డాక్టర్ బాబాసాహెబ్

# అంబేద్కర్

## విశ్లేషణాత్మక అధ్యయనం

డబ్ల్యు.ఎన్. కుబేర్



ప్రజాశక్తి బుక్‌హౌస్

FOR FAVOUR OF REVIEW

# డాక్టర్ బాబాసాహెబ్
# అంబేద్కర్

## విశ్లేషణాత్మక అధ్యయనం

డబ్ల్యు.ఎన్. కుబేర్

ప్రజాశక్తి బుక్‌హౌస్
1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్-20. ఫోన్ : 27660013

361.9540924
C17219
AC No. 88664
-500 044.
Acc. No. 427

ప్రచురణ సంఖ్య : 1023

ప్రథమ ముద్రణ : ఫిబ్రవరి, 2008

వెల : రు. 100/-

టైటిల్ : శ్రీరాం కారంకి

ప్రతులకు

ప్రజాశక్తి బుక్‌హౌస్

1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్-20. ఫోన్ : 27660013

బ్రాంచీలు

హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, ఖమ్మం,

హన్మకొండ, నల్గొండ, గుంటూరు

ముద్రణ

ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, హైదరాబాద్

FOR FAVOUR OF REVIEW

# ప్రచురణకర్తల ముందుమాట

అంబేద్కర్ లాంటి సమగ్ర, సంక్లిష్ట వ్యక్తిత్వాన్ని మహారాష్ట్రకు చెందిన వమన్ నారాయణ్ కుబేర్ ఎంతో సమర్థవంతంగా ఈ గ్రంథంలో వివరించారు. అంబేద్కర్ కృషి పట్ల ఎంతో ఉన్నతమైన గౌరవభావం కలిగిన ఈ రచయిత ఆయన కృషిని తులనాత్మకంగా బేరీజు వేయడానికి ప్రశంసనీయమైన కృషి చేశారు. చిన్ననాటనే స్వాతంత్రోద్యమంలో భాగస్వామి అయి, అనేక ప్రజా ఉద్యమాలలో కూడ పాలుపంచుకొన్న కుబేర్, తర్వాత అధ్యయనం వైపు దృష్టి సారించారు. పూనా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పొందడానికి ఆయన సమర్పించిన థీసిస్ ఈ గ్రంథం.

డాక్టర్ భీమ్‌రావ్ రామ్‌జీ అంబేద్కర్ సామాజిక అణిచివేతకు వ్యతిరేకంగా జరిగే పోరాటానికి సంకేతం, గొప్ప స్ఫూర్తిప్రదాత. నిమ్నకులంలో జన్మించిన అంబేద్కర్ కులవివక్షను స్వయంగా అనుభవించారు. ఎంత విద్య అభ్యసించినా, ఎన్ని ఉన్నత పదవులు నిర్వహించినా కులవివక్షకు ఆయన గురికాక తప్పలేదు. ఈ వివక్షను అంతం చేసి సమాజంలో అందరితో పాటు నిమ్న వర్గాలకూ సమాన స్థాయి లభించేలా చేసేందుకు ఆయన జీవితాంతం కృషి సల్పారు. ఈ క్రమంలో ఆయన దళితులను సమీకరించడానికి పూనుకున్నారు. ఉద్యమాలు నిర్మించారు, స్వయంగా అనేక పోరాటాలు నిర్వహించారు.

అంబేద్కర్ కేవలం దళితుల కోసం పోరాడిన వ్యక్తి మాత్రమే కాదు. గొప్ప రాజనీతిజ్ఞుడు, రాజకీయ వేత్త. న్యాయశాస్త్ర కోవిదుడు. ఆనాడు బ్రిటిష్ వారితో రాజ్యాంగ అంశాలపై జరిగిన మోంటేఫోర్డ్ సంస్కరణలనుండి, క్యాబినెట్ మిషన్ ప్రతిపాదనల వరకు అన్నింటిలోను చురుగ్గా పాల్గొన్నారు. స్వతంత్ర భారత రాజ్యాంగ రచనలో ఆయన కీలక పాత్ర వహించారు. రాజ్యాంగ నిర్మాతగా పేరుగడించారు. అంబేద్కర్ గొప్ప ఆర్థిక వేత్త కూడ. భూసమస్యతో సహా అనేక అంశాలపై ఆయన తన అభిప్రాయాలను వెల్లడించారు. భాషా

ప్రయుక్త రాష్ట్రాలు, కార్మిక సమస్యలు, మార్క్సిజం, తదితర అనేక అంశాలపై ఆయనకు నిర్దిష్టమైన అభిప్రాయాలున్నాయి. వీటన్నింటిని కుబేర్ ఎంతో విశ్లేషణాత్మకంగా వివరించారు.

ఈ గ్రంథాన్ని తొలుత 'అంబేద్కర్- ఎ క్రిటికల్ స్టడీ' పేరుతో న్యూఢిల్లీకి చెందిన న్యూఏజ్ పబ్లిషర్స్ ఆంగ్లంలో 1974లో ప్రచురించారు. 1979లో మలి ముద్రణ పొందింది. తర్వాత కుబేర్ ఈ గ్రంథాన్ని సవరించారు. సవరించిన ప్రతి 1991లో ప్రచురితమయింది. ఇప్పుడు మేము దాని తెలుగు అనువాదాన్ని ప్రచురిస్తున్నాము. అంబేద్కర్ కృషి గురించి ఇంతటి సమగ్రమైన, తులనాత్మకమైన గ్రంథం బహుశా ఇంతవరకు వెలువడకపోయి ఉండవచ్చు. నేడు మన రాష్ట్రంలో సైతం ముమ్మరంగా సామాజికోద్యమాలు జరుగుతున్న నేపథ్యంలో సరైన దృక్పథం ఏర్పరుచుకునేందుకు దోహదపడే ఈ గ్రంథాన్ని తెలుగు పాఠకులు సమాదరిస్తారని ఆశిస్తున్నాము.

హైదరాబాద్
02-02-2008

**ప్రజాశక్తి బుక్‌హౌస్**

# రచయిత ముందుమాట

అంబేద్కర్ సామాజిక, రాజకీయ ఆలోచనా సరళిని మీ ముందు ఉంచేందుకు చేసిన చిన్న ప్రయత్నమే ఈ పుస్తకం. సాంఘికంగా వెనుకబడిన కులంలో పుట్టి, పాశ్చాత్య విద్యలను నేర్చి, హేతువాద దృక్కోణాన్ని అలవర్చుకొని, తిరుగుబాటు తత్వం కలిగిన అంబేద్కర్ సరైన సమయంలో అట్టడుగు వర్గానికి చెందిన తన కులం వారికి నాయకత్వం వహించి వారి తరపున సామాజిక ఉద్యమాలలో, రాజ్యాంగ వ్యవహారాలలో వ్యూహాత్మకంగా పాల్గొన్నారు. అణగారిన కులాల పట్ల సాంఘికంగా నిర్లక్ష్య వైఖరి కనబరిచినందుకు అగ్ర కుల హిందువులను (గాంధీని, కాంగ్రెస్‌ను కూడా) ఆయన విమర్శించారు. వారి రాజకీయ, ఆర్థిక వెనకబాటు తనానికి బ్రిటిష్ ఏలుబడిని తప్పుపట్టారు. తరతరాలుగా అణగారిపోయివున్న తన వర్గం వారికి తిరుగులేని నాయకుడై, వారి జీవితాలను బాగు చేసేందుకు తనను తాను అంకితం చేసుకున్నారు.

అంబేద్కర్ కేవలం అల్ప సంఖ్యాకుల నాయకుడు మాత్రమే కాదు. ఆయన వాక్పటిమ గల న్యాయవాది. జగమెరిగిన ఆర్థిక వేత్త. అల్ప సంఖ్యాక వర్గాలకు చెందిన వాడిగా మాత్రమే బ్రిటిష్ ప్రభుత్వం అంబేద్కర్‌ను న్యాయమండలి సభ్యునిగా నియమించిందని భావించినా, కాంగ్రెస్ పార్టీ మాత్రం ఆయన సత్తాను గుర్తించినందువల్లే భారత రాజ్యాంగ పరిషత్ రాజ్యాంగ రూపకల్పన కమిటీ చైర్మన్‌గా ఎంపిక చేసింది.

న్యాయశాస్త్రం, ఆర్థిక శాస్త్రం బోధించిన అధ్యాపకునిగా, ప్రాదేశిక, కేంద్ర శాసన సభలలో సభ్యునిగా, వైస్రాయ్ మండలి న్యాయ, కార్మిక విభాగాలలో సభ్యునిగా స్వాతంత్ర్యానంతరం కేంద్ర కేబినెట్ మంత్రిగా ప్రజా జీవనంలో గడించిన అపారమైన అనుభవానికి లోతైన సమాజ అధ్యయనాన్ని జోడించి అంబేద్కర్ సమకాలీన సామాజిక అంశాలపై పన్నెండుకు పైబడిన పరిశోధనాత్మక ( అవి వివాదాస్పదమయ్యాయి కూడా) గ్రంథాలను

వెలువరించారు. ఆధునిక భారత ప్రజా నాయకునిగా వుంటూ విస్తృత పరిధిలో సామాజిక రాజకీయ చింతన గల అతి కొద్ది మందిలో అంబేద్కర్ ముందు వరసలో వుంటారు. అందుకే ఆయన రచనలను అమూలాగ్రం అధ్యయనం చేయవలసిన ఆవశ్యకత వుంది.

ప్రస్తుత గ్రంథం (నా పిహెచ్.డి. సిద్ధాంత గ్రంధానికి సంక్షిప్త రూపం)లో మొత్తం పదిహేను అధ్యయాలు ఉన్నాయి. మొదటి అధ్యాయంలో షెడ్యూల్డ్ కులాల సామాజిక, రాజకీయ స్థితిగతులను రేఖామాత్రంగా వివరించే ప్రయత్నం చేశాను. స్వాతంత్రోద్యమ కాలంలో వారు పోషించిన పాత్ర, బ్రిటిష్ పాలకులు వారి పట్ల కనబరిచిన వైఖరి, అనాటి సాంఘిక సంస్కరణోద్యమాల సమీక్ష , వారి కష్ట నష్టాల నివారణకు, బాధల పరిహారానికి బ్రిటిష్ ప్రభుత్వం చట్టపరంగా చేపట్టిన చర్యల బాగోగుల పరిశీలన (అంబేద్కర్ కాలం వరకు) ఈ అధ్యాయంలో మీరు చూస్తారు.

అంబేద్కర్ జీవిత సంక్షిప్త చిత్రణకు రెండో అధ్యాయం పరిమితమైంది.

అంబేద్కర్ సామాజిక తత్వచింతనకు మూడు, నాల్గవ అధ్యాయాలు కేటాయించాను. హిందూ సాంఘిక చట్రం నేపథ్యంలో శూద్ర కులాల పుట్టుక, అస్పృశ్యత, వర్ణ వ్యవస్థ (ప్రజా స్వామ్యం, పార్లమెంటరీ పాలన, న్యాయశాస్త్రాలు, పరిపాలనా యంత్రాంగం వంటి అంశాలకు, కులానికి మధ్య గల పరస్పర సంబంధం) వర్ణ వ్యవస్థ రద్దుకు గల అవరోధాలు వంటి అంశాలపై ఆయన ఆలోచనలను వివరించేందుకు మూడో అధ్యాయాన్ని ఉద్దేశించాను. బ్రాహ్మణ వాదం, బ్రాహ్మణేతర ఉద్యమాలు, హిందూ కోడ్‌పై ఆయన ధృక్పథాన్ని కూడా ఈ అధ్యాయంలో పరిశీలించడం జరిగింది. అంబేద్కర్ చేసిన సామాజిక పోరాటాలపై, సమాజ పరివర్తన పట్ల ఆయన వైఖరిపై సమీక్షతో ఈ అధ్యాయం ముగుస్తుంది. మతంపై, జీవిత చరమాంకంలో ఆయనను నిమగ్నం చేసిన మతమార్పిడిపై భావాల విశ్లేషణ నాలుగో అధ్యాయంలో గమనించవచ్చు.

మిగిలిన తొమ్మిది అధ్యాయాల్లో అంబేద్కర్ రాజకీయ తత్వ పరిశీలనకు ప్రయత్నించాను. రాజ్యాంగ అంశాలపై అభిప్రాయాలు, రాజ్యాంగ సభలో నిర్వర్తించిన విధులు, జాతీయోద్యమంపై అభిప్రాయాలు, కాంగ్రెస్‌తో, గాంధీజీతో గల విభేదాలు, ముస్లింలు, ఇతర మైనారిటీల సమస్యలు, పాకిస్తాన్ ఏర్పాటు వలన ముస్లింలకు ఎదురైన సమస్యలు, పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఇమిడివున్న సమస్యలు, సామ్యవాద ఆలోచనా ధోరణి, కార్మికోద్యమం, వైస్రాయ్ మండలిలో కార్మిక విభాగం సభ్యునిగా ఎదుర్కొన్న కార్మికుల సమస్యలు, "మార్క్సిజం - బుద్ధిజం" వంటి అంశాలపై ఆయన అభిప్రాయాలను నిశితంగా పరిశీలించేందుకు ఈ అధ్యాయాలలో పెద్ద పీట వేయడం జరిగింది. అంబేద్కర్ నెలకొల్పిన "ఇండిపెండెంట్ లేబర్ పార్టీ", షెడ్యూల్డ్ కులాల సమాఖ్య, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా,

కాంగ్రెస్ వ్యతిరేక వేదిక ఏర్పాటు, భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు, భారత విదేశాంగ విధానం, రెండో ప్రపంచ యుద్ధం, విద్య, పాత్రికేయ వృత్తి వంటి పలు అంశాలపై ఆయన అభిప్రాయాలను క్లుప్తంగా వివరించేందుకు వీటిలో ప్రయత్నించాను.

అంబేద్కర్ ఆర్థిక దృక్కోణాన్ని 14వ అధ్యాయంలో చర్చించాను. కరెన్సీ, ఫైనాన్సు, సమిష్టి వ్యవసాయం, పరిశ్రమల జాతీయకరణ పై ఆయన వెలుబుచ్చిన అభిప్రాయాల విశ్లేషణకు ప్రాధాన్యం ఇచ్చాను. ఆయన సామాజిక, రాజకీయ తత్వ విచార ధారను సమగ్రంగా అంచనా వేసేందుకు, సమకాలికుల కృషితో ఆయన కృషిని సరిచూసేందుకు చివరిదైన 15వ అధ్యాయంలో ప్రయత్నించాను.

నా పరిశోధనకు తోడ్పాటునందించిన వ్యక్తులు, సంస్థలకు నేనెంతగానో రుణపడి వున్నాను. ముఖ్యంగా పూనా విశ్వవిద్యాలయంలో నా పరిశోధనకు మార్గదర్శకత్వం చేసిన డా॥ డి. కె. గర్దే, ప్రొ॥ లోకమాన్య తిలక్ అందించిన సహకారం, ప్రోత్సాహం ఎన్నటికీ మరువలేను. మరెందరో పెద్దలు, మిత్రులు నా కృషి పరిపూర్తి కావడానికి దోహదం చేశారు. వారందరికీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

కోపర్‌గావ్ నగర్
మహరాష్ట్ర
జనవరి **26, 1973**

**డబ్ల్యు.ఎన్. కుబేర్**

# విషయసూచిక


1. చారిత్రక నేపథ్యం ........................................ 11

2. అంబేద్కర్ జీవిత చిత్రం ........................................ 23

3. హిందూ సామాజిక వ్యవస్థ ........................................ 37
   - సెక్షన్ 1 : శూద్రుల పుట్టు పూర్వోత్తరాలు 37
   - సెక్షన్ 2 : అస్పృశ్యత - దాని స్వభావం 48
   - సెక్షన్ 3 : కుల వ్యవస్థ 54
   - సెక్షన్ 4 : బ్రాహ్మణ వాదం - బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమాలు 64
   - సెక్షన్ 5 : హిందూ స్మృతి 72
   - సెక్షన్ 6 : సామాజిక కార్యరంగం - సామాజిక దృక్కోణం 75

4. మతం - మత మార్పిడి ........................................ 83
   - సెక్షన్ 1 : మతం అంటే ఏమిటి? 83
   - సెక్షన్ 2 : మతం - దాని తత్వం 90
   - సెక్షన్ 3 : సామాజిక శక్తిగా మతం 9
   - సెక్షన్ 4 : హిందూ సామాజిక వ్యవస్థ 95
   - సెక్షన్ 5 : హిందూ మతంలోని చిక్కుముడులు 97
   - సెక్షన్ 6 : బౌద్ధానికి మార్పిడి 9

5. రాజ్యాంగ సమస్యలపై అభిప్రాయాలు ........................................ 115
   - సెక్షన్ 1 : బడుగు వర్గాలకు ప్రాతినిధ్యం, విస్తరణ 115
   - సెక్షన్ 2 : భారత రాజ్యాంగం - సమస్యలు 132

6. జాతీయవాదం, జాతీయోద్యమం మరియు జాతీయ సమైక్యత ............ 157
   - సెక్షన్ 1 : జాతీయోద్యమం 157
   - సెక్షన్ 2 : జాతీయ నాయకత్వం 164
   - సెక్షన్ 3 : గాంధీజీతో పోరాటం 168
   - సెక్షన్ 4 : భారతీయ జాతీయ కాంగ్రెస్ పట్ల వైఖరి 173
   - సెక్షన్ 5 : రాజ సంస్థానాలు 182

7. మైనారిటీల సమస్యలు - పాకిస్తాన్ ........................................ 185
సెక్షన్ 1 : మైనారిటీల సమస్యలు 185
సెక్షన్ 2 : దేశ విభజన - పాకిస్తాన్ 189

8. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ........................................ 199

9. సోషలిస్టు ఆలోచన ........................................ 205
సెక్షన్ 1 : కార్మిక సంఘాల ఉద్యమం 205
సెక్షన్ 2 : కార్మిక సభ్యునిగా ఎదుర్కొన్న కార్మిక సమస్యలు 208
సెక్షన్ 3 : మార్క్సిజం × బుద్ధిజం 210

10. రాజకీయ పార్టీలు ........................................ 217
సెక్షన్ 1 : పార్టీలపై దృష్టి కోణం 217
సెక్షన్ 2 : ప్రతిపక్ష పార్టీ ఏర్పాటు 221

11. భాషా ప్రయుక్త రాష్ట్రాలు ........................................ 225

12. అంతర్జాతీయ రాజకీయ సమస్యలు ........................................ 235
సెక్షన్ 1 : రెండవ ప్రపంచ యుద్ధం 235
సెక్షన్ 2 : భారత విదేశాంగ విధానం 237

13. విద్య, జర్నలిజంపై ఆలోచనలు ........................................ 241
సెక్షన్ 1 : విద్య 241
సెక్షన్ 2 : జర్నలిజం 245

14. ఆర్థిక ఆలోచన ........................................ 247
సెక్షన్ 1 : భూ సంస్కరణలు 247
సెక్షన్ 2 : కరెన్సీ సమస్యలు 254
సెక్షన్ 3 : ఫైనాన్స్ సమస్యలు 259
సెక్షన్ 4 : ఇతర సమస్యలు 264
సెక్షన్ 5 : ఆర్థికవేత్తగా అంబేద్కర్ 271

15. సామాజిక, రాజకీయ ఆలోచనాపరునిగా అంబేద్కర్ ........................................ 277
సెక్షన్ 1 : సామాజిక ఆలోచన 279
సెక్షన్ 2 : రాజకీయ ఆలోచన 287

# అధ్యాయం 1

# చారిత్రక నేపథ్యం

హిందూ సమాజం అట్టడుగున అస్పృశ్యులు శతాబ్దాల తరబడిగా దిక్కూ మొక్కూ లేక అణగారి పోయారు. సామాజిక శాస్త్రవేత్తలు అస్పృశ్యత మూలాలపై వేర్వేరు సిద్ధాంతాలు చేశారు. కాని వాస్తవం ఏమిటంటే అంటరానివారిని తాకినా, వారి నీడ సోకినా, చివరికి వారి గొంతు విన్నా మైల పడిపోతామని బ్రాహ్మణులు భావించారు. అంటరాని వారు వూరికి వెలుపల అపరిశుభ్ర పరిసరాలలో నివసించాలని ఆంక్షలు విధించిన హిందూ మతం వారు జంతువులను పెంచుకోరాదని, బంగారం వంటి లోహాలతో చేసిన నగలు ధరించరాదని కూడా కట్టడి చేసింది. మంచి నీటి బావుల నుంచి నీరు తోడుకునే హక్కు కానీ, తమ పిల్లలను హిందూ అగ్ర కులాల పిల్లలు చదివే పాఠశాలలలో చదివించే హక్కు కాని వారికి లేకుండా చేసారు. వారికి అన్ని దేవాలయాలోకి అనుమతిని వారికి నిరాకరించారు. మంగలి, చాకలి వారి సేవలు పొందే అవకాశం కూడా లేకుండా చేశారు. దీని వలన వారి బతుకులు అత్యంత దయనీయంగా మారాయి. బ్రాహ్మణులు వారిని కనీసం మనుషులుగా కూడా గుర్తించే వారు కాదు. పోలీసు, మిలటరీసేవలే కాక ఇతర ప్రభుత్వ సేవలన్నీ వారికి రద్దు చేసారు. అంటరాని వారు సహజంగానే గత్యంతరం లేని పరిస్థితులలో వంశ పారంపర్యంగా తమ పూర్వీకులు చేసిన అమానవీయమైన పనులనే కొనసాగించవలసి వచ్చేది. సాంఘికంగా నెలకొని వున్న అంతరాల వలన జీవితపర్యంతం వారు అంటరానివారుగానే వుండవలసి వచ్చేది. సాంఘికంగా కుంగిపోయి, ఆర్థికంగా అతి బలహీనులై, రాజకీయంగా అగ్ర కులాల సేవకులై వారి జీవితాలు శాశ్వతంగా చీకట్లో మగ్గిపోయాయి. విద్యా, సాంస్కృతిక రంగాల నుంచి వారిని బహిష్కరించారు.

బ్రాహ్మణులను భూసురులుగా భావించేవారు. రాజులకు హక్కు లేని సొంత ఆస్తి, మరణశిక్ష నుండి స్వేచ్ఛ వంటి అనేక విశేషాధికారాలు వారికి వుండేవి. పురుష సూక్తం చెప్పిన వర్ణ వ్యవస్థ సిద్ధాంతం కులాల/వర్ణాల పుట్టుకపై అంతిమ శాసనం చేయడంతో పాటు హెచ్చు తగ్గుల సమాజ వ్యవస్థ ఉనికిని తిరుగులేని దైవ నిర్ణయంగా ప్రకటించింది. ఉన్నత వర్ణాలకు ప్రత్యేక హక్కులు, కింది వర్ణాలకు వైకల్యాలు వుండటం అనేది వర్ణ / కుల సమాజంలో

సార్వత్రిక లక్షణం అని సమాజ శాస్త్రవేత్త ఘుర్యే అంటారు. అన్ని రంగాలలో మతాధిపత్యం స్పష్టంగా కనిపించేది.హిందూ సంస్కృతి విశిష్టత అంతా దాని మతతత్వంలో ఇమిడి ఉంది.హిందూ న్యాయసూత్రాలలో కూడా మతం మిళితమై ఉంది. హిందూ నాగరికతకు సామాజిక ఇరుసుగా ఉమ్మడి కుటుంబం ,సాముదాయిక గ్రామ వ్యవస్థ , కుల వ్యవస్థ ఉండేవి ఈ మూడింటిలో చివరిదైన కుల వ్యవస్థకు దైవాజ్ఞతో పాటు మతామోదం ఉన్నదని భావించేవారు. సామాజిక జీవనం దాదాపుగా రాజ్య పరిధికి వెలుపలే ఉనికిలో ఉండేది .రాజకీయ నియంత్రణ లేకపోవడం వలన రాజకీయ స్వభావం గల విప్లవాల ప్రభావం దానిపై ఉండేది కాదు.

మధ్య యుగాల నాటి ముస్లిం పాలనలో శూద్రులకు ,అంటరాని వారికి చదువుకునే హక్కుతో పాటు స్వేచ్ఛ,సమానత్వం కొరవడ్డాయి .ఇస్లాం బోధించిన సౌభ్రాతృత్వం వాస్తవ రూపం తీసుకోలేదు.ముస్లిం పాలకులు హిందూ అగ్రకులాల నుంచి ఎంపిక చేసిన సర్దార్లు,జాగీర్దార్లు అంటరానివారికి మానవ హక్కులు కల్పించేందుకు అంగీకరించలేదు.అస్పృశ్యత నాటి సమాజంలో అమలులో ఉన్నందువల్లే ముస్లిం పాలకులు ఇస్లాం మత సూత్రాలను వారికి వర్తింప చేయలేకపోయారు.హిందూ అగ్ర కులస్తులతో ఈ విషయమై ఘర్షణకు దిగడం ఇష్టం లేకే వారు ఈ విధంగా వ్యవహరించారు. మరాఠా రాజ్యంలో అంటరానివారిలో ఒకరుగా ఉన్న మహర్లు యుద్ధాలలో ముస్లింలతో వీరోచితంగా పోరాడినప్పటికీ వారికి సైతం హక్కులు సిద్ధించలేదు. ప్రజారంజకుడైన పాలకునిగా చరిత్రకెక్కిన ఛత్రపతి శివాజీ సైతం అమానవీయమైన అస్పృశ్యతా విధానాన్ని అంతమొందించ లేకపోయారు.

### యూరోపియన్ నాగరికత ప్రభావం

గ్రామాలలో ఉపాధి ఆధారిత ఆర్థిక వ్యవస్థ అమలులో వుండేది. వ్యక్తులకు, భిన్న సమూహాలకు మధ్య సంబంధం పరస్పర ఒప్పందం వల్ల కాక పుట్టుక ద్వారా సంక్రమించిన హోదా ఆధారంగా ఏర్పడేది. ఎవరి హక్కులను, విధులనైనా కులమే శాసించేది. స్వాతంత్రానికి పూర్వం ఉన్న భూస్వామ్య ఆర్థిక విధానం క్రమంగా పెట్టుబడిదారీ ఆర్థిక విధానంగా పరివర్తన చెందడం విప్లవాత్మక పరిణామమే అని చెప్పాలి. భూస్వామ్య ఆర్థిక విధానం నాటి భూ సంబంధాలకు కాలం చెల్లిపోయింది. చేతివృత్తులు, హస్తకళల పరిశ్రమలు కనుమరుగవ సాగాయి. పురాతన పరిశ్రమలతో భూ విధానంతో సంబంధం కలిగి వున్న వర్గాలు క్షీణించిపోయి నూతన పరిశ్రమలు, భూ సంబంధాలకు లోబడిన కొత్త వర్గాలు ముందుకు రావడంతో భూస్వామ్యం వెనకడుగు వేసింది. గ్రామీణ సామూదాయిక వ్యవస్థ స్థానాన్ని భూమిని స్వంత ఆస్తిగా గల యజమాని, జమిందార్ భర్తీ చేశారు.మారిన పరిస్థితులలో రైతులు వీరి అజమాయిషీలో పనిచేసే కూలీలుగా మారిపోయారు. బ్రిటిష్ ఏలుబడి మూలంగా భారతీయ సమాజపు ఆర్థిక నిర్మాణంలోనే కాకుండా, సమాజ సౌష్టవంలో కూడా మార్పులు వచ్చాయి.

బ్రిటిష్ పాలన దేశంలో వ్యవసాయ విప్లవానికి బాటలు వేసింది. వ్యవసాయ రంగంలో పెట్టుబడిదారీ విధానం భవిష్యత్తులో అభివృద్ధిని చెందడానికి వీలుగా బ్రిటిష్ ప్రభుత్వం భూమి వ్యక్తిగత ఆస్తిగా మార్చే విధానాన్ని ప్రవేశపెట్టింది. దీని వల్లే రైతుల యాజమాన్యంలో వ్యక్తిగత భూ కమతాలు, భూ స్వాముల యాజమాన్యంలో ఎకరాలకు ఎకరాలుగా వ్యవసాయ క్షేత్రాలు ఏర్పడ్డాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పెట్టుబడిదారీ మార్గంలోకి మళ్లడం, స్వయం పోషక గ్రామీణ జీవనం ధ్వంసమైపోవడం గతి శీలమైన పరిణామాలని చెప్పాలి. ఈ సామాజిక పరివర్తనకు ప్రాతిపదిక ఏమిటో ఇప్పుడు చూద్దాం.

> "హోదాను అనుసరించి ఏర్పడ్డ సంబంధాల ప్రాతిపదికగా ఏర్పడిన సాంఘిక వ్యవస్థ ఛిద్రమైపోవడం, చేతి వృత్తులతో పొట్ట గడవని పరిస్థితి ఏర్పడటం, ధన వినియోగం పెరగడం, ముఠాతత్వం పెచ్చరిల్లడం, కులాల మధ్య సంబంధాలలో కొత్త మార్పులు రావడం, అణగారిన వర్గాలకు చెందిన వారి ఆర్థిక, రాజకీయ ప్రయోజనాల పట్ల ఆసక్తి పెరగడం వంటి పరిణామాల మూలంగానే గ్రామీణ సమాజంలో పెద్ద ఎత్తున మార్పులు సంభవించాయి. ఏక కాలంలో సంస్కృతీకరణ, పాశ్చాత్యీకరణ జరిగిన ఫలితం ఇది."
>
> **(మారియట్ --- విలేజ్ ఇండియా నుంచి)**

బ్రిటిష్ పాలకులు తమతో పాటు కుల రహిత సంస్కృతిని, వ్యక్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు పట్టం కట్టే సాహిత్యాన్ని తీసుకువచ్చారు. రెండు దేశాలకు మధ్య భావజాల పరంగా ఏర్పడిన సంపర్కం వలన మూడు విధాల ఆలోచనా ధోరణులు ముందుకు వచ్చాయి. వీటిలో మొదటిది పాశ్చాత్య హేతువాద భావాలను ఒంట పట్టించుకుంది. పాత విలువలను పూర్తిగా కాలదన్ని నూతనత్వాన్ని అంతటా ఆహ్వానించడం ఈ ధోరణి ప్రధాన లక్ష్యం. రెండవది పాశ్చాత్య విజ్ఞానంతో ప్రేరణ పొంది హిందూ మతాన్ని అంతర్గతంగా సంస్కరించు కోవాలనుకుంది. హిందూ మతం బోధించిన సార్వజనీన సూత్రాలను, దాని సారాంశాన్ని పరిరక్షిస్తూనే, అందులోని అవినీతిని పారదోలడం తన లక్ష్యంగా నిర్దేశించుకుంది. వీరి గాఢ మతానురక్తి కొత్త అభివ్యక్తిని ఎంచుకుంది. రాజా రామ మోహన్ రాయ్, రానడే, గోఖలే వంటి వారు ఈ ధోరణికి ప్రతినిధులుగా నిలుస్తారు. మూడవ ధోరణికి మతంలో, దాని ఆచార వ్యవహారాలలో విశ్వాసం సడలని సంప్రదాయవాదులు ప్రాతినిధ్యం వహిస్తారు. కొత్త భావాలను స్వీకరించడానికి, యూరోపియన్ జీవన సరళిని అనుసరించడానికి వీరు బద్ధవిరోధులు. శాస్త్రరంగంలో నూతన ఆవిష్కరణలను కూడా వారు శంకించారు. సంప్రదాయ సామాజిక జీవన విధానాన్ని పరిరక్షించుకునే క్రమంలో వీరు విదేశీ పోకడలను తోసిపుచ్చారు.

## బ్రిటిష్ పాలనా విధానం ప్రభావం

న్యాయ సమ్మతమైన పాలనకు కులం తోడ్పడదని భావించిన బ్రిటిష్ ప్రభుత్వం కులం ఉనికిని అధికారికంగా గుర్తించ నిరాకరించింది. అయితే సాంస్కృతిక రూపంగా మాత్రం

కులం ప్రాధాన్యాన్ని ప్రశ్నించలేదు. కులం పటిష్టంగా వుండేందుకు గాను పాలకులు చాలినన్ని ప్రోత్సాహకాలు అందించారు. దేశంలో చట్టాల అమలుకు సిఫార్సులను చేసేందుకు వచ్చిన సైమన్ కమిషన్‌కు బొంబాయి ప్రభుత్వం సమర్పించిన వినతి పత్రంలో బ్రాహ్మణేతరుల తీరు పై ఫిర్యాదు చేసింది. స్థానిక జిల్లా స్థాయి పాలనా మండలులలో బ్రాహ్మణేతరులు టీగా వున్న సందర్భాలలో సామర్థ్యాన్ని సైతం కాదని బ్రాహ్మణులను గెంటివేయడానికి త్నిస్తున్నట్లు మొర పెట్టుకుంది.

దేశ జాతీయతను ప్రభావితం చేస్తున్న కుల సమస్యను బ్రిటిష్ పాలకులు ఎన్నడూ పట్టించుకోలేదు. 1857 నాటి సైనిక తిరుగుబాటు ఫలితంగా సైన్యంలోని ఉన్నత లకు చెందిన వారిని పెద్ద సంఖ్యలో ఇళ్లకు పంపించే ప్రక్రియ మొదలైంది. సిపాయి తిరుగుబాటుకు ప్రధానంగా ఉన్నత కులాలకు చెందిన బ్రాహ్మణులు, రాజపుత్రులు కారణమని భావించడం వల్లే సైన్యంలోకి సిబ్బందిని చేర్చుకునే విషయంలో ఆంక్షలు అమలులోకి వచ్చాయి. అయితే పాలకులు తీసుకున్న చర్యలన్నీ పాక్షికంగా మాత్రమే వుండేవని చెప్పవచ్చు. బ్రిటిష్ ఆధిపత్యానికి భంగం కలిగే పరిస్థితులు బలంగా ఉన్న సందర్భాలలో మాత్రమే 'చర్య'కు దిగడం పరిపాటిగా వుండేది.

1857 తిరుగుబాటు తరువాత దేశం పాలనాపరంగా ఏకీకృతమైంది. శాంతి భద్రతల పరిరక్షణ, చట్టానికి లోబడిన పాలన స్వేచ్ఛా స్వాతంత్ర్యాల పట్ల విశ్వాసం, దేశ ఆధునికీకరణ,రాజ్య అవసరాల రీత్యా బలమైన ఆర్థిక పునాదులు వేయడం, కరువు కాటకాలు, అంటు వ్యాధుల అదుపునకు దృఢమైన చర్యలు, వ్యవసాయ వనరుల పెంపు, రాజకీయ సుస్థిరత్వం వంటి పలు అంశాలు దేశ స్థితి గతులను పూర్తిగా మార్చివేశాయి. ఈ పరిణామాల వలన దేశానికి సార్వత్రికంగా జాతీయతా భావన సమకూరింది. ఒకేవిధమైన న్యాయ వ్యవస్థ, పరిపాలనా వ్యవస్థల ప్రవేశంతో చాలా వరకు ఏకీకరణ సాధ్యపడింది. రాజకీయపరమైన సంఘటనల ఏర్పాటుకు అప్పటిదాకా వున్న నిబంధనలను సడలించి సులభసాధ్యం చేయడం వలన దేశ ప్రజల మధ్య ఐక్యతకు అస్కారం ఏర్పడింది. ఆంగ్ల విద్య, ఆధునిక ప్రసార సాధనాల అభివృద్ధి, స్థానిక స్వయం పాలనా వ్యవస్థల ఏర్పాటు, పరిమిత స్థాయిలో స్వయం పాలనకు అనుకూలంగా తీసుకున్న చర్యలు, కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు వంటి చర్యలు ఈ క్రమాన్ని వేగవంతం చేశాయి.

హిందూ సంప్రదాయ వాదంపై బ్రిటిష్ వారు ప్రవేశపెట్టిన విలువలు ఎనలేని ప్రభావం చూపాయి. బ్రిటిష్ ప్రభావం వలన ఉన్నత విద్యను అభ్యసించిన భారతీయులు( సంఖ్యలో కొద్ది మందే అయినా సమాజంలో ప్రధానమైన స్థానాలలో వున్నవారు కావడంతో) సంప్రదాయ హిందూ ఆలోచనా ధోరణులను విడనాడి పాశ్చాత్య జీవన విధానాన్ని, ఆలోచనలను అలవర్చుకొని సమాజాన్ని తీవ్రస్థాయిలో ప్రభావితం చేశారు. ఆధునిక విద్యపై మెకాలే వెలిబుచ్చిన అభిప్రాయాలు తమ వంతు కర్తవ్యాన్ని నేరవేర్చడంలో సఫలమయ్యాయి. రక్తంలో, రంగులో భారతీయులుగా వుంటూనే అభిరుచులలో, అభిప్రాయాలలో, నైతిక విలువలలో,

మేధస్సులో ఆంగ్లేయుల వలె వ్యవహరించే వర్గాన్ని సృష్టించడం మెకాలే తన లక్ష్యంగా పెట్టుకున్నాడు. మెకాలే అవలంబించిన ఈ వ్యూహం ఆయన ఆశించిన విధంగానే సత్ఫలితాలను ఇచ్చింది. మెకాలే సూత్రాన్ని అమలు చేస్తూ నాటి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని "విప్లవాత్మక పరిణామాలకు దారి తీసిన అత్యంత సానుకూల చర్య"గా చరిత్రకారుడు కె.ఎం.పణిక్కర్ వ్యాఖ్యానించారు.

పౌర హక్కుల అమలు పట్ల శ్రద్ధ, న్యాయ వ్యవస్థకు ఆధిక్యత, ప్రజల భాగస్వామ్యం, వారి అమోదంతో ఏర్పడే ప్రభుత్వం అందరికే ఓటు హక్కు కల్పించి నిర్వహించే ఎన్నికలు,రాజకీయంగా ప్రజలందరూ ఒక్కటేననే భావనను దేశ వ్యాప్తం చేయడం, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, న్యాయ వ్యవస్థ, దేశ పురోగతిలో విశ్వాసం, ముందు చూపు – భారత సమాజంపై దీర్ఘకాలిక ప్రభావం చూపే ఈ భావనలన్నీ బ్రిటిష్ పాలన వల్లే వాస్తవ రూపం దాల్చాయి.

అప్పటి దాకా భారతదేశం బ్రిటన్‌కు వ్యావసాయిక జీవన విధానం గల వలస అవశేషంగా వుండేది. సంప్రదాయ పరిశ్రమల స్థానే ఆధునిక పరిశ్రమలను నెలకొల్పడం వల్ల భారత ప్రజల మధ్య ఆర్థిక సమైక్యత సాధ్యపడింది. బ్రిటిష్ వలసవాదం ఫలితంగా ఒక జాతిగా, దేశంగా ఏర్పడిన క్రమంలో భారత్ కొత్త వర్గాలకు నెలవుగా మారింది. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థకు లోబడి కొత్త వర్గాలు ఏర్పడటంతో సరిపెట్టకోకుండా కౌలుదారీ విధానం పరాకాష్టకు చేరుకోవడం,వ్యవసాయ కూలీల వ్యవస్థ పెరుగుదల పరిపూర్తి కావడం వంటి పరిణామాలు కూడా ఈ పరివర్తనకు దోహదం చేశాయి అయితే ఈ దశలో భూస్వాములలో, భూమి గల ఇతర రైతాంగంలో జాతీయతాభావన పెల్లుబుకడం గమనార్హం. మార్క్స్ ఈ బూర్జువా విప్లవాన్ని "భారత చరిత్రలో సంభవించిన ఒకే ఒక నిఖార్సయిన సామాజిక విప్లవం"గా అభివర్ణించారు.

## సంఘ సంస్కర్తల కృషి

హిందూ సమాజాన్ని అస్పృశ్యత అనే దుష్ట సంప్రదాయం నుంచి విముక్తి చేసేందుకు బుద్ధుని కాలం నుంచే (క్రీ పూ. 500) ఎన్నెన్నో గొప్ప ప్రయత్నాలు జరిగాయి. బుద్ధుడు అస్పృశ్యులను తన కొత్త మతంలోకి అహ్వానించాడు. అంటరానితనాన్ని రద్దు చేసి సాంఘిక సమానత్వాన్ని ఏర్పరిచేందుకు భావజాల, అధ్యాత్మిక రంగాలలో శతాబ్దాలుగా ప్రయత్నాలు చేసినవారు ఉన్నారు. చక్రధరుడు, రామానందుడు, కబీరు, చైతన్యుడు, ఏకనాధ్, తుకారాం, రోహిదాస్, చొక్కమేళుడు వంటి ఎందరో యోగులు భక్తి మార్గంలో అధ్యాత్మిక సమానత్వం నెలకొల్పడంలో చాలా వరకు విజయం సాధించారు.

దేశంలో సంఘ సంస్కరణోద్యమం నూతన భావ స్రవంతులు రంగప్రవేశం చేయడంతో ఊపందుకుంది. స్వేచ్ఛా స్వాతంత్ర్యాల పట్ల మక్కువ, పార్లమెంటరీ వ్యవస్థపై విశ్వాసం, దేవుని ముందు, చట్టం ముందు అందరూ సమానులేనన్న విశ్వాసం ఈ కొత్త ఉద్యమాలకు ఉత్తేజాన్నిచ్చాయి.

కులం ప్రాధాన్యాన్ని ప్రశ్నించలేదు. కులం పటిష్టంగా వుండేందుకు గాను పాలకులు చాలినన్ని ప్రోత్సాహకాలు అందించారు. దేశంలో చట్టాల అమలుకు సిఫార్సులను చేసేందుకు వచ్చిన సైమన్ కమిషన్‌కు బొంబాయి ప్రభుత్వం సమర్పించిన వినతి పత్రంలో బ్రాహ్మణేతరుల తీరు తెన్నులపై ఫిర్యాదు చేసింది. స్థానిక జిల్లా స్థాయి పాలనా మండలులలో బ్రాహ్మణేతరులు మెజారిటీగా వున్న సందర్భాలలో సామర్థ్యాన్ని సైతం కాదని బ్రాహ్మణులను గెంటివేయడానికి ప్రయత్నిస్తున్నట్లు మొర పెట్టుకుంది.

దేశ జాతీయతను ప్రభావితం చేస్తున్న కుల సమస్యను బ్రిటిష్ పాలకులు ఎన్నడూ పెద్దగా పట్టించుకోలేదు. 1857 నాటి సైనిక తిరుగుబాటు ఫలితంగా సైన్యంలోని ఉన్నత కులాలకు చెందిన వారిని పెద్ద సంఖ్యలో ఇళ్లకు పంపించే ప్రక్రియ మొదలైంది. సిపాయి తిరుగుబాటుకు ప్రధానంగా ఉన్నత కులాలకు చెందిన బ్రాహ్మణులు, రాజపుత్రులు కారణమని భావించడం వల్లే సైన్యంలోకి సిబ్బందిని చేర్చుకునే విషయంలో ఆంక్షలు అమలులోకి వచ్చాయి. అయితే పాలకులు తీసుకున్న చర్యలన్నీ పాక్షికంగా మాత్రమే వుండేవని చెప్పవచ్చు. బ్రిటిష్ ఆధిపత్యానికి భంగం కలిగే పరిస్థితులు బలంగా ఉన్న సందర్భాలలో మాత్రమే 'చర్య'కు దిగడం పరిపాటిగా వుండేది.

1857 తిరుగుబాటు తరువాత దేశం పాలనాపరంగా ఏకీకృతమైంది. శాంతి భద్రతల పరిరక్షణ, చట్టానికి లోబడిన పాలన స్వేచ్ఛా స్వాతంత్ర్యాల పట్ల విశ్వాసం, దేశ ఆధునికీకరణ,రాజ్య అవసరాల రీత్యా బలమైన ఆర్థిక పునాదులు వేయడం, కరువు కాటకాలు, అంటు వ్యాధుల అదుపునకు దృఢమైన చర్యలు, వ్యవసాయ వనరుల పెంపు, రాజకీయ సుస్థిరత్వం వంటి పలు అంశాలు దేశ స్థితి గతులను పూర్తిగా మార్చివేశాయి. ఈ పరిణామాల వలన దేశానికి సార్వత్రికంగా జాతీయతా భావన సమకూరింది. ఒకేవిధమైన న్యాయ వ్యవస్థ, పరిపాలనా వ్యవస్థల ప్రవేశంతో చాలా వరకు ఏకీకరణ సాధ్యపడింది. రాజకీయపరమైన సంఘటనల ఏర్పాటుకు అప్పటిదాకా వున్న నిబంధనలను సడలించి సులభసాధ్యం చేయడం వలన దేశ ప్రజల మధ్య ఐక్యతకు అస్కారం ఏర్పడింది. ఆంగ్ల విద్య, ఆధునిక ప్రసార సాధనాల అభివృద్ధి, స్థానిక స్వయం పాలనా వ్యవస్థల ఏర్పాటు, పరిమిత స్థాయిలో స్వయం పాలనకు అనుకూలంగా తీసుకున్న చర్యలు, కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు వంటి చర్యలు ఈ క్రమాన్ని వేగవంతం చేశాయి.

హిందూ సంప్రదాయ వాదంపై బ్రిటిష్ వారు ప్రవేశపెట్టిన విలువలు ఎనలేని ప్రభావం చూపాయి. బ్రిటిష్ ప్రభావం వలన ఉన్నత విద్యను అభ్యాసించిన భారతీయులు( సంఖ్యలో కొద్ది మందే అయినా సమాజంలో ప్రధానమైన స్థానాలలో వున్నవారు కావడంతో) సంప్రదాయ హిందూ ఆలోచనా ధోరణులను విడనాడి పాశ్చాత్య జీవన విధానాన్ని, ఆలోచనలను అలవర్చుకొని సమాజాన్ని తీవ్రస్థాయిలో ప్రభావితం చేశారు. ఆధునిక విద్యపై మెకాలే వెలిబుచ్చిన అభిప్రాయాలు తమ వంతు కర్తవ్యాన్ని నేరవేర్చడంలో సఫలమయ్యాయి. రక్తంలో, రంగులో భారతీయులుగా వుంటూనే అభిరుచులలో, అభిప్రాయాలలో, నైతిక విలువలలో,

మేధస్సులో ఆంగ్లేయుల వలె వ్యవహరించే వర్గాన్ని సృష్టించడం మెకాలే తన లక్ష్యంగా పెట్టుకున్నాడు. మెకాలే అవలంబించిన ఈ వ్యూహం ఆయన ఆశించిన విధంగానే సత్ఫలితాలను ఇచ్చింది. మెకాలే సూత్రాన్ని అమలు చేస్తూ నాటి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని "విప్లవాత్మక పరిణామాలకు దారి తీసిన అత్యంత సానుకూల చర్య"గా చరిత్రకారుడు కె.ఎం.పణిక్కర్ వ్యాఖ్యానించారు

పౌర హక్కుల అమలు పట్ల శ్రద్ధ, న్యాయ వ్యవస్థకు ఆధిక్యత, ప్రజల భాగస్వామ్యం, వారి అమోదంతో ఏర్పడే ప్రభుత్వం అందరికే ఓటు హక్కు కల్పించి నిర్వహించే ఎన్నికలు,రాజకీయంగా ప్రజలందరూ ఒక్కటేననే భావనను దేశ వ్యాప్తం చేయడం, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, న్యాయ వ్యవస్థ, దేశ పురోగతిలో విశ్వాసం, ముందు చూపు – భారత సమాజంపై దీర్ఘకాలిక ప్రభావం చూపే ఈ భావనలన్నీ బ్రిటిష్ పాలన వల్లే వాస్తవ రూపం దాల్చాయి.

అప్పటి దాకా భారతదేశం బ్రిటన్‌కు వ్యావసాయిక జీవన విధానం గల వలస అవశేషంగా వుండేది. సంప్రదాయ పరిశ్రమల స్థానే ఆధునిక పరిశ్రమలను నెలకొల్పడం వల్ల భారత ప్రజల మధ్య ఆర్థిక సమైక్యత సాధ్యపడింది. బ్రిటిష్ వలసవాదం ఫలితంగా ఒక జాతిగా, దేశంగా ఏర్పడిన క్రమంలో భారత్ కొత్త వర్గాలకు నెలవుగా మారింది. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థకు లోబడి కొత్త వర్గాలు ఏర్పడటంతో సరిపెట్టకోకుండా కౌలుదారీ విధానం పరాకాష్టకు చేరుకోవడం,వ్యవసాయ కూలీల వ్యవస్థ పెరుగుదల పరిపూర్తి కావడం వంటి పరిణామాలు కూడా ఈ పరివర్తనకు దోహదం చేశాయి అయితే ఈ దశలో భూస్వాములలో, భూమి గల ఇతర రైతాంగంలో జాతీయతాభావన పెల్లుబుకడం గమనార్హం. మార్క్స్ ఈ బూర్జువా విప్లవాన్ని "భారత చరిత్రలో సంభవించిన ఒకే ఒక నిఖార్సయిన సామాజిక విప్లవం"గా అభివర్ణించారు.

## సంఘ సంస్కర్తల కృషి

హిందూ సమాజాన్ని అస్పృశ్యత అనే దుష్ట సంప్రదాయం నుంచి విముక్తి చేసేందుకు బుద్ధుని కాలం నుంచే (క్రీ పూ. 500) ఎన్నెన్నో గొప్ప ప్రయత్నాలు జరిగాయి. బుద్ధుడు అస్పృశ్యులను తన కొత్త మతంలోకి అహ్వానించాడు. అంటరానితనాన్ని రద్దు చేసి సాంఘిక సమానత్వాన్ని ఏర్పరిచేందుకు భావజాల, అధ్యాత్మిక రంగాలలో శతాబ్దాలుగా ప్రయత్నాలు చేసినవారు ఉన్నారు. చక్రధరుడు, రామానందుడు, కబీరు, చైతన్యుడు, ఏకనాథ్, తుకారాం, రోహిదాస్, చొక్కమేళుడు వంటి ఎందరో యోగులు భక్తి మార్గంలో అధ్యాత్మిక సమానత్వం నెలకొల్పడంలో చాలా వరకు విజయం సాధించారు.

దేశంలో సంఘ సంస్కరణోద్యమం నూతన భావ స్రవంతులు రంగప్రవేశం చేయడంతో ఊపందుకుంది. స్వేచ్ఛా స్వాతంత్ర్యాల పట్ల మక్కువ, పార్లమెంటరీ వ్యవస్థపై విశ్వాసం, దేవుని ముందు, చట్టం ముందు అందరూ సమానులేనన్న విశ్వాసం ఈ కొత్త ఉద్యమాలకు ఉత్తేజాన్నిచ్చాయి.

1850 ప్రాంతంలో రాజారామమోహన్‌రాయ్ మతాన్ని సమాజపరం చేస్తూ ప్రారంభించిన తన పునరుద్ధరణ ఉద్యమంలో భాగంగా సాంఘిక సమానత్వాన్ని బోధించారు. రామమోహన్, ఆయన సమకాలికుల బోధనల ఫలితంగా హిందూ - క్రైస్తవ మతాల సమ్మిశ్రమమైన బ్రహ్మ సమజం రూపు దాల్చింది. ఏకోపాసనతో పాటు సోదర భావాన్ని కూడా బ్రహ్మసమాజం ప్రచారం చేసింది. మనిషి నుంచి మనిషిని వేరు చేస్తున్న కులాన్ని బలహీనపరచడంలో రామమోహన్ భావ విప్లవం ఒక మేరకు విజయవంతమైంది. బ్రహ్మ సమాజం అడుగు జాడల్లో ప్రార్థన సమాజం బొంబాయిలో ఏర్పడింది. ఇది కుల వివక్షను అసాంతం నిరాకరించింది. ఆర్య సమాజ్‌ను నెలకొల్పిన స్వామి దయానంద సరస్వతి కుల వ్యవస్థ బహు ముఖాలుగా విస్తరించి సంక్లిష్టమై పోయిన దృష్ట్యా దాని స్థానే పాత కాలపు చాతుర్వర్ణ వ్యవస్థను సిఫార్సు చేశారు. జాతి పునర్నిర్మాణానికి ఆర్య సమాజ్ చేపట్టిన కార్యక్రమంలో ముఖ్యమైన కొత్త అంశం వర్ణ వ్యవస్థలోని నాలుగో మెట్టు మీద వున్న శూద్రులకు వేదాధ్యయనాన్ని అనుమతించడం వేద కాల సమాజపు ప్రాచీన శుద్ధతను పునరుద్ధరించడానికి ప్రయత్నించిన ఆర్య సమాజ్ సంప్రదాయ భావజాలంలో వున్న వారిని విశేషంగా ఆకర్షించింది. ఆర్యసమాజ్ సభ్యులు తమ ఆచరణలో కనబరిచిన చిత్తశుద్ధి ప్రజలను ప్రబలంగా ఆకట్టుకుంది. రామకృష్ణ మిషన్ దివ్యజ్ఞాన సమాజాలు ప్రాచుర్యంలోకి తెచ్చిన భావజాలం కూడా ఆనాటి విద్యావంతులను ప్రభావితంచేసింది. ఈ ఉద్యమాలన్నీ హిందూ సమాజంలో నివసిస్తున్న వారి ప్రవర్తన చట్రాలను సంస్కరించడంలో గణనీయమైన పాత్ర పోషించాయి. తద్వారా భారతీయ సంస్కృతిపై ఇస్లాం, క్రైస్తవాల దాడులను నిలువరించగలిగాయి.

దేశంలోని ఇతర ప్రాంతాలలో సాంఘిక - మత పునరుద్ధరణ ఉద్యమాలు సాగితే, మహారాష్ట్రలో ఇందుకు భిన్నమైన సాంఘిక - మత సంస్కరణ ఉద్యమం 19వ శతాబ్దం ద్వితీయార్ధంలో ఊపిరి పోసుకుంది. ఈ ఉద్యమానికి ఎం.జి. రానడే, దదోబా, లోక హితవాది, విష్ణుతత్వ బ్రహ్మచారి, మహాత్మా జ్యోతి రావ్ ఫూలే వంటి సంఘ సంస్కర్తలు నాయకత్వం వహించారు. రానడే సమాజిక దృక్కోణంలో వచ్చిన 'మార్పు' కింది విధంగా వుంది.

> "మనమంతా ఆశించే మార్పు ఆంక్షలనుంచి స్వతంత్రం, అవిశ్వాసం నుంచి విశ్వాసం, అంతరాల నుంచి ఒప్పందానికి, ఆధిపత్యం నుంచి వివేచనకు, అసంఘటిత జీవితం నుంచి సంఘటిత జీవితానికి, మత దురభిమానం నుంచి పరమత సహనానికి, గుడ్డి కర్మవాదం నుంచి మానవ గౌరవ భావనకు మనలను ఎదిగించేదిగా వుండాలి. వ్యక్తులకు కాని, సమాజాలకు కాని ఈ దేశంలో వర్తించే సాంఘిక విప్లవాన్ని నేను అర్థం చేసుకున్న తీరు ఇది".

జ్యోతిబా ఫూలే సాంఘిక సమానత్వం కోసం తన ఉద్యమాన్ని సుదీర్ఘంగా కొనసాగించారు. 1873లో మహారాష్ట్రలో ఆయన తన ఉద్యమాన్ని సాగించేందుకు సత్య శోధక్ సమాజ్ (సత్యాన్వేషణ సంఘం) నెలకొల్పారు. కులానికి అతీతంగా మనిషి విలువను,

ప్రాధాన్యాన్ని నిలపడమే ఈ సంస్థ ముఖ్యోద్దేశం. హిందూ సమాజంలోని వారందరికి మానవ హక్కులను ఇవ్వడాన్ని నిరాకరించిన కుల వ్యవస్థపై ఆయన తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. బ్రాహ్మణాధిక్యాన్ని తోసి పుచ్చే బ్రాహ్మణేతర ఉద్యమం కాదు పూలేది. 1848 నాటికే ఆయన బ్రాహ్మణేతర కులాలకు చెందిన బాలురకు, బాలికలకు వేర్వేరుగా ప్రాథమిక పాఠశాలలు నెలకొల్పారు. 1851లో అంటరానివారి పిల్లలకు పాఠశాల ప్రారంభించారు. రానడే పూలే సాగించిన ఈ నూతనోద్యమానికి తమ వంతు మద్దతు తెలిపారు. పూలే చేపట్టిన ఆందోళనకు కొల్హాపూర్ మహారాజు కొత్త జవజీవాలను అందించారు. అంటరాని వారి పిల్లలకు నిర్బంధ ఉచిత విద్య అందజేయాలని 1884లో హంటర్ కమిషన్ ముందు పూలే వాదించారు. పూలే చేపట్టిన కార్యం విప్లవాత్మకమైంది. కాని నిర్మాణపరమైన బలహీనతలు, వనరుల లేమి వలన ఆశించిన ఫలితాలను ఆయన పొందలేక పోయారు. సామాన్య జనబాహుళ్యంలో ఆత్మ విశ్వాసాన్ని ప్రేరేపించిన మొట్టమొదటి ఉద్యమకారుడు పూలే. పూలే అగ్రకులాల ఆధిక్యాన్ని ప్రశ్నించారు. కాని ఆయన జనం బాధలకు మూలకారణం కనిపెట్టలేకపోయారు. విదేశీ వ్యాపారులు నిర్దాక్షిణ్యంగా దోపిడికి పాలుపడటం, సామ్రాజ్యవాదుల పాలనలో దేశం మగ్గుతుండటం ప్రజల దుస్థితికి కారణం అనే నిజాన్ని ఆయన దృష్టిలో పెట్టుకోలేదు.

## క్రైస్తవ మిషనరీల పాత్ర

హిందువులు ఏనాడు ఏకీకృత సమూహంగా లేరు. భిన్న కులాల సమాఖ్యగా మాత్రమే వారు ఉనికిలో వుంటూ వచ్చారు. సమాజం నాలుగు వర్ణాలుగా విభజించబడి వున్నందున ఆయా కులాలు / ఉప కులాలు ఏదో ఒక వర్ణానికి (అంతరాల దొంతరకు) అనుబంధంగా వుండేవి. హిందూ మతంపై క్రైస్తవ మిషనరీలు దాడి చేసిన ఫలితంగా విద్యాధిక వర్గాలలో అంతరాలకు అతీతమైన సమూహంగా ఏర్పడాలనే భావనకు అస్కారం కలిగింది.

హిందూ సమాజపు స్థితిగతులను ఈ మిషనరీలు తమకు అనుకూలంగా మలుచుకున్నాయి. హిందువుల సామాజిక జీవనంలోని అసమానతలను వారు ఎత్తి చూపారు. అణగారిన వర్గాలు, అస్పృశ్యులకు చదువులు చెప్పే కార్యక్రమాన్ని వారు చేపట్టారు. కింది కులాలకు చదువు చెప్పడానికి, ఇతర సదుపాయాలు కల్పించడానికి ఉన్నత కులాలు, మరీ ముఖ్యంగా బ్రాహ్మణులు వ్యతిరేకులనే అభిప్రాయాన్ని మిషనరీలు వారిలో కల్పించారు. ఈ శోషిత వర్గాలకు పాఠశాలలు, ఆసుపత్రులను పెద్ద ఎత్తున నెలకొల్పారు. తమ చాతుర్యంతో, దయా గుణంతో, బాధితులకు ఆపన్నహస్తం అందించే వారి వైఖరితో క్రైస్తవ మత గురువులు నిమ్నజాతులకు చెందిన వారిని హిందూ జీవన విధానం నుంచి వేరుచేయగలిగారు. దీని పరిణామంగా వేలాదిమంది అస్పృశ్యులు క్రైస్తవంలోకి మారిపోయారు. మతం మారిన తరువాత కాలంలో వారికి హిందువులనుంచి ఆదరణ లభ్యమైంది. ఈ సామాజిక ప్రక్రియ నిరాటంకంగా కొనసాగడంతో, సామాజికంగా హిందువులను వ్యతిరేకిస్తూ విదేశీ పాలకులకు వత్తాసు పలికే

అణగారిన అంటరాని వారి వర్గం ఒకటి స్థిర రూపం తీసుకుంది. ఈ విధంగా ప్రబలిన జాతి వ్యతిరేక భావన విస్తారంగా వ్యాప్తి చెంది స్వాతంత్ర పోరాటాన్ని, అందుకు సాగిన జాతీయోద్యమాన్ని దెబ్బతీశాయి. స్పృశ్యులకు, అస్పృశ్యులకు మధ్య దీని వలన తారతమ్యం పెరిగిపోయి క్రమంగా సమస్య భిన్న రూపాన్ని సంతరించుకుంది.

క్రైస్తవం రాక ఇంతచేసి అస్పృశ్యుల స్థితిగతులను మెరుగుపరచలేకపోయింది. బ్రిటిష్ పాలన చివరి ఘడియల దాకా వారి సామాజిక, ఆర్థిక స్థితిగతులు యధాతథంగా వుండి కులతత్వం ఉచ్చులో చిక్కుకుపోయి వున్నాయి. కుల అణిచివేత, ఆర్థిక దోపిడీ, రాజకీయ దాస్యాలను వారి జీవితాలనుంచి తొలిగించడంలో మిషనరీలు పూర్తిగా వైఫల్యం చెందాయి.

సాంఘిక, మతపరమైన అంశాలలో జోక్యం చేసుకోకూడదనే విధానాన్నే సామ్రాజ్యవాదులు తుది దాకా అవలంబించారు. ప్రభుత్వం అవలంబించిన ఈ తటస్థ వైఖరి అస్పృశ్యులకు మేలు చేయలేదు సరి కదా, అగ్ర కుల హిందువులకు ఊతమిచ్చింది. విద్యారంగంలో వారిది పైచేయిగా వుండటం ఇందుకు దోహదం చేసింది.

బ్రిటిష్ ప్రభుత్వం భారత చరిత్రలో తొలిసారిగా ప్రజాస్వామిక విలువల ప్రాతిపదికపై దేశవాసుల్ని చట్టపరంగా ఏకతాటిపైకి తేవడంలో సఫలమయింది. అయితే ఈ ఏకీకరణ ప్రక్రియలో లోపాలు లేకపోలేదు. యూరోపియన్లకు అనుకూలంగా వివక్షాపూరిత చట్టాలను బ్రిటిష్ పాలకులు చేయడం గమనార్హం. కరెన్సీ వ్యవస్థను సాధారణీకరించడం వలన దేశ ఆర్థిక రంగ విధివిధానాలలో సామ్యం సాధ్యమయింది. బ్రిటిష్ అధికార యంత్రాంగం మరెన్నో శాసనాలను కొత్తగా ప్రవేశపెట్టింది. కులాన్ని కోల్పోయినా, మతం మార్చుకున్నా ఆస్తి హక్కు పోకుండా 1850లో కుల వైకల్యాల తొలగింపు చట్టాన్ని తెచ్చింది. వివాహ చట్టాన్ని సడలించాలని సంస్కర్తలు నిరంతరాయంగా ఆందోళనలు చేసిన ఫలితంగా 1972లో ప్రత్యేక వివాహ చట్టాన్ని ప్రవేశపెట్టారు. ఈ చట్టాన్ని 1923లో ప్రత్యేక వివాహ సవరణ చట్టంగా మార్చింది.

ఇన్ని ప్రయత్నాల తర్వాత కూడా అంటరాని వారికి మాత్రం పౌరహక్కులు అందనంత దూరంలోనే వుండిపోయాయి. అంటరాని వారు సాంఘికంగా ఎదుర్కొంటున్న అసమానతలను, వైకల్యాలను తొలగించి అందరితో సమానంగా వారికి పౌర హోదా కల్పించాలనే డిమాండ్ బ్రిటిష్ అధికారుల ముందుకు రాకపోలేదు. ప్రభుత్వ నిధులతో నడిచే అన్ని పాఠశాలలలో వివక్ష లేని విధంగా అన్ని వర్గాలకు చెందిన బాలలకు ప్రవేశం కల్పించాలని 1888లో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పాశ్చాత్య నాగరికతతో సంపర్కం, ఆంగ్ల విద్య సైతం అంటరానితనంపై నాటుకొనిపోయి వున్న కాలం చెల్లిన అభిప్రాయాలను మార్చలేకపోయాయని 1915లో ప్రభుత్వం బహిరంగంగానే వాఖ్యానించింది. అస్పృశ్య, అణగారిన వర్గాలకు చెందిన పిల్లలకు ప్రవేశాన్ని నిరాకరించిన ఎయిడెడ్ విద్యా సంస్థలకు నిధులను నిలిపివేయాలని

బొంబాయి ప్రభుత్వం 1923లో తీర్మానించింది. ప్రజలకు అందచేసే అన్ని సేవా కార్యక్రమాలను అంటరానివారితో సహా అన్ని వర్గాలకు చెందిన వారికి అందించేందుకు వీలుగా మద్రాస్ శాసన మండలి 1925లో ఒక బిల్లును అమోదించింది. మాంట్‌ఫోర్డ్ సంస్కరణల వల్ల స్థానిక సంస్థలలో, చట్టసభలలో అణగారిన వర్గాలకు ప్రవేశార్హత కలిగింది. ఎన్నికల ప్రక్రియ ద్వారా కాకుండా నామినేట్ చేయడం ద్వారా వారిని నేరుగా చట్ట సభలకు పంపే విధానం అమలులోకి రావడం ఈ సంస్కరణల పుణ్యమే. అన్ని ఉద్యోగాలలో తొలుత బ్రాహ్మణులు, ఇతర అనుబంధ కులాలకు చెందిన వారే వుండటం వలన అంగ్లేయ విద్య ప్రయోజనాలను ముందుగా వారే అందుకున్నారు. వారి సంప్రదాయ వైఖరి సహజంగానే బ్రాహ్మణేతరుల పట్ల వారు అవలంబించిన వ్యవహార సరళిని ప్రభావితం చేసింది. ఈ నేపథ్యంలోనే బ్రాహ్మణేతర నాయకులు ప్రత్యేక ప్రాతినిధ్యాన్ని కోరుతూ ఉద్యమించారు. దీని ఫలితంగా కింది స్థాయి ప్రభుత్వ ఉద్యోగాలలోకి ఉన్నత స్థాయికి చెందిన బ్రాహ్మణులను తీసుకోకుండా ఆంక్షలు విధిస్తూ బొంబాయి ప్రభుత్వం 1923 సెప్టెంబర్ 7వ తేదిన ఒక తీర్మానాన్ని అమోదించింది. కింది కులాలకు చెందిన వారికి కనీసం చిన్న స్థాయి ఉద్యోగాలనైనా కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అయితే తిరిగి 1925 ఫిబ్రవరి 5వ తేదిన చేసిన మరో తీర్మానం ద్వారా ఉద్యోగ నియామకాలలో బ్రాహ్మణులపై అమలులో వున్న పూర్తి స్థాయి ఆంక్షలను రద్దు చేసింది.

అంటరాని వారి విద్యకు సంబంధించిన సమస్య పాలకుల ముందు ఎప్పుడూ వుంటూనే వచ్చింది. బొంబాయి ప్రెసిడెన్సీలోని ధార్వాడ్‌లో జరిగిన ఒక సంఘటన వలన ఈ సమస్య ఎనలేని ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. ధార్వాడ్ లోని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంటరాని కులానికి చెందిన ఒక బాలునికి సీటు ఇవ్వడానికి నిరాకరించాడు. ఈ సందర్భంగా బొంబాయి ప్రభుత్వం ఈ సమస్యను పరిశీలించి 1858లో కీలకమైన ఒక నిర్ణయం తీసుకుంది. కులం, జాతి కారణాలుగా చూపి ఏ వర్గానికి చెందిన వారికైనా ప్రభుత్వ వనరులతో (పాక్షికంగానైనా) నిర్వహించే పాఠశాలలలో ప్రవేశం నిరాకరిస్తే నిధులు నిలిపివేసే అధికారం ప్రభుత్వానికి వుంటుందని, ప్రభుత్వ నిధులతో నిర్వహిస్తున్న పాఠశాలలలో వివక్షకు తావు లేని విధంగా సమాజంలోని అన్ని వర్గాలకు ప్రవేశార్హత వుంటుందని శాసనం చేసింది.

అంటరాని వారి ప్రయోజనాలను పాలకులు బాహాటంగా వ్యతిరేకించకపోయినా, వారి పట్ల మొత్తంగా సానుకూల వైఖరి కనబరచలేదనే చెప్పాలి. కింది కులాలు ముఖ్యంగా అంటరాని వారికి చదువులు చెబితే ఉన్నత కులాలకు చెందిన వారికి ముఖ్యంగా బ్రాహ్మణులకు ఎక్కడ కోపం వస్తుందోనని బ్రిటిష్ ప్రభుత్వం ఒకింత జాగ్రత్తగా వ్యవహరించింది. ప్రభుత్వం సమస్యను ఎల్లప్పుడూ పక్కదారి పట్టించేందుకే ప్రయత్నించింది. ప్రభుత్వంలో ఉన్నతోద్యోగాలలో బ్రాహ్మణులు తిష్ఠ వేసి వుండటం సమస్యను మరింత జటిలం చేసింది.

**జాతి నిర్మాణానికి యత్నాలు**

అస్పృశ్యతా నివారణ, అణగారిన వర్గాల చీకటి బతుకులలో వెలుగు నింపడం లక్ష్యంగా బ్రిటిష్ హయాంలో అన్ని మత - సామాజిక ఉద్యమాలు ముందుకు వచ్చాయి. చదువుకునే చైతన్యవంతులైన వారిలో ప్రజాస్వామిక విలువలు పాదుకొనడం వలన సార్వజనీనంగా తలెత్తిన ధర్మాగ్రహంలో భాగంగానే అమానుషమైన, అన్యాయమైన అస్పృశ్యతా దురాచారం పట్ల కూడా వారిలో పట్టరాని ఆగ్రహం పెల్లుబుకింది. అంటరాని వారికి సాంఘిక, మత, సాంస్కృతిక రంగాలలో సమాన హక్కులు కల్పించేందుకు ఆనాటి ప్రముఖులు, సాంఘిక, రాజకీయేతర సంస్థలు ప్రచార మాధ్యమం ద్వారా, చదువులు చెప్పడం ద్వారా, అవసరమైన చర్యలు తీసుకోవడం ద్వారా పాటుపడ్డారు.

అణగారిన కులాలలో / వర్గాలలో కూడా తమ దుస్థితి పట్ల తీవ్ర అసహనం, ఆందోళన, అలజడి పొడచూపాయి. 1906 అక్టోబర్ 18వ తేదిన జస్టిస్ చందావర్కర్ నేతృత్వంలో భారత శోషిత వర్గాల కార్యసాధక సంఘం ఏర్పడింది అణగారిన వారి అభ్యున్నతి విద్య ద్వారా మాత్రమే సాధ్యపడుతుందని గట్టిగా నమ్మిన ఈ సంఘం ఈ మేరకు ఒక విజ్ఞాపన పత్రాన్ని భారత ప్రభుత్వానికి సమర్పించింది.

1892 నాటికే సైన్యంలోకి అంటరాని జాతులకు చెందిన మహర్లను తీసుకోవడం నిలిచిపోయింది. వారు శ్వేత జాతీయులతో తొలి రోజుల్లోనే ప్రత్యక్ష సంబంధం నెలకొల్పుకున్నారు. శారీరకంగా వారు దృఢకాయులు పోరాట పటిమలో, ధైర్యసాహసాలను ప్రదర్శించడంలో వారిది పెట్టింది పేరు. పరిస్థితులకు అనుగుణంగా తమను తాము మలుచుకోగల నిశిత బుద్ధి వారి సొత్తు. అంబేద్కర్ తండ్రి రాంజీ న్యాయసమ్మతం కాని ఈ ఉత్తర్వులను వ్యతిరేకించారు. ఎం జి రానడేను కలిసి ఈ విషయమై ఫిర్యాదు చేశారు. బొంబాయి రాష్ట్ర గవర్నర్‌ను కలిసి మహర్లకు జరిగిన అన్యాయాన్ని వివరించారు.ముస్లింలు తమ రాజ్యాధికారాన్ని పటిష్టం చేసుకునేందుకు తమను వాడుకున్నట్లే బ్రిటిష్ పాలకులు కూడా సంస్థానాల రాజులకు వ్యతిరేకంగా తమను ఉపయోగించుకున్నారనే అభిప్రాయం మహర్లలో బలంగా వుండేది. బ్రిటిష్ వారి బ్రాహ్మణ అనుకూల వైఖరికి తోడు అంటరాని వారిని విద్యాబుద్ధులకు దూరంగా వుంచడం ఈ వివక్షను మరింత తీవ్రతరం చేసింది.

సైన్యంలోకి ప్రవేశించేందుకు అంటరాని వారు 1915 నుంచి చేస్తున్న ప్రయత్నాలు ఫలించలేదు. 1917 ఫిబ్రవరి 6వ తేదీన అప్పటికి 25 ఏళ్ల క్రితం జారీ అయిన నిషేధపు టుత్తర్వులను ప్రభుత్వం ఉపసంహరించుకుంది. మొదటి ప్రపంచయుద్ధం (1914 - 1918)అవసరాలను తీర్చడానికి గాను మూడో మహర్ సైనిక పటాలాన్ని ఏర్పాటు చేశారు. రెండో మహర్ పటాలాన్ని ఈ సందర్భంగా రద్దు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని

మహర్లు గట్టిగా వ్యతిరేకించారు. సైన్యంలోకి మహర్లను తీసుకోవలసిన అవసరాన్ని నొక్కి చెప్పిన సందర్భాలు ఎన్నో వున్నాయి. 1917 నవంబర్ 17న సర్ నారాయణ్ చందావర్కర్ అధ్యక్షతన జరిగిన అణగారిన వర్గాల సదస్సు అంటరాని వారి డిమాండ్లను ప్రభుత్వం ముందు వుంచింది. ఈ డిమాండ్లను ఆమోదిస్తూ అదే ఏడాది కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ సమ్మేళనం ఒక తీర్మానం ఆమోదించింది. బరోడా రాష్ట్ర పాలకుడు మహారాజా శాయాజీరావ్ గైక్వాడ్ అధ్యక్షతన 1918 మార్చి 23 నాడు అంటరానితనం రద్దును డిమాండ్ చేస్తూ ఒక సదస్సు జరిగింది. ఈ సదస్సు సన్నాహక కమిటీ ఛైర్మన్‌గా సర్ ఎన్.జి. చందావర్కర్ వ్యవహరించారు. అంటరాని వారి సమస్యల విచారణకు బ్రిటిష్ రాజ వంశీయులతో కూడిన కమిషన్ నియమించాలని సదస్సు డిమాండ్ చేసింది. 1920కి ముందు సామాజిక కార్యకర్తలు మానవతావాద భావాల ప్రభావానికి లోనై జనం మధ్య పని చేసేవారు. క్రైస్తవం కూడా వారిపై ప్రభావం చూపింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ స్థాయిలో కొన్ని కీలకమైన పరిణామాలు సంభవించాయి. బొంబాయి రాష్ట్ర శాసనమండలి సభ్యుడు డి.డి. ఘోలప్ 1921 జూలై 25న ప్రతిపాదించిన తీర్మానంలో అస్పృశ్యులకు ఉచిత నిర్బంధ విద్య కల్పించాలని కోరారు. కాని ప్రభుత్వం ఆయన డిమాండ్‌ను మన్నించలేదు. మరో ఎం.ఎల్.సి. సి.కె. బోలే సామూహిక స్థలాలకు వెళ్లడానికి ఇతరులు అందరికి మాదిరే అంటరాని వారికి కూడా స్వతంత్రం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌ను ఆమోదించని పక్షంలో అస్పృశ్యులు సత్యాగ్రహానికి పాల్పడవచ్చునని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అస్పృశ్యత రద్దుకు సాగిన ఉద్యమాన్ని వృద్ధి చేయడంలో విఠల్ రాంజీ షిండే, శివరాం జన్‌బా కాంబ్లే కీలకమైన భూమిక పోషించారు.

### అంబేద్కర్ రంగ ప్రవేశం

బ్రిటిష్ వారి ఏలుబడిలో భారత ప్రజానీకంలో జాతీయ స్థాయిలో రూపు దాల్చిన ప్రజాస్వామిక జాగరణ, అణగారిన వర్గాలలో ప్రజాస్వామ్య చైతన్యం పరిఢవిల్లి, మౌలికమైన మానవ హక్కుల పట్ల స్పష్టమైన అవగాహన ఏర్పడానికి కారణమైంది. చిరకాలంగా అణచివేతకు గురైన ప్రజాసమూహాల తిరుగుబాటు పోరాటాలకు, ఉన్నత కులాలకు చెందిన విద్యావంతులు మానవతావాద కార్యకలాపాలతో సంఘీభావం ప్రకటించడమే సంఘ సంస్కరణోద్యమాల సారాంశంగా చెప్పవచ్చు.

కులాల మధ్య అసమానతలు, హెచ్చుతగ్గులు క్రమేపీ మాసిపోవడానికి రైళ్లు, బస్సులను ప్రవేశపెట్టడం, కొత్తగా నెలకొల్పిన పరిశ్రమలలో పని చేయడానికి కార్మికులుగా అస్పృశ్యులతో పాటు ఇతర కులాల వారిని కూడా తీసుకోవడం, హోటళ్లు స్థాపించడం, కుల చైతన్యం స్థానే వర్గ చైతన్యం కలగడం వంటి అనేక నూతన పరిణామాలు దోహదం చేశాయి. విద్యా వ్యాప్తి ఈ క్రమాన్ని వేగవంతం చేసింది. దీనివలన అస్పృశ్యుల్లో అణగారిన వర్గాలలో తమ మానవ



సుందరయ్య గ్రంథాలయ
A C No 88664

హక్కులు, రాజకీయ డిమాండ్ల సాధనకు రాజీ లేని పోరాటాలు చేయగల మేధావులు, యోధులు రంగం మీదికి వచ్చారు. అంబేద్కర్‌ది వీరిలో అగ్రస్థానం. సంఘ సంస్కరణలను దయాదాక్షిణ్యాలతో ఒకరిచ్చే భిక్షగా ఆయన భావించలేదు. తన వారిలోస్వాతంత్ర స్ఫూర్తిని, ఆత్మ వికాసాన్ని, తమ హక్కుల పట్ల ఎరుకను కలిగించడానికి ఆయన కృషి చేశారు. ఆయన నూతన మానవుడిని, తద్వారా నూతన సమాజాన్ని నిర్మించాలని తలంచారు. సంఘ సంస్కరణ ఆయన దృష్టిలో సాంఘిక దాస్యంపై చేసే ఒక తిరుగుబాటు. మనువు శాసనాలకు లోబడి లేని ఆధునిక భారతదేశంలో అంటరానివారు తమ కాళ్ల మీద తాము నిలబడ గలిగే శక్తిని సమకూర్చుకోవాలని, స్వయం ప్రతిపత్తి సాధించాలని ఆయన కోరుకున్నారు.

# అధ్యాయం 2

# అంబేద్కర్ జీవిత చిత్రం

భీంరావ్ రాంజీ అంబేద్కర్ మధ్య భారతంలోని మహువా గ్రామంలో 1891 ఏప్రిల్ 14న జన్మించారు. ఆయన తండ్రి రాంజీ, తాత మాలోజీ సైన్యంలో పని చేశారు. తండ్రి రాంజీ క్రీడలలో అందెవేసిన చేయి. ఆయనది ముక్కుసూటి స్వభావం. ఇంగ్లీష్ భాషలో ఆయనకు ప్రావీణ్యం వుండేది. సైన్యంలో ఆయన సుబేదార్ - మేజర్ హోదాకు ఎదిగారు. సుమారు 14 ఏళ్ల పాటు ఆయన సైనిక శిక్షణా కేంద్రంలో బోధకునిగా వున్నారు. 1891లో నెలకు 50 రూ॥ల పింఛన్‌తో పదవీ విరమణ చేసిన రాంజీ రత్నగిరి జిల్లాలోని దపోలీ లో స్థిరపడ్డారు. 1894లో రత్నగిరిలోని పబ్లిక్ వర్క్స్ విభాగంలో స్టోర్ కీపర్‌గా ప్రభుత్వం ఆయనకు తిరిగి ఉద్యోగం ఇచ్చింది. కొంత కాలానికి ఆయన సతారాకు బదిలీ అయ్యారు.

రాంజీకి మొత్తం 14 మంది పిల్లలు. భీం రావ్ వారిలో కడపటి వాడు. భీం రావ్ తల్లి భీమా బాయ్ 1896లో అతని ఐదేళ్ల వయసులో కన్ను మూసింది. పిన్ని మీరాబాయ్‌కి అతనంటే అమితమైన ప్రేమ. భీం రావ్‌కు తల్లి లేని లోటు ఆమె ద్వారా తీరింది. ఆమె భీం రావ్‌ను భివా అని పిలిచేది. రాంజీ మాంసాహారం ముట్టేవాడుకాదు. మద్యపానం ఎరగడు. ఆయన మత, ధార్మిక అంశాలపై అమితమైన ఆసక్తి కనబరచేవారు. చర్చలలో ఉత్సాహంగా పాలు పంచుకునేవారు. జ్యోతిబా పూలేకు ఆయన అభిమాని.

ఆ రోజులలో అంటరానివారిలో మరీ ముఖ్యంగా మహర్లలో మూడు భక్తి మార్గాలు ఆచరణలో వుండేవి. అవి కబీర్, రామానందుడు, నాథ మార్గాలు. 1896లో రాంజీ అంబేద్కర్ కబీర్ మార్గానుయాయి అయ్యారు. కబీర్ బోధించిన భక్తి మార్గం దయాగుణంలో, ఉపకార బుద్ధిలో, దైవాధీనతలో ఓదార్పును ప్రవచిస్తుంది. ఈ మార్గానికి చెందిన భక్తులు శ్రీ కృష్ణుడ్ని, శ్రీ రాముడ్ని కొలవడం ద్వారా నైతికంగా సంతుష్టిని, ఆధ్యాత్మికంగా ఉపశాంతిని పొందేవారు. కబీర్ కుల వ్యవస్థను చీల్చి చెండాడారు. ఈ కారణంగానే కుల వ్యవస్థ మూలంగా చెప్పరాని అవమానాలకు, బాధలకు గురవుతున్న అస్పృశ్యులు కబీర్ మార్గాన్ని అనుసరించారు.



మందరయ్య గ్రంథాలయ సంఘ
A C No. 88664

ఐదేళ్ల వయసులో భీం రావ్‌ను దపోలీ లోని మరాఠీ పాఠశాలలో చేర్చారు. తండ్రి సతారాకు బదిలీ అయిన పిదప అంటే 1900వసం॥లో భీం రావ్ అక్కడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫస్ట్ స్టాండర్డ్‌లో ప్రవేశించాడు. స్కూల్‌లో ఆయన పేరు భివా రాంజీ అంబావడేకర్ గా నమోదైంది. నిజానికి పూర్వీకుల నుంచి ఆయనకు వచ్చిన ఇంటి పేరు సంక్‌పల్. అయితే అతని పూర్వీకులు ఇంటి పేరుతో కాకుండా స్వగ్రామమైన అంబావడే పేరిట గుర్తింపు పొందడాన్ని ఎంచుకున్నారు. ఈ ఊరు రత్నగిరి జిల్లా ఖేడ్ తాలుకాలో వుంది. సతారా స్కూల్‌లోని అంబేద్కర్ పేరు గల ఒక ఉపాధ్యాయుడు భీం రావ్‌ను బాగా ఇష్టపడే వాడు. అతనికి తరచు భోజనం కూడా పెట్టేవాడు. ఆయన విశాల హృదయుడు, దయాళువు. గురువు పట్ల గౌరవభావంతో భీంరావ్ తనను తాను అంబేద్కర్‌గా పిలుచుకునేవాడు. జీవిత పర్యంతం ఆయన తన పట్ల ఎంతో అభిమానంగా వున్న ఆ చిన్ననాటి గురువుకు కృతజ్ఞుడిగా వున్నారు. చివరికి ఆ గురువు పేరునే తన పేరుగా చేసుకున్నారు. పెరిగి అంబేద్కర్ రౌండ్ టేబుల్ సమావేశానికి లండన్ వెళ్లిన సందర్భంగా ఈ ఉపాధ్యాయుడు ఆయనను అభినందిస్తూ ఉత్తరం రాశారు.

పుట్టుకతో అంటరానివాడు కావడంతో స్కూల్‌లో అంబేద్కర్‌ను విడిగా కూర్చోబెట్టేవారు. సహ విద్యార్థులతో కలిసి తిరగడం, వారితో కలిసి క్రికెట్ వంటి ఆటలు ఆడటానికి ఆయన నోచుకోలేదు. సంస్కృతం అభ్యసించకుండా అంటరాని వారిపై ఆంక్షలు ఉండేవి. సంస్కృతం చెప్పే ఉపాధ్యాయుడు సైతం ఇందుకు తగినట్లుగానే వారికి పాఠాలు చెప్పడానికి సుముఖంగా వుండకపోయేవాడు. దీనితో తప్పనిసరై అంబేద్కర్ ద్వితీయ భాషగా పర్షియన్ చదవవలసి వచ్చింది. "సంస్కృతం నేర్చుకోవాలన్న కోరిక నాలో బలంగా వున్నా టీచర్ల సంకుచిత వైఖరి వలన అది సాధ్యపడలేదు". అని ఆయన తరువాతి రోజుల్లో స్వయంగా చెప్పుకున్నారు. అంటరాని పిల్లల నోట్ పుస్తకాలను టీచర్లు ఏ ఒక్కనాడు కూడా తాకక పోయేవారు. కొందరైతే మైలపడిపోతామని భయంతో వారిని పద్యాలు అప్పచెప్పమని అడగటం కానీ, ప్రశ్నలు అడగటం కానీ చేయకపోయేవారు. అంబేద్కర్ విద్యార్థిగా ఈ అవమానాలన్నీ సహించవలసివచ్చింది.

అంబేద్కర్ తండ్రి రాంజీని సతారాలో ఉద్యోగం నుంచి 1904లో తొలగించారు. అప్పుడు ఆయన బొంబాయికి మారిపోవాలని నిర్ణయించుకున్నారు. బొంబాయి పరేల్ ప్రాంతంలోని పాడుపడిన సత్రంలో ఒక గదిలో ఆ కుటుంబం నివసించేది. ఆ గదిలో కుటుంబ సభ్యులతో పాటు ఒక తిరగలి, ఒక ఆడ గొర్రె కూడా వుండేవి.

ఆ సమయంలో అంబేద్కర్ ఫోర్త్ స్టాండర్డ్ చదువుతున్నాడు. పరేల్‌లోని మరాఠా హైస్కూల్‌లో మొదట ఆయన చేరాడు. స్కూల్ రుసుములో రాయితీ లేనందున డబ్బు కట్టడం కష్టమై ప్రభుత్వం నిర్వహించే ఎల్ఫిన్ స్టోన్ హైస్కూల్‌లో ప్రవేశించాడు. సతారా స్కూల్‌లో

మహర్ కావడం వలన ఆడలేకపోయిన క్రికెట్ బొంబాయిలో మాత్రం స్వేచ్ఛగా ఆడే అవకాశం ఆయనకు కలిగింది. మధ్యాహ్న భోజనం ఆయన ఇంటినుంచే తీసుకుపోయేవాడు. జౌళి మిల్లులలో పని చేసే తన బంధువుల టిఫిన్ క్యారేజీలను కూడా ఆయనే తీసుకెళ్లెవాడు. పుస్తక పఠనంపైనున్న మక్కువతో ఆయన ప్రతి రోజు చార్ని రోడ్ గార్డెన్స్‌కు వెళ్లి చదువుకునేవాడు.

అంబేద్కర్ 1907లో మెట్రిక్యులేషన్ పరీక్ష పాసయ్యాడు. ఆయన కుటుంబం దీనిని కనీ వినీ ఎరుగని ఒక అద్భుత సంఘటనగా భావించింది. అంటరాని మహర్ కుటుంబానికి చెందిన పిల్లవాడు ఉన్నత విద్యకు ప్రవేశార్హత పొందడం అనేది వారికి అబ్బురమనిపించింది. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు అంతా కలిసి వేడుక చేసుకున్నారు. సత్య శోధక్ సమాజ్ ఉద్యమ నాయకుడు ఎస్.కె. బోలే, శివాజీ జీవిత చరిత్ర రచయిత కృష్ణారావ్ అర్జున్ కెలూస్కర్‌ల అధ్యక్షతన జరిగిన సమావేశంలో అంబేద్కర్‌ను అభినందించారు. గౌతమ బుద్ధుని జీవిత చరిత్రను కెలూస్కర్ ఆ రోజు ఆ సభలో అంబేద్కర్‌కు బహుమతిగా ఇచ్చారు.

స్కూల్‌లో వుండగానే ఆయనకు వివాహం జరిగింది. 14వ ఏట ఫిఫ్త్ స్టాండర్డ్‌లో వుండగా తొమ్మిదేళ్ల రమాబాయ్‌తో ఆయన పెళ్లి జరిగింది. భికు వలాంకర్ ఆమె తండ్రి.

అంబేద్కర్ ఎల్ఫిన్ స్టోన్ కళాశాలలో చేరాడు. కాలేజి విద్య సాగించడానికి అభ్యుదయ భావాలు గల బరోడా పాలకుడు శాయాజీ రావ్ గైక్వాడ్ నెలకు 25 రూపాయల ఉపకార వేతనం ఇచ్చేవారు. ప్రొ॥ ముల్లర్ ఆయనకు పుస్తకాలు, దుస్తులు అందజేశారు. అయితే కాలేజి హాస్టల్ వార్డెన్ మాత్రం ఆయనకు తాగడానికి నీళ్లు గాని, టీ కాని ఇచ్చేవాడు కాదు. అదే సమయంలో కుటుంబం వేరే చోటకు రెండు గదుల ఇంటికి మారింది. అంబేద్కర్ తండ్రి అయ్యారు. పుట్టిన కొడుకుకు యశ్వంత్ అని పేరు పెట్టారు.

ఇంగ్లీష్, పర్షియన్ ఐచ్ఛికాంశాలుగా బి.ఏ. పరీక్షలో ఆయన 1913లో ఉత్తీర్ణులయ్యారు. తరువాతి కాలంలో బహుశాస్త్ర కోవిదునిగా ఉన్నత స్థానం చేరుకున్న అంబేద్కర్ బి.ఎ.లో మాత్రం ర్యాంక్ సాధించలేకపోయారు. 1913 ఫిబ్రవరి 2వ తేదీన ఆయనకు పితృవియోగం కలిగింది. తండ్రి మరణం అంబేద్కర్‌ను తీవ్రంగా కలచివేసింది. తండ్రి తనకు చదువు చెప్పించడానికి ఎన్ని కష్టనష్టాలను ఎదుర్కొన్నారో అంబేద్కర్‌కు తెలుసు. చదువులకుగాను తప్పనిసరై ఆయన అప్పులు కూడా చేయవలసి వచ్చింది. వ్యసనాలకు దూరంగా జీవించిన తన తండ్రి నుంచి కష్టపడి పనిచేసే స్వభావాన్ని, ఆశయ సాధనకు కట్టుబడి వుండే తత్వాన్ని, మంచి అలవాట్లను అలవర్చుకున్నారు.

తండ్రి ఆమోదం లేకున్నా తన సంస్థానంలో పని చేయవలసిందిగా కోరుతూ బరోడా మహారాజు పంపిన ఆహ్వానాన్ని అంబేద్కర్ అంగీకరించారు. బరోడా సంస్థానంలో ఉన్నతోద్యోగాలన్నీ సంప్రదాయ బ్రాహ్మణులకు, ఇతర అగ్ర వర్ణస్థులకు హక్కు భుక్తమై వుండేవి.

మడి – మైలకు సంబంధించి బంట్రోతు వంటి కింది స్థాయి ఉద్యోగులకు సైతం ఎంతో పట్టింపు వుండేది. అంటరానివారిని తాకడానికి వారికి తీవ్రంగా అభ్యంతరాలు వుండేవి. అందుకే వారు అంబేద్కర్ ముఖంపై ఫైళ్లను విసిరికొట్టేవారు. నివసించడానికి మంచి ఇల్లు కూడా ఆయనకు దొరకలేదు. ఆర్యసమాజ్ కార్యకర్త ఆత్మారాంతో కలిసి ఒక గదిలో అయన వుండేవారు. పరిస్థితులు ఈ విధంగా భరించశక్యం కాకుండా ఉండటంతో తప్పనిసరై ఆయన తన ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేశారు.

మహారాజు మాత్రం ఆయనను 1913 జూన్ 4న తిరిగి పిలిపించుకొని సంస్థానంలో ఉద్యోగిగా ఒప్పందం కుదుర్చుకుని ఉన్నత విద్యకు అమెరికా పంపించారు. గైక్వాడ్ స్కాలర్‌గా కొలంబియా విశ్వ విద్యాలయంలో ఆదే ఏడాది జూలై మూడవ వారంలో ఆయన చేరారు. విదేశీ విశ్వ విద్యాలయాలలో ఉన్నత విద్య అభ్యసించిన తొలి మహర్ అంబేద్కర్ కావడం విశేషం.

కొలంబియాలోని కాస్మోపాలిటన్ క్లబ్‌లో ఆయన నివసించేవారు. అక్కడ ఆయన ఇతరులతో సమానంగా అన్ని హక్కులు అనుభవించేవారు. కొలంబియా విశ్వ విద్యాలయం ఆయన మనోద్వారాలను విశాల ప్రపంచానికి తెరిచి, ఆయన ప్రాపంచిక దృష్టి కోణాన్ని విశదం చేసింది.

ప్రఖ్యాత ఆర్థిక శాస్త్రవేత్త ప్రొ॥ సెలిగ్‌మన్ అక్కడ ఆయనకు అధ్యాపకుడిగా లభించారు. అంబేద్కర్ రోజుకు 18 గంటలు అధ్యయనంలోనే గడిపేవారు. నాటి స్వాతంత్ర్యోద్యమ మహారథి లాలా లజపతిరాయ్ అప్పుడు అమెరికాలో ప్రవాస దీక్షలో వున్నారు. ఆయన రోజూ అంబేద్కర్ చదివే కాలేజీ గ్రంథాలయానికి వచ్చేవారు. అక్కడే ప్రతి రోజు చదువుకుంటూ కాలం గడిపే అంబేద్కర్ ఆయన దృష్టిని ఆకర్షించారు. దగ్గరకు వచ్చి అంబేద్కర్ ఎవరైందీ, ఎక్కడ నుంచి వచ్చిందీ ఆప్యాయంగా తెలుసుకున్నారు. భారత్‌లో సాగుతున్న జాతి విమోచన పోరాటం గురించి వారిద్దరూ ప్రతి రోజూ సంభాషించు కునేవారు.

అంబేద్కర్ 1915 జూన్‌లో "ప్రాచీన భారతంలో వాణిజ్యం" అనే అంశంపై పరిశోధనా పత్రం సమర్పించి ఎం. ఎ. డిగ్రీ పొందారు. డా॥ గోల్డెన్ వైజర్ నేతృత్వంలో 1916 మే నెలలో జరిగిన మానవ పరిణామ శాస్త్ర సదస్సులో "భారతదేశంలో కులాలు : వాటి పుట్టుక, అభివృద్ధి, తీరు తెన్నులు" అనే అంశంపై పత్రాన్ని సమర్పించారు. ఈ పత్రం 1917 మే నెల ఇండియన్ యాంటిక్వరీ సంచికలో ప్రచురితమైంది. ఇదే రచన వెను వెంటనే చిన్ని పుస్తకంగా వెలువడింది. తొలుత వెలుగు చూసిన అంబేద్కర్ రచన ఇదే. అంతర్వివాహ పద్ధతి కులాల ఉనికికి మూల కారణమని ఆయన ఇందులో ప్రతిపాదించారు. ఆయన దృష్టిలో దడి కట్టిన వర్గమే కులం. మనువు కన్నా ముందు నుంచే కులం మనుగడలో వున్నట్లు ఆయన

అభిప్రాయపడ్డారు. ఈ రచనలో మనువును ఆయన ముందు వెనుక చూడని దుస్సాహసిగా అభివర్ణించారు.

తన పిహెచ్.డి. థీసిస్‌ను అంబేద్కర్ 1916 జూన్‌లో పూర్తి చేశారు. "భారత దేశానికి జాతీయ మిగులు అదాయం: ఒక చారిత్రక - విశ్లేషణాత్మక అధ్యయనం" అనే అంశంపై ఆయన సమర్పించిన ఈ థీసిస్‌ను ఆయన మహరాజా శాయాజీ రావ్‌కు అంకితమిచ్చారు. ఎనిమిదేళ్ల తర్వాత "బ్రిటిష్ ఇండియాలో ప్రాదేశిక ద్రవ్య పరిణామ క్రమం" పేరిట ఈ థీసిస్ గ్రంథ రూపంలో వెలువడినప్పుడు దానికి తన అధ్యాపకుడు ప్రొ॥ ఎస్. ఎ. సెలిగ్‌మన్ ముందు మాట రాశారు. "బడ్జెట్ చర్చల సందర్భంగా భారత శాసనసభ సభ్యులకు ఈ పుస్తకం ఎంతగానో ఉపకరించింది" అని అంబేద్కర్ జీవిత చరిత్ర రచయిత కీర్ పేర్కొన్నారు.

అంబేద్కర్ 1916 జూన్‌లో కొలంబియా విశ్వవిద్యాలయాన్ని విడిచిపెట్టి లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ (లండన్ ఆర్థిక - రాజకీయ శాస్త్రాల అధ్యయన సంస్థ) లో చేరడానికి సన్నద్ధుడయ్యారు. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన లండన్ స్కూల్ అధ్యాపకులు ప్రొ॥ కెనన్, ప్రొ॥ సిడ్నీ వెబ్ లకు ప్రొ॥ సెలిగ్‌మన్ పరిచయ లేఖలు రాసి అంబేద్కర్ చేతికి ఇచ్చారు. 1916 అక్టోబర్‌లో ఆయన గ్రే న్యాయ కళాశాల (గ్రేస్ ఇన్ ఫర్ లా)లో చేరారు. అయితే ఈ దశలో ఆయన ఆర్థికంగా గడ్డు పరిస్థితి ఎదుర్కొన్నారు. లండన్‌లో ఏడాది పాటు గడిపి ఆయన స్వదేశానికి తిరిగి వచ్చారు. ఈ కాలాన్ని ఆయన ఆర్థిక శాస్త్రంలో ఎం.ఎస్సీ. డిగ్రీ పొందడానికి గాను థీసిస్ రాసే పనిలో వెచ్చించారు. థీసిస్ పని పూర్తి కాకముందే ఆయన వెనక్కి తిరిగి రావడానికి కారణం బరోడా మహరాజు ఇచ్చిన స్కాలర్‌షిప్ ఆగిపోవడమే. స్కాలర్‌షిప్ కొనసాగించవలసిందిగా అంబేద్కర్ రాజు శాయాజీ రావ్‌కు చేసుకున్న విన్నపాలు ఫలించలేదు. అప్పుడు ఆయన గత్యంతరం లేక నాలుగేళ్లలోగా తిరిగివచ్చి తన పరిశోధనను పూర్తి చేయగలనని లిఖిత పూర్వకంగా లండన్ విశ్వ విద్యాలయం అధికారులకు హామీ ఇచ్చి వారి అనుమతి తీసుకున్నారు. ప్రొ॥ కెనన్ ఈ విషయంలో అంబేద్కర్ తరపున వకాల్తా పుచ్చుకున్నారు. అంబేద్కర్ పట్ల వున్న అభిమానంతో సంబంధిత పెద్దలకు ఆయన సిఫార్సు చేయడం వల్లే ఇది సాధ్యపడింది.

1917 జూన్‌లో బరోడా మహరాజా కొలువులో అంబేద్కర్ సైనిక కార్యదర్శిగా నియమితులయ్యారు. మున్ముందు బరోడా రాష్ట్ర ఆర్థిక మంత్రిగా పదవీ బాధ్యతలను అప్పగించే ఉద్దేశంతోనే మహరాజు వ్యూహాత్మకంగా అంబేద్కర్‌ను తన వద్ద పెట్టుకున్నారు. కొత్త ఉద్యోగం బాధ్యతలు స్వీకరించడానికి బరోడా వెళ్లినప్పుడు ఆయనను తోడ్కొని పోవడానికి ఎవరూ రాలేదు. పట్టణంలోని హోటళ్లు, వసతి గృహాలు ఆయనను లోనికి అనుమతించలేదు. అప్పుడు తన ఉనికిని దాచి పెట్టి ఒక పార్సీ మతస్తుల హోటల్లో బస చేశారు. ఉద్యోగంలో చేరిన నాటి

నుంచే సహ సిబ్బంది, బంట్రోతులతో సహా అందరూ ఆయనను కుష్టు వ్యాధి పీడితుని వలె చూశారు. మనం ఇంతకు ముందే చెప్పుకున్నట్లు బంట్రోతులు ఆయన టేబుల్ వద్దకు వెళ్లకుండా దూరం నుంచే ఫైళ్లను, ఇతర కార్యాలయ పత్రాలను ఆయన పైకి విసిరేసేవారు. ఆఫీస్‌లో ఆయనకు తాగడానికి మంచి నీరు ఇచ్చేవారు కాదు. ఈ భయానక వాతావరణం నుంచి సేద తీరడానికి ఆయన గ్రంథాలయంలో ఆశ్రయం పొందేవారు. పార్సీలు కూడా విషయం గ్రహించి ఆయనను తమ హోటల్ నుంచి తరిమికొట్టారు. తన దుస్థితిని తెలియజేస్తూ అంబేద్కర్ అప్పుడు మహారాజాకు లేఖ పంపించారు. లేఖను అందుకున్న దివాను తన నిస్సహాయతను వ్యక్తం చేశారు.• వ్యక్తిగత హోదాలో చదువు ద్వారా ఉన్నత స్థానానికి చేరుకున్నప్పటికీ అగ్ర కుల హిందువుల వైఖరి తన పట్ల కించిత్తు కూడా మారకపోవడం ఆయనను బాధించింది. ఒక సాయంత్రం చెట్టు కింద కూచోని ఆయన భోరున విలపించారు. అంటరాని కులంలో పుట్టిన పాపానికి అక్కడ ఎదురైన అవమానాల పరంపరకు ప్రతిగా ఆయన బరోడా విడిచిపెట్టారు. తన శ్రేయోభిలాషి కె.ఎ. కెలూస్కర్ ద్వారా బరోడాలో తాను పడ్డ బాధలను శాయాజీ రావ్ దృష్టికి తీసుకుపోయేందుకు అంబేద్కర్ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. బరోడాలో వుండగా ఒక ప్రొఫెసర్ పేయింగ్ గెస్ట్‌గా తన ఇంట అంబేద్కర్‌ను వుంచుకోవడానికి ముందు అంగీకరించినా తరువాత వెనక్కి తగ్గారు. తన మేలు కోరి తనకెంతో సహాయం అందించిన రాజు సంస్థానానికి వీడ్కోలు చెప్పి అంబేద్కర్ 1917 నవంబర్‌లో బొంబాయికి తిరిగి వచ్చారు.

అంబేద్కర్ బొంబాయి రాగానే శంభాజీ వాఘ్‌మారే వంటి వారు ఆయనకు పౌర సన్మానం ఏర్పాటు చేశారు. సన్మాన సభకు అధ్యక్షత వహించవలసి వున్న సర్ చిమన్ లాల్ సెతల్వాడ్ గైర్హాజరయ్యారు. ఈ సమయంలో అంబేద్కర్ భూమి సమస్యపై"భారతదేశంలో చిన్న భూ కమతాలు - పరిష్కార మార్గాలు" అనే చిన్న పుస్తకాన్ని ప్రచురించారు.

బొంబాయిలో తన జీవితాన్ని కొత్తగా తీర్చిదిద్దుకునేందుకు ఆయన ప్రయత్నించారు. ఒక పార్సీ సహకారంతో ఇద్దరు విద్యార్థులకు ట్యూషన్లు చెప్పే పనిలో ఆయన కుదిరారు. ట్యూటర్‌గా వుంటూనే స్టాక్ మార్కెట్‌లో షేర్ల లావాదేవీలపై డీలర్లకు సలహాలిచ్చే వ్యాపార సంస్థను ప్రారంభించారు. కాని వినిమయదారులు సలహా సంప్రదింపులకు అంటరాని వాని వద్దకు వెళ్లేందుకు సిద్ధంగా లేకపోవడంతో ఆయన ఆ సంస్థను మూసివేశారు. పార్సీ పెద్ద మనిషి వ్యాపార గణాంకాలు, ఉత్తర ప్రత్యుత్తరాలను కొంతకాలం నిర్వహించారు. బొంబాయిలోని సిడెన్‌హ్యామ్ కాలేజీలో రాజకీయార్థిక శాస్త్ర అధ్యాపకుని ఉద్యోగం ఖాళీగా వున్నట్లు తెలుసుకొని దానికి 1918 నవంబర్‌లో దరఖాస్తు చేశారు. తాత్కాలిక ప్రాతిపదికపై ఆ ఉద్యోగంలో చేరారు. తన లండన్ యాత్రకు అవసరమైన ధనాన్ని సేకరించేందుకు ఆయన ఈ ఉద్యోగం ద్వారా వచ్చిన వేతనాన్ని వినియోగించుకున్నారు. కాలేజీ విద్యార్థులకు అత్యంత ప్రియమైన

అధ్యాపకునిగా అక్కడ పేరు తెచ్చుకున్నారు. ఇతర కాలేజీల విద్యార్థులు కూడా వచ్చి ఆయన చెప్పే పాఠాలను ఆసక్తిగా వినేవారు. అయితే ఆయన సామాజిక జీవనం మాత్రం ఎటువంటి మార్పుకు నోచుకోలేదు. ఆయన అధ్యాపక సిబ్బంది కోసం కేటాయించిన కుండలో నుంచి నీటిని తాగడం పట్ల బ్రాహ్మణీయ అగ్ర కులాలకు చెందిన అధ్యాపకులు అభ్యంతరం లేవనెత్తేవారు. ప్రతి నెల ఆయనకు రూ॥ 450 /- వేతనంగా ముట్టేది. ఈ కాలేజీలో 1918 నవంబర్ 11 నుంచి 1920 మార్చి 11 వరకు ఆయన ప్రొఫెసర్‌గా వున్నారు. లండన్‌లో న్యాయ, ఆర్థిక శాస్త్రాలను అభ్యసించేందుకు గాను ఆయన ఈ ఉద్యోగానికి రాజీనామా చేశారు. బొంబాయిలో గడిపిన ఈ రెండేళ్ల కాలంలో ఆయన ఏడు వేల రూపాయల వరకు అదా చేశారు. అయితే లండన్ వెళ్లడానికి ఆయనకు కొల్హాపూర్ సంస్థానాధీశుడు సాహు మహరాజ్ 1500/- రూపాయలు ఇచ్చి సహకరించారు.

ఎన్నికల్లో పాల్గొనే అధికారం ప్రజలకు కల్పించడంపై అభిప్రాయం చెప్పవలసిందిగా అంబేద్కర్‌ను సౌత్ బరో కమిషన్ కోరింది. ఓటర్లకు వేర్వేరు కూటములను (ఎలెక్టోరేట్) ఏర్పాటు చేయవలసిందిగా ఆయన కమిషన్‌కు విన్నవించారు.మాంట్ ఫోర్డ్ సంస్కరణలకు ఈ కమిషన్ సిఫార్సులే ప్రాతిపదిక అయ్యాయి. కమిషన్ తన నివేదికను 1919 ఫిబ్రవరి 22న ప్రభుత్వానికి సమర్పించింది. బ్రాహ్మణేతర హిందువులు వేర్వేరు ఎలెక్టోరేట్‌ల కోసం పెట్టుకున్న అర్జీలను కమిషన్ తోసి పుచ్చింది.

అణగారిన ప్రజా శ్రేణుల తరపున పోరాడేందుకు 1920 జనవరి 31న అంబేద్కర్ మూక నాయక్ (మూగవాళ్ల నేత) అనే వార పత్రికను ప్రారంభించారు. తొలి సంచిక సంపాదకీయంలో ఆయన ఈ విధంగా రాశారు.

> "ప్రస్తుతం మనుగడలో వున్న వార్తా పత్రికలు కొన్ని వర్గాల ప్రయోజనాలను మాత్రమే కాపాడుతున్నాయి. ఇతర కులాల ఈతి బాధలను అవి పట్టించుకోవు. ఈ దేశం అసమానతలకు పుట్టినిల్లు. అధికారం, జ్ఞానం లేకుండా బ్రాహ్మణేతరుల, అణగారిన వర్గాలు పురోగతి చెందడం కుదరని పని. పేదరికం, అశక్తత, అజ్ఞానం విశాలమైన శోషిత సమాజాన్ని దారీ తెన్ను లేకుండా చేశాయి."

సాహు మహరాజ్ ఈ పత్రికకు వెయ్యి రూపాయలు విరాళంగా ఇచ్చారు. కాని ఈ పత్రిక ఎక్కువ కాలం మనలేకపోయింది.

సాహు మహరాజ్ అధ్యక్షతలో 1918లో నాగపూర్‌లో, 1920లో కొల్హాపూర్‌లో జరిగిన అణగారిన వర్గాల సదస్సులకు అంబేద్కర్ హాజరయ్యారు. సర్. నారాయణ్ చందావర్కర్ మద్దతుతో వి.ఆర్.షిండే నిర్వహిస్తున్న అణగారిన వర్గాల మిషన్ కార్యకలాపాలను అంబేద్కర్

విమర్శించారు. అంటరాని వారి ఉద్ధరణకు చేసిన తొలి సంఘటిత యత్నం ఇది. సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సోసైటీ ఈ మిషన్ పట్ల సానుకూలంగా స్పందించింది. అస్పృశ్యులు నిర్వహించే సంస్థలకు, అస్పృశ్యులకు తప్ప అన్యులు నడిపే సంస్థలకు అంటరానివారి ప్రయోజనాలను కాపాడతామని చెప్పే హక్కు లేదన్నది అంబేద్కర్ అభిప్రాయం. వి.ఆర్. షిండే తదితరులపై నాగ్‌పూర్ సదస్సు అవిశ్వాస తీర్మానాన్ని ఆమోదించింది. ఈ సదస్సు అంటరానివారికి తమ కాళ్లపై తాము నిలబడగలిగే శక్తినిచ్చింది. అంబేద్కర్ భావి కార్యక్రమాలకు ఈ సదస్సులోనే పునాదులు పడ్డాయి.

మరాఠీ భాషలో జ్ఞాన కోశ పేరిట తన సంపాదకత్వంలో సిద్ధం చేస్తున్న ఎన్‌సైక్లోపీడియాకు రచనలు ఇవ్వవలసిందిగా మరాఠీ భాషా వేత్త, పండితుడు డా॥ ఎస్. వి. కేత్కర్ చేసిన విజ్ఞప్తిని అంబేద్కర్ తోసిపుచ్చారు. ఢిల్లీలో 1918లో జరిగిన ఆర్థిక శాస్త్ర సదస్సులో పత్రం సమర్పించడానికి కూడా ఆయన నిరాకరించారు. తాను చదువుకున్న సిడెన్ హామ్ కాలేజీ ప్రిన్సిపల్ ఈ విషయమై చేసిన ఒత్తిడికి కూడా ఆయన తలొగ్గలేదు.

అంబేద్కర్ 1920 సెప్టెంబర్‌లో లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో తిరిగి చేరారు. న్యాయశాస్త్ర అధ్యయనానికి శ్రీకారం చుట్టారు. ఆర్థికంగా ఆయన పరిస్థితి అక్కడ సంతృప్తి కరంగా లేదు. కొల్హాపూర్‌లో వున్న తన భార్య రమాబాయి బాగోగులు చూడటానికి సాహు మహరాజ్ ముందుకు వచ్చినా ఆయన అందుకు అంగీకరించలేదు. అయితే ఆయన చేసిన ఆర్థిక సహాయాన్ని మాత్రం తీసుకున్నారు.

లండన్‌లో తన పూర్తి కాలాన్ని ఆయన అధ్యయనానికే వెచ్చించారు. నగరంలోని ప్రముఖ గ్రంధాలయాలలో సభ్యత్వం తీసుకున్నారు. లండన్ విశ్వవిద్యాలయ ప్రధాన గ్రంధాలయం, గోల్డ్ స్మిత్ ఆర్థిక శాస్త్ర గ్రంధాలయం, బ్రిటిష్ మ్యూజియం లైబ్రరీ, ఇండియా ఆఫీస్ లైబ్రరీ వంటి గ్రంధాలయాలలో రోజంతా పుస్తక పఠనంలో మునిగి వుండేవారు. జేబులో డబ్బులు కూడా లేకపోవడంతో ఆయన రోజు మధ్యాహ్న భోజనం మానేసి, అక్కడే చదువు సాగించేవారు. విహార యాత్రలు, నాటకాలు, హోటళ్లకు అతి దూరంగా వుండేవారు. భార్యకు ఒకసారి రాసిన ఉత్తరంలో అవసరాలు తీరని పక్షంలో నగలు అమ్మవలసిందిగా సూచించారు. తిరిగి వచ్చిన తరువాత నగలు తిరిగి కొనిపెట్టగలనని వాగ్దానం చేయడం ఈ లేఖలో కనిపిస్తుంది. అంబేద్కర్ అభిమానులు ఎందరో రమాబాయికి సహాయం చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. కాని ఆమె వారి సహాయాన్ని స్వీకరించలేదు. ఆర్థిక శాస్త్రంలో ఎం.ఎస్సీ. డిగ్రీ కోసం "బ్రిటిష్ ఇండియాలో సామ్రాజ్యవాదుల విత్తం – సంస్థానాలలో దాని వికేంద్రీకరణ" అనే అంశంపై అంబేద్కర్ రాసిన థీసిస్‌ను 1921 జూన్‌లో లండన్ విశ్వవిద్యాలయం ఆమోదించింది. జర్మనీలోని బాన్ విశ్వవిద్యాలయంలో 1922 –23 మధ్య

కాలంలో కొద్ది మాసాలు ఆయన ఆర్థిక శాస్త్రాన్ని అధ్యయనం చేశారు. "రూపాయి సమస్య : దాని పుట్టుక, పరిష్కారం" అనే అంశంపై థీసిస్‌ను ఆర్థిక శాస్త్రంలో డి.ఎస్సీ. డిగ్రీ కోసం 1923 మార్చిలో సమర్పించారు. థీసిస్‌లోని కొన్ని అంశాలను చెప్పిన పద్ధతి బ్రిటిష్ ఎగ్జామినర్లకు కోపం తెప్పించింది. విశ్లేషణ మార్చనవసరం లేకుండా తిరిగి రాసి సమర్పించవలసిందిగా ఆదేశిస్తూ వారు ఆ పత్రాన్ని వెనక్కి ఇచ్చారు. వారు సూచించిన విధంగానే దానిని ఆయన తిరగరాసి డి.ఎస్సీ. పట్టా పొందారు. దీనిని లండన్‌లోని పి.ఎస్.కింగ్ అండ్ కంపెనీ అదే ఏడాది డిసెంబర్‌లో గ్రంథ రూపంలో వెలువరించింది. ఈ గ్రంథం ప్రొ॥ కెనన్ ముందు మాటతో వెలువడింది. ప్రేరణను ఇచ్చే కొత్త అభిప్రాయాలు అంబేద్కర్ థీసిస్‌లో వున్నట్లు ఆయన ఈ ముందుమాటలో పేర్కొన్నారు. అంబేద్కర్‌ను ఒక గొప్ప మేధావిగా ఆయన ప్రస్తుతించారు. ఇదే గ్రంథాన్ని "భారతీయ కరెన్సీ – బ్యాకింగ్ చరిత్ర" ఒకటవ సంపుటి రూపంలో 1947 మే నెలలో బొంబాయిలోని థాకర్ అండ్ కంపెనీ వెలువరించింది. 1923 ఏప్రిల్‌లో అంబేద్కర్‌కు బొంబాయి కోర్టు నుంచి పిలుపు వచ్చింది. లండన్‌లో ఆయన భారత విదేశాంగ శాఖ కార్యదర్శి / మంత్రి (సెక్రటరీ ఆఫ్ స్టేట్) ఇ. ఎస్. మాంటేగ్‌ను ,విఠల్ భాయ్ పటేల్‌ను కలుసుకొని భారత్‌లో అస్పృశ్యుల సమస్యలపై వారితో చర్చించారు.

ఆయన బొంబాయి హైకోర్టులో న్యాయవాద వృత్తిని 1923 జూన్‌లో ప్రారంభించారు. కోర్టు కేసుల చిట్టాను(సనద్) తీసుకునేందుకు అవసరమైన డబ్బు కూడా ఆయన వద్ద వుండకపోయేది. హైకోర్టుకు అనుబంధంగా వున్న మరో కోర్టులో ఆయన తన వృత్తిని సాగించారు. అంటరానితనం సాకుగా చూపి ఆయనతో న్యాయపరమైన లావా దేవీలు జరిపేందుకు అక్కడి వకీళ్లు నిరాకరించారు. అందువలన చిన్న చిన్న స్థానిక కేసులతో ఆయన సంతృప్తి పడాల్సి వచ్చేది. పరేల్ ప్రాంతంలోని దామోదర్ హాల్‌లో కార్యాలయం ప్రారంభించేందుకు కార్మిక నాయకుడు ఎన్. ఎం.జోషీ ఆయనకు సహకరించారు. ఈ ప్రతికూల వాతావరణంలో న్యాయవాదులు బి.జి.మోదక్, డి.ఎ.ఖారే ఆయనకు కొన్ని కేసులు అప్పగించి అండగా నిలిచారు. న్యాయవాద వృత్తి చాలినంత ఆదాయం ఇవ్వకపోవడంతో స్థానిక అకౌంటెన్సీ ఇన్‌స్టిట్యూట్ లో పార్ట్ టైం ప్రొఫెసర్‌గా మర్కంటైల్ లా మూడేళ్లు బోధించారు. బొంబాయి విశ్వవిద్యాలయంలో ఎగ్జామినర్‌గా పని చేయడం ద్వారా ఆయన అదనంగా మరికొంత ఆదాయం సమకూర్చుకునేవారు.

అణగారిన వర్గాల సమస్యలపై సమావేశాన్ని 1924 మార్చ్ 9న ఆయన పరేల్‌లో తాను ప్రాక్టీస్ చేసే చోట ఏర్పాటు చేశారు. సమావేశంలో జరిగిన చర్చల ఫలితంగా 1924 జూలై 20 వ తేదీన అణగారినవారి శ్రేయస్సుకు "బహిష్కృత హితకారిణీ సభ" ఏర్పడింది. దీనికి సర్ చిమన్ లాల్ సెతల్వాద్ అధ్యక్షునిగా, అంబేద్కర్ ఛైర్మన్‌గా వ్యవహరించారు. డా॥ ఆర్. పి. పరంజపి, కె.ఎఫ్. నారిమన్, బి.జి. ఖేర్ వంటి ప్రముఖులు కమిటీ సభ్యులుగా

వున్నారు. అంటరాని వారిలో విద్యా వ్యాప్తి, వారి ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడానికి చర్యలు చేపట్టడం, వారి సమస్యలను ప్రభుత్వానికి విన్నవించడం సభ తన లక్ష్యాలుగా పెట్టుకుంది.

సిడెన్ హామ్ కళాశాల ప్రిన్సిపల్ ఉద్యోగానికి ఈ సమయంలో ఖాళీ ఏర్పడింది. ఆనాటి విద్యా మంత్రి డా॥ ఆర్.పి.పరంజపి అంబేద్కర్ అంటే ఎనలేని అభిమానం వుండి కూడా ఆ ఉద్యోగాన్ని ఆయనకు ఇవ్వలేకపోయారు. ఎల్ఫిన్ స్టోన్ కాలేజీ వారు ఇచ్చిన ప్రొఫెసర్ ఉద్యోగాన్ని , కొల్హాపూర్ సంస్థానాధీశుడు సాహు మహరాజ్ ఇచ్చిన మంత్రి పదవిని ఆయన తోసి పుచ్చారు. తన సామాజిక కార్యరంగానికి అడ్డుగా నిలిచే ఏ పనిని కూడా అంగీకరించకూడదని ఆయన దృఢ నిర్ణయం తీసుకున్నారు.

*"బహిష్కృత్ భారత్"* అనే పత్రికను ఆయన 1927 ఏప్రిల్ 3వ తేదిన ప్రారంభించారు. కొత్తగా ప్రవేశపెట్టిన సంస్కరణల దృష్ట్యా అణగారిన వర్గాల పక్షాన నిలబడేందుకు ఒక పత్రిక అవసరం వున్నదని భావించడం వల్లే ఆయన దీనికి నాంది పలికారు. జనాభా దామాషా ప్రకారం ప్రతి కులానికి చట్ట సభలలో సముచిత ప్రాతినిధ్యం కల్పించాలనే ఆశయం ఈ పత్రికకు మార్గ దర్శకత్వం నెరపింది. దేవాలయాలు, మంచినీటి వసతులు అంటరాని వారికి అందుబాటులోకి రావాలని ఈ పత్రిక డిమాండ్ చేసింది. కులం ఏదైనా, ప్రతి మనిషికి బహిరంగ స్థలాలలో సంచరించే హక్కు , పాఠశాలలు, చెరువులు, బావులకు వెళ్లే హక్కు వుండాలని డిమాండ్ చేస్తూ బొంబాయి శాసనసభలో ఎస్. కె. బోలే ప్రతిపాదించిన తీర్మానం స్ఫూర్తికి వ్యతిరేకంగా వ్యవహరించేవారిని శిక్షించవలసిందిగా ప్రభుత్వానికి ఈ పత్రిక విజ్ఞప్తి చేసింది. కొలాబా జిల్లా మహద్‌లో ఈ మేరకు ఆయన సత్యాగ్రహం చేపట్టారు. మంచి నీటి కోసం ఆంక్షలు ధిక్కరించి చెరువు వద్దకు వెళ్లవలసిందిగా అంబేద్కర్ ఈ సందర్భంగా అంటరాని వారికి ఉద్బోధ చేశారు. కాని పరిస్థితులు అనుకూలించక చివరికి ఈ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాల్సి వచ్చింది. విత్త వ్యవస్థ పై ప్రభుత్వం నియమించిన హిల్టన్ – యంగ్ కమిషన్ ముందు1926లో ఆయన తన అభిప్రాయాలు చెప్పారు. బొంబాయి శాసన మండలికి 1927లో డా॥ సోలంకితో పాటు ఆయన నియమితులయ్యారు.

నిమ్న జాతులకు ఉన్నత విద్యను అందుబాటులోకి తేవాలని ఆయన నిశ్చయించుకున్నారు. కింది తరగతులకు చెందిన వారిని ఉన్నత తరగతుల స్థాయికి తీసుకువెళ్లడాన్ని ఆయన సమానత్వంగా భావించారు. అధ్యాపక వృత్తిని బ్రాహ్మణులకొక్కరికే ఇవ్వడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. వంశ పారంపర్యంగా సంక్రమించే పదవులు, ఉద్యోగాలను రద్దు చేయవలసిందిగా కోరుతూ 1928లో శాసనమండలి సభ్యునిగా ఆయన అందుకు సంబంధించిన 1874 నాటి చట్టానికి సవరణ సూచించారు. కాని ఆయన చేసిన ప్రతిపాదన వీగిపోయింది.

బొంబాయి ప్రభుత్వ న్యాయ కళాశాల ప్రొఫెసర్‌గా 1928లో ఆయన బాధ్యతలు చేపట్టారు. కేవలం తెల్లవారితో కూడిన సైమన్ కమిషన్‌ను దేశ వ్యాప్తంగా బహిష్కరించిన తరుణంలో ఆయన తన వాదాన్ని కమిషన్ ముందు వినిపించారు. కళాశాల విద్యార్థులు సైమన్ రాకను వ్యతిరేకిస్తూ నిరసన ప్రదర్శనలు ఒక వైపు నిర్వహిస్తూంటే బొంబాయి ప్రెసిడెన్సీ కమిటీ సభ్యునిగా కమిషన్ ముందు హాజరై అంటరాని వారికి ప్రత్యేక ఎలెక్టొరేట్‌లను ఏర్పరచవలసిందిగా డిమాండ్ చేశారు. సైమన్ కమిషన్ సిఫార్సుల మేరకు 1930 నవంబర్‌లో రౌండ్ టేబుల్ సమావేశాన్ని లండన్‌లో నిర్వహించాలనిప్రభుత్వం తలపెట్టింది. అన్ని రాజకీయ పార్టీల నాయకులను ఈ సమావేశానికి ఆహ్వానించారు. అంటరాని వారి ప్రతినిధిగా పాల్గొనవలసిందిగా అంబేద్కర్‌కు పిలుపు వచ్చింది. భారత జాతీయ కాంగ్రెస్ ఈ సమావేశాన్ని బహిష్కరించింది. జాతి యావత్తు ఈ సమావేశాన్ని వ్యతిరేకించడం వల్ల కాంగ్రెస్ ఈ నిర్ణయం తీసుకుంది.

శాసనోల్లంఘనోద్యమం, ఉప్పు సత్యాగ్రహం 1930 – 31 సం॥లో పతాక స్థాయికి చేరుకున్నాయి. గాంధీ – ఇర్విన్‌ల మధ్య 1931 మే నెలలో కుదిరిన ఒడంబడిక మేరకు 1931 డిసెంబర్‌లో లండన్ నగరంలో జరిగే రెండవ రౌండ్ టేబుల్ సమావేశానికి కాంగ్రెస్ హాజరైంది. కాంగ్రెస్ ప్రతినిధులుగా గాంధీజీ, మదన్ మోహన్ మాలవ్య, సరోజిని నాయుడులను ఎంపిక చేశారు. హిందు, ముస్లింల మధ్య తలెత్తిన మత పరమైన సమస్యను చర్చించడం ఈ సదస్సు ముఖ్యోద్దేశం. అంటరానివారికి ప్రత్యేక ఎలక్టొరేట్‌లను ఏర్పరిచే అంశం కూడా సమావేశం ఎజెండాలో వుంది.

అంటరానివారి నాయకునిగా తనను తాను గాంధీజీ భావించుకునేవారు. ఇది అంబేద్కర్‌కు గిట్టేదికాదు. అంటరాని వారి ప్రతినిధిగా లండన్ సమావేశానికి ఎవరు వెళ్లాలనే విషయమై ఏకాభిప్రాయం కుదరలేదు. సమస్యను చూసే దృక్పథానికి సంబంధించిన విభేదాలకు పరిష్కారం లభించలేదు. దీనితో అంటరాని వారి అంశంపై ఏ నిర్ణయం తీసుకోకుండానే రెండో సమావేశం ముగిసింది.

దేశానికి తిరిగి వచ్చిన తరువాత గాంధీజీ నాయకునిగా తీవ్ర సంక్షోభాన్ని చవి చూశారు. మూకుమ్మడి అరెస్టులు, నిర్బంధం సర్వసాధారణమైపోయాయి. గాంధీజీ కూడా అరెస్టయ్యారు. 1932 ఆగస్టులో రామ్సే మెక్‌డొనాల్డ్ అంటరాని వారికి ప్రత్యేక ఎలెక్టొరేట్ సదుపాయం కలిపిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ప్రకటించారు. హిందూ సమాజం దీనివలన చీలిపోతుందని చెప్పి ఆమరణ నిరాహార దీక్షకు గాంధీజీ పూనుకున్నారు. ప్రత్యేక ఎలెక్టొరేట్‌ల విషయమై కాంగ్రెస్‌తో రాజీ కుదుర్చుకోవడానికి సిద్ధంగా లేకపోయినా తేజ్ బహదూర్ సప్రూ, జయకర్, మాలవ్య తదితరులు నచ్చజెప్పిన మీదట సీట్ల రిజర్వేషన్‌తో కూడిన ఉమ్మడి

ఎలెక్టొరేట్ విధానానికి ఆయన ఆమోదం తెలిపారు. ఈ మేరకు గాంధీ, అంబేద్కర్ కలిసి 1932 సెప్టెంబర్ 24న పూనా ప్యాక్ట్‌గా తరువాతి కాలంలో ప్రసిద్ధి చెందిన ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ఫలితంగా మెక్‌డొనాల్డ్ ప్రకటించిన కమ్యూనల్ అవార్డ్ రద్దు అయిపోయి ఉమ్మడి ఎలెక్టొరేట్ ద్వారా అంటరాని వారికి చట్ట సభలలో ప్రాతినిధ్యం వహించే విధానం ముందుకు వచ్చింది. రాజ్యాంగ సంస్కరణల కోసం నియమించిన ఉమ్మడి శాసనసభ కమిటీ సభ్యునిగా అంబేద్కర్ 1932 - 34 మధ్య కాలంలో వ్యవహరించారు. 1932 - 33 లో జరిగిన మూడవ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న ప్రతినిధి వర్గంలో కూడా ఆయన సభ్యునిగా వున్నారు.

బొంబాయి ప్రభుత్వ న్యాయ కళాశాల ప్రిన్సిపల్‌గా ఆయన 1935 జూన్‌లో నియమితులయ్యారు. న్యాయ శాస్త్రంలో పెర్రీ - ప్రొఫెసర్‌గా కూడా ఇదే కాలంలో ఆయన నియుక్తులయ్యారు. నాసిక్ జిల్లా యివోలాలో 1935 అక్టోబర్ 13 న అణగారిన వర్గాల ప్రాదేశిక సదస్సు జరిగింది. ఈ సదస్సులో చేసిన అధ్యక్షోపన్యాసంలోనే హిందు మతాన్ని విడిచిపెట్టాలనుకుంటున్న తన నిర్ణయాన్ని ప్రకటించారు. "హిందూ మతంలో పుట్టనైతే పుట్టాను. కాని హిందువుగా మాత్రం మరణించను" అని ఆయన చేసిన ఏక వాక్య ప్రకటనను సభకు హాజరైన వేలాది మంది సమర్థించారు. హిందు మతాన్ని వీడిన తరువాత ఏ మతంలోకి పోబోతున్నది ఆయన అక్కడ చెప్పలేదు. లాహోర్‌కు చెందిన జాతి మత విరోధ మండలి 1935 లో తమ వార్షిక సదస్సుకు అధ్యక్షత వహించవలసిందిగా ఆయనను ఆహ్వానించింది. అంబేద్కర్ ప్రతిపాదించిన అధ్యక్షోపన్యాసంలోని అంశాలు హిందు మతంపై తీవ్రస్థాయిలో చేసిన విమర్శ నిర్వాహకులకు జీర్ణం కాలేదు. అందుకే ఈ ఉపన్యాసం ఆనాడు లోకం వెలుగు చూడలేదు. 1936 మే నెలలో జరిగిన బొంబాయి ప్రెసిడెన్సీ మహర్ సదస్సులో చేసిన ప్రసంగంలో ఆయన హిందూ మతం వదిలి పెట్టవలసిందిగా సభికులకు సలహా ఇచ్చారు.

అఖిల భారత స్థాయిలో 1935 నాటి భారత ప్రభుత్వ చట్టం మేరకు ప్రాదేశిక శాసనసభలకు ఎన్నికలు జరగనున్న దృష్ట్యా అణగారిన, అంటరాని కులాల హక్కుల సాధనకు ఇండిపెండెంట్ లేబర్ పార్టీ పేరిట ఒక రాజకీయ వేదికను నెలకొల్పారు. బొంబాయి శాసనసభకు పోటీ చేసిన 17 స్థానాలలో పదిహేనింటిని లేబర్ పార్టీ గెలుచుకుంది. బొంబాయి స్టేట్‌లోని 15 ప్రావెన్సీలలో ఎనిమిదింటిని అత్యధిక మెజార్టీతో కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. అంబేద్కర్ తన పార్టీ సభ్యులతో సభలో ప్రతిపక్షంలో చేరారు. 1937 ఆగస్టులో ఖోటి - మహర్ల భూవసతి రద్దుకు అంబేద్కర్ బిల్లును ప్రవేశపెట్టారు. అంటరాని వారి పేరును హరిజనునిగా మార్చుతూ కాంగ్రెస్ పార్టీ 1932లో బిల్లు ప్రవేశపెట్టింది. అంబేద్కర్ ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించారు. పేరు మార్చినంత మాత్రాన వారి జీవన స్థితిగతుల్లో మార్పు రాదని అంబేద్కర్ సభలో వాదించారు.

భారత గవర్నర్ జనరల్ కనుసన్నల్లో పనిచేసే కార్య నిర్వాహక మండలికి 1942 జూలైలో ఆయన కార్మిక విభాగ సభ్యునిగా నియమితులయ్యారు. జాతీయ వాదుల విమర్శలను బేఖాతరు చేస్తూ ఆయన ఈ పదవిని 1946 జూలై దాకా నాలుగేళ్ల పాటు నిర్వహించారు. ఈ కాలంలోనే కాంగ్రెస్ పార్టీ క్విట్ ఇండియా ఉద్యమాన్ని ప్రారంభించింది. ఇండియా నుంచి బ్రిటిష్ పాలకులు ఉపసంహరించుకున్న తరువాతనైనా అంటరాని వారికి రాజ్యాంగ పరమైన రక్షణలు కల్పించాలని కోరడానికి ఆయన 1946 సెప్టెంబర్‌లో ఇంగ్లండ్ బయలుదేరి వెళ్లారు. క్యాబినెట్ మిషన్ అంటరాని వారికి చేసిన చెరుపును తొలగించడానికి రక్షణలు ఒక్కటే మార్గమని ఆయన భావించారు.

రాజకీయంగా ఎంత ఒత్తిడికి లోనవుతున్నా మేధావిగా, తాత్వికునిగా అంబేద్కర్ ఎప్పుడు అప్రమత్తంగా వుండేవాడు. రాజ్యాంగ సభకు ఎన్నికలు చేరువైన తరుణంలో ఆయన శూద్రులంటే ఎవరు? పుస్తకాన్ని ప్రచురించారు. భారతార్య సమాజంలోని వర్ణ వ్యవస్థలో నాలుగవ వర్ణంగా శూద్రులకు స్థానం ఎట్లా దక్కిందనే అంశాన్ని ఈ పుస్తకంలో ఆయన పరిశీలన చేశారు. రాజ్యాంగ సభకు 1946 నవంబర్‌లో బెంగాల్ నుంచి ఎన్నికయ్యారు. తదుపరి నెల జరిగిన రాజ్యాంగ సభ తొలి సమావేశంలో సమైక్య భారతదేశ నిర్మాణానికి ఆయన పిలుపునిచ్చారు. రాజ్యాంగ సభ 1947 అగస్టులో రాజ్యాంగ రచనా కమిటీ సభ్యునిగా ఎంపిక చేసింది. రాజ్యాంగ రచనా కమిటీ సభ్యులంతా కలిసి ఆయనను దాని చైర్మన్‌గా ఎన్నుకున్నారు. రాజ్యాంగ రచనా కమిటీ చైర్మన్ హోదాలో రాజ్యాంగ సభకు భారత రాజ్యాంగ చిత్తు ప్రతిని ఆయన సమర్పించారు. భిన్న వర్గాల నుంచి వచ్చిన విమర్శలకు సమాధానాలు చెప్పారు. న్యాయపరమైన అంశాలలో ప్రావీణ్యానికి, రాజ్యాంగ సమస్యలపై లోతైన అధ్యయనానికి, అపారమైన జ్ఞాన సంపదకు  అబ్బురపడిన కమిటీ సభ్యులు ఆయనను భారత రాజ్యాంగ రూపకర్తగా అభివర్ణించారు. స్వతంత్ర భారత దేశపు తొలి కేంద్ర మంత్రి వర్గంలో న్యాయశాఖ మంత్రిగా అంబేద్కర్‌ను ఎంపిక చేశారు. 1951 సెప్టెంబర్‌లో అంటే సరిగ్గా నాలుగేళ్లకు ఆయన తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఎస్సీల పట్ల ప్రభుత్వం కనబరుస్తున్న అలక్ష్య వైఖరికి నిరసనగా తాను రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. కాశ్మీరు సమస్యపై భారత విదేశాంగ విధానంపై హిందు స్మృతి బిల్లుపై క్యాబినెట్‌తో తనకు గల విభేదాలను ఈ సందర్భంగా వెల్లడించారు. 1952లో ఆయన రాష్ట్రాల మండలికి ఎన్నికయ్యారు.

కొలంబియా విశ్వవిద్యాలయం ప్రత్యేక ఉత్సవంలో 1952 జూన్ 5వ తేది ఆయనకు ఐ.ఎల్.డి. గౌరవ పట్టాను  ప్రధానం చేసింది. భారత రాజ్యాంగ రచనకు సంబంధించి చేసిన కృషికి గుర్తింపుగా ఈ డిగ్రీ ప్రధానం చేస్తున్నట్లు విశ్వవిద్యాలయం పురస్కార పత్రంలో పేర్కొంది. భారత దేశపు గొప్ప సంఘ సంస్కర్తగా, మానవ హక్కుల పరిరక్షకునిగా, ప్రముఖ సామాజికునిగా విశ్వవిద్యాలయం ఆయనను ఈ సందర్భంగా కీర్తించింది. అంబేద్కర్‌తో పాటు గౌరవ డిగ్రీ పొందిన వారిలో కెనడా విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి లెస్టర్ బి.పియర్ సన్, ప్రముఖ

ఫ్రెంచ్ సాహిత్యకారుడు దానియే మోర్నేతోపాటు ఎనిమిది మంది అమెరికన్ పౌరులున్నారు. 35 ఏళ్ల క్రితం పిహెచ్.డి. డిగ్రీ ప్రధానం చేసిన విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్‌కు సమానమైన గౌరవ పట్టాను అంబేద్కర్ పొందడం కాల వైచిత్రం అని చెప్పాలి. 1955 అగస్టులో అంబేద్కర్ ముంబాయి రాజ్య కనిష్ట గాయ్ కామ్ గార్ అసోసియేషన్ స్థాపించారు. అదే ఎడాది డిసెంబర్‌లో భాషా ప్రయుక్త రాష్ట్రాలపై ఆలోచనలు పేరిట పుస్తకాన్ని ప్రచురించారు.

వివిధ సదస్సులలో పాల్గొన్న క్రమంలో బౌద్ధం దిశగా అంబేద్కర్‌లో వస్తున్న సానుకూల వైఖరి ప్రస్ఫుటమవుతూ వచ్చింది. నేపాల్ రాజధాని ఖాట్మండ్‌లో 1969లో జరిగిన ప్రపంచ బౌద్ధమత సదస్సులో ఆయన మార్క్సిజానికి బౌద్ధానికి మధ్య గల సామ్యం, భేదాలపై పత్రం సమర్పించారు. ఈ ప్రసంగ పాఠమే మార్క్సిజం వర్సెస్ బుద్ధిజం పేరిట పుస్తకంగా వెలువడింది. 1950 డిసెంబర్‌లో ఆయన మరోసారి ప్రపంచ స్థాయి బౌద్ధ మత సదస్సులో పాల్గొన్నారు. 1951 జూలై భారతీయ బౌద్ధ జన సంఘాన్ని ఏర్పాటు చేశారు. బౌద్ధ ఉపాసన పథం పేరిట అదే ఏడాది సెప్టెంబర్‌లో బౌద్ధ మత ప్రార్థనా గ్రంథాన్ని సంకలనం చేశారు. రంగూన్‌లో 1954లో జరిగిన ప్రపంచ బౌద్ధ మత సదస్సుకు ఆయన ప్రతినిధిగా ఎన్నికయ్యారు. 1955 మే నెలలో భారతీయ బౌద్ధ మహాసభ స్థాపించారు. నాగపూర్‌లో అదే ఏడాది అక్టోబర్ 14వ తేదిన నిర్వహించిన చారిత్రిక ఉత్సవంలో ఆయన బౌద్ధ మతాన్ని స్వీకరించారు. అదే ఏడాది నవంబర్‌లో ఖాట్మండ్‌లో జరిగిన ప్రపంచ బౌద్ధ సదస్సుకు ఆయన ప్రతినిధిగా హాజరయ్యారు. అక్కడ ఆయనను నవబుద్ధునిగా కొనియాడారు. 1956 డిసెంబర్ 6వ తేదిన అంబేద్కర్ తుదిశ్వాస విడిచారు. లక్షలాది మంది ఆయన మరణాన్ని సంస్మరించుకున్నారు. ఎవరికి వారు వ్యక్తిగతంగా తమ పెన్నిధిని కోల్పోయినట్లు దుఃఖించారు.

అధ్యాయం 3

# హిందూ సామాజిక వ్యవస్థ సమస్యలు, సవాళ్ళు

## సెక్షన్-1

### శూద్రుల పుట్టుపూర్వోత్తరాలు

చాతుర్ వర్ణ వ్యవస్థలో అసమానతలు అంతరాల దొంతరల సూత్రం ప్రాతిపదికగా నిర్ణయించబడ్డాయి. ఇండో ఆర్యన్ సమాజంలో నాలుగు వర్ణాలు నాగరికత తొలి రోజుల నుంచి ఉనికిలో వున్నాయని, వేదాలు స్థల కాలాలకు అతీతమైనవని, అతి పవిత్రమైనవని గట్టిగా విశ్వసించిన వారు నిన్న మొన్నటి దాకా వున్నారు. ఆర్య సమాజ్‌కు చెందిన వారు అటువంటివారే. వేదాలలో కొన్ని భాగాలు బ్రాహ్మణులు సృష్టించినవేనని, ముఖ్యంగా ఆర్య, సమాజ్ వారికి ఊపిరులూదే పురుష సూక్తాన్ని స్వీయ ప్రయోజనాలను ఆశించి బ్రాహ్మణులే వేదాలలో చొప్పించారని అంబేద్కర్ వాఖ్యానించారు. వేదాలు అపౌరుషేయాలని, అవి ఆది మధ్యంతరహితాలని, లోప రహితమైనవని బోధించడం ద్వారా ఆర్య సమాజ్ హిందూ సమాజాన్ని దగా చేసిందని, ఆ సమాజాన్ని నిలువ నీటి చందంగా మార్చి స్థబ్దతకు లోను చేసిందని ఆయన అభిప్రాయపడ్డారు.

పురుష సూక్తం చాతుర్ వర్ణ వ్యవస్థను పవిత్రమైన వ్యవస్థగా, దైవదత్తమైనదిగా మార్చింది. కాల పురుషుని నోటి నుంచి బ్రాహ్మణులు, భుజాల నుంచి క్షత్రియులు, తొడల నుంచి వైశ్యులు, పాదాల నుంచి శూద్రులు పుట్టుకొచ్చారని పురుష సూక్తం తీర్మానించింది. విశ్వం పుట్టుకకు సంబంధించిన సిద్ధాంతంగా దీన్ని చెప్పవచ్చు. ఈజిప్టు నాగరికత విశ్వ సృష్టిపై చేసిన ఊహలు పురుష సూక్తానికి దగ్గరగా వున్నాయి. అయితే పురుష సూక్తంలోని 11, 12వ శ్లోకాలు కేవలం విశ్వసృష్టికి సంబంధించినవి కావు. సమాజ నిర్మాణానికి సంబంధించి నిర్దిష్టమైన విధానాన్ని దైవాజ్ఞ రూపంలో ఆదేశించడం వీటిలో కనిపిస్తుంది. పురుష సూక్తం సూచించిన సమాజ నిర్మాణమే చాతుర్ వర్ణ వ్యవస్థ అని అంటారు అంబేద్కర్. ఈ పురుష సూక్తం బోధించిన సామాజిక వ్యవస్థను ఒక్క బుద్ధుడు తప్ప వేరేపరూ ప్రశ్నించలేదని ఆయన పేర్కొన్నారు. పురుష సూక్తం అందరి ఆదర్శం కావాలని దైవం నిశ్చయించిందని,

ధర్మానికి వేదమే అంతిమ ప్రమాణమని మనువు కొత్తగా వాఖ్యానించాడు అంతకు మునుపు లేని దైవత్వాన్ని , ప్రమాణీకతను, చాతుర్ వర్ణ్యానికి మనువు అపాదించాడని అంబేద్కర్ అనేవారు.

అంబేద్కర్ పురుష సూక్తాన్ని కింది విధంగా విశ్లేషించారు.

> "1. ఏదైతే వున్నదో దానిని ఆదర్శం స్థాయికి తీసుకొనిపోవడం. 2. ఏ ఒక్క కులానికీ,జాతికీ వాస్తవ రూపంలో, చట్ట, పరంగా వర్గ హోదాను ఇవ్వకపోగా ఆదర్శ సమాజ భావనను నామ మాత్రంగా అంగీకరించారు 3. ఆదర్శానికి ఎటువంటి కులం లేదు. దీనిని ఏ సమాజం ఆమోదించలేదు. వర్గాన్ని ఆయా కాలాలలో స్వభావికమైనదిగా మాత్రమే భావించారు పురుష సూక్తం ఒక అడుగు ముందుకు వేసి వర్గ మేళవింపు సహజం, ఆదర్శం అనడంతో ఆగకుండా పవిత్రంగా, దివ్యమైనదిగా భావించింది. 4. చరిత్రలో ఏ ఒక్క సమాజం కూడా కులాలు - వర్గాలు - వృత్తులు ఎన్ని వుండాలనే విషయంపై మూఢంగా వ్యవహరించలేదు. పురుష సూక్తం మాత్రం సమాజాన్ని నాలుగు భిన్న వర్గాలుగా విభజించి తన మూఢత్వాన్ని చాటుకుంది 5. భిన్న కులాలు - వర్గాలు పాటించవలసిన విధి విధానాలను సర్వ కాలాలకు అతీతంగా పురుష సూక్తం శాశ్వత ప్రాతిపదికపై నిశ్చయించింది అది ప్రతిపాదించిన విధి విధానం నిచ్చెనమెట్ల సూత్రంపై ఆధారపడి నాలుగు వర్ణాల మధ్య అసమానతలను సృష్టించింది."

ఇన్ని ప్రత్యేకతలను కలిగి వున్న పురుష సూక్తం ఒకవేళ వర్గ రహిత సమాజాన్ని ఆదర్శ సమాజంగా బోధించి వుంటే దానికి విశిష్ట స్థానం దక్కేదని అంబేద్కర్ వాఖ్యానించారు. భిన్న వర్గాలతో కూడిన సమాజాన్ని ఆదర్శ సమాజంగా పురుష సూక్తం ప్రతిపాదించడాన్ని ఆయన నిరసించారు. శ్రమ విభజన భావనను శ్రామికుల మధ్య విభజనగా మలచడం ద్వారా వృత్తులకు శాశ్వత్వాన్ని, స్థిరమైన రూపాన్ని పురుష సూక్తం అపాదించిందని ఆయన అంటారు. పురుష సూక్తం వర్ణ వ్యవస్థను సుస్థిరం చేయడానికి చేసిన ప్రయత్నంలో రాజీకి ఎత్తుగడలు మాత్రమే కనిపిస్తాయని, ప్రపంచంలో మరే ఇతర మతంలో ఇంతటి మాయాజాలం కానరాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఆచరణకు తగని ఆదర్శానికి వాస్తవ రూపం ఇవ్వడానికి ప్రయత్నించడం నేరాలలోకెల్లా నేరం అంటారాయన. ఉద్దేశంలో ఇది నేరం. ఫలితాలలో సంఘ వ్యతిరేకం. ఎందుకంటే అది ఒక వర్గం మరో వర్గాన్ని అన్యాయంగా దోచుకొని పీడించే సంఘరీతిని సుస్థిరం చేయాలని చూసింది. నాలుగు వర్ణాలను శరీరంలోని నాలుగు అవయవాలకు అంటగట్టే ప్రక్రియ ప్రమాదవశాత్తు జరిగింది కాదని, పథకం ప్రకారమే అలా చేశారని ఆయన తేల్చి చెప్పారు. శరీరావయం వర్ణం అంతస్తును నిర్ణయిస్తే, అంతస్తు ఆ వర్ణం విధులను నిర్ణయించిందని, అందుకే బ్రాహ్మణులకు విద్యా విజ్ఞానాల పరిరక్షణను, క్షత్రియులకు యుద్ధ విద్యను, వైశ్యులకు వాణిజ్యం, పరిశ్రమలను, శూద్రులకు అమానవీయమైన,

హేయమైన విధులను అపాదించింది. శూద్రులకు, ఆపై మూడు వర్ణాలకు వుండే హక్కులు లేకుండా చేశారు.

అంబేద్కర్ శూద్రుల హోదాను కింది విధంగా సంక్షిప్తీకరించారు.

1. సమాజ చట్టంలో శూద్రుడిదే చివరాఖరి స్థానం. 2. శూద్రుడు అపవిత్రుడు. కాబట్టి పవిత్రమైన విధులను వాహ చూసేలా, వినేలా ఆచరించకూడదు. 3. మొదటి మూడు వర్ణాలను గౌరవించిన విధంగా శూద్రులను గౌరవించరాదు. 4. శూద్రుడి బ్రతుకుకు ఎటువంటి విలువ లేదు. అతనిని ఎవరైనా చంపవచ్చు. చంపినప్పటికీ పరిహారం చెల్లించనవసరం లేదు. చెల్లించినా అతి కొద్దిగా మాత్రమే చెల్లిస్తే చాలు. పై మూడు వర్ణాలకు చెల్లించే దాని కన్న ఇది చాలా తక్కువ. 5. శూద్రుడు జ్ఞాన సంపార్జన చేయకూడదు. అతనికి విద్యా బుద్ధులు చెప్పడం నేరమే కాదు మహా పాపం కూడా. 6. శూద్రుడు సంపద పోగు చేయరాదు. అంతే కాదు ఆ సంపదను బ్రాహ్మణుడు తనకు ఇష్టం వచ్చినప్పుడు తీసుకుపోవచ్చు. 7. శూద్రుడు ప్రభుత్వ ఉద్యోగం చేయరాదు. 8. శూద్రుడు ఉన్నత కులాలను సేవించుకోవాలి. అది అతని కర్తవ్యం. అతని మోక్ష మార్గం కూడా అదే. 9. ఉన్నత కులాలకు చెందిన వారు శూద్రులను పెళ్లి చేసుకోరాదు. పై మూడు వర్ణాలకు చెందిన పురుషులు మాత్రం శూద్ర స్త్రీని ఉంపుడు కత్తెగా పెట్టుకోవచ్చు. అదే ఒక వేళ శూద్ర పురుషుడు ఉన్నత కులాలకు చెందిన స్త్రీని తాకినా కూడా అతనికి అత్యంత కఠినమైన శిక్షలకు అర్హుడు. 10. శూద్రుడు దాస్యంలో జన్మించాడు. కనుక అతనిని ఎప్పటకీ దాస్యంలోనే వుంచాలి.

శూద్రులతో పోల్చి చూస్తే క్షత్రియులకు, వైశ్యులకు కూడా పెద్దగా హక్కులేమి లేవు. ప్రత్యేకమైన హక్కులు, విశేష సదుపాయాలు, అధికారాలు కలిగి వున్న త్రై వర్ణికుడు ఒక బ్రాహ్మణుడు మాత్రమే. శూద్రునికి ఆస్తి హక్కు లేకుండా చేశారంటే అందుకు కారణం అది బ్రాహ్మణుడిని నొప్పిస్తుంది. శూద్రుడు రాజుగా వున్న దేశంలో బ్రాహ్మణుడు నివసించరాదు. శూద్రునికి, బ్రాహ్మణునికి మధ్య వున్న ఈ అగాధాలను చూసి వీరిద్దరికి మధ్య ఆగర్భవైరమేదో వుండి వుంటుందని అంబేద్కర్ వాఖ్యానించారు. శూద్రుడుని ప్రత్యేకించి తన శత్రువుగా బ్రాహ్మణుడు భావించడం వల్లే అంబేద్కర్ ఇలా అనాల్సివచ్చింది.

రోమన్‌లు ఇతర ప్రజా శ్రేణుల పట్ల అవలంభించిన వైఖరిని బ్రాహ్మణులు మిగిలిన వర్ణాల పట్ల అవలంభించిన వైఖరికి మధ్య గల తేడాలను ఆయన ఈ సందర్భంగా చర్చించారు. స్వేచ్ఛ, పౌరసత్వం, కుటుంబ జీవనం వున్నప్పుడే పౌరుడి హోదా వున్నట్లు రోమన్లు భావించేవారు. హక్కులు, లోపాలు అందరికి సమస్థాయిలో వుండేవి. వాటి ప్రాతిపదిక ఒకటిగా వుండేది. రెండు వేరు వేరు సమూహాల మధ్య ఈ విషయంలో తేడాలుండేవి కావు. అదే బ్రాహ్మణవాద చట్టం ప్రకారమైతే హక్కులు, లోపాలు అందరికి ఒకే విధంగా వుండవు. అందరికీ వర్తించే అంశాలు సాధారణ స్థాయిలో సార్వజనీనంగా వుండవు. మొదటి మూడు

వర్ణాలకు హక్కులు, అధికారాలుంటాయి. నాలుగో వర్ణమైన శూద్రులకు లోపాలు, వైఫల్యాలను హిందు సమాజం అపాదించింది. బ్రాహ్మణీయ విలువల చట్టానికి ఇదే ప్రాతిపదిక. కాని రోమ్ దేశంలో పరిస్థితి ఇందుకు భిన్నంగా వుంది. అక్కడ కూలీనులకు, బానిసలకు మధ్య సమానత్వం ప్రాతిపదికగా పూర్తి స్థాయి ఐక్యత వుండేది. బలహీన శ్రేణులకు చెందిన కష్ట జీవులు అక్కడ బానిసలుగా చూడబడలేదు ఉన్నత వర్గాలకు బలహీన వర్గాలకు అసమానతలను రద్దు చేసి సమాన పాయ రోమన్ చట్టం కల్పించినట్లు త్రైవర్ణికులకు, శూద్రులకు మధ్య హెచ్చు తగ్గులను బ్రాహ్మణీయ హిందూత్వం ఎందుకు రద్దు చేయలేకపోయిందని అంబేద్కర్ ప్రశ్నించారు. పౌర రాజకీయ హక్కులకు సంబంధించి సమానత్వాన్ని రోమన్ చట్టం గుర్తించకపోయినా నేర స్మృతికి సంబంధించి మాత్రం అందరిని సమానంగా చూసింది. రోమ్‌లో చేసిన నేరాన్ని బట్టి శిక్ష అమలు కాగా నేరం ఎవరు చేశారన్నది బట్టి ఇండియాలో శిక్షలు అమలయ్యాయి. దీనికి కారణం హిందూ సమాజంలో భిన్న కులాలకు మధ్య హెచ్చుతగ్గులు వున్నట్లుగా రోమ్‌లో లేవు. వేద సాహిత్యాన్ని సృష్టించింది ఆర్య జాతి వారేనని సర్వత్రా నెలకొని వున్న అభిప్రాయంతో అంబేద్కర్ విభేదించారు. వేదాలలో వుపయోగించిన ఆర్య, అనార్య శబ్దాలను జాతుల దృష్టితో వాడలేదని ఆయన వాదించారు. ఆర్య జాతి అనేది వునికిలో లేదని అది, కేవలం భాషాపరమైనదని మాక్స్ ముల్లర్ వెలిబుచ్చిన అభిప్రాయాన్ని అంబేద్కర్ ఆమోదించారు బాల గంగాధర తిలక్ ప్రకారం ఆర్కిటిక్ ప్రాంతం నుంచి ఆర్యులు మన దేశానికి వలస వచ్చారు. వలస వచ్చి దశల వారీగా ఆక్రమించుకున్నారు. ఆర్యులు అశ్వమేధయాగం నిర్వహించడాన్ని బట్టి వారు ఆర్కిటిక్ ప్రాంతానికి చెందినవారని తిలక్ అభిప్రాయం ఎందుకంటే అశ్విక జాతికి ఆర్కిటిక్ ప్రాంతం పుట్టినిల్లు. భారత్‌లోని స్థానికులైన దాస, దస్యులు ఆర్యులకు పూర్తి భిన్నమైనవారని తిలక్ చెప్పినదానిని కూడా ఆయన ఖండించారు. ఆర్యులు భారత దేశాన్ని దురాక్రమించారని చెప్పడానికి ఎటువంటి దాఖలాలు రుగ్వేదంలో కానరాలేదని అంబేద్కర్ పేర్కొన్నారు. ఆర్యులు బయటి నుంచి వచ్చిన వారు కాదని చెప్పడానికి ఆయన చూపెట్టిన మరో ఆధారం వేదాలలోనే వుంది. దేశంలోని నదులను గంగా, యమునా! అని వేద రుషులు వాటి పేర్లతో సంబోధించడం ఇందుకు దృష్టాంతంగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

అనార్య తెగలకు చెందిన దాస, దస్యులను ఆర్యులు సైన్యంతో వచ్చి లోబరుచు కోలేదని కూడా ఆయన గట్టిగా విశ్వసించారు. దీనికి సంబంధించి ఆయన కొన్ని ఆధారాలను చూపెట్టారు. 1. ఆర్యులకు స్థానిక దాస జాతికి మధ్య యుద్ధాలు జరిగిన సూచన, ప్రస్తావన కాని రుగ్వేదంలో దాదాపుగా లేవు. దాస, దస్యులకు, ఆర్యులకు మధ్య చెదురు మదురుగా హింసాత్మక సంఘటనలు మాత్రమే జరిగాయి. ఆర్యులు స్థానికులను లోబరుచుకున్నారని కాని, వారిపై విజయం సాధించారని చెప్పడానికి కాని ఈ సంఘటనలు సరిపోవు. 2. రెండు జాతులు శాంతి, ఆత్మ గౌరవం ప్రాతిపదికగా పరస్పర అంగీకారం కుదుర్చుకున్నాయి. ఇద్దరి శత్రువు ఒక్కరే అయిన సందర్భాలలో దాస, ఆర్య జాతులు ఏక తాటిపై నిలిచి పోరాటం చేశాయని చెప్పడానికి రుగ్వేదంలో స్పష్టమైన ఆధారాలున్నాయి. 3 ఇరువురికి మధ్య ఘర్షణలు

ఎంత తీవ్రస్థాయిలో వున్నా వాటిని రెండు జాతుల మధ్య ఘర్షణగా చిత్రించడం కుదరదు. మత పరమైన విభేదాల మూలంగా ఈ ఘర్షణలు తలెత్తాయి. ఈ మూడు అంశాల ప్రాతిపదికపై ఆయన తన వాదాన్ని నిరూపించే ప్రయత్నం చేశారు.

ఆర్యులకు ,దాస, దస్యులకు మధ్య జాతిపరమైన భేదాలు లేవని, శరీర నిర్మాణం కూడా ఒకే విధంగా వున్నదని అందుకే దాస, దస్యులు ఆర్యులుగా మారడం వీలైందని అంబేద్కర్ అభిప్రాయపడ్డారు. ఆర్యుల నుంచి దాస, దస్యులను వేరు చేసే పని ఇంద్రునికి అప్పగించడం ఈ అంశాన్నే సూచిస్తున్నది. ఆర్యుల దురాక్రమణ కట్టుకథ మాత్రమేనని దురాక్రమణ బయటినుంచి వచ్చారని, భారతదేశాన్ని దురాక్రమించారని చెప్పడానికి ఆధారాలు లభ్యం కాలేదని దాస, దస్యులు భారతదేశపు మూలవాసులని చెప్పడం నిజం కానేకాదని ఆయన వాదించారు. ఆర్య జాతి సిద్ధాంతం కేవలం ఒక భావన మాత్రమేనని 1938లో వెలువడిన డా॥ బోప్ గ్రంథం కంపారటివ్ గ్రామర్ ప్రతిపాదించిన భాషా సూత్రం ఆధారంగా ఈ భావన రూపుదిద్దుకున్నదని ఆయన పేర్కొన్నారు. ఆర్య జాతి సిద్ధాంతాన్ని' అసంబద్ధమైనది'గా ఆయన భావించారు. స్థానిక ఆర్యేతర జాతులను దాడులు చేసి లోబరుచుకున్నవారిగా ఆర్యులను ఈ సిద్ధాంతం ఊహించిందని కాని ఇది వాస్తవ దూరమైన ఆలోచన అని ఆయన తేల్చి చెప్పారు. వర్ణం అనే మాట రంగును సూచిస్తుందని యూరోపియన్ పండితులు చెప్పినదానిని బ్రాహ్మణ పండితులు అంగీకరించడం కూడా ఈ భావన వ్యాప్తికి తోడ్పడింది. వైదికార్యులకు వర్ణ భేదాలు లేవని ఆయన నిరూపించడానికి ప్రయత్నించారు. 'జెంద్ అవెస్థ' గ్రంథం వర్ణానికి ఇచ్చిన అర్థాన్ని తన వాదానికి మరో ఆధారంగా ఆయన సూచించారు. నిర్దిష్టమైన మత విశ్వానికి కట్టుబడి వుండేవారిని వర్ణ శబ్దం సూచిస్తుందే తప్ప రంగు, రూపం తో దానికి ఎటువంటి సంబంధం లేదని అంబేద్కర్ చెప్పారు.

అంబేద్కర్ ఆర్య జాతి సిద్ధాంతంపై చేసిన విమర్శలోని ముఖ్యాంశాలను ఇప్పుడు వివరించుకుందాం. 1. వేదాలకు ఆర్య జాతి అనేది ఒక్కటి వున్నట్లు తెలియదు. 2. భారత దేశాన్ని ఆర్య జాతి ఆక్రమించి స్థానికులైన దాస, దస్యులను ఓడించిందని చెప్పడానికి వేదాలలో ఎలాంటి ఆధారం లేదు. 3. ఆర్యులకు దాస, దస్యులకు జాతి పరమైన భేదం వున్నట్లు చెప్పడానికి కూడా ఆధారం లేదు. 4. దాస, దస్యుల రంగు ఆర్యుల రంగు వేరు వేరు అని చెప్పే వాదానికి వేదాలలో ఆధారం లేదు. ఆర్య జాతి సిద్ధాంతం వ్యర్థమైనదని చెప్పడానికి ఆయన రుగ్వేదం నుంచి మరో ఆధారాన్ని వెలికితీసారు." ఓ ఇంద్రా! నీ తొందరపాటు మన ఇరువురు విరోధులను (దాసులు, ఆర్యులు) హతమార్చింది" అన్న వాక్యం ఆర్యులు రెండు భిన్న సమూహాలుగా వుండేవారని, వారి మధ్య శత్రుత్వం కూడా వుండేదని స్పష్టం చేస్తుందని అంబేద్కర్ వ్యాఖ్యానించారు. ఆర్యుల భిన్నత్వం కేవలం భాష్యం కాదు,అది ఒక తిరుగులేని వాస్తవమన్నది ఆయన ఉద్దేశం.

వాస్తవానికి మొదట్లో రెండు వేదాలు ఉనికిలో ఉండేవి. ఒకటి రుగ్వేదం. రెండవది అధర్వణవేదం. రుగ్వేదాన్ని పవిత్రమైనదిగా, అధర్వణ వేదాన్ని నీచమైనదిగా భావించే వైఖరిని ఆయన తప్పు పట్టారు. ఈ రెండు వేదాలు రెండు భిన్న ఆర్య జాతులకు చెందినవని, కాలక్రమంలో రెండు జాతులు ఒక్కటైన పిదప మాత్రమై అధర్వణ వేదానికి రుగ్వేదం తో సమాన స్థాయి లభించిందని ఆయన అన్నారు. తన వాదానికి మద్దతుగా ఆయన తైత్రీయ సంహిత, శతపథ బ్రాహ్మణం, మహా భారతం, (వనపర్వం, ఆదిపర్వం) రామాయణం నుంచి ఆయన ఉల్లేఖనలు చూపెట్టారు.

ఆర్య, ద్రావిడ, మంగోలియన్, స్కైతియన్ జాతుల మిశ్రమమే భారతదేశ ప్రజలని సర్. హెర్బర్ట్ రిస్లె 1901 లో శిరో పరిణామం ఆధారంగా ప్రకటించారు. రిస్లె ప్రతిపాదనలను 1936లో డా|| గుహ బలపరిచారు. భారత ప్రజానీకం రెండు జాతుల మేళవంతో రూపుదిద్దుకున్నదని, వీరిలో ఒక జాతి పొడవు తల కలవారు కాగా,మరొక జాతి పొట్టి తల కలవారని ఆయన సూత్రీకరించారు. పొడవు తల కలవారు దేశం మధ్య భాగంలో వ్యాప్తిచెంది వుండగా, పొట్టి తల కలవారు భౌగోళికంగా దేశం సరిహద్దు ప్రాంతంలో వున్నారని గుహ తేల్చి చెప్పారు. ఆల్పిన్, మెడిటెరేనియన్ జాతులతో పోలిక తెచ్చి పొడవు తల కలవారిని మెడిటెరేనియన్లుగా (మధ్యధరా సముద్ర తీర ప్రాంతపు ప్రజలు), పొట్టి తల కలవారిని ఆల్పిన్లుగా (ఆల్ప్స్ పర్వత శ్రేణులు ఎల్లలుగా కల దేశాల ప్రజలు) ఆయన అభివర్ణించారు.

భారతదేశంలో రెండు భిన్నమైన ఆర్య జాతులు ఉనికిలో వుండేవని చెప్పడానికి ఆంత్రోపోమెట్రీ (మానవ పరిణామాన్ని పరిమాణం / కొలత ఆధారంగా నిర్వచించే శాస్త్రం) లో, చరిత్రలో ఖచ్చితమైన ఆధారాలున్నాయని అంబేద్కర్ చెప్పారు. పాశ్చాత్యులు ఒకే ఆర్య జాతి వున్నట్లు చెబుతుండగా, రుగ్వేదం మాత్రం రెండు ఆర్య జాతులు వున్నట్లు చెబుతోంది. దాస, దస్యులు జాతి పరంగా ఆర్యులకు భిన్నమైన వారని, ఘర్షణలు,యుద్ధాలలో దాస్య, దస్యులపై ఆర్యులు విజయం పొందడంపై మాత్రమే దృష్టి పెట్టకుండా, ఒక ఆర్య జాతిపై వేరొక ఆర్య జాతి విజయం సాధించడంపై కూడా మన దృష్టిని కేంద్రీకరించాలని అంబేద్కర్ అభిప్రాయపడ్డారు. దాసులకు శూద్రులకు మధ్య గల సంబంధంపై కూడా అంబేద్కర్ తనదైన ఆలోచన చేశారు. " దాస, దస్యులు బర్బరులు, అడవి మనుషులైనా అయి వుంటారు. లేదంటే వేద కాలానికి చెందని ఆర్య తెగకు చెందిన వారైనా అయివుంటారు. యుద్ధంలో ఎవరైతే పట్టుబడ్డారో వారిని బానిసలుగా మార్చి అనంతర కాలంలో శూద్ర కులం పరిధిలోకి వారిని తెచ్చి వుండవచ్చు."

దాస, దస్యులకు సంబంధించి అంబేద్కర్ రెండు ప్రతిపాదనలు చేశారు. మొదటిది దాస, దస్యులు ఒకే జాతికి చెందినవారన్నది. రెండవది దాస, దస్యులు, శూద్రులు అంతా ఒకే జాతికి చెందిన వారన్నది. దాసులు, దస్యులు ఒకే జాతికి చెందినవారనే ప్రతిపాదన ప్రమాణీకమైనది కాదని అంబేద్కర్ అన్నారు. రుగ్వేదంలో దాసుల గురించి, దస్యుల గురించి వేరు వేరు సందర్భాలలో ప్రస్తావన వుండగా, మొత్తంగా దాసుల గురించి 78 సార్లు, దస్యుల

గురించి 78 సార్లు వున్నది. వారు ఇద్దరు రెండు వేరు వేరు జాతులకు చెందిన వారు కావడం వల్లే వేరు వేరు ప్రస్తావనలున్నాయని అంబేద్కర్ అంటారు. శూద్రులు దాస, దస్యులు ఒకటేననే మాట నిలిచేది కాదని కూడా ఆయన వాదించారు. పదాలకు తప్పుడు ఉత్పత్తి అర్థాలను ఆపాదించడంలో బ్రాహ్మణ రచయితలను మించినవారు మరొకరు లేరని ఆయన ఈ సందర్భంగా వాఖ్యానించారు. శూద్ర అనే మాట ఒక తెగకు,లేదా ఒక వర్గానికి గల సాధారణ నామం అని, బ్రాహ్మణ రచయితలు చెప్పినట్లు ఉత్పన్న శబ్దం కాదని అంబేద్కర్ చెప్పారు.

పతంజలి మహా భాష్యంలో శూద్రుల గురించిన ప్రస్తావన వున్నది. పతంజలి శూద్రులను అభిరాలతో అనుబంధం గలవారిగా చిత్రించారు. మహాభారతం సభాపర్వంలోని 32వ ఆధ్యాయంలో శూద్రుల రాజ్యం ప్రస్తావన వుంది. విష్ణు పురాణం, మార్కండేయ పురాణాలలో దేశంలోని అనేక తెగలలో శూద్రులది ఒక ప్రత్యేకమైన తెగగా చెప్పడం కనిపిస్తుంది. వింధ్య పర్వతాలకు ఎగువన పశ్చిమ భారతం వారి ఆవాసంగా ఈ రెండు పురాణాలు చెప్పాయి.

దాస, దస్య శబ్దాలను అనార్య తెగలని సూచించడానికి జాతుల అర్థంలో వుపయోగించారా ? లేక భారతదేశపు స్థానిక తెగలని చెప్పడానికి వుపయోగించారా? అన్నది తెలుసుకునేందుకు అంబేద్కర్ తన వంతు ప్రయత్నం చేశారు. దస్యులను అనార్య తెగగా చెప్పకపోవడం మహాభారతం శాంతి పర్వంలో స్పష్టంగా కనిపిస్తుంది. తమ శత్రువులకు ఇండో ఆర్యన్లు దస్యులనే పేరు పెట్టారని, ఒక వేళ ఇదే నిజమైతే దస్యులను భారత దేశపు మూలవాసులుగా పరిగణించడం సాధ్యం కుదరదని అంబేద్కర్ అంటారు. ఆయన దృష్టిలో" దాస, దస్యులు ఆదిమ జాతులకు చెందిన వారు కాదు. ఆర్యులతో సమానంగా వారికి ప్రత్యేక నాగరికత ఉంది. ఆర్యుల కన్నా బలవంతులు కూడా. దాస, దస్యులు ఒక్కటి కారు. అది కేవలం నిరాధారమైన ఊహ మాత్రమే. అనంతర వేద సాహిత్యంలో దాస, దస్యుల ప్రస్తావన మచ్చుకు కూడా కనిపించదు. వైదికార్యులు వీరిని పూర్తిగా తమలో విలీనం చేసుకున్నారని చెప్పడానికి ఇది ఒక దాఖలా. పూర్వ వేద సాహిత్యం శూద్రుల గురించి మౌనం పాటించింది. కాని అనంతర వేద సాహిత్యంలో శూద్రుల ప్రస్తావన కొల్లలుగా వుంది". దాస, దస్యులు, శూద్రులు ఒకటి కాదని అంబేద్కర్ తీర్పు విశ్లేషించారు.

శూద్రులకు వేదాలు పఠించే హక్కు లేదని ధర్మ సూత్రాలు నిర్దేశించాయి. అయితే ఇందుకు భిన్నంగా ప్రాచీన రుషి బదరి వేద కర్మ కాండ శూద్రులు చేయవచ్చునని చెప్పినట్లు జైమిని వాఖ్యానించారు. శూద్రులకు సోమ పానం చేసే హక్కు కూడా లేదు. కాని అశ్వినీ దేవతల గాథలో శూద్రులకు దేవతలు సేవించే సోమ పానం చేసే హక్కు వున్నట్లు నిర్దిష్టమైన ఆధారాలున్నాయి.

మనుస్మృతి శూద్రులను అనార్యులుగా పేర్కొంది. కాని కౌటిల్యుడు తన అర్థ శాస్త్రంలో శూద్రులను ఆర్యులుగా గుర్తించాడు. శూద్రులు ఆర్యులు కాదని చెప్పడానికి ఎటువంటి అధారాలు లేవని బల్లగుద్ది వాదించాడు. యుధిష్టరుని పట్టాభిషేకానికి శూద్రులను కూడా ఆహ్వానించారు.

ప్రాచీన కాలంలోని జనపదం, పురం అనే రెండు రాజకీయ శాసనసభల్లో శూద్రులకు సభ్యత్వం వుండేది. ఈ రెండు సభల సభ్యులుగా బ్రాహ్మణుల నుంచి వారికి ప్రత్యేక గౌరవం దక్కేది. శూద్రుడు రాజుగా వున్న దేశంలో బ్రాహ్మణుడు నివసించరాదని మనువు ఆదేశించాడు శూద్రులు రాజులుగా వున్నారనే చారిత్రిక సత్యాన్ని మనువు జారీ చేసిన ఈ ఆదేశం నిరూపిస్తుంది. మహాభారతంలో శాంతిపర్వంలో శూద్రులు మంత్రులుగా వుండటం చూస్తాం సంఖ్యా పరంగా మంత్రి పదవిలో బ్రాహ్మణులు ఎంత మంది వుండేవారో శూద్రులు కూడా అంతే సంఖ్యలో వుండేవారు. శూద్రులు వర్గంగా సంపన్నులు కూడా

శూద్రులపై అంబేద్కర్ పరిశీలనను మూడు మాటలలో సంక్షిప్తంగా చెప్పవచ్చు. 1. శూద్రులు ఆర్యులు. 2. శూద్రులు క్షత్రియ వర్గానికి చెందినవారు 3 క్షత్రియులుగా శూద్రులు కీలకమైన స్థానాలలో వున్నారు ఆర్య జాతుల రాజ్యాలకు శూద్రులు రాజులుగా వున్నారు అంబేద్కర్ ఈ సందర్భంగా ప్రొ॥ వెబర్ అభిప్రాయాన్ని ఉదహరించారు భారతదేశానికి ఇతరుల కన్నా ముందు వలస వచ్చిన ఆర్యులే శూద్రులు వారు ఆర్యులన్నది ఎంత నిజమో, క్షత్రియులన్నది అంత నిజం. ఇండో - ఆర్యన్లలో మొదట మూడు వర్ణాలే వుండేవి. రుగ్వేదం శూద్రులను ప్రత్యేక వర్ణంగా చెప్పలేదు. శూద్రులను నాలుగో వర్ణంగా ఎక్కడా పేర్కొనలేదు.

పురుష సూక్తంలో మాత్రం ఇందుకు భిన్నంగా నాలుగు వర్ణాల ప్రస్తావన వుంది. అయితే ఇది రుగ్వేద కాలానికి తరువాత ఉనికిలోకి వచ్చింది. పురుష సూక్తానికి సంబంధించి సామవేదంలో ఐదు శ్లోకాలు, రుగ్వేదంలో 16 శ్లోకాలు , వాజసనేయి సంహితలో 22 శ్లోకాలున్నాయి. రుగ్వేదంలోని పురుష సూక్తం పూర్తి పారం మనం ఒక్క అధర్వణ వేదంలో మాత్రమే చూడవచ్చు. విషయమేమిటంటే ఇది ప్రాచీనమైనది కాదు. వేదాలకు ఇది అనుబంధంగా వుంది. ప్రొ॥ మాక్స్ ముల్లర్, తదితరులు చెప్పినట్లు పురుష సూక్తం తరువాత వేదాలలో చేర్చబడిందనే అభిప్రాయాన్ని బలపరిచే సాక్ష్యాధారాలు ఇప్పుడు లభిస్తున్నాయి.

పూజారి వర్గం అబద్ధపు రాతలు రాసి వేదాలలో చొప్పించారని, పురుష సూక్తాన్ని కూడా తమకు కావలసిన విధంగా మార్చారని అంబేద్కర్ అన్నారు నాలుగో వర్ణం ఉనికిలోకి వచ్చిన చాలా కాలానికి, రుగ్వేదం చాతుర్వర్ణ వ్యవస్థను అమోదించిందని చెప్పడానికి పురుష సూక్తాన్ని మొత్తంగా కాకపోయిన 11వ, 12 వ శ్లోకాలను మార్చారన్నది సుస్పష్టమని ఆయన చెప్పారు. రుగ్వేదానికి తరువాతి కాలంలో పురుష సూక్తాన్ని జత చేశారని, ఆర్య సమాజంలో తొలినాళ్ల నుంచి నాలుగు వర్ణాలు ఉనికిలో వున్నట్లు చెప్పడానికి ఇది అధారం కాజాలదని ఆయన స్పష్టం చేశారు. వేద కాలంలో ఆర్యులు మూడు వర్ణాలుగా మాత్రమే వుండేవారని, శూద్రులు వీటిలో రెండవదైన క్షత్రియ వర్ణానికి చెందిన వారన్నది అంబేద్కర్ నిశ్చితాభిప్రాయం.

అంబేద్కర్ ఒక ప్రశ్నలేవనెత్తారు. శూద్రులు, క్షత్రియవర్గానికి చెందినవారైతే వారిని ఎందుకు హీనంగా చూస్తున్నారనేది ఆయన ప్రశ్న శూద్రులకు, బ్రాహ్మణులకు మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణలు తలెత్తిన ఫలితంగానే శూద్రులను హేయంగా చిత్రించే ధోరణి ప్రబలింది.

బ్రాహ్మణ రుషి వశిష్టునికి, శూద్ర చక్రవర్తి సుదాసునికి మధ్య హింసాపూరిత ఘర్షణ జరిగిందని చెప్పడానికి ప్రత్యక్ష అధారాలున్నాయి. వశిష్ట విశ్వామిత్రుల మధ్య శత్రుత్వం కూడా ఈ కోవకు చెందినదే. విశ్వామిత్రుడు క్షత్రియ రుషి కావడం వల్లే వశిష్టునితో ఆయనకు ఘర్షణ ఏర్పడింది. రుగ్వేదంలో అనేక శ్లోకాలను రాసింది విశ్వామిత్రుడే కావడం గమనార్హం. చివరికి బ్రాహ్మణులకు అతి ప్రధానమైన గాయత్రీ మంత్రాన్ని రాసింది కూడా విశ్వామిత్రుడే. బ్రాహ్మణులకు, క్షత్రియులకు మధ్య ఘర్షణలు మూడు అంశాలకు సంబంధించి తలెత్తాయని అంబేద్కర్ పేర్కొన్నారు. 1. కానుకలు పొందే హక్కు 2. వేదాలను బోధించే హక్కు 3. వైదిక కర్మకాండ నిర్వహించే హక్కు. శూద్రులను అవమానించడానికి బ్రాహ్మణులు ఎంచుకున్న రెండు ముఖ్యమైన పద్ధతులను అంబేద్కర్ సోదాహరణంగా వివరించారు. శూద్రులకు ఉపనయనం (జంధ్యం వేసే ఆచారం) చేయడానికి నిరాకరించడం మొదటి పద్ధతి. దీని అధారంగా ఆస్తి హక్కు లేకుండా చేయడం రెండవ పద్ధతి. ఉపనయనం నిరాకరణ అంశాన్ని ఇప్పుడు కొంత వివరంగా పరిశీలిద్దాం. ఉపనయనం శాస్త్రోక్తంగా చేయడానికి తిరస్కరించడం ద్వారా బ్రాహ్మణులు తమ ప్రతీకారాన్ని శూద్రులపై తీర్చుకున్నారు. తాము అనుకున్నది సాధించారు. పిల్లవానికి గురువు గాయత్రీ మంత్రం చెప్పడంతో సాధారణంగా ఉపనయనం తంతు ముగుస్తుంది. అంబేద్కర్ ప్రకారం జంధ్యం పోగు వేసే పండుగ గోత్రానికి సంబంధించిందే తప్ప ఉపనయనానికి దానితో ఏ సంబంధం లేదు. తొలి రోజుల్లో జంధ్యపు పోగు వేయడానికి, ఉపనయనానికి వేర్వేరు ప్రయోజనాలుండేవి. కాని తర్వాతి రోజుల్లో ఈ రెండు ఒకటిగా రూపాంతరం చెందాయి. వేద బ్రాహ్మణుడు వేదాలను బోధించడమే ఉపనయనానికి గల నిజమైన అర్థం. అంబేద్కర్ ఈ సందర్భంగా నాలుగు సందేహాలను లేవనెత్తారు. 1. ఉపనయనానికి అనర్హతే శూద్రత్వానికి కొలమానమా? 2. శూద్రులకు ఏనాడైనా ఉపనయన హక్కు వుండేదా? 3. ఉపనయనాన్ని కోల్పోయినంత మాత్రాన శూద్రులు అధమస్థాయికి ఎలా చేరుకున్నారు? 4. శూద్రులకు ఉపనయనాన్ని నిరాకరించే హక్కు బ్రాహ్మణులకు ఎక్కడి నుంచి వచ్చింది?

భారతదేశంలో క్షత్రియులకు ఉపనయనం చేసుకునే హక్కు వుందని ప్రివీ కౌన్సిల్ నిర్ధారించింది. బీహార్ హైకోర్టు కాయస్థులను శూద్రులుగా పరిగణించింది. అలహాబాద్ హైకోర్టు బీహార్ హైకోర్టు చెప్పినదానితో ఏకీభవించలేదు. బెంగాల్ హైకోర్టు కూడా కాయస్థులను శూద్రులుగానే నిర్ణయించింది. బీహార్‌కు చెందిన కాయస్థులు క్షత్రియులని పాట్నా హైకోర్టు తీర్పునిచ్చింది. మరో వైపు మద్రాస్ హైకోర్టు మరాఠాలను శూద్రులుగా గుర్తిస్తూ తీర్పు చెప్పింది. బొంబాయి సంస్థానంలోని మరాఠాలలో మూడు వర్గాలుండేవి. మొదటిదైన ఉన్నత వర్గంలో ఐదు కుటుంబాలు, రెండవ వర్గంలో 96 కుటుంబాలు, మిగిలిన మరాఠాలంతా మూడవ వర్గంలో వుండేవారు. వీరిలో మొదటి రెండు తరగతులకు చెందిన వారికి మాత్రమే క్షత్రియులుగా చట్టబద్ధమైన గుర్తింపు వుండేది. మద్రాస్ హైకోర్టు యాదవులను కూడా శూద్రులుగానే పరిగణించింది.

శూద్రులకు ఉపనయనం లేకుండా చేయడం వల్లే వారు తమకు ఎగువన వున్న మూడు వర్ణాల వారిని తమకన్నా ఉన్నతులుగా భావిస్తే, మూడో వర్ణాలకు చెందిన వారు తమకన్నా దిగువన వున్న శూద్రులను క్షుద్రులుగా, నిమ్న జాతీయులుగా భావించారు. అంతరాల దొంతరలు ఏర్పడి అసమానతలతో సమాజం చీలిపోవడానికి కారణమైన ఈ సంక్లిష్ట స్థితిని అంబేద్కర్ మరింత వివరంగా మన ముందుంచేందుకు ప్రయత్నించారు.

ఉపనయనంపై ఆధారపడి క్రతువు / హోమం చేసే హక్కు ఏర్పడుతుంది క్రతువు చేయగల అధికారం లేదా హక్కువున్న వారికే ఆస్తి హక్కు వుంటుంది. అంటే ఏమిటి? ఉపనయనం అర్హత కలిగివున్న వారికే ఆస్తి కలిగి వుండటానికి అర్హత వుంటుంది క్రతువు యజ్ఞం చేయాలంటే వేద మంత్రాలను ఉచ్చాటన చేయవలసి వుంటుంది వేదాధ్యయనంలో శిక్షణ పొందినవారు మాత్రమే మంత్రోచ్ఛాటన చేయగలరు. వేదాలను పఠించే హక్కు లేని వారికి క్రతువు చేసే హక్కు కూడా లేదనే కదా దీని అర్థం ఉపనయనం జరిగిన వారికి మాత్రమే వేదాలను అధ్యయనం చేసే అవకాశం వున్నప్పుడు ఉపనయనం హక్కు లేనివారికి వేద జ్ఞానపథం మూసివేసినట్లే కదా! అంటే ఏమిటి? విజ్ఞానానికి హక్కు వున్నవారికే ఆస్తి హక్కు వుంటుంది, ఆస్తి హక్కు వున్న వారికే జ్ఞానం పొందే హక్కు దఖలైవుతుంది. ఈరెండు హక్కులు పరస్పరాశ్రితాలుగా వున్నాయి. ఉపనయనం ద్వారానే ఈ రెండు హక్కులు సిద్ధిస్తాయి. అందుకే అంబేద్కర్ ఉపనయనం ప్రక్రియకు శూద్రులను దూరం చేయడాన్ని బ్రాహ్మణులు కనిపెట్టిన అత్యంత దుర్మార్గమైన వ్యూహంగా పేర్కొన్నారు. శూద్రులపై కక్ష తీర్చుకోవడానికి బ్రాహ్మణులు ప్రయోగించిన మారణాయుధంగా ఆయన దీనిని అభివర్ణించారు. అణు బాంబు విస్ఫోటనం ఎంతటి విధ్వంసాన్ని సృష్టిస్తుందో అంతటి దుష్ప్రభావాన్ని శూద్రులపై ఈ వివక్ష చూపింది. బ్రాహ్మణుల పరిభాషలో చెప్పాలంటే శూద్రులకు అది శ్మశాన వాటికను నిర్మించింది.

ఉపనయనం చేసే హక్కు కేవలం ఒక బ్రాహ్మణులకు మాత్రమే వుండటం వల్లే వారికి ఈ విషయమై అపరిమితమైన అధికారాలు సమకూరాయి నిబంధనలు కాదని బ్రాహ్మణులు ఎవరికైనా ఉపనయనం చేస్తే వారికి జరిమానా విధించేవారు దీనితో బ్రాహ్మణులు తప్ప వేరెవరూ ఈ తంతును నిర్వహించే పరిస్థితి వుండేదికాదు ఒక వేళ ఎవరైనా బ్రాహ్మణేతరులు అందుకు సిద్ధపడినా దానికి ప్రమాణీకత కాదు.

తన వాదానికి మద్దతుగా శివాజీ పట్టాభిషేకం సన్నివేశాన్ని ఉదహరిస్తారు. శివాజీ 1674 జూన్ 6వ తేదిన పట్టాభిషిక్తుడయ్యాడు. సమాజ ఆమోదం పొందేందుకే ఆయన వేద ప్రమాణంగా జరిగే పట్టాభిషేకానికి సంసిద్ధుడయ్యాడు. శివాజీ తీసుకున్న నిర్ణయానికి నాలుగు కారణాలను అంబేద్కర్ చూపెట్టారు 1. తన సామాజిక శ్రేణికి చెందినవారిని ఆయన ఈ పనికి ఒప్పించలేకపోయారు. 2. బ్రాహ్మణేతరునితో పట్టాభిషేకం ఉత్సవాన్ని నిర్వహించడానికి శివాజీ సాహసించలేకపోయాడు 3. హిందూ మతానికి చెందిన వారి సామాజిక హోదాను నిర్దేశించే అధికారం పూర్తిగా బ్రాహ్మణులకే దఖలైవుంది. 4. బ్రాహ్మణులు ఇతరులకు హోదా కల్పించే విషయంలో తమకు గల విశేషాధికారాలు,అధికారాన్ని ఆసరా చేసుకొని తీసుకునే

నిర్ణయాలతో పెద్ద మొత్తంలో ధనాన్ని ఆర్జించేవారు. క్యాథలిక్ మత గురువుల విచ్చలవిడితనానికి బ్రాహ్మణుల స్వార్థపూరిత జీవన విధానానికి మూలాలు ఒక్కటే కావడం విశేషం. శివాజీ మంత్రులే ఆయన పట్టాభిషేకాన్ని తీవ్రంగా వ్యతిరేకించారంటే పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. బ్రాహ్మణులైన ఆ మంత్రులు శివాజీని శూద్రునిగా పరిగణించారు. పట్టాభిషేకం సందర్భంగా శివాజీ గాగ భట్టు అనే మంత్రికి ప్రతిఫలం పెద్ద మొత్తంలో చెల్లించినట్లు అంబేద్కర్ వాఖ్యానించారు. చట్టాన్ని అతిక్రమించి కొంత మొత్తాన్ని చెల్లించినట్లు, భూమి వంటి వనరుల రూపంలో కూడా సంపద చేతులు మారినట్లు ఆయన పేర్కొన్నారు.

కొద్ది మంది రాజులతో వున్న వైషమ్యాన్ని బ్రాహ్మణులు యావత్ శూద్ర జాతికి ఎలా ? ఎందుకు? వర్తింపచేశారనే ప్రశ్నకు సమాధానంగా సమాజంలో ఆధిపత్యం సంపాదించేందుకై ఈ పని చేసినట్లు అంబేద్కర్ చెప్పారు. ఈ శత్రుత్వంలో భాగంగానే ఉపనయనాన్ని శూద్రులకు లేకుండా చేశారు. తద్వారా బ్రాహ్మణుల దాష్టీకం మితిమీరిపోయి సహింపరానిదిగా తయారైంది. యుద్ధంలో ఓటమి పాలైన క్షత్రియ రాజులు ఆత్మ గౌరవాన్ని ఫణంగా పెట్టి లొంగిపోయినట్లు అన్ని కథల్లో ఒకటే సారాంశం. నీచమైన, అతి హేయమైన, అసహ్యకరమైన ఈ కట్టుకథలను చారిత్రిక వాస్తవాలుగా ఎవరైనా నమ్మగలరా? కథనాలను బ్రాహ్మణ వాదం మద్దతుదారులు తప్ప వేరెవరూ సమర్థించజాలదని అంబేద్కర్ అన్నారు.

ఇండో - ఆర్యన్ సమాజంలోని శూద్రులు, హిందూ సమాజంలోని శూద్రులు ఒకరు కాదని అంబేద్కర్ ఆధారసహితంగా రుజువు చేశారు. హిందూ సమాజంలోని శూద్రులు, ఇండో - ఆర్యన్ సమాజంలోని శూద్రులకు జాతి పరంగా వారసులు కారని ఆయన చెప్పారు. ఇండో - ఆర్యన్ సమాజంలో శూద్రులు ఒకే సమూహానికి చెందినవారు కాగా హిందూ సమాజంలో శూద్రులను సంస్కృతి, నాగరికతలు లేని నిమ్న వర్గానికి చెందినవారుగా చిత్రించారు. ఆర్యుల కాలపు సమాజం లోని శూద్రులకు, హిందూ సమాజంలోని శూద్రులకు మధ్య ఎటువంటి సంబంధం వుండటానికి అస్కారం లేదని దీన్ని బట్టి తెలుస్తున్నది. రుగ్వేద కాలం నాటికే బ్రాహ్మణులు ఒక వర్గంగా రూపుదాల్చారని వర్గచైతన్యాన్ని పెంపొందించుకొని, తమ వర్గ ప్రయోజనాలను రక్షించుకునేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకున్నారని అంబేద్కర్ పేర్కొన్నారు. ఈ క్రమంలో ఉపనయనం చేసే హక్కు కుటుంబ పూజారి సొంతమైపోయిందని, ఉపనయనం చేసుకునే అవకాశాన్ని కోల్పోతే సంభవించే నష్టాన్ని, భావితరాలపై దాని ప్రభావాన్ని శూద్రులు గుర్తించలేదని అంబేద్కర్ వ్యాఖ్యానించారు.

శూద్రులకు సంబంధించి తన సిద్ధాంతాన్ని అంబేద్కర్ షట్సూత్రాలలో పొందుపరిచారు. 1. సూర్య వంశానికి చెందిన భిన్న ఆర్య జాతులలో ఒక జాతికి చెందిన వారే శూద్రులు. 2. ఇండో - ఆర్యన్ సమాజంలో వారిది క్షత్రియ వర్ణం. 3. ఇండో - ఆర్యన్ సమాజం తొలి దశలో మూడు వర్ణాలను మాత్రమే గుర్తించింది. (ఆర్యా త్రైవర్ణికా) ఆనాడు శూద్రులు క్షత్రియ వర్ణంలో అంతర్భాగంగా వున్నారు. 4. శూద్ర రాజులకు ,బ్రాహ్మణులకు నడుమ నిరంతరాయంగా ఘర్షణలు తలెత్తేవి. ఈ విరోధం వలన శూద్రులు బ్రాహ్మణుల

చేతిలో ఎన్నో అవమానాలకు, పీడనలకు గురయ్యారు. 5. ఈ వైషమ్యాల మూలంగా శూద్రుల పట్ల అసహనం, ద్వేషం పెరిగిపోయి జందెపు పోగును వారు ధరించకుండా బ్రాహ్మణులు అడ్డుకున్నారు. 6. జందెపు పోగును ధరించే అవకాశాన్ని కోల్పోయి శూద్రులు సాంఘికంగా అధమ స్థాయికి చేరుకొని, వైశ్యులకన్నా అడుక్కి పోయి నాలుగో వర్ణంగా రూపుదిద్దుకున్నారు.

## సెక్షన్-2

### అస్పృశ్యత - దాని స్వభావం

ఒకే కులం లేదా కుటుంబంలో పుట్టిన కొంతమంది వ్యక్తులు ఆ పుట్టుక ఫలితంగా వారిని తాకితే మైలపడిపోవడాన్ని అస్పృశ్యతగా నిర్వచించవచ్చు. హిందూ జీవన విధానంలో ఈ అస్పృశ్యతా దురాచారం అమలులో వుండటం గమనార్హం. అస్పృశ్యత పుట్టు పూర్వోత్తారాలను అధ్యయనం చేసి 'ఎవరీ అస్పృశ్యులు' అని అంబేద్కర్ రాసిన గ్రంథాన్ని ఇప్పుడు పరిశీలిద్దాం. "హిందూ నాగరికతను ఏ కోశానా నాగరికత అనలేం. మానవులను అణచివేసి వారిని ఎప్పటికీ దాస్య శృంఖలాలలో బంధించి వుంచేందుకు పన్నిన దుష్ట పన్నాగం, అత్యంత క్రూరమైన కుతంత్రం అది" అనే ఆలోచనతో ఈ గ్రంథాన్ని ఆయన ప్రారంభిస్తారు. అంటు, మైల వంటి భావాలతో పాటు, అపవిత్రత పోగొట్టుకోవడానికి శుద్ధి కార్యక్రమం / కర్మ కాండ కూడా ఆదిమ సమాజంలో ప్రవేశించాయి. అపవిత్రతను, మైలను పోగొట్టుకునేందుకు ఆదిమ సమాజం మరో మార్గాన్ని కూడా కనిపెట్టాయి. ఆది మైలను అవతల మనిషికి అశుచి లేదా మైల, అంటు, కళంకం వంటి భావాలు అన్ని ప్రాచీన సమాజంలో విడివిడిగా ఆచరణలో వున్నాయని దీన్ని బట్టి చెప్పవచ్చు.

భౌతికపరమైన, భావనాపరమైన అశుచిని, జన్మతః సిద్ధించే అస్పృశ్యతను గురించి చర్చించిన పిదప అంబేద్కర్ అంటరాని వారి ఆవాసం గురించి సుదీర్ఘంగా చర్చించారు. అంటరాని వారుగా ముద్ర పడిన జనం ప్రతి నిత్యం ఎదుర్కొనే అతి ముఖ్యమైన సమస్యపై ఆయన తన పదునైన చూపును ఎక్కుపెట్టారు. మనువు తన ధర్మశాస్త్రంలో అంత్యజులు అంటే అంటరాని వారు గ్రామానికి వెలుపల తమ ఆవాసాన్ని ఏర్పాటు చేసుకోవాలని నిర్దేశించారు. అస్పృశ్యుల ఆవాసానికి సంబంధించి అంబేద్కర్ రెండు మార్గాంతరాలను సూచించారు. తొలినాళ్ల నుంచి వారు ఊరికి ఎడంగానే జీవించివుండాలి. లేదంటే తొలుత ఊళ్లో అందరితో పాటు వుండి తరువాతి కాలంలో ఊరి వెలుపలికి వెళ్లిపోయి వుండాలి. అంబేద్కర్ ఈ రెండో మార్గాన్ని స్వైరకల్పనగా, అసంబద్ధమైనదిగా తోసిపుచ్చారు. ఈ సంప్రదాయం భారతదేశం మొత్తం ఆచరణలో ఉంది. అంటరాని వారు మొదటి నుంచీ ఊరి బయటే వున్నారన్నదే వాస్తవానికి దగ్గరగా వుంది.

ఆదిమ సమాజాలలో రక్త సంబంధంపై ఆధారపడిన సంచార ఆదివాసి జాతులు నివసించేవి. ఇందుకు భిన్నంగా ఆధునిక సమాజాలలో భౌగోళిక పరిమితులకు లోబడి స్థానిక

జాతులు స్థిరపడిన సమూహాలు వుంటాయి. ఆదిమ సమాజాలు సంచార లక్షణం కలిగి వుండటానికి కారణం సంచారం వారికి ఇష్టం కావడం వల్ల కాదు. ఆనాడు పశువులు వారి చరాస్తిగా వుండటమే ఇందుకు గల కారణం. ఆదిమ సమాజాల మొట్టమొదటి సంపద పశు సంపదేనన్నది మనం ఇక్కడ మరువరాదు. గొడ్డూ - గోదా వెంటపడి సంచరించడం తప్పనిసరి కావడం వల్ల సంచార జీవనం వారి తత్వంగా మారిపోయింది. భూమిని సంపద వనరుగా గుర్తించి వ్యవసాయాన్ని వృత్తిగా చేపట్టిన తరువాత మాత్రమే ఈ సంచార జీవులు స్థిరపడటం మొదలైంది. వ్యవసాయం అభివృద్ధి చెందిన కొద్దీ మానవ సమూహాలు స్థిరనివాసం ఏర్పరచుకోవడం సాధారణమవుతూ వచ్చింది.

ఆదివాసి తెగల మధ్య నిరంతరం యుద్ధాలు జరుగుతుండటం వల్ల యుద్ధంలో పరాజయం పాలైనవారి మనుగడ సమస్య ముందుకొచ్చింది. ఓడిన తెగకు చెందిన ఆదివాసుల జీవనం ముక్కలు చెక్కలైపోయింది. ఖండఖండాలుగా చీలిపోయిన ఈ ఆదివాసి జనం దిక్కూ మొక్కూలేని వారైపోయి అన్ని దిక్కులా కదిలి వెళ్లడంతో సంచార జీవనం నిత్యకృత్యమైంది. ఇలా కొత్త ప్రాంతాలకు వలస వెళ్లినవారు ఆవాసం లేక, భద్రత కరువై, దారి తప్పి ఎవరికి వారు విడివిడిగా బతకడం వలన, మనుషులుగా వారు వైకల్యానికి గురయ్యారు. విరిగిపోయారు. దళన జీనం మూలంగా 'దళితులు'గా రూపాంతరం చెందారు. చెట్టుకొకరు, పుట్టకొకరైన వారి అంతరంగంలో 'హృదయ దళన దారుణ రోదన' ధ్వనుల విషాద సంగీతం సుడులు తిరిగింది. స్థిర నివాసం ఏర్పరచుకొని జీవనం కొనసాగిస్తున్న వారికి, దూర ప్రాంతాల నుంచి వలస వచ్చిన దళితులకు మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం దళితులు జనవాసాలకు ఆవలవుంటూ అక్కడివారికి సేవలు చేస్తారు. కాపలా పని, పశువుల పని చేయడానికి అంగీకరించారు. ఇందుకు ప్రతిగా వారు వీరికి ఆహారం, నిలువనీడ కల్పిస్తారు. దళితులు అక్కడివారికి కొత్త కావడంతో ఆగంతకులుగా జనావాసంలోకి ప్రవేశించలేక ఊరికి వెలుపలే జీవించనారంభించారు. మొదటి నుంచి ఊరికి వెలుపల నివసించడం వలన అంటరానితనం వారిని వరించలేదని చెప్పడానికి ఇదొక బలమైన దృష్టాంతం.

అంబేద్కర్ ప్రకారం అస్పృశ్యులు వర్ణవ్యవస్థకు అవతలే వున్నారు. అందుకే శూద్రులవలే సవర్ణులు కాకుండా వారు అవర్ణులయ్యారు. శూద్రుడు వర్ణ వ్యవస్థలో అంతర్భాగంగా వున్నాడు. కనుక సవర్ణుడైతే అస్పృశ్యుడు వర్ణ వ్యవస్థకు వెలుపల వున్నాడు కనుక అవర్ణుడయ్యాడు. అస్పృశ్యులను అంత్యులుగా, అంత్యజులుగా, అంత్యవాసులుగా పిలవడం (ఒకే పదాన్ని మూడు విధాలుగా) మనకు తెలిసిందే. సృష్టి ప్రాధాన్యతా క్రమానికి సంబంధించిన హిందూ మత సిద్ధాంతం అస్పృశ్యులకు వర్తించదని అంబేద్కర్ అభిప్రాయపడ్డారు. అంత్య అనే మాటకు అర్థం సృష్టిలో ఆఖరివాడు కాదని, ఊరి చివర అని ఆయన వ్యాఖ్యానించారు. గ్రామం అంచుల్లో నివసించేవారిని ఉద్దేశించి ఈ మాటను వుపయోగించారు. అంత్య పదానికి మనుగడకు సంబంధించిన అర్థం కూడా వుంది. ఆదివాసి సమూహం భౌగోళిక సమూహంగా మారడం వలన ఆదిమ సమాజంలో మౌలికమైన పరివర్తన చోటుచేసుకుంది. ఒకే రక్తం

పంచుకుని పుట్టిన వారికి ఒకే భూభాగాన్ని ఇవ్వడం వలన దళితులకు వేరుగా నివాసగృహాలు కేటాయించే పద్ధతి కనుమరుగైంది. ఒకే రక్తం పంచుకున్న వారి మధ్య వుండే బలీయమైన బంధం ఇందుకు కారణమైనదే. గ్రామానికి దూరంగా దళితుల గృహాలు వుండటమన్నది నిరంతరాయంగా శాశ్వత ప్రాతిపదికపై కొనసాగుతూ వస్తున్నది. మహర్లు తొలినాళ్ల నుంచి గ్రామానికి బయటే నివసించారని; గ్రామంలో స్థిరపడిన తెగకు చెందని వారు కావడం వలన దళితులుగా మారి ఊరి వెలుపలే వుండిపోయారు. మహర్లు తమవిగా చెప్పుకునే 52 హక్కులు మహారాష్ట్రలో తప్ప మరెక్కడా కనిపించకపోవడం విశేషం. దళితులు వేరే తెగకు, తద్వారా వేరే రక్తానికి చెందినవారు కావడం వల్లే వారికి ఊరి బయట గృహ వసతి కల్పించారని అంబేద్కర్ సిద్ధాంతం చెబుతున్నది.

అస్పృశ్యత పుట్టు పుర్వోత్తరాలకు సంబంధించిన సిద్ధాంతాలు ఈ విధంగా వున్నాయి. జాతి సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన స్టాన్లీ రాస్ అస్పృశ్యులను అనార్యులుగా మాత్రమే కాకుండా ద్రవిడేతర ఆదివాసులుగా పేర్కొన్నాడు. ద్రావిడులే వారిని లొంగదీసుకొని బానిసలుగా మార్చుకున్నారన్నది ఆయన సిద్ధాంతం. ద్రావిడుల చేతుల్లో ఓడిపోయిన వారే కులహీనులుగా సామాజిక వెలికి గురయ్యారని చెప్పడానికి బలమైన ఆధారాలు వున్నాయి. ఆర్యుల చేతుల్లో వారు పరాజితులు కాలేదన్నది మాత్రం సుస్పష్టం అంటాడు రాస్. అస్పృశ్యత మూలాలు జాతిలో, వృత్తిలో వున్నాయని ఆయన అంటారు. భారతదేశం దురాక్రమణ రెండుసార్లు జరిగిందని, మొదటిసారి ద్రావిడులు ఆక్రమించగా, రెండవసారి ఆర్యులు ఆక్రమించారని ఆయన వెల్లడించారు. తొలుత దేశంలోకి ప్రవేశించిన ద్రావిడులను ఆర్యులు యుద్ధంలో ఓడించారని, దీని ఫలితంగా ఆర్యుల ఆధిపత్యం స్థాపితమైనదని రాస్ అభిప్రాయపడ్డారు. అంబేద్కర్ ఈ సిద్ధాంతాన్ని యాంత్రికమైనదిగా, ఊహాజనితమైనదిగా భావించారు. ద్రావిడులన్నా, నాగాలన్నా ఒక్కరేనని, అవి ఒకే మానవ సమూహానికి వున్న రెండు పేర్లని అంబేద్కర్ వివరించాడు. ద్రావిడులు నాగజాతికి చెందిన వారుగా ఒక్క దక్షిణ భారతదేశంలోనే కాక యావత్తు దేశంలో విస్తరించి వుండేవారు. ఉత్తర భారతంలోని నాగాలు తమ మాతృభాష అయిన తమిళాన్ని విడనాడి సంస్కృతాన్ని తమ మాతృభాషగా మలుచుకున్నారు. నాగ శబ్దం జాతికి, సంస్కృతికి చిహ్నం కాగా, ద్రవిడ శబ్దం భాషకు చిహ్నంగా వుంది. దాసాలే నాగులని, నాగులే ద్రావిడులని, కాబట్టి భారతదేశంలో ఆర్య - నాగ జాతులు తప్ప మరో జాతి లేదని అంబేద్కర్ తేల్చారు. అంటరాని వారు అటు ఆర్యులు కాక ఇటు ద్రావిడులు కాక, మరో మూడో జాతికి చెందినవారనే ప్రతిపాదన కాల పరీక్షకు నిలిచేది కాదని అంబేద్కర్ చెప్పారు.

మానవ పరిణామాన్ని పరిమాణపరంగా, అంటే శరీర నిర్మాణ పరంగా వివరించే శాస్త్రం ప్రకారం బ్రాహ్మణులు, అస్పృశ్యులది ఒకే జాతి. అంబేద్కర్ ప్రకారం బ్రాహ్మణులు ఒకవేళ ఆర్యులైతే అస్పృశ్యులు కూడా ఆర్యులే. బ్రాహ్మణులు ఒకవేళ ద్రావిడులైతే అస్పృశ్యులు కూడా ద్రావిడులే. అలాగే వారు ఒకవేళ నాగాలైతే వీరు కూడా నాగాలే. రాస్ ప్రతిపాదించిన

సిద్ధాంతం తప్పుడు పునాదులపై ఆధారపడి వుందని చెప్పడానికి జాతి పరమైన ఐక్యతను నిర్ధారించే ఈ అంశాలు సరిపోతాయని అంబేద్కర్ అన్నారు.

హిందూ సమాజం కులం / ఉప కులం ప్రాతిపదికపై ఏర్పడలేదు. బహిర్వివాహం కీలక పాత్ర పోషించే కుటుంబ వ్యవస్థ ఆధారంగా అది ఏర్పడింది. హిందూ సంప్రదాయంలోని కులం, గోత్రం ఆదిమ సమాజపు టోటమ్‌కు సమానార్థకాలు. భిన్న కులాలలో, సమూహాలలో ఒకే గోత్రం ఉనికిలో వుండటం వారంతా ఒకే జాతికి చెందినవారని సూచిస్తుంది. ఆయా కులాల మధ్య సామాజికమైన అంతరాలు వున్నప్పటికీ జాతిపరంగా వారంతా ఒక్కటేనని చెప్పడం ఇక్కడ ఉద్దేశం. ఈ జాతి – కులం సమస్యను రిస్లే అధ్యయనం చేశారు. అస్పృశ్యులు ఆర్యులకు, ద్రవిడులకు భిన్నమైన వారనే సిద్ధాంతాన్ని ఆయన పరిశోధనలు అసత్యమని రుజువు చేశాయి. మానవ పరిణామ శాస్త్ర పరిశోధనలు కూడా మహర్లు, మరాఠాలు ఒకే జాతికి చెందిన వారని నిరూపించాయి. మహర్లలో వున్న ఉప కులాలన్నీ మరాఠాలలో కూడా వుండటం ఈ వాస్తవాన్ని స్పష్టం చేస్తుంది. ఈ అంశాలన్నింటినీ గమనంలోకి తీసుకున్న అంబేద్కర్ అస్పృశ్యత మూలాలకు సంబంధించిన జాతి సిద్ధాంతాన్ని బుట్టదాఖలా చేయక తప్పదని అభిప్రాయపడ్డారు.

నిచ్చెన మెట్ల సమాజాన్ని ఏర్పరచి అంతరాలు, అసమానతలకు కారణమైన తాత్విక సూత్రమే చాతుర్వర్ణ వ్యవ్యస్థకు పునాది. బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియ, శూద్రులలో ఎవరు బానిసలుగా వుంటే వారు పారిశుధ్య పని చేశారు. బానిసత్వం అన్ని వర్ణాలలో వుండేదని దీన్ని బట్టి గ్రహించవచ్చు. "పారిశుధ్యం పని ఆర్యునికి అసహ్యకరమైనది కానప్పుడు ,అటు వంటి 'మురికి' పనులుచేయడమే అంటరానితనానికి కారణమని అనడం ఎలా సాధ్యపడుతుంది?" అని అంబేద్కర్ ప్రశ్నించారు. అస్పృశ్యతకు కారణం మురికి పనులు చేయడం కాదని దీన్ని బట్టి అంబేద్కర్ అభిప్రాయపడ్డారు.

బ్రాహ్మణులకు, దళితులకు మధ్య గల శత్రుత్వానికి కారణాలను కనిపెట్టేందుకు అంబేద్కర్ ప్రయత్నించారు. దళితులు అప్పటికే బౌద్ధమతం స్వీకరించి వుండటం వలన బ్రాహ్మణులువారి పట్ల ఏహ్యాభావాన్ని, ద్వేషాన్ని కలుగచేసేందుకు వాస్తవ దూరమైన కథనాలను ప్రచారంలో పెట్టారు. బ్రాహ్మణుల కుతంత్రం వల్లే దళితులు అంటరాని వారుగా పరిగణించబడ్డారు. అయితే దళితులు అంబేద్కర్ చెప్పినట్లు బౌద్ధులని చెప్పడానికి ప్రత్యక్ష ఆధారాలేమి లేవు. బౌద్ధులకు వ్యతిరేకంగా బ్రాహ్మణులు సృష్టించిన ద్వేష భావంలోనే అస్పృశ్యత మూలాలు వున్నాయని అంబేద్కర్ అన్నారు. అస్పృశ్యతను దళితులకు అపాదించడానికి వారి నివాస స్థలాన్ని అదనపు ఆధారంగా వుపయోగించుకున్నారు. పశు మాంసం భుజించడం కూడా అంటరానితనానికి ఒకానొక కారణమని చెప్పేవారు కూడా లేకపోలేదు. స్మృతి కారులకు ఈ అంశం తెలుసు. దళితులు బౌద్ధులుగా మారిన తర్వాత కూడా పశు మాంసాన్ని ఆహారంగా తీసుకునే తమ పాత అలవాట్లను మానుకోలేదు. ఇది బ్రాహ్మణులకు మరింత కోప కారణమైంది.



సుందరయ్య గ్రంథాలయ
A C N 88664

మనుస్మృతి గోవధను నిషేధించలేదు. అశోకుని పాలనలో పశువులను వధించడంపై ఆంక్షలు లేవు. చట్టం దాన్ని అమోదించింది. అశోకుడు గోవధను నిషేధించినట్లు ప్రొ॥ రాధా కుముద్ ముఖర్జీ పేర్కొన్నారు. అంబేద్కర్ మాత్రం ముఖర్జీ చెప్పిన దానితో ఏకిభవించలేదు. అశోకునికి గోరక్షణపై ప్రత్యేకమైన శ్రద్ధ ఏదీ లేదని,దానిని చంపకుండా ఉండేందుకు ఆయన ఎటువంటి చట్టం తేలేదని అంబేద్కర్ భావించారు. బ్రాహ్మణుల ఆహారపుటలవాట్లను అనుకరించడం ద్వారా బ్రాహ్మణేతరులు గొడ్డు మాంసం తినడాన్ని విడిచిపెట్టారని ఆయన వ్యాఖ్యానించారు.

బ్రాహ్మణులు శాకాహారులుగా మారడానికి గల కారణాలను అంబేద్కర్ ఈ విధంగా చెప్పారు. బ్రాహ్మణులు మొదట గొడ్డు మాంసాన్ని ప్రీతిగా ఆరగించేవారు. మతం పేరిట సంరంభగా ఉత్సవ వాతావరణంలో నిర్వహించే యజ్ఞంలో బ్రాహ్మణులు జంతు బలి చేసేవారని, మాంసాహారం పట్ల వారికి గల మక్కువను మరుగుపరచడానికి ఈ వాతావరణం వారికి ఉపయోగపడేదని అంబేద్కర్ వివరించారు. మనువు గోవును పవిత్రమైన జంతువుగా భావించలేదు. పైపెచ్చు దానిని తాకితే మైల పడతారని ఆయన రాశారు. గోమాంసం తినడాన్ని ఆయన వ్యతిరేకించలేదు. గోవధను నేరంగా చిత్రించలేదు. అద్వైతతత్వం గోవును దేవతగా మార్చడంలో కీలకపాత్ర పోషించిందనే భావనను అంబేద్కర్ అంగీకరించలేదు. బ్రాహ్మణ వాదానికి, బౌద్ధానికి మధ్య జరిగిన సంఘర్షణ ఫలితంగా గోవును దైవంగా భావించే సంప్రదాయం ముందుకు వచ్చిందని, బౌద్ధంపై ఆధిపత్యం సంపాదించడానికి బ్రాహ్మణవాదం దీనిని ఒక సాధనంగా ఎంచుకున్నదని ఆయన చెప్పారు. సుమారు రెండు వేల సంవత్సరాల నాడు భారతదేశపు మెజారిటి ప్రజల మతంగా బౌద్ధం వుండేది. వందలాది ఏళ్ల పాటు మతంగా అది ఆధిక్య స్థానంలో వుంది. బ్రాహ్మణవాదాన్ని అది చీల్చి చెండాడింది. బౌద్ధం ఈ ఘర్షణలో స్వీయ రక్షణ పద్ధతి అవలంభించింది. బౌద్ధుల జీవన విధానాన్ని ఆచరించడం ద్వారా బౌద్ధ తత్వాన్ని అనుకరించడం ద్వారా మాత్రమే బ్రాహ్మణులు బౌద్ధులపై పైచేయి సాధించారు. బౌద్ధులపై ఆధిక్యత సాధించడానికి అవసరమైన గుణగణాలు ఏవి తమ వద్ద లేకపోవడంతో, గత్యంతరం లేని పరిస్థితులలో బ్రాహ్మణులు యజ్ఞం వంటి క్రతువులకు ,కర్మ కాండకు. గోవధకు స్వస్తి చెప్పారు. తద్వారా తాము అనుకున్నది సాధించారు.

బౌద్ధం జంతు బలికి బద్ధ విరోధి. గోవు పట్ల దానికి ప్రత్యేకమైన ఆదరభావమేమి లేదు. గోరక్షణకు అశోకుడు ప్రత్యేకించి చట్టం చేయకపోవడం ఈ విషయాన్నే సూచిస్తున్నది. బౌద్ధంపై తమది పైచేయి అని చాటుకోవడానికి జంతు బలి అంశాన్ని తెలివిగా వాడుకున్నారు. వాడుకొని గోమాతను పూజించే విధానానికి శ్రీకారం చుట్టారు. క్రమంగా దానిని ప్రాచుర్యంలోకి తెచ్చారు. హిందూ మత సంరక్షకులుగా రంగం మీదికి వచ్చిన గుప్తుల కాలానికి గోహత్య మహా పాతకమైపోయింది. బౌద్ధ భిక్షువులపై ఆధిపత్యం చలాయించడానికి మాత్రమే బ్రాహ్మణులు

పశు మాంస భక్షణను విడనాడి శాకాహార భక్షణ చేపట్టారని దీన్ని బట్టి గ్రహించవచ్చు. కోల్పోయిన తమ ఔన్నత్యాన్ని తిరిగి పొందడానికి బ్రాహ్మణులు ఈ విధి విధానాన్ని ఒక వ్యూహంగా అవలంభించారు.

చండాలుడు తాకితే మైల పడిపోయినట్లు ఒక్క బ్రాహ్మణులే భావించారు. మొదట్లో వైదిక కర్మలు, సంస్కారాలు నిర్వహించే సందర్భాలలో మాత్రమే ఈ అంటరానితనం పాటించేవారు. తర్వాత క్రమంగా అది నిత్యకృత్యమైపోయింది. మనం గమనించవలసిన అంశం ఇక్కడ ఒకటి వుంది. అశుచికి, అస్పృశ్యతకు మధ్య తేడా వుందని భావించిన పక్షంలో మైల పడిపోవడం అనే భావన అపవిత్రత కిందికే వస్తుంది తప్ప అది అస్పృశ్యత కాజాలదు. అంటరానివాడు బ్రాహ్మణుడితో సహా అందరినీ కళంకం పాలు చేస్తే, అపరిశుద్ధుడు మాత్రం ఒక్క బ్రాహ్మణుడ్ని మాత్రమే కళంకితం చేస్తాడు. అపరిశుద్ధుడు తాకితే వైదిక కర్మ కాండ నిర్వహించే రోజులలో మాత్రమే బ్రాహ్మణుడు మైల పడతాడని, అస్పృశ్యుడు తాకితే అన్నివేళలా మైలపడతారని దీన్ని బట్టి తెలుసుకోవచ్చు. అస్పృశ్యతకు మూలకారణం పశు మాంసభక్షణ అని, అపరిశుద్ధుల నుంచి అస్పృశ్యులను ఇది వేరు చేసిందని అంబేద్కర్ భావించారు. అశుచి, అస్పృశ్యత ఒకటి కాదనుకున్నప్పుడు అస్పృశ్యత పుట్టుక ఎప్పుడన్నది నిర్దిష్టంగా, అంతిమంగా తేల్చి చెప్పడం అంత సులభం కాదు. వేద కాలంలో అస్పృశ్యత లేదని, ధర్మ శాస్త్రాల కాలంలో అశుచి తప్ప అస్పృశ్యత లేదని అంబేద్కర్ సూత్రీకరించారు.

మనుస్మృతి కాలంలోనాలుగు వర్ణాలున్నాయే తప్ప ఐదో వర్ణం లేదు. మనువు రచనల్లో పంచముల ప్రస్తావన కనిపించదు. మనువు కాలంలో అస్పృశ్యత లేదని కేవలం అశుచి మాత్రమే వుందని అంబేద్కర్ వ్యాఖ్యానించాడు. బానిసలను పంచములుగా నిర్వచించిన తొలి సందర్భం నారద స్మృతిలో మనం చూడవచ్చు. వృత్తి కారణంగా ఏర్పడిన అంటరానితనం గురించిన ప్రస్తావన ఇందులో వుంది. " నారద స్మృతి బానిసలనుద్దేశించి ఉపయోగించిన పంచములనే మాట మను స్మృతిలో సైతం చోటు చేసుకొని వుండాలి. కాని మనుస్మృతిలో ఈ మాట ఎంత వెదికినా తారసపడదు. దీన్ని బట్టి మనువు కాలంలో అస్పృశ్యత వున్నదనే వాదం అసత్యమని తేలుతుంది. మనుస్మృతి అస్పృశ్యతకు సంబంధించి శాసనం ఏది చేయలేదు" అన్నారు అంబేద్కర్.

మనుస్మృతి కాల నిర్ణయం చేసేందుకు అంబేద్కర్ ప్రయత్నించారు. బ్యూహ్లర్ ప్రకారం అది క్రీ.శ. రెండవ శతాబ్దానికి చెందినది. క్రీ.పూ. 185 సంవత్సరం తర్వాతి కాలంలో మాత్రమే అది రాయబడిందని దప్తరీ అభిప్రాయపడ్డాడు. పుష్య మిత్రునికి మనువు ప్రతిపాదనలకు మధ్య గల సామీప్యాన్ని బట్టి చూస్తే క్రీ.పూ. 185 తర్వాతే మనుస్మృతి ఉనికిలోకి వచ్చినట్లు తెలుస్తుంది. క్రీ. శ. రెండవ శతాబ్దంలో అస్పృశ్యత లేదన్నది అంబేద్కర్ భావన. అదే కాలానికి చెందిన మనుస్మృతిలో దాని ప్రస్తావన లేకపోవడం దీనిని బలపరుస్తుంది. క్రీ. శ. 400 సం॥లో భారతదేశం పర్యటించిన చైనా యాత్రికుడు ఫాహియాన్ తన రచనల్లో చిత్రించిన

పరిస్థితులు అస్పృశ్యత అమలులోవున్నట్లు చెప్పడానికి దాఖలాలు లేవని , అస్పృశ్యతను పోలిన పరిస్థితులు మాత్రమే ఆయన రాసిన దానిలో ప్రతిఫలించాయని అంబేద్కర్ అభిప్రాయపడ్డారు. ఫాహియాన్ భారత పర్యటనకు వచ్చేనాటికే దేశం గుప్త రాజుల ఏలుబడిలో వుంది. గుప్తులు బ్రాహ్మణ వాదానికి మహారాజ పోషకులుగా వున్నారు. వైదిక కర్మ కాండ సందర్భంగా బ్రాహ్మణులు ఒక్క చండాలులకు సంబంధించి తీవ్ర స్థాయిలో ఆచరించే మడికట్టును ఫాహియాన్ తన యాత్ర స్మృతిలో ప్రస్తావించివుంటారని , అది పూర్తి స్థాయిలో అస్పృశ్యత కాజాలదని అంబేద్కర్ అంటారు. ఫాహియాన్ రచనలో వున్నట్లే బాణుడు కాదంబరి హయాంలలో కూడా చండాలుల ప్రస్తావన వుంది. కాదంబరిలో చండాలురిని అవమానించే ధోరణి లేకపోగా వారిలో రాజ కుటుంబాలు కూడా వున్నట్లు చెప్పడం కనిపిస్తుంది. చండాల కన్యను చండాల రాణిగా బాణుడు సంబోధించడమే ఇందుకు నిదర్శనం. బాణుడు క్రీ. శ. 600 కాలానికి చెందినవాడు. ఆనాటికి కూడా చండాలురు అస్పృశ్యులుగా లేరు. ఫాహియాన్ వర్ణన చండాలురకు సంబంధించినవి కాగా మరొక చైనా యాత్రికుడు హుయన్ త్సాంగ్ తన రచనలో చేసిన వర్ణన చండాలురు కాని కులాలకు సంబంధించినది కావడం గమనార్హం. హుయన్ త్సాంగ్ భారత పర్యటనకు వచ్చిన కాలంలోనే దేశంలో అస్పృశ్యతా దురాచారం వేళ్లూనుకుంటున్నదని చెప్పవచ్చు. క్రీ. శ. 200 నాటికి లేని అస్పృశ్యత క్రీ. శ. 600 నాటికి ఉనికిలోకి వచ్చిందని దీన్ని బట్టి తెలుస్తుంది.గుప్త రాజులు 4వ శతాబ్దంలో గోహత్యకు మరణ దండన శిక్షగా విధించారు, గుప్తుల కాలంలోనే అటు ఇటుగా అస్పృశ్యత మానవ జీవితంలోకి ప్రవేశించిందని అంబేద్కర్ నిర్ధారణ చేశారు.

## సెక్షన్-3

### కుల వ్యవస్థ

కుల వ్యవస్థ వలన కలిగిన కీడు గురించి, అది మనిషికి చేసిన చెడు గురించి అంబేద్కర్ తన రచనలలో, ప్రసంగాలలో విస్తారంగా, అతి నిశితంగా విమర్శలు చేశారు. అంబేద్కర్ కుల వ్యవస్థపై తన తొలి రచనను 1910 మే 9వ తేదిన న్యూయార్క్ లోని కొలంబియా విశ్వవిద్యాలయ సదస్సులో సమర్పించారు. మానవ పరిణామ శాస్త్ర విభాగంలో డా॥ఎ.ఎ. గోల్డెన్ వైజర్ ఈ సదస్సు నిర్వహించారు. అంబేద్కర్ తన పత్రంలో తొలుత సెనార్ట్ , నెస్ ఫీల్డ్, రిస్లే, ఎస్.వి.కేత్కర్ ప్రభుతులు కులానికిచ్చిన నిర్వచనాలను ఉదహరించారు."భారతదేశంలో కులం ఉనికిలో వున్నంత కాలం హిందూవుల మధ్య కులాంతర వివాహాలు జరగవు. తమ కులానికి చెందని ఇతరులతో వారికి సామాజిక సంపర్కం వుండదు. ఒకవేళ హిందూవులు ప్రపంచంలోని ఇతర ప్రాంతాలకు వలస పోయిన పక్షంలో వారు తమ వెంట తమ కులాన్ని తీసుకెళ్తారు కనుక అప్పుడు కులం అనేది యావత్తు ప్రపంచ సమస్య అవుతుంది" అన్నది కేత్కర్ అభిప్రాయం. ఇక్కడ కేత్కర్ కుల వ్యవస్థకు సంబంధించిన రెండు ప్రధాన లక్షణాలను మన ముందుంచారు. అవి కుల సభ్యుల సంఖ్య ఆ కులంలో పుట్టిన వారికే పరిమితం

కావడం, ఒక కులానికి చెందిన వారు వేరొక కులం వారిని పెళ్లి చేసుకోవడంపై ఆంక్షలు వుండటం.

మత సంబంధమైన ప్రభావం వున్నప్పుడు మాత్రమే కులానికి అశుచి అనే లక్షణం సమకూడుతుంది. ఇతర కులస్థులతో కలిసి భోజనం చేసే పరిస్థితి లేకపోవడం కూడా కులమే కారణం. విడివడి వుండే లక్షణం మనుషులకు కులం మూలంగానే సంక్రమించింది. దేశంలోని వేర్వేరు భూభాగాలలో నివసిస్తున్న విభిన్న జాతుల మధ్య ఒక మేరకు సంపర్కం ఏర్పడి దాదాపుగా అవి పరస్పరం కలిసి పోవడం వలన సాంస్కృతిక ఐక్యతకు అస్కారం కలిగి దేశ ప్రజలు సజాతీయులుగా మనుగడ సాగించగలుగుతున్నారని చెప్పవచ్చు. కులానికి గల ప్రత్యేక లక్షణమైన అంతర్వివాహ పద్ధతి ఈ సాంస్కృతిక ఐక్యతకు అడ్డం పడుతున్నది. పెళ్లి వయస్సు వచ్చిన స్త్రీ పురుషుల మధ్య అంతరాలను తగ్గించడానికి, వీలైతే తొలగించడానికి ఉపకరించే సాధనంగా కులం చివరికి పరిణమించిందని చెప్పవచ్చు. అంబేద్కర్ ఈ అంశంపై ఈవిధంగా స్పందించారు.

> "కులంలో అవసరానికి మించి వున్న స్త్రీ పురుషుల సమస్యను పరిష్కరించడానికే సతీ సహగమనం, బాల్య వివాహం వంటి ఆచారాలు అమలులోకి వచ్చాయి. సమస్య పరిష్కారానికి ఇంత కన్న మెరుగైన మార్గం అందుబాటులో లేకపోవడం వల్లే అవి చాలా కాలం మనుగడలో వున్నాయి. అంతర్వివాహ పద్ధతి సజావుగా సాగడానికి కూడా ఇవి తోడ్పడ్డాయి. కులం పుట్టిందంటేనే అంతర్వివాహ పద్ధతి పుట్టిందన్న మాట."

కుల వ్యవస్థ తుపాకీ మొనపై నిర్వహిస్తున్న న్యాయ పరమైన వ్యవస్థగా అంబేద్కర్ మనకు చూపిస్తారు. జనానికి ఆయుధాలు కలిగి వుండే హక్కు లేకపోవడం వలన, వారికి చదువుకునే హక్కు, ఆస్తి హక్కు నిరాకరించడం వలన మాత్రమే కుల వ్యవస్థ బతికి బట్ట కట్టిందని ఆయన అంటారు. కుల వ్యవస్థ సహజమైనది, స్వాభావికమైనది ఎంత మాత్రం కాదని, అది పాలక వర్గాలు పాలితులపై బలవంతంగా రుద్దిన విషపూరిత వ్యవస్థ అని అంబేద్కర్ అభిప్రాయపడ్డారు.

కుల సమస్య అధ్యయనంలో అంబేద్కర్ నాలుగు అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. అవి 1. హిందూ కుల సమాజంలో వైరుధ్యాలు ఎన్ని వున్నా ప్రజల మధ్య లోతైన సాంస్కృతిక ఐక్యత వున్నదని చెప్పడం. 2. సాంస్కృతికంగా ఏక తాటిపైకి వచ్చిన వారిని కులం ముక్కలు ముక్కలుగా నరికి వేస్తున్నదని చెప్పడం. 3. ప్రారంభంలో ఒకే కులం వున్నదని చెప్పడం. 4. బయటికి పోయిన వారిని వెనక్కి తీసుకోవడం, లోపల వున్న వారిని వెలివేసి బయటికి పంపడం ద్వారా వర్గాలు కులాలుగా పరివర్తన చెందాయని చెప్పడం.

లాహోరులో 1936 మార్చి చివర్లో జాత్ – పాత్ – తోడక్ మండల్ వారి సదస్సులో చేయవలసి వున్న అధ్యక్షోపన్యాసంలో అంబేద్కర్ కుల వ్యవస్థ బండారాన్ని సైద్ధాంతికంగా

బట్టబయలు చేశారు. "హిందూ మత ద్వేషి" అంబేద్కర్‌ను మండల్ అధ్యక్షునిగా ఎన్నుకోవడంపై చెలరేగిన విమర్శల పరంపర ఫలితంగా ఈ సదస్సు మే నెల 15 వ తేది వరకు వాయిదా పడింది ప్రసంగ పాఠంలోని అంశాలు తీవ్రస్థాయిలో వున్నాయనే నెపంతో నిర్వాహకులలో ఒక వర్గం అంబేద్కర్ ప్రసంగం చేయరాదని అభ్యంతరం పెట్టింది. దీని ఫలితంగా మండల్ ముఖ్య నాయకులైన భాయి పరమానంద్, డా॥ నారంగ్, మహాత్మా హన్స్‌రాజ్, నరేంద్రనాద్ మండల్ నుంచి వేరయ్యారు.

1936 ఏప్రిల్ 13, 14 తేదిలలో అమృత్‌సర్‌లో జరిగిన సిక్కు మత సదస్సులో అంబేద్కర్ పాల్గొన్నారు. సిక్కుల సదస్సులో ఆయన పాల్గొనడం జాత్ – పాత్ –తోడక్ మండల్ వారి అనుమానాలకు మరింత బలం చేకూర్చింది హిందూవుగా తాను చేస్తున్న చిట్టచివరి ప్రసంగం ఇదేనని లాహోరు సదస్సులో మాట్లాడటానికి సిద్ధం చేసుకున్న ఉపన్యాస పత్రంలో ఆయన చెప్పుకొన్నారు. ప్రసంగ పాఠాన్ని మార్చవలసిందిగా వారు చేసిన విజ్ఞప్తికి ఆయన తలవంచలేదు. సదస్సు అధ్యక్షునిగా నిర్వాహకులు అంబేద్కర్‌ను అంగీకరించలేదు. ఒక సంస్థ సన్నాహక సంఘం తాము వార్షిక సదస్సుకు ఎంచుకున్న అధ్యక్షుడిని కేవలం అతని అభిప్రాయాలు తమకు ఆమోదయోగ్యంగా లేవు కనుక విరమింపచేయడమన్నది అదే మొదటిసారి. ఈ వ్యవహారంపై గాంధీజీ చేసిన వ్యాఖ్యలు ఎంతో ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి "విశేష కృషితో `అనన్య సామాన్యమైన స్థానాన్ని సాధించుకున్న ఒక ధీశాలి వెలిబుచ్చే మౌలికమైన అభిప్రాయాలను వినే అవకాశం ప్రజానీకానికి లేకుండా చేసిన ఘనత సన్నాహక సంఘానికి దక్కినట్లు కనిపిస్తున్నది. భవిష్యత్తు అతనికి ఎటువంటి ముద్రనైనా వేయవచ్చు కాక, డా॥అంబేద్కర్ మనం ఎవరమూ విస్మరించలేని వ్యక్తి."

సిక్కుల సదస్సులో అంబేద్కర్ మహారాష్ట్రకు చెందిన 17వ శతాబ్దపు ప్రఖ్యాత కవి – యోగి రాందాస్ కవితా చరణాలను ఉదహరించారు. సామాజిక, రాజకీయ, మతపరమైన అంశాలపై రాసిన 'దాస్ – బోధ్ ' గ్రంథంలో "చండాలుడు పండితుడైతే మీరు అతడిని గురువుగా అంగీకరిస్తారా? " అంటూ హిందువులను రాందాస్ ప్రశ్నిస్తాడు అంగీకరించరంటూ సమాధానం కూడా అయనే చెబుతాడు. 1713 – 1818 మధ్య కాలంలోని పీష్వాల పాలనలో కూడా అంటు, సొంటు వంటి మూఢ నమ్మకాలు కొనసాగాయి.

శ్రమ విభజన అనూహ్యంగా జరిగిందేమీ కాదు. సహజమైన స్వభావం రీత్యా కాని, ఇష్ట పూర్తిగా కాని కూడా ఇది జరగలేదు. వ్యక్తిగత భావావేశాలకు ఇక్కడ తావు లేదు. అంతా కర్మ అనుకొనే మూఢత్వంపై ఆధారపడి ఇది జరిగింది కుల వ్యవస్థ వ్యక్తులకు విధులను వారి శక్తి సామర్థ్యాలను అనుసరించి కాని, వారు పొందిన శిక్షణను అనుసరించి కాని కాకుండా వారి తల్లి దండ్రుల సామాజిక స్థితి గతుల ఆధారంగా నిర్దేశిస్తుందని అంబేద్కర్ అన్నారు.

కుల వ్యవస్థలో వృత్తులను పరస్పరం మార్చుకునే విధానం అమలులో లేకపోవడం వలన నిరుద్యోగం పెరిగిపోవడానికి కులం ప్రత్యక్షంగా కారణమైంది. మనిషి స్వభావిక శక్తులు, ఇష్టాయిష్టాలు, సామాజిక నిబంధనలకు పూడిగం చేయవలసి రావడం వలన ఆర్థిక వ్యవస్థగా కులం మనిషికి ప్రమాదకరంగా పరిణమించిందని అంబేద్కర్ వ్యాఖ్యానించారు. ఆర్థిక సామర్థ్యానికి కూడా కులం తోడ్పడలేదని, కులం వలన జాతి మెరుగు పడలేదని, హిందువులు కులం వలన దుర్నీతి పాలవడమే కాకుండా ఒకరికొకరు కాకుండా పోయారు.

జాతి, రక్తం కల్తీ కాకుండా నివారించడమే కులం ముఖ్యోద్దేశమని బ్రాహ్మణవాదులు వాదించారు. ప్రపంచంలోని అన్ని ప్రాంతాలలో జాతులు ఒకదానితో ఒకటి కలిసి పోవడం జరిగిందని, కల్తీ లేని జాతి అంటూ ఎక్కడా లేదని అంబేద్కర్ అన్నారు. బ్రాహ్మణవాదులు చెప్పినట్లు జాతిని పరిశుద్ధంగా వుంచడానికి, రక్తం మలినం కాకుండా చూడడానికి కుల వ్యవస్థ ఉనికిలోకి వచ్చిందని చెప్పడానికి ఎటువంటి ఆధారం లేదని, జాతులను కుల వ్యవస్థ విభజించిన దాఖలాలు లేవని అంబేద్కర్ చెప్పారు. జాతుల పుట్టుకకు కుల వ్యవస్థ ప్రతిఫలం కాదని, సామాజికంగా ఉన్నతమైన హోదాలో వున్న హిందువులలో వక్రబుద్ధిగల వర్గం అహంకారంతో , స్వార్థంతో కుల వ్యవస్థకు ప్రాణప్రతిష్ట చేసి, తమకన్నా దిగువన వున్న వారిపై బలవంతంగా రుద్దిందని ఆయన వ్యాఖ్యానించారు.

అంబేద్కర్ ప్రకారం హిందూ చైతన్యం అంటూ ప్రత్యేకించి ఏమీ లేదు. ప్రతి హిందువులో వున్నది కుల చైతన్యమే తప్ప మరొకటి కాదు. మహమ్మదీయుల దురాక్రమణకు పూర్వం సంస్కృత భాషలో హిందూ అనే పదం కానరాదు. హిందూ సమాజం కులాల కూటమిగా వున్నదని, అది సమాఖ్య స్వభావం కూడా కలిగి లేదని, భౌతికంగా ఒకే పరిసరాలలో కలిసి జీవించడం వలన మనుషులు సమాజంగా ఏర్పడలేదని అంబేద్కర్ పేర్కొన్నారు. అలవాట్లు, ఆచారాలు, నమ్మకాలు, ఆలోచనలలో పోలికలు వున్నంత మాత్రాన మానవ సమాజం ఏర్పడజాలదని, మనుషులను కట్టి పడవేసే సాధారణ అంశాలు బలంగా వున్నప్పుడే వారి మధ్య బంధం బలపడి సమాజం ఏర్పడుతుందని, సమాచారాన్ని పరస్పరం ఇచ్చి పుచ్చుకోవడం ద్వారా సమాజం మనుగడలో వుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.

> "కుల వ్యవస్థ అందరికీ ఒకే విధంగా వర్తించే కార్యరంగాన్ని నిరోధిస్తుంది. తద్వారా హిందువులు తమదైన సామాన్య జీవన విధానం, చైతన్యాలతో ఒక సమాజంగా ఏర్పడకుండా నిరోధించింది. వ్యక్తులు ఎవరికి వారుగా మొత్తం పనిలో తమ వంతు పని చేసే వారుగా విడివడి వుండటానికి మాత్రమే అది అనుమతిస్తుంది" అన్నారు అంబేద్కర్.

కుల వ్యవస్థకు వున్న అసాంఘిక అంశ, అది ఎంత అమానవీయమైనదో స్పష్టం చేస్తుందని అంబేద్కర్ భావించారు. బ్రాహ్మణులకు, బ్రాహ్మణేతరులకు మధ్య ఎప్పుడూ ఘర్షణలు జరిగేవని, హిందువులు కులాల పొందిక మాత్రమే కాదని, స్వీయ ప్రయోజనాల కోసం, స్వార్థ పూరిత లక్ష్యాల కోసం పరస్పరం ఘర్షణ పడే సమూహాలకు నెలవుగా సమాజం వుండేదని ఆయన అన్నారు. కులం , కుల చైతన్యం ఉనికిలో వుంటూ గత కాలపు ఘర్షణలను గుర్తు చేస్తుండటం వలన సంఘీభావాన్ని దూరం చేసింది. శివాజీని అవమానించిన బ్రాహ్మణుల ఈనాటి వారసులను బ్రాహ్మణేతరులు క్షమించలేకపోతున్నారని అంబేద్కర్ ఒక సందర్భంగా వ్యాఖ్యానించడం గమనార్హం.

కులాలు స్వయం ప్రతిపత్తిని కలిగివున్నాయని ఆగంతకున్ని ఒక కులంలోకి ప్రవేశపెట్టే అధికారం ఏ శక్తికి లేదని ,హిందూ సమాజం కులాల కూడలిగా వుంటూనే ప్రతి కులం దేనికదే వ్యవస్థీకృతమై వున్నందున ఒక కులం నుంచి మరో కులం లోకి మార్పు చెందే ప్రక్రియకు అస్కారం లేదని అంబేద్కర్ అంటారు. కుల వ్యవస్థ అభివృద్ధి చెందిన మేరకు హిందూ మతం ఒక మతంగా తన లక్ష్యం లేనిదైపోయింది. కులాలు ఉనికిలో వున్నంత వరకు హిందూ మతం క్రైస్తవం, ఇస్లాం వంటి మతాల వలే సార్వజనీన విలువల కోసం దీక్షా దక్షతలతో పాటుపడే అవకాశం లేదని, కులం నుంచి వెలి వేసినవారిని తిరిగి ఆశ్రమంలోకి తీసుకొనేందుకు నిర్వహించే శుద్ధి కార్యక్రమం అపహాస్యంగా , వ్యర్థ కలాపంగా మిగిలిపోక తప్పదని ఆయన తీర్మానించారు. సోదరభావం సిక్కులలో, ముస్లింలలో వున్న విధంగా హిందువులలో కన్పించదు. సామాజిక బంధం హిందువులలో బలపడలేదు. తోటి హిందువులు ఆపద సమయంలో తమకు సహయం అందచేస్తారనే నమ్మకం వారిలో కనిపించదు. దీనికి కారణం వారి మధ్య సోదరభావం కొరవడటమేనని చెప్పాలి. కులం ఉనికిలో వున్నందుపల్లే సోదర భావం వివిధ కులాలకు చెందిన వారి మధ్య ఏర్పడలేదని, అది వారిని సంఘటితం కానవ్వదని, సంఘటితం కాకుండా వారు బలవంతులు కాలేరని , పిరికివారుగా, బలహీనులుగా మిగిలిపోగలరని అంబేద్కర్ వ్యాఖ్యానించాడు. పది మందికి పనికి వచ్చే ఒక మంచి పని చేయడానికి అవసరమైన పరస్పర సహకారం, సంఘీభావం కులం మూలంగా అసాధ్యమైపోయాయని ఆయన ఒక సందర్భంలో చెప్పారు.

కుల వ్యవస్థలో కుల ఆచారాలను ఉల్లంఘించిన వారిని కులంనుంచి వెలి వేసే హక్కు అనాదిగా వస్తున్నది. కులం నుంచి వెలివేయడం అంటే అది మృత్యువుతో సమానం. అయినా చట్టం దీనిని శిక్షార్హమైన నేరంగా గుర్తించలేదు. కులానికీ, చట్టానికీ అతీతమైన స్వయంప్రతిపత్తి వుండటం వల్లే న్యాయస్థానాలు ఈ విషయమై మిన్నకుంటున్నాయని ఆయన అన్నారు. దీని మూలంగానే సంప్రదాయవాదుల చేతుల్లో కులం బలమైన ఆయుధంగా మారింది. సంస్కర్తలను శిక్షించడానికి వారు దీనిని ఉపయోగించారు. ధర్మనిరతి వున్నప్పటికీ అది కులానికి లోబడి వుండేది. ప్రజాజీవనంలో ధర్మనిరతిని కుల వ్యపస్థ ధ్వంసం చేసింది. సుగుణం, నైతిక

వర్తనం కుల పరిమితులకు లోబడి మాత్రమే వుండేవి. "కులం వద్దంటున్నావు సరే, నీవు చెప్పే ఆదర్శ సమాజం ఏమిటి?" అని విమర్శకులు అడిగిన ప్రశ్నకు "స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ప్రాతిపదికగా నెలకొనే సమాజం నాకు ఆదర్శం" అని జవాబిచ్చారు అంబేద్కర్. ఆదర్శ సమాజానికి చలనం జీవ లక్ష్యంగా వుండాలి. సమాజం పరస్పరాశ్రితంగా వుండాలి. ప్రజాస్వామ్యానికి మరో పేరే సౌభ్రాతృత్వం. ప్రజాస్వామ్యం కేవలం ఒక పరిపాలనా విధానం మాత్రమే కాదు. ప్రాథమికంగా అది సహజీవన విధానం. సమిష్టి భావనకు ప్రతిరూపం. సంమిశ్రిత అనుభవానికి ఆటపట్టు. మౌలికంగా ప్రజాస్వామ్యమనేదే తోటి వారి పట్ల ఆదరాభిమానాలు కనపరిచే ఒక దృక్పథం.

చాతుర్వర్ణ వ్యవస్థ పుట్టుకపై ఆధారపడలేదని , మనిషి గుణగణాలే దాని ప్రాతిపదిక అని ఆ వ్యవస్థను ప్రతిపాదించినవారు జాగ్రత్త పడి చెప్పిన మాటలను అంబేద్కర్ విశ్వశించలేదు. "వాళ్లు ఎన్ని మాటలైనా చెప్పవచ్చు. వారి ఉద్దేశం మాత్రం ఒక్కటే. పాత మాటల స్థానే కొత్తవి వచ్చి చేరినంత మాత్రాన సామాజిక సారాంశం మారదు" అని ఆయన అన్నారు. గుణాలను బట్టి ఈ వ్యవస్థ రూపొందివుంటే పుట్టుకకు సంబంధించిన బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర కుల నామాలతో దానిని ఎందుకు పిలువవలసి వచ్చిందని ఆయన ప్రశ్నించారు. చాతుర్వర్ణ వ్యవస్థ ప్రజలను ఈ విధంగా నాలుగు వర్గాలుగా చేసిన విభజన, గ్రీకు తత్వవేత్త ప్లేటో చేసిన విభజనకు దగ్గరగా వుంది. ప్లేటో మనుషులను ఉత్పత్తిదారులు (కార్మికులు, వ్యాపారులు), రక్షకులు (యుద్ధ సమయంలో, శాంతి సమయంలో), శాసనకర్తలు అనే మూడు వర్గాలుగా విభజించాడు. మనుషులను స్థూలంగా మూడు వర్గాలుగా ప్లేటో విభజించడాన్ని అంబేద్కర్ తప్పు పట్టారు. వర్ణానికి, కులానికి మధ్య మౌలికంగానే తేడా వుందని, అవి రెండు ఒకటి కావని ఆయన భావించారు. వర్ణం గుణంపై ఆధారపడి వుండగా, కులం పుట్టుకపై ఆధారపడిందని అన్నారు. చాతుర్వర్ణ వ్యవస్థను నిజంగానే ఒకవేళ నెలకొల్పదలిస్తే, కుల వ్యవస్థను ముందు రద్దు చేయ వలసి వుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. చాతుర్వర్ణ వ్యవస్థ ఆచరణ యోగ్యం కాదని, ప్రమాదకరమైనదని కాలం రుజువు చేసిందని, దాని ఘోర వైఫల్యమే దీనికి నిదర్శనమని అంబేద్కర్ వ్యాఖ్యానించారు. ప్లేటో కలలు కన్న రిపబ్లిక్ ఎందుకు విఫలమైందో, చాతుర్ వర్ణం కూడా అందుకే విఫలమైందని ఆయన అన్నారు. "చాతుర్వర్ణం అనే మాట వింటేనే నాకు అసహ్యం. నా దేహం, నా మనస్సు మొత్తంగా ఆ మాటను ధిక్కరిస్తాయి" అన్నాడు ఆయన. చాతుర్వర్ణ వ్యవస్థ ఒకవేళ ఆచరణలో సాధ్యమని అనుకొన్నా అది ఒక దుర్మార్గమైన వ్యవస్థ అని కూడా ఆయన అన్నారు.

అంబేద్కర్ మరొక ముఖ్యమైన ప్రశ్న లేవనెత్తారు. భారతదేశంలో సామాజిక విప్లవాలు ఎందుకు సంభవించలేదు? అన్న ఈ ప్రశ్నకు ఆయనే జవాబు చెప్పారు. "హిందువులలో వెనుకపడ్డ శ్రేణులు వర్ణ వ్యవస్థ వలన ప్రత్యక్ష కార్యాచరణకు పూనుకోలేకపోయారు. ఎందుకంటే ఆ వ్యవస్థ వారిని పూర్తి స్థాయిలో వైకల్యానికి గురి చేసింది." సమాజం అట్టడుగున వున్న వెనుకబడ్డ జాతులు తాము వున్న స్థితి నుండి తప్పించుకునే మార్గం లేక, తప్పించుకోవడమెలాగో

తెలియక నిరంతర దాస్యంతో రాజీ పడ్డారు. అంతా తమ కర్మ అని ఉదాశీనులై పరిస్థితులకు తలవంచారు. ఈ స్థితి వారికి ఒక శాపం వలే పరిణమించింది. దీనికి భిన్నంగా యూరోపియన్ దేశాలలో బలహీన వర్గాలకు చెందిన వారికి సైన్యంలో చేరే స్వేచ్ఛ వుండటం వలన ఆయుధాన్ని ధరించే హక్కు, ఓటు వేసే స్వేచ్ఛ హక్కుకు వుండటం వలన రాజకీయ స్వాతంత్రం, చదువుకునే స్వేచ్ఛ వుండటం వలన నైతిక విలువలకు సంబంధించిన స్వయం ప్రతిపత్తి లభ్యమయ్యాయి. చాతుర్ వర్ణ వ్యవస్థ వలన భారతదేశంలో బలహీన వర్గాలకు ఈ మూడు హక్కులు నిరాకరించడం వలన స్వీయ రక్షణకు ఆయుధాన్ని ఉపయోగించే అవకాశం లేకపోయింది. ఓటు వేసే హక్కు లేనందున రాజకీయంగా అస్వతంత్రులుగా మిగిలిపోయారు. చదువుకునే హక్కు లేకపోవడం వలన నైతిక జీవనంలో సంక్షోభం ఏర్పడి బానిసత్వం ప్రశ్నించ వీలు లేని విలువగా మారిపోయింది. "చాతుర్వర్ణాని కన్నా మనుషులను హీన పరిచే సామాజిక వ్యవస్థ మరొకటి వుండజాలదు. అది మనుషులను జీవచ్ఛవాలుగా మారుస్తుంది. వారి ఉనికిని వైకల్యంతో విరిచి వేస్తుంది" అన్నారు అంబేద్కర్.

మౌర్యులు దేశాన్ని పాలించిన కాలంలో చాతుర్ వర్ణం పూర్తిగా నిర్మూలించబడిందని అంబేద్కర్ అంటారు. అందువలన శూద్రులు దేశాన్ని పాలించారు. మౌర్యులు పాలించిన కాలాన్ని ఆయన చరిత్రలో స్వేచ్ఛకు, ఔన్నత్యానికి, ఘనకీర్తికి పేరెన్నిక గన్న కాలంగా అభివర్ణించారు. చాతుర్వర్ణం దీనికి భిన్నంగా ఓటమికి, చీకటికి నిదర్శనంగా నిలిచాయి. ఆనాడు బ్రాహ్మణులకు, క్షత్రియులకు మధ్యన వైరం వుండేది. క్షత్రియులు ప్రజాకంటకులుగా మారి పోవడం వలన ప్రజలు అసహాయులుగా మిగిలిపోయారు. బ్రాహ్మణులకు, క్షత్రియులకు మధ్య జరిగిన ఘర్షణలకు సంబంధించిన సంఘటనలు మహాభారతంలో, పురాణాలలో కోల్లలుగా కనిపిస్తాయి. అవతారాలన్నీ క్షత్రియులను అణచివేయడానికే రంగం మీదికి వచ్చాయి. బ్రాహ్మణులకు, క్షత్రియులకు మధ్యనే కాక అన్ని వర్ణాలకు మధ్య ఆ రోజులలో శత్రుత్వం వుండేది. ఘర్షణలు నిత్యకృత్యంగా వుండేవి. సామరస్యం ఆనాడు మచ్చుకైనా లేదు. ఇందుకే చాతుర్వర్ణ వ్యవస్థ ఏ సమాజానికైనా ఆదర్శం కాజాలదని అంబేద్కర్ తేల్చి చెప్పారు.

హిందువేతరులకు కులంపై గల అవగాహనకు, హిందువులకు కులంపై గల అవగాహనకు మధ్య మౌలికంగానే చాలా అంతరం వుంది. హిందువులు కులానికి సామాజిక విలువగా ఇచ్చిన గుర్తింపు హిందువేతరులు ఇవ్వలేదు. హిందువులలో కులం చాలా కీలక పాత్ర వహించింది. కులం ఏమిటో తెలియకుండా ఒక మనిషి ఎలాంటి వాడో చెప్పడం హిందువులు ఊహించలేరు. దీనికి తోడు హిందువులలో కులం నుంచి వెలి వేసే దుష్ట సంప్రదాయం అమలులో వుండేది. సిక్కులు, ముస్లింలలో ఈ ఆచారం లేదు. హిందువేతరులలో కులం మతపరమైన మూఢ విశ్వాసంగా లేదు.హిందువులు ఇందుకు భిన్నంగా కులాల మధ్య వేరు కుంపటిని, వేర్పాటును మత పరమైన ఒత్తిడుల వలన పెంచి పోషించారు "కులం వలన కలిగిన విపత్తిని నిలువరించె బలీయమైన శక్తి హిందువులలో కొరవడింది " అన్నారు అంబేద్కర్.

శతాబ్దాలుగా హిందువులు మనుగడలో ఉన్నారని, వారిని ఎవరూ నాశనం చేయలేకపోయారనే మాట మనం తరచు వింటుంటాం. మనుగడలో ఉన్నంత మాత్రాన మానడానికి వారు అర్హులని చెప్పడానికి ఆధారమేమీలేదని అంబేద్కర్ అన్నారు. హిందూ సమాజం అంతరించి పోకుండా ఉనికిలో ఉండటానికి కారణం కులం కాదని, వీదేశి దురాక్రమణ శక్తులు తాము లోబరుచుకున్న హిందువులను మొత్తంగా హతమార్చకపోవడమే కారణమని ఆయన వ్యాఖ్యానించారు. హిందువుల చరిత్ర అంతా విదేశీ దురాక్రమణదారులముందు సాగిలబడి లొంగిపోయినదేనని అంటారు. విదేశీ దురాక్రమణదారుని దాడులకు ఎదురొడ్డి హిందువులెన్నడూ పోరాడలేదు. విదేశీ శక్తులను పారదోలడానికి అవసరమైన చర్యలను చేపట్టిన దాఖలాలు కూడా లేవు. జన సైన్యాన్ని నిర్మించి తిరుగుబాటు బావుటాను ఎగురవేసిన సందర్భం అంతకన్నా లేదు. దాస్యాన్ని సుఖప్రదమైన జీవన విధానంగా మలచేందుకే హిందువులు ప్రయత్నం చేశారు. నిజానికి కుల వ్యవస్థ రక్షణ అవసరాలకు జనాన్ని ఏకతాటిపై తేకుండా అడ్డుకున్నది. కుల వ్యవస్థను సృష్టించిన సిద్ధాంతం నశించకుండా కులాలన్నీ ఏకమై శత్రువును ఎదుర్కొనే పరిస్థితి ఉత్పన్నం కాదు. వర్ణ వ్యవస్థ ప్రాతిపదికపై పుట్టుకొచ్చిన వంశ పారంపర్యాన్ని అధికారిక సిద్ధాంతంగా మలచడాన్ని ఆయన తప్పు పట్టారు. ప్రజలకు ఆయా వర్గాలందించే సేవలతో తప్ప వారికి వ్యవస్థ వేసిన ముద్రలతో నిమిత్తం లేదని అంబేద్కర్ అభిప్రాయపడ్డారు. కులాలకు అతీతంగా నిర్వహించే బంతి భోజనాలతో కుల సమస్య పరిష్కారం కాదని భావించిన అంబేద్కర్ కులాంతర వివాహం కుల వ్యవస్థను ధ్వంసం చేయగలదని ఆశించారు.

అంబేద్కర్ మానసిక పరివర్తనకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఆలోచనలలో మార్పు రావలసిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. శాస్త్రాల పవిత్రతపై నమ్మకం పోయినప్పుడే సమస్యకు సరైన పరిష్కారం లభిస్తుందని ఆయన అన్నారు. ఎందుకంటే "శాస్త్రాలు మానవ మస్తిష్కాలపై వేసిన ప్రభావం వల్లే విశ్వాసాలు ఏర్పడ్డాయి. ఆ విశ్వాసాల ఆధారంగానే మనుషులు పనులు నిర్వర్తిస్తున్నారు." అందుకే శాస్త్రాలపై విశ్వాసం పోయినప్పుడు మాత్రమే మనుషులు స్వతంత్ర కార్యాచరణకు పూనుకోగలరు. కుల వ్యవస్థను అదృశ్యంగా నడిపిస్తున్న మతపరమైన పక్షపాతం నుంచి, 'పవిత్రమైన' అభిప్రాయాల నుంచి మనుషులు విముక్తులు కావలసిన అవసరం వుందని ఆయన అన్నారు. కులాలకు, తద్వారా శాస్త్రాలకు ఆపాదించిన దివ్యత్వాన్ని నిర్మూలించకుండా అడుగు ముందుకు వేయజాలని పరిస్థితిని ఆయన గుర్తించారు. కులం మనుషులను వేర్వేరు సమూహాలుగా విభేదించిందని, తిరిగి ఆ సమూహాల మధ్య అంతరాలు సృష్టించిందని, దీనివలన నిచ్చెన మెట్ల వ్యవస్థ ఏర్పడి మనుషుల సామాజిక హోదాలో తీవ్ర అసమానతలకు కారణమైందని ఆయన చెప్పారు. కులాలన్నింటినీ ఈ విధంగా నిర్బంధంలో పెట్టడం వలన కుల వ్యవస్థకు వ్యతిరేకంగా విస్తృత స్థాయిలో ఒక సమిష్టి కూటమిని నిర్మించడం అసాధ్యమైపోయిందని ఆయన చెప్పారు. కుల వ్యవస్థ ఆయా కులాల మధ్య హోదాకు సంబంధించి, హెచ్చుతగ్గులకు సంబంధించి అసూయ, ద్వేషం ఏర్పడటానికి కారణమైంది. కుల వ్యవస్థ రద్దు అయితే తరతరాలుగా అనుభవిస్తున్న ఉన్నత హోదా కూడా రద్దు అయిపోతుందనే భీతితో వారు

స్వార్థం కొద్ది కులాన్ని పెంచి పోషించడానికి తమ శక్తి యుక్తులను వెచ్చించారు. ఇందువల్లనే కుల వ్యవస్థ నిర్మూలనకు హిందువులు సార్వజనీనంగా సంఘటితమయ్యే పరిస్థితి లేకుండా పోయింది.

హిందూ మతాన్ని ఒక వైపు వేదాలు, మరో వైపు స్మృతులు శాసించాయి. అయితే ఈ రెంటిలో ఏది వివేచనకు నిలబడుతుందో కనుగొనే ప్రయత్నం జరుగలేదని అంబేద్కర్ అన్నారు. కులం, వర్ణం అనే విలువలను నమ్మే హిందువుకు ఆ నమ్మకం మూలాలను హేతుబద్ధంగా పరిశీలించే అవకాశం కలుగలేదు. వేదాలను, స్మృతులను హేతువాద విధానంతో వ్యాఖ్యానించడాన్ని ఆయన వ్యతిరేకించారు.

కులాన్ని శాసించే నిబంధనలను ఉల్లంఘించిన వారు పశ్చాతాపం ప్రకటించి ప్రాయశ్చిత్తం చేసుకుంటే వారికి సమాజంలో పూర్వపు హోదా దక్కే పద్ధతి హిందు మతంలో వుంది. "ప్రాయశ్చిత్తం ద్వారా చేసిన తప్పు సరిదిద్దుకునే అవకాశం కల్పించి శాస్త్రాలు రాజీ మార్గాన్ని అవలంభించడం మూలంగానే కులం ఎప్పటికప్పుడు నూతన జవజీవాలతో తన ఉనికిని చాటుకుంటున్నది. కులం లోతుపాతులపై నిశితమైన ఆలోచనకు అది అస్కారం లేకుండా చేసింది. తద్వారా కులం విధ్వంసం కాకుండా కాపాడింది" అన్నారు అంబేద్కర్.

అంబేద్కర్ లాహోర్ సదస్సులో చేయవలసిన అధ్యక్షోపన్యాసం 'కుల నిర్మూలన' పేరిట ప్రచురితమైన సందర్భంగా గాంధీ తన 'హరిజన్' పత్రికలో ఆయన చెప్పినదాన్ని ఖండిస్తూ మూడు వ్యాసాలు రాశారు.

> "అంబేద్కర్ హిందూ మతానికి ఒక పెను సవాలుగా నిలుస్తున్నారు. మతం జ్ఞాన సంపదతో జీవించదు. అది రుషులు, దార్శనికుల అనుభవాలలో, వారి జీవితాలలో, ప్రవచనాలలో జీవిస్తుంది. కులానికి మతంతో ఎటువంటి ప్రమేయం లేదు. నాలుగు వర్ణాలు, నాలుగు ఆశ్రమాలు కులంతో సంబంధంలేని వ్యవస్థలు. వర్ణ ధర్మం మన హక్కులను కాకుండా మన విధులను నిర్వచిస్తుంది. వర్ణ ధర్మంలో అస్పృశ్యతను విశ్వసించాలనే నియమం లేదు. ఎలాంటి విలువ, సాధికారికత లేని గ్రంథాల నుంచి ఉదహరించడంలో వున్నది అంబేద్కర్ తప్పంతా. మతానికి ఘోరమైన తప్పుడు వ్యాఖ్యలు చేసి, దిగజారి వున్న హిందువులను చూసి వారినే అసలు సిసలు హిందువులుగా భావించడంలో కూడా అంబేద్కర్ పొరపాటు చేశారు. అంబేద్కర్ తన వాదంలో నెగ్గడానికి అవసరానికి మించినన్ని ఆధారాలు చూపెట్టి తన వాదాన్ని బలహీనపరుచుకున్నారు. ఒక మతం మంచి చెడులను దాని హీనమైన అనుయాయులను బట్టి నిర్ణయించలేం. అది సృష్టించిన (ఒకవేళ సృష్టించి వుంటే) ఉత్తమోత్తములను బట్టి మాత్రమే తుది తీర్పు చెప్పవలసి వుంటుంది" అని రాశారు గాంధీ.

జనానికి శాస్త్రాల్లో ఏమున్నదో తెలియదని అంబేద్కర్ తన ప్రసంగ పాఠంలో మొట్ట మొదట వ్యాఖ్యానించారు. శాస్త్రాలు కులాన్ని, అస్పృశ్యతను మత ధర్మంగా పాటించాలని చెప్పాయని ఇతరులు చెప్పిదాన్ని వారు నమ్మారని అంబేద్కర్ అన్నారు.

గాంధీజీ ఇందుకు సమాధానంగా శాస్త్రాలపై వ్యాఖ్యానాలు చేయవలసింది రుషులు, సంత్‌లే కాని పండితులు కాదని అన్నారు. గాంధీజీ వెలిబుచ్చిన ఈ అభిప్రాయాన్ని అంబేద్కర్ ఖండిస్తూ సంత్‌లు కుల వ్యవస్థను ఎప్పుడూ తప్పు పట్టకపోగా బలంగా విశ్వసించారని అన్నారు. సంత్ జ్ఞానదేవ్ బ్రాహ్మణునిగా గుర్తింపు పొందడం కోసం భూమి ఆకాశాలను ఏకం చేయవలసి వచ్చిందని, అంత ప్రయాసపడితే కానీ పైథాన్ బ్రాహ్మణులు ఆయనకు ఆ గుర్తింపు ఇవ్వలేదని అంబేద్కర్ పేర్కొన్నారు. మరో సంత్ ఏకనాథ్ కులాన్ని, అస్పృశ్యతను వ్యతిరేకించలేదు. అంటరాని వారిని తాకితే అంటే మైల నుంచి శుద్ధి కావడానికి పవిత్ర గోదావరి జలాలలో స్నానం చేయాలని ఆయన సూచించారు. గత కాలానికి చెందిన ఏ ఒక్క సంత్ కూడా కులానికి, అస్పృశ్యతకు వ్యతిరేకంగా ఉద్యమం చేపట్టలేదని అంబేద్కర్ అన్నారు. మనిషికీ, మనిషికీ మధ్య సంఘర్షణ కన్న మనిషికీ భగవంతునికీ మధ్య సంబంధంపై సంత్‌లకు ఎక్కువ మక్కువని ఆయన వ్యాఖ్యానించారు. భగవంతుని ముందు మనుషులంతా సమానులే అని వారు చెప్పిన సుద్దులు ప్రజల విశ్వాసాలను ప్రభావితం చేయలేకపోయాయి. చూడటానికి పైకి న్యాయంగా కనిపించే ఇటువంటి సూక్తులను ప్రచారం చేయడానికి ఎవరూ ఇబ్బంది పడలేదు. నమ్మితే ప్రమాదమని ఎవరూ సంకోచించలేదు. కులం , అస్పృశ్యతలపై ప్రజలకు గల దృఢ విశ్వాసాన్ని సంత్‌ల పవిత్ర వాక్కులు వీగిపోయేలా చేయలేదని చెప్పడానికి మెజారిటీ ప్రజల ఆచరణ నిదర్శంగా వుందని అంబేద్కర్ వ్యాఖ్యానించారు.

మతాన్ని అది సృష్టించిన ఉత్తములను బట్టి నిర్ణయించాలని, అధములను బట్టి కాదని గాంధీజీ చేసిన వ్యాఖ్యకు స్పందనగా అధములు అధిక సంఖ్యలో ఉత్తములు అత్యల్ప సంఖ్యలో ఎందుకున్నదీ చెప్పాలని అంబేద్కర్ ప్రశ్నించారు. అంబేద్కర్ ఈ స్థితికి కారణం కాగల రెండు పూర్వ రంగాలను ప్రతిపాదించారు. 1. అధములుగా వున్న వారు మతం ప్రవచించిన ఆదర్శాన్ని అందుకునేందుకు ఇసుమంతైనా శక్తి లేని అసమర్థులై వుండాలి. 2. మతం చెప్పిన ఆదర్శమే పూర్తిగా తప్పుడు ఆదర్శమై వుండి అత్యధికుల జీవితాలను తప్పుడు నీతులతో మలుపు తిప్పి వుండాలి. ఉత్తములేమో తప్పుడు మతాదర్శానికి ఆకర్షితులవకుండా ఉత్తములుగా వుండి వుండాలి. తప్పుడు మలుపును సరైన దిశగా తిప్పడం ద్వారా వారు ఈ పని సాధించి వుండాలి. అంబేద్కర్ మొదటి ప్రతిపాదనను తిరస్కరించి రెండవ దానిని ఆమోదించారు.

పూర్వీకుల బాటలో నడవాలన్న గాంధీజీ ఆదర్శం అసాధ్యమైన, ఆచరణ సాధ్యం కాని ఆదర్శమే కాక నైతికంగా సమర్థించ వీలు కాని ఆదర్శమని అంబేద్కర్ భావించారు. బ్రాహ్మణునిగా పుట్టిన వాడు జీవితాంతం బ్రాహ్మణునిగా కొనసాగడంలో గాంధీకి గొప్ప సుగుణం కనిపించింది." ప్రజలనుంచి దానం, ధర్మం ఉచితంగా స్వీకరించి అందుకు

ప్రతిఫలంగా ప్రజలకు ఆధ్యాత్మిక సంపదను ఉచితంగా పంచిపెడుతున్న నిజ బ్రాహ్మణులను "చూసి గాంధీ తృప్తి చెందేవాడు. ఈ 'ఆధ్యాత్మిక సంపద' సద్గుణాలను పోగు చేస్తే ఏర్పడింది కాదని, మత సేవ చేసే ఉన్నతమైన వృత్తిని కళంకితం చేయడమేనని అంబేద్కర్ విమర్శించారు.

వర్ణం, కులం – రెంటికి రెండు దురాలోచనలేనని రెంటిలో దేనిని నమ్మినా ఒక్కటేనని అంబేద్కర్ అభిప్రాయపడ్డారు. వేదాల మాదిరే వర్ణం కూడా తిరుగులేనట్టిది. భగవద్గీత వర్ణ వ్యవస్థకు అంతర్గత గుణగణాల పేరిట నమ్మడానికి వీలైన కొత్త పునాదులపై తిరిగి ప్రాణప్రతిష్ట చేసి కపటానికి పరాకాష్టగా నిలిచింది. పైపెచ్చు వర్ణ వ్యవస్థ పుట్టుకపై ఆధారపడివున్నదని కూడా భగవద్గీత చెప్పలేదు. గాంధీ మాత్రం గీతాకారుడ్ని కూడా దాటిపోయి వర్ణమనేది పుట్టుకే నిర్ణయిస్తుందని, ఏ వర్ణం వాళ్లు ఏ వృత్తి చేపట్టాలనేది వంశ పారంపర్య సూత్రం నిర్ణయిస్తుందని చెప్పి , వర్ణానికీ కులానికీ మధ్య వున్న విభజన రేఖను చెరిపివేశారు.

## సెక్షన్-4

### బ్రాహ్మణ వాదం - బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమాలు

భారతీయ సమాజ వ్యవస్థను విశ్లేషించే క్రమంలో కుల వ్యవస్థను అంబేద్కర్ నిర్హేతుకమైనదిగా, అణచివేతకు గురి చేసేదిగా అభివర్ణించారు. బ్రాహ్మణవాదాన్ని ఆమూలాగ్రం ఖండించారు. బ్రాహ్మణవాదం ముఖ్య సూత్రాలను ఆయన ఈ విధంగా వివరించారు. 1. భిన్న కులాల మధ్య అణచివేతకు అసమానతలు. 2. శూద్రులు, అస్పృశ్యుల నిరాయుధీకరణ 3. శూద్రులు, అస్పృశ్యులకు చదువుకొనే హక్కుపై పూర్తి నిషేధం. 4. అధికార స్థానాన్ని, ఆధిపత్య స్థానాన్ని చేరుకోకుండా శూద్రులు, అస్పృశ్యులపై ఆంక్షలు. 5. శూద్రులు, అస్పృశ్యుల ఆస్తి హక్కుపై పూర్తి నిషేధం. 6. స్త్రీల అణచివేత, పూర్తి స్థాయి దాస్యం.

అసమానత బ్రాహ్మణ వాదం అధికారిక సిద్ధాంతమని, సమానత్వం ఆకాంక్షించి అందుకోసం పాటుపడే వారిని ఎలాంటి పశ్చాత్తాప భావనకు గురికాకుండా అణిచివేయడం తమ జన్మ హక్కుగా బ్రాహ్మణులు భావిస్తారని అంబేద్కర్ స్పష్టం చేశారు. బ్రాహ్మణులు విద్యపై గుత్తాధిపత్యాన్ని సాధించి కింది కులాలు విద్యనభ్యసించడాన్ని నేరంగా ప్రకటించారు. శూద్రులు, అస్పృశ్యుల నిరాయుధీకరణకు బ్రాహ్మణులు శాసన రూపం కల్పించారు. పూర్తి స్థాయి నిరాయుధీకరణ బ్రాహ్మణవాద విధానం కావడం వలన నిమ్న శ్రేణులకు చెందిన ప్రజానీకం నిర్వీర్యమైపోయింది. భారతదేశంలో బ్రాహ్మణులు చేసిన విధంగా మరే ఇతర దేశంలో మేధావి వర్గాలు ప్రజలను నిరాంతరాయంగా అజ్ఞానంలో, పేదరికంలో కట్టిపడవేసే తత్వశాస్త్రాన్ని కనిపెట్టలేదు. మేధస్సును మరే ఇతర మేధావి వర్గం ఇంత దారుణంగా మలినపరచలేదు.

శూద్రులకు, అస్పృశ్యులకు బ్రాహ్మణులు ఆగంతకుడే కాక విరోధి కూడానని అంబేద్కర్ అన్నారు. చరిత్రలో వైశ్యులతో పోల్చదగిన పరాన్నభుక్కు వర్గం మరొకటి కానరాదని, ధనార్జన అనే దుర్గుణం వైశ్యులలో సంస్కృతిపరంగా అమోదం పొంది అవధులు దాటిన

అవలక్షణంగా రూపుదాల్చిందని ఆయన వ్యాఖ్యానించారు. మహమ్మారి జనం మీదపడి మృత్యు ఘంటికలు మోగిస్తూంటే సందట్లో సదేమియాలా ఇదే అదనని, సొమ్ము చేసుకొనేవాడే వైశ్యుడని, తన దగ్గర వున్న ధనాన్ని, పేదరికాన్ని పెంచి పోషించడానికి ఉపయోగించడం అతనికి వెన్నతో పెట్టిన విద్య అని, అనుత్పాదక ఖర్చులకు అప్పులిచ్చి, పేదల రుణభారం పెంచి వారిని మరింత పేదరికంలోకి నెట్టివేయడంలో వైశ్యులు ఆరితేరారని ఆయన వ్యాఖ్యానించారు. ఆకలి దప్పులతో అలమటిస్తున్న నిరుపేద, నిరక్ష్యరాస్య భారతదేశం వైశ్యుని వద్ద తాకట్టుపడి వున్నదని, బ్రాహ్మణుడు మెజారిటీ ప్రజల మస్తిష్కాలను దాస్య శృంఖలాలలో బంధించగా వైశ్యుడు వారి దేహాలను బంధించాడని, కొల్లగొట్టిన సంపదను ఇరువురూ వాటాలు వేసుకొని పంచుకున్నారని అంబేద్కర్ అన్నారు.

అంబేద్కర్ దృష్టిలో బ్రాహ్మణులు సమాజానికి నాయకులుగా వ్యవహరించారు. పాండిత్యాన్ని తమకు మాత్రమే పరిమితం చేసుకున్నారు. బ్రాహ్మణ పండితుడు విద్యాధికుడే తప్ప మేధావి కాదు. ఎందుకంటే అతను తన కులానికి, వర్గానికి చెందిన వారి ప్రయోజనాలను పరిరక్షించడానికి మాత్రమే తన తెలివి తేటలను వెచ్చిస్తాడు. బ్రాహ్మణులు విద్యాధికులే అయినా వారిలో వోల్తేర్ వంటి మహా మేధావి పుట్టకపోవడానికి కారణం ఇదే. వారికి తమ స్వార్థ ప్రయోజనాలే పరమావధి కావడం వలన అసహనం వారికి జన్మతః అబ్బిందని చెప్పవచ్చు. బ్రాహ్మణవాదం తమ పూర్వీకుల నుంచి వారసత్వంగా రావడం వల్ల వారు వేదాల 'పవిత్రత'ను రక్షించడానికి సత్యాన్ని అణిచివేశారు. గత కాలపు బ్రాహ్మణులను సమర్థించడం ద్వారా వారు తమ ఉనికిని సమర్థించుకున్నారు. ఆధిపత్యాన్ని చాటుకోవాలని చూశారు. బ్రాహ్మణులు స్వతంత్రంగా వేదాల వంటి 'పవిత్ర' గ్రంథాల పై పరిశోధన చేపట్టకపోవడానికి ఈ సామాజిక నేపథ్యమే కారణమైంది. రాజకీయ, మతపరమైన అధికారాలను కలగలిపి బ్రాహ్మణులకు దారదత్తం చేస్తూ సమాజంలో అగ్ర కులాల ఆధిపత్యాన్ని బ్రాహ్మణ పాలనను సుస్థిరం చేస్తూ 1928లో వెలువడిన నెహ్రూ నివేదికను అంబేద్కర్ చీల్చి చెండాడారు. అస్పృశ్యులకు, వెనుకబడిన హిందువులకు ఎన్నికలలో సీట్లు రిజర్వేషన్ ప్రాతిపదికపై కేటాయించడం ద్వారా ఈ ఆధిపత్యాన్ని సవాల్ చేయవచ్చునని అంబేద్కర్ అభిప్రాయపడ్డారు. నెహ్రూ కమిటీలో మెజారిటీగా వున్న బ్రాహ్మణులు ఇతర అగ్ర కుల హిందువులు కింది కులాలకు రాజకీయ హక్కులు లేకుండా చేశారని, తద్వారా బ్రాహ్మణుల ఆధిక్యాన్ని బలోపేతం చేశారని ఆయన భావించారు. నెహ్రూ కమిటీ సూచించిన నియోజకవర్గాలు బ్రాహ్మణాధికారాన్ని చెక్కు చెదరకుండా సుస్థిరం చేయడానికే తప్ప రాజకీయ సమానత్వం ఆశించి కాదని అంబేద్కర్ విమర్శించారు.

బ్రాహ్మణులు హిందూ పురాణేతిహాసాలను శృతుల పేర సృష్టించి తమ విశేషాధికారాలను, ఆధిపత్యాన్ని పటిష్టం చేసుకున్నారని, సత్యాన్ని ఫణంగా పెట్టి అయినా బ్రాహ్మణ పండితులు ఈ రచనలను సమర్థించారని, వాటికి సమాజంలో గల స్థానాన్ని దెబ్బతీసే పనికి వారెన్నడూ తలపెట్టలేదని అంబేద్కర్ అన్నారు. బ్రాహ్మణ పండితులు చెప్పుకోదగిన

పరిశోధన ఏదీ చేయలేదని, కాల నిర్ణయం చేయడం, ఉన్నత కులాలు, వంశాల పుట్టు పూర్వోత్తరాలను వెలికి తీయడం వంటి పనులకు మాత్రమే వారు తమ మేధస్సును ఉపయోగించారని ఆయన అన్నారు. ఈ బ్రాహ్మణ పెత్తనాన్ని తుదముట్టించడానికి శూద్రుల నాయకత్వంలో బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమం పుట్టిందని ఆయన వ్యాఖ్యానించారు.

శాస్త్రాలు ప్రజలను అవమానించేవిగా వున్నందువలన వాటిని నిషేధించాలని అంబేద్కర్ గట్టిగా అభిప్రాయపడ్డారు. వేదాలను పుక్కిటబ్బుబుపట్టే వారు పరిష్కారానికి చేరువగా వున్న సామాజిక సమస్యలలో జోక్యం చేసుకోవడం తగదని ఒక సందర్భంలో అంబేద్కర్ అంటారు. హిందూవులలో మెజారిటీగా వున్న నిరుపేద, నిరక్షరాస్య, మూఢ జనులను కన్నుగప్పి మాయపుచ్చడానికి , మోసగించడానికి అవసరమైన సామాగ్రి పురాణాలలో, శాస్త్రాలలో నిండుగా వున్నదని ఆయన భావించారు. బ్రాహ్మణవాదానికి, ప్రజాస్వామ్యానికి మధ్య పరస్పర విరోధం వున్నదని , ప్రజాస్వామ్యం కావాలనుకుంటే చాతుర్వర్ణానికి చరమగీతం పాడక తప్పదని అంబేద్కర్ నిగ్గుతేల్చారు.

> "అస్పృశ్యత మూలాలు కుల వ్యవస్థలో వున్నాయి. కుల వ్యవస్థ మూలాలు వర్ణాశ్రమ ధర్మాలను ఆశ్రయించిన మతంలో వున్నాయి.వర్ణాశ్రమ వ్యవస్థ మూలాలు బ్రాహ్మణీయ మతంలో వున్నాయి. బ్రాహ్మణీయ మతం మూలాలు మూడు వర్ణాలకు చెందిన రాజకీయాధికారంలో, ఆధిపత్యంలో వున్నాయి" అన్నారు అంబేద్కర్.

అందరికీ వర్తించే సార్వజనీన మతం అమలులోకి తేవడానికి ఆయన కొన్ని సూచనలు చేశారు.

1. హిందువులందరికీ ఆమోదయోగ్యమైన ఒకే ఒక ప్రామాణిక గ్రంథం వుండాలి. వేదాలు, శాస్త్రాలు, పురాణాలలో వున్న మత సామాజిక సిద్ధాంతాలను బోధించడాన్ని, ప్రచారం చేయడాన్ని శిక్షార్హం చేయాలి.
2. పురోహిత వృత్తిని రద్దు చేయాలి. కనీసం అది వంశపారంపర్యంగా సంక్రమించేదిగా వుండకూడదు. పౌరోహిత్యం, అర్చకత్వం చేసే వారిని ఎంపిక చేయడానికి ప్రభుత్వం పరీక్ష నిర్వహించాలి.
3. తగిన అర్హత, పరిజ్ఞానం లేకుండా పౌరోహిత్యం చేసే వారిని శిక్షించాలి.
4. ఇతర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా పురోహితుడు రాజ్యానికి లోబడి వుండాలి. ప్రభుత్వమే అతనికి వేతనం చెల్లించాలి. నైతిక విలువలు ,విశ్వాసాలు భగవదారాధన వంటి అంశాలకు సంబంధించి అతనిపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే హక్కు ప్రభుత్వానికి వుండాలి. పౌరులందరికీ వర్తించే చట్టమే పురోహితునికి కూడా వర్తింప చేయాలి.

5. ప్రభుత్వోద్యోగాలకు పరిమితి వున్నట్లే పురోహితుల ఉద్యోగాలను కూడా అవసరాలకు అనుగుణంగా పరిమితం చేస్తూ చట్టం వుండాలి. హిందువులలో పురోహిత వర్గం చట్టానికీ, నైతిక వర్తమానానికీ కట్టుబడి లేదు, కనుక వారిని చట్టం పరిధిలోకి తేవాలి. పురోహిత వృత్తిని చేపట్టడానికి అవకాశాన్ని ఒక కులానికి పరిమితం చేయకుండా అన్ని కులాల వారికి విస్తరింపచేయాలి. ఇలా చేస్తే బ్రాహ్మణవాదం అంతరిస్తుంది. బ్రాహ్మణవాదంతో పాటు కులం కూడా అంతరించడానికి ఇది తోడ్పడుతుంది. బ్రాహ్మణ వాదానికి ప్రతి రూపమే కులం.

"హిందూ మతాన్ని బ్రాహ్మణ వాదం విషపూరితం చేసింది. బ్రాహ్మణ వాదాన్ని హతమార్చినప్పుడే హిందూ మత రక్షణ సాధ్యపడుతుంది. ఆర్య సమాజీయులు ఈ ప్రక్రియకు స్వాగతం పలకాలి. ఎందుకంటే వారు బోధించిన గుణ - కర్మ సిద్ధాంతం ఇక్కడ అన్వయించబడింది" అన్నారు అంబేద్కర్.

హిందు మతానికి సిద్ధాంత ప్రాతిపదిక వుండవలసిన అవశ్యకతను ఆయన నొక్కి చెప్పారు. ప్రజాస్వామ్యానికి మౌలిక సూత్రాలైన స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వాలకు అనుగుణంగా ఈ ప్రాతిపదిక వుండాలని ఆయన సూచించారు. అంబేద్కర్ ముగ్గురు మహా పురుషులను తన గురువులుగా చెప్పుకున్నారు. వారు వరుసగా కబీరు, బుద్ధుడు, ఫూలే. భక్తి ఉద్యమాలలోని మంచిని ఆయన కబీరు ద్వారా దర్శించారు. బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమ నిర్మాణానికి , జనబాహుళ్యానికి ఉపశమనం కలుగ చేసే కార్యకలాపాలకు, వారి విద్యా బుద్ధులకు, ఆర్థిక పురోగతికి కృషి చేయడానికి ఫూలే ఆయనను పురిగొల్పారు. బుద్ధుని నుంచి ఆయన తాత్విక రంగంలో స్పష్టతను పొందారు. మానసిక, అధిభౌతిక రంగాలలో నాటుకొని వున్న అసంబద్ధతను తొలగించేందుకు, బుద్ధుడు సూచించిన మార్గాన్ని ఆయన అవలంబించారు. అస్పృశ్యుల విమోచనకు బుద్ధుడు ఆచరించిన మూకుమ్మడి మత మార్పిడి విధానాన్ని అంబేద్కర్ అనుసరించారు.

మహారాష్ట్రలో జన్మించిన జ్యోతి రావ్ ఫూలే 19 వ శతాబ్దంలో పేరెన్నికగన్న సంఘసంస్కర్త . అస్పృశ్యులకు తొలిసారి తాగునీటి వసతి కల్పించిన ధీశాలి ఫూలే. అస్పృశ్యులతో పాటు మహిళలకు పాఠశాలలు మొదటిసారిగా నెలకొల్పిన ఘనత ఆయనకే దక్కుతుంది. 1850 ప్రాంతంలో ఆయన పూనా పట్టణంలో ఈ పనులన్నీ చేశారు. కొల్హాపూర్ సంస్థానాన్ని పాలించిన సాహూ మహరాజ్ ఫూలేను మహారాష్ట్ర మార్టిన్ లూథర్‌గా అభివర్ణించారు. శూద్రులను బ్రాహ్మణులు అణిచివేయడాన్ని ఆయన నిష్కర్షగా వ్యతిరేకించారు. ఆయన బ్రాహ్మణ ద్వేషి కాదు. ఆయన చేపట్టిన బహుజన ఉద్యమం బ్రాహ్మణ వాదాన్ని వ్యతిరేకించిందే తప్ప బ్రాహ్మణులను కాదు. సంఘ సంస్కరణ కార్య కలాపాలలో జస్టిస్ ఎం.జి. రాణడే వంటి వారు ఆయనకు తమ సహాయ సహకారాలు అందించారు. పురోహితులకు దాస్యం చేసే దౌర్భాగ్య స్థితి నుంచి దేశ ప్రజలకు విముక్తి కలిగించేదే స్వాతంత్ర్యమని ఆయన భావించారు.

ఫూలే 1873 సెప్టెంబర్ 23న సత్యశోధక్ సమాజాన్ని ఆయన నెలకొల్పారు. ఇది ప్రధానంగా మూడు సూత్రాలను బోధించింది. 1. భగవంతుడు ఒక్కడే. మనుషులంతా ఆయన పిల్లలు. 2. మనుషులక్కూ, భగవంతునికి మధ్య సంధాన కర్త అవసరం లేదు. 3. మనిషి ఔన్నత్యాన్ని అతని పుట్టుక (అంటే అతను పుట్టిన కులం) శాసించకూడదు. ఫూలే బోధించిన ఈ మూడు సూత్రాల్ని నెలకొల్పిన సమాజం ఆయనకు నాటి సమాజంలో ఉన్నత స్థానం కల్పించాయి. బరోడా సంస్థానం రాజు షాయాజీ రావ్ గైక్వాడ్ ఫూలే ఉద్యమానికి తన వంతు సహాయం అందచేశాడు. ఫూలేను ఆయన భారతదేశపు బుకర్ టి. వాషింగ్టన్‌గా అభివర్ణించాడు. 1881లో లోకమాన్య బాల గంగాధర తిలక్ , అగార్కర్‌లు డోంగ్రీ జైలు నుంచి విడుదలైనప్పుడు ఫూలే తన అనుచరులతో ధైర్యంగా ఎదురేగి వారిని పెద్ద ఊరేగింపుగా పూనా పట్టణానికి తీసుకు వచ్చారు. అంబేద్కర్ తన సుప్రసిద్ధ గ్రంథం 'శూద్రులంటే ఎవరు?' ఫూలేకు అంకితం చేశారు.

నిమ్న శ్రేణులకు చెందిన మెజారిటీ జనాలకు సామాజిక విమోచన కల్పించేందుకు ఫూలే నిర్దిష్టమైన దృక్పథాన్ని అవలంబించడం వలన అంబేద్కర్ ఆయన బోధనల పట్ల ఆకర్షితులయ్యారు. పేదల నుంచి పెద్ద మొత్తంలో అన్యాయంగా చక్ర వడ్డీ వసూలు చేసే దుర్మార్గాన్ని , భూమిని సాగు చేయకుండా, భూమిపై ఆధిపత్యం కలిగి వుండే భూస్వామ్య వ్యవస్థను ఆయన తీవ్ర స్థాయిలో వ్యతిరేకించారు. భూమిని సాగు చేయని భూస్వామిని రైతుగా గుర్తించడానికి ఆయన నిరాకరించారు. ఫూలే ప్రవచించిన బ్రాహ్మణ వ్యతిరేక వాదాన్ని బ్రాహ్మణేతర రాజకీయ పార్టీలకు ఉపయోగపడే సంకుచిత ఉద్యమంగా కొందరు నాయకులు మలుచుకున్నారు. బ్రాహ్మణేతర నాయకులు బ్రాహ్మణులను జాతికి శత్రువులుగా భావించేవారు. 'దేశానికి శత్రువులు' పేరిట జావల్కర్ విడుదల చేసిన కరపత్రం యావత్ మహారాష్ట్రలో పెను సంచలనం సృష్టించింది. అంబేద్కర్ ఈ కరపత్రాన్ని 'నీచాభిరుచితో, దుర్బుద్ధితో రాసిన మంచి రచన'గా పేర్కొన్నారు. కరపత్ర రచయితలైన బ్రాహ్మణేతర నాయకులు జేధే, జావల్కర్, బగాడే త్రయంపై చట్టపరంగా చర్య తీసుకోవలసిందిగా కోరుతూ కోర్టులోఒక పిటిషన్ దాఖలైంది. అంబేద్కర్ న్యాయవాదిగా ఈ ముగ్గురు నిందితుల తరపున వాదించి వారి విడుదలకు తోడ్పడ్డారు.

1920–30 మధ్య కాలంలో బ్రాహ్మణేతర ఉద్యమం ఉధృతంగా వ్యాప్తి చెందింది. కోల్హాపూర్ సంస్థానాన్ని పాలించిన సాహూ మహరాజ్ ఈ ఉద్యమానికి క్రియాశీల మద్దతు అందించారు. ఈ ఉద్యమ నాయకుడు బి.వి.జాదవ్ బొంబాయి శాసన మండలికి ఎన్నికై కొత్త ప్రభుత్వంలో మాంట్ ఫోర్డ్ సంస్కరణలకు లోబడి మంత్రి అయ్యారు. ఉన్నత స్థానంలో ఆయన వున్న కాలంలో బ్రాహ్మణేతర ఉద్యమం బాగా బలపడింది.

సాహూ మహరాజు అంబేద్కర్‌లో బ్రాహ్మణేతర ఉద్యమానికి నాయకత్వం వహించగల సమర్థుడైన యువ నాయకుడిని పసిగట్టారు. అంబేద్కర్‌కు రాసిన ఒక లేఖలో ఆయన ఈ విధంగా పేర్కొన్నారు.

"మెస్సర్స్ లిటిల్ అండ్ కంపెనీ వారిని రెండు అంశాలకు సంబంధించి సంప్రదించగలవు. మొదటిది తిలక్‌పై కేసు నమోదు చేయడానికి సంబంధించి. మహర్లను తిలక్ నేరస్థుల తెగకు చెందిన వారని అన్నాడు. ఈ మాట అన్నందుకు ఆయనను కోర్టుకు ఈడ్చేందుకు గల అవకాశాలను పరిశీలించవలసిందిగా వారిని కోరగలవు. రెండవది ప్రజాధనం దుర్వినియోగానికి సంబంధించింది. తిలక్ తన కోసమో, తన పార్టీ అవసరాల కోసమో ప్రజా ధనాన్ని వెచ్చించినట్లు ఆరోపణలు వచ్చాయి. బొంబాయి నుండి వెలువడే 'సందేశ్' అనే మరాఠీ దిన పత్రికలో దీనికి సంబంధించిన జమా ఖర్చు వివరాలు ప్రచురితమయ్యాయి. వీటి ఆధారంగా తిలక్‌పై క్రిమినల్ కేసు కాని, సివిల్ కేసు కాని, లేదంటే రెండు కేసులు కాని నమోదు చేయవచ్చో; లేదో కూడా వారిని కనుక్కోగలవు. "మరో ఉత్తరంలో సాహు మహరాజ్ అంబేద్కర్‌ను 'లోకమాన్య' అని సంబోధించారు (దేశ ప్రజలు తమ ఇష్ట పూర్తిగా లోకమాన్య అని ఆనాటి జాతీయ నాయకులలో ఒక తిలక్‌నే పిలుచుకున్నారు). ఈ ఉత్తరంలో ఆయన అంబేద్కర్‌ను కొల్హాపూర్ వచ్చి తనకు సహకరించవలసిందిగా అభ్యర్థించారు. 'బలుతా 'వ్యవస్థను రద్దు చేసి అస్పృశ్యులలో ఆత్మగౌరవాన్ని, స్ఫూర్తిని పునరుద్ధరించేందుకు తాను చేపట్టిన కార్యక్రమానికి తోడ్పాటునందించవలసిందిగా ఆయన కోరారు. అస్పృశ్యులకు భూ పంపిణీ కార్యక్రమాన్ని ఈ సందర్భంగా చేపట్టారు. సర్ ఆల్ఫ్రెడ్ పీస్‌కు రాసిన మరో లేఖలో సాహూ మహరాజ్ అంబేద్కర్ చెప్పే అంశాలను శ్రద్ధగా వినవలసిందిగా ఆయనను కోరారు. "వెనుకబడిన కులాలకు, బ్రాహ్మణ అధికార యంత్రాంగానికి మధ్య గల తేడా ఏమిటో అంబేద్కర్ మీకు వివరిస్తాడు. చిరకాలంగా అనుభవిస్తూ వచ్చి ఇటీవల క్రమంగా కోల్పోతున్న అధికారాన్ని తిరిగి హస్తగతం చేసుకోవడమే బ్రాహ్మణుల ఏకైక లక్ష్యంగా వుంది. బ్రిటిష్ ప్రభుత్వం ప్రతిపాదించిన స్వయం పాలనా విధానం ప్రజలకు సమానత్వాన్ని పంచి యిచ్చేదిగా లేకపోగా బ్రాహ్మణులను శక్తిమంతులు చేసేదిగా వుంది. బ్రాహ్మణుల ఏకఛత్రాధిపత్యానికి రాజకీయాధికారం తోడైతే బ్రిటీష్ రాజరిక వ్యవస్థకు అది బెడదగా పరిణమిస్తుంది. భారతదేశ వాసుల పురోగమనాన్ని కుంటుపరుస్తుంది. బ్రిటీష్ పాలకులు అందరికందరూ బ్రాహ్మణేతరుల వాదన ఏమిటో తెలుసుకోనేందుకు కించిత్తు ఆసక్తి కూడా కనపరచలేదు. కనీసం బ్రిటీష్ ప్రజలైనా వారి పట్ల సానుభూతి కనపరచగలరని వారు ఆశిస్తున్నారు. అంబేద్కర్ దీనికి సంబంధించి చెప్పేది ఓపికగా విని, అవసరమైన సహాయం అందచేయగలరని ఆశిస్తున్నాను" అని సాహూ మహరాజ్ దేశ స్థితిగతులపై తన అవగాహనను ఆ బ్రిటిష్ పెద్ద మనిషి ముందు పెట్టారు.

అయితే ఈ లేఖలలోని అంశాలు అంబేద్కర్‌ను ప్రభావితం చేయలేకపోయాయి. మొదటి ఉత్తరానికి సమాధానంగా ఆయన బ్రిటిష్ న్యాయవాదులు చేయగల సహాయం ఏమి వుండదని , కొత్త సమస్యలు ఉత్పన్నం కావడానికి మాత్రమే అది దోహదం చేస్తుందని సాహు మహరాజ్‌కు తన అభిప్రాయాన్ని బట్వాడా చేశారు. సర్ ఆల్ఫ్రెడ్ పీస్‌ను కలుసుకోవడం కూడా తనకు కుదరదని మరో లేఖలో అంబేద్కర్ స్పష్టం చేశారు. ఇంతలో బ్రాహ్మణేతర ఉద్యమం నలుదిశలా వ్యాపిస్తుంది. కుల వ్యవస్థ దుష్ప్రభావం సమాజంపై పూర్తిగా తొలగనంత

వరకు బ్రిటిష్ ప్రభుత్వం రక్షణ, మార్గదర్శకత్వం దేశానికి అవసరమని బ్రాహ్మణేతర ఉద్యమం నినదించింది. జాతీయోద్యమాన్ని తిప్పి కొట్టే స్థాయికి చేరిన బ్రాహ్మణేతర ఉద్యమం జాతీయవాద వ్యతిరేక భావ స్రవంతిలో కలవడం బ్రిటిష్ సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయోద్యమానికి శరాఘాతం వలే పరిణమించింది. సాహూ మహరాజ్ బొంబాయిలో 1922 మే నెల 5వ తేదిన కన్ను మూయడంతో బ్రాహ్మణేతర ఉద్యమం వెనకడుగు వేసింది.

బొంబాయి నగరం 1943 జనవరిలో అంబేద్కర్‌కు ఘనంగా స్వాగతం పలికింది. పౌర సన్మాన సభలో మాట్లాడుతూ బ్రాహ్మణేతర రాజకీయోద్యమ పార్టీ బొంబాయి, మద్రాసు రాష్ట్రాలలో మాత్రమే బలంగా వున్నదని, అందువలన దేశప్రజలను అది వారి గమ్య స్థానం దిశగా నడపలేదని వ్యాఖ్యానించాడు. ఉద్యమ వైఫల్యానికి గల కారణాలను ఆయన ఈ సభలో విశ్లేషించారు. తమ వారికి ప్రభుత్వంలో ఉద్యోగాలు ఇవ్వడానికి తమ అధికార పదవులను బ్రాహ్మణేతర ఉద్యమ నాయకులు వాడుకున్నారని, తద్వారా ఉద్యమ లక్ష్యాలను మలినపరిచారని ఆయన దండెత్తారు. ఉద్యమ వైపల్యానికి ప్రథమ కారణం నాయకుల స్వార్థపరత్వమేనని ఆయన తేల్చి చెప్పారు. ఉద్యమ నేతలకు సరైన విధానాలు కాని, కార్యక్రమాలు కాని లేవని, ఈ ఉద్యమ నాయకులు తమ మూలాలను మరిచిపోయి విదేశీ పాలకుల విధానాలను నిర్లజ్జగా అవలంబించారని, తద్వారా వారిలో దురహంకారం అతిశయించిందని అంబేద్కర్ నాటి కఠిన వాస్తవాలను ముక్కుసూటిగా ప్రజల ముందు వుంచారు. 1946 సెప్టెంబర్‌లో మద్రాసులో ఇచ్చిన ఉపన్యాసంలో బ్రాహ్మణేతర పార్టీ సభ్యులు రెండో తరగతి బ్రాహ్మణులుగా మారడానికి చేస్తున్న ప్రయత్నాలను ఎండగట్టారు. బ్రాహ్మణేతర ఉద్యమకారులు బ్రాహ్మణవాదాన్ని విసర్జించలేదని, అది వారికి ఉన్నతాదర్శంగా వున్నదని ఆయన విమర్శించారు. బ్రాహ్మణేతర పార్టీకి ఉత్తములైన నాయకుల అవసరం వున్నదని, బలమైన నిర్మాణంతో పాటు, స్పష్టమైన భావజాలాన్ని కూడా ఆ పార్టీ సమకూర్చుకోవలసివున్నదని ఆయన అభిప్రాయపడ్డారు.

బ్రిటిష్ పాలన ఒక వైపు, పాశ్చాత్య ఉదారవాద, హేతువాద భావజాలం మరో వైపు సంప్రదాయేతర స్ఫూర్తిని అందిస్తున్న సరికొత్త చారిత్రక సన్నివేశంలో కుల వ్యవస్థను నిలదీస్తూ హిందూ సమాజానికి చెందిన అట్టడుగు శ్రేణుల నుంచి వచ్చిన స్పందనగా ఈ ఉద్యమాన్ని అంబేద్కర్ దర్శించారు. మిత వాదాన్ని అమితంగా ఒంట పట్టించుకున్న బ్రాహ్మణేతరులు కాంగ్రెస్ పార్టీలో చేరిపోయి అనతి కాలంలోనే దానిపై పెత్తనం చెలాయించసాగారు. అనేక సంవత్సరాల పాటు బ్రాహ్మణేతరులలో ఫూలే భావాలు వ్యాప్తి చెందలేదు. కాని భావి ప్రభుత్వ రూపానికి, దాని నిర్మాణానికి సంబంధించి మాంటేగ్ ప్రజలను, ప్రభుత్వంలో బాధ్యులుగా వున్న వారిని సంప్రదించేందుకు 1916లో దేశంలో కాలు పెట్టినది ఆదిగా కుల చైతన్యం అకస్మాత్తుగా పదునుదేరింది. బ్రాహ్మణేతర ఉద్యమంతో పాటు 1930వ దశాబ్దంలో ఆర్థిక మాంద్యం పైనబడి ఉక్కిరిబిక్కిరి చేయడంతో బ్రాహ్మణులు గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వలస పోవడం ప్రారంభమైంది. సంపన్నులు, విద్యావంతులైన బ్రాహ్మణేతర కులాలకు చెందిన వారు సాంస్కృతీకరణం ద్వారా తమ జీవన విధానాన్ని ఒక వైపు

మార్చుకుంటుంటే మరో వైపు బ్రాహ్మణులలో పాశ్చాత్యీకరణ చెందే క్రమం ప్రారంభమైంది. సమాజంలో వచ్చిన ఈ కొత్త కదలిక మూలంగా బ్రాహ్మణేతర కులాలకు చెందిన వారు ప్రత్యేక హక్కులు, రాయితీలు విరివిగా పొందారు. అదే సమయంలో వివక్షాపూరిత విధానాలు అనేక రాష్ట్రాల పాలనా యంత్రాంగంలో అంతర్భాగమైపోయాయి. ఈ క్రమంలో తరతరాలుగా సొంత భూమి కలిగి వున్న ఆధిపత్య కులాలు ప్రధానంగా లబ్ధి పొందాయి.

బ్రాహ్మణేతర ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు అంబేద్కర్ ప్రయత్నించిన మాట నిజమే అయినా, బ్రాహ్మణుల 'గుణగణాల'ను, కాలానుగుణంగా తమ విధానాలను మార్చుకొనే వారి లౌక్యాన్ని గుర్తించడంలో ఆయన చూపు గురితప్పలేదు.

"మీరు ఎల్లప్పుడూ బ్రాహ్మణులను నిందిస్తుంటారు. కాని వారి సుగుణాలను మాత్రం అనుకరించరు. బ్రాహ్మణులు తమ భావాలను ఎప్పటికప్పుడు పరిస్థితులకు అనుగుణంగా మార్చుకుంటూ పోతారు. వాళ్లు ఏకకాలంలో జ్ఞానాన్ని, ధనాన్ని ఆర్జిస్తుంటారు. గుర్తు పెట్టుకోండి! బ్రాహ్మణులకు మెదళ్ల లోపల మెదళ్లు వున్నాయి. బ్రాహ్మణులతో పోట్లాడాలనుకుంటే వారికన్నా ఎక్కువ తెలివితేటలు మీకు వుండాలి. మీరు ఐక్యం కారు, కాలేరు. కాకపోగా మీలో మీరే తన్నుకు చస్తారు. 'మరాఠాల కన్నా మహర్లు తక్కువ స్థాయి వారు' వంటి విషగుళికలను బ్రాహ్మణులు ఇస్తే సంతోషంగా వాటిని ఆరగిస్తారు" అంటూ శూద్ర అగ్ర కులాలకు చెందిన వారిపై వ్యంగ్యాస్త్రాలను అంబేద్కర్ సంధించారు.

చెరువు నుంచి మంచినీటిని తెచ్చుకునే హక్కు కోసం 1927లో సాగిన మహద్ సత్యాగ్రహం సందర్భంగా బ్రాహ్మణులు సత్యాగ్రహంలో పాల్గొనకుండా చూడవలసిందిగా బ్రాహ్మణేతర ఉద్యమ నాయకులు జెధే, జావల్కర్ అంబేద్కర్‌ను కోరుతారు. కాని వారి కోరికను ఆయన మన్నించలేదు. బ్రాహ్మణులందరిని అంటరానివారి శత్రువులుగా భావించడం సమంజసం కాదని ఆయన వారి ముఖాల మీద తన మనస్సులోని మాటను దాచుకోకుండా చెప్పాడు. బ్రాహ్మణవాదం బోధించే ఉన్నత నిమ్న కులాల సిద్ధాంతాన్ని అణువణువునా నిండివున్న వారిని, వారెవరైనా కావచ్చు ఆయన తీవ్రంగా అసహ్యించుకునేవారు. ఎందుకంటే ఈ భావనే మనుషుల మనస్సులో అశుచి వంటి భావాల్ని నాటుకునేలా చేసింది. అసమానతలను పెంచి పోషించింది. బ్రాహ్మణేతర నాయకులకు లక్ష్యసాధన పట్ల నిబద్ధత లేదని పూలే ఆశించిన విధంగా బ్రాహ్మణేతర కులాలకు సమాన ఛాయ కల్పించడంలో వారు విఫలమయ్యారని అంబేద్కర్ వ్యాఖ్యానించారు. మరాఠాలు ఆధిక్యతా భావంతో ఇతరుల కన్నా తాము అధికులమని చాటుకునేందుకు ప్రయత్నించడాన్ని ఆయన తప్పు పట్టారు. పార్టీ కార్యక్రమాలలో సైతం మరాఠాలు, మరాఠాలు కాని వారికి మధ్య దూరం క్రమంగా పెరిగిపోయింది. విద్యా సదస్సులలో సైతం అంటరానివారిని మైల భయంతో విడిగా, దూరంగా కూర్చోపెట్టడం ఆనవాయితీగా మారిపోయింది. ఎన్నికలలో మరాఠా అభ్యర్థులకే ఓటు వేయవలసిందిగా బి.వి. జాదవ్ వంటి బ్రాహ్మణేతర నాయకులు ప్రజలను కోరడం ఈ విపరిణామాన్నే సూచిస్తున్నది. అంటరాని వారికి ఆ ఉద్యమంలో స్థానం లేదని చివరికి తేలిపోయింది. అందువల్లే అంటరానివారు బ్రాహ్మణేతర ఉద్యమం పట్ల ఆకర్షితులై కూడా దానిలో మమేకం కాలేకపోయారు.

బొంబాయి శాసనమండలిలోని బ్రాహ్మణేతర సభ్యులు 1927లో అస్పృశ్యత నివారణకు ప్రవేశపెట్టిన బిల్లును వ్యతిరేకించడం గమనార్హం. ఉన్నత తరగతికి చెందిన మరాఠాలు అంటరానివారిని తమతో సమానంగా చూడలేకపోయారు మహద్ సత్యాగ్రహంలో పాల్గొన్న అంబేద్కర్‌కు మరాఠాలు తమ మద్దతు తెలుపలేదు మహర్లకు భూమిపై హక్కు (వతన్) కల్పించే బిల్లును మరాఠాలు వ్యతిరేకించినందు వలన వారి పట్ల ఆయన తీవ్ర అసహనాన్ని కనపరిచేవాడు. రాజకీయంగా ఇతరులందరి కన్నా మరాఠాలు వెనుకబడి వుండేవారు. వారిలో ఒక తిలక్, ఒక గోఖలే, ఒక రాణడే లేకపోవడమే ఇందుకు నిదర్శనమని అంబేద్కర్ వ్యాఖ్యానించారు.

'సత్య శోధక్' పత్రికకు ఆ సంస్థ 16వ సదస్సు సందర్భంగా పంపించిన సందేశంలో "జ్యోతిబా స్మృతిని బ్రాహ్మణేతరులు పూర్తిగా తుడిచివేస్తున్నారు ఆయన బోధించిన సిద్ధాంతాలకు నిస్సిగ్గుగా ద్రోహం చేస్తున్నారు" అన్నారు అంబేద్కర్ . బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమం అంటరానివారి ప్రయోజనాలకు పెద్ద పీట వేసి వారికి న్యాయం జరగాలని ఘోషించడం ద్వారా, అంబేద్కర్‌ను సమర్థించడం ద్వారా పురోగామి శక్తిగా నిలిచినప్పటికీ ఆ ఉద్యమ నాయకులు ఉద్యమాన్ని తమ సంకుచిత ప్రయోజనాల కోసం వాడుకున్నారు అంటరానివారిని ఉద్యమ పరిధికి ఆవల పెట్టారు పూలే రచనలతో ఉత్తేజం పొందిన అంబేద్కర్ ఆయన అనుయాయుల చేతలతో విభేధించారు. పూలే పేరు చెప్పి బ్రాహ్మణేతర ఉద్యమాన్ని మత తత్వ సంఘ వ్యతిరేక మార్గాలలో నడిపించడాన్ని ఆయన జీర్ణించుకోలేకపోయారు.

## సెక్షన్-5

### హిందూ స్మృతి

భారతదేశంలో మానవ సంబంధాలకు చెందిన అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని ఉమ్మడి చట్టం వుండేది. రాజ్యాంగ సభలో దీనికి సంబంధించిన సంక్లిష్టతలను అంబేద్కర్ వివరించారు.

> "మనకు ఉమ్మడి నేర స్మృతి ఉంది. ఆస్తి బదిలీ చట్టం, సెలవు దినాల చట్టం వంటి అన్ని చట్టాలు దేశ వ్యాప్తంగా ఒకే విధంగా వున్నాయి. దీనిని బట్టి పౌరస్మృతి కూడా ఒకే విధంగా దేశానికి అంతటికీ వర్తించే విధంగా వుందనిపించవచ్చు. కాని ఉమ్మడి పౌర స్మృతి చొరబడలేని అంశాలు రెండు వున్నాయి. ఒకటి వివాహం, రెండు వారసత్వం."

దేశ వ్యాప్తంగా ముస్లిం పౌర స్మృతి ఏక శిలా సదృశ్యంగా వున్నదన్న అభిప్రాయాన్ని ఆయన సవాల్ చేశారు. వాయువ్య భారత రాష్ట్రాలలో 1935 దాకా షరియత్ చట్టం వర్తించలేదు. అప్పటి వరకు అక్కడ హిందూ స్మృతి అమలులో వుండేది. 1939లో కేంద్ర చట్ట సభ

షరియత్ చట్టాన్ని శాసనం చేసి ఆ రాష్ట్రాలకు అన్వయింపచేసింది. 1937లో ఈ చట్టాన్ని దేశంలోని మిగిలిన అన్ని ప్రాంతాలకు అన్వయింపచేశారు. ఉత్తర మలబార్ ప్రాంతంలో ముస్లింలు మాతృస్వామ్య చట్టాలను పాటించేవారు. "పౌరస్మృతి కర్తలు తమకు అన్యాయం చేశారని అనే అవకాశం లేదు. తమ మత విశ్వాసాలపై దౌర్జన్యం జరిగిందని ముస్లింలు భావిస్తారనే భయానికితావు లేదు." అన్నారు అంబేద్కర్.

హిందూ స్మృతి ప్రస్తుత చట్టంలో కొత్తగా నాలుగు అంశాలను మాత్రమే ప్రవేశపెట్టింది. అవి, 1, పుట్టుక ద్వారా సంక్రమించే హక్కులను రద్దు చేయడం. 2, మహిళలకు ఆస్తిపై పూర్తి హక్కు కల్పించడం. 3, కూతురికి వాటా ఇచ్చే హక్కు కల్పించడం. 4, మహిళలకు విడాకులు తీసుకునే హక్కు కల్పించడం. ప్రస్తుత హిందూ చట్టంలో కొత్తగా వచ్చి చేరిన ఈ అంశాలలో సంఘ వ్యతిరేక, మత వ్యతిరేక కోణం ఏమీ లేదు.

దత్తతకు సంబంధించిన చట్టం అస్తవ్యస్తంగా వుండేది. దేశం మొత్తానికి ఒకే విధంగా వర్తించే హిందూ చట్టం ఏదీ లేనందు వలన దత్తత చట్టం వలన అనేక సమస్యలు తలెత్తేవి. వివాహ చట్టం కూడా ఒక విధంగా లేదు. హిందూ చట్టం హిందువులందరికీ ఉమ్మడిగా లేదనే విమర్శ తరచు వినిపించేది.

హిందూ చట్టంలోనున్న అసంబద్ధతలను, అస్పష్టతలను, చాపల్యాలను చక్కదిద్దడం ఎలా అన్న ప్రశ్న ఇక్కడ ఉత్పన్నమవుతుంది. ఇప్పటిదాకా ఇందుకు మనం శాసనసభ జోక్యాన్ని కోరుతున్నాం. ఈ పరిస్థితులలో క్రోడీకరణ ఒక్కటే సరైన మార్గంగా మనముందు వుంది. ప్రసిద్ధ న్యాయ శాస్త్రవేత్తలు కూడా క్రోడీకరణనే సమర్థిస్తున్నారు. డా॥ పి.వి.కానే కూడా దీనికే మద్దతు పలికారు. హిందూ చట్టం క్రోడీకరణ అలంకార ప్రాయం కాదు. అదొక ఆవశ్యకత. హిందూ సమాజాన్ని బలోపేతం చేయడం ఉమ్మడి స్మృతి ఉద్దేశం. ఉమ్మడి స్మృతి హిందువులందరికీ వర్తించేదిగా వుంటుంది.

లింగ, కుల ప్రాతిపదికలపై భారతీయ పౌరుల మధ్య వివక్ష వుండదని రాజ్యాంగం మనకు ఇచ్చిన స్పష్టమైన హామీని ఈ క్రోడీకరణ ప్రక్రియ పరిపూర్తి చేస్తుంది. అస్పృశ్యతను రాజ్యాంగం రద్దు చేసింది. కొత్తగా ప్రవేశపెట్టే అంశాలన్నింటికి రాజ్యాంగపరమైన ఆమోదం కల్పించడానికి ఉమ్మడి స్మృతి తోడ్పడుతుంది. రాజ్యాంగ సూత్రాల మేరకు ప్రస్తుత స్మృతికి చట్ట రూపం ఇవ్వడం తప్పనిసరి అని అంబేద్కర్ వాదించారు. హిందూ స్మృతి ప్రాచీన కాలపు వివిధ స్మృతులకు లోబడి వున్నది. హిందూ చట్టంలో కాలానుగణంగా మార్పులు వచ్చాయని చెప్పడానికి వేరు వేరు స్మృతులు సాక్ష్యంగా వున్నాయి. ప్రస్తుత హిందు చట్టం కాలాతీతమైనది కాదని, దైవ సంకల్పానికి అది లోబడి లేదని ఖచ్చితంగా చెప్పవచ్చు.

మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే హిందూ స్మృతి రాజ్యాంగ సూత్రాలకు అనుగుణంగా వుంది. పుట్టిన ప్రదేశాన్ని బట్టి పౌరుల మధ్య రాజ్యాం వివక్ష కనపరచరాదని 15వ అధికరణ చెపుతున్నది. రాజ్యాంగంలో పొందు పరిచిన ప్రాథమిక హక్కులకు విరుద్ధంగా

హిందూ చట్టంలో ప్రస్తుతం వున్న కొన్ని అంశాలను చక్కదిద్ది, దానిని రాజ్యాంగానికి అనుగుణంగా మరల్చడమే ఉమ్మడి స్మృతి లక్ష్యం. యావత్తు ఆధునిక ప్రపంచం క్రోడీకరణ దిశగా అడుగులు వేస్తున్నది. అంతర్జాతీయ చట్టాన్ని క్రమబద్ధంగా అభివృద్ధి చేసి క్రోడికరించడాన్ని ప్రోత్సహించాలని ఐక్యరాజ్యసమితి హక్కుల ప్రకటనలోని (చార్టర్) 13వ అధికరణం పేర్కొంది.

సర్ బి.ఎన్. రావు ఛైర్మన్‌గా భారత ప్రభుత్వం 1941లో హిందూ చట్ట కమిటీని నియమించింది. హిందూ చట్టాన్ని దశల వారీగా క్రోడీకరించాలని, రావు కమిటీ ప్రభుత్వానికి సిఫార్స్ చేసింది. కమిటీ ఇందుకు సంబంధించిన బిల్లును 1943, 47 సంవత్సరాలలో కేంద్ర చట్ట సభలలో ప్రవేశపెట్టినప్పుడు సంప్రదాయ హిందువుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. రాజ్యాంగ నిర్మాణ పనికి హిందూ చట్టం క్రోడీకరణ కొనసాగింపు మాత్రమే. రాజ్యాంగ రచనా కమిటీ చైర్మన్‌గా అంబేద్కర్ ప్రతిపాదిత క్రోడీకరణ పట్ల అమితమైన శ్రద్ధ వహించారు. క్రోడీకరణకు సంబంధించిన సెలెక్ట్ కమిటీలో అంబేద్కర్ కాక మరో 16 మంది సభ్యులు వుండేవారు. ఈ కమిటీ హిందూ చట్టంలోని కొన్ని అంశాలను సవరించి క్రోడీకరించాలని సిఫారసు చేస్తూ 1948 ఆగస్టు 12 న భారత రాజ్యాంగ సభకు ఒక నివేదిక సమర్పించింది. ఈ నివేదిక మొత్తం తొమ్మిది భాగాలుగా వుంది. పీఠిక, వివాహం - విడాకులు, దత్తత, మైనారిటీ తీరని వారి సంరక్షణ బాధ్యత, ఉమ్మడి కుటుంబ ఆస్తి, మహిళల ఆస్తి, వారసత్వం, జీవన భృతి ఏర్పాటు తదితర అంశాలు ఇందులో వున్నాయి.

హిందూ చట్ట కమిటీ సిద్ధం చేసిన హిందూ స్మృతి బిల్లును అనుసరిస్తు ప్రభుత్వం ఒక బిల్లును రూపొందించి చట్ట సభలో 1947 ఏప్రిల్ 11న ప్రవేశపెట్టింది. బిల్లులను కొనసాగించవలసిందిగా కోరుతూ ఒక తీర్మానాన్ని సభ అదే ఏడాది నవంబర్ 17న ఆమోదించింది. అంబేద్కర్ ఈ సందర్భంగా చేసిన కొన్ని వ్యాఖ్యలను ఇక్కడ పరిశీలిద్దాం.

> "నేను సంప్రదాయవాదినైతే కావచ్చు. కానీ మహిళలకు విడాకులు తీసుకునే హక్కు కల్పించవలసిందే. అయితే ఆ హక్కును తప్పుడు ప్రయోజనాల కోసం, దుర్వినియోగం చేయకూడదు. అలా చేయకుండా వుండేందుకే ఆ హక్కు నుపయోగించడానికి కొన్ని ఆంక్షలను సూచించడమైనది. "

ఈ వ్యాఖ్యకు వివరణ అవసరం లేదు. విడాకుల హక్కు దుర్వినియోగం కాకుండా నివారించడానికి విడాకుల దరఖాస్తు జిల్లా జడ్జికి పెట్టుకోవాలనే సూత్రాన్ని బిల్లును ఆయన పొందుపరిచారు. ప్రముఖ హిందూ మహిళ నాయకురాళ్లు ఎవరికీ మహిళల సామాజిక పురోగతి పై నిజమైన ఆసక్తి లేదని అంబేద్కర్ ఫిర్యాదు చేస్తారు. స్మృతులు విధించిన పరిమితులకు లోబడి ఆయన విడాకుల చట్టాన్ని రూపొందించారు. అందుకే స్మృతులు పురుషులకు కల్పించిన హక్కులన్నీ ఈ బిల్లులో యధాతధంగా చోటు చేసుకున్నాయి. మహిళలు సామాజికంగా ముందంజ వేయడానికి చట్టపరంగా వున్న అవరోధాలను తొలగించడమే ఈ

బిల్లు ముఖ్యోద్దేశం అని ఆయన చెప్పుకున్నారు. అయితే చివరికి ఆయనే బిల్లు నిష్ఫలత్వాన్ని ఈ క్రింది మాటలలో వ్యక్తం చేశారు. "చేదు ఆమ్లం కలిపితే పాడైపోయిన పాల మాదిరి హిందూ స్మృతి బిల్లు వున్నదని ఆయన వ్యాఖ్యానించారు."

హిందూ స్మృతి బిల్లును సంప్రదాయ వర్గాలు వ్యతిరేకించాయి. పాలక పక్ష వర్గాలు ఈ విషయమై రెండుగా చీలిపోవడంతో బిల్లు భవితవ్యం తేలకుండా వుండిపోయింది. కాంగ్రెస్ పార్టీ ఈ బిల్లుకు మద్దతు ప్రకటించలేదు. బిల్లుపై స్వేచ్ఛగా ఓటు వేయడానికి కాంగ్రెస్ సభ్యులకు ప్రధాని అనుమతి ఇచ్చారు. ఓటింగ్‌లో బిల్లు వీగిపోయింది. అప్పుడు ప్రభుత్వం దానిని ఉపసంహరించుకుంది. కేంద్రం మంత్రి వర్గం నుంచి అంబేద్కర్ రాజీనామాకు ఈ పరిణామాలు కారణమయ్యాయి.

## సెక్షన్-6

### సామాజిక కార్యరంగం - సామాజిక దృక్కోణం

మాటకు, చేతకు మధ్య సమన్వయం వుండాలని విశ్వసించిన అంబేద్కర్ తాను చెప్పిన దానిని ఆచరణలో పెట్టేందుకు చిత్త శుద్ధితో కృషి చేశారు. "ఏదీ నిశ్చలంగా లేదు. ఏ ఒక్కటీ శాశ్వతం కాదు. సనాతనమైనదంటూ ఏదీ లేదు. ప్రతిదీ మార్పుకు లోనవుతున్నది. మార్పు వ్యక్తుల జీవితాలనే కాక సమాజ జీవితాన్ని కూడా శాసిస్తున్నది. పరివర్తన జీవన సూత్రం." గతి తత్వానికి ఆయన ఇచ్చిన నిర్వచనం ఇది. జీవితంలోని ప్రతి అంశాన్ని, నైతిక విలువలు, మతం వంటి అంశాలతో సహా వాటి మనుగడ ప్రమాణంగా విలువ కట్టాలని ఆయన భావించారు.

మనిషి వర్తమానంలో పడుతున్న బాధలకు, కష్టాలకు గత జన్మలో చేసిన కర్మలు కాదని, జీవన స్థితిగతులే పేదరికానికీ, దు:ఖానికీ పూర్తిగా కారణమని అంబేద్కర్ పేర్కొన్నారు. మనిషి దుస్థితికి కారణం ఆ మనిషి మాత్రమే కాదు, అతని సామాజిక స్థితిగతులు అందుకు అంతే బాధ్యత వహిస్తాయి. "ఆదర్శ సమాజంలో ఎన్నెన్నో ప్రయోజనాలను పరస్పరం పంచుకోవడం జరుగుతుంది. సమిష్టి సామాజిక పరస్పరాశ్రితతత్వం ఆ సమాజంలో మానవ జీవనానికి ఇరుసుగా వుంటాయన్నారు అంబేద్కర్.

అంబేద్కర్ సామాజిక అంతర్ చైతన్యానికి అమిత ప్రాముఖ్యం ఇచ్చారు. అన్ని హక్కులను అవి ప్రాధమికమైనవైనా, ప్రాధమికం కానివేనా సామాజిక అంతర్ చేతనం (అంతరాత్మ) మాత్రమే రక్షించగలదు. అధికార బధిరాంధులు చేసే తప్పుడు పనులు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసే శక్తి సామాజిక అంతర్ చేతన వున్నవారికే సాధ్యమవుతుంది. మనుషుల మధ్య సమన్వయ సాధనను ఆయన తన లక్ష్యంగా పెట్టుకున్నారు. మనుషులు కేవలం మనుగడలో వున్నంత మాత్రాన సరిపోతుందని ఆయన ఎన్నడు భావించలేదు. సమాజం నుంచి గౌరవాన్ని ఇతరులతో సమానత్వాన్ని పొందుతూ అన్యాయానికి తావు లేని విధంగా జీవించాలని ఆయన

ఆశించారు. గౌరవం, ఉన్నత లక్ష్యం, ఆత్మగౌరవం, తోటి మనిషి మీద, సమాజం మీద, దేశం మీద అనురక్తి లేని జీవితం ఏ మనిషికైనా అత్యంత అవమానకరమైనదని ఆయన విశ్వసించారు.

సామాజిక స్థిరత్వం నెలకొని ఉన్నప్పుడే రాజకీయాధికారం, సైనిక శక్తి ఉనికికి ముప్పు వాటిల్లదని, విభిన్న సామాజిక సమూహాల మధ్య సర్దుబాటు ధోరణి పాదుకున్నప్పుడే సామాజిక స్థిరత్వం సాధ్యమని అంబేద్కర్ భిన్న వర్గాల మధ్య సమానత్వం, కలిసిపోయేతత్వం వుంటేనే సామాజిక పురోగతి సాధ్యపడుతుందని, సామాజిక పురోగతి లేని నాడు సామాజిక స్థిరత్వం ఎండమావి అవుతుందని ఆయన పేర్కొన్నారు. "స్థిరత్వం కావాలసిందే. కాని, మార్పును ఫణంగా పెట్టి కాదు. సర్దుబాటు ధోరణి వుండవలసిందే కాని సామాజిక న్యాయాన్ని పక్కన పెట్టి కాదు" అని వ్యాఖ్యానించారు అంబేద్కర్. సామాజికుల ధృక్పథాన్ని సామాజిక స్థిరత్వం అనుసరిస్తుంది. సామాజిక సుస్థిరత్వ సాధన కుదిరిందంటే దాని అర్థం భారతీయ సమాజంలో కులవ్యవస్థ తన ఉనికిని కోల్పోయినట్లేనని భావించాలి. కుల వ్యవస్థ ఇంకా నేటికి బలంగా వున్నది కాబట్టే మన సమాజంలో సామాజిక సంఘీకభావం, ఐక్యత సుదూర స్వప్నంగానే వున్నాయి.

చెరువు నీటి కోసం మహద్ సత్యాగ్రహం, మనుస్మృతి దగ్ధం, దేవాలయ ప్రవేశం కోసం కాలారాం మందిర్ సత్యా గ్రహం వంటివి అంబేద్కర్ చేపట్టిన ఉద్యమాలలో ముఖ్యమైనవి. ఈ సత్యాగ్రహాలు చేపట్టడానికి గల కారణాలను ఆయన ఈ విధంగా వివరించారు.

> "సత్యాగ్రహం చేస్తే సమస్యలన్నీ పరిష్కారమైపోతాయని కాదు. అగ్రకుల హిందువులను ఆలోచింపచేయడమే వీటి ఉద్దేశం. తోటి మనుషులను మనుషులుగా ఈ అగ్ర కులస్థులు చూసేదీ, లేనిదీ ఋజువు చేసేందుకు ఈ సత్యాగ్రహ ఉద్యమాలు తోడ్పడతాయి. వారి హృదయ పరివర్తనే ఈ సత్యాగ్రహాల ఏకైక లక్ష్యం. మారిన కాలమాన పరిస్థితులకు అనుగుణంగా హిందువుల దృష్టి కోణం మారిందీ, లేనిదీ తెలుసుకునేందుకు, లోకానికి తెలియజేసేందుకు ఈ ఉద్యమాలు ఉపకరిస్తాయి."

దేవాలయ ప్రవేశ ఉద్యమం గురించి ఆయనేమన్నారో ఇప్పుడు చూద్దాం. "దేవాలయంలోకి ప్రవేశార్హత కలిగితే చాలని భావించడం హిందు మతం తాలూకు దుష్టత్వంతో రాజీ పడటమే. అంటరాని వారిలో నిక్షిప్తమై వున్న పవిత్రతను మారు బేరానికి అంగట్లో పెట్టడమే" అన్నారు ఆయన. దేవాలయ నిర్మాణం కన్నా అంటరానితనాన్ని పారద్రోలడం ముఖ్యమని ఆయన అభిప్రాయపడ్డారు.

అఖిల భారత అణగారిన జాతుల సంఘం తొలి సదస్సులో 1930 ఆగస్టు 8న సంస్థ అధ్యక్షుని హోదాలో హిందూ ఆధిపత్య శక్తులకు అపరిమితమైన అధికారాలు దఖలు పరిచే వాతావరణం నెలకొనడం పట్ల అంబేద్కర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగంలో అట్టడుగున వున్న అంటరాని వారికి చాలినన్ని రక్షణలు నిర్దిష్టంగా కల్పించాలని, జనాభా దామాషా ప్రాతిపదికపై శాసన మండలులలో వారికి ప్రత్యక్ష ప్రాతినిధ్యం వుండాలని ఆయన తన ప్రసంగంలో డిమాండ్ చేశారు. అణగారిన జాతుల ఉద్యమం ఫలితంగా అంటరాని వారికి సామాజిక విముక్తి సిద్ధిస్తుందని, ప్రతి మనిషికీ జీవితంలోని అన్ని రంగాలలో - రాజకీయ, సాంఘిక, ఆర్థిక రంగాలతో సహా సమానమైన విలువ ఉండే నూతన సమాజం ఏర్పాటుకు దోహదం చేస్తుందని ఆనాటి సదస్సులో వేదికపై నుంచి అంబేద్కర్ గొప్ప ఆశావహ ప్రకటన చేశారు.

బొంబాయి ప్రెసిడెన్సీలోని అణగారిన వర్గాలు, ఆదివాసి జాతుల సాంఘిక ఆర్థిక స్థితిగతులను, విద్యారంగంలో వారి వెనుకబాటుతనాన్ని అధ్యయనం చేసి వారి అభ్యున్నతికి చేపట్టవలసిన చర్యలను సిఫార్సు చేసేందుకు ఒక కమిటీని నియమించవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ డా॥ పి.జి. సోలంకి చేసిన తీర్మానం మేరకు బొంబాయి ప్రభుత్వం ఎస్.టి. ఆర్తే అధ్యక్షతన కమిటీని నియమించింది. ఎ.వి.తక్కర్ , అంబేద్కర్, సోలంకి ప్రభృతులు ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ 1930 మార్చిలో నివేదిక సమర్పించింది. అణగారిన జాతులకు చెందిన ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉపకార వేతనాలు పెంచాలని, వసతి గృహాల సంఖ్య కూడా పెంచాలని, రైల్వే వర్క్ షాపులలో, మిల్లులలో శిక్షణలో వున్న ఐటిఐ అప్రెంటిస్‌లకు ఉపకారవేతన సదుపాయం కల్పించాలని, విదేశాలలోని ఇంజనీరింగ్ సంస్థలు, పరిశ్రమలలో ఉన్నత విద్యలు అభ్యసించడానికి వెళ్ళిన వారికి ఉపకార వేతనం చెల్లించాలని, ఈ ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారిని నియమించాలని, పోలీస్ శాఖలోకి, సైన్యంలోకి అణగారిన వర్గాలకు చెందిన వారిని తీసుకోవాలని ఈ కమిటీ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఈ వర్గాలకు చెందిన వారి కోసం సాంఘిక, సాంస్కృతిక కార్యకలాపాలను నిర్వహించేందుకు సామాజిక కేంద్రాలను నెలకొల్పవలసిన అవసరాన్ని అంబేద్కర్ నొక్కి చెప్పారు.

1932 నాటి పూనా ఒడంబడికతో గాంధీజీ ఉపవాస దీక్ష ఒక కొలిక్కి వచ్చిన తర్వాత అంటరానితనం నిర్మూలనకు కాంగ్రెస్ ఉద్యమం విస్తృతమైంది. అస్పృశ్యులు, అణగారిన జాతులు వంటి మాటల బదులు హరిజనులుగా అంటరాని వారిని పిలువాలని కాంగ్రెస్ పార్టీ ఈ కాలంలోనే సూచన చేసి అమలుపరిచింది కూడా. హరిజనులనే (దేవుని మనుషులు) మాటకు అధికారికంగా గుర్తింపునిచ్చేందుకు బొంబాయి శాసనసభలో 1930వ సంవత్సరంలో ఒక బిల్లు ప్రవేశపెట్టారు. హరిజన్ అనే కొత్త మాట అస్పృశ్య అనే పాత మాటకు సమానార్థకమై పోయిందని, రెంటికీ మధ్య తేడా లేకుండా పోయిందని అంబేద్కర్ వ్యాఖ్యానించారు.

అంటరానివారు ఉనికిలో వుండటం అనే చేదు నిజానికి మసి పూసేందుకు చేసిన ప్రయత్నమే హరిజన్ అనే తీపి పేరు పెట్టడం అని ఆయన అన్నారు. గాంధీజీ ప్రారంభించిన హరిజన నిధి ధ్యేయం అగ్ర కుల హిందువులకు అంటరాని వారిని ముమ్ముందు కూడా బానిసలుగా వుంచడానికేనని ఆయన విమర్శించారు.

గాంధీజీ ఇంతలో అఖిల భారత స్థాయిలో అస్పృశ్యత వ్యతిరేక కూటమిని ఏర్పాటు చేశారు. పూనా ఒడంబడిక తరువాతి పరిణామాలు ఈ కూటమి (లీగ్) ఏర్పాటుకు నేపథ్యంగా నిలిచాయి. లీగ్‌లోని వేర్వేరు కమిటీలలో సభ్యులుగా అంటరానివారే అధిక సంఖ్యలో వుండాలని అంబేద్కర్ సూచించారు. అస్పృశ్యుల జనాభా వివరాలను సేకరించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయవలసిన అవసరం వున్నదని ఆయన అన్నారు. అణగారిన జాతుల అభివృద్ధికి లీగ్ చేపడుతున్న కార్యక్రమాలలో పటుత్వం సన్నగిల్లుతోందని ఆయన గాంధీజీకి ఫిర్యాదు చేశారు. లీగ్ కార్యక్రమాలు దేవాలయ ప్రవేశం, బంతి భోజనాలు వంటి నిరర్థకమైన పనులను కాకుండా ఆర్థిక, సాంఘిక, విద్యా రంగాలలో వారి అభివృద్ధికి ఉద్దేశించినవై వుండాలని ఆయన గాంధీజీకి సూచించారు. అస్పృశ్యతకు, పౌర హక్కుల సాధనకు ఉద్యమాన్ని చేపట్టవలసిందిగా లీగ్‌ను ఆయన కోరారు. హిందు సమాజంలో సాంఘిక విప్లవం రావాలంటే హక్కుల ఉద్యమం తప్పనిసరి అని ఆయన భావన. అణగారిన కులాల పట్ల వివక్షను పారదోలేందుకు పోరాడవలసిందిగా ఆయన లీగ్‌ను అభ్యర్థించారు. ఈ పనులు చేసేందుకు పూర్తి స్థాయి కార్యకర్తలను నియమించ వలసిన అవసరాన్ని ఆయన లీగ్ దృష్టికి తీసుకువెళ్ళారు.

ఈ లీగ్ పేరును గాంధీజీ కొద్ది రోజులకే 'హరిజన్ సేవక్ సంఘ్' గా మార్చారు. ఈ సంఘం కేంద్ర మండలి సభ్యునిగా వున్నప్పటికీ సమావేశాలకు అంబేద్కర్ ఏనాడూ హాజరు కాలేదు. స్థాపించిన నాటి లక్ష్యాలకు దూరమైపోవడం వలన ఆయన ఈ సంఘంతో సంబంధాలను తెగతెంపులు చేసుకున్నాడు. హరిజన్ సేవక్ సంఘ్ కార్యవర్గం నుంచి అణగారిన జాతుల నాయకులు, కార్యకర్తలను తొలగించడంతో ఆ వర్గానికి చెందిన నాయకులకు సంఘం ఉనికిపైనే సందేహాలు క్రమంగా తలెత్తాయి. సంఘం (ఒకనాటి లీగ్) ధ్యేయం అంబేద్కర్ ఉద్యమానికి మార్గం సుగమం చేయడం కాదని, ఆయన నాయకత్వాన్ని హరింపచేయడమేనని అణగారిన జాతుల నాయకులు అనేకమంది భావించారు. అస్పృశ్యతా నివారణ అనేది గాంధీజీకి ఒక వేదిక మాత్రమేనని, జరూర్‌గా చేయవలసిన కార్యక్రమం కాదని వారికి అర్థమైంది.

హరిజన్ సేవక్ సంఘ్ ఆచరణ సార్వజనీన మానవతావాద దృక్పథానికి లోబడి వుండేది. గాంధీజీ విశ్వసించి, ప్రవచించిన హృదయ పరివర్తన సిద్ధాంతంపై అది ప్రధానంగా ఆధారపడి పని చేసింది. అది కాంగ్రెస్ అనుబంధ సంస్థ వలే వ్యవహరించింది. కాంగ్రెస్ పార్టీకి భిన్నమైన, స్వతంత్రమైన కార్యరంగాన్ని అది ఎంచుకోలేదు. కాంగ్రెస్ కార్యకర్తలే సంఘ్ కార్యకర్తలుగా పని చేసేవారు. అంటరాని వారి అభ్యున్నతికి పోరాట పటిమతో, అంకితభావంతో పనిచేయగల శక్తివంతులైన నవతరం కార్యకర్తలను అది ప్రోత్సహించలేదు. అంతే కాదు

కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీల సంస్థలను అది నిర్మించనేలేదు. పైపెచ్చు అంబేద్కర్ నెలకొల్పిన రాజకీయ సంస్థలను అడుగడుగునా వ్యతిరేకించింది.

హరిజన్ సేవక్ సంఘ్ చేపట్టిన 'నిర్మాణాత్మక' కార్యక్రమం అస్పృశ్యులను' దయగా చంపే' పథకంగా మారిపోయే ప్రమాదం వుందని అంబేద్కర్ వ్యాఖ్యానించారు. సంఘ్ వ్యవహారాల నిర్వహణ ఆసాంతం కాంగ్రెస్ పార్టీకి చెందిన హిందువుల చేతిలోకి వెళ్లిపోయింది. సంఘ్ యాజమాన్య బాధ్యత నుంచి అంటరాని వారిని తప్పించడమే సంఘ్ పెద్దల విధానమని దిశా నిర్దేశం చేయగల వారికి యాజమాన్యంలో బాధ్యత లేకపోవడంతో సంఘ్ నిరర్థకమైపోయిందని అంబేద్కర్ ఆరోపించారు. ఆయన చేసిన ఈ ఆరోపణకు గాంధీజీ ఈ విధంగా స్పందించారు.

> "అస్పృశ్యత అనే పాపానికి ఒడికట్టినందుకు ప్రతిగా పాప పరిహారం చేసుకునేందుకు హిందువులు సంఘ్ సంక్షేమ కార్యక్రమాలను స్వీకరించారు. సంఘం మండలిలో సభ్యత్వం కోరే హక్కు నైతికంగా అంటరానివారికి లేదు కాక లేదు."

కానీ అంబేద్కర్ గాంధీ వైఖరిని నిరసించారు. హరిజన్ సేవక్ సంఘ్‌ను ఆయన రాజకీయ కర్మాగారంగా, అస్పృశ్యుల సేవా కేంద్రంగా అభివర్ణించారు. అంటరాని వారిని కాంగ్రెస్ పార్టీలోకి మళ్ళించడానికే సంఘ్‌ను నెలకొల్పారు కాబట్టి అది కేవలం కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంస్థ మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. సంఘ్ ప్రధాన కార్యదర్శిగా వున్న థక్కర్ మహర్ విద్యార్థులకు ఉపకారవేతనాలు ఇవ్వకూడదని ఏకంగా ఒక తీర్మానం చేయడాన్ని ఆయన ఖండించారు. మహర్లు కాంగ్రెస్ వ్యతిరేక రాజకీయాలలో పాల్గొంటున్నందువల్లే సంఘ్ వారిని ఈ విధంగా శిక్షించిందని, అంటరాని వారిని కాంగ్రెస్ పార్టీకి, హిందువులకు సేవకులుగా మార్చడమే సంఘ్ తన పనిగా పెట్టుకున్నదని అంబేద్కర్ ఈ సందర్భంగా నిశిత విమర్శలు చేశారు.

ముస్లింల మాదిరి అస్పృశ్యులు కూడా భారత జాతీయ జీవనంలో ఒక విశిష్టమైన సమూహం, హిందువులలో వారు అంతర్భాగం కాదనే ప్రతిపాదన అంబేద్కర్ రాజకీయాలకు పునాదిగా వున్నది. అందుకే హిందువుల నుంచి వేరుగా వారికి ఆయన ప్రత్యేక రాజకీయ హక్కులను కోరుకున్నారు. హరిజన సేవక్ సంఘ్ కార్యవర్గ సమితిలో అంటరాని వారికి ఒక్కరికీ సభ్యత్వం కల్పించినా అది బ్రాహ్మణవాదానికి మృత్యుఘాతమై వుండేదని, కార్యవర్గంలోకి వారిని తీసుకోకపోవడానికి గల కారణం ఇదేనని ఆయన అభిప్రాయపడ్డారు.

ఈ క్రమంలో అంబేద్కర్ సమతా సైనిక దళాన్ని ఏర్పాటు చేశారు. అసమానతలకు పట్టుకొమ్మలుగా వున్న ఆచార వ్యవహారాలను రద్దు చేయడం ఈ దళం ప్రధాన విధి. సంప్రదాయం పేరిట, సాంస్కృతిక వారసత్వం పేరిట, అమానుష లక్షణాలను పరిరక్షిస్తూ

పెంపొందించే అన్ని విలువలను పడదోయడం దీని లక్ష్యం. అంబేద్కర్ విమర్శకులు ఈ సంస్థ ఏర్పాటును వృధా ప్రయాసగా, ధన కాలాలను హరించే వ్యర్థ కలాపంగా పేర్కొన్నారు అయితే అంబేద్కర్ ఈ విమర్శలను ఖాతరు చేయలేదు సమాజంలో అసమానత అనేది సహజస్థితిగా మారిపోయిందని , పుట్టీ పుట్టడమే అసమానులుగా మనుషులు పుడుతున్నారని ఆయన ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. సామాజిక సమానత్వం పునాదిగా వున్నప్పుడే సుస్థిర సమాజం ఏర్పాటు సాధ్యపడుతుందనే అభిప్రాయాన్ని ఆయన పునరుద్ఘాటించారు సమతా సైనిక దళం వంటి సంస్థలు ఇందుకు అవసరమని , మానవ సమాజంలో ఇటువంటి సంస్థల అవసరం అన్ని వేళలా వుంటుందని ఆయన పేర్కొన్నారు. 1928లో ప్రారంభించిన ఈ దళం ఆయన తలపెట్టిన మహోద్యమంలో ఒక భాగం మాత్రమే. అది ఆయన చేతుల్లో ఒక బలమైన ఆయుధంగా రూపొందింది

> '"హిందూ సమాజంలో గౌరవప్రదమైన స్థానం కల్పించవలసిందిగా గతంలో మేము కోరిన మాట నిజమే. కాని మేము ఇప్పుడు అడుగుచున్నది అది కాదు హిందూ సమాజానికి సమాంతరంగా సమాజాన్ని సమాన పాయల ఏకీకృతం చేయాలన్నది మా ఈనాటి డిమాండ్. ఇప్పుడు మేం రాజకీయ రంగంలో సమానత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. రాజకీయ, ఆర్థిక, సాంఘిక సమానత్వ సాధనకు సమతా సైనిక దళం కట్టుబడి వుంది" అన్నారు అంబేద్కర్.

1942 జూలైలో జరిగిన సమతా సైనిక దళ్ వార్షిక సదస్సులో ప్రసంగిస్తూ అహింసా సిద్ధాంతానికి తాను వ్యతిరేకిని కాదని, కానీ సిగ్గుమాలిన లొంగుబాటును తాను అహింసగా పరిగణించలేనని అంబేద్కర్ ప్రకటించారు. ప్రాణులన్నిటి పట్ల ప్రేమ, దయా వుండాలని బోధించే అహింసా సిద్ధాంతం దుష్ట శిక్షణకు కూడా అంతే ప్రాధాన్యాన్ని యిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. 1948 గాంధీజీ హత్య జరిగిన వెంటనే అప్పటికే 20 ఏళ్ళుగా ఉనికిలో వున్న సైనిక్ దళ్‌ను నాటి నెహ్రూ ప్రభుత్వం నిషేధించింది నిషేధం ప్రభుత్వ నిదర్శనం అని అంబేద్కర్ వ్యాఖ్యానించారు

"ఆదివాసుల అరణ్య రోదన - అంబేద్కర్ - ఎ.వి. ధక్కర్ల మధ్య వివాదం" అనే గ్రంథానికి బొంబాయి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి బి.జి. కేర్ రాసిన ముందుమాటలో అంబేద్కర్‌పై కొన్ని పదునైన విమర్శలు చేశారు. రిజర్వేషన్లపై కార్యాచరణ ప్రణాళికలో ఆయన ఆదివాసుల ప్రతినిధులకు అవకాశం కల్పించలేదని 1935 నాటి ఆదివాసుల చట్టం పరిమిత స్థాయిలో కల్పించిన రిజర్వేషన్లను కూడా అంబేద్కర్ ప్రణాళిక బుట్ట దాఖలా చేసిందని ఆయన ఆరోపించారు. ఆదివాసులు రాజకీయంగా అభివృద్ధి చెందలేదనే పేరుతో వారికి శాశ్వతంగా ఓటు హక్కు లేకుండా చేయడం అంబేద్కర్‌కు తగదని ఎ.వి. ధక్కర్ ప్రవేశికలో

విమర్శించారు. హిందూ నాగరికత మనిషి బాల్య దశకు చెందినదని అంబేద్కర్ చేసిన వ్యాఖ్యలపై థక్కర్ విరుచుకుపడ్డారు.

> "శతాబ్దాల క్రితం మనుషుల మధ్య అసమానతలను శోధించిన మను స్మృతిని బహిరంగంగా దగ్ధం చేయడం ద్వారా మనువు చేసిన పనినే మరింత ఉధృత రూపంలో అంబేద్కర్ చేశాడు. ప్రపంచం ఎంతగానో ముందుకు పయనించి సమానత్వం, స్వేచ్ఛ, సోదర భావాలను అలవర్చుకుంటున్న ఈ ఆధునిక కాలంలో 1945 వ సంవత్సరంలో చేయడం ఏ విధంగా చూసిన సమంజసం కాజాలదు."

అంబేద్కర్ హరిజనుల పట్ల హద్దులు మీరిన పక్షపాతం కనబరుస్తూ ఆదివాసులకు న్యాయాన్ని నిరాకరిస్తున్నారని థక్కర్ పత్రికలలో ఒక లేఖను ప్రచురించారు. అంబేద్కర్ ఈ లేఖకు సమాధానమిస్తూ తనను తానెప్పుడూ దుఃఖిత మానవ జాతి సార్వజనీన నాయకునిగా ప్రకటించుకోలేదని చెప్పుకున్నారు. ముస్లింలకు ప్రాతినిధ్యం తగ్గించిన మేరకు మాత్రమే ఆదివాసులకు రిజర్వేషన్లు ఇవ్వడం కుదురుతుందని అంబేద్కర్ ఈ లేఖలో వివరణ ఇచ్చారు. తన కులానికి చెందిన వారి ప్రయోజాలను రక్షించడానికి ఆయన శక్తి వంచన లేకుండా పాటుపడ్డారు.

ఎంతో కష్టపడి సాధించుకున్న దేశ స్వాతంత్ర్యాన్ని రక్షించుకునే గురుతర బాధ్యత షెడ్యూల్ కులాలపై వున్నదని అంబేద్కర్ భావించారు. వారిని ఈ మేరకు ఒప్పించేందుకు కూడా ఆయన ప్రయత్నం చేశారు. కాంగ్రెస్‌తో, ఇతర రాజకీయ పక్షాలతో గతంలో వున్న విభేదాలను విస్మరించ వలసిందిగా ఆయన తన అనుయాయులను కోరారు. అన్ని రాజకీయ పక్షాలకు చేరువ అయ్యేందుకు, వారి సానుభూతి సంపాదించేందుకు ఎస్సీలు ప్రయత్నించాలని ఆయన అభిప్రాయపడ్డారు. భారత రాజ్యాంగ రచనలో తన పాత్రను హిందువులు తెలుసుకున్ననాడు తనపై గతంలో చేసిన ఆరోపణలు వాస్తవ దూరమైనవని వారే గ్రహిస్తారని ఆయన ఆశించారు.

అస్పృశ్యతకు అగ్ర కుల హిందువులే కారణమని అంబేద్కర్ భావించారు. షెడ్యూల్ కులాల పట్ల ప్రభుత్వ వైఖరిని కూడా ఆయన దుయ్యబట్టారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ నివేదికపై తన అభిప్రాయం చెబుతూ ఆర్థిక స్వాతంత్రానికి చేపట్టవలసిన చర్యలను ఆయన సూచించారు. అంబేద్కర్ కొత్త అర్థంలో రెండు జాతుల సిద్ధాంతాన్ని ఈ సందర్భంగా ప్రతిపాదించారు. ఒకటి పాలించే జాతి కాగా, మరొకటి పాలిత జాతి. కమిషన్ విధానాలు తన కులం పట్ల అసహనం కనపరిచేవిగా వున్నాయని, కమిషన్ నివేదికను ప్రచ్ఛన్న శక్తులు తమకు అనుకూలంగా తయారు చేశాయని, అది స్వతంత్రమైన నివేదిక కాదని ఆయన అభిప్రాయపడ్డారు.

అంబేద్కర్ ఏక కాలంలో బహు విధాల కార్యక్రమాలలో నిమగ్నమై వున్నప్పటికీ తాను అంటరానివాడిననే భావన మదిని తొలుస్తూ వుండేది. పాఠకులను ఒకింత దిగ్భ్రాంతి పరిచే విధంగా తన జీవిత చరిత్రలో తేల్చిన 'ఎవరేమిటి !' అనే విభాగంలో తనను తాను 'కులం ద్వారా అస్పృశ్యుడిని' అని చెప్పుకున్నారు. తరువాతి కాలంలో ఆయన తన పెళ్లి గురించి రాసుకున్నారు. 1948లో బొంబాయికి చెందిన డా॥ శారదా కబీర్‌తో తన వివాహం జరిగిందని చెబుతూ ఆమె బ్రాహ్మణ కులస్తురాలని చెప్పారు. తన కులస్తుల భవిష్యత్తు పట్ల ఆయనెప్పుడూ దిగులుపడుతు వుండేవారు. "గ్రామాలలో వున్న నా సోదరుల పరిస్థితి ఏం కానుందో?" అంటూ ఆయన తన చివరి రోజులలో విలపించేవారు.

అగ్ర కులాల ప్రయోజనాలను దెబ్బతీస్తుంది కనుక మహర్ల భూమి హక్కు బిల్లు ఆమోదం కోసం చేస్తున్న పోరాటాన్ని విరమించవలసిందిగా అంబేద్కర్ ఒక సందర్భంగా తన అనుయాయి భావ్ రావ్ గైక్వాడ్‌కు సూచిస్తారు. ఈ పోరాటం మహర్ కులస్తుల ప్రయోజనాలను విచ్ఛిన్నం చేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. జైల్ భరో కార్యక్రమాన్ని ఆయన నిరసించేవారు. జైలులో పనీ పాటా లేకుండా వూరికే పడివుండటం వృథా అన్నది ఆయన అభిప్రాయంగా ఇక్కడ మనం భావించాలి. సత్యాగ్రహం పట్ల తన వైఖరిని మార్చుకోవలసిందిగా కూడా ఆయన తన అనుయాయులను కోరారు. ఒక విధంగా చెప్పాలంటే ఆయన సత్యాగ్రహాన్ని పోరాట రూపంగా తిరస్కరించారు.

ప్రజా పోరాట ఉద్యమ రూపాలను ఆయన ఈ దశలో పున:సమీక్షించారని చెప్పవచ్చు. సత్యాగ్రహాలు చేసి జైలు పాలవడం ద్వారా కార్యకర్తలు పనికి రాకుండా పోతున్నారని ఆయన ఆవేదన చెందారు. షెడ్యూల్ కులాల డిమాండ్లను ప్రభుత్వం ముందు పెట్టి సానునయంగా ఆ డిమాండ్లను సాధించుకోవాలని, డిమాండ్ల సాధనకు చేపట్టే ఉద్యమం ఎప్పుడు కూడా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనే భారీ సత్యాగ్రహంగా మారకుండా చూసుకోవాలని వారికి ఆయన హితవు చెప్పారు. రాజ్యాంగ సభలో చేసిన చిట్టచివరి ప్రసంగంలో ప్రజలు తమ డిమాండ్ల సాధనకు రాజ్యాంగబద్ధమైన మార్గాలను మాత్రమే ఎంచుకోవాలని ఆయన నిర్ద్వందంగా చెప్పారు. రాజ్యాంగబద్ధమైన మార్గాలు ఒకవేళ విఫలమయ్యే పక్షంలో మిగిలేది అరాచకమేనని ఆయన హెచ్చరించారు.

# అధ్యాయం 4

# మతం - మత మార్పిడి

## సెక్షన్-1

**మతం అంటే ఏమిటి?**

> "సమాజానికి మతం అవసరం లేదని కొంత మంది అనుకుంటారు. కాని నేను దీంతో ఏకీభవించబోను. మతం, దాని పునాదులు మానవ జీవితానికి, సమాజపు కట్టుబాట్లకు, ఆచార వ్యవహారాలకు అత్యవసరమైనవన్నది నా భావన." - అంబేద్కర్.

అంబేద్కర్ తన రచనలలో, ప్రసంగాలలో మతం ఆవశ్యకతను చెబుతూ వచ్చారు. "మతం మనిషికి వారసత్వంగా సంక్రమించే సంప్రదాయం" అన్నది ఆయన దృఢ అభిప్రాయం. అణగారిన వర్గాల యువజన సదస్సులో ఒకసారి మాట్లాడుతూ ఆయన ఈ కింది విధంగా అన్నారు.

> "యువజనులు మతంపై నిరాసక్తంగా వుండటం నన్ను బాధిస్తున్నది. కొంత మంది చెబుతున్నట్లు మతం మత్తు మందు కాదు. నాలో ఏమైనా మంచి వుందంటే అందుకు కారణం నాలో దృఢంగా నాటుకుని వున్న మత విశ్వాసాలే. నా చదువు సమాజానికి వుపయోగపడిందంటే అందుకు కూడా నాలోని మత భావనలే కారణమంటాను. నేను మతానికి వ్యతిరేకిని కాదు. మతం పేరిట జరుగుతున్న కపట నాటకానికి మాత్రమే నేను వ్యతిరేకిని. "

భౌతిక సుఖాలు అందుబాటులోకి వచ్చినంత మాత్రాన మనిషి ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారమైపోవని, మనిషిని కార్యాచరణకు పురికొల్పే ఇంధన శక్తి మతమేనని ఆయన అంటారు. "మనిషికి తిండి ఒక్కటే చాలదు. మనిషికి బుద్ధి అనేది వుంది. దానికి కూడా తిండి కావలసిందే." అని అంబేద్కర్ దృష్టిలో "మతం మనిషిలో విశ్వాసాన్ని నింపుతుంది. పనికి ప్రోద్బలాన్ని ఇస్తుంది."

మత విలువల ప్రకారం నడిచే సమాజంలో బానిసత్వం వుండటానికి అస్కారం లేదని, మతం మనిషికి సేవ చేయాలే తప్ప మనిషిని తన సేవకునిగా చేసుకోరాదని ఆయన అంటారు. మనుషుల మధ్య వివక్ష కనపరిచేది మతం కాదని, కోట్లాదిగా వున్న మతావలంబకులను కుక్కల కన్నా, నేరస్తుల కన్నా హీనంగా చూసేది, వారిని తీరని బాధలకు, అవమానాలకు, వైకల్యాలకు గురి చేసేది మతం కాజాలదని, అన్యాయం ప్రాతిపదికగా వునికిలో వున్న అసమ వ్యవస్థకు మతం మేలి ముసుగు కాకూడదని ఆయన స్పష్టం చేశారు

సామాజిక నీతి సూత్రాల ప్రాతిపదికపై ఏర్పడిన సామాజిక ప్రమాణాల ఆధారంగా మతాన్ని , దాని బాగోగులను అంచనా వేయవలసి వుంటుందని ఆయన చెప్పారు మతాన్ని మనుషుల సామాజిక స్వస్థతకు ఆయన అనుసంధానం చేశారు. మతం, సామాజిక హోదా, ఆస్తి వంటివన్నీ ఆధికారానికి, పెత్తనానికి మూలకారణాలుగా ఆయన గుర్తించారు. ఆధ్యాత్మిక సూత్రాలకు కట్టుబడి వుండే విశ్వజనీన, సార్వజనీన, సార్వకాలీనమైన మతం వుండాలని ఆయన ఆశించారు. హిందూ మతాన్ని ఆయన సామాజిక, రాజకీయ, పారిశుధ్య, నైష్టిక నియమ నిబంధనలతో, కర్మ కాండలతో కూడిన కలగూరగంపగా, శాసన రూపంలో వున్న వర్గ నీతి శాస్త్రంగా నిర్వచించారు. సామాజిక, ఆధ్యాత్మిక ఐక్యతకు ముఖ్య వనరుగా మతం వుండాలని ఆయన భావించారు కాని అందుకు పూర్తి భిన్నమైన పరిస్థితిని ఆయన తన చుట్టూ అలుముకొని వున్న వాతావరణంలో గమనించారు. తన తోటి వారు మృతప్రాయమైన, దుస్సహమైన జీవనాన్ని గడుపుతుండడం ఆయనను తీవ్రంగా కలచివేసింది. అందుకే మతం పట్ల ఆయన భావాలు సమాజ గమనంతో ముడిపడి వున్నాయి రాజకీయాల ప్రతిఫలంగా మాత్రమే మత భావనలను కలిగివున్నందున అంబేద్కర్ అంటరానివారి మానవ హక్కుల విషయంలో సదా అప్రమత్తంగా వుండగలిగారు. మతం, బానిసత్వం పరస్పర విరుద్ధమైనవనే భావనకు మూలాలు ఈ నేపథ్యంలో ఇమిడివున్నాయి.

అంబేద్కర్ మతానికి వుండవలసిన నాలుగు గుణాలను ప్రతిపాదించారు అవి 1. మతం నైతిక ప్రమాణంతో వుండి, సమాజ గమనాన్ని నిర్దేశించే సాధనంగా వుండాలి. 2. మతం వివేచన(శాస్త్రం)ను అనుసరించి వుండాలి. అప్పుడే అది ఆశించిన ఫలితాలను ఇవ్వగలదు 3 మతం తాలూకు నీతి శాస్త్రం మనిషి ప్రాథమిక అవసరాలైన స్వేచ్ఛ, సమానత్వం, సోదర భావాలను గుర్తించాలి. సామాజిక జీవనానికి సంబంధించిన ఈ మూడు మౌలిక సూత్రాలను గుర్తించని మతం అదృశ్యం కాక తప్పదు. 4. మతం పేదరికానికి ఆమోద ముద్ర వేయకూడదు. ఉన్నతమైందిగా కీర్తించకూడదు.

అంబేద్కర్ ప్రకారం మతం ఇప్పటి దాకా నాలుగు దశలను దాటుకుంటూ వచ్చింది. తొలి దశలో మనిషికి వ్యక్తిగత స్థాయిలో మోక్ష కారకంగా వుంది. రెండవ దశలో నీతి

సూత్రాల ఆధారంగా మనుషుల మధ్య సోదర భావాన్ని పెంపొందించింది, మానవ ప్రవర్తనను నిర్దేశించింది. మూడవ దశలో తమ అవసరాలను తీర్చే వ్యక్తులను పూజించేదిగా మార్పు చెందింది. నాలుగవ దశలో అద్భుతాలు చేసే వారిని పూజించేదిగా అది పరిణమించింది. ఇహ లోకంలో సంపదలను, ఔన్నత్యాన్ని, పరలోకంలో మోక్షాన్ని ఇచ్చేదే మతమని ఆయన నిర్వచించారు.

ఐక్యతకు అస్కారముః్న చోట సదాచారం ఆలంబనవుతుందనే తత్వాన్ని భగవద్గీత ప్రవచిస్తుందని అంబేద్కర్ భావించారు. గీశ సారాంశం సత్యాగ్రహమని ఆయన అంటారు. గీత స్పృశ్యులకే కాక అస్పృశ్యులకు కూడా ఆరాధ్య గ్రంథమని అంబేద్కర్ అభిప్రాయపడ్డారు. అర్జునుడు న్యాయసాధనకు, రక్షణకు ఆయుధాలు ధరించాడు కనుక అది సమర్థనీయమని ఆయన వాఖ్యానించారు.

మనిషిని మహిమాన్వితునిగా చేసి ఆరాధించే తత్వం, మనిషికి దైవత్వం అపాదించే సంప్రదాయం, కర్తవ్య విముఖత హిందూ సమాజాన్ని శిథిలం చేసాయని, దేశం అత్యంత హీన స్థాయికి చేరుకోవడానికి ఈ మూడు అంశాలే కారణమయ్యాయని అంబేద్కర్ భావించారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు కాని, శత్రు దేశం మన దేశంపై యుద్ధానికి వచ్చినప్పుడు కాని, మరే ఇతర ప్రళయం వచ్చిపడినప్పుడు కాని సాక్షాత్తు భగవంతుడు దిగివచ్చి ప్రజలను ప్రమాదం బారి నుంచి రక్షిస్తాడనే విశ్వాసం ఈనాటికీ చెక్కు చెదరకుండా వుందంటే ఏమిటి అర్థం? ప్రజలలో ఉదాసీనతను పెంచే ఇటువంటి నిరర్థక భావజాలం వలన ఐక్య కార్యాచరణకు తావు లేకుండా పోతున్నది. అవతారపురుషుడెవరో వచ్చి తమ కష్టాలను తీర్చి పోతాడనే భావనకు బలం చేకూరుతున్నది. ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఎదురు చూసి మోసపోయే స్వభావం దీని వలన జనంలో వేళ్లూనుకుంటున్నది. ప్రజలలో ఆశావహ దృక్పథాన్ని కలిగించేందుకు, సంప్రదాయ దృక్పథాన్ని తిప్పికొట్టేందుకు ఆయన పాటుపడ్డారు. భగవంతుని అవతరణలో విశ్వాసం వలన మనిషి సామాజిక బాధ్యతల నుంచి తప్పించుకోవడానికి వీలు లేకుండా చేయాలనే సదుద్దేశంతో ఆయన ఈ పని చేపట్టారు. మనిషికీ, దేవునికి మధ్య కాక, మనిషికీ, మనిషికీ మధ్య బాంధవ్యం మతానికి కేంద్ర బిందువుగా వుండాలని ఆయన కోరుకున్నారు. దైవాన్ని విశ్వసించడం వలన మనిషికి కలిగే ప్రయోజనం ఏమిటి? అనే ప్రశ్నకు జవాబిస్తూ దైవంపై విశ్వాసం వల్ల పూజా, ప్రార్థనలకు స్వతహాగా లేని శక్తి సమకూరిందని, దీని వలన పురోహితునికి ఎక్కడ లేని శక్తి సమకూరిందని, దీన్ని ఆసరాగా చేసుకొని పురోహితుడు మూఢాచారాలను సృష్టించి వివేచనను, వివేకాన్ని ధ్వంసం చేశాడని ఆయన వివరించారు. "రామ భజన చేస్తే ప్రజలకు వొరిగేదేమీ లేదు. కనీసం భూస్వామికి కట్టవలసిన కౌలు మొత్తంలో రాయితీ అయినా దొరకదు" అంటారు అంబేద్కర్.

జీవితం పట్ల హేతుబద్ధ దృక్పథం కలిగి వున్నందున అంబేద్కర్ ప్రకృతికి అతీతంగా శక్తులుంటాయని చెప్పే అన్ని వాదాలను తిప్పికొట్టారు. ప్రకృతికి అతీతమైన విలువలు ఉంటాయని నమ్మినప్పుడు మనిషికి తెలివి తేటలు వుండి ప్రయోజనం ఏమిటి? అని ఆయన

ప్రశ్నించారు. అధి భౌతిక వాదం, అధి ప్రాకృతిక వాదాలపై బుద్ధుడి ఖండనలతో ఆయనకు ఏకాభిప్రాయం వుంది. ఈ విషయంలో ఆయనకు మూడు ఆశయాలు వున్నాయి. ఒకటి – హేతు వాద మార్గానికి మనిషిని మళ్లించడం. రెండు– సత్యాన్వేషణకు మనిషి పూనుకొనేలా చేసేందుకు, మానసికంగా అతడిని విముక్తం చెయ్యడం మూడు–మూఢ విశ్వాసాలకు బలం చేకూరుస్తున్న అన్ని వనరులను నిర్మూలించడం. భగవంతున్ని నమ్మడం కన్న ఆత్మను నమ్మడమే మేలన్ని ఆయన భావించారు. భగవంతునిలో విశ్వాసం వలన పురోహిత వర్గం రంగ ప్రవేశం చేసి మనిషిని పుట్టిన నాటి నుంచి చనిపోయే నాటి దాకా అదుపు చేస్తున్నదని అయన అభిప్రాయపడ్డారు. దేవుడు, ఆత్మల ఉనికిని నిరాకరించడం ద్వారా మానవ జీవితాన్ని ఈ జన్మలో శాసిస్తున్న గత జన్మ కర్మలను ఆయన నిరాకరించారు. హిందూ జీవన విధానం ప్రతిపాదించిన ఈ గత జన్మల కర్మల సిద్ధాంతం మనిషిలోని తిరుగుబాటు తత్వాన్ని పూర్తిగా హరించివేసిందంటారు ఆయన. అంటరానితనం రద్దుకు, భగవంతుని మీద కాని, అద్భుతాలు చేస్తామని చెప్పుకునే స్వాములు, బాబాల మీద కాని నమ్మకం పెట్టుకోవద్దని, ఉపవాసాలు, యాత్రలతో అంటరానితనం పోదని, రాజకీయ అధికారం మాత్రమే దానిని పారతోలగలదని ఆయన తన ప్రజలకు ఒక సందర్భంగా పిలుపునిచ్చారు. భగవాదార్చన కన్నా రొట్టె ముక్క గొప్పదని ఆయన వారికి హితవు చెప్పారు.

పుట్టుక నుంచి చావు దాకా మానవ జీవితంలోని ఏ ఒక్క అంశాన్ని వదలిపెట్టని మతాచారాలపై, కర్మ కాండలపై విశ్వాసం పనికి రాదని, భూమిపై గల హక్కులను మతం శాసించరాదని, దైవ శక్తిని నమ్మేంత వరకు మతం ప్రభావం మనిషిపై వుంటే ఫర్వాలేదని అంబేద్కర్ భావించారు. ప్రతి మతానికి తనదైన న్యాయ స్మృతి వుండటం వల్ల సమస్యలు జటిలమైపోతున్నందు వలన ఈ స్మృతుల విషయంలో పార్లమెంటు జోక్యం చేసుకోవలసిన అవసరం వున్నదని ఆయన చెప్పారు. హిందూ స్మృతిపై రాజ్యాంగ సభ సమావేశాలలో జరిగిన చర్చల సందర్భంగా అంబేద్కర్ వేరువేరు స్మృతులు వుండరాదని వాదించారు రాజ్యాంగంలోని 25 వ అధికరణం ప్రకారం రాజ్యానికి దేశంలోని వివిధ వర్గాల, సమూహాల స్మృతులకు సంబంధించి జోక్యం కల్పించుకునే హక్కు వుండాలని ఆయన సూచించారు ఎవరికి వారు తమ న్యాయ స్మృతి కాలాతీతమైనదని భావిస్తే అది పొరపాటని, రాజ్యాంగం ప్రకారం సర్వాధికారాలు దఖలు పడివున్న పార్లమెంటు అవసరమైనప్పుడు మార్పులు చేర్పులు చేయవచ్చునని ఆయన ప్రకటించారు

హిందూ మతం స్పృశ్యులు అస్పృశ్యుల కలిసి సమిష్టిగా సృష్టించిందని భావించిన అంబేద్కర్ పురోహిత వర్గం దౌష్ట్యం నుంచి దేశాన్ని రక్షించే బాధ్యతను హిందూ మేధావులు స్వీకరించాలని కోరుకున్నారు. హిందూ పురోహిత వర్గం పార్సీ వంటి ఇతర మతాల పురోహిత వర్గం కన్నా ఏ విధంగాను ఉన్నతమైనది కాదని, బ్రాహ్మణ పురోహితులు అదృశ్య దైవానికి, నిస్సహాయునిగా వున్న మనిషికి మధ్య నిస్సిగ్గుగా దళారివలె వ్యవహరించి పొట్ట

పోసుకుంటున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. గౌరవనీయమైన ఆలోచనలకు అమానవీయ ప్రవర్తనకు మధ్య వుండే వైరుధ్యానికి నిదర్శనంగా నిలిచే హిందూ మతం చిక్కుముడి వంటిదని ఆయన అంటారు. హిందూ మతం లెక్కకు మిక్కిలి నిబంధనలు , ఆజ్ఞలు , ఆంక్షలు , నిషేధాల పుట్ట అంటారాయన.

హిందూ మతంలోని చెడులను ఆయన ఐదు సూత్రాలలో క్లుప్తంగా, స్పష్టంగా వివరించారు. 1. మనిషిని స్వతంత్రమైన నైతిక జీవనానికి అనర్హుడుని చేసి, బయటి నుంచి బలవంతంగా విధించిన నియమాలకు బందీని చేసి భీతావాహుడ్ని చేస్తుంది. 2. భావాలకు కట్టుబడి కాకుండా నిబంధనలకు కట్టుబడి'మనిషి జీవించేలా చేస్తుంది. 3. ధర్మాలు (చట్టాలు) అందరికీ , అన్ని వేళాలా ఒకే విధంగా వర్తింపచేయకుండా మార్పులకు తావు లేని విధంగా చేసి భిన్న సమూహాల మధ్య తరతరాలుగా అసమానతలను సృష్టించింది. 4. ఈ ధర్మాలను ప్రవక్తలుగాని, న్యాయ మూర్తులు గాని రూపొందించినవి కావు. 5 . హిందూ న్యాయస్మృతి ఏకశిలా సదృశ్యంగా మార్పుకు తావు లేని విధంగా తయారు చేశారు.

ఇటువంటి అమానుషమైన మతాన్ని నాశనం చేయాలని , దానిని నాశనం చేయడం మత వ్యతిరేకమైన పని కాదని ఆయన అభిప్రాయ పడ్డారు. హిందూ మతంగా చలామణిలో వున్నది వాస్తవానికి మతం కాదని, అది కేవలం చట్టం అని, అందుకే దానిని రద్దు చేయడం కాని, సవరించడం కాని చేయాలని ఆయన పేర్కొన్నారు.

అంబేద్కర్ మౌలికంగా హిందూ మతానికి , హిందూ మత నాయకులకు వ్యతిరేకి కాదు. అది ప్రబోధించిన తప్పుడు ఆశయాలకు వాటిని తూచ తప్పకుండా ఆచరించే హిందూ మత పెద్దల మొండి వైఖరిని వ్యతిరేకించారు. సామాజిక ఐక్యతకు హిందూ మతం బద్ధ విరోధి అని ఆయన అన్నారు. సంప్రదాయ సామాజిక వ్యవస్థను ప్రతిఫలించే హిందూ జీవనవిధానం హిందూవుల ఐక్యతకు అతి పెద్ద అవరోధం అని, మనుషులను వేరు చేయాలనే దృష్టి దాని అణవణువునా వున్నదని ఆయన వ్యాఖ్యానించారు. సామాజిక ఐక్యత సాధించకుండా సమానత్వ భావన, జాతీయ సమైక్యత, ప్రజాస్వామిక విలువలు, ఆత్మీయ సోదర భావాలను సాధించడం కుదరదని, హిందూ మతం ఆధిక్యతా స్థానంలో వున్నందువల్లే ఈ పరిస్థితి కొనసాగుతున్నదని ఆయన అంటారు. కులం మత మార్పిడిని అడ్డుకుంటున్నదని, కులం వల్లే హిందూ మతం అసమానతలకు పుట్టిల్లుగా మారిందని, వర్ణ వ్యవస్థ సిద్ధాంతాన్ని వదిలించుకుంటే తప్ప హిందూ మతానికి దిక్కు లేదని ఆయన అభిప్రాయ పడ్డారు. హిందూ మతాన్ని నాశనం చేయడం తన ఉద్దేశం కాదని, దానిని సంస్కరించి, పునర్నిర్మించాలన్నదే తన ధ్యేయమని ఆయన స్పష్టం చేశారు. హిందూ సమాజాన్ని సమానత్వం, కుల రాహిత్యం అనే రెండు ప్రధాన సూత్రాల ప్రాతిపదికపై రూపొందించాలని ఆయన భావించారు. హిందూ సమాజం ఈ అంతర్గత శక్తి లేకుండా స్వాతంత్రం వచ్చినా అది బానిసత్వానికి దారి తీస్తుందని ఆయన అన్నారు. బౌద్ధ సమాజ తాత్విక ఉద్యమానికి గల జన విమోచన అంశాన్ని

ఎదుర్కొనేందుకు బ్రాహ్మణీయ శక్తులు సృష్టించిన భావజాలంగా వేదాంత వాదాన్ని ఆయన నిర్వచించారు బ్రాహ్మణీయ 'పరాన్న భుక్కు విలాసానికి' వ్యతిరేకంగా తిరగబడిన బౌద్ధం కలిమి , బలిమి , మేసిమి లకు నిలయంగా నిలిచే నాగరికత నిర్మాణానికి పునాదులు వేసిందని ఆయన వాఖ్యానించారు.

అంబేద్కర్ దృష్టిలో మతం వివేచన గలదై వుండాలి. అది నీతి గలదై వుండాలి. ఆధ్యాత్మిక కోణం కూడా కలిగి వుండాలి. లౌకిక తత్వం కూడా వుండాలి . పరలోక చింతనకు దానిలో తావు వుండకూడదు స్వధర్మానే ఆయన మతంగా భావించారు మతం వ్యక్తిగత జీవితానికి పరిమితమైన అంశంగా మాత్రమే వుండాలి. బౌద్ధ ధర్మానికి వున్న సామాజికత మతానికి వుండితీరవలసిన అతి ముఖ్య లక్షణమని ఆయన చెప్పారు. "బౌద్ధ దమ్మంలో ప్రార్థనలకు, యాత్రలకు, మొక్కుబడులకు, కర్మ కాండలకు, హోమం, యజ్ఞం వంటి క్రతువులకు స్థానం లేదు నైతికత దమ్మం సారాంశం, అది లేకుండా దమ్మం లేదు" అన్నారు

అంబేద్కర్. దమ్మాన్ని ఆయన సత్యసంధతగా, మనుషుల మధ్య అన్ని రంగాలలో సత్సంబంధంగా ఆయన నిర్వచించారు. మనిషి ఏకాకి అయితే అతనికి దమ్మం అవసరం వుండేది కాదని, కాని సమాజం దమ్మం లేకుండా అంటే పరస్పరం సత్సంబంధాలు లేకుండా మనజాలదని, ఆయన అన్నారు. మతంగా అందుకే దమ్మం దేవుడిని, ఆత్మను నమ్మదని, దేవుడిని మొక్కదని ప్రార్థనలతో రోగాలు నయమవుతాయని నమ్మదని ఆయన అంటారు. మనుషుల మధ్య మంచి సంబంధాలు ఏర్పరచడం ద్వారా ప్రపంచాన్ని సమతా సౌధంగా పునర్నిర్మించే నిజమైన మతం బుద్ధుని దమ్మం అని అయన భావించారు నైతిక పునరుజ్జీవనం, సాంఘిక విమోచనం ద్వారా మానవ జీవితాన్ని సంపూర్ణంగా మార్చే మార్గంగా బౌద్ధాన్ని ఆయన దర్శించారు. సమాజంలొ ప్రతి సభ్యుడు స్వీయ మానసిక ఉన్నతికి కృషి చేస్తూనే తోటి వారి ఉన్నతికి తోడ్పడాలని బౌద్ధం బోధిస్తుందని ఆయన తెలిపారు. బౌద్ధ జీవనవిధానం రెండు విధాలు. ఒకటి సామాన్యుల కోసమైతే, మరొకటి భిక్షువుల కోసం. నైతిక ప్రవర్తనా నియమావళికి రెండో మార్గంలో అమిత ప్రాధాన్యం వుంటుంది. అంబేద్కర్ తన జీవితంలో ఈ నైతిక నియమాలను పాటించేందుకు గట్టి ప్రయత్నం చేశారు. సమాజం పట్ల మార్క్సిస్టు దృకోణం కన్నా బౌద్ధ దృకోణం మానవీయమైనదని, సమగ్రమైనదని, రోజు వారీ సామాజిక జీవనావసరాలను తీర్చగల శక్తి బుద్ధుని బోధనలకు వున్నదని అంబేద్కర్ భావించారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ భావాలను నైతిక పునాదుల ప్రాతిపదికపై నిర్మించేందుకు బుద్ధుడు ప్రయత్నించాడని అంబేద్కర్ చెప్పారు. సామాజికంగా, రాజకీయంగా మనుషుల మధ్య ఐక్యతను ప్రబోధించడం ద్వారా సమానత్వం, స్వేచ్ఛ, ప్రేమ, సానుభూతి వంటి విలువలు ఆధిపత్య స్థానంలో వుండే ఆదర్శ సమాజ నిర్మాణానికి బుద్ధుడు ప్రయత్నించాడు. మానవుని నైతిక, మత జీవనం సమాజ నిర్మాణంపై, సమాజంలో మనిషి నడవడిపై ఆధారపడి వుండాలన్నది బుద్ధుని తత్వం. బుద్ధుని ప్రేమ, కరుణ భావాలతో ప్రేరణ పొంది అంబేద్కర్ మానవ జాతికి

సేప చేయడానికి ముందుకు సాగారు. అంబేద్కర్ ప్రకారం క్రైస్తవం నూటికి తొంభై పాళ్లు బౌద్ధానికి అనుకరణ అని సారంలో, రూపంలో అది బౌద్ధం అడుగుజాడలలో నడుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. అంబేద్కర్ నలుగురిని మాత్రమే బోధకులుగా గుర్తించారు. వారు వరుసగా శ్రీ కృష్ణుడు, బుద్ధుడు, ఏసుక్రీస్తు, మహమ్మద్ . వీరిలో బుద్ధుడి బోధనలు ఆయనను అమితంగా ఆకట్టుకున్నాయి. తన శిష్యులు అంతరాత్మ చెప్పినట్లు వినాలే కాని, తన మాట వినకూడదని, తన ఆజ్ఞలను పాటించకూడదని బుద్ధుడు తన శిష్యులకు సదా బోధించడం అంబేద్కర్‌ను విశేషంగా ఆకర్షించింది. బౌద్ధంలో భగవంతునికి స్థానం లేదు. ఆ స్థానాన్ని నైతిక వర్తనం భర్తీ చేసింది. రాముడు, కృష్ణుడు, గాంధీలను ఆయన బ్రాహ్మణీయ మత ప్రచారకులుగా భావించారు. ప్రజాస్వామ్య సమాజ నిర్మాణానికి ఈ ముగ్గురి బోధనలు ఎంతమాత్రం పనికి రావని, ఒక్క బుద్ధుడి బోధనలు మాత్రమే ఇందుకు ఉపకరిస్తాయని అంబేద్కర్ భావించారు. ప్రజాస్వామ్యానికి , చాతుర్వర్ణ వ్యవస్థకు చుక్కెదురు అని ఆయన పలుమార్లు చెప్పాడు. చాతుర్వర్ణమనే దీర్ఘవ్యాధికి బుద్ధుని తత్వం తప్పిస్తే మరో చికిత్స లేదని, హిందువులందరూ బుద్ధుని జన్మదినం నాడు వేడుకలు చేసిననాడు రాజకీయ మాలిన్యం తొలిగిపోయే అవకాశం ఏర్పడుతుందని ఆయన భావించారు.

లౌకిక రాజ్య భావనకు పునాదులు పాశ్చాత్య ఉదారవాద ప్రజాస్వామిక సంప్రదాయంలో ఉన్నాయి. మనిషికి మత పరమైన అంశాలలో స్వేచ్ఛను ఇచ్చిన లౌకిక రాజ్యం మతానికి అతీతంగా మనిషికి కోరిన హోదా కూడా ఇచ్చింది. ఈ ఆధునిక రాజ్యం ఏ ఒక్క మతానికీ విశేష ప్రాధాన్యం ఇవ్వదు. ఏ ఒక్క మతాన్నీ పోషించదు. మత సంబంధమైన వ్యవహారాలలో జోక్యం చేసుకోదు. మత స్వేచ్ఛ, పౌరసత్వం, మతం నుంచి రాజ్యాన్ని వేరు చేయడం వంటి లౌకిక పునాదులపై ఈ ఆధునిక రాజ్య నిర్మాణం జరిగింది. ప్రభుత్వ నిధులతో పని చేసే ఏ సంస్థ అయినా మత పరమైన బోధనలను చేపట్టరాదని, రాజ్యం కూడా ఇందుకు అతీతం కాకూడదని అంబేద్కర్ ప్రతిపాదించారు. 1951లో పార్లమెంటులో హిందూ స్మృతిపై జరిగిన చర్చలో పాల్గొంటూ లౌకిక వాదాన్ని ఆయన ఈ విధంగా నిర్వచించారు. "లౌకిక రాజ్యం ప్రజల మత భావోద్వేగాలకు వ్యతిరేకం కాదు. ఏ ఒక్క మతాన్ని ఆ మతానికి చెందని వారిపై బలవంతంగా రుద్దడాన్ని మాత్రమే లౌకిక రాజ్యం వ్యతిరేకిస్తుంది. రాజ్యాంగం ఈ ఒక్క పరిమితిని మాత్రమే గుర్తిస్తుంది. "లౌకిక వాదం మతాన్ని రద్దు చేయదని కూడా ఆయన స్పష్టం చేస్తారు. మతాలు, వాటి శాఖలు, ప్రశాఖల మధ్య గల భిన్నత్వాన్ని పరిగణనలోకి తీసుకున్నప్పుడు వివిధ మతాలకు చెందిన బాలలను సమానత్వం గాట కట్టి వారందరికీ ఒకే విధమైన మత బోధన చేయజాలమనేది స్పష్టంగా అవగతమౌతుందని, ఉనికిలో వున్న మతాలను పరిశీలించి చూస్తే వాటిలో అసాంఘికమైనవే కాక సంఘ వ్యతిరేకమైనవి కూడా వున్నాయని, మోక్షానికి మార్గం తమ మతంలోనే తప్ప అన్య మతాలలో లేదని చెప్పుకునే ధోరణి ప్రబలంగా వుందని – అన్ని సూక్ష్మ స్థాయి వైరుధ్యాల వలన మతాన్ని విద్య నుంచి వేరు చేయవలసిన అవసరం వున్నదని అంబేద్కర్ భావించారు.

"పాఠశాల ప్రాంగణంలోకి ఈ వైరుధ్యాలను తీసుకెళ్తే అక్కడి శాంతియుత వాతావరణం దెబ్బతినక తప్పదు. ప్రభుత్వ విద్యా సంస్థలలో మత బోధన జరుగకుండా చూడటం ఒక్కటే ఈ సమస్యకు పరిష్కారం" అని ఆయన రాజ్యాంగ సభలో వాదించారు.

మత సూత్రాలకు, న్యాయ సూత్రాలకు మధ్య సమన్వయం తప్పనిసరని అంబేద్కర్ భావించారు. మతానికి, చట్టానికి మధ్య వైరుధ్యం కాని, వ్యతిరేకత కాని వుండరాదని, మానవ సమాజ పురోగతికి ఇది అత్యవసరమని ఆయన పేర్కొన్నారు. పన్ను రూపేణా ప్రజలు ప్రభుత్వానికి కట్టే సొమ్మును మత పరమైన అవసరాలకు వెచ్చించకుండా చూడవలసిన బాధ్యత ప్రభుత్వంపై వున్నదని, మరీ ముఖ్యంగా ఒక మనిషి చెల్లించే మొత్తం ఆ మనిషికి చెందని మతం కోసం వెచ్చించరాదని ఆయన చెప్పారు. మత పరమైన విషయాలలో బలవంతమనేది ప్రభుత్వం కాని, ఒక మతం మరో మతంపై కాని చేయరాదని, మతపరమైన అణచివేతకు రాజ్యం పాల్పడరాదని అంబేద్కర్ తీర్మానించారు చట్టానికి అన్ని మతాలు సమానమైనవి, గౌరవనీయమైనవేనని ఆయన భావించారు. లౌకికవాద సిద్ధాంతంపై ప్రగాఢ విశ్వాసం వల్లే ఆయన అన్ని మతాల మధ్య సమానత్వం చూడకలిగారు భారతదేశంలో లౌకిక వాదం సమస్యపై స్మిత్, లూథరా విస్తృతంగా చర్చించారు. లూథరా భారతదేశం లౌకిక రాజ్యం కాదు, కాజాలదని చేసిన వాదనను స్మిత్ తోసిపుచ్చారు. మతం నుంచి రాజ్యాన్ని వేరు పరచడమనే ఒక్క అంశాన్ని మాత్రమే లూథరా పరిగణనంలోకి తీసుకోవడం వల్లే లౌకిక వాదంపై ఆమె అభిప్రాయం సంకుచితమైందని స్మిత్ వాదించారు. హిందూ మతం చలనశీలమైనది కాదని లూథరా భావించడం కూడా ఈ అభిప్రాయానికి తావిచ్చిందని స్మిత్ అభిప్రాయపడ్డారు. అంబేద్కర్ లౌకిక వాదం సమస్య మూలాలలోకి పోవడం వలన మౌలికమైన అన్ని అంశాలను అది కలిగి వుంది. మత విద్వేషం, వివక్ష , మతాన్ని బట్టి చిన్న చూపు చూడటం వంటి అన్ని అమానవీయ వైఖరులకు అవకాశమివ్వని సిద్ధాంతంగా అంబేద్కర్ లౌకిక వాదాన్ని పటిష్టం చేశారు.

## సెక్షన్-2

### మతం - దాని తత్వం

మతానికి గల తాత్విక పునాదులను అవగాహన చేసుకునే క్రమంలో దేవుని ఉనికి, దైవ రాజ్యం, దేవుని నైతిక పాలన అనే దైవ శాస్త్రం ప్రతిపాదించే మూడు అంశాలను అంబేద్కర్ నిశితంగా పరిశీలించారు. సమాజ వ్యవస్థలో నైతిక ప్రమాణాలకు కట్టుబడి మానవులు జీవించే విధంగా ఆదర్శనీయమైన దైవ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడమే మతం ముఖ్యోద్దేశమని అంబేద్కర్ అంటారు. మనిషికి – భగవంతునికి, సమాజానికి – మనిషికి, మనిషికి – మనిషికి మధ్య సంబంధాలపై గల భావనలలో ఏర్పడిన మార్పుల మూలంగా వచ్చిన విప్లవాన్ని దృష్టిలో పెట్టుకోకుండా మతం తాలూకు తాత్వికతపై నిర్దిష్టమైన అభిప్రాయం ఏర్పరుచుకోజాలమని

ఆయన అంటారు. ఆటవిక సమాజం నుంచి నాగరిక సమాజం వరకు వచ్చిన మార్పులను గమనిస్తే ఈ విప్లవం అనేది ఎంత విస్తృతమైనదో తెలుసుకోవచ్చు.

వినడానికి నమ్మశక్యంగా లేకున్నా మత పరమైన విప్లవాలపై సమగ్ర అధ్యయనం ఈ నాటికి జరుగలేదు. ఆదిమ సమాజం నుంచి ఈ నాటి దాకా మత స్వభావంలో వచ్చిన మార్పులు, మతాన్ని చూసే దృష్టి కోణంలో వచ్చిన మార్పులు ఈ విప్లవం వల్లే సాధ్యమయ్యాయి. మతానికి సంబంధించిన వివిధ అంశాలను చూసే తీరులో సమూలమైన పరివర్తనకు ఈ విప్లవం పాదులు వేసింది.

జీవితంలోని మౌలికమైన అంశాలను , ప్రక్రియలను పవిత్రీకరించడం ద్వారా వాటి పరిరక్షణకు సమాజం విధించిన నియమ నిబంధనలను కూడా పవిత్రీకరించింది. మతానికి నైతికతకు మధ్య గల సంబంధాన్ని ఈ దృష్టితో చూసినప్పుడు సులువుగా అర్థం చేసుకోవచ్చు. మతానికి – దేవునికి మధ్య గల బంధం కన్నా ఇది ఎక్కువ సహజమైనది , సన్నిహితమైనది. అయితే మతానికి , నైతికతకు మధ్య ఐక్యత సరిగ్గా ఏ కాలంలో ఏర్పడిందో చెప్పడం అంత సులువు కాదు.

ఆటవిక సమాజానికి భిన్నంగా నాగరిక సమాజంలో భగవంతుడు మతం పరిధిలోకి రావడం , నైతికతను మతం పవిత్రీకరించడం చూడవచ్చు . ఇందులో మొదటి అంశం సమాజ నిర్మాణానికి సంబంధించింది. ఆదిమ సమాజంలో మనుషులు , దేవుళ్లు సామాజికంగా, రాజకీయంగానే కాక మతపరంగా కూడా ఒకే నేపథ్యం కలిగి పరస్పరం ఐక్యంగా వుండేవారు. దేవుడికి అతని భక్తులకు మధ్య వుండే సంబంధం ఆధారంగా మతం ఆనాడు మనుగడలోకి వచ్చింది. ఇందుకు భిన్నంగా ఆధునిక సమాజం భగవంతుడ్ని తన నిర్మాణం నుంచి తొలగించింది. ఆధునిక సమాజ నిర్మాణంలో మనుషులకే అగ్రాసనం. రెండవ అంశం దేవుడికి సమాజానికి మధ్య గల సంబంధంలో వచ్చిన మార్పులు, భేదాలకు సంబంధించింది. మూడవ అంశం భగవంతుడు తండ్రి (పితృత్వం) కావడానికి సంబంధించిన భావనలో వచ్చిన మార్పులకు సంబంధించింది.

ఈ పురాతన సమాజంలో దైవం ప్రజల తండ్రి. అయితే తండ్రి అనే భావన భౌతిక ఆలోచనల నుండి వచ్చిన మానసిక ధోరణి. జాతీయత మారిన సందర్భాల్లో మతం పాత్ర ఏమిటనే ప్రశ్న నాల్గవ అభిప్రాయబేధానికి కారణమవుతోంది. మతంలో భాగంగా దేవుని గురించి అర్థం చేసుకునే పరిజ్ఞానం ఐదవ అభిప్రాయభేదానికి సంబంధించింది. మతంలో విశ్వాసం పాత్ర మరో అభిప్రాయభేదానికి –హేతువుగా పరిణమించింది. మతంలో వ్యక్తి స్థాయి. అతని ఆలోచనాధోరణి ఏర్పాటు అభిప్రాయభేదానికి కారణమవుతుంది. సమాజం, దైవం మధ్య సంబంధాలు, దైవేచ్ఛ, మానవ సమాజం మధ్య గల సంబంధాలకు ఎనిమిదవ అభిప్రాయ భేదం సంబంధించింది.

దైవం తన ఒక్కడిపట్ల కరుణార్ద్ర హృదయునిగా ఉండాలని పురాతన సమాజంలో మానవుడు కోరుకోలేదు. సమాజ క్షేమాన్ని ఆకాంక్షించాడు. మతంలో ఇది మరో ముఖ్యమైన విప్లవాత్మకమైన పరిణామం.

ఆ విధంగా మతంలో రెండు రకాల భావనలు చోటు చేసుకున్నాయి. ఒకటి బహిరంగ విప్లవాత్మక ఆలోచనలకు దారి తీసేదిగా ఉండగా రెండోది ఆంతరంగిక సంస్కారానికి దారితీసింది. బహిరంగ విప్లవాత్మక సరళి మతం ఉనికిలో ఉండే సమాజం. ప్రాంతానికి సంబంధించినటువంటిది. మానవ సమాజాన్ని సుభిక్షంగా పరిపాలించేందుకు మతంలో ప్రవేశపెట్టాల్సిన మార్పులకు భావనాత్మక ఆలోచనాధోరణి అద్దం పడుతుంది. బహిరంగ విప్లవం వాస్తవానికి మతపరమైందికాదని చెప్పవచ్చు. తనకు సంబంధం లేని ప్రాంతం, ఆలోచనలపై అదుపుసాధించే మతతత్వ వైఖరికి శాస్త్రీయంగా కళ్ళెం వేసే విధానం. అంతర్గత విప్లవమే నిజమైన విప్లవం. దానిని మాత్రమే ఫ్రెంచ్ విప్లవం, రష్యా విప్లవం వంటి ఏ ఇతర రాజకీయ విప్లవంతో పోల్చడం సాధ్యపడుతుంది. ఇది మొత్తం సమగ్ర స్వరూపానికి సంబంధించినటువంటిది. ఇటువంటి విప్లవాత్మక ఆలోచనాధోరణి సమున్నతమైన పాలనా విధానంలో అవసరమైన సవరణలకు దారి తీసింది.

**సామాజిక శక్తిగా మతం:**

సమున్నతమైన పరిపాలనలో మతం నిర్వహించే పాత్ర గురించి నేను ఇంతకు ముందే వివరించాను.

హిందూ మతం సమానత్వాన్ని గుర్తిస్తుందా? అని అంబేద్కర్ ప్రశ్నించారు. గుర్తించదు అని నిరూపించేందుకు ఆయన ఇలా వాదిస్తారు. నాకు ఇందుకు విరుద్ధంగా అనేక తార్కాణాలు దృగ్గోచరమయ్యాయి. అసమానత్వం కోసం మనువు ఎంతగా తపించాడో అర్థం చేసుకున్నాను. ఆయన మతపరమైన అసమానత్వాన్ని ప్రోత్సహించారు. ఇందుకు సంబంధించి అనేక ఉదాహరణలు ఇవ్వవచ్చు. మతపరమైన ఉత్సవాలు లేదా కార్యక్రమాలు, ఆశ్రమాల్లో జరిగే 'తంతు' పరిశీలిస్తే ఈ విషయం అర్థమవుతుంది.

క్రైస్తవుల మాదిరిగానే హిందువులకు మతపరమైన విశ్వాసాలు మెండుగా ఉంటాయి. అయితే ఇక్కడ తేడా ఏమిటంటే హిందువుల్లో నెలకొన్న విశ్వాసాల సంఖ్యే రోమన్ కాథలిక క్రైస్తవులకు సైతం ఆశ్చర్యం కలిగిస్తుంది. మతపరమైన, సామాజికపరమైన, అసమానత్వాలు హిందూతత్వంలోనే ఇమిడి ఉన్నాయి. అంతేకాదు. మనము మానవ వ్యక్తిత్వాన్ని గుర్తించకపోవడంతోనే పరిమితం కాలేదు. అసలు విభిన్న మానవుల్లోనే అంతరాలు ఉంటాయనే సిద్ధాంతాన్ని ఆయన వ్యాపింపచేసారు. మనిషికి, మనిషికి మధ్య తేడా ఉంటుందనే ఆయన ప్రచారం చేసిన మరో విశ్వాసం.

ప్రప్రథమంగా సమాజంలో సమానత్వం ఉండాల్సిన అవసరం ఉంది. హిందూమతం స్వేచ్ఛను గుర్తిస్తుందా? అనేది అంబేద్కర్ మరో ప్రశ్న. ఇక రెండో స్థానంలో ఆర్థిక భద్రత ప్రాధాన్యత వహిస్తుంది. విజ్ఞానం అందరికీ అందుబాటులో ఉండాలన్నది మూడో స్థానంలో ఉంటుంది. ఈ సంక్లిష్ట ప్రపంచంలో మనిషి ఎంతో ప్రమాదకరమైన స్థితిలో జీవనం గడుపుతున్నాడు. తన స్వేచ్ఛను ఫణంగా పెట్టకుండా ఇందులో జీవించడం నేర్చుకోవాలి.

ఈ పరిస్థితుల్లో దేనిని హిందూమతం సంతృప్తి పరుస్తుంది? హిందువులా సమానత్వాన్ని ఎలా కాలరాసిందీ ఇప్పటికే స్పష్టమైంది. ప్రత్యేక సదుపాయాలు, అసమానతలను అదిపెంచి పోషిస్తుంది. అందులో స్వేచ్ఛకు ఎంత మాత్రం స్థానం లేదు.

ఆర్థిక భద్రతకు సంబంధించి హిందూమతంలో ముఖ్యంగా మూడు అంశాలు ప్రాధాన్యత సంతరించుకుంటాయి. మొట్టమొదటిగా జీవనభృతి తనకు ఇష్టమైన వృత్తిని ఎంపిక చేసుకునే స్వేచ్ఛను హిందూమతం కల్పించదు. ఇతరుల ప్రయోజనంకోసం మనం జీవించాలని అది ప్రబోధిస్తుంది. పరోపకారార్థం ఇథం శరీరం' అని ప్రవచిస్తుంది. అయితే దురదృష్టకరమైన విషయం ఏమింటే అది శూద్రులకే పరిమితం. శూద్రులు ఎలా వ్యవహరించాలని బోధించడంతోనే మనువు సరిపెట్టుకోలేదు. ఆయన ఇంకో అడుగు ముందువేసి శూద్రులు తమ బాధ్యతలను, దైవోపహతంగా సంక్రమించిన విధిని తప్పించుకోజాలరని హెచ్చరించడం వరకు వెళ్ళారు. శూద్రులు సంపదను సేకరించుకునే అవకాశాన్ని హిందూమతం కల్పించకపోవడం మరో ముఖ్యమైన అంశం. వారు తమకు ఇష్టమైన వ్యాపకాల్ని ఎంపికచేసుకునే అవకాశం లేదు. ఆర్థిక స్వాతంత్ర్యం లేదు. ఆర్థిక భద్రత లేదు. ఆర్థిక విషయాలకు సంబంధించి శూద్రుల గురించి మాట్లాడాల్సిన పనిలేదు. హిందుమతం జ్ఞానవ్యాప్తిని ప్రోత్సహించడానికి బదులు అంధకారాన్ని వ్యాపింపచేస్తుంది. ఈపరిస్థితులనన్నిటినీ ఆకలనం చేస్తే స్వేచ్ఛకు హిందూమతంలో ఎంత మాత్రం ఆస్కారం లేదనే విషయం స్పష్టమవుతుంది.

"హిందూమతం సోదరభావాన్ని గుర్తిస్తుందా?" ఇది అంబేద్కర్ సంధించిన మరో ప్రశ్న.

సమాజంలో రెండు రకాల ధోరణులుంటాయి. అవి వ్యక్తివాదం, సోదరభావం, వ్యక్తివాదం అనేది ఎల్లవేళలా, అన్నిచోట్లా ద్యోతకమవుతుంది. సోదరభావం లేదా సమిష్టితత్వం ఇందుకు పూర్తిగా భిన్నమైంది. ఇతరులను వ్యక్తిగతంగా, భావనాపరంగా గౌరవించడం సోదరభావానికి మరో పేరు. ఇతరులతో సమానంగా తనను పరిగణించుకోవడం ఇందులో ముఖ్యమైన విషయం. ఇతరుల్లో గల మంచిని తాను అనుసరించడం, తనకు వర్తింపచేసుకోవడం వంటి అంశాలు దీనిని విశదపరుస్తాయి. కులాల సంఖ్య అన్నిటికంటే ముఖ్యమైనది. అసలు ఈ సంఖ్య ఎంతో ఎవ్వరూ లెక్కించలేదు. ఇది రెండువేలకు తగ్గదని ఉజ్జాయింపుగా చెప్పవచ్చు. మూడువేలు కూడా కావచ్చు. ఆందోళన కలిగించే విషయం ఇదొక్కటే కాదు. అనేకం ఉన్నాయి.

కులాలు ఉపకులాలుగా విభజింపబడ్డాయి. మరీ గందరగోళం సృష్టించే విషయం ఏమంటే ఈ కులాలు చిన్న చిన్న ఉపకులాలు, జాతులుగా విభజింపబడ్డాయి.

నిచ్చెన మెట్ల కుల వ్యవస్థలో ఒక కులం అన్నింటికన్నా పైన వుండి అత్యున్నత స్థానంలో వుండగా మరో కులం అన్నింటికన్నా అడుగున వుండి అతి నిమ్నమైనదిగా వుంటుంది మధ్యలో వున్న మిగిలిన కులాలు ప్రతి ఒక్కటి ఏక కాలంలో మరో కులానికి ఎగువన కానీ దిగువన కానీ వుంటాయి. ఈ అంతరాల వ్యవస్థలో అన్నింటి కన్నా పైన , అన్నింటి కన్నా దిగువన వున్న కులాలకు తప్ప మిగిలిన అన్ని కులాలు ఏదో ఒక కులంపై ఆధిక్య స్థానంలో, ప్రాధాన్య స్థానంలో వుండటం విశేషం. ఒక కులంపై మరో కులం ఆధిక్యాన్ని మత క్రతువులను నిర్వర్తించడాన్ని బట్టి నిర్ణయిస్తారు. క్రతువులు, కర్మ కాండల నిర్వహణకు అనుగుణంగా కులాల ఆధిక్య, అల్పత్వ స్థానాలను నిర్ణయిస్తున్నట్టు దీనిని బట్టి తెలుస్తున్నది

ఒక కులాన్ని అగ్రస్థానంలో నిలబెట్టే సూత్రాలకు మతం ప్రాతిపదికగా వుంటున్నదనే విషయంలో అస్పష్టతేమీ లేదు. ఈ అగ్రగామిత్వాన్ని మూడు అంశాలు నిర్ణయిస్తాయి 1. మతపరమైన క్రతువులు, వైదిక సంస్కారాలు, కర్మలు, 2 ఈ క్రతువులు, సంస్కారాలు. కర్మలు నిర్వహించే సందర్భంగా పురోహితులు చేసే మంత్రోచ్చాటనలు, 3. పురోహితునికి గల ఉన్నత స్థానం ఒక కులం నిమ్నోన్నతాలను ఈ విధంగా వైదిక కర్మ కాండ కు సంబంధించిన అంశాలు నిర్ణయించడం హిందూ మతంలో మొదటినుంచి వున్నది. బహుళ అంతస్తుల బృహత్ నిర్మాణంగా కుల వ్యవస్థను రూపొందించడం వలన సామాజికంగా మనుషులలో ఒక విధమైన మనస్తత్వం చోటు చేసుకున్నదని చెప్పవచ్చు. గౌరవం పొందడానికి భిన్న కులాలు తమలో తాము ఘర్షణ పడే తత్వాన్ని, దిగువ వున్న కులాలలో ద్వేషాన్ని, ఎగువ వున్న కులాలలో ఛీత్కారాన్ని పెంపొందించిన ఖ్యాతి కుల వ్యవస్థకే దక్కుతుంది.

హిందువులు తమ సుఖదుఃఖాలను ఇతరులతో పంచుకునేందుకు ఎందుకు నిరాకరిస్తారనే ప్రశ్నకు సమాధానం ఇప్పుడు తెలుసుకుందాం. మతం వద్దంటుంది కనుకే హిందువులు తమ జీవితంలో అనుభవించే కష్ట సుఖాలను ఇతరులతో పంచుకోవడానికి ఇష్టపడరనేది తెలిసిందే. ఈ మాట అంటున్నందుకు ఎవరూ అదిరిపోనవసరం లేదు. హిందూ మతం చేసే బోధనలన్నీ నకారాత్మకమైనవే. ఇతర కులస్తులతో సహ భోజనాన్ని, వివాహాన్ని, స్నేహాన్ని హిందూ మతం వద్దంటుంది. చేయకూడని పనుల గురించిన బోధనలతో హిందూ మతం నిండి వుండటం వలన సంఘజీవనం హిందువులకు పనికి రానిదైంది

కులం గురించి అంబేద్కర్ పంచ సూత్రాలను మన ముందుంచారు. అవి వరుసగా 1 కులం శ్రామికులను వేరు చేస్తుంది. 2. పనికీ ఆసక్తికీ మధ్య వుండే బంధాన్ని తుంచి వేస్తుంది. 3. బుద్ధిని, మానసిక శ్రమను, శారీరక శ్రమ నుంచి వేరు చేస్తుంది. 4. ఇష్ట పూర్తిగా చేసే పనులు చేయకుండా నివారిస్తుంది. తద్వారా ఇష్టం లేని, ఆసక్తి లేని పనులను బలవంతంగా చేయిస్తుంది. 5. మనుషులను ఎక్కడికి కదలకుండా ఒక్క దగ్గరే వుండి పోయేలా చేసి వారి అభ్యున్నతిని నిరోధిస్తుంది

కుల వ్యవస్థ శ్రమ విభజన చేయడంతో ఆగక శ్రామికులను కూడా విభజిస్తున్నదనేది గమనార్హం. నాగరిక సమాజానికి శ్రమ విభజన ఎటూ తప్పేది కాదు. కాని ఏ నాగరిక సమాజంలో కూడా శ్రమ విభజనతో పాటు అసహజమైన శ్రామికుల విభజన కనిపించదు. కేవలం భారతదేశంలో మాత్రమే ఈ శ్రామికుల విభజన స్వభావికమైనది, సహజమైన ఇష్టాయిష్టాలతో కూడినది కాదు. సమాజంలో ప్రతి మనిషికి తాను ఎంచుకునే వృత్తిలో నైపుణ్యం పెంచుకుని ఇతరులతో పోటి పడే హక్కు, వృత్తిలో పైకి ఎదిగే హక్కు వుంటుంది. వుండాలి. కాని భారతీయ సమాజంలో మాత్రం కుల వ్యవస్థ మూలంగా ఈ సూత్రం అమలుకు నోచుకోవడం లేదు. ఎందుకంటే కుల వ్యవస్థలో మనిషికి తన వృత్తిని ఎంచుకునే స్వతంత్రం లేదు. తాను బాగా చేయగలననుకున్న పనిలో శిక్షణ పొంది ఎదిగే అవకాశం అంతకన్నా లేదు. మనిషి భూమి మీద కాలు మోపకుండా అతను చేపట్టవలసిన వృత్తి ఏమిటో కుల వ్యవస్థ నిర్ణయిస్తుంది. అతని తల్లిదండ్రులు ఏ పని చేస్తారో అదే పని వారికి పుట్టినందు వలన చేయవలసివుంటుంది. అంతా ముందే నిర్ణయమైపోవడం వలన మనిషికి వృత్తినే కాదు తన జీవితంలో దేనిని ఎంచుకునే హక్కు లేకుండా చేసింది కుల వ్యవస్థ. ఈ విధంగా కుల వృత్తులతో మనుషులు సంతృప్తి చెందడం వారి పురోగతికి ఏ మాత్రం తోడ్పడే అవకాశం లేదు. వారి జీవితాలలో స్తబ్దత ఏర్పడడానికి, పురోగతి లేకుండా వారి ఆర్థిక, సాంఘిక జీవనం స్తంభించిపోవడానికి ఇది దోహదం చేస్తుంది. కులం మనిషి జవ జీవాలను హరించి వేసి అతడిని పీల్చి పిప్పి చేస్తుంది. ప్రాణుల సహజ లక్షణమైన 'కదలిక' లేకుండా చేసి మనిషిని బందీని చేస్తున్నది.

## సెక్షన్-4

### హిందూ సామాజిక వ్యవస్థ

'ఇండియా అండ్ కమ్యూనిజం' అనే పుస్తకంలో భాగంగా ఈ అధ్యాయం కనిపిస్తుంది. ఈ అధ్యాయంలో రెండు ఛాప్టర్లున్నాయి. (1) హిందూ సామాజిక వ్యవస్థలు - దాని ప్రధాన సిద్ధాంతాలు, (2) హిందూ సామాజిక వ్యవస్థ – దాని విశిష్ట లక్షణాలు. అంతరాల అసమానత సూత్రాన్ని అంబేద్కర్ ఆర్థిక రంగానికి కూడా అన్వయించారు. హిందూ సామాజిక వ్యవస్థను "ప్రతి మనిషి నుంచి అతని శక్తి మేరకు - ప్రతి మనిషికి అతని అవసరం మేరకు" అనే సార్వజనీన సూత్రానికి విరుద్ధమైన "ప్రతి మనిషి నుంచి అతని అవసరం మేరకు - ప్రతి మనిషికి అతని కులీనత మేరకు" అనే సూత్రం నిర్దేశిస్తున్నది. హిందూ వ్యవస్థను నడుపుతున్న మొదటి సూత్రం ఇది . కుల వృత్తుల శాశ్వతత్వం ఈ వ్యవస్థ రెండవ సూత్రం. వంశ పారం పర్యంగా వృత్తులు కొనసాగుతుండటం దీని అంతస్సూత్రం మూడవ సూత్రం మనుషులను వారి వారి వర్గాలకు పరిమితం చేయడం. కుల పరిమితి వర్గ పరిమితిని అనివార్యంగా విధిస్తుంది కనుక హిందూ సమాజం వర్గ బేధాలను గుర్తిస్తుంది.

హిందూ సమాజ వ్యవస్థ సోదర భావానికి బద్ధ విరోధి . సమానత్వం సూత్రాన్ని అది అంగీకరించదు. అంగీకరించకపోగా అసమానత్వాన్ని తన అధికార సిద్ధాంతం చేసింది. స్వేచ్ఛకు కూడా ఈ వ్యవస్థల్లో చోటు లేదు. వృత్తి ఎంచుకునే స్వేచ్ఛ ఎటూ లేదు. ప్రతి ఒక్కరి వృత్తిని అంతకు మునుపే నిర్ణయించడం వలన, ఎవరికి తన వృత్తికి సంబంధించి స్వతంత్రం లేదు. మాట్లాడే హక్కు , భావాలను ప్రకటించే హక్కు వుంటుంది. కాని కొందరికే వుంటుంది. వ్యవస్థకు అనుకూలంగా వుండే వారికి మాత్రమే వుంటుంది. పాశ్చాత్య ఉదారవాదం ప్రవచించిన భావ ప్రకటనా స్వేచ్ఛ ఈ వ్యవస్థలో ఏనాడూ లేదు. "నువ్వు చెప్పేదానితో నాకు ఏకీభావం లేదు. అయినా నీ చెప్పే హక్కును కాపాడటం కోసం నా ప్రాణం పోయే వరకు పోరాడుతాను" అని వోల్తేర్ చెప్పిన మాట ఇక్కడ అసంబద్ధమైనదిగా కనిపిస్తుంది.

హిందూ సమాజ వ్యవస్థ వర్గ ప్రాతిపదికపై ఏర్పడిన వ్యవస్థ. వ్యక్తికి ఈ వ్యవస్థలో ప్రాధాన్యం లేదు. వర్గాలను ఒకదానిపై ఒకటిగా ఏర్పరచిన వ్యవస్థ ఇది. ఆయా వర్గాల హోదా, విధులు కాలాతీతంగా నిర్ణయమైపోయిన వ్యవస్థ ఇది. మార్పుకు అవకాశం లేని కరుడు కట్టిన వ్యవస్థ ఇది. ఒక వ్యక్తి జీవితంలో కొన్ని గుణాత్మకమైన మార్పులు ఏర్పడినా, అతని సామాజిక హోదాలో మాత్రం మార్పు వుండదు. తాను పుట్టిన వర్గానికి మాత్రమే అతడు ప్రతినిధిగా వుంటాడు కనుక మరో వర్గానికి చెందిన మనిషితో అతని సంబంధాలలో ఎటువంటి మార్పు వుండదు. మొదటి వాడు చివరివాడు కాలేనట్లే, చివరివాడు మొదటి వాడు కాలేడు.

హిందూతత్వంలో సమానత్వానికి, స్వాతంత్రానికి, సోదర భావానికి స్థానం లేదు. సామాజిక ప్రయోజకత్వం కానీ, వ్యక్తికి న్యాయం కానీ హిందూ మతంలో వుండే అవకాశం లేదని దాని తాత్విక పూర్వ రంగం స్పష్టం చేస్తున్నదని అంబేద్కర్ తీర్మానించారు. మను స్మృతిలోని అంశాలు హిందూ మతతత్వం అంతస్సారాన్ని, అంతరార్థాన్ని మన ముందుంచుతాయి. హిందూ మతం అధి మానవుడి రాకను ఆహ్వానిస్తుంది. అధిమానవుడికి ఏదైతే సమ్మతమో అదే నైతికంగా సరైనది, మంచిది అంటుంది హిందూ మతం.

అంబేద్కర్ మనువును అందరూ అసహ్యించుకునే, భయపడే జర్మన్ తత్వవేత్త నీషేతో పోలుస్తాడు. ఈ పోలిక హిందూవులకు ఆశ్చర్యాన్ని, ఆగ్రహాన్ని కలిగించవచ్చు. కాని ఈ పోలికలో అతియోశక్తి లేదన్నదీ నిర్వివాదం. తాను మనువు మార్గంలో తన తత్వశాస్త్రాన్ని నిర్మిస్తున్నట్లు నీషే తన 'యాంటీ క్రైస్ట్' గ్రంథంలో బహిరంగంగా ప్రకటించుకున్నాడు. మనువుకు నీషేకు తేడా లేదని కాదు, వుంది నీషే ప్రస్తుతం ఉనికిలో వున్న మానవ జాతి స్థానంలో నూతన జాతిని తద్వారా అధి మానవుని సృష్టించాలని ఆశించాడు. మనువు అందుకు భిన్నంగా ఒక వర్గం హక్కులను, ప్రయోజనాలను కాపాడటం కోసం వారిని అధి మానవులుగా చిత్రించడం కోసం పాటుపడ్డాడు. నీషే అధిమానవుడు తన ప్రతిభ వలన అధి మానవుడైతే, మనువు అధి

మానవుడు కేవలం తన పుట్టుక వలన అధి మానవుడయ్యాడు. నీట్షేకు తన అధిమానవతత్వాన్ని ప్రతిపాదించడంలో స్వార్థ ప్రయోజనాలు లేవు. కాని మనువు మాత్రం తమను తాము అధి మానవులుగా చెప్పుకునే మనుషుల వర్గ ప్రయోజనాలను పరిరక్షించడానికి అందుకు అనుగుణమైన తత్వ శాస్త్రాన్ని సృష్టించాడు. అధి మానవులకు వుండవలసిన గుణగణాలను వారు కోల్పోయినా వారి అధి మానవ హోదాకు భంగం రాకుండా చూసిన ఘనత ఒక తత్వవేత్తగా మనువుకు దక్కుతుంది.

హిందూ మత తత్వాన్ని బట్టి చూస్తే, హిందూ మతాన్ని మానవీయ మతమని చెప్పజాలం. హిందూ మతం సాధారణ మానవుల అంతరంగ జీవితాన్ని బలోపేతం చేయకపోగా, స్తంభింప చేస్తుందని బల్ఫోర్ చెప్పిన మాట ఈ వాస్తవాన్ని మరో విధంగా మన ముందుంచుతుంది. సామాన్య మానవుల ఆత్మ క్షోభకు హిందూ మతంలో విరుగుడు లేదు. వారికి దుఃఖం నుంచి ఉపశమనం లేదు. వారి సాధారణ బలహీనతల నుంచి బయటపడవేసే మార్గోపాయం లేదు . వారి ఆధ్యాత్మిక అవసరాలను తీర్చే పుష్టి – తుష్టి లేదు. ప్రకృతి శక్తులతో ఒక మేరకు పోరాడి ఓడిపోయే శ్రమజీవుల చీకటి బతుకులలో కాంతిని నింపే శక్తి దానికి లేదు. భగవంతునిలో మనిషికి ప్రత్యక్షంగా ఎటువంటి సంబంధ బాంధవ్యాలు లేకుండా చేసిన మతం బహుశా యావత్ ప్రపంచంలో ఇదొక్కటేనంటే అతిశయోక్తి కాజాలదు. ఇది హిందూ మత సారాంశం. దాని అంతస్సారం. మొత్తంగా దాని తత్వం. అధి మానవుడికి స్వర్గం. సామాన్యుడికి నరకం రుచి చూపెట్టేదే హిందూ మతం. అసమానత దాని ఆత్మ. దాని నీతి బాహిరమైనది. అంతస్సుతో దానికి నిమిత్తం లేదు. దానికి నీతి లేదు. మానవాంశ లేదు. నీతి లేనిది అవినీతిగా, మానవాంశ లేనిది అమానుషంగా అప్రతిష్ట పాలవకతప్పదు కదా! హిందూ మతానికి అదే జరిగింది.

అంబేద్కర్ తలపెట్టి పూర్తి చేయని ఈ గ్రంథంలో 18 అధ్యాయాలను తలపోశారు. కాని అత్యధిక అధ్యాయాలు అసంపూర్ణంగా వున్నాయి . ఈ గ్రంథంలోని రెండవ, మూడవ అధ్యాయాలలో వెలిబుచ్చిన అభిప్రాయాలనే ఇక్కడ నేను సంక్షిప్తం చేశాను. మనుస్మృతిని, ఇతర హిందూ స్మృతులను ఆయన ఈ సందర్భంగా విరివిగా ఉదహరించారు.

## సెక్షన్-5

### హిందూ మతంలోని చిక్కుముడులు

గ్రంథం మొదటి భాగంలో అంబేద్కర్ 15 చిక్కుముడులను 5 అనుబంధాలను మన ముందుంచారు. సామాజిక అంశాలకు ప్రాధాన్యమిచ్చిన రెండో భాగంలో ఐదు చిక్కు ముడులు, రెండు అనుబంధాలు వుండగా , రాజకీయ అంశాలకు ప్రాధాన్యమిచ్చిన మూడో భాగంలో నాలుగు చిక్కు ముడులు ఒక అనుబంధం వున్నాయి. రామకృష్ణుల చిక్కు ముడి ఈ భాగంలోనే మనం చూస్తాం. వేదాల పుట్టుక, అవి బోధించిన నైతిక, ఆధ్యాత్మిక విలువల

గురించి అంబేద్కర్ పుంఖానుపుంఖాలుగా రాశారు. వర్ణ వ్యవస్థ, వర్ణాశ్రమ ధర్మం, కలియుగం, మన్వంతరం వంటి అనేక అంశాలపై కూడా ఆయన సవివరంగా రాశారు

హిందూ మతంలోని చిక్కు ముడులు గ్రంధానికి రాసిన ఉపోద్ఘాతంలో బ్రాహ్మణిక సిద్ధాంతం ప్రతిపాదించిన విశ్వాసాల నిజరూపాన్ని వెలుగులోకి తెచ్చేందుకు ఈ పుస్తకం రాస్తున్నట్లు అంబేద్కర్ పేర్కొన్నారు. హిందూ మతంలో అణగారిపోతున్న సామాన్య జనానికి బ్రాహ్మణులు చేసిన తప్పిదాలను తెలియచెప్పడానికి, హేతువాద మార్గంలోకి వారిని మళ్లించడానికి గ్రంధ రచనకు పూనుకున్నట్లు ఆయన చెప్పుకున్నారు. హిందూ మతం సనాతనమైనది కాదనే సత్యాన్ని ప్రజలు గుర్తించేలా చేయడమే తన లక్ష్యంగా చెప్పుకున్నారు బ్రాహ్మణులు సామాన్య ప్రజానీకాన్ని మోసగించిన తీరును, అందుకు వారు ఎంచుకున్న పద్ధతులను, వారిని బ్రాహ్మణులు అన్ని వేళలా ఎలా తప్పు దారి పట్టించింది లోకం ముందు వుంచడమే లక్ష్యం అని ఆయన చెప్పుకున్నారు. బ్రాహ్మణులకు మతం కన్నా దక్షిణ ముఖ్యమని, వాళ్లు మతాన్ని వాణిజ్యంగా, లాభదాయకమైన వ్యాపారంగా మార్చారని ఆయన పేర్కొన్నారు

వేదాలు అసత్యం కానేరని అమోఘమైన జ్ఞాన నిధి అనే మోసపూరిత ప్రచారాన్ని బ్రాహ్మణులు విస్తృత స్థాయిలో చేపట్టడం ద్వారా ప్రజలలో వాటిపై సందేహానికి అతీతమైన విశ్వాసం ఏర్పడేందుకు కారణమయ్యారు. భారతదేశం పురోగమించాలంటే ముందు వేదాలపై వున్న చెదరని విశ్వాసాన్ని ధ్వంసం చేయాలి. హిందూవుల మేధో వికాసం ఆగిపోకూడదన్న హిందూ నాగరికత . సంస్కృతి మృతప్రాయం కాకూడదన్నా ఈ మూఢ విశ్వాసం సమూలంగా చెదిరిపోవాలి. వాస్తవానికి వేదాలనేవి ఎందుకు పనికిరాని నిరర్థక గ్రంధాలు వాటిని పవిత్రమైనవని, సత్యపూర్వకమైనవి అని చెప్పడానికి ఎటువంటి ఆధారం లేదు. తర్వాతి కాలంలో వేదాలకు అనుబంధంగా జత చేసిన పురుష సూక్తం బ్రాహ్మణులను భూసురులుగా, పాలకులుగా పేర్కొనడం వలన వారు వేదాలకు పవిత్రతను, కాలాతీత ప్రభావాన్ని అపాదించారు. శత్రు సంహారానికి , శత్రువుల సంపదలను దోచుకోవడానికి , దోచిన దానిని తమ అనుచరులకు ధారదత్తం చేయడానికి ఆదిమ దేవతలను ఉచ్చాటన చేసిన వేదాలను పవిత్రమైనవిగా, సత్యానికి ప్రతి రూపంగా చెప్పడాన్ని సవాలు చేసే ధైర్యం ఎవరికీ లేకపోయింది. కాని హిందూ మేధస్సు బ్రాహ్మణులు ప్రచారం చేసిన మూర్ఖపు భావాల ప్రభావం నుంచి విముక్తం కావలసిన సమయం వచ్చింది ఈ విమోచన జరగకుండా దేశానికి భవిష్యత్తు వుండే అవకాశం లేదు. ఈ పని ఎంత ప్రమాదకరమైనదో నాకు తెలుసు . తెలిసి కూడా దీనిని నేను చేపట్టాను. పరిణామాలకు భయపడి బాధ్యతలను విస్మరించే తత్వం కాదు నాది ప్రజలను మేలు కొల్పడంలో సఫలం కాగలిగితే అదే నాకు సంతోషం.

హిందూ సామాజిక వ్యవస్థ దైవాజ్ఞ మేరకు ఉనికిలో వున్నదని ప్రతి హిందువు యొక్క ప్రగాఢ విశ్వాసం ఈ దైవ (దివ్య) వ్యవస్థకు మూడు సూత్రాలు పట్టుకొమ్మలుగా

వున్నాయి. మొదటిది  సమాజం నాలుగు సమూహాలుగా వేరుపడి ఉన్నది. 1. బ్రాహ్మణులు 2. క్షత్రియులు 3. వైశ్యులు  4. శూద్రులు. రెండవది ఈ నాలుగు వర్ణాలు అంతరాలతో కూడిన అసమానతల వ్యవస్థలో  పరస్పర సంబంధం కలిగివున్నాయి. ఈ అసమ వ్యవస్థలో బ్రాహ్మణులు మిగిలిన మూడు వర్ణాల కన్నా పైన అగ్రభాగాన వుండగా క్షత్రియులు బ్రాహ్మణులకు దిగువన వైశ్యులు శూద్రులకు ఎగువన, వైశ్యులు బ్రాహ్మణులకు, క్షత్రియులకు దిగువన, శూద్రులకు ఎగువన వుంటారు. శూద్రులు మాత్రం ఈ మూడు వర్ణాలకు అడుగున వుంటారు. మూడవది ఈ నాలుగు వర్ణాల వృత్తులు పుట్టుక ద్వారా సంక్రమించి ఎటువంటి మార్పు లేకుండా శాశ్వతంగా వుంటాయి. బ్రాహ్మణుల వృత్తి అధ్యయనం, బోధన కాగా క్షత్రియుల వృత్తి యుద్ధ విద్యలు నేర్వడం. యుద్ధాలు చేయడం. వైశ్యుల కుల వృత్తి వ్యాపార వాణిజ్యాలు కాగా శూద్రుల వృత్తి ఈ మూడు అగ్ర వర్ణాలకు సేవలు చేయడం. దీనినే హిందువులు వర్ణ వ్యవస్థ అన్నారు. హిందూ మతానికి ఇది ఆత్మగా వున్నది. హిందూ మతాన్ని ఇతర మతాల నుంచి వేరు చేసేది వర్ణ వ్యవస్థ అంటే అతిశయోక్తి కాదు.

ఈ మూడు సూత్రాల సారాంశమే మనకు రామాయణంలో కనిపిస్తుంది. మహాభారతం కొద్ది మార్పులతో మనువు ఈ నాలుగు వర్ణాలను సృష్టించాడని చెబుతుంది. అయితే మనువు శరీరావయవాల నుంచి ఈ నాలుగు వర్ణాలు మనుగడలోకి వచ్చాయని మాత్రం మహాభారతం చెప్పలేదు. బ్రాహ్మణులు ప్రణాళికబద్ధమైన ఆర్థిక వ్యవస్థను నిర్మించడానికి పురాణ కాలంలో చేసిన ఒక ప్రయత్నమే ఆశ్రమ వ్యవస్థ అని చెప్పవచ్చు. బ్రాహ్మణులు ఈ వ్యవస్థను సృష్టించడానికి గల కారణాలు, దాని వెనుక గల ఉద్దేశాలు తెలుసుకోవడం ఒక చిక్కుముడిగా పరిణమించిందని కూడా చెప్పవచ్చు.

**రాముడు గురించి ?**

ఈ రాముడు పూజనీయుడా ? మన ఆరాధనకు అర్హుడా? అన్నది ఇప్పుడు మన ముందు వున్న ప్రశ్న . రాముని జన్మ వృత్తాంతం వ్యభిచారంతో నిండి వుంది. రాముని కన్నా కూడా అతని ముగ్గురి సోదరుల జన్మ కథ మరింత వ్యభిచారంతో కూడి వుంది. సీతతో రాముని పెళ్లి వివాదాలకు అతీతమేమి కాదు. బుద్ధ రామాయణం ప్రకారం సీత రామునికి స్వయానా చెల్లెలు. వారిద్దరూ దశరథుని సంతతే. అయితే వాల్మీకి రామాయణం బుద్ధ రామాయణం చెప్పిన దానితో అంగీకరించలేదు. వాల్మీకి ప్రకారం సీత వైదేహ దేశపు రాజు జనకుని కుమార్తె . కనుక రామునికి సోదరి అయ్యే అవకాశం లేదు. అయితే  వాల్మీకి చెప్పిన దాని ప్రకారం చూసినా సీత జనకుని స్వంత కూతురు కాదు. నాగలితో పొలం దున్నతున్న ఒక రైతుకు ఆమె లభించింది. ఆ రైతు భూమిలో దొరికిన ఆ శిశువును సంతానం లేని రాజుకు కానుకగా ఇచ్చాడు. దీని ప్రకారం సీతను జనక మహారాజు కుమార్తెగా చెప్పలేం.

రామునికి ఆపాదించిన గుణగణాలలో అతి ముఖ్యమైనది అతని ఏకపత్నీవ్రతం. వాస్తవానికి విరుద్ధమైన, నిరాధారమైన ఈ మాట సకల జనామోదం ఎలా పొందగలిగిందో అర్థం కాదు ఎందుకంటే వాల్మీకి రామాయణం ప్రకారం చూసినా రామునికి లెక్కకు మిక్కిలి భార్యలున్నారు. భార్యలే కాదు, అనేక మంది ఉంపుడుగత్తెలు కూడా వున్నారు. ఈ విషయంలో రాముడు తన నామమాత్రపు తండ్రి దశరథుని అడుగుజాడలలో నడిచాడని చెప్పవచ్చు. ఎందుకంటే దశరథునికి కూడా అందరికీ తెలిసిన ముగ్గురు భార్యలతో పాటు మరెందరో భార్యలున్నారు.

రాముడు ఎటువంటి వాడో తెలుసుకునేందుకు వీలుగా ఇక్కడ అతనికి సంబంధించిన రెండే రెండు అంశాలను ప్రస్తావిస్తాను. వీటిలో మొదటిది వాలిని వధించడానికి సంబంధించింది. కాగా రెండవది సీతతో వ్యవహరించిన తీరుకు సంబంధించినది. మొదట వాలి వధకు దారి తీసిన సంఘటనను పరిశీలిద్దాం. రాముడు సుగ్రీవుని పక్షం వహించిన సంగతి తెలిసిందే. అన్నదమ్ములు వాలి, సుగ్రీవుల మధ్య ద్వంద్వ యుద్ధం మొదలవుతుంది. రాముడు అన్నదమ్ములిద్దరిలో ఎవరెవరైందీ కనుగొనేందుకు వీలుగా సుగ్రీవుడు తన మెడలో హారాన్ని ధరిస్తాడు. రాముడు దూరంగా చెట్టు వెనుక దాగి తన బాణం సంధించి వాలిని హతమారుస్తాడు. ఆ విధంగా కిష్కింధ రాజ్యానికి సుగ్రీవుడిని రాజును చేసేందుకు మార్గం సుగమం చేస్తాడు. వాలి వధ రాముని వ్యక్తిత్వంపై మాయని మచ్చ అని చెప్పవచ్చు రాముడికి వాలితో ప్రత్యక్షంగా ఎటువంటి వైరం లేదు. వాలి యుద్ధానికి తనను ఉసిగొల్పనూ లేదు. అంతే కాదు, ఆ సమయంలో వాలి నిరాయుధునిగా వున్నాడు. ఇది రాముని పిరికిపంద చర్య. అందుకే దీనిని ముందుగా రూపొందించుకుని చేసిన హత్యగా చెప్పవచ్చు.

ఇక సీత విషయానికి వస్తే, రావణ వధ తర్వాత రాముడు నేరుగా సీత వద్దకు వెళ్లవలసి వుంది. కాని ఆయన ఆ పని చేయలేదు. సీతను కలుసుకోవడం కన్నా పట్టాభిషేకమే అతనికి ప్రధానమవుతుంది. పట్టాభిషేకం అనంతరం కూడా సీత వద్దకు వెళ్లాలనే ఆలోచన అతనికి రాదు

పట్టాభిషేకం తరువాత కూడా శ్రీరాముడు తనంతట తానుగా సీత వద్దకు వెళ్ళలేదు. హనుమంతుడ్ని పంపుతాడు. ఈ చర్య ఏ సందేశం పంపుతుంది? సీతను తీసుకురమ్మని కూడా హనుమంతుడ్ని శ్రీరాముడు ఆదేశించలేదు. తాను ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉన్నానని మాత్రమే సీతకు వివరించమని హనుమంతుడికి చెపుతాడు. రాముడ్ని చూడాలనే కోరికను సీత మాత్రమే వ్యక్తం చేస్తుంది. రావణుడిచే అపహరించబడి 10 మాసాలకు పైగా నిర్బంధంలో ఉన్న సీత దగ్గరికి రాముడు వెళ్లలేదు. సీతను రాముడి వద్దకు తీసుకువచ్చారు. సీతను చూసినపుడు రాముడు ఆమెతో ఏమి చెప్పాడు? "నా శత్రువు, నిన్ను అపహరించిన వ్యక్తిని యుద్ధంలో

వధించి నిన్ను బహుమతిగా పొందాను. నా సైనిక సామర్థ్యాన్ని ప్రజలు వీక్షించారు. నేను పడ్డ శ్రమ ఫలించినందుకు ఎంతో ఆనందంగా ఉంది. నా శత్రువును సంహరించాను. నా గౌరవాన్ని తిరిగి పొందాను. రావణుడ్ని వధించి గౌరవాన్ని తిరిగి పొందేందుకే ఇక్కడకు వచ్చాను. నేను పడ్డ ఇంత తపనా నీకోసం కాదు." రాముడు అంతటితో ఆగలేదు. ఆమెతో ఇంకా ఇలా చెప్పాడు. "నీ ప్రవర్తనను నేను సందేహిస్తున్నాను. రావణుడు నిన్ను పాడుచేసే ఉంటాడు."

కృష్ణుడు - ఈయన మహాభారతంలో హీరో.

రాముడు, కృష్ణుడ్ని అంబేద్కర్ నిర్దయగా విమర్శించారు. వారిద్దరూ దేవుళ్ళు కాదనే అంతిమ నిర్ణయానికి వచ్చారు. సాధారణ మానవులకంటే అతీతులు కాదని తీర్పు ఇచ్చారు.

## సెక్షన్-6

### బౌద్ధంలోకి మార్పు

అస్పృశ్యుల నుండి దేవాలయాలను వేరు చెయ్యడాన్ని 1929 జనవరిలోనే అంబేద్కర్ వ్యతిరేకించారు. బాబూరావు గైక్వాడ్‌కు రాసిన లేఖలో ఈ అంశాన్ని ఆయన స్పష్టం చేశారు. వాస్తవానికి ఆయన ఆదర్శవంతమైన ఆరాధకుడు కాదు. తనకంటూ కొన్ని నిర్దిష్టభావాలు కలిగినవారు. ఇతరుల విశ్వాసాలను ప్రశ్నించేవారు.

1927లో మహర్ సత్యాగ్రహం తరువాత అస్పృశ్యుల సామాజిక, మతపరమైన పోరాటం విభిన్న కోణం తీసుకుంది. అణచివేతకు గురవుతున్న వారి ప్రతి సమావేశాల్లో హిందూయిజాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానాలు చేయసాగారు. హిందూమతం కాకుండా మరోదానినైనా స్వీకరించాలని వారిని కోరుతూ 1929 మే 29న జరిగిన జలగావ్ సదస్సు తీర్మానం చేసింది. హిందువులు తనను ఎంతగా క్షోభపెట్టినప్పటికీ తాను హిందూమతాన్ని పరిత్యజించబోనని 1930 ఆగస్టులో నాగపూర్‌లో జరిగిన మొట్టమొదటి అణగారిన వర్గాల సదస్సులో ప్రసంగిస్తూ అంబేద్కర్ పేర్కొన్నారు. అంబేద్కర్ ఆలోచనలో పరస్పర వైరుధ్య వైఖరి ఆయన ప్రసంగంలో స్పష్టంగా కనిపించింది. అయితే ఆయన ఆలోచన ఆ విషయంలోనూ స్థిరంగా లేదు. అస్పృశ్యులు వేరే మతం స్వీకరించక తప్పనిసరి పరిస్థితులు రోజురోజుకు పెరిగిపోతున్నట్లు ఆయన ఆ తరువాత భావించారు.

అంబేద్కర్ ఇస్లాం మతం స్వీకరించాలని భావిస్తున్నట్లు 1933 మధ్యలో ఒకవార్త కొన్ని వర్గాల్లో వ్యాపించింది. తమ సమస్యలు పరిష్కరించే వరకు అటువంటి 'రాజా' వేగిరపాటు నిర్ణయం తీసుకోరాదనేది తమ ప్రజల సాధారణ అభిప్రాయమని పేర్కొంటూ అంబేద్కర్‌కు సుబేదార్ సావర్కర్ ఒక లేఖ రాసారు. అంబేద్కర్ ఈ లేఖకు లండన్ నుండి జాబు రాశారు. మతమార్పిడి గురించి తాను గవాయ్‌తో చర్చించానని, హిందుమతాన్ని వీడి మరో ఇతర మతం స్వీకరించాలని నిర్ణయించుకున్నానని ఆలేఖలో పేర్కొన్నారు. ఇస్లాం మతాన్ని ఎన్నడూ



సుందరయ్య గ్రంథాలయ ... A C No 88664

స్వీకరించబోనని, బౌద్ధంలో చేరాలని ఆ సమయంలో భావిస్తున్నట్లు అంబేద్కర్ ఆ లేఖలో వెల్లడించారు

మతమార్పిడి గురించి యియోలా (మహారాష్ట్రలోని నాసిక్‌జిల్లాలో ఉంది) సదస్సులో ప్రకటించాలని అంబేద్కర్ యోచిస్తున్నట్లు పత్రికల్లో వార్త వచ్చింది ఆ సదస్సు 1935 అక్టోబర్‌లో జరిగింది. అలా ప్రకటించవద్దని కోరుతూ ఎన్.సి. కేల్కర్, ఎల్.బి. భోపాట్కర్, చిత్రావ్‌శాస్త్రి, ఎస్.ఎం. మాటే మహారాష్ట్రలోని ఇతర హిందూ సంఘసంస్కర్తలు సంయుక్తంగా లేఖ రాశారు తాను దురదృష్టవశాత్తు హిందూ అస్పృశ్యునిగా జన్మించానని అంబేద్కర్ పేర్కొన్నారు దానిని నిరోధించే సామర్థ్యం తనకు లేదని అన్నారు. "నేను హిందువుగా మరణించబోనని స్పష్టంగా వెల్లడిస్తున్నాను" అని ప్రకటించారు. స్వేచ్ఛ పౌరుల అభ్యున్నతి కోసం హిందూమతానికి వెలుపల ఒక ప్రత్యేక సమాజాన్ని ఆయన ఆవిష్కరింపచేశారు. హిందూ కులస్థులతో సమానత్వం కోసం అస్పృశ్యులు సాగిస్తున్న అన్నిరకాల పోరాటాలను నిలిపివేస్తు సదస్సు ఒక తీర్మానాన్ని ఆమోదించింది. తాము చేస్తున్న పోరాటాల నిరర్థకంగా మారుతున్నాయని భావన కలగడమే ఈ తీర్మానం చెయ్యడానికి కారణం. అణగారిన వర్గాల అసలు లక్ష్యాలు, ఆశయాల నుండి స్పష్టంగా వైదొలుగుతూ సమావేశం ముగిసింది. హిందూమతంలోని అస్పృశ్యుల తమ మతం స్వీకరించే అవకాశం ఉందని ఇస్లాం నాయకులు, క్రైస్తవ మత అనుచరులు భావించారు. సిక్కులు కూడా అదే విధంగా ఆలోచించారు.

హిందూమతాన్ని వీడుతున్నట్లు అంబేద్కర్ చేసిన ప్రకటన ప్రకంపనలు సృష్టించింది. ఈ ప్రకటన పట్ల అనేకమంది నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు గాంధీజి ఇలా అన్నారు. "ఇది దురదృష్టకరమైన సంఘటన. మతం అన్నది శరీరదేహం కంటే కూడా అంతర్గతమైన విషయం. విశ్వాసాలను మార్చుకోవడం వల్ల ఒనగూడే ప్రయోజనాలు ఏమీ ఉండవు". ఆయన ఇంకా ఇలా వ్యాఖ్యానించారు. "మతం అనేది బేరం ఆడే వస్తువు కాదు" ఇటువంటి ప్రమాదకరమైన నిర్ణయాలు తీసుకోవడం వల్ల వచ్చే పరిమాణాల గురించి వి డి. సావర్కర్ అణగారిన వర్గాలను హెచ్చరించారు. భారతదేశంలో క్రైస్తవ మతంలోగానీ, ఇస్లాం మతంలోగానీ వారు సమానత్వం పొందే అవకాశమే లేదని తేల్చి చెప్పారు సమానత్వం కోసం ధీరువు మాదిరిగా పోరాడాలని ఆయన అంబేద్కర్‌కు పిలుపునిచ్చారు.

సంఘ సంస్కర్తల కార్యకలాపాలను అంబేద్కర్ సంక్లిష్టం చేస్తున్నారని ఆనాటి కాంగ్రెస్ అధ్యక్షులు బాబు రాజేంద్ర ప్రసాద్ వ్యాఖ్యానించారు. దేవ్‌రుక్కర్, కజ్రోల్కర్ వంటి అణగారిన వర్గాల నాయకులు సైతం అంబేద్కర్‌ను వ్యతిరేకించారు రౌండ్ టేబుల్ సదస్సుకు అంటరానివారు బలం పెంచుకుని హక్కుల సాధనకు పోరాటం చేయాలని అంబేద్కర్‌తో పాటు హాజరైన డా॥ సోలంకి శ్రీనివాసన్ చెప్పారు.

కుల వ్యవస్థను రద్దు చేసినప్పుడు మాత్రమే హిందువుల మధ్య సంఘీభావం ఏర్పడుతుందని అంబేద్కర్ భావించారు. హిందువులు సంఘటితమైనప్పుడు శుద్ధి అనేది దాని అర్థాన్ని కోల్పోతుందని ఒకవేళ శుద్ధి చేసినా కూడా అది హిందువుల సంఘటిత శక్తికి నిదర్శనంగా మాత్రమే వుండగలదని ఆయన భావించారు. కులం మనుగడలో వున్నంత కాలం శుద్ధి పాటించడం కుదరని పని. ఒక వేళ కుదిరినా కూడా నిజమైన ఐక్యతకు, సంఘీభావానికి అది హాని చేస్తుంది. హిందూ సమాజాన్ని మౌలికంగా మార్చాలని చెప్పే సంస్కర్త ఎందుకో కాని కులం రద్దు చేసే విషయం వచ్చేసరికి వెనుకడుగు వేయడం, మతం మార్చుకున్న హిందువును తిరిగి మతంలోకి తీసుకురావాలని చెప్పడం ఆశ్చర్యం కలిగిస్తుంది. హిందూ మతం నుంచి బయటికి వెళ్లి తిరిగి వెనక్కి వచ్చిన వాళ్లు ఆహారం, విహారం, ఆచారాలను మార్చుకుంటే సరిపోతుందని ఆయన అంటారు. కులాన్ని ఒక వైపు కాపాడుకుంటూనే తమ సమాజాన్ని రక్షించుకోవడం సాధ్యం కాదనే విషయాన్ని హిందువులకు ఏదో ఒక నాటికి అర్థం కాకపోదు. ఆ రోజు ఎంతో దూరంలో లేదని ఆశిద్దాం.

హిందూ మతం ప్రాతిపదిక అసమానత కావడం వలనే, అణగారిన కులాలు హిందూ మతం, దాని నీతి శాస్త్రాల పరిధిలో వున్నన్నాళ్లు పరిపూర్ణంగా వికాసం చెందలేవు కనుక ఉద్దేశపూర్వకంగానే ఇయోలా ప్రకటన చేయడం జరిగిందని గాంధీ చేసిన వ్యాఖ్యకు స్పందనగా అంబేద్కర్ వ్యాఖ్యానించారు. మతం ఆవశ్యకతను గాంధీతో పాటు ఇయోలా కూడా అంగీకరించారు. కాని వర్తమానంలో మతం పట్ల తీవ్ర వ్యతిరేకత ఏర్పడి దానికి విరుద్ధమైన భావాలు ఏర్పరుచుకున్న మనిషి సైతం ఆ మతం అనేది తన పూర్వీకుల వారసత్వం కనుక దానికి కట్టుబడి వుండాలని గాంధీ చెప్పిన దానితో ఆయన విభేదించారు. హిందూ మతాన్ని వీడాలని అణగారిన కులాలు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసి ఒక సందర్భంలో నాసిక్ సంప్రదాయ హిందువులు అత్యంత ఆనందభరితులయ్యారు. బ్రాహ్మణేతరులేమో మత సంబంధమైన విషయాలు కేవలం బ్రాహ్మణులకు సంబంధించినవిగా భావించి మిన్నకుంటారు. నాసిక్ రథయాత్రపై విధించిన నిషేధాన్ని తొలగించాలని సంప్రదాయ హిందువులు నాసిక్ జిల్లా కలెక్టర్‌కు అర్జీ పెట్టుకున్నారు. సమాజంలోని పురోగామి ఉద్యమ శక్తులు ఈ నిర్ణయాన్ని ఖండించాయి.

అస్పృశ్యులు హిందూ మతాన్ని ప్రమాణ పూర్వకంగా విసర్జిస్తే పెద్దగా నష్టమేమి లేదని అంబేద్కర్ ఈ సందర్భంగా మసూర్కర్ మహరాజుతో అన్నప్పుడు మహరాజు అందుకు సమాధానంగా మత మార్పిడి వలన క్రమంగా ఒకనాటికి హిందూమతం మృతప్రాయమై పోతుందని అంటారు. నిర్ణీత కాల వ్యవధిలో అంటరానితనాన్ని తమ మతం నుంచి తొలగించగలమని హిందూ మత పెద్దలు ప్రతిజ్ఞ చేయాలని ఆయన ప్రకటిస్తారు . సమస్య

తీవ్రతను మహరాజు నొక్కి వక్కాణిస్తారు. హిందువుల హృదయ పరివర్తనకు ఐదు నుంచి పదేళ్ల పాటు తాను వేచి వుండగలనని అంబేద్కర్ అంటారు. మహారాష్ట్ర బ్రాహ్మణులు ఇంతలో అణగారిన వర్గాల నాయకుడు కె.కె. సాకత్‌ను శంకరాచార్యుని పీఠంపై ఏడాది పాటు అధిష్టింపచేయాలని, హృదయ పరివర్తన తమలో కలిగిందని చెప్పడానికి గుర్తుగా వంద చిత్పవన్ బ్రాహ్మణ కుటుంబాలు ఈ కొత్త శంకరాచార్యుల పాదాలపై సాష్టాంగ పడుతూ సేవలు చేయాలని అంబేద్కర్ మహరాజుతో జరిగిన చర్చలో భాగంగా ప్రతిపాదిస్తారు "ఇస్లాం మతానికి నేను కనుక మారి వుంటే కోట్లాది రూపాయలు మా అణగారిన వారి పాదాలపై కురిసేవి. ఆ డబ్బుతో ఐదేళ్లలో ఈ దేశాన్ని నేను నాశనం చేసి వుండేవాడిని అయితే చరిత్రలో విగ్రహాంతకుడిగా నా పేరు నమోదు కావడం నాకిష్టం లేదు" అని కూడా ఆయన ఈ సందర్భంగా వ్యాఖ్యానించాడు.

దీనిపై దేశ వ్యాప్తంగా దీర్ఘకాలం పెద్ద యెత్తున వివాదం తలెత్తింది . ఐదేళ్లలో మత మార్పిడి మొదలు కాగలదని హిందువుల నుంచి సానుకూల స్పందన వస్తే తన నిర్ణయాన్ని పునఃపరిశీలించగలనని అంబేద్కర్ ప్రకటిస్తారు. తన కులాన్ని మరో బలమైన సమూహంలో చేర్చాలని ఆయన ఆశించారు. ఆ రోజులలో ఆయన సిక్కు మతం స్వీకరించాలని అభిలషించారు. ఇస్లాం మతాన్ని ప్రస్తావిస్తూ, ముస్లింల మత విశ్వాసాలలో, ఆచార వ్యవహారాలలో జోక్యం చేసుకోవడం కష్టసాధ్యమని అంటారు.

పూనాలో 1930వ సంవత్సరంలో జరిగిన అంటరాని యువజన సదస్సులో అంబేద్కర్‌కు ఈ విషయంలో తన వర్గం మద్దతు లభించింది. అయితే అంటరాని కులాలు అన్నింటికన్నీ తమ మద్దతు తెలుపకపోవడం గమనార్హం. మహర్ కులం తప్పిస్తే మరే ఇతర అంటరాని కులం మత మార్పిడిపై అంబేద్కర్ అవలంభిస్తున్న వైఖరిని సమర్థించలేదు. గట్టిగా వ్యతిరేకించాయి. మత మార్పిడి వలన ఆర్థిక జీవనంలో ఎటువంటి మార్పు రాదని, పైపెచ్చు మొదటికే మోసం వస్తుందని, భవిష్యత్తు అంధకార బంధురమవుతుందని ఆయా కులాల నాయకులు అభిప్రాయపడ్డారు. హిందూ మత సంస్థల కార్యకర్తలు అంబేద్కర్ నిర్ణయాన్ని పలాయన చర్యగా అభివర్ణించారు. దూరదృష్టి గల హిందూ సంస్కర్తలు మాత్రం ఆయనను హిందూ మతాన్ని పునర్నిర్మించి బలోపేతం చేసేందుకు అవతరించిన ప్రవక్తగా పేర్కొన్నారు. మరికొందరు అంబేద్కర్ నిర్ణయాన్ని కేవలం ఒక ఎత్తుగడగా, బుకాయింపుగా అభివర్ణించారు. అంటరాని వారు తమ పోరాటంతో హిందూమతాన్ని శుద్ధిచేస్తారని, తమ రక్తంతో దాని మరకలను తుడిచి వేస్తారని అంబేద్కర్ ప్రకటించారు. యువజన సదస్సు ఇయోలా సదస్సులో ఆయన చేసిన ప్రకటనను సమర్థించడమే కాక సమిష్టి కార్యాచరణకు సంబంధించిన తీర్మానానికి కట్టుబడి వుంటామని ప్రతిజ్ఞ చేశారు.

అమృతసర్‌లో 1936 ఏప్రిల్ 13, 14 తేదీలలో జరిగిన సిక్కు కూటమి సదస్సు లో ప్రసంగిస్తూ సిక్కుల సమానత్వ సూత్రాలకు తన ఆమోదం తెలిపారు . హిందూ మతాన్ని

విడిచిపెట్టాలని నిర్ణయం తీసుకున్నప్పటికీ ఏ మతంలోకి మారాలనే విషయంపై తుది నిర్ణయం ఇంకా తీసుకోలేదని ఆయన ఈ సమావేశంలో ప్రకటిస్తారు. 1936లో ఈస్టర్ సెలవుల్లో లాహోర్‌లో సమావేశం కానున్న జాత్ పాత్ తోడక్ మండల్ వారిలో అంబేద్కర్ ఈ సదస్సులో పాల్గొని చేసిన ప్రకటన ఆశలను రేపింది.

బొంబాయిలోని దాదర్ ప్రాంతంలో అదే ఏడాది మే 30 , 31 తేదీలలో సమావేశమైన మహర్ కులస్తులు ఇయోలా తీర్మానాన్ని అమలు చేయడానికి అవలంబించవలసిన వ్యూహ రచనకు నాంది పలికారు. హిందూ మతం పరిధిలో వున్నంతకాలం వారికి విముక్తి లేదని ఈ సమావేశాన్ని ఉద్దేశించి చేసిన ప్రసంగంలో అంబేద్కర్ స్పష్టం చేస్తారు. నిజమైన మతం విధి మనుషులను ఉద్ధరించడమేనని, కాని హిందూమతం అందుకు విరుద్ధంగా వారిని అణచిపెడుతున్నదని, సోదర భావం, సమానత్వం, స్వాతంత్రం వంటి సద్గుణాలను హిందూ మతం బోధించలేదని, దళితులకు అనుకూలమైన వాతావరణాన్ని అది అందించలేదని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో హిందూ మతాన్ని విడిచి మరో మతాన్ని చేపట్టడం అనివార్యమైందని ఆయన చెబుతూ ప్రసంగం చివర బుద్ధుని మాటలను ఉదహరిస్తారు. ఏ మతంలోకి మారబోయేదీ ఆయన ఈ సమావేశంలో ప్రకటించలేదు. సదస్సు ఈ సందర్భంగా హిందూ దేవుళ్లను కొలువరాదని, హిందూ పండుగలను పాటించరాదని, హిందూ యాత్రా స్థలాలను సందర్శించరాదని మహర్లకు పిలుపునిచ్చింది. అంటరానితనం సమస్య వర్గపోరాటం వంటి సమస్యగా ఆయన ఈ సదస్సులో ప్రకటించారు. హిందూ మతం నుంచి మరో మతంలోకి మారిన నాడు అంటరాని వారు సామాజిక దాస్యం నుంచి విముక్తులై ఆర్థిక అభివృద్ధి, పురోగతి సాధిస్తారని అంబేద్కర్ స్పష్టం చేశారు. హిందూ మహసభ నాయకుడు డా॥ మూంజేతో అంబేద్కర్ 1936 జూన్ 18వ తేదీన సమావేశమై మతమార్పిడిపై చర్చించారు. అంటరానివారిని సిక్కు మతంలోకి మార్చాలనే ప్రతిపాదనను మూంజే అంబేద్కర్ ముందుపెడతారు. గాంధీజీ, రాజాజీ, మదన్‌మోహన్ మాలవ్యల సలహా కోరుతూ ఎం.సి. రాజా లేఖలు రాశారు. పూనా ఒడంబడిక మేరకు అంటరానివారు హిందువులుగా కొనసాగుతూనే అన్ని హక్కులు, అధికారాలు పొందుతున్నందువలన ఒకవేళ వారు హిందూ మతం నుంచి బయటికి పోదలిస్తే వారు అన్ని హక్కులు కోల్పోక తప్పదని పండిత్ గోవింద్ వల్లభపంత్ అభిప్రాయపడ్డారు. ఈ మొత్తం వ్యవహారాన్ని కాంగ్రెస్ పార్టీ పన్నాగంగా అంబేద్కర్ భావించారు. తనను, తనవారిని, తన పార్టీని లొంగదీసుకునేందుకు, తద్వారా అంటరాని వారు హిందూ మతంలోనే కొసాగేందుకు కాంగ్రెస్ ఈ ఎత్తుగడ పన్నిందని ఆయన ఆరోపించారు.

అంబేద్కర్, మూంజేల ప్రతిపాదనలను తాము వ్యతిరేకిస్తున్నట్లు గాంధీ, రాజాజీ, మాలవీయలు రాజాకు రాసిన ఉత్తరంలో స్పష్టం చేశారు. అంటరానివారు ముస్లింల ప్రభావంతో ఇస్లాం మతంలోకి పోకుండా నివారించేందుకు మూంజే ఒక ప్రత్యామ్నాయంగా సిక్కు మతాన్ని అంబేద్కర్‌కు ప్రతిపాదించారు. హిందువుల ప్రయోజనాలను ఆశించి సిక్కు మతాన్ని మతమార్పిడికి అనువైనదిగా తాను సృష్టించినట్లు అంబేద్కర్ విడిగా రాజాకు రాసిన లేఖలో

పేర్కొన్నారు. మూంజే రాజాకు తాను రాసిన లేఖతో ఆయన లేఖను జత పరిచారు సిక్కు మతంలోకి మారదలుచుకున్నవారికి ఎదురయ్యే ఆర్థిక, రాజకీయ కష్టనష్టాలను తొలగించేందుకు హిందువులు సహాయపడాలని, సిక్కులకు చేయూతనందించాలని అంబేద్కర్ తమ లేఖతో సూచించారు. హిందూవేతర మతాలలో ఒక సిక్కు మతాన్నే తాను ఎంచుకోవడానికి గల కారణాలను అంబేద్కర్ తన లేఖలో వివరించారు. "వున్నంతలో సిక్కు మతం అన్నింటికన్నా ఉత్తమమైనది. అణగారిన కులాలకు చెందిన వారు ఇస్లాం లేదా క్రైస్తవంలో చేరితే వారు హిందూ మతం నుంచే కాదు, హిందూ సంస్కృతి నుంచి కూడా దూరమవుతారు అదే ఒక వేళ వారు సిక్కు మతం తీసుకుంటే హిందూ సంస్కృతిలో కొనసాగే అవకాశం వుంటుంది. ఇస్లాం లేదా క్రైస్తవంలోకి వెళ్లే అంటరాని వారు జాతీయత కోల్పోయి విజాతీయులవుతారు. ఇస్లాంలోకి మారితే ముస్లింల సంఖ్య రెండింతలవుతున్నది అప్పుడు ముస్లిం ఆధిపత్యంపై వున్న భయాలు నిజమవుతాయి."

అంబేద్కర్, మూంజేల ప్రతిపాదనను రాజాజీ దుష్టమైనదిగా అభివర్ణించారు పూనా ఒడంబడిక సందర్భంగా అణగారిన వర్గాల ఉద్ధరణకు చేసిన వాగ్దానాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైనందున గాంధీ, మాలవీయలకు ఈ విషయమై తమ అభిప్రాయాల వెలిబుచ్చే అర్హత లేదని అంబేద్కర్ వ్యాఖ్యానించారు.

"సిక్కు మతంలోకి మారే ప్రతిపాదనను శంకరాచార్య , డా॥ కుర్త కోటి వంటి ప్రముఖ హిందువులెందరో ఆమోదించారు. హిందువుల భవిష్యత్ పట్ల బాధ్యత వుందని భావించడం వల్లే ప్రత్యామ్నాయంగా ఆమూలాగ్రం పరిశీలించిన పిదప సిక్కు మతాన్ని సూచించాను."

మత మార్పిడి ఉద్యమానికి సంబంధించి చేసిన ప్రయత్నాలలో భాగంగా అంబేద్కర్ 1936 సెప్టెంబర్ 18 న ఒక ప్రతినిధి బృందాన్ని సిక్కు మతాన్ని అధ్యయనం చేయడానికి అమృత్‌సర్ పంపించారు . 1937 సాధారణ ఎన్నికలకు సన్నాహాలు జరుగుతుండగా అంబేద్కర్ ఆ ఏడాది నవంబర్ 11న జెనీవాకు బయలుదేరి వెళ్లారు అణగారిన కులాలకు కల్పించిన రక్షణలు మతం మారితే యథాప్రకారం కొనసాగేదీ, లేనిదీ స్వయంగా తెలుసుకునేందుకే ఆయన యూరప్ పర్యటనకు బయలుదేరారు. జెనీవా వెళ్లే దారిలో లండన్‌లో ఆగి బ్రిటిష్ రాజకీయవేత్తలతో ఈ విషయం కూలంకషంగా చర్చించారు. బ్రిటిష్ రాజకీయవేత్తలను కలిసే ముందు ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన జర్మన్, యూరోపియన్ న్యాయ శాస్త్రవేత్తలను కూడా ఆయన సంప్రదించారు . రానున్న ఎన్నికలలో రాష్ట్రాల అసెంబ్లీలకు పోటీ చేసే ఎస్సీ కులాల అభ్యర్థులకు రిజర్వ్‌డ్ స్థానాల కేటాయింపులో తేడాలు రాకుండా చూసేందుకు ఆయన ఈ యాత్రను ఉపయోగించుకున్నారు. "మత మార్పిడి చేసే బదులు కొత్త మతాన్ని నెలకొల్పవచ్చు కదా?" అని మహద్‌కు చెందిన తన సన్నిహిత మిత్రుడు సుర్బా టిప్నిస్ చేసిన సూచనకు

బదులిస్తూ "నేను శంకారచార్యుడిని కాదు, మహర్ కులంలో పుట్టినవాడిని. ఒక మహర్ స్థాపించే మతాన్ని ఎవరు అనుసరిస్తారు?" అంటారు అంబేద్కర్.

అంబేద్కర్‌కు శంకారాచార్య అంటే చాలా గౌరవమని టిప్నిస్ మహద్ కళాశాల ప్రతినిధికి ఈ సందర్భంగా చెప్పారు. తాను అంటరానివాడుగా పుట్టి వుండకుంటే స్వాభావికంగా తనలో నిక్షిప్తమై వున్న గుణగణాలు సమాజానికి మరింత ఉపయోగపడేవని అంబేద్కర్ భావించేవారని ఆమె తెలిపారు. తోటివారికి తన గురించిన సరైన అంచనా లేకపోవడం పట్ల ఆయన విచారం వెలిబుచ్చేవారు.

అంటరానివారికి మత మార్పిడి వలన ఎటువంటి ప్రయోజనం వుండదని వాదించే వర్గం తన అభిప్రాయాన్ని మార్చుకోలేదు. అంటరానివారికి, హిందువులకు మధ్య గల తేడాలను పరిగణనలోకి తీసుకున్నప్పుడు, అంటరాని వారు కేవలం తమ పుట్టుక కారణంగా అగ్ర కులస్తులతో ఉద్యోగం, సంపాదన వంటి విషయాలలో పోటీపడలేక పోతున్నారనేది వాస్తవమని తేలుతుంది. హిందూమతంలో వున్నంత కాలం వారి మధ్య ఈ తేడా యథాతథంగా వుంటుంది కనుక మతం మారడం మినహా మరో ప్రత్యామ్నాయం వారికి లేదనేది స్పష్టం అవుతుంది. మతం మార్చుకుంటే సామాజిక అణచివేత పోయి సమానత్వం వారి జీవితాలలో ఒక ప్రజాస్వామిక విలువగా ప్రవేశిస్తుంది కనుక మత మార్పిడికి విశేషమైన ఆదరణ లభించింది.

హిందూ మతాన్ని విడిచి పెట్టి మరే ఇతర మతాన్ని అయినా తీసుకోవాల్సిందిగా తన అనుచరులకు పిలుపు ఇచ్చేనాటికే అంబేద్కర్ తన అంతరంగంలో బౌద్ధాన్ని ప్రత్యామ్నాయంగా ఎంచుకున్నారు. బాల్యంలోనే బౌద్ధమతంపై ఆయన అనురక్తిని పెంచుకున్నారు. బుద్ధుడిని బోధకుడిగా భావించారు. బ్రాహ్మణవాదానికి, బౌద్ధానికి మధ్య జరిగిన పోరాటాన్ని, బ్రాహ్మణ వాదుల నాయకత్వంలో సాగిన ప్రతీఘాత విప్లవం ఆయన తన ప్రసంగాలలో తరచూ ప్రస్తావించేవారు. సత్యం కోసం అన్వేషణ ఆయనను ఈ అధ్యయనానికి పురిగొల్పింది. వేదాలపై చేసిన విశ్లేషణలో భాగంగా ఆయన కొన్ని నూతన ఆవిష్కరణలు చేశారు. బ్రాహ్మణ వాదానికి అనుకూలంగా వేదాలలో ప్రక్షిప్తాలను తర్వాతి కాలంలో చేర్చారని ఆయన కనిపెట్టారు. జాగు చేయకుండా సత్వరమే కార్యాచరణకు పూనుకోకపోతే ప్రతీఘాత విప్లవానిది పైచేయి అయి దేశం సర్వ నాశనమవుతుందని అంబేద్కర్ ఆనాడు హెచ్చరించారు. 1944 నవంబర్‌లో పూనాలో ఒక సమావేశంలో చేసిన ప్రసంగంలో మాట్లాడుతూ పురాతన కాలంలో రాసిన ప్రతి మత గ్రంథం రాజకీయ గ్రంథమేనని, భగవద్గీత కూడా అటువంటి రాజకీయ భావజాల గ్రంథమేనని, వేదాల సారాన్ని బోధిస్తూ బ్రాహ్మణవాదాన్ని అత్యున్నత స్థితికి తీసుకుపోవడమే దాని లక్ష్యమని అంబేద్కర్ పేర్కొన్నారు.

అంబేద్కర్ బౌద్ధతత్వంలో ఆరు మానవీయ సూత్రాలను కనిపెట్టారు. అవి వరుసగా 1. జీవితానుభవానికి ప్రాధాన్యం. మరణానంతరం కాక ఇక్కడే ఇప్పుడే సమున్నతమైన దివ్య

జీవనాన్ని సాధించడానికి నిర్దిష్టమైన పదం. 2. ఆదర్శవాదం కాకుండా వాస్తవిక వాదం కావడం. 3. స్వేచ్ఛ, స్వాతంత్రం, సత్యం, న్యాయం వంటి విలువలకు ఉన్నత స్థానం. మానవీయత, ప్రేమ, శాంతికి ప్రాధాన్యం. 4 గతిశీలమైనది, శాస్త్రీయమైనది, బహుముఖమైనది కావడం. 5. జీవితాన్ని , దాని అర్థాన్ని , సారాన్ని అన్వేషించిన తీరు, పుట్టుకకు, చావుకు గల ప్రయోజనం, పరమార్థాలను స్పష్టంగా, హేతుబద్ధంగా వివరించడం. 6. అన్నిటికీ మించి మనిషి అన్నిటికీ కేంద్ర బిందువు, అత్యున్నత ప్రమాణం కావడం. మనిషి మినహా మరే ఇతర అతీంద్రియ శక్తిని పరిగణనలోకి తీసుకోకపోవడం.

హిందూ సమాజం నిశ్చలమైనదని, అంటరానితనాన్ని గుర్తించే హిందూమతానికి కులం పునాదిగా వుందని భావించిన అంబేద్కర్ హిందూ - బౌద్ధ ధర్మాల బాగోగులను లోతుగా అంచనా వేసిన తర్వాతే బౌద్ధం స్వీకరించాలనే నిర్ణయం తీసుకున్నారు అంబేద్కర్ బౌద్ధ మతాన్ని స్వీకరించడానికి గల నాలుగు కారణాలను కింది విధంగా చెప్పవచ్చు.

1. అంటరానివారు బౌద్ధులని నిరూపించడానికి ఆయన ప్రయత్నించారు అంటరానితనం పుట్టుకపై రాసిన పరిశోధన గ్రంథంలో అంటరానివారు బౌద్ధులేనని నిర్వంద్వంగా ప్రకటించారు.
2. బౌద్ధం భారతీయ మతం. అంటరాని వారికి బుద్ధుడు అత్యంత సన్నిహితుడు.
3 కఠినమైన శాస్త్రీయ పరీక్షలను నిలదొక్కుకోగల శక్తి బౌద్ధానికి వుంది. ఆధునిక ప్రపంచానికి దిశా నిర్దేశం చేయగల సామర్థ్యం దానికి వుంది.
4. ప్రపంచ బౌద్ధసమాజంలో చేరి అంతర్జాతీయ స్థాయిలో సోదరభావం నెలకొనేందుకు అంటరానివారు బాటలు వేస్తారు.

అంబేద్కర్ హిందూమతంలో కొల్లలుగా వున్న దేవుళ్లను, దేవుళ్లను అనుకరిస్తూ పుట్టుకువచ్చిన దొంగ స్వాములను, బాబాలను ఎండగట్టారు బౌద్ధ మతం నైతికవర్తనంపై ఆధారపడి ఉంది. బుద్ధుడు మార్గదర్శి మాత్రమే తప్ప కృష్ణుడిలా దేవుడు కాదు. తనను తాను దేవుడినని చెప్పుకోలేదు. ఇందుకు భిన్నంగా కృష్ణుడు తనను తాను దేవదేవునిగా చెప్పుకున్నాడు క్రీస్తు దేవుని పుత్రునిగా, మహమ్మదు దేవుని చివరి దూతగా తమను తాము చెప్పుకున్నారు. ఈ విధంగా బుద్ధుడు తప్ప మిగిలిన మత స్థాపకులు మోక్ష ప్రదాత పాత్ర పోషించేందుకు ప్రయత్నించారు. తాము చెప్పిందే అంతిమ సత్యమని, తాము బోధించేదే సరైన మార్గమని వారు నమ్మబలికారు. బుద్ధుడి పద్ధతి ఇందుకు పూర్తి విరుద్ధం. అందుకే ఆయన తనను తాను మార్గ ప్రదాత పాత్రకు పరిమితం చేసుకున్నారు. బౌద్ధం నైతిక విలువలకు ప్రాధాన్యం ఇవ్వగా బ్రాహ్మణ మతం ధర్మం పేరిట యజ్ఞ యాగాదులకు, మొక్కుబడులకు, కర్మకాండలకు ప్రాధాన్యతనిచ్చింది. హిందూ మతం ప్రవచించిన "కర్మ" స్థానంలో బుద్ధుడు నీతిని ప్రతిష్టించాడు. హిందూ మతం సామాజిక తత్వం అసమానత్వం కాగా, బౌద్ధానిది సమానత్వం.

'జనత ' అనే పత్రికా ప్రతినిధి 1950 మే నెలలో ఇచ్చిన ఇంటర్వ్యూలో బౌద్ధం పట్ల తమ మొగ్గును స్పష్టంగా అంబేద్కర్ వ్యక్తంచేశారు. హిందూ మతం రెండు దశలను దాటి ప్రస్తుతం మూడో దశలో వున్నదని, వేద మతం, బ్రాహ్మణ మతం దాని తొలి మలి దశలు కాగా హిందూ మతం దాని ప్రస్తుతం దశ అని ఆయన ఆ పత్రికకు చెప్పారు. బ్రాహ్మణ వాద దశలో ఆవిర్భంచిన బౌద్ధం సమానతత్వాన్ని బోధించిందని, శంకరాచార్య తదనంతర కాలంలో బౌద్ధం భారతదేశంలో అంతరించిపోయిందని చెప్పడం సత్యదూరమని ఆయన పేర్కొన్నారు. ఏళ్ల తరబడి తరతరాలుగా బౌద్ధం కొనసాగుతూ వస్తున్నదని, వాస్తవానికి శంకరాచార్య, ఆయన గురువు బౌద్ధులేనని అంబేద్కర్ ఈ ఇంటర్వ్యూలో అభిప్రాయపడ్డారు. శైవ, వైష్ణవ మతాలు బౌద్ధం నుంచి కొన్ని కర్మ కాండలను, ఆచార వ్యవహారాలను తీసుకొని ఆచరణలో పెట్టడం వలన, బౌద్ధమతానికి వ్యతిరేకంగా అవి రెండూ యుద్ధ ప్రాతిపదికపై పని చేయడం వలన బౌద్ధం భారతదేశంలో పతనం చెందిందని అంబేద్కర్ స్పష్టం చేశారు . ముస్లిం దురాక్రమణ దారులు బౌద్ధ బిక్షువులను, పూజారులను మూకుమ్మడిగా హత మార్చడం వల్ల వారు దేశాన్ని విడిచి ఇతర దేశాలకు ప్రవాసం వెళ్లిపోయారని అంబేద్కర్ చెప్పారు. బౌద్ధ మత ఆచార వ్యవహారాలు ఆచరణలో కష్ట సాధ్యమైనవి కావడం దేశంలో నెలకొనివున్న రాజకీయపు పరిస్థితి బౌద్ధానికి వ్యతిరేకంగా వుండటం వలన బౌద్ధ మత పురోగతి నిలిచిపోయిందని, దేశంలో జాతీయ మతంగా వున్న వేద మతాన్ని బౌద్ధులు ఆచరించిన వ్యక్తి పూజ కొంత మేరకు అదుపు చేసిందని ఆయన వ్యాఖ్యానించారు. దైవ రాహిత్యం, జీవన్ముక్తికి అమిత ప్రాధాన్యం, వేదనాపూరిత చింతన, ప్రాపంచిక వ్యవహారాల పట్ల అలక్ష్యం, కుటుంబం పట్ల నిర్లక్ష్యం, పొరుగుదేశాల పట్ల సానుభూతి వంటి అంశాలన్ని కలగలిసి దేశంలో బౌద్ధం క్షీణించడానికి దోహదం చేశాయని ఆయన భావించారు.

మూడో ప్రపంచ బౌద్ధ మత సదస్సులో పాల్గొనేందుకు ఆయన 1954 డిసెంబర్‌లో రంగూన్ వెళ్లారు. శ్రీలంక, బర్మా ప్రపంచంలోని బౌద్ధ దేశాలలో అగ్రభాగాన వున్నాయని ఆయన తమ ప్రసంగంలో పేర్కొన్నారు. హిందూమతాన్ని బౌద్ధం విస్తృతంగా ప్రభావితం చేసిందని, గోరక్షణ బౌద్ధమతం పాటించిన అహింసా తత్వానికి లభించిన ఆధ్యయనాన్ని రాజ్యాంగబద్ధం చేయడం, ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ ముఖద్వారంపై బుద్ధుని సూక్తిని పొందుపరచడం, ఆశోక చక్రాన్ని జాతీయ చిహ్నంగా ఆమోదింపచేయడం – ఈ మూడు వ్యక్తిగతంగా తాను సాధించిన విజయాలని ఆయన ఈ సదస్సులో సభా ముఖంగా ప్రకటించారు. బుద్ధ జయంతిని జాతీయ సెలవు దినంగా భారత్ ప్రభుత్వం ప్రకటించడం వెనుక అంబేద్కర్ కృషి వుంది.

మహరాష్ట్రలోని ప్రసిద్ధ వైష్ణవ క్షేత్రం పండరీపురంలోని విఠోబా మూర్తి వాస్తవానికి బుద్ధుని విగ్రహమని పూనాలో బుద్ధుని విగ్రహం ఆవిష్కరించిన సందర్భంగా ఆయన వెల్లడించారు. పండరీపురంలో కొలువుదీరిన పాండురంగని పేరు పాళీ భాషలోని పుండలీక

శబ్దం నుంచి పుట్టిందని, పుండలీక అంటే కమలా పుష్పం అని, పాళీ భాషలో ఈ పుష్పాన్ని పాండురంగ అంటారని వివరించారు. కమలాసనుడు బుద్ధుడే కాబట్టి పాండురంగడు ఈ క్షేత్రంలో బుద్ధుడు తప్ప వేరెవరూ కాజాలదని ఆయన చెప్పారు. బౌద్ధాన్ని ధ్వంసం చేయడానికి బ్రాహ్మణులు లెక్కకు మిక్కిలిగా సృష్టించిన దేవుళ్ళు, దేవతలను సామాన్య ప్రజానీకం మొక్కడం వలన క్రమంగా బౌద్ధం దేశం నుంచి అదృశ్యమైపోయిందని ఆయన తేల్చి చెప్పారు.

బౌద్ధమతాన్ని భారతదేశంలో ప్రచారం చేయడానికి బెంగుళూర్‌లో బౌద్ధమత అధ్యయన కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు అంబేద్కర్ ఈ సదస్సులో ప్రకటించారు. భారతీయ తత్వచింతన పుట్టుపూర్వోత్తరాలపై టోక్యోలో జరగనున్న రౌండ్ టేబుల్ సదస్సుకు పాల్గొనవలసిందిగా డా॥ ఫెలిక్స్ వల్యీ అంబేద్కర్‌ను ఆహ్వానించారు. సదస్సు బౌద్ధ, జైన మతాల పుట్టుకపై తన దృష్టిని సారిస్తుంది కనుక అంబేద్కర్ తప్పక హాజరవ్వాలని ఆయన కోరారు. జపాన్ ప్రభుత్వ సహకారంతో అంతర్జాతీయ సాంస్కృతిక సంబంధాల సమితి ఈ సదస్సును నిర్వహించింది. డా॥ వల్యీకి రాసిన ఉత్తరంలో గతంలో మాదిరి భారతదేశం బౌద్ధానికి సానుకూలంగా లేదని అంబేద్కర్ చెబుతారు.

బౌద్ధాన్ని తాను ఎంచుకోవడానికి గల కారణాలు 1956 మే నెలలో లండన్‌లో బిబిసికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన వివరించారు. "మరే మతం చేయని విధంగా బౌద్ధం మూడు మౌలికమైన జీవన సూత్రాలను గుదిగుచ్చి మానవ జాతికి కానుకగా ఇచ్చింది . అవి – ప్రజ్ఞ (అవగాహన) కరుణ (ప్రేమ) సమత ......భగవంతుడు కానీ, 'ఆత్మ' కానీ ఈ సమాజాన్ని రక్షించలేవు" అని ఆయన ఈ ఇంటర్వ్యూలో తెలిపారు . మార్క్సు భావాల పట్ల ఆయనకు అభ్యంతరాలు, తప్పుడు అంచనాలు వున్నాయి. కమ్యూనిజం పట్ల కూడా ఆయనకు వాస్తవ దూరమైన అభిప్రాయాలున్నాయి.

> "కమ్యూనిజానికి మారిన బౌద్ధ దేశాలు కమ్యూనిజం అంటే ఏమిటో ఇంకా అవగాహన చేసుకోలేదు. సోవియట్ కమ్యూనిజం రక్తపాత విప్లవం ద్వారా సమతా రాజ్యాన్ని సాకారం చేస్తానంటుంది. కానీ బౌద్ధ కమ్యూనిజం మాత్రం రక్త రహిత విప్లవం ద్వారా సమతా సమాజానికి ప్రాణ ప్రతిష్ట చేస్తుంది. ఆగ్నేయాసియా దేశాలు బుద్ధుని బోధనలకు రాజకీయ స్వరూపం ఇవ్వాలి. పేదరికాన్ని నెపంగా చూపి మానవ స్వేచ్ఛను హరించడానికి వీలు లేదు" అన్నారు అంబేద్కర్.

మార్క్సు తత్వ చింతన గురించి ప్రస్తావిస్తూ ఆయన ఈ విధంగా వ్యాఖ్యానించారు. "మనిషికి తినడానికి ఇంత తిండి వుంటే సరిపోదు. అతనికి మేధస్సు వుంది. దానికి కూడా తిండి కావాలి. మతం మనిషిలో ఆశను పాదుకొల్పి అతడిని కార్యోన్ముఖుణ్ణి చేస్తుంది. హిందూ మతం అట్టడుగు మనిషిలోని జ్ఞానానురక్తిని, జిజ్ఞాసను నీరు కార్చింది. అందుకే నా మతాన్ని మార్చుకుని బౌద్ధాన్ని స్వీకరించడం అవసరంగా భావిస్తున్నాను." 1956 మే 24న బొంబాయిలోని

నారే పార్క్‌లో జరిగిన బుద్ధ జయంతి వేడుకలలో బౌద్ధ మతాన్ని స్వీకరిస్తున్నట్లు ఆయన మొదటిసారి బహిరంగ ప్రకటన చేశారు. నూతన మత స్వీకారానికి ముహుర్తాన్ని అదే ఏడాది అక్టోబర్‌గా నిశ్చయించారు.

అహింసను జీవన తత్వంగా బోధించినందుకు బౌద్ధాన్ని విమర్శించిన వీర సావర్కర్‌కు చెప్పిన జవాబులో హిందూ మతానికి పునాదులు హింసలో వున్నాయని, హిందూ మతం దేవుడిని విశ్వసించగా బౌద్ధంలో దేవుడి ఉనికి సైతం లేదని, బౌద్ధం ప్రకారం ఆత్మ అనేది అసలే లేదని, హిందూ మతానికి ప్రాతిపదికగా వున్న చాతుర్వర్ణ వ్యవస్థకు బౌద్ధంలో స్థానంలేదని అంబేద్కర్ ప్రకటించారు .

నాగపూర్‌లో 1956 అక్టోబర్ 14వ తేదీన దసరా పండుగ నాడు ఉదయం 9 నుంచి 11 గంటల మధ్య కాలంలో తాను బౌద్ధం స్వీకరిస్తున్నట్లు అంబేద్కర్ సెప్టెంబర్ 23వ తేదీన పత్రికా ప్రకటన విడుదల చేశారు . ప్రాచీన కాలంలో బౌద్ధమతాన్ని అవలంభించిన నాగజాతి ప్రజలు నివసించిన చారిత్రిక పట్టణం కావడం వలన నాగపూర్‌ను స్వయంగా ఇందుకు ఎంచుకున్నారు. బౌద్ధ మత స్వీకార ఉత్సవానికి నాగపూర్‌ను వేదికగా ఎంచుకోవడానికి గల కారణాలను అక్టోబర్ 15 వ తేదీన ఆయన విశదం చేశారు. నాగజాతి ప్రజలు భారతదేశంలో బౌద్ధాన్ని ప్రచారం చేశారని, ఆర్యులు వారిని శత్రువులుగా చూశారని, ఆర్యులు నాగులను అగ్నికి ఆహుతి చేశారని చెప్పటానికి చారిత్రిక ఆధారాలు ఉన్నాయని, శూద్రులు, అతి శూద్రులు స్వీకరించడం వల్లే బౌద్ధం పరివ్యాప్తి చెందుతున్నదని, నాగులకు నాగపూర్ కేంద్ర బిందువు అని అంబేద్కర్ ఆనాడు తన ప్రసంగంలో పేర్కొన్నారు.

జ్ఞానం, నిజ మార్గం, కరుణ అనే మూడు మౌలికమైన సూత్రాల జీవితానికి మార్గదర్శకత్వం వహించే నిజమైన మతంపై ఆయన వ్యాఖ్యానించారు. బౌద్ధం ఒక్కటేనని అంబేద్కర్ భావించారు. “భారతీయ సంస్కృతి నుంచి విడదీయలేని, విడదీయరాని అంతర్భాగం బౌద్ధం. ఈ దేశపు సంస్కృతీ సంప్రదాయాలకు, చరిత్రకు నా మత మార్పిడి వలన నష్టం కలగకుండా నేను జాగ్రత్త వహించాను” అని ఆయన చెప్పుకున్నారు. బౌద్ధంలో ఆయన అన్ని కులాలకు, జాతులకు ఆశా కిరణాన్ని, వెలుగు రేఖను దర్శించారు. దాస్య శృంఖలాలో బందీలుగా వున్న శోషిత వర్గాల సామాజిక హోదా పెంచడానికి బుద్ధుడు విశేష కృషి చేసినట్లు ఆయన శత్రు శిబిరంతో వాదించేవారు. పేదలు, బలహీనులు, అభాగ్యుల జీవితంలో సామాజిక, మత సంస్కరణలు సత్వరమే తేవలసిన అవశ్యకతను బుద్ధుడు ఆనాడే గుర్తించాడని చెప్పారు. బుద్ధుని జీవన తత్వం, ఆచరించిన మార్గం కేవలం నిరసన మాత్రమే కాదని యావత్ హిందూ సమాజానికి అది ఒక సవాల్ విసిరిందని ఆయన వ్యాఖ్యానించారు. “బౌద్ధం సామాజిక, మేధోపరమైన, ఆర్థిక, రాజకీయ స్వాతంత్రాన్ని బోధించింది. మనిషికి మనిషి మధ్య సమానత్వాన్నే కాక, స్త్రీ పురుషుల మధ్య కూడా సమానత్వాన్ని అది బోధించింది. ఇందుకే కమ్యూనిజానికి బౌద్ధం పత్యామ్నాయం కాగలదేమో ఆలోచించవలసిందిగా యువతరాన్ని కోరాలి. బౌద్ధం మాత్రమే అన్ని ఒడిదుడుకులను తట్టుకొని మనగలుగుతుంది” అని ఆయన అభిప్రాయపడ్డారు.

ద్వారా తాను కొత్తగా పునర్జన్మ పొందానని నరకం నుంచి విముక్తి చెందానని ఆయన చెప్పుకున్నారు. "హిందూమతాన్ని నేను విసర్జిస్తున్నాను అని ప్రకటించినప్పుడు ఆయన భావోద్వేగంతో కదిలిపోయారు. బౌద్ధం స్వీకరించడం ద్వారా ఆయన హిందూ మతంతో పాటు దాని ఆచార వ్యవహారాలను, సంప్రదాయాలను కూడా విసర్జించారు. సమానత్వాన్ని సర్వత్రా వ్యాప్తి చేసేందుకు తాను ఇక నుంచి పాటు పడగలనని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు.

బౌద్ధం స్వీకరించిన సందర్భంగా పండిట్ నెహ్రూ, డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్, సి. రాజగోపాలాచారి, డా॥ రాజేంద్రప్రసాద్ వంటి రాజకీయ ఉద్ధండుల నుంచి ఆయన అభినందన సందేశాలు అందుకోలేదు. స్వయాన అంబేద్కర్ కార్యదర్శి రాజ్ భోజ్ ఒక ప్రకటనలో సమస్యకు మత మార్పిడి పరిష్కారం కాదన్నారు. అయితే అంబేద్కర్ ఈ సందర్భంగా "నేను హిందువుగా పుట్టిన మాట నిజమే అయినా హిందువుగా మాత్రం చావను" అని 1935లో చేసిన ప్రతిజ్ఞను గుర్తు చేశారు. అన్న విధంగానే ప్రతిజ్ఞా పాలన చేశారు. ఆ రోజు తన పార్టీ సభ్యులను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో రాజకీయాల కన్నా మతానికే తాను ప్రాధాన్యం ఇస్తానని చెబుతూ "మీకేమో మతం కన్నా రాజకీయాల మీద ఎక్కువ ఆసక్తి. కాని నాకు మాత్రం రాజకీయాల కన్నా మతమే ముఖ్యం" అని ఆయన స్పష్టం చేశారు. భారతదేశంలో బౌద్ధమత పునరుద్ధరణకు కార్య రంగాన్ని సిద్ధం చేయడం ఆయనకు సంతృప్తినిచ్చింది. భారీ ఎత్తున మత మార్పిడికి రంగం సిద్ధం కావడం భారతదేశ చరిత్రలో కనీ వినీ ఎరుగని సంఘటనగా నిలుస్తుంది. మతపరమైన ద్వంద్వ నీతికి అవినీతిపై వ్యతిరేకంగా మనిషిలో వివేచనతో కూడిన చైతన్యాన్ని పెంపొందించడానికి మత మార్పిడి తప్పనిసరి అని ఆయన భావించారు. ఆయన ఈ మొత్తం సమస్యను మానవతావాదం దృక్పథం నుంచి పరిశీలించారని చెప్పవచ్చు. సమాజ సంప్రదాయ చట్రాన్ని సమూలంగా మార్చేందుకు అందరికీ అన్ని విధాల అవకాశాలు కల్పించేందుకు ఆయన ఈ బృహత్ కార్యక్రమాన్ని చేపట్టారు. మనిషి అణిచివేతకు, దాస్య శృంఖలాలలో మనిషిని బంధించడానికి వ్యతిరేకంగా చేసిన తిరుగుబాటు చర్యగా అంబేద్కర్ చేపట్టిన మత మార్పిడిని ఆనాడు ఎందరో అభివర్ణించారు. భౌతికమైన ప్రయోజనాలను ఆశించి ఆయన మత మార్పిడి కార్యక్రమాన్ని ప్రత్యామ్నాయంగా ఎంచుకోకపోవడం గమనార్హం. తొలినాళ్ల నుంచి అంబేద్కర్ ప్రోది చేస్తూ వచ్చిన ధిక్కార చేతనకు అత్యున్నత రూపమే బౌద్ధ ఉద్యమమని చెప్పవచ్చు. అందువల్లే అది విమోచన శక్తిగా రూపుదాల్చింది.

బౌద్ధానికి మారడానికి సంబంధించి ఆయన అవలంబించిన మానవతావాద దృక్పథం మార్క్సిస్ట్ సిద్ధాంతం పట్ల ఆయన తీసుకున్న పొరపాటు వైఖరి వలన బలహీన పడిందని చెప్పాలి. మార్క్సిజాన్ని విమర్శించి బౌద్ధాన్ని మార్క్సిజానికి ప్రత్యామ్నాయంగా ఆయన ప్రతిపాదించారు. అంటరానివారి సమస్య వర్గపోరాటంతో కాని సమసిపోదని గతంలో ఆయన

చెప్పిన మాటను ఈ కొత్త భావజాల ప్రతిపాదనలు పూర్వ పక్షం చేశాయి. ఇంతా చేసి తన తదుపరి ప్రకటనలలో మత మార్పిడి అంటరాని వారికి సామాజిక దాస్యం నుంచి ఎలా విముక్తి కల్పించేదీ ఆయన వివరించనే లేదు. వర్గపోరాటాన్ని ప్రతిపాదించారే తప్ప చేపట్టలేదు. చేపట్టక మతంలో ఉపశమనం పొందారు. పరస్పర విరుద్ధమైన వైఖరులను అవలంభించడం వలన ఆయన బౌద్ధం అనే విమోచనా మార్గాన్ని పూర్తి స్థాయిలో ఉపయోగించలేకపోయారు. చివరికి నిష్ఫలంగా పరిణమించిన మత మార్పిడితో సంతృప్తి చెందడం ద్వారా పలాయనవాదంలోకి ఆయన తిరోగమించారు.

కమ్యూనిజానికి ప్రత్యామ్నాయంగా బౌద్ధాన్ని యువతరం భావిస్తే మినహా బౌద్ధం మనజాలదని అంబేద్కర్ గతంలో వెలిబుచ్చిన అభిప్రాయాన్ని మనమిక్కడ మననం చేసుకోవాల్సిన అవసరం వుంది. ఆయన ఇక్కడ ముందు పరిష్కారాన్ని నిర్దేశించుకొని, దాని సమర్ధనకు తర్వాత సిద్ధాంతాన్ని జోడించినట్లు కనిపిస్తుంది. భౌతికమైన ఈతి బాధలను తొలగించేందుకు శాస్త్రీయ విధానాన్ని అవలంభించడంలో విఫలమై , బౌద్ధమతం స్వీకారంలో అందుకు భిన్నమైన మార్గాన్ని కనిపెట్టేందుకు ఆయన యత్నించారని చెప్పవచ్చు.

# అధ్యాయం 5

# రాజ్యాంగ సమస్యలపై అభిప్రాయాలు

## సెక్షన్-1

### బడుగు వర్గాలకు ప్రాతినిధ్యం విస్తరణ

రాజ్యాంగ నిర్మాణానికి సంబంధించిన చర్చలన్నిటిలో చురుకుగా పాల్గొన్న అతి కొద్దిమంది పాలనాదక్షత గల రాజకీయ నాయకుల్లో అంబేద్కర్ ఒకరు. మాంట్‌ఫోర్డ్ సంస్కరణలు (1919) నుండి క్యాబినెట్ మెషిన్ స్కీం (1946) పై జరిగిన చర్చల్లో అంబేద్కర్ పాల్గొన్నారు. అయితే క్రిప్స్ ప్రతిపాదనలపై జరిగిన చర్చలకు మాత్రం ఆయన హాజరు కాలేదు. ఈ సమయంలో ఆయన తన కులానికి నాయకునిగా వ్యవహరించడంలో తలమునకలయ్యారు.

మార్లే - మింటో సంస్కరణలు (1909) మత ప్రాతిపదికపై ముస్లింలు, యూరోపియన్లకు ప్రత్యేక ప్రతిపత్తి కలిగించాయి. దీంతో వేర్పాటువాద ధోరణులు కనిపించసాగాయి. హిందువులు, ముస్లింల మధ్య అభిప్రాయ భేదాలు అనివార్యమయ్యాయి. కాంగ్రెస్, ముస్లిం లీగ్ మధ్య 1916లో లక్నోలో కుదిరిన ఒప్పందం పాక్షిక స్వీయ పరిపాలనకు శ్రీకారం చుట్టింది. దీనిని కాంగ్రెస్ - లీగ్ పథకం అని వ్యవహరించేవారు. అదే సమయంలో సార్వభౌమాధికారం గల రాజ్యంలో సమాన భాగస్వామిగా ప్రకటించుకోవడం భారత ధ్యేయంగా ఉండేది. ఒకే ప్రాంతంలో రెండు వేరు వేరు వర్గాల మధ్య ప్రత్యేక ప్రతిపత్తి విధానాన్ని లక్నో ఒప్పందం ఆమోదించింది. ఈ ఒప్పందాన్ని బాలగంగాధర్ తిలక్ సమర్థించగా మాలవీయ వ్యతిరేకించారు. "లార్డ్ మింటో, లార్డ్ మార్లే ప్రారంభించిన ఓటర్లను మతపరంగా విభజించే ప్రక్రియ అనివార్యమని అంగీకరించడం ద్వారా లక్నో ఒప్పందం పెద్ద తప్పిదం చేసింది." మార్లే - మింటో సంస్కరణలకు ముందు అస్పృశ్యులను హిందువులుగా నమోదు చేయరాదని ముస్లింలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

భారత రాజ్యాంగ సంస్కరణలపై మోంటేగ్ - చెమ్స్ ఫోర్డ్ నివేదిక 1918లో ప్రచురితమైంది. డ్యార్చీ ప్రాతిపదికగా 1919లో సంస్కరణలు రూపొందించారు. 1920 నుండి అవి అమలులోకి వచ్చాయి. మాంటేగ్ - చెమ్స్ ఫోర్డ్ సంస్కరణల నేపథ్యంలో ఓటు హక్కు సమస్యల గురించి చర్చించేందుకు లార్డ్ సౌత్ బారో అధ్యక్షతన ఒక ఫ్రాంఛైజ్ కమిటీని

ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో శ్రీనివాస్ శాస్త్రి, సురేంద్రనాధ్ బెనర్జీ సభ్యులుగా ఉన్నారు రాజేంద్రప్రసాద్, మోతీలాల్ నెహ్రూ, మాలవీయ వంటి అగ్రశ్రేణి జాతీయ నాయకులు ఈ కమిటీ ముందు హాజరై సాక్ష్యం చెప్పారు. సాక్ష్యం చెప్పాల్సిందిగా అంబేద్కర్‌కు కూడా ఆహ్వానం పలికారు. జనాభా ప్రాతిపదికగా బడుగు వర్గాలకు ప్రత్యేక రాయితీలు కల్పించాలని, చట్టసభల్లో సీట్లు రిజర్వు చేయాలని అంబేద్కర్ సూచించారు. అస్పృశ్యుల ప్రతినిధులు అస్పృశ్యుల ఓట్ల ద్వారా మాత్రమే ఎన్నికవ్వాలని ఆయన ప్రతిపాదించారు. అయితే వారికి ప్రత్యేక ప్రతిపత్తి కల్పించి అదనపు రాయితీలు కల్పించాలనే డిమాండ్ సహేతుకం కాదని కమిటీ అభిప్రాయపడింది.

భారతదేశానికి స్వదేశీపాలన కావాలని జాతీయ నాయకులు డిమాండ్ చేశారు. వారు అస్పృశ్యులకు ప్రాతినిధ్యం వహించేందుకు సిద్ధంగాలేరని అంబేద్కర్ వ్యాఖ్యానించారు. అంబేద్కర్ ఇంకా ఈ విధంగా అన్నారు. "అందరికీ సామాజిక సమానత్వం కలిగించడం అభివృద్ధి చెందిన వర్గాల బాధ్యత. స్వీయపాలన అనేది బ్రాహ్మణులకు ఎంత జన్మహక్కో మహర్లకు కూడా అంతే జన్మహక్కు ఈ విషయాన్ని అందరూ గ్రహించారు " ముస్లింలకు మతపరమైన ప్రాతినిధ్యానికి సౌత్ బారో కమిటీ అనుమతినిచ్చింది. బడుగు వర్గాల విషయంలో నామినేషన్ విధానం పాటించడం ఉత్తమం.

అఖిల భారత అస్పృశ్యుల సదస్సు 1920 మే 30, 31, జూన్ 1 వతేదీల్లో జరిగింది. అస్పృశ్యుల ప్రతినిధులను ప్రభుత్వమో లేదా అస్పృశ్యులకు చెందిన సంస్థలో కాక శాసనమండలి సభ్యులు ఎన్నుకోవాలని బడుగువర్గాల అభ్యున్నతి కోసం విశేష కృషిసల్పిన వి ఆర్ షిండే సూచించారు. అయితే ఈ సూచనను అంబేద్కర్ వ్యతిరేకించారు ప్రభుత్వ చర్యను ఖండిస్తూ సదస్సు ఒక ప్రత్యేక తీర్మానం ఆమోదించింది. అస్పృశ్యులే తమ ప్రతినిధులకు ఎన్నుకోవాలనే అంబేద్కర్ సిద్ధాంతం క్రమంగా బలం పుంజుకుంది

1919 చట్టాన్ని పరిశీలించి లోపాలను సరిచేసేందుకు బ్రిటిష్ ప్రభుత్వం సర్‌జాన్ సైమన్ అధ్యక్షతన భారత స్టాట్యుటరీ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. 1927 నవంబర్ 26న దీనిని ఏర్పాటు చేసింది. అయితే ఈ కమిషన్ భారతీయులెవరికీ ప్రాతినిధ్యం కల్పించలేదు. ఇది జాతీయ భావోద్వేగాలను సృష్టించింది. కాంగ్రెస్ పార్టీ దానిని బహిష్కరించింది. ఉదారవాదులు కూడా కమీషన్‌ను బహిష్కరించారు. ముస్లింలలోని షాఫిగ్రూప్ మద్రాస్ జస్టిస్ పార్టీ మినహా మిగిలిన రాజకీయ పార్టీలన్నీ సైమన్ కమిషన్‌ను బహిష్కరించాయి కాంగ్రెస్‌పార్టీ మరో అడుగు ముందుకేసి సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా ఉద్యమం ప్రారంభించింది విద్యార్థులు కమిషన్‌ను బహిష్కరించారు. నల్లజెండాలు, 'సైమన్ గో బ్యాక్' అంటూ నినాదాలు చేస్తూ ప్లకార్డులను ప్రదర్శించారు. రాజకీయ దృక్పథంతో గల భారతదేశం సైమన్ కమిషన్, దాని భారత విభాగాన్ని బహిష్కరించింది సైమన్ కమిషన్‌కు సహకరించేందుకు కేంద్రప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. సైమన్ కమిషన్‌తో కలసి పనిచేసేందుకు ప్రతి శాసనమండలి ఒక ప్రాదేశిక కమిటీని నియమించింది. బొంబాయి ప్రాదేశిక కమిటీలో అంబేద్కర్ బొంబాయి శాసనమండలి సభ్యునిగా ఎన్నికయ్యారు. బొంబాయి లా కళాశాల విద్యార్థులు అంబేద్కర్ వైఖరికి నిరసనగా ఆయన నిర్వహించిన క్లాసులను బహిష్కరించారు అంబేద్కర్ బ్రిటిష్‌వారి బానిసగా అభివర్ణింపబడ్డారు.

బడుగు వర్గాల వారిని ప్రత్యేక కులంగా వర్గీకరించాలని అంబేద్కర్ పిలుపునిచ్చారు. ఆ వర్గం హిందువులకు భిన్నంగా ఉండాలని సూచించారు. చట్ట సభల్లో వారికి సీట్ల రిజర్వ్ చెయ్యాలని, ఒకరిద్దరిని నామినేట్ చేసే ప్రస్తుత పరిస్థితి అంతం కావాలని డిమాండ్ చేశారు. బొంబాయి శాసనమండలిలో గల మొత్తం 140 స్థానాల్లో కనీసం 22 స్థానాలను వారికి రిజర్వ్ చెయ్యాలని డిమాండ్ చేశారు. అక్షరాస్యత శాతం తక్కువ కావడం వల్ల ఇతర కులాల వారి కంటే బడు/గువర్గాల వారు తెలివి తక్కువగా ఉంటారని వ్యాఖ్యానించడాన్ని ఆయన గట్టిగా వ్యతిరేకించారు. హిందువులు, బడుగువర్గాల మధ్య ఎటువంటి సంబంధం లేదని ఆయన వ్యాఖ్యానించారు. అందువల్ల వారిని ప్రత్యేక, స్వతంత్ర వర్గంగా పరిగణించాలని ఆయన డిమాండ్ చేశారు. మహ్మదీయులకు కేటాయించిన ప్రాతిపదికలోనే బడుగువర్గాల వారికి రిజర్వేషన్లు కల్పించాలని సూచించారు. చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించడంతో పాటు ప్రత్యేక రాయితీలు కల్పించాలని పట్టుబట్టారు. వయోజన ఓటుహక్కు కల్పించాలని సూచించారు. బడుగువర్గాల కోసం రాజ్యాంగంలో కొన్ని భద్రతాచర్యలు ప్రవేశపెట్టాలని సూచించారు. బడుగు వర్గాల విద్య, ప్రభుత్వోద్యోగాలలో కొన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. బడుగు వర్గాల వారికి వయోజన ఓటింగ్ హక్కు ప్రత్యేక హక్కులు, రాయితీలు కాక ఇతర ప్రతిపాదనలేమైనా ఉన్నాయా అనే విషయాన్ని అంబేద్కర్‌ను సైమన్ కమిషన్ సభ్యుడు లార్డ్‌బర్న్‌హామ్ ప్రశ్నించారు.

ఈ రెండింటిలో ఒకటి కల్పించాలని అంబేద్కర్ సమాధానమిచ్చారు. మైనారిటీలైన బడుగువర్గాల వారికి మరింత రాజకీయపరమైన రక్షణ కల్పించాల్సిన అవశ్యకత ఉందని అంబేద్కర్ పేర్కొన్నారు. హిందువుల్లో విభిన్న వ్యక్తిగా గుర్తింపు పొందుతున్న కులం అతడ్ని హిందూ అని పిలవాలా, హిందూ మతేతర వ్యక్తి అని పిలవాలా అన్నది అప్రస్తుతమని అంబేద్కర్ వ్యాఖ్యానించారు. హిందూ సమాజ సంస్కరణ వాదుల ప్రయత్నాలను ఆయన వ్యతిరేకించారు. అవి కేవలం వేదికలపై ఊకదంపుడు ఉపన్యాసాలని పేర్కొన్నారు. బొంబాయి శాసనమండలి ఏర్పాటు చేసిన కమిటీతో ఆయన విభేదించారు. దాని నివేదికపై సంతకం చెయ్యడానికి నిరాకరించారు. మే 17, 1929న విడిగా ఒక నివేదిక సమర్పించారు. బడుగు వర్గాలకు చెందిన 18 సంఘాలు సాక్ష్యం చెప్పగా అందులో 16 ప్రత్యేక ఎలక్టోరేట్లకు మద్దతు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ 1928 ఫిబ్రవరి, మే నెలల్లో అఖిలపక్ష సమావేశాలను ఏర్పాటు చేసింది. భారత్ స్వరాజ్ రాజ్యాంగం రూపకల్పనకు పండిట్ మోతీలాల్ నెహ్రూ అధ్యక్షతన ఒక కమిటీని ఏర్పాటు చేసింది. రాజ్యాంగ నిర్మాణం కోసం చేసిన తొలి ప్రయత్నం ఇదే కావడం గమనార్హం. హిందువులు, ముస్లింల మధ్య అభిప్రాయభేదాలను తొలగించడంపై అది ప్రధానంగా దృష్టి సారించింది.

1930లో ఈ కమిటీ నివేదిక సమర్పించింది. 1920 తరువాత తన కార్యక్రమాల్లో అస్పృశ్యత రద్దు సమస్యను ప్రధానమైందిగా చేసిన దరిమిలా జాతీయ ఉద్యమం నేపథ్యంలో బడుగు వర్గాల రాజకీయ ప్రాధాన్యత ప్రభుత్వ దృష్టిలో పెరిగింది. ప్రభుత్వం వారికి నామినేటెడ్ స్థానాలు కల్పించింది. స్వరాజ్ రాజ్యాంగ నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన కమిటీ అదనంగా మరే ఇతర ప్రతిపాదనలు చెయ్యలేదు. చట్టసభల్లో బడుగు వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించే విషయమై ఎటువంటి సిఫార్సులూ చెయ్యలేదు. బడుగువర్గాలను ఆర్థికంగా, సామాజికంగా

అభివృద్ధిలోకి తీసుకురావాలని, వారికి వయోజన ఓటింగ్ హక్కు కల్పించాలని, విద్య, ఇతర సదుపాయాలు కల్పించాలని సిఫార్సు చేసింది. భారత జాతీయవాదం, దాని శక్తులు నిర్వచనం. ధ్యేయాలపట్ల సైమన్ కమిషన్ తగిన విధంగా ప్రతిస్పందించలేదు నెహ్రూ నివేదిక ఆమోదయోగ్యమైన పరిష్కారంకాదని అది సూచించింది. "నెహ్రూ నివేదిక చూపిన ఉత్సాహాన్ని సైమన్ కమిషన్ అనుసరించిన వైఖరి హరించి వేసింది".

ప్రముఖ ముస్లిం, పార్సీ క్రైస్తవ, సిక్కు, ఆంగ్లో ఇండియన్ సంస్థలకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఆహ్వానం పలికింది. బ్రాహ్మణేతర సంస్థలను కూడా ఆహ్వానించి అంబేద్కర్ నేతృత్వంలోని ద్రవిడ్ మహాజన్ సభను ఆహ్వానించలేదు వాస్తవానికి బడుగు వర్గాలకు చెందిన ఏ సంస్థనూ ఆహ్వానించలేదు. జాతీయ నాయకుల వైఖరిని అంబేద్కర్ గట్టిగా వ్యతిరేకించారు. నెహ్రూ నివేదికలో రూపొందించిన నియోజక వర్గాలను అంబేద్కర్ విమర్శించారు అగ్రవర్ణాల ఆధిపత్యం, బ్రాహ్మణ పాలనా సమాజాన్ని పరిరక్షించడం కోసమే ఈ ఏర్పాటు చేశారని వ్యాఖ్యానించారు. రాజకీయ అధికారం నుండి బడుగు వర్గాలను దూరంగా ఉంచడమే బ్రాహ్మణ సమాజాన్ని పరిరక్షించడానికి ఉత్తమ మార్గమని భావించారు బ్రాహ్మణులు, అగ్రవర్ణాల ఆధిపత్యంలోని నెహ్రూ కమిటీ కావాలనే ఇలా వ్యవహరించిందని అంబేద్కర్ వ్యాఖ్యానించారు.

ముస్లింలు 1927 మార్చి 20న ఢిల్లీలో జరిగిన సమావేశంలో డిమాండ్ చేసిన విధంగా సింధ్, బెలూచిస్తాన్, వాయువ్య రాష్ట్ర ప్రాంతాన్ని విభజించేందుకు నెహ్రూ నివేదిక సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. ముస్లింలు ఈ డిమాండ్‌ను ఆమోదించినట్లయితే ప్రత్యేక ఎలక్టోరేట్లు కల్పించాలనే డిమాండ్‌ను వదులుకునేందుకు ముస్లింలు సంసిద్ధత వ్యక్తం చెయ్యవచ్చు. ముస్లింలు మెజారిటీగా గల ప్రాంతాల్లో హిందూ మైనారిటీలను ముస్లింల దయాదాక్షిణ్యానికి వదిలి వెయ్యడం అత్యంత ప్రమాదకరం దీని కంటే ముస్లింలకు ప్రత్యేక ఎలక్టోరేట్లను మంజూరు చెయ్యడమే ఉత్తమం. రాష్ట్రాలకు నెహ్రూ కమిటీ సూచించిన అధికారాలను కల్పించాలనే ముస్లింల డిమాండ్‌ను కూడా అంబేద్కర్ వ్యతిరేకించారు.

భారత ప్రజల డిమాండ్‌ను నెరవేర్చే లక్ష్యంతో భారత రాజ్యాంగాన్ని రూపొందించేందుకు బ్రిటిష్ ప్రభుత్వం 1930 లండన్‌లో ఒక రౌండ్ టేబుల్ సమావేశాన్ని (RTC) నిర్వహించింది. RTC లో 89 మంది సభ్యులున్నారు

ఇందులో మూడు బ్రిటిష్ పార్టీలకు చెందిన 16మంది ప్రతినిధులున్నారు. 53 మంది వివిధ వర్గాల ప్రయోజనాలకోసం పోరాడుతున్న సంస్థల కాంగ్రెస్ యేతర ప్రతినిధులున్నారు మిగిలిన 20 మంది భారత సంస్థానాల ప్రతినిధులు. బడుగు వర్గాలకు అంబేద్కర్, రావు బహదూర్ శ్రీనివాసన్ ప్రాతినిధ్యం వహించారు.

RTC మొదటి సమావేశం 1930 నవంబర్ 12న జరిగింది. ఈ సమావేశం ప్రాధాన్యత ఏమిటో అంబేద్కర్‌కు తెలుసు. రాజ్యాంగ సమస్యలను భారతీయులతో చర్చించాలనే సిద్ధాంతాన్ని బ్రిటిష్ ప్రభుత్వం మొట్టమొదటిసారిగా ఆమోదించిందని అంబేద్కర్ వ్యాఖ్యానించారు. బడుగువర్గాల ప్రతినిధులను ఆ సమావేశానికి ఆహ్వానించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇది షెడ్యూల్డ్ కులాల ప్రత్యేక ప్రతిపత్తిని గుర్తించడమేనని వ్యాఖ్యానించారు. స్వయం

పాలిత భారత రాజ్యాంగంలో బడుగు వర్గాల హక్కుల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను అంబేద్కర్, శ్రీనివాసన్ RTC కి సమర్పించారు. అస్పృశ్యులను కుల రహిత హిందువులుగా పిలవాలని లేదా ప్రొటెస్టెంట్ లేదా నాన్‌కన్ఫర్మిస్ట్ హిందువులుగా పిలవాలని అంబేద్కర్ సూచించారు. అస్పృశ్యులకు హిందువుల నుండి ప్రత్యేక ప్రతిపత్తి ఉందని అన్నారు. వారు బానిస, కట్టుబానిస వ్యవస్థల మధ్య ఊగిసలాడుతున్నారని వివరించారు. తమ హక్కుల పరిరక్షణ కోసమే వారిని హిందువులు తమలో ఒకరిగా చెప్పుకుంటూ ఉంటారు. స్వరాజ్ డిమాండ్‌ను తాను ఆమోదిస్తానని, అసాధ్యమైతే అస్పృశ్యుల సమస్యను దేశాల కూటమి ముందు ఉంచగలనని అన్నారు. అంబేద్కర్ తన ప్రసంగంలో భారత దేశంలో బ్రిటిష్ రాజ్యంపై నిశితంగా దాడి చేశారు. 150 సంవత్సరాల బ్రిటిష్ రాజ్యంలో అస్పృశ్యుల స్థితిగతుల్లో ఏ మాత్రం మెరుగుదల లేదని అన్నారు. వారి సమస్యలు పరిష్కారానికి నోచుకోకుండా అలాగే వెక్కిరిస్తున్నాయని అన్నారు. ఆధిపత్య హోదా కల్పించాలనే వారి డిమాండ్‌కు ఆయన మద్దతు తెలిపారు. అంబేద్కర్ ఈ విధంగా వ్యాఖ్యానించారు.

> "మనకు ఎటువంటి ప్రభుత్వం కావాలంటే అధికారంలో ఉన్న వ్యక్తులు దేశ ప్రయోజనాల పట్ల సంపూర్ణ విధేయతతో పనిచేసే వారుగా ఉండాలి. మాకు మేము చేసుకున్న విధంగా ఎవ్వరూ మా కష్టాలు తొలగించలేరు. రాజకీయాధికారం చేతుల్లో లేకుంటే మేము కూడా మా బాధలను తొలగించుకోలేం, బడుగు వర్గాలు ఇప్పటికే దీర్ఘకాలం ఎదురు చూశాయి. కొత్త రాజ్యాంగానికి ప్రజల ఆమోదం ప్రమాణంగా ఉండాలి."

ప్లీనరీ సదస్సులో సాధారణ చర్చ ముగిసిన పిమ్మట తొమ్మిది ఉపసంఘాల సమావేశం ఏర్పాటు చేసింది. అంబేద్కర్ మైనారిటీల ఉపసంఘం, ప్రాదేశిక ఉపసంఘం, సర్వీసుల ఉపసంఘంలో సభ్యునిగా ఉన్నారు. భారత్, బ్రిటిన్‌లకు చెందిన అనేక మంది ప్రముఖ నాయకులతో కలసి ఆయన పనిచేశారు. బడుగు వర్గాలు వారిని ఎన్నికల విషయాలకు సంబంధించి ప్రత్యేక వర్గంగా పరిగణించాలి. హిందూ కుటుంబం నుండి విడివడినదిగా భావించాలి. తమ డిమాండ్లు సముచిత మైనారిటీలో ఆమోదింపబడే వరకు స్వీయ పాలనా రాజ్యాంగానికి వారు సమ్మతి తెలపబోరు. ఉమ్మడి పౌరసత్వం, ఉమ్మడిహక్కులను స్వేచ్ఛగా వినియోగించడం, చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం, ప్రభుత్వోద్యోగాలలో న్యాయబద్ధమైన ప్రాతినిధ్యం కావాలని అంబేద్కర్ డిమాండ్ చేశారు. అస్పృశ్య వర్గాలకు చెందిన వారికి మంత్రి వర్గంలో స్థానం కల్పించకపోతే సామాజికాభివృద్ధి, అస్పృశ్యతా నివారణ కృషి గుర్తింపునకు నోచుకోవన్నారు. సమైక్య భారతదేశం సిద్ధాంతం, రాజకీయ రంగంలో బడుగు వర్గాల ఉనికి పూర్తిగా అంబేద్కర్ సాధించిన విజయమే.

మార్చి 5, 1931 న కుదిరిన గాంధీ – ఇర్విన్ ఒప్పందం ఫలితంగా శాసనోల్లంఘన ఉద్యమం ఉపసంహరింపబడింది. లండన్‌లో రెండవ రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరయ్యేందుకు గాంధీజీ అంగీకరించారు. మహాత్మాగాంధీ, సరోజినీనాయుడు, మాలవీయ ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీకి ప్రాతినిధ్యం వహించారు. అస్పృశ్యులను హిందువుల నుండి రాజకీయంగా వేరు పరచటాన్ని గాంధీజీ వ్యతిరేకించారు. RTC రెండవ సమావేశం

1931 సెప్టెంబర్ 7న ప్రారంభమైంది. ఫెడరల్ స్ట్రక్చర్ కమిటీ, మైనారిటీల కమిటీ రూపొందించిన నివేదికలను పునఃసమీక్షించడం, బలోపేతంచెయ్యడం ఈ సమావేశం ఉద్దేశం.

సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు ప్రభుత్వ నామినీలేనని గాంధీజీ వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో పాల్గొనే ప్రతినిధులను ఎంపిక చేసే అవకాశం కల్పించినప్పటికీ తాను ఈ సమావేశానికి హాజరయ్యే వాడిననడంలో ఎటువంటి సందేహం లేదని అన్నారు సంభాషణలు జరుపుతున్న వారు తాము ఏ వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారో ఆ వర్గం తరపున పూర్తి నిర్ణయాలు తీసుకునే అధికారం కలవారు కాదనే విషయం గ్రహించాలి. గాంధీ, ఇతరుల ప్రాతినిధ్య స్వభావం ఏమైనప్పటికీ వారు మమ్ములను కట్టడి చెయ్యలేరనే విషయాన్ని గ్రహించాలి. మైనారిటీల సమస్యల పరిష్కారానికి అంబేద్కర్ రెండు ప్రత్యామ్నాయాలు సూచించారు. మైనారిటీ ఉపసంఘం, ఇది సాధ్యపడకపోతే ప్రభుత్వం ఆ సమస్యకు పరిష్కారం కనుగొనే బాధ్యతను చేపట్టాలి. వారి వారి ప్రాతినిధ్యాన్ని బట్టి అన్ని వర్గాలు అధికారాన్ని పంచుకోవాలని అంబేద్కర్ సూచించారు.

ప్రత్యేక ప్రాతినిధ్యం విషయమై బడుగు వర్గాల ఆకాంక్షలతో కూడిన అనుబంధ మెమొరాండం మైనారిటీ కమిటీకి సమర్పించడం జరిగింది. అంబేద్కర్ ప్రత్యక్ష ఎలక్టొరేట్స్ కావాలని డిమాండ్ చేశారు. చట్ట సభల్లో బడుగు వర్గాల ప్రాతినిధ్యం విషయమై మెజారిటీ డిమాండ్ మేరకు ఓటర్ల రిఫరెండం నిర్వహించే వరకు బడుగు వర్గాల డిమాండ్ల విషయంలో మార్పు ఉండబోదని అంబేద్కర్ అన్నారు. 20 ఏళ్ళ వరకు లేదా విశ్వజనీన వయోజన ఓటు హక్కు నెలకొల్పేవరకు ఈ రిఫరెండం నిర్వహించరాదు.

ముస్లింలు, బడుగు వర్గాలు, క్రైస్తవుల్లో ఒక వర్గం యూరోపియన్లు, ఆంగ్లో ఇండియన్ల ప్రతినిధులు సంయుక్తంగా ఒక వినతి పత్రం సమర్పించారు ఇది మైనారిటీ ఒప్పందంగా పిలవబడింది. పౌరహక్కుల విషయంలో అస్పృశ్యత ప్రాతిపదికగా ఎటువంటి వివక్షత ఉండరాదని ఒప్పందం నిర్దేశించింది. ప్రభుత్వోద్యోగాల్లో నియామకాలకు సంబంధించి, పోలీసు, సైనిక సర్వీసుల్లో నియామకాల విషయమై బడుగు వర్గాల పట్ల సంపూర్ణన్యాయం గవర్నర్ జనరల్‌కు అప్పీలు చేసుకునే అధికారం, తగినస్థాయిలో ప్రాతినిధ్యం పొందేహక్కు ఉండాలి.

ఈ ఒప్పందం గాంధీజీకి ఆగ్రహం తెప్పించింది అంబేద్కర్ సామర్థ్యంపై తనకు పూర్తి నమ్మకం ఉందని గాంధీజీ తన ప్రసంగంలో పేర్కొన్నారు నిజజీవితంలో ఎదురైన అనుభవాల ప్రభావం అంబేద్కర్ విషయ నిర్ణయాధికారంపై ప్రసరించినట్లు కనిపిస్తోందని గాంధీజీ వ్యాఖ్యానించారు. అస్పృశ్యులు ఇస్లాం మతం లేదా క్రైస్తవ మతం స్వీకరించినా తాను అభ్యంతరం వ్యక్తం చెయ్యబోనని అస్పృశ్యతకు రిజర్వేషన్లు కల్పించడాన్ని వ్యతిరేకించగలనని అన్నారు. గాంధీజీ చేసిన ఈ వాదనకు అంబేద్కర్ సమాధానం ఇవ్వలేదు. మతపరమైన, కులపరమైన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకునే అధికారాన్ని బ్రిటిష్ ప్రధానికి కల్పిస్తూ మైనారిటీలు సమర్పించిన వినతిపత్రంపై అంబేద్కర్ సంతకం చెయ్యలేదు. దీనిపై గాంధీజీ సంతకంచేశారు. ముస్లింలకు వ్యతిరేకంగా హిందువుల హక్కులను సమర్థిస్తూ మెక్‌డొనాల్డ్‌కు అంబేద్కర్ వినతిపత్రం సమర్పించారు. మైనారిటీల సమస్యల పరిష్కారంలో గాంధీజీ ప్రదర్శించిన పక్షపాతం, వివక్షత, ఆయన వ్యవహారశైలి, ఇతర ప్రతినిధుల పట్ల

సంపూర్ణ అగౌరవభావంతో సమస్యను యుక్తిగా పరిష్కరించడంలో గాంధీజీకి అవరోధంగా నిలిచాయని అంబేద్కర్ వ్యాఖ్యానించారు.

ఈ చర్చల సందర్భంగా అంబేద్కర్ బ్రిటిష్ వారి పట్ల సానుకూలంగా వ్యవహరించి తాను చేస్తున్న పోరాటాని గుర్తింపు తెచ్చుకోవడం, తన డిమాండ్లకు అనుమతి సంపాదించడం ఒక మార్గం. ఇక రెండవ ప్రత్యామ్నాయం ఏమంటే గాంధీజీ అనుకూలంగా వ్యవహరించి జాయంట్ ఎలక్టొరేట్‌తో ప్రత్యేక ప్రాతినిధ్యం సంపాదించడం.

ప్రాదేశిక ఉపసంఘం సమావేశంలో సంపూర్ణ ప్రాదేశిక సార్వభౌమికత కల్పించాలని అంబేద్కర్ డిమాండ్ చేశారు. ప్రాదేశిక ప్రాంతాలకు గరిష్ట స్థాయిలో ప్రాదేశిక సార్వభౌమికత కల్పించాలి. అఖిల భారతస్థాయి గల ప్రాదేశిక సమస్యలను కూడా ప్రాదేశిక స్థాయి భూమికత గురించి పరిశీలించాలి. మైనారిటీలు, బడుగువర్గాల ప్రయోజనాలను పరిరక్షించాలి. మంత్రివర్గం కులాల ప్రాతినిధ్యం గురించి అంబేద్కర్ ప్రస్తావిస్తూ బడుగువర్గాల ప్రయోజనాలు సంబంధిత మంత్రుల విధానాలపై ఆధారపడి ఉంటాయని, ఆ మంత్రుల ప్రధాన దృష్టి కూడా కులం మీదనే ఉంటుందని అన్నారు. అస్పృశ్య శాఖలకు ఉమ్మడి సివిల్ సర్వీస్‌కు బదులు వివిధ విభాగాలకు వేర్వేరు సివిల్ సర్వీసులుండటం వల్ల సామర్థ్యం పెరుగుతుందని సూచించారు. ఇక్కడ కూడా కులపరమైన ఆలోచనా విధానం సిబ్బందిపై ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రిజ్వర్డ్ స్థానాలు, జాయింట్ ఎలక్టొరేట్స్ విషయంలో హిందూసభ నాయకుడు డాక్టర్ మూంజ్, సెంట్రల్ అసెంబ్లీలో బడుగువర్గాల సభ్యుడు ఎంసి. రాజా ఒక ఒప్పందాన్ని రూపొందించారు. మూంజ్‌తో తాను కుదుర్చుకున్న ఒప్పందం వివరాలను వెల్లడిస్తూ బ్రిటిష్ ప్రధానికి రాజా టెలిగ్రామ్ సందేశం పంపారు. తొలుత అంబేద్కర్‌కు మద్దతు తెలిపిన రాజా తరువాత తన వైఖరి మార్చుకున్నారు. ఈ ఒప్పందాన్ని అంబేద్కర్ వ్యతిరేకించారు. 1932 మే నెలలో కాంప్టీలో జరిగిన అఖిల భారత బడుగువర్గాల సదస్సు ఈ ఒప్పందాన్ని రద్దు చేసింది. రౌండ్‌టేబుల్ సమావేశంలో అంబేద్కర్. శ్రీనివాసన్ అందించిన సేవలను సదస్సు ఘనంగా ప్రస్తుతించింది.

ఓటు హక్కు విధానాన్ని సవరించడం, కొత్త నియోజకవర్గాల ఏర్పాటు గురించి సవివరమైన ప్రతిపాదనలు చేస్తూ ప్రాంతీయ కమిటీ నివేదికను రూపొందించింది. అంబేద్కర్ విడిగా ఒక నోట్ సమర్పించారు. బడుగు వర్గాలు అనే పదానికి ఈ కమిటీ స్పష్టమైన నిర్వచనం ఇచ్చింది. ఇండియన్ లెజిస్లేచర్ అధికారాన్ని కమిటీ (1916లో) భారత ప్రభుత్వ విద్యా కమిషనర్ సర్ హెన్రీ షార్ప్, సౌత్‌బారో ఫ్రాంచైజ్ కమిటీ బడుగు వర్గాలను గిరిజనుల తెగగా అభివర్ణించాయి. నేరస్థులు, ఇతర వర్గాలు గ్రూపుల్లో చేర్చాయి. బడుగు వర్గాలకు కల్పించే రాయితీలు, ఇతర ప్రయోజనాలు అస్పృశ్యులకు మాత్రమే వర్తించాలని లోథియన్ ఫ్రాంచైజ్ కమిటీ అభిప్రాయపడింది. ఇది నిజంగా అంబేద్కర్ సాధించిన విజయమే. అస్పృశ్యతను నిర్ధారించే పరీక్షను భావనాపరమైన వివక్షత ప్రాతిపదికగా నిర్ణయించాలని అంబేద్కర్ తాను సమర్పించిన నోట్‌లో సూచించారు. భౌతికంగా అస్పృశ్యతను నేడు పాటించడం లేదని ఆయన పేర్కొన్నారు.

భారతదేశంలో కులతత్వం గురించి, దానివల్ల ఎదురవుతున్న సమస్యలపై బ్రిటిష్ ప్రధాని 1932 ఆగస్ట్ 14న తన అవార్డు ప్రకటించారు. ప్రాదేశిక శాసన సభల్లో బడుగువర్గాలకు ప్రత్యేక సీట్లను ఆయన కేటాయించారు. ద్వంద్వ ఓటు హక్కు కల్పించారు. ఒక ఓటు తమ ప్రతినిధులను ఎన్నుకునేందుకు ఉద్దేశించింది కాగా మరొకటి సాధారణ నియోజకవర్గాలకు కూడా వర్తించే ఓటుహక్కు. ముస్లింలు, సిక్కులు యూరోపియన్లు క్రైస్తవులు, ఆంగ్లో ఇండియన్లకు ప్రత్యేక ఎలక్టొరేట్లను అవార్డు మంజూరు చేసింది. ఇది భారతీయుల్లో చీలికలు సృష్టించింది. భారతదేశ చరిత్రలో అస్పృశ్యులకు రాజకీయ ఉనికిని ఈ అవార్డు కలిగించింది. భారతదేశ భవిష్యత్తును నిర్ధారించడంలో వారికి కూడా పాత్ర కల్పించింది. అంబేద్కర్ సిద్ధాంతాలకు లభించిన విజయమే.

హిందువుల నుండి అస్పృశ్యులను వేరు చెయ్యడానికి జరిగిన ప్రతి ప్రయత్నాన్ని గాంధీజీ శాయశక్తులా అడ్డుకున్నారు. ప్రత్యేక ఎలక్టొరేట్‌లు భారతదేశాన్ని విచ్ఛిన్నం చేస్తాయని సామ్యూలహోర్‌కు రాసిన లేఖలో ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రత్యేక ఎలక్టొరేట్‌లు కలిపిస్తే నేను నిరవధిక నిరాహారదీక్ష పాటించాల్సి వస్తుంది. నా తుది నిర్ణయాన్ని బ్రిటిష్ ప్రభుత్వానికి స్పష్టంగా వివరించదలుచుకున్నాను. గాంధీ ప్రతిపాదనను అంబేద్కర్ రాజకీయ స్టంట్‌గా వ్యాఖ్యానించారు.

ప్రతిష్ఠంభనను అంతమొందించి గాంధీజీ ప్రాణాలను కాపాడాలని పండిట్ మాలవీయ 1932 సెప్టెంబర్ 19న బొంబాయిలో జరిగిన హిందూ నాయకుల సమావేశంలో విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని అంబేద్కర్‌కు కూడా తెలియజేశారు. బడుగు వర్గాలకు ప్రత్యేకంగా సీట్ల కేటాయించడం పై గాంధీజీకి ఎటువంటి అభ్యంతరం లేదని సర్‌చునీలాల్ మెహతా పేర్కొన్నారు. గాంధీజీ ప్రాణాలు కాపాడేందుకు బ్రిటిష్ ప్రధాని ఇచ్చిన అవార్డులో మార్పులు చేయాల్సి ఉంటుందని అంబేద్కర్ అన్నారు. ఇందుకు ఆయన ఆమోదం పొందాల్సి ఉంటుందన్నారు. దేశ వ్యాప్తంగా అందరిచూపు అంబేద్కర్‌పైనే పడింది. ఎటువంటి ఖచ్చితమైన అభిప్రాయాలు లేకుండా సమావేశం నిర్వహించడం వల్ల ఉపయోగం లేదని అంబేద్కర్ వ్యాఖ్యానించారు. జాతీయ మీడియా ఇందుకు ఆగ్రహం వ్యక్తం చేసింది. అంబేద్కర్‌ను ఒక భూతంగా, ద్రోహిగా, తాత్కాలిక ప్రయోజనాలను మాత్రమే ఆశించే వ్యక్తిగా అభివర్ణించింది. హిందూ నాయకుల సమావేశం సందర్భంగా అంబేద్కర్ మరో ప్రకటన చేశారు. ఆయన ఈ విధంగా వ్యాఖ్యానించారు.

> "రౌండ్‌టేబుల్ సమావేశంలో దేశ స్వాతంత్ర్యం కోసం పట్టుబట్టిన విధంగా దాని కోసం గాంధీజీ ఆమరణ నిరాహారదీక్ష చేయడం సముచితంగా ఉండేది. బ్రిటిష్ ప్రధాని అవార్డును బడుగువర్గాలకు ప్రత్యేక ప్రాతినిధ్యం కల్పించడానికి వ్యతిరేకంగా ఆయన ఈ ఆందోళన చేపట్టడం బాధాకరమైన విషయం. తన ఆత్మాహుతికి దీనిని సాకుగా తీసుకోవడం నిజంగా ఆందోళన కలిగించే అంశం. మహాత్ముడే మీ అమర జీవి కాదు. అలాగే పార్టీ కూడా శాశ్వతం కాదు. మహాత్ములు వచ్చారు, వెళ్ళారు. అయితే అస్పృశ్యులు అస్పృశ్యులుగానే ఉన్నారు.

యరవాడ జైలులో ఉన్న గాంధీజీని అంబేద్కర్ ఇతర హిందూనాయకులతో కలసి పరామర్శించారు. అన్ని సీట్లకు ప్యానెల్ విధానం అమలు చేయాలని గాంధీజీ ఈ సందర్భంగా ప్రతిపాదించారు. ప్రాదేశిక శాసన సభల్లో బడుగు వర్గాలకు 197 స్థానాలు కేటాయించాలని అంబేద్కర్ డిమాండ్ చేశారు. ఆయన గాంధీజీ సూచనను ఆమోదించారు. నాయకులు ఈ స్థానాల సంఖ్యను 126కు కుదించారు. ప్రాథమిక ఎన్నికల విధానం 10 ఏళ్ళ తరువాత అంతం కావాలని అంబేద్కర్ సూచించారు. అయితే స్థానాల రిజర్వేషన్ల విషయంలో 15 ఏళ్ళ తరువాత బడుగువర్గాల రిఫరెండం నిర్వహించి తదనుగుణంగా నిర్ణయం తీసుకుందామని ఆయన ప్రతిపాదించారు. ప్రాదేశిక శాసనసభల్లో బడుగువర్గాలకు 145 స్థానాలు కేటాయించాలని అంగీకారం కుదిరింది. బ్రిటిష్ ఇండియాలోని సెంట్రల్ అసెంబ్లీలో హిందువుల స్థానాల్లో 10 శాతం బడుగు వర్గాలకు కేటాయించాలని కూడా అంగీకారం కుదిరింది.రిఫరెండం కోసం పట్టుబడి ఒప్పందాన్ని నిలవరించవద్దని అంబేద్కర్‌కు గాంధీజీ గట్టిగా విజ్ఞప్తి చేశారు.

"మహాత్మాజీ మీరు మాకు అండగా ఉండాలి" అని అంబేద్కర్ విజ్ఞప్తి చేశారు. "నిర్దిష్ట కాలపరిమితి తరువాత రిఫరెండం నిర్వహించాలనే డిమాండ్‌ను కొంతమంది మిత్రులు వ్యతిరేకిస్తున్నారు. అయితే మేము మాత్రం ఈ విషయంలో గట్టిపట్టుదలగా ఉన్నాం" అని అంబేద్కర్ పేర్కొన్నారు. అంతిమంగా గాంధీజీ ఇలా ప్రశ్నించారు. "అయిదేళ్ళా? నా జీవితమా" అని ఆయన ప్రశ్నించారు. రిఫరెండం కాలపరిమితి విషయంలో లొంగే ప్రసక్తిలేదని అంబేద్కర్ స్పష్టం చేశారు. ఇది 10 ఏళ్ళ కంటే తక్కువ ఉండరాదన్నారు. గాంధీజీ దీనికి ఆమోదం తెలిపారు. ఈ మేరకు సెప్టెంబర్ 24న సాయంత్రం 5 గంటలకు ఒక ఒప్పందంపై సంతకాలు జరిగాయి. పూనా ఒప్పందంగా ఇది చరిత్రలో మిగిలిపోతుంది. బడుగువర్గాల తరపున అంబేద్కర్ సంతకం చేశారు. పూనా ఒప్పందాన్ని ధృవీకరించేందుకు బొంబాయిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రసంగిస్తూ అంబేద్కర్ ఈ విధంగా అన్నారు. "మహత్మాగాంధీ రౌండ్‌టేబుల్ సమావేశంలో ఈ వైఖరిని ఎందుకు తీసుకోలేదన్నదే నా ఒకే ఒక్క ఆందోళన. నా అభిప్రాయాన్ని ఆయన మన్నించి ఉంటే ఇన్ని సమస్యలు ఉండేవి కావు. "పూనా ఒప్పందాన్ని బ్రిటిష్ ప్రభుత్వం ఆమోదించింది. దీనితో మెక్‌డొనాల్డ్ మత అవార్డు ఉనికి కోల్పోయింది. గాంధీజీ ఇందుకు సంతృప్తి వ్యక్తం చేశారు.

పూనా ఒప్పందంపై అంబేద్కర్ వ్యాఖ్యలు పరుషంగా ఉన్నాయి. బడుగు వర్గాలకు ఏ మాత్రం ప్రయోజనం చేకూర్చనిదిగా పూనా ఒప్పందాన్ని మలచడంలో హిందువులు కుట్ర పన్నారని ఆయన విమర్శించారు. కమ్యూనల్ అవార్డు ప్రధానం చేసిన రెండో ఓటు అత్యంత విలువైంది.అస్పృశ్యులపై ఆధారపడి ఉండే విధంగా చేస్తే సాధారణ నియోజకవర్గాల్లో కూడా అస్పృశ్యులను అలక్ష్యం చేసేందుకు హిందూ కులాల వారెవ్వరూ సాహసం చెయ్యబోరు. బడుగు వర్గాల ప్రయోజనాలను విస్మరించబోరు.

పూనా ఒప్పందం సమయంలో ఉత్కృష్టమైన హామీలు ఇచ్చినప్పటికీ బడుగు వర్గాలకు కేటాయించిన స్థానాల్లో ఆ వర్గానికి చెందిన ఒకరిని ఉత్సవ విగ్రహంగా నిలబెట్టి కాంగ్రెస్ నాయకులు పోటీకి దిగేవారు. ఈ వైఖరి అంబేద్కర్‌ను తీవ్ర ఆగ్రహనికి గురి చేసింది. 1939 నవంబర్‌లో కాంగ్రెస్ మంత్రులందరూ మూకుమ్మడిగా వైదొలగిన సందర్భంగా ముస్లింలు నిర్వహించిన విమోచనోత్సవాలకు అంబేద్కర్ మద్దతు తెలిపారు.

పూనా ఒప్పందం, దాని ఓటింగ్ విధానం సార్వత్రిక ఎన్నికల్లో షెడ్యూల్డ్ కులాలకు చెందిన అభ్యర్థుల ఓటమికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. ఈ పరిణామాలన్నిటినీ సమీక్షించిన షెడ్యూల్డ్ కులాల సమాఖ్య కార్యవర్గం 1944 సెప్టెంబర్ 23 న సమావేశమై బడుగు వర్గాలకు ప్రత్యేక ఎలక్టోరేట్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఒక తీర్మానం ఆమోదించింది ఈ తీర్మానాన్ని అంబేద్కర్ ప్రతిపాదించారు పూనా ఒప్పందం రద్దు కావాలని ఆయన ఒక ఇంటర్వ్యూలో డిమాండ్ చేశారు. 6 కోట్ల అస్పృశ్యులకు ఇది ఓటుహక్కును కాలరాసింది. అంతర్జాతీయ, న్యాయశాస్త్రం ప్రకారం ఏ చట్టం శాశ్వతం, అంతిమం కాదు తిరుగులేనిది, పవిత్రమైంది కాదు.

జాయింట్ ఎలక్టోరేట్స్ డిమాండ్ వల్లే 1952 సార్వత్రిక ఎన్నికల్లో తాను ఓడిపోయానని అంబేద్కర్ గుర్తించారు. పూనా ఒప్పందం అనివార్యమనే విషయాన్ని అంగీకరిస్తున్నట్లు 1953 సెప్టెంబర్ 22న రాజ్యసభలో చేసిన ప్రసంగంలో అంబేద్కర్ పేర్కొన్నారు. ఆ ఒప్పందంలో నిర్దేశించిన దానికంటే ఎక్కువను తాను సాధించలేకపోయినట్లు అంగీకరించారు. మొత్తం వివాదాన్ని ముగింపచేస్తూ ఈ విధంగా అన్నారు. "బడుగు వర్గాల వారు స్వావలంబన కోసం చేస్తున్న ప్రయత్నాలకు పూనా ఒప్పందం 'మృత్యుఘంటం' గా పరిణమించింది. కాంగ్రెస్ అస్పృశ్యులకు ప్రాతినిధ్యం వహించబోదని అన్నారు తాను, గాంధీజీ సంతకం చేసిన పూనా ఒప్పందాన్ని రద్దు చెయ్యాలని అంబేద్కర్ డిమాండ్ చేశారు. మెక్డొనాల్డ్ 1942 అక్టోబర్లో 24న గవర్నర్ జనరల్కు అంబేద్కర్కు ఆయన వినతిపత్రం సమర్పించారు. అస్పృశ్యుల రాజకీయ, విద్య, ఇతర సమస్యలను అందులో ప్రస్తావించారు. సెంట్రల్ అసెంబ్లీలో, సెంట్రల్ ఎగ్జిక్యూటివ్లో బడుగువర్గాలకు ప్రాతినిధ్యం లేని విషయాన్ని ఆయన ఫిర్యాదు చేశారు. ప్రభుత్వోద్యోగాల్లో, ఫెడరేషన్ సర్వీస్ కమిషన్లో వారికి తగ్గ ప్రాతినిధ్యం లభించడంలేదని అంబేద్కర్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో జనాభా నిష్పత్తి ప్రాతిపదికగా బడుగు వర్గాలకు సరైన ప్రాతినిధ్యం లభించని విషయాన్ని ప్రస్తావించారు. ఉద్యోగాల్లో నియామకాలు చేసే అధికారులు హిందూ కులాల వారు కావడమే ఇందుకు కారణమని ఆయన అభిప్రాయపడ్డారు. 15మంది సభ్యులున్న మంత్రివర్గంలో ముస్లింలు ముగ్గురు ఉండగా షెడ్యూల్డ్ కులాలకు చెందిన వారు ఒక్కరే ఉన్నారని అంబేద్కర్ ప్రస్తావించారు. ఆయన కొన్ని పరిష్కారాలు సూచించారు. షెడ్యూల్డ్ కులాల వారిని మైనారిటీలుగా ప్రకటించాలి. వార్షిక ఖాళీల్లో వారి వాటాను స్పష్టంగా ప్రకటించాలి. వయో పరిమితి పెంచాలి. పరీక్ష ఫీజును తగ్గించాలి. నిబంధనలు సక్రమంగా అమలు జరిగిందీ లేనిదీ పర్యవేక్షించేందుకు షెడ్యూల్డ్ కులాలకు చెందిన అధికారులను నియమించాలి.

ప్రజా ప్రతినిధుల సభగా రాజ్యాంగపరిషత్ను రూపొందించాలనే డిమాండ్ను రాజకీయ నాయకులు పదే పదే చేయసాగారు. లండన్లో జరిగిన రౌండ్టేబుల్ సమావేశం విఫలం కావడం భారత రాజ్యాంగాన్ని భారతీయులే రూపొందించుకోవాలని, రాజ్యాంగ పరిషత్ ద్వారా ఈ కార్యం నెరవేరాలని భారతీయులు గ్రహించడానికి దోహదం చేసింది. భారత్కు స్వీయ నిర్ణయాధికారం ఉండాలని డిమాండ్ చేస్తూ స్వరాజ్పార్టీ 1934లో ఒక తీర్మానం ఆమోదించింది. ఇందుకు రాజ్యాంగ పరిషత్, అన్ని వర్గాల ప్రజల సమావేశాన్ని ఏర్పాటు చేయడం శరణ్యమని అభిప్రాయపడింది ఈ తీర్మానంలో నిర్దేశించిన విధివిధానాలను 1934

మే నెలలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ఆమోదించింది. ప్రజాస్వామ్య వ్యవస్థ ద్వారా ప్రజలకు సంపూర్ణాధికారం లభిస్తుందని కాంగ్రెస్‌పార్టీ 1936 డిసెంబర్‌లో ఫిరోజ్‌పూర్ సమావేశంలో నమ్మబలికింది. వయోజన ఓటు ద్వారా ఏర్పడే రాజ్యాంగ పరిషత్ ద్వారా మాత్రమే ఇది సాధ్యపడుతుందని పేర్కొంది. రాజ్యాంగాన్ని రూపొందించే అధికారం దానికి కల్పించాలని సూచించింది.

ద్వితీయ ప్రపంచ సంగ్రామంలో బ్రిటిష్ ప్రభుత్వంతో సహకరించేలా కాంగ్రెస్‌పార్టీకి అవకాశం కల్పించేందుకు రాజ్యాంగ పరిషత్తు ద్వారా భారత స్వతంత్ర ప్రతిపత్తిని గుర్తించి, రాజ్యాంగాన్ని రూపొందించడం (రాజ్యాంగ పరిషత్ ద్వారా) అవసరమని 1939 నవంబర్‌లో సమావేశమైన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానించింది.

స్వాతంత్ర్యం పొందిన ఒకదేశం రాజ్యాంగాన్ని రూపొందించుకునేందుకు, మతపరమైన, ఇతర సమస్యల పరిష్కారానికి రాజ్యాంగపరిషత్ ఒక్కటే ప్రజాస్వామిక విధానమని అభిప్రాయపడింది. వయోజన ఓటింగ్ ప్రాతిపదికగా రాజ్యాంగ పరిషత్‌ను ఎన్నుకోవాలని కమిటీ అభిప్రాయపడింది. మైనారిటీలు కోరుకున్న విధంగా స్వతంత్ర ప్రతిపత్తిని కొనసాగించాలని కమిటీ సూచించింది.

రాజ్యాంగ పరిషత్ ఆలోచనను గాంధీజీ కూడా సమర్థించారు. రాజ్యాంగ నిర్మాణానికి గాను చిన్న పరిమాణంలో ఒక సంస్థ ఉండాల్సిన అవసరం ఉందని సర్ మారిస్‌గాయర్, ప్రొఫెసర్ రెజినాల్డ్ కూప్‌లాండ్ అభిప్రాయపడ్డారు. 1940 మార్చిలో లాహోర్ తీర్మానం చేసిన అనంతరం రాజ్యాంగ పరిషత్ విషయమై ముస్లింలీగ్ వైఖరిలో మార్పు వచ్చిన సూచనలు కనిపించాయి. దేశంలో రెండు ప్రత్యేక ప్రాంతాలు ఏర్పాటు చేయాలనే తమ డిమాండ్‌కు అనుగుణంగా రెండు రాజ్యాంగ పరిషత్‌లను ఏర్పాటు చేయాలని అది డిమాండ్ చేసింది. రెండు రాజ్యాంగ పరిషత్‌లను ఏర్పాటు చేయాలనే డిమాండ్‌ను కాంగ్రెస్ పార్టీ ఇంతకు ముందే చేసింది. క్రిప్స్ ప్రతిపాదనల్లో కూడా ఈ అంశం ఉంది. నెహ్రూ కమిటీ కూడా దీనితో ఏకీభవించింది. అయితే అంబేద్కర్ ఆ డిమాండ్‌ను వ్యతిరేకించారు. ఇది దేశంలో అంతర్గత యుద్ధానికి దారితీసే అంశమని ఆయన అభిప్రాయపడ్డారు. మతపరమైన పరిశీలన రాజ్యాంగ పరిషత్‌లో భాగం కాకూడదని ఆయన పేర్కొన్నారు. ఆయన ఈ విధంగా వ్యాఖ్యానించారు.

> "సాప్రూ కమిటీ చేసిన సూచన మేరకు రాజ్యాంగ పరిషత్‌లో మొత్తం సభ్యుల సంఖ్య 160 ఉండాలి. ప్రాదేశిక శాసనసభల సభ్యులు రాజ్యాంగ పరిషత్ సభ్యులను ఎన్నుకోవాలి. దామాషా ప్రాతినిధ్యం వ్యవస్థ ప్రకారం ఏదైన ఒక నిర్ణయం చేసేందుకు హాజరైన ఓటింగ్‌లో పాల్గొన్న వారిలో నాల్గింట మూడు వంతుల మంది ఓటు వేయాల్సి ఉంది. ఇటువంటి పరిస్థితిలో రాజ్యాంగ పరిషత్ తమకు నమ్మకం కలిగించేదిగా నిష్పక్షపాతంగా వ్యవహరించగలుగుతుందా?"

షెడ్యూల్డ్ కులాల సమాఖ్య నాయకునిగా క్యాబినెట్ మిషన్ అంబేద్కర్‌ను 1946 ఏప్రిల్ 5న ఇంటర్వ్యూ చేసింది. రాజ్యాంగ పరిషత్ ఏర్పాటు చేయాలనే ఆలోచనను ఆయన వ్యతిరేకించారు. హిందూ అగ్రకులాల వారు దానిలో ఆధిపత్యం ప్రదర్శించే అవకాశం

ఉందని ఆయన భయం వ్యక్తం చేశారు. షెడ్యూల్డ్ కులాల వారు ప్రవేశించినా వారి సంఖ్య మైనారిటీ స్థాయి కంటే ఎక్కువేమీ ఉండబోదని, వారి అభిప్రాయాలకు విలువ ఉండబోదని అభిప్రాయపడ్డారు.

మతం స్వరాజ్యానికి అవరోధం అవుతుంది. ఈ సమస్యకు కేవలం మధ్యపెట్టడం వల్ల పరిష్కారం కనుగొనలేమని, కొన్ని ఖచ్చితమైన సిద్ధాంతాల ప్రాతిపదికగా మాత్రమే పరిష్కరించగలమని అంబేద్కర్ పేర్కొన్నారు. ఆయన ఇంకా ఇలా చెప్పారు.

> "మతపరమైన విషయానికి సంబంధించి దృక్పథాలు రెండు విధానాలుగా ఉండాలి. (1) మత సమస్య పరిష్కారానికి గాను అవలంభించాల్సిన ప్రభుత్వ విధానాలను స్పష్టంగా నిర్వచించాల్సి ఉంటుంది. (2) ఈ సిద్ధాంతాలను అన్ని పార్టీలకు సమానంగా, పక్షపాతం లేకుండా వర్తింప చెయ్యాలి."

అంబేద్కర్ దృష్టిలో మెజారిటీ అంటే కుల, మతపరమైన మెజారిటీ, రాజకీయపరమైన మెజారిటీ కాదు. మెజారిటీ కులం లేదా మతానికి చెందిన వారిని ప్రధానమంత్రిగా, మంత్రులను మొత్తం సభ సింగిల్ ట్రాన్స్‌ఫరబుల్ ఓటుద్వారా ఎన్నుకోవాలి. మంత్రి వర్గంలో వివిధ మైనారిటీల ప్రతినిధులను చట్ట సభలో ఆ మతానికి చెందిన సభ్యులు సింగిల్ ట్రాన్స్‌ఫరబుల్ ఓటు ద్వారా ఎన్నుకోవాలి.

బ్రిటిష్ ప్రభుత్వం తరపున వైస్రాయ్ 1940 ఆగస్ట్ 8 చేసిన ప్రకటన ఆగస్ట్ ప్రతిపాదనగా పేరు గడించింది. జాతీయ ప్రయోజనం కోసం వీలైనంత త్వరగా సమైక్యతను సాధించడం ఆ ప్రతిపాదనల లక్ష్యంగా పేర్కొనబడింది. "నిరంకుశత్వం, అణచివేతకు వ్యతిరేకంగా సాగే ప్రపంచవ్యాప్త ఉద్యమంలో సాధ్యమైన మేరకు పూర్తి స్థాయిలో పాలు పంచుకోవడానికి ఈ సమైక్యత దోహదం చెయ్యాలి." బ్రిటన్ కామన్వెల్త్‌లో భారత్‌కు ఆధిక్యత, సమాన భాగస్వామ్యం కల్పించడం ఈ ఆగస్ట్ ప్రతిపాదన ప్రధాన ధ్యేయం. మిగిలిన రాజ్యాంగపరమైన సమస్యలను యుద్ధం ముగిసిన తరువాత పరిష్కరించుకోవాలని అది నిర్దేశించింది. ఈ ప్రతిపాదనను గాంధీజీ, కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించగా సావర్కర్ సానుకూలత ప్రదర్శించారు. ఇది చాలా క్రియాశీలకమైన ప్రతిపాదనగా రాజాజీ వ్యాఖ్యానించారు. ముస్లిం లీగ్‌తో ఒప్పందం కుదరడానికి అవకాశం కలిగించవచ్చునని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తే రాజకీయ పరిస్థితి ఆ పార్టీకి అనుకూలంగా పరిణమించగలదని ఆయన భావించారు. ఆగస్ట్ ఆఫర్‌ను ఆమోదించేందుకు అంబేద్కర్ నాయకత్వంలోని షెడ్యూల్డ్ కులాల సంస్థ సుముఖత తెలిపింది.

బ్రిటన్ వారి క్యాబినెట్‌లో సభ్యుడైన క్రిప్స్ 1942 మార్చి 22న భారత్ వచ్చారు. బ్రిటిష్ ప్రభుత్వం నుండి కొన్ని ప్రతిపాదనలను ఆయన తీసుకువచ్చారు. యుద్ధ ప్రతిపాదనల్లో భారత్ సంపూర్ణ సహకారం సాధించడం క్రిప్స్ మిషన్ తక్షణ ధ్యేయం. యుద్ధం ముగిసిన వెంటనే రాజ్యాంగ పరిషత్‌ను సత్వరం సమావేశపరచాలని క్రిప్స్ ప్రతిపాదనలు నిర్దేశించాయి. భారత రాష్ట్రాల సహకారంతో రాజ్యాంగం రూపొందించడం ధ్యేయం. అయితే ఇండియన్ యూనియన్‌లో చేరడమా లేదా చేరకపోవడమా అనే అంశంపై నిర్ణయాధికారం ఆయా రాష్ట్రాలకు

ఇవ్వడం కూడా ఆ ప్రతిపాదనల్లో ఒకటి ఉంది. రాజ్యాంగ పరిషత్ ఈ మేరకు బ్రిటిష్ ప్రభుత్వంతో అవగాహనకు రావాలి. క్రిప్స్ ప్రతిపాదన పోస్ట్ డేటెడ్ చెక్‌గా గాంధీజీ అభివర్ణించారు. ఇతర పార్టీలు కూడా ఈ ప్రతిపాదనలను వ్యతిరేకించాయి.

ఎం.సి. రాజాతో కలిసి క్రిప్స్‌ను అంబేద్కర్ మార్చి 30న ఇంటర్వ్యూ చేశారు. బడుగు వర్గాల ప్రయోజనాల పరిరక్షణకు ఈ ప్రతిపాదనలు ఎంత మాత్రం దోహదం చేయబోవని అంబేద్కర్ పేర్కొన్నారు. "ఈ ప్రతిపాదనలు బడుగు వర్గాలకు తీవ్రనష్టం చేకూర్చేందుకు ఉద్దేశింపబడ్డాయి. హిందువుల పాలన కింద మగ్గిపోయేందుకు ఇవి దోహదం చేస్తాయి: అని అంబేద్కర్ వ్యాఖ్యానించారు. తాము ఆమోదం తెలపని రాజ్యాంగాన్ని తమపై బలవంతంగా రుద్దేందుకు బ్రిటిష్ ప్రభుత్వం ప్రయత్నిస్తే అది వాగ్దాన ఉల్లంఘనే అవుతుందని, తమ ఈ అభిప్రాయాన్ని బ్రిటిష్ ప్రభుత్వానికి తెలియజేయాలని బడుగు వర్గాల నాయకులు సర్‌స్టాఫోర్డ్ క్రిప్స్‌కు విజ్ఞప్తి చేశారు. తాము ఆమోదం తెలపని రాజ్యాంగాన్ని తమపై బలవంతంగా రుద్దేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని బడుగువర్గాలు భావించే అవకాశం ఉందని నివేదించాలని కోరారు. బడుగు వర్గాల పట్ల బ్రిటిష్ ప్రభుత్వ వైఖరి మ్యూనిచ్ దృక్పథం వలే ఉందని అంబేద్కర్ విమర్శించారు. అంటే ఇతరులను త్యాగం చేసి ఒకరిని కాపాడే విధంగా ఉందన్నారు. క్రిప్స్ ప్రతిపాదనలు పాకిస్తాన్‌ను ఏర్పాటు చేసుకునేందుకు ముస్లింలీగ్‌కు హక్కు కల్పించేవిగా ఉన్నాయని విమర్శించారు.

అంబేద్కర్ కార్మికవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారా లేక బడుగు వర్గాలకా అని క్రిప్స్ ప్రశ్నించారు. ఆయన పార్టీ బలం ఎంత అని ప్రశ్నించారు. దరిమిలా అంబేద్కర్ బడుగు వర్గాల నాయకుల సమావేశాన్ని 1942 మార్చి 30, 31 తేదీల్లో నిర్వహించారు. 1942 జూలైలో అఖిల భారత బడుగు వర్గాల సదస్సును నిర్వహించాలని నిర్ణయించారు. క్రిప్స్ ప్రతిపాదనలు బడుగు వర్గాలను వంచించేవిగా ఉన్నాయని అన్నారు. సర్వ శక్తులను సమీకరించుకుని అటువంటి ప్రమాదాన్ని ప్రతిఘటించి తీరతామని హెచ్చరించారు.

ఈ ప్రతిపాదనలు మెజారిటీ వర్గానికి మైనారిటీ వర్గం దాసోహమనిపించేవిగా ఉన్నాయని అంబేద్కర్ వ్యాఖ్యానించారు. రాజ్యాంగ పరిషత్ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ చేస్తున్న డిమాండ్‌ను ఆమోదించడం, పాకిస్తాన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్‌ను అంగీకరించడం ద్వారా ఈ ప్రతిపాదనలు బడుగు వర్గాలను వంచిస్తున్నాయి. వారు అస్పృశ్యుల కాళ్ళు, చేతులు కట్టివేసి హిందువుల దయాదాక్షిణ్యాల మీద వదిలేశారు. 1940 ఆగస్టు 14, 1941 ఆగస్ట్ 8 తేదీల్లో చేసిన ప్రతిపాదనలను ఆయన సమీక్షించారు. అస్పృశ్యుల హక్కులను అవి గుర్తించాయి. అయితే క్రిప్స్ ప్రతిపాదనలు వాటిని వంచించాయని వ్యాఖ్యానించారు. ఈ ప్రతిపాదనలు ప్రభుత్వం, రాజకీయ పార్టీల మధ్య అగాథాన్ని పెంచాయి.

క్రిప్స్ ప్రతిపాదనలను కాంగ్రెస్‌పార్టీ వ్యతిరేకించింది. పరివర్తనా సమయంలో పాలనా వ్యవస్థలో ఎటువంటి కీలక మార్పు లేకపోవడం ఇందుకు ప్రధాన కారణం. అలాగే జాతీయ ప్రభుత్వాన్ని సత్వరం నెలకొల్పాలనే డిమాండ్‌ను ఆమోదించకపోవడం మరో కారణం. పాకిస్తాన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్‌ను అంగీకరించనందున ముస్లింలీగ్ కూడా వ్యతిరేకించింది. ఈ ప్రతిపాదనలను ఆమోదిస్తే అవి దేశ సమైక్యతకు భంగం కలిగిస్తాయని హిందూ మహాసభ

తిరస్కరించింది. భారతదేశంలో బ్రిటిష్ అధికారం తక్షణం అంతం కావాలని మహాత్మాగాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్‌పార్టీ డిమాండ్ చేసింది. 1942 ఆగస్ట్ 8న "క్విట్‌ఇండియా" తీర్మానాన్ని కాంగ్రెస్ ఆమోదించింది ఆ తరువాత కాంగ్రెస్‌పార్టీని నిషేధించి నాయకులను అరెస్ట్ చేయడం జరిగింది.

మద్రాస్ శాసనసభలో కాంగ్రెస్‌పార్టీ చేత రెండు తీర్మానాలు ఆమోదింపచేయడంలో రాజాజీ కృతకృత్యులయ్యారు. 1942 ఏప్రిల్‌లో శాసనసభ ఈ తీర్మానాలను చేసింది. (1) వేర్పాటు కోసం ముస్లింలీగ్‌లు చేస్తున్న డిమాండ్‌ను స్వీకరించాలనే విషయంలో ఒక అంగీకారానికి రావడం ద్వారా అత్యవసర పరిస్థితిలో జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ముస్లింలీగ్‌తో చర్చలు ప్రారంభించాలి (2) మద్రాస్‌లో బాధ్యతాయుతమైన ప్రభుత్వం నెలకొల్పేందుకు ప్రతిపాదనలు చేసింది. ఈ తీర్మానాలను AICC తిరస్కరించింది రాజాజీతో సంబంధాలను కాంగ్రెస్ పార్టీ తెగతెంపులు చేసుకుంది. కాంగ్రెస్ నుండి విడిపోయిన తరువాత రాజాజీ వంటరిగా మారిపోయారు.

పార్టీ రహిత సమావేశం స్థాయి సంఘం 1944 నవంబర్ 18,19 తేదీల్లో న్యూఢిల్లీలో సమావేశమై ఒక కమిటీని ఏర్పాటు చేసేందుకు తీర్మానాన్ని ఆమోదించింది. 1944 డిసెంబర్ 3న సర్ టి బి. సప్రు ఈ "మధ్యవర్తి కమిటీ" సభ్యుల పేర్లను ప్రకటించారు. సభ్యత్వానికి ఆమోదం తెలిపి సహకరించేందుకు తొలుత అంగీకరించిన అంబేద్కర్ ఆ తరువాత సభ్యునిగా వైదొలిగారు. సభ్యుల ఏర్పాటు తీరును వ్యతిరేకించడమే ఇందుకు కారణం ఆత్మవిశ్వాసం రేకెత్తించడంలో సభ్యులు విఫలమవుతున్నారని ఆయన ఫిర్యాదు చేశారు. సభ్యులను మార్చి కమిటీని పునర్వ్యవస్థీకరిస్తే తిరిగి సహకరించేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు, కమిటీ ఈ విధంగా వ్యాఖ్యానించింది. "షెడ్యూల్డ్ కులాలపై ఆయన రాసిన వాటిని, ఉపన్యాసాలను అధ్యయనం చేయడం ద్వారా ఈ లోటును అధిగమించేందుకు మేము ప్రయత్నించాం." కనీసం 30 మంది నుండి 40 శాతం ఓట్లు సంపాదించగల షెడ్యూల్డ్ కులాల అభ్యర్థులను సార్వత్రిక ఎన్నికల్లో అభ్యర్థులుగా నిలబడేందుకు అర్హులుగా పరిగణించాలని అంబేద్కర్ సూచించారు

లార్డ్‌వావెల్ తన ప్రతిపాదనలను 1945 జూన్ 14న చదివి వినిపించారు. సిమ్లాలో భారత నాయకుల సమావేశం నిర్వహించాలనేది ఆయన ఉద్దేశ్యం. కొత్త కార్యనిర్వాహక మండలి ఏర్పాటులో కాంగ్రెస్ నాయకుల సూచనలు తీసుకోవడం ఈ సమావేశాన్ని ఏర్పాటు చేయడం ఆయన ఉద్దేశ్యం. భారతదేశంలో వివిధ మతాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించే భారతీయ మండలిగా దానిని చేయాలని ఆయన భావించారు. ప్రస్తుత రాజ్యాంగ పరిధిలోని మండలి బాధ్యతలు నిర్వహించాలని ఆయన అభిప్రాయపడ్డారు. తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు తుది రాజ్యాంగ పరిష్కారానికి ఎటువంటి పరిస్థితుల్లోనూ ప్రతిబంధకం కాలేదు. రాజ్యాంగ నిర్మాణ వ్యవస్థ సమావేశాన్ని వీలైనంత త్వరలో నిర్వహించాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. భారతదేశంలో ప్రధాన రాజకీయ పార్టీ సహకారంతో కార్యనిర్వాహకమండలిని ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకునే అధికారాన్ని బ్రిటన్ ప్రభుత్వం వైస్రాయ్‌కు కల్పించింది.

భులాభాయ్ దేశాయ్, లియాకత్ అలీఖాన్ మధ్య కుదిరిన ఒప్పందంలోని ప్రతిపాదనల గురించి చర్చించేందుకు బ్రిటన్ వైస్రాయ్ లార్డ్‌వావెల్ 1945 మార్చి నెలలో లండన్ వెళ్ళారు. ఆ ఒప్పందాన్ని సప్రూ కమిటీ తరవాత ఆమోదించింది. 'వావెల్ పథకం' తో లార్డ్‌వావెల్ జూన్ మొదటివారంలో భారత్ తిరిగి వచ్చారు. జైలులో నిర్బంధంలో ఉన్న కాంగ్రెస్ నాయకులను ఆయన విడుదల చేశారు. 1945 జూన్ 25న సిమ్లాలో ఒక సమావేశాన్ని నిర్వహించారు.

వైస్రాయ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో సభ్యుడైనందువల్ల అంబేద్కర్ ఆ సమావేశానికి హాజరు కాలేకపోయారు. అయితే షెడ్యూల్డ్ కులాల వారి సమస్యలు అభిప్రాయాలు తెలియజేసేందుకు ఆయన కృషి చేశారు. ముస్లింలను హిందువులతో సమానంగా చూడటంలో షెడ్యూల్డ్ కులాల వారికి ఉన్న అభ్యంతరాలను సమావేశంలో పాల్గొన్న శివరాజ్ వివరించారు. ఇతర మైనారిటీల హక్కులు సమస్యలను గాలికి వదిలివేసి ముస్లింలకు మాత్రమే ప్రత్యేక సదుపాయాలను కల్పించడాన్ని ఆయన వ్యతిరేకించారు. ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమాన ప్రాతినిధ్యం కల్పిస్తే సర్వీసు రంగం, భారత సైనిక దళాల్లో కూడా సమాన ప్రాతినిధ్యం కల్పించాలని ముస్లింలు డిమాండ్ చేసే అవకాశం ఉందని ఆయన భావించారు.

1940లో తాము చేసిన సిఫార్సును శివరాజ్ తప్పుగా అర్థం చేసుకున్నారని జిన్నా పేర్కొన్నారు. ఆ సమయంలో ముస్లింలు కాకుండా షెడ్యూల్డ్ కులాలు లేదా ఇతర మైనారిటీల గురించి ప్రత్యేక ప్రస్తావన ఉండేది కాదు. షెడ్యూల్డ్ కులాలకు చెందిన ప్రతినిధులను నామినేట్ చెయ్యాలనే కాంగ్రెస్ సూచనను శివరాజ్ వ్యతిరేకించారు. భారత జాతీయ జీవనంలో షెడ్యూల్డ్ కులాల వారు విభిన్న వ్యవస్థకు ప్రతిరూపాలని ఆయన వ్యాఖ్యానించారు. ఆ విధమైన గుర్తింపు కూడా వారు పొందారని పేర్కొన్నారు. సమానత్వం కల్పించాలని డిమాండ్ చేయబోనని, ప్రాతినిధ్యం, వారి జనాభాకు ఉన్న దామాషానే తమకు కూడా కల్పించాలని పట్టుపట్టగలనని ఆయన అన్నారు. రెండు ప్రధాన పార్టీలను మాత్రమే గుర్తించడం బ్రిటిష్ వారు పొరపాటు చేశారని ఆయన అన్నారు. 6 కోట్ల మంది ఉన్న షెడ్యూల్డ్ కులాల వారు జనాభాలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారని అన్నారు. వారిని ఆ విధంగానే చూడాలని డిమాండ్ చేశారు. దేశ సమగ్రతను పరిరక్షించడంతో తగిన జాగ్రత్తలు తీసుకునేందుకు ఈ సమావేశం చివరి అవకాశం కల్పించింది. యుద్ధంలో ఓటమి ఎదురైన తరువాత మతతత్వ మంటలు వేగంగా విస్తరించాయి.

రెండు ముఖ్యమైన సంఘటనలు భారత జాతీయ ఉద్యమానికి అనుకూల పరిణామాలను సృష్టించాయి. న్యూఢిల్లీలోని ఎర్రకోట వద్ద భారత జాతీయ సైనిక ఖైదీల విచారణ 1945 నవంబర్, డిసెంబర్ మాసాల్లో నిర్వహించారు. ఇది బ్రిటిష్ ప్రభుత్వం పట్ల భారతీయుల్లో అనుమానాలు విద్వేషం, వివాదాలను పెంచడానికి దోహదం చేసింది. రాయల్ ఇండియన్ నౌకాదళం బొంబాయి నగరంలో సమ్మె చేసింది. భారత్‌ను అణచి ఉండటం ఇక ముందు సాధ్యం కాదని ఈ పరిణామం నిరూపించింది.

రాజకీయ ప్రతిష్టంభనను పరిష్కరించేందుకై భారత నాయకులతో సంప్రదింపులు జరిపేందుకు ముగ్గురు క్యాబినెట్ మంత్రుల బృందాన్ని బ్రిటిష్ ప్రధాని భారత్‌కు పంపారు. సర్‌స్టాఫర్డ్ క్రిప్స్, ఎవి అలెగ్జాండర్, అప్పటి భారత విదేశాంగమంత్రి లార్డ్ ఫెథిక్‌లారెన్స్

1946 మార్చి 24న న్యూఢిల్లీ చేరుకున్నారు. వీరి వద్ద ఎటువంటి నిర్దిష్ట ప్రతిపాదనలు లేవు. చర్చలు సాధారణ, వివరణాత్మక రీతిలో జరిగాయి. భారత భవిష్యత్ రాజ్యాంగం విషయంలో కాంగ్రెస్, ముస్లింలీగ్ నాయకుల మధ్య అవగాహన పెంపొందించడంలో బ్రిటన్ మంత్రుల బృందం విఫలమైంది.

రాష్ట్రాలు, లేదా విభాగాల సమాఖ్యకు కార్యనిర్వాహక లేదా శాసనపరమైన యంత్రాంగం ఏర్పాటు చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించింది. వివిధ ప్రాంతాల మధ్య సమానత్వం ప్రాతిపదికగా ప్రాతినిధ్యం కల్పించాలనే డిమాండ్‌ను కూడా అది వ్యతిరేకించింది. ఒకటి పాకిస్తాన్‌కు, రెండవది ఇతర ప్రాంతాలతో కూడిన కూటమికి సమాన ప్రాతినిధ్యం కల్పించాలనే సూచన తమకు కూడా ఆమోదయోగ్యం కాదని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు. యూనియన్ ఎగ్జిక్యూటివ్, లెజిస్లేచర్‌తో సమాన ప్రాతినిధ్యం కావాలని ముస్లింలీగ్ డిమాండ్ చేసింది. హిందువులు, ముస్లింల మధ్య సమన్వయం సాధించాలనే ఉద్దేశంతో నిర్వహించిన సమావేశం విఫలమైంది.

ముగ్గురు మంత్రుల భారత్ పర్యటన ఉద్దేశం రాజ్యాంగానికి సంబంధించిన వివరాలను రూపొందించడం కాదు. భారతీయులు కోసం తామే భారతీయుల రాజ్యాంగ పరిషత్‌ను ఏర్పాటు చేసుకునేలా సహకరించడం. భారత్‌లో ప్రధానంగా ఉన్న మూడు సాధారణ, ముస్లిం, సిక్కు మతాలను మంత్రులు గుర్తించారు.

మంత్రులు మిషన్ ప్రకటనలోని పథకాన్ని అఖిల భారత ముస్లిం లీగ్ మండలి ఆమోదించింది. సర్వసత్తాక పాకిస్తాన్ కావాలనే తమ డిమాండ్ విషయంలో ఎటువంటి మార్పు ఉండబోదని అది ప్రకటించింది. అది భారత ముస్లింలో తిరుగులేని లక్ష్యమని పేర్కొంది.

ఎటువంటి రూపంలోనైనా సమానత్వం కల్పించడాన్ని కాంగ్రెస్‌పార్టీ వ్యతిరేకించింది. అయితే తాత్కాలిక ప్రభుత్వంలో సమాన ప్రాతినిధ్యం కల్పించే విషయానికి సానుకూలత వ్యక్తం చేసింది. మంత్రుల బృందంతో సమావేశమైన వైస్రాయ్ ఒక ప్రతిపాదన చేశారు. 14 మందితో తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని, ఇందులో ఒక షెడ్యూల్డ్ కులాలకు చెందిన వ్యక్తితో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆరుగురికి, ముస్లింలీగ్‌కు చెందిన అయిదుగురికి, సిక్కు, పార్సీ, భారత క్రైస్తవులను ఒక్కొక్కరినీ మంత్రిని నియమించాలన్నది ఆ ప్రతిపాదన సారాంశం. ఈ ప్రతిపాదన సలహారూపంలో కాక ఒక తీర్పు లేదా అవార్డు రూపంలో ఉండటం గమనార్హం. రాజ్యాంగ పరిషత్‌లో చేరేందుకు మాత్రమే కాంగ్రెస్ ఆమోదం తెలిపిందని పండిట్ జవహర్‌లాల్‌నెహ్రూ పేర్కొన్నారు. తాత్కాలిక ప్రభుత్వంలో చేరరాదని ముస్లిం లీగ్ నిర్ణయించింది. కొత్త ప్రభుత్వం 1946 సెప్టెంబర్ 2న అధికారంలోకి వచ్చింది. వైస్రాయ్, జిన్నాల మధ్య లేఖాయనం కొనసాగింది. తాత్కాలిక ప్రభుత్వంలో చేరాలనే ముస్లింలీగ్ నిర్ణయాన్ని జిన్నా వైస్రాయ్‌కు తెలియజేశారు. రాజ్యాంగ పరిషత్‌లో కూడా అది చేరగలదన్న అభిప్రాయం. ఆ సమయంలో వ్యక్తమైంది. ఈ అభిప్రాయాన్ని కొట్టిపారేస్తూ జిన్నా ఒకప్రకటన చేశారు. పాకిస్తాన్ ఏర్పాటు చెయ్యాలని, రెండు రాజ్యాంగ పరిషత్‌లను ఏర్పాటు చెయ్యాలనే తమ డిమాండ్‌కు కట్టుబడి ఉన్నట్టు ఆయన ప్రకటించారు.

రాజ్యాంగ పరిషత్‌కు సంబంధించిన సమస్యలను రెండుగా వర్గీకరించాలని అంబేద్కర్ ప్రతిపాదించారు (ఎ) రాజ్యాంగపరమైన అంశాలు ఉదా! శాసన వ్యవస్థ, అధికార యంత్రాంగం మధ్య సంబంధాలు, వాటి నిర్మాణం, బాధ్యతలు (బి) మతపరమైన సమస్యలు, (ఎ) ఇందులో పేర్కొన్న అంశాలను గ్రేట్‌బ్రిటన్ లేదా అమెరికాకు చెందిన ప్రముఖ రాజ్యాంగ న్యాయవాది అధ్యక్షతన ఏర్పడిన కమిషనకు నివేదించాలి. ఈ కమిషన్‌లో ఇద్దరు భారతీయ నిపుణులుండాలి. వారు హిందూ, ముస్లిం మతాలకు చెందిన వారై ఉండాలి. 1935 భారత ప్రభుత్వ చట్టానికి అనుగుణంగా ఈ అంశాలను నివేదించాలి. చట్టంలో చెయ్యవలసిన మార్పులను జిన్నా కమిషన్ సూచించాలి. (బి) లోని అంశాలను వివిధ మతాలకు చెందిన నాయకుల సమావేశానికి నివేదించాలి. ఒక ఆమోద యోగ్యమైన పరిష్కారం సాధించడంలో ఈ సమావేశం విఫలమైతే బ్రిటిష్ ప్రభుత్వం అవార్డు ప్రకటించాలి. భారతదేశం నుండి వైదొలగడానికి ముందు కొత్త రాజ్యాంగం షెడ్యూల్డ్ కులాల వారికి ప్రాథమిక మానవహక్కులు, స్వేచ్ఛ, సుఖ సంతోషాలకోసం కృషి చేసుకునే హక్కు హామీ, ఇవ్వాలని వారికి ప్రత్యేక ఎలక్టోరేట్‌లను పునరుద్ధరించాలని, వారు డిమాండ్ చేసిన ఇతర భద్రతా చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ సూచించారు. సమిష్టి ఎలక్టొరేట్లు ఉన్నంతకాలం షెడ్యూల్డ్ కులాల ఓటర్లు తక్కువగా ఉన్నందున హిందూ అభ్యర్థులు వారి ఆకాంక్షలను విస్మరిస్తారని అంబేద్కర్ పేర్కొన్నారు. హిందుకులాల వారు షెడ్యూల్డ్ కులాల అభ్యర్థులకు ఎప్పుడు మద్దతు ఇవ్వబోదు. ప్రత్యేక ఎలక్టోరేట్‌లు మౌలికమైనవి. అవి లేకుండా షెడ్యూల్డ్ కులాల వారికి చట్టసభల్లో ప్రాతినిధ్యం ఉండబోదు.

షెడ్యూల్డ్ కులాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నానని అంబేద్కర్ చెప్పుకోవడాన్ని కాంగ్రెస్ హరిజన నాయకుడైన జగ్‌జీవన్‌రాం తిరస్కరించారు. ఎన్నికల్లో అంబేద్కర్ అనుచరుల ఓటమికి సంబంధించిన గణాంకాలను కాంగ్రెస్‌పార్టీ ముందుకు తీసుకువచ్చింది.

మంత్రుల బృందం పర్యాటనకు సంబంధించిన ప్రకటన 1946 మే 16న ప్రచురితమైంది. వెనువెంటనే అంబేద్కర్ ఒక ప్రకటన చేశారు. అస్పృశ్యులను పూర్తిగా విస్మరించారని, కేంద్ర ఎగ్జిక్యూటివ్‌తో తమ ప్రతినిధిని నామినేట్ చేసే హక్కు వారికి లేదని, ప్రాతినిధ్యానికి సంబంధించి నిర్దిష్ట కోటాలేదని రాజ్యాంగ పరిషత్తులో ప్రత్యేక ప్రాతినిధ్యానికి హక్కు లేదని అంబేద్కర్ పేర్కొన్నారు. బ్రిటిష్ ప్రభుత్వ నిర్దేశిత విధానాలకు విరుద్ధంగా క్యాబినెట్ మిషన్ నిర్ణయాలున్నాయని అంబేద్కర్ విమర్శించారు. RTC లో అస్పృశ్యులకు ఉన్న గుర్తింపు, కమ్యూనల్ అవార్డును రద్దు చేయడం జరిగిందని అంబేద్కర్ పేర్కొన్నారు. 1940 జనవరి, ఆగస్ట్ నెలల్లో లార్డ్ లిలింగ్‌థో ప్రసంగాల్లో ఇచ్చిన హామీలు, అమెరీ, వెల్‌న్ వారి వారి ప్రసంగాల్లో ఇచ్చిన హామీలను విస్మరించారని అంబేద్కర్ పేర్కొన్నారు. మంత్రుల బృందం ఫార్ములా గాంధీ ఫార్ములాకు కేవలం నకలు మాత్రమేనని అంబేద్కర్ వ్యాఖ్యానించారు. అస్పృశ్యులను ఇవి ఒక ప్రత్యేక శక్తిగా గుర్తించవు. ప్రాథమిక ఎన్నికల ఫలితాలను పరిగణలోకి తీసుకోవాలే గానీ అవే తుది మార్గదర్శక సూత్రాలని భావించడం తగదని అన్నారు. ప్రాథమిక ఎన్నికల్లో పోల్ అయిన ఓట్లలో 28 శాతం కాంగ్రెస్‌కు అనుకూలంగా పడ్డాయి. అంటే 72 శాతం వ్యతిరేకంగా పడ్డాయి. సలహా సంఘాన్ని ఏర్పాటు చేయాలనే సూచనను అంబేద్కర్ వ్యతిరేకించారు. రాజ్యాంగ పరిషత్తులో హిందూ అగ్రవర్ణ కులాలే ఆధిపత్యం ప్రదర్శిస్తారని

అన్నారు బ్రిటిష్ ప్రభుత్వం అస్పృశ్యులను మైనారిటీలుగా గుర్తించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మైనారిటీల భద్రత కోసం రాజ్యాంగ పరిషత్ రూపొందించిన చర్యలు సరిపోతాయా, వాస్తవానికి అనుగుణంగా ఉన్నాయా అనే విషయాన్ని పరిశీలించేందుకు యంత్రాంగాన్ని ఏర్పాటు చేసేదీ లేనిదీ ప్రకటించాలని, ఏర్పాటు చేస్తే ఆ యంత్రాంగం విధి విధానాలు ఏమిటో తెలియచేయాలని ఆయన బ్రిటిష్ ప్రభుత్వాన్ని కోరారు. మైనారిటీల భద్రతకోసం రూపొందించిన చర్యలను భవిష్యత్తులో రాజ్యాంగం మెజారిటీ మద్దతుతో మార్చకుండా, తిరగ రాయకుండా నిరోధించేందుకు అనుగుణంగా రాజ్యాంగ రూపకల్పన చెయ్యాలని రాజ్యాంగ పరిషత్‌పై వత్తిడి తెచ్చేది, లేనిదీ వెల్లడించాలని ఆయన బ్రిటిష్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ అనుబంధ సంస్థ ద్వారా అంబేద్కర్ నాయకత్వంలోని బడుగు వర్గాలకు పూర్తిస్థాయి ప్రాతినిధ్యం లభిస్తుందని లార్డ్‌ఫెథిక్ - లారెన్స్ హామీ నిచ్చారు. కాంగ్రెస్ నాయకులను ఆ మిషన్ ఇంటర్వ్యూ చేసింది. బడుగు వర్గాలకు సహాయం చేయాలనే వారి కృతనిశ్చయం వారిలో వ్యక్తమైంది. మైనారిటీలకు సీట్ల పంపిణీతో కమిటీ ఉదారంగా వ్యవహరించగలదని అంబేద్కర్ విశ్వసించారు

అంబేద్కర్‌కు గల ప్రజాదరణ షెడ్యూల్డ్ కులాలకు, అది బొంబాయి ప్రెసిడెన్సీ, కేంద్ర ప్రాంత రాష్ట్రాలకు పరిమితమని మిషన్ సభ్యులు వాదించారు. బెంగాల్ నుండి రాజ్యసభకు తాను ఎన్నికవ్వడం వారి అభిప్రాయం తప్పని నిరూపించిందని అంబేద్కర్ అన్నారు. తమ పార్టీకి అఖిల భారత్ స్థాయి మద్దతు ఉందని ఆయన అన్నారు ప్రభుత్వ యంత్రాంగం కుట్రకు షెడ్యూల్డ్ కులాలు బలయ్యామని అంబేద్కర్ విమర్శించారు.

1946 ఆగస్టులో అంబేద్కర్, వి. శివరాజ్ లండన్‌వెళ్ళి షెడ్యూల్డ్ కులాలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను క్యాబినెట్ మిషన్ ఎలా తుంగలో తొక్కిందీ లార్డ్ అట్లీకి వివరించారు.

## సెక్షన్-2

### భారత రాజ్యాంగం - సమస్యలు

ప్రభుత్వంలోని వివిధ విభాగాల పనితీరును నియంత్రించేందుకు దోహదం చేసే వ్యవస్థే రాజ్యాంగమని అంబేద్కర్ అభిప్రాయపడ్డారు. ఇది ఒక పార్టీకి చెందిన కొంతమంది సభ్యులను అధికారంలో కూర్చోబెట్టే వ్యవస్థగా అంబేద్కర్ వ్యాఖ్యానించారు. ఒక తరహా సమాజంలోని నివసించాలని ప్రజలకు పరిమితులు, కట్టుబాట్లు విధించేదిగా రాజ్యాంగం ఉండరాదు ప్రభుత్వ విధానాలు, సమాజంలో రాజకీయ, ఆర్థిక వ్యవస్థలు, మారుతున్న కాలమాన పరిస్థితులకు అనుగుణంగా కొత్త విధానాలను ప్రజలు అవలంభించడం వంటి మౌలిక అంశాలను అంబేద్కర్ ప్రస్తావించారు. ఈ సమస్యలన్నింటిని ఒక్క రాజ్యాంగానికే పరిమితం చెయ్యకూడదని అన్నారు ఎందుకంటే అది ప్రజాస్వామ్య వ్యవస్థనే కుప్పకూలుస్తుంది అన్నారు. ఒక దేశ సామాజిక వ్యవస్థ ఫలానా విధంగా ఉండాలని నిర్దేశిస్తే వారు ఏ సామాజిక వ్యవస్థలో ఉండగోరుతున్నారో దానిని ఎంపిక చేసుకునే స్వేచ్ఛ వారికి పోతుంది

బొంబాయి నుండి ఓడిపోయినప్పటికీ పశ్చిమబెంగాల్ శాసనసభ్యులు అంబేద్కర్‌ను రాజ్యాంగ పరిషత్‌కు ఎన్నుకున్నారు. ఆయన డ్రాఫ్టింగ్ కమిటీకి ఎన్నికయ్యారు. తరువాత

దాని ఛైర్మన్ అయ్యారు. ఎన్. గోపాలస్వామి అయ్యంగార్, అల్లాడి కృష్ణస్వామి అయ్యర్, కె.ఎం. మున్షి, సర్ మహ్మద్ సాదుల్లా, యన్. మాధవమేనన్, డి.పి. ఖైతాన్ ఇతర సభ్యులు బి.ఎన్. రావు రాజ్యాంగ సలహాదారుగా నియమితులయ్యారు.

రాజ్యాంగ పరిషత్ 1946 డిసెంబర్ 9న తొలిసారిగా సమావేశమైంది. 1947 ఆగస్ట్ 15న ఇది స్వతంత్ర భారత సర్వసత్తాక రాజ్యాంగ పరిషత్ అయింది. 1948 నవంబర్ 4న రాజ్యాంగ తొలి ముసాయిదాను సమర్పించారు. 1949 నవంబర్ 26న తుది రాజ్యాంగాన్ని ఆమోదించారు. మూడేళ్ళ కాలంలో రాజ్యాంగ నిర్మాణ ప్రక్రియ అనేక మలుపులు తిరిగింది. డ్రాఫ్టింగ్ కమిటీ ఛైర్మన్‌గా అంబేద్కర్ దానిని సమర్పించారు. ఆయన ఈ పనిని అత్యంత ఆత్మ స్థైర్యంతో నిర్వహించారు. అందుకు సమైక్యంగా, బలంగా ఉన్న రాజకీయ పార్టీ అండ ఎంతో అవసరం. ఆయన నిర్వహించిన పాత్రకుగాను కాంగ్రెస్‌పార్టీ ఆయనకు ఎంతగానో అండగా నిలిచింది. ఇందుకు అంబేద్కర్ కృతజ్ఞతలు తెలిపారు. రాజ్యాంగ పరిషత్‌లో కాంగ్రెస్ పార్టీ ఎంతో క్రమశిక్షణతో వ్యవహరించింది. రాజ్యాంగపరిషత్‌లో రాజ్యాంగం ఎటువంటి ఇబ్బంది లేకుండా సజావుగా ఆమోదం పొందింది. ఇందుకు కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన పాత్రే కారణమని అంబేద్కర్ ప్రశంసించారు.

అంబేద్కర్ కాంగ్రెస్‌పార్టీని ప్రశంసించడం వెనుక ఒక వ్యూహం ఉంది. సమాజం పట్ల కాంగ్రెస్ పార్టీ అనుసరించే వైఖరికిగాను ఆయన ఆ పార్టీని నిరంతరం ప్రతిఘటిస్తూ ఉండేవారు. రాజ్యాంగ పరిషత్ తొలి సమావేశంలో జవహర్‌లాల్ నెహ్రూ ప్రవేశపెట్టిన లక్ష్యాల తీర్మానాన్ని వ్యతిరేకించిన అతి కొద్దిమందిలో ఆయన ఒకరు. మధ్యేవాదమే రాజకీయంగా వాస్తవ విధానమని అంబేద్కర్ గుర్తించడానికి తదనంతర పరిణామాలు దోహదం చేశాయి. రాజకీయ నిర్ణయాధికారం కొన్ని శక్తులపట్ల మధ్యేవాదంగా వ్యవహరించడమే ఉత్తమమనే విషయాన్ని ఆయన అంగీకరించారు. కాంగ్రెస్‌పార్టీ ఆయన సానుకూల వైఖరికి అనుకూలంగా ప్రతిస్పందించి డ్రాఫ్టింగ్ కమిటీ ఛైర్మన్‌గా ఎన్నుకుంది.

షెడ్యూల్డ్ కులాల ప్రయోజనాలను పరిరక్షించేందుకు అంబేద్కర్ రాజ్యంగా పరిషత్‌లో చేరారు. రాజ్యాంగాన్ని రూపొందించాలనే తపన తనకు లేదని అన్నారు. డ్రాఫ్టింగ్ కమిటీ సభ్యునిగా ఎన్నికకావడం అత్యాశ తరువాత దాని ఛైర్మన్ కావడం ఆయనను ఆశ్చర్యపరిచింది. తమ కాలం ప్రయోజనాలకోసం పోరాడుతూనే స్వాతంత్ర్య పరిరక్షణ విషయంలో బాధ్యతను తానే విస్మరించరాదని అంబేద్కర్ తన సహచరులకు సూచించారు. రాజకీయ పరిస్థితుల్లో కొత్తమార్పులు చోటు చేసుకున్న విషయం స్ఫురణలోకి తీసుకోవాలని ఉద్బోధించారు.

రాజ్యాంగ ముసాయిదా 1935 భారత ప్రభుత్వ చట్టం నకలు మాత్రమేనని రాజ్యాంగపరిషత్‌లో ఆరోపణ వచ్చింది. అందుకు అంబేద్కర్ ఈ విధంగా సమాధానం ఇచ్చారు. "అప్పు తీసుకోవడంలో సిగ్గుపడాల్సిన అవసరం లేదు, "అది గ్రంథచౌర్యం క్రింద రాదు". పూర్తిస్థాయి స్వీయ ప్రభుత్వం కావాలని భారత డిమాండ్, భారత్‌ను తమ చెప్పుచేతల్లో ఉంచుకోవాలనే బ్రిటిష్‌పాలకుల స్థిరనిర్ణయం మధ్య సమన్వయం సాధించడం. భారత్‌లో బ్రిటిష్ ప్రభుత్వ అధికారాలను పునర్విభజన చెయ్యడం 1935లో తమ ముందు ఉన్న ప్రధాన సమస్య అని అంబేద్కర్ వివరించారు. అందుకు అనేక విధాలుగా రాజీపడటం అవసరమైందని

చెప్పారు. 1937లో దానిని అమలుపరిచారు. సువిశాల భారత సామ్రాజ్యాన్ని రాజ్యాంగంగా మలచేందుకు 1947 ఆగస్ట్ 15 –1950 జనవరి 26 మధ్య అవసరమైన మార్పులు ప్రవేశపెట్టారు. అంబేద్కర్ దృష్టిలో రాజ్యాంగపరిషత్ ఏర్పాటు చెయ్యడం అనవసర చర్య. సామ్రాజ్య స్థాయికి అనుకూలంగా లేని సెక్షన్లను భారత ప్రభుత్వం నుండి తొలగిస్తే సరిపోయేది. కుల, మత సమస్యలకు పరిష్కారం కనుగొనడమే రాజ్యాంగపరిషత్ నిర్వహించిన ఏకైక చర్య. మిగిలిన అధికారాలకు సంబంధించి 1935 భారత్ ప్రభుత్వ చట్టంలోని నిబంధనలను వర్తింప చేసుకోవచ్చునని ఆయన సూచించారు.

రాజ్యాంగ నైతికత సహజ సిద్ధమైన భావోద్వేగం కాదని అంబేద్కర్ అభిప్రాయపడ్డారు. దానిని ఒక అలవాటుగా మలచుకోవాలి. అధికార యంత్రాంగం, రాజ్యాంగ విధానాల మధ్య సంబంధం ఉందని ఆయన వివరించారు. రాజ్యాంగ విధానాలను రూపొందించే విషయంలో శాసన వ్యవస్థను పూర్తిగా విశ్వసించలేమని అన్నారు. అధికార యంత్రాంగంలో ఎటువంటి మార్పులు ప్రవేశపెట్టకుండానే, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా రాజ్యాంగాన్ని దారి మళ్ళించే అవకాశం ఉందని హెచ్చరించారు. అందువల్లనే అధికార యంత్రాంగం విధి విధానాలను రాజ్యాంగంలో పొందుపరచడాన్ని ఆయన సమర్థించుకున్నారు.

వయోజన ఓటుహక్కు ప్రాతిపదికగా ఈ రాజ్యాంగ వ్యవస్థను ఎన్నుకోవడం జరగలేదని అనేక మంది విమర్శించారు. అందువల్ల దానిని ప్రజా ప్రాతినిధ్య వ్యవస్థగా పరిగణించలేమని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇందుకు అంబేద్కర్ స్పష్టమైన రీతిలో సమాధానం ఇచ్చారు. ఈ దేశంలో ప్రతి మహిళ, పురుషుడు ప్రాతినిధ్యం వహించనందున అది రాజ్యాంగబద్ధమైన వ్యవస్థ కాదనే విమర్శ సహేతుకమైందే. ప్రస్తుతం చర్చనీయాంశమేమిటంటే "ఈ రాజ్యాంగం ప్రజల ఆకాంక్షలు, అభిలాషకు అనుగుణంగా లేదా? వారి అభిమతాలను గుర్తించలేదా? ఆమోదించడం లేదా? వారి అభిప్రాయాలను ప్రతిబింబించడం లేదా? నేనంటాను ఈ ప్రశ్నలన్నిటికీ సమాధానం "అవునని" అని అంబేద్కర్ అన్నారు.

ఈ సందర్భంగా ఆయన అమెరికా చరిత్రకు సంబంధించిన కొన్ని సంఘటనలను ప్రస్తావించారు. అమెరికా సంయుక్త రాష్ట్రాల రాజ్యాంగం ముందుమాటలో ఈ విధంగా ఉంది. అమెరికా సంయుక్త రాష్ట్రాల ప్రజలైన మనం పవిత్ర ఆదేశాలను పాటిస్తున్నాం. అమెరికా రాజ్యాంగాన్ని రూపొందించుకుంటున్నాం. వాస్తవానికి అమెరికా రాజ్యాంగాన్ని అతి తక్కువ మంది సభ్యులతో కూడిన వ్యవస్థ రూపొందించింది. అమెరికాలో 13 రాష్ట్రాలు మాత్రమే ఉన్నాయి. భారత్ రాజ్యాంగ పరిషత్ విషయాన్ని అంబేద్కర్ ప్రముఖంగా ప్రస్తావించారు. ఆయన ఈ విధంగా అన్నారు.

> "13 రాష్ట్రాల ప్రతినిధులు ఫిలడెల్ఫియాలో సమావేశమై రాజ్యాంగాన్ని ఆమోదించి ఆ పనిని ప్రజల పేరున, వారి అధికారం మేరకు, వారి సార్వభౌమత్వం ప్రాతిపదికగా చేస్తున్నామని ప్రకటించుకోగా 292 మంది సభ్యులుతో కూడిన వ్యవస్థను విశాల ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించేవారు తాము దేశం తరపున ఈ పనిని నిర్వహిస్తున్నామని ప్రకటించుకోలేరా?

భారత సార్వభౌమత్వం బ్రిటన్ సార్వభౌమత్వం నుండి ఆవిర్భవించింది కాదని అంబేద్కర్ అన్నారు. భారత కామన్వెల్త్ దేశాలతో సంబంధ బాంధవ్యాలు పెంపొందించుకోగలదని ప్రకటించడం భారత ప్రజల సార్వభౌమాధికారాన్ని కించపరచడం కాదు అని కొంతమంది సభ్యులు ప్రశ్నించడం ఈ విమర్శకులకు ఆయన ఈ విధంగా సమాధానం చెప్పారు.

"ఒక సర్వసత్తాక దేశం మరో సర్వసత్తాక దేశంతో ఒప్పందం చేసుకోవడమంటే దాని సార్వభౌమత్వాన్ని తగ్గించుకోవడం కాదు కదా! లోక్‌నాథ్ మిశ్రా ఈ విధంగా అన్నారు." ఈ సార్వభౌమత్వమనేది ప్రభుత్వానికి సంబంధించిన అంశం. భారత ప్రభుత్వం, భారత ప్రజల మధ్య విభజన రేఖ నిర్దిష్టంగా ఉండాలన్నదే తన ఆలోచనగా అంబేద్కర్ ఎక్కడో చెప్పడం విన్నాను. అంబేద్కర్ ఈ విధంగా సమాధానం ఇచ్చారు. "అవును నిస్సందేహంగా సార్వభౌమాధికారం ప్రజలకు మాత్రమే ఉంటుంది."

భారత రాజ్యాంగం ముందుమాట గురించి అల్లాడి కృష్ణస్వామి అయ్యర్ ఈ విధంగా అభివర్ణించారు. 1947 జనవరి 22న రాజ్యాంగపరిషత్ ఆమోదించిన లక్ష్యాల తీర్మానం ఆధారంగా ముందుమాటను రూపొందించడం జరిగింది. మన రాజ్యాంగం దేనినుండి అధికారం పొందిందీ దీనిలో వివరించారు. ఏ లక్ష్యాలతో రాజ్యాంగం రూపొందించబడిందో వివరించారు. రాజ్యాంగం ప్రాతిపదికగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు ఏ విలువలు, లక్ష్యాలను పాదుకొల్పాలో ఇది వివరిస్తుంది. ప్రొఫెసర్ బార్కర్ ఈ విధంగా వ్యాఖ్యానించారు. "మనం దేనినైతే పాశ్చాత్య ధోరణి అని పిలుస్తామో, వాస్తవానికి పాశ్చాత్య ధోరణులను మలిచిన రాజకీయ సంప్రదాయ విలువలను పాలుపంచుకుంటూ స్వతంత్ర భారతదేశంలో జీవనం కొనసాగించవలసి వచ్చినందుకు గర్విస్తున్నాను. సార్వభౌమత్వ అధికారం ప్రజలకు చెందుతుందని ముందు మాటలో నేరుగా చెప్పాలనే డిమాండ్ వచ్చింది. అంబేద్కర్ దీనిని వ్యతిరేకించారు. భారత ప్రజలైన మేము అనడంలోనే ఇది నిగూఢమై ఉందని ఆయన అన్నారు.

పౌరసత్వానికి సంబంధించిన రాజ్యాంగ నిబంధనల్లో అత్యంత ముఖ్యమైంది దేశం మొత్తానికి ఒకే రకమైన ఉమ్మడి పౌరసత్వ విధానం అమలులో ఉండటం. కొన్ని ఫెడరల్ దేశాల్లో నెలకొని ఉన్న ద్వంద్వ పౌరసత్వ విధానానికి ఇది పూర్తిగా భిన్నమైంది. అంబేద్కర్ ఈ విధంగా అన్నారు.

> "అన్ని సర్వసత్తాక దేశాల్లో ప్రజలను మూడు రకాలుగా వర్గీకరిస్తారు. పౌరులు, విదేశీయులు, ఒక ప్రత్యేక దేశంలో నివసించే వారు అంటే భారతదేశంలో నివాసముంటే ఈ స్వీయపాలనా దేశాల ప్రజలు విదేశీయులుగా పరిగణించబడరు. విదేశీయులకు లేని కొన్ని హక్కులు వారికి ఉంటాయి. అయితే వారికి పూర్తి పౌరసత్వ హక్కులు ఉండవు. మనదేశ ప్రజలకు లభించే హక్కులు వారికి ఉండవు."

ఆధునిక రాజ్యాంగ విధానంలో ఫెడరలిజం అత్యంత ముఖ్యమైన విషయం. ఫెడరలిజం ముఖ్య ధ్యేయం భిన్నత్వంలో ఏకత్వం. అధికారాల విభజన, పరిపాలన వికేంద్రీకరణ. అది భారతదేశ రాజ్యాంగ ప్రభుత్వం ముఖ్య పునాది.

రాజ్యాంగం ఫెడరల్ తరహాలో ఉందని రాజ్యాంగ ముసాయిదాను రాజ్యాంగ పరిషత్‌లో ప్రవేశపెడుతూ అంబేద్కర్ అన్నారు. కేంద్రం, రాష్ట్రాల్లో ద్వంద్వ విధానం అమలులో ఉంటుంది. తమకు కేటాయించిన విభాగాల్లో వాటికి సంపూర్ణ హక్కులు ఉంటాయి. కేంద్రం అంటే రాష్ట్రాల కూటమి కాదు. సన్నని బంధంతో కలిపి ఉన్నది కాదు. రాష్ట్రాలు కేంద్రం నుండి అధికారాలు పొందే ఏజెన్సీలు కాదు. కేంద్రం, రాష్ట్రాలు – రెండూ రాజ్యంగం సృష్టించినవే. రెండు వాటి వాటి అధికారాలను రాజ్యాంగం నుండి పొందినవే. ఒకటి మరోదానికి దిగువ స్థాయిలోనికి కాదు. ఒకదానినొకటి సమన్వయంతో వ్యవహరించాల్సినవే.

అంబేద్కర్ ఫెడరలిజంకు వ్యతిరేకి కాదు. కేంద్రం రాజ్యాంగ విభాగాల హక్కులపై దాడి చెయ్యరాదనేది ఆయన ప్రధాన భావన. అమెరికన్ ఫెడరల్ రాష్ట్ర ప్రభుత్వాల రాజ్యాంగాల మధ్య సంబంధం అంత పటిష్టంగా ఉండదు. భారతదేశంలో రాష్ట్రాలకు తన సొంత రాజ్యాంగాన్ని ఏర్పాటు చేసుకునే హక్కు ఉండదు. కేంద్రం, రాష్ట్రాల మధ్య పాలన, కార్యనిర్వాహక అధికారాలకు సంబంధించి స్పష్టమైన విభజన ఉండటం భారతదేశ ఫెడరలిజంలో ముఖ్య విశేషం. భారత ఫెడరేషన్ రాష్ట్రాల కూటమి కాదు. అలాగే రాష్ట్రాల కేంద్ర ప్రభుత్వ పాలన విభాగాలు కాదు. ఫెడరలిజంపై అంబేద్కర్ ఆలోచనలో అభిప్రాయాలు మానవ వ్యవహారాల పరిష్కారంలో ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నాయి. అంబేద్కర్ దృష్టిలో ఫెడరలిజం అంటే సాధారణ సమయాల్లో దేశం ఫెడరేషన్‌గానూ, అత్యవసర సమయాల్లో కలిసికట్టుగా వ్యవహరించే సమైక్య శక్తి, ఆయన ప్రయోగించిన "ఇండియన్ యూనియన్"అనే పదాలు రెండు అంశాలను సూచించాయి. భారత్ ఫెడరేషన్ దానిలోని అంతర్భాగాల మధ్య కుదిరిన ఒప్పందం కారణంగా ఏర్పడిన వ్యవస్థ కాదు. అలాగే సామరస్యం ఉన్న దేశాలకు అందులో నుండి విడిపోయే స్వేచ్ఛా లేదు. ప్రొఫెసర్ ఎం.వెంకట రంగయన్, కె.సి. వీర్, పాట్రిక్ బేనయ్, సి.హెచ్.మూర్, ఎ.వి. డైసొసీలత్ ఆయన విభేదించారు. వారి దృష్టిలో ఫెడరలిజం అంటే ఒక కాంట్రాక్టు ఫెడరలిజం ఒక కాంట్రాక్టు అయినందున అందులోని పార్టీలన్నీ స్వయం ప్రతిపత్తి కలిగియుంటాయి. ఫెడరేషన్ అంటే కొన్ని విభాగాల సమాఖ్య కాదని అంబేద్కర్ అన్నారు. రాజకీయ తీవ్రవాదానికి అది స్వస్తి చెప్పింది. ఆ విధంగా భావోద్వేగ పూరిత సమగ్రత, జాతీయ సమైక్యతలకు అది మార్గం సుగమం చేసింది.

ఫెడరల్ వ్యవస్థలన్నీ ఫెడరలిజం సూత్రాలకు సంపూర్ణంగా కట్టుబడి ఉంటాయని అంబేద్కర్ అన్నారు. ఫెడరలిజం తన ఆకారాన్ని, లక్షణాన్ని మార్చుకోలేదు. అన్ని ఎన్నడూ ఒక్కటిగా వ్యవహరించలేదు. అయితే భారతదేశ రాజ్యాంగం ఒకవైపు ఏకీకృత శక్తిగా వ్యవహరిస్తే మరోవైపు ఫెడరల్ తరహాలోనూ వ్యవహరించగలదు. అది కాలానుగుణంగా, సందర్భానుసారంగా వ్యవహరించగలరు. సాధారణ సమయాల్లో అది ఫెడరల్ వ్యవస్థ మాదిరిగా వ్యవహరిస్తుంది. అత్యవసర సమయంలో అది ఏకీకృత వ్యవస్థ మాదిరిగా వ్యవహరించగలదు. 257వ

నియమావళి ప్రకారం ఫెడరల్ వ్యవస్థను యూనిటరీ వ్యవస్థగా మార్చే అధికారం రాష్ట్రపతికి ఉంది. ఏ ఇతర ఫెడరల్ వ్యవస్థలోనూ ఇటువంటి ఏర్పాటు లేదు.

ఫెడరల్ వ్యవస్థలో రెండు బలహీనతలను అంబేద్కర్ ప్రస్తావించారు. అవి కఠినత్వం,న్యాయబద్ధతలో మితిమీరిన వైఖరి ఫెడరల్ రాజ్యాంగంలో స్పష్టంగా గోచరిస్తాయని అన్నారు. అమెరికా రాజ్యాంగాన్ని ఇందుకు ఉదాహరణగా చెప్పారు. ఆస్ట్రేలియా రాజ్యాంగంలో మాదిరిగా మన రాజ్యాంగంలో అనేక అంశాలు ఉమ్మడి జాబితాలో ఉన్నాయి. ఆస్ట్రేలియా రాజ్యాంగంలో 34 అంశాలుండగా మన రాజ్యాంగంలో కూడా 37 అంశాలు ఉమ్మడి జాబితాలో ఉన్నాయి. పార్లమెంటుకు చట్టబద్ధమైన అధికారాలు ఎక్కువగా ఉండటం భారత రాజ్యాంగంలోని విశిష్ట లక్షణం. రాజ్యాంగంలో పైన ఉదహరించిన రెండు బలహీనతలను అధిగమించేందుకు అంబేద్కర్ రెండు మార్గాలు సూచించారు. 256, 257 వ అధికారణాలను అమలు చేయడం, రాజ్యాంగాన్ని సవరించడం, మార్పులకు అనుగుణంగా ఉండటం భారత రాజ్యాంగం విశిష్ట లక్షణాలు. అమెరికాలో ఫెడరల్ జ్యుడీషియరీ, రాష్ట్ర జ్యుడీషియరీ విడివిడిగా. ఒకదానొకటి స్వతంత్రమైనవి. భారత ఫెడరేషన్ ద్వంద్వ రాజకీయ ప్రవృత్తి కలిగి ఉన్నప్పటికీ ద్వంద్వ న్యాయ వ్యవస్థ లేదు. భారత న్యాయ వ్యవస్థకు, కెనడా న్యాయ వ్యవస్థకు మధ్య సన్నిహిత సారూప్యం ఉంది.

ఫెడరేషన్, యూనియన్ మధ్య తేడా ఉందని అంబేద్కర్ పేర్కొన్నారు. భారత ఫెడరేషన్ కానున్నప్పటికీ ఫెడరేషన్‌లో చేరేందుకు రాష్ట్రాలు అంగీకరించిన ఫలితంగా ఫెడరేషన్ ఏర్పడలేదు. ఫెడరేషన్ నుండి విడివడేందుకు ఏ రాష్ట్రానికీ అధికారం లేదు. ఫెడరేషన్ అనేది విధానం చేయడానికి వీలులేని యూనియన్. 1935 భారత ప్రభుత్వ చట్టం నిర్దేశించిన దానికంటే ఎక్కువ పటిష్టంగా ఉండాల్సిన అవసరం ఉందని అంబేద్కర్ అన్నారు.

భారత రాజ్యాంగంలో కేంద్రానికి అధికంగా అధికారాలు కల్పించి దానిని అవసరమైన దానికంటే పటిష్టంగా రూపొందించారని విమర్శలు చెలరేగాయి. అధికారాలను కేంద్రం వద్ద కేంద్రీకరించడం, రాష్ట్రాలను మున్సిపాలిటీల స్థాయికి దిగజార్చాలనే విమర్శలు అవగాహన రాహిత్యం వల్లనేనని అంబేద్కర్ వ్యాఖ్యానించారు. శాసన, కార్యనిర్వాహక అధికారాలు, కేంద్రం, రాష్ట్రాల మధ్య అధికారాల విభజన ఫెడరల్ వ్యవస్థ మౌలిక సిద్ధాంతం.

బలమైన కేంద్రం ఉండాలన్న సిద్ధాంతాన్ని అంబేద్కర్ బలపరిచారు. అసలు కేంద్రం పటిష్టంగా ఉండకుండా నివారించడం కూడా అసాధ్యమని అన్నారు. అధికారాల కేంద్రీకరణ ప్రస్తుత ప్రపంచంలో నెలకొని ఉన్న పరిస్థితుల దృష్ట్యా అనివార్యమని ఆయన అభిప్రాయపడ్డారు. అమెరికాలో ఫెడరల్ ప్రభుత్వానికి చాలా పరిమితమైన అధికారాలు మాత్రమే కల్పించినప్పటికే ఫెడరల్ ప్రభుత్వం బలం పుంజుకుని రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలను అధిగమించి హరించివేసిందని అంబేద్కర్ అన్నారు. రాష్ట్రాలపై అధికారం చెలాయించేందుకే కేంద్రానికి ఎక్కువ అధికారాలు కల్పించినట్లు అంగీకరించారు. అయితే దీనిని సమర్థించుకునేందుకు ఆయన ప్రయత్నించారు. అజమాయిషీ అధికారాలు రాజ్యాంగంలో సాధారణ లక్షణం కాదని అన్నారు. వాటి వినియోగం, అమలు అత్యవసర పరిస్థితులకే పరిమితమని అన్నారు. అత్యవసర పరిస్థితి సమయం ప్రజల రాష్ట్రాలకు కాకుండా కేంద్రానికి విధేయులుగా ఉండాలని సూచించారు.

కేంద్రం మాత్రమే ఉమ్మడి లక్ష్యం, మొత్తం దేశ ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరించగలుగుతుంది. కేంద్రానికి మితిమీరిన అధికారాలు కల్పించినట్లు వచ్చిన విమర్శల గురించి అంబేద్కర్ ప్రస్తావిస్తూ భారత రాజ్యాంగం కేంద్రానికి బాధ్యతలు, అధికారాలు కల్పించడం జరిగింది. ఇతర ఫెడరల్ రాజ్యాంగాల్లో కంటే భారత రాజ్యాంగంలో పరిస్థితి భిన్నంగా ఉంటుంది. డైసీ ఇచ్చిన సలహాలతో నిర్దిష్ట అభిప్రాయాలు ఏర్పరచుకున్న విద్యార్థులు అధికారాల కేంద్రీకరణవల్ల సహజంగానే ఆందోళన చెందారు. కేంద్రానికి అధికమైన అధికారాలు కేటాయించడం వల్ల ఫెడరల్ వ్యవస్థ విచ్ఛిన్నం కాదని అంబేద్కర్ అన్నారు.

ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ప్రాథమికహక్కులు ప్రత్యేక ప్రాధాన్యత సంతరించు కుంటాయి. ప్రజాస్వామ్య వ్యవస్థ విజయం పౌరులు ఏ మేరకు హక్కులు అనుభవిస్తున్నారనే విషయంపై ఆధారపడి ఉంటుంది. రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులను పొందుపరిచారు. అధికారులు వాటిని ఉల్లంఘించబోరని హామీ ఇవ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది.

పరిపూర్ణహక్కులు కానంత వరకు ప్రాథమిక హక్కులు ప్రాథమికమైనవి కావని వీటిపై జరిగిన చర్చలో విమర్శకులు పేర్కొన్నారు. అమెరికా హక్కులు బిల్లు కల్పించిన ప్రాథమిక హక్కులు నిజమైనవి. వాటికి ఎటువంటి పరిమితులు, మినహాయింపులు లేకపోవడమే ఇందుకు కారణం. ఇందుకు అంబేద్కర్ ఈ విధంగా వ్యాఖ్యానించారు. "ప్రాథమిక హక్కులు మాత్రమే పరిపూర్ణమైనవని, ప్రాథమిక హక్కులు కానివి పరిపూర్ణమైనవి కావని భావించడం సరికాదు. ప్రాథమికేతర హక్కులు రెండు పార్టీల మధ్య ఒక ఒప్పందం ప్రకారం సృష్టింపబడినవి. ప్రాథమిక హక్కులు చట్టం కానుకగా ఇచ్చినవి. ఇదే ఈ రెండింటికి మధ్య ఉన్న తేడా.

అమెరికా రాజ్యాంగం మాదిరిగా కాకుండా భారత రాజ్యాంగ పరిషత్ రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులపైన వివరమైన నిబంధనలు రూపొందించింది. భారతదేశంలో ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితులు విచిత్రంగా ఉంటాయి. ఈ సందర్భంగా ఆయన అస్పృశ్యత అంటరానితనం, వెనుకబాటుతనం, మతం, కులం, తెగ ప్రాతిపదికగా విపక్షత పాటించడం నిర్మూలనకు సంబంధించిన నిబంధనలను ప్రస్తావించారు. రాజ్యాంగ పరిషత్ బ్రిటిష్ తరహా శాసనసభ ఆధిపత్యం గురించి ప్రత్యేకంగా విశ్లేషించి ఒక సిద్ధాంతాన్ని సూత్రీకరించారు. ప్రాథమిక హక్కులు లక్ష్యాలు రెండు విధాలుగా ఉంటాయని పేర్కొన్నారు. ప్రతి వ్యక్తీ ఆ హక్కులను పొందే స్థితిలో ఉండాలి. అవి చట్టం సృష్టించిన వ్యక్తులందరికీ వర్తించే విధంగా ఉండాలి. చట్టం లేక హక్కు నిబంధనలు రూపొందించే హక్కు గల అధికారులు వీటిని పాటించాలి, అన్ని హక్కుల్లో పౌరులందరికి సమాన హక్కులు కల్పించడం అత్యంత ముఖ్యమైనదని అంబేద్కర్ వ్యాఖ్యానించారు.

తొలి నియామవళికి కె.టి.షా ఒక సవరణ ప్రవేశపెట్టారు. "భారత లౌకికవాద, ఫెడరల్, సోషలిస్టువాద రాష్ట్రాల సమ్మేళనం" అని పేర్కొంది. అంబేద్కర్ ఈ సవరణను వ్యతిరేకించారు. ప్రజలు ఈ విధంగానే నివశించాలని రాజ్యాంగం ప్రజలను కట్టిపడవేయ కూడదని ఆయన అన్నారు. అవి రాష్ట్రంలో వివిధ విభాగాల పని తీరును నియంత్రించే అధికార యంత్రాంగాలే.

రాజ్యాంగంలో దానిని నిర్దేశించే అవకాశం లేదు. ఎందువల్లనంటే అది మొత్తం ప్రజాస్వామ్యాన్నే విచ్ఛిన్నం చేస్తోంది. అంబేద్కర్ ఈ విధంగా వ్యాఖ్యానించారు. "ప్రభుత్వ సామాజిక వ్యవస్థ ఫలానా విధంగా ఉండాలని మీరు నిర్దేశిస్తే ఏ సామాజిక వ్యవస్థలో నివసించ గోరుతున్నారో దానిపై నిర్ణయం తీసుకునే హక్కును కాలరాయడమే. సవరణ అర్థరహితమని వ్యాఖ్యానించారు. శాసన వ్యవస్థ, అధికార యంత్రాంగాలకు రాజ్యాంగం స్పష్టమైన బాధ్యతలను కల్పించింది. అంబేద్కర్ ఈ విధంగా వ్యాఖ్యానించారు." నేను దృష్టి సారించిన నిర్దేశిత సిద్ధాంతాలు దిశ, పరిమాణాల్లో సోషలిస్ట్ తరహాలో లేకపోతే సోషలిజం అంటే ఇంకా మరేమిటో నాకు అర్థం కావడం లేదు. సోషలిస్ట్ సిద్ధాంతాలు మన రాజ్యాంగంలోనే పొందుపరచబడి ఉన్నాయి.

పత్రికా రంగానికి ప్రత్యేక హక్కుల ఉండాల్సిన అవసరం లేదని అంబేద్కర్ అన్నారు. వ్యక్తిగతహోదాలో పౌరులు పొందలేని హక్కులను పత్రికారంగంలో వారికి కల్పించలేమని పేర్కొన్నారు. పత్రికా స్వేచ్ఛ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించాల్సిన పనిలేదని అన్నారు. ఆయుధాలు చేతబూనడం హక్కు కాదని, అది బాధ్యతని వ్యాఖ్యానించారు. అత్యవసర పరిస్థితి సమయంలో ఆయుధాలు చేత ధరించే హక్కులను అంగీకరించే పక్షంలో సైనిక సర్వీసును అమలు చేయాలని సూచించారు.

మన సమాజంలో మతానికి విస్తృత పరిధి కల్పించబడింది. ఇది మొత్తం జీవితానికి విస్తరిస్తుంది. శాసన వ్యవస్థ దీని జోలికి పోరాదు. కౌలుదారీ చట్టం, వారసత్వ చట్టం వంటి చట్టాలను మతం శాసించకూడదని అన్నారు. అసమానత్వాలు, వివక్షత, ఇతర ప్రాథమిక లోపాలకు ఆలవాలమైన మన సామాజిక వ్యవస్థను సంస్కరించే బాధ్యత మనందరికే ఉంది. ఈ అసమానతలు ప్రాథమిక హక్కులతో ఘర్షణకు పాల్పడతాయని అంబేద్కర్ అన్నారు.

పన్నుల ద్వారా వసూలైన ప్రభుత్వ నిధులను ఒక ప్రత్యేక వర్గం ప్రయోజనాల కోసం వినియోగించరాదనే సిద్ధాంతాన్ని మనమందరం అంగీకరించామని అంబేద్కర్ అన్నారు. మత బోధలకు, ప్రసార సభలకు ప్రభుత్వ నిధులు వెచ్చించరాదు. మత ప్రచార సభను ప్రభుత్వం నిర్వహించిందా, ఇతర వేరే ఎవరైనా నిర్వహించారా అనేది ఇక్కడ అప్రస్తుతం, ఈ దేశంలో మతాలు పరస్పర సంబంధాల రీత్యా సామాజిక రహితమైనవి మాత్రమే కాకుండా సామాజిక వ్యతిరేకమైనవని అంబేద్కర్ వ్యాఖ్యానించారు. మత ప్రచారానికి స్వేచ్ఛ కల్పించారు. ప్రతి వర్గం లేదా మతం తన మౌలిక సిద్ధాంతాలు, లక్ష్యాలు ప్రాతిపదికగా ప్రచారాన్ని నిర్వహించి చూసిన స్వేచ్ఛ కల్పించారు. మతప్రచారం, పరిశోధన, అధ్యయనం మధ్య తేడా ఉందని అంబేద్కర్ అన్నారు. సిద్ధాంతం, పరిశోధన మధ్య ఎంత వ్యత్యాసం ఎందో ఈరెండింటి మధ్య కూడా అంత వ్యత్యాసం ఉందని అన్నారు.

ప్రాథమిక హక్కుల్లో మార్పులు చేసే అధికారం పార్లమెంటుకు మాత్రమే ఉండాలని ప్రొఫెసర్ సక్సేనా సూచించారు. ప్రభుత్వానికి ఇందులో సంబంధం ఉండకూడదని అన్నారు. దానికి అంబేద్కర్ ఈ విధంగా ప్రతిస్పందించారు. "సాధారణ పరిస్థితుల్లో ప్రాథమిక హక్కులపై ప్రభావం చూపే చట్టాలు చేసే అధికారం పార్లమెంటు, ప్రభుత్వానికి ఉంది. ఈ సాదారణ హక్కును అత్యవసర స్థితి సమయంలో ప్రభుత్వానికి తొలగించడానికి హేతువు ఏమీలేదు."

అంబేద్కర్ సూటిగా ఒక ప్రశ్నను అడిగారు. "హక్కులను సస్పెండ్ చేసే అధికారం రాష్ట్రపతికి కల్పించాలా? లేక పార్లమెంటు దానిని నిర్ణయించాలా? ఇంగ్లండ్‌లో హెబియస్ కార్పస్‌ను తాత్కాలికంగా నిలువరించే హక్కు ప్రభుత్వానికి లేదు. అమెరికాలో కాంగ్రెస్‌కు ఈ అధికారం ఉంది. హెబియస్ కార్పస్ పిటిషన్‌ను సస్పెండ్ చేసే అదనపు అధికారం అధ్యక్షునికి ఉంటుంది. భారతదేశం అమెరికా పద్ధతినే అనుసరించిందని అంబేద్కర్ అన్నారు. భారత రాజ్యాంగం అదనపు భద్రత సమకూర్చి పెట్టింది. భారత రాష్ట్రపతి ప్రభుత్వ సలహా మేరకు నడచుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వం పార్లమెంటు అధికారాలకు లోబడి వ్యవహరించాల్సి ఉంటుంది.

రాజ్యాంగపరమైన పరిష్కారాలకు రాజ్యాంగం హామీ ఇచ్చింది. ఇవి ప్రాథమిక హక్కులకు సంబంధించిన అధ్యయంలో వివిధ నిబంధనలకు అనుగుణంగా ఉంటాయి. అంబేద్కర్ ఈ నిబంధనలను సమర్థించారు. ప్రాథమిక హక్కులకు సంబంధించి బ్రిటిష్ విధానాన్ని మా దేశంలో అనుసరించడం ఉత్తమమని అభిప్రాయపడ్డారు. రాజ్యాంగం పరిష్కారం నిర్దేశించని పక్షంలో హక్కు అనేది లేదని బ్రిటిష్ విధానం స్పష్టం చేస్తుంది. రాజ్యాంగ పరిష్కారాలకు సంబంధించిన నియమావళి రాజ్యాంగానికి హృదయం వంటిదని అంబేద్కర్ వ్యాఖ్యానించారు. రాజ్యాంగం ఈ హక్కును మాత్రం సుప్రీం కోర్టుకు కల్పించింది. రాజ్యాంగ సవరణ ద్వారా మాత్రమే ఈ హక్కును తీసివేయవచ్చు. ఈ అధికారం చట్ట సభలకు ఉంటుంది. వ్యక్తి భద్రతకు రాజ్యాంగం కల్పించిన అనేక భద్రతా చర్యల్లో ఇది ఒకటి.

రాజ్యాంగ పరిష్కారాలకు సంబంధించిన హక్కును సస్పెండ్ చేయడానికి అవకాశం కల్పించే నిబంధనను రాజ్యాంగ పరిషత్‌లోని కొంతమంది సభ్యులు వ్యతిరేకించారు. అప్రజాస్వామికంగా కనిపించే ఈ నిబంధన రాజ్యాంగంలో కల్పించడాన్ని అంబేద్కర్ గట్టిగా సమర్థించుకున్నారు. ఆయన ఈ విధంగా అన్నారు.

> "రాజ్యాంగం కొన్ని ప్రాథమిక హక్కులను ప్రజలకు కల్పించాలనే విషయంలో ఎటువంటి సందేహం లేదు. తన వ్యక్తిత్వాన్ని ఇనుమడింపచేసుకునేందుకు వారికి కొంత భద్రత, స్వేచ్ఛ ఉండాలి. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో ఈ హక్కులకు కొంత పరిమితి విధించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఉదాహరణకు ప్రభుత్వ మనుగడ ప్రమాదంలో పడ్డ సందర్భంలో హక్కులపై పరిమితి విధించడం జరుగుతుంది."

22వ నియమావళి మూడు రకాల హక్కులకు హామీ ఇచ్చింది. తమను ఎందుకు అరెస్టు చేస్తున్నారో తెలుసుకునే హక్కు అరెస్టయిన వారికి ఉంటుంది. న్యాయ వాదిని సంప్రదించి తనను తాను డిఫెండ్ చేసుకునే హక్కు అరెస్టయిన వారికి ఉంది. అరెస్టు అయి పోలీసుల కస్టడీలో ఉన్న ప్రతి వ్యక్తిని 24 గంటల్లోపు మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచాల్సి ఉంది. ఆ మేజిస్ట్రేట్ అనుమతితోనే కస్టడీలో కొనసాగించే అవకాశం ఉంది. ఈ హక్కులన్నిటికీ ఎటువంటి షరతులు, మినహాయింపులు లేవు, పరిపూర్ణమైనవి.

సాధారణ సమయాల్లో ఈ విధంగా విచారణ లేకుండా నిర్బంధించే అవకాశం కల్పించే నిబంధన ప్రపంచంలో మరెక్కడైన ఉందా అని బక్షిటేక్‌చంద్ ప్రశ్నించారు? రాజ్యాంగం

కల్పించిన ప్రత్యేక భద్రత చర్యలను అంబేద్కర్ తన సమాధానంలో వివరించారు. ఈ ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం క్రింద అరెస్ట్ అయి పోలీసుల నిర్బంధంలో ఉన్న వ్యక్తి భద్రతకు సైతం పాటించాల్సిన నిబంధనలను రాజ్యాంగంలో పొందుపరిచినట్లు ఆయన వివరించారు. రాజ్యాంగ పద్ధతులను పాటించినట్లయితే ప్రివెంటివ్ డిటెన్షన్ అవసరం ఉండదని అన్నారు. అధికారాన్ని చేజిక్కించు కోవాలని ఆరాటపడే ఇతర పార్టీల సంబంధించిన వారు రాజ్యాంగ విరుద్ధమైన పనులకు పాల్పడితే ప్రభుత్వం వారిని నిర్బంధించే అధికారం కలిగి ఉంది. ఇటువంటి సందర్భాల్లో న్యాయపరమైన చర్యలన్నింటిని పాటించడం సాధ్యం కాదు. ప్రివెంటివ్ డిటెన్షన్, ఇతర నిబంధనలు సంఘ వ్యతిరేక శక్తుల వారి కోసం ఉద్దేశింపబడ్డాయి. ప్రభుత్వ ప్రయోజనాలు కంటే ప్రజల స్వేచ్ఛకే ఎక్కువ ప్రాధాన్యతనివ్వాల్సి ఉంటుందని అంబేద్కర్ అన్నారు.

ప్రాథమిక హక్కుల గురించి వివరించే 18వ నియమావళిలో 'మైనారిటీ' అనేపదం ప్రయోగింపబడింది. ఇది కేవలం సాంకేతిక పరంగా వాడటం జరగలేదు. వారికి కొన్ని రాజకీయపరమైన భద్రత కల్పించేందుకు ఈ పదాన్ని వాడారు. ఇక్కడ మైనారిటీ అనే పదం సాంకేతికపరంగా కాకుండా సాంస్కృతిక, భాషాపరంగా ఉపయోగించడం జరిగింది.

మైనారిటీలకు సంబంధించిన నియమావళి (29, 30) వారికి సంస్కృతి, భాష, లిపికి సంబంధించిన వ్యవహారాల్లో రక్షణ కల్పించడానికి ఉద్దేశింపబడ్డాయి. సాంకేతిక పరంగా మాత్రమే కాకుండా విస్తృత అర్థంలో దీనిని ఉపయోగించడమైంది. మెజారిటీ చట్టాన్ని మైనారిటీలు వినమ్రంగా ఆమోదించారు. ఇక్కడ మెజారిటీ అంటే రాజకీయ మెజారిటీ కాదు, మౌలికంగా మతపరమైన మెజారిటీ, ప్రభుత్వోద్యోగాలు, పదవుల్లో తమకు రిజర్వేషన్లు కేటాయించాలని అంబేద్కర్ ప్రముఖంగా ప్రస్తావించారు. షెడ్యూల్డ్ కులాలు, తెగలు వారు మాత్రమే మైనారిటీలుగా పరిగణింపబడతారని పోలీసులు పేర్కొన్నారు. రాజ్యాంగంలో వ్యక్తులు, పార్టీలకు ఎటువంటి అధిక్యత కల్పింపబడలేదు.

షెడ్యూల్డ్ కులాల ప్రజలు సామాజికపరంగా అస్పృశ్యులు, అంబేద్కర్‌కు ఇతర విషయాల కంటే ఈ అంశమే ఎక్కువ ఆందోళన కలిగిస్తుంది. ఇందుకు ఆర్థిక పరిష్కారం కనుగొనాల్సిన అవసరం ఉందని చెప్పేందుకు ఆయనకు ఆత్మగౌరవం అడ్డువచ్చింది. ఆర్థికంగా, రాజకీయంగా సమానత్వం సాధించి విద్యాపరంగా అభివృద్ధి చెందితే ప్రతి సమస్య పరిష్కారం అవుతుంది. అంబేద్కర్ దృష్టిలో ప్రాథమిక హక్కులంటే సమానత్వం సాధించడం మాత్రమే. "మనకు ఈ స్వేచ్ఛ ఎందుకు?" అని ఆయన తనను తాను ప్రశ్నించుకున్నారు. అసమానతలకు, వివక్షతకు, ప్రాథమిక హక్కులకు భంగం కలిగించే ఇతర సమస్యలకు ఆలవాలమైన సామాజిక వ్యవస్థను సంస్కరించేందుకు మనకు ఈ స్వేచ్ఛ కల్పించబడింది అని ఆయన సమాధానం చెప్పుకున్నారు. రాజకీయరంగంలో షెడ్యూల్డ్ కులాలు, తెగలకు చెందిన వారి ఆధిక్యత పెంపొందించేందుకు వయోజన ఓటు హక్కుపై ఆయన ఆధారపడ్డారు. సంఖ్యాపరంగా కీలక స్థాయిలో ఉన్న షెడ్యూల్డ్ కులాలు తెగలకు చెందిన వారికి వయోజన ఓటుహక్కు ప్రాధాన్యత తెలుసు. అది ఎంత పెద్ద మార్పులు తీసుకురానున్నదనే విషయం కూడా వారికి తెలుసు. చెల్లాచెదురుగా అనైక్యతతో ఉండటం వల్ల షెడ్యూల్డ్ కులాల వారికి ఆస్తులు కూడా తక్కువగా ఉన్నాయి. రిజర్వేషన్ సదుపాయం లేకుండా చట్ట సభల్లో తగిన ప్రాతినిధ్యం పొందే అవకాశం లేదు. సీట్ల రిజర్వేషన్ సదుపాయం 10 ఏళ్ళ తరువాత అంతమవుతుంది. ఇందుకు సంబంధించి

ఏ మార్పు చేసినా రాజ్యాంగాన్ని సవరించడం అవసరం. రిజర్వేషన్లు మరింత ఎక్కువ కాలం కొనసాగాలన్నది ఆయన వ్యక్తిగత అభిప్రాయం. దీనిని డిమాండ్ చేయడానికి ఆయన సంసిద్ధత వ్యక్తం చేశారు. ముస్లింలు, క్రైస్తవులు ఎంతో ముందుగానే రిజర్వేషన్ సదుపాయం పొందారు. షెడ్యూల్డ్ కులాలవారు 1935లో రాజ్యాంగంలో పొందారు. రిజర్వేషన్లు 1937లో ప్రారంభమయ్యాయి. 10 ఏళ్ల పాటు మాత్రమే అమలులో ఉన్నాయి. 1935లో చట్టాన్ని సస్పెండ్ చేయడంతో షెడ్యూల్డ్ కులాలు వారు తాము అప్పటివరకు పొందుతున్న సదుపాయాలు కోల్పోయారు. షెడ్యూల్డ్ కులాల వారికి మరింత ఎక్కువ కాలం రిజర్వేషన్లు కల్పించడం సమంజసంగా ఉంటుందని ఆయన అన్నారు.

రాజ్యాంగంలో 36 నుండి 51 వరకు గల 16 నియమావళులు ఆదేశిక సూత్రం గురించి ప్రస్తావించాయి. ఆర్థిక, సామాజిక, న్యాయం, విద్య. అంతర్జాతీయ సమస్యలకు సంబంధించి విస్తృత ప్రభుత్వ కార్యకలాపాలపై ఈ ఆదేశిక సూత్రాలు చర్చించాయి, తన పౌరుల పట్ల ప్రభుత్వం వ్యవహరించాల్సిన తీరుతెన్నులను ఇవి స్పష్టం చేశాయి. ప్రభుత్వ విధానాలకు సంబంధించి ఆదేశిక సూత్రాలు ప్రత్యేకత సంతరించుకున్నాయి. భారత రాజ్యాంగంలో స్థానం కల్పించే ముందు ఒక్క ఐర్లాండ్ రాజ్యాంగం మాత్రమే దానికి సంబంధించిన అంశాలను పొందుపరచుకుంది. ఆదేశిక సూత్రాలు భారత రాజ్యాంగంలోని ఒక వివాదాస్పద అంశంగా పరిణమించాయి. ప్రాథమిక హక్కులకు విభిన్న రీతిలో ఉండటంతో ఇది వివాదాస్పదంగా మారాయి. అయితే ఇవి రాజ్యాంగంలో ముఖ్యమైన అంశంగా మారాయి. ఇవి నిర్మాణాత్మక లక్ష్య సాధనకు దోహదం చేసే డైనమిక్ ఆలోచన విధానాలకు ప్రతిరూపాలని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వ్యాఖ్యానించారు.

దేశంలో రాజకీయ ప్రజాస్వామ్యంతో పాటు సామాజిక, ఆర్థిక ప్రజాస్వామ్యం నెలకొల్పేందుకు ఈ ఆదేశిక సూత్రాలు ఉద్దేశింపబడ్డాయి. లిఖిత పూర్వక రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులకు స్థానం కల్పించడంలో ఇది సాధ్యమైంది. 'ఆదేశిక' అనే పదం హెడ్డింగ్‌లో కొనసాగించాలని అంబేద్కర్ సూచించారు. భవిష్యత్తులో శాసనవ్యవస్థకు, ప్రభుత్వాలకు వాటి అధికార నిర్వహణకు సంబంధించి కొన్ని ఆదేశాలు జారీ చేయటం రాజ్యాంగ పరిషత్తు ఉద్దేశం కావడమే ఇందుకు కారణమని అంబేద్కర్ అన్నారు. ప్రతిపాదిత రాజ్యాంగం అధికారం కైవసం చేసుకునేందుకు ఉద్దేశించిన యంత్రాంగం కాదని ఆయన వ్యాఖ్యానించారు. ప్రతిపాదిత రాజ్యాంగం రాజకీయ ప్రజాస్వామ్యం నెలకొల్పడంతో పాటు ప్రభుత్వాలు ఏర్పాటు చేసే వారికి కొన్ని మార్గదర్శకాలను నిర్దేశించింది. ఆదర్శం ఆర్థిక ప్రజాస్వామ్యంతో పాటు ఆదేశిక సూత్రాల్లో కొన్ని నర్మగర్భమైన అధికారాలు కూడా ఉన్నాయని అంబేద్కర్ పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం కోసం చట్టాలను రూపొందించే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. అయితే ఈ చట్టాలు ప్రాథమిక హక్కులకు భంగం కలిగించేవిగా ఉంటే ప్రమాదం ఉందని ఆయన అన్నారు.

ఆదేశిక సూత్రాలంటే దేశంలో వివిధ ప్రభుత్వాలపై రాజ్యాంగం విధించే బాధ్యతలు అని అర్థం. అవి చేయాల్సిన కొన్ని పనులను నిర్దేశించింది. ఆ పనులను చేయడంలో అవి విఫలమైతే ఆ ప్రభుత్వం నుండి నిర్దిష్టమైన కార్యక్రమాలకోసం ఎవరూ ఎదురు చూడబోరని అంబేద్కర్ వ్యాఖ్యానించారు.

ఇది ప్రభుత్వాలు విధిగా పాటించాల్సిన కర్తవ్యాలు. 'ఆదేశిక' అనే పదాన్ని తొలగిస్తే ఆ భాగం రూపొందించడంలో రాజ్యాంగ పరిషత్ ఉద్దేశం విఫలమవుతుందన్నారు. రాజ్యాంగంలో పేర్కొన్న అంశాల పట్ల భవిష్యత్ ప్రభుత్వాలు, చట్టసభలు, కేవలం నామమాత్రంగా ప్రస్తావించి విధుల నిర్వహణను పరిత్యజించే అవకాశం కల్పించకుండా చూడడం ఉద్దేశం. ప్రభుత్వ నిర్వహణలో, ముమ్ముందు తీసుకునే నిర్ణయాలకు ఆదేశిక సూత్రాలు ప్రాతిపదిక కావాలి. ఆదేశిక సూత్రాలకు చట్టబద్ధతలేదు. అవి నిరుపయోగకరమైనవని అంగీకరించేందుకు ఆయన సిద్ధంగాలేరు. ఆదేశిక సూత్రాలకు మరోపేరు ఆదేశ సాధనాలు, అవి శాసన వ్యవస్థకు, ప్రభుత్వానికి జారీ చేయబడిన ఆదేశాలు. అయితే ఈ చట్టాలు ప్రాథమిక హక్కులకు భంగం కలిగించేవిగా ఉంటే ప్రమాదం ఉందని ఆయన అన్నారు.

మద్యపాన నిషేధం అనేది కేవలం సూచన మాత్రమే. దానిని ప్రవేశపెట్టాలనే నిర్బంధం ప్రభుత్వంపై లేదు. దానిని ప్రవేశపెట్టాలా, లేదా అనే విషయంపై నిర్ణయం తీసుకునే విచక్షణాధికారం ప్రభుత్వానికి ఉంది. దానిని ప్రవేశపెట్టాలని నిర్ణయించినప్పటికి దానిని ప్రవేశపెట్టే సమయంపై నిర్ణయం తీసుకునే అధికారం ఆయా రాష్ట్రాలకు ఉంటుంది. ప్రజాభిప్రాయం మేరకు రాష్ట్రాలు నిర్ణయం తీసుకుంటాయి. మద్యపాన నిషేధానికి సంబంధించి నిర్దేశిత సూత్రాలకు కట్టుబడి ఉండాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై ఉండదు.

నూతన ప్రజాస్వామ్య వ్యవస్థకు గ్రామపంచాయితీలు ప్రాతిపదిక కాదని రాజ్యాంగ నిర్మాణ కమిటీ, ముఖ్యంగా అంబేద్కర్ అభిప్రాయంగా ఉండేది. ముసాయిదా కమిటి గ్రామాన్ని కాకుండా వ్యక్తిని యూనిట్‌గా తీసుకుంది. దీనిని అనేకమంది విమర్శించారు. గ్రామ పంచాయతీలు, జిల్లా పంచాయతీల ప్రాతిపదికగా రాజ్యాంగ నిర్మాణం జరిగి ఉండాల్సిందని కొంతమంది సూచించారు. భారతదేశంలో అనేక గ్రామ ప్రభుత్వాలు ఉండాలని మరికొంతమంది పేర్కొన్నారు.

అంబేద్కర్ ఈ విమర్శలకు సూటిగా సమాధానాలు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మెటకాఫె చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు.

> "రాజ్యాలు తరువాత రాజ్యాలు కుప్పకూలిపోతున్నాయి. విప్లవాలు పుట్టుకు వస్తున్నాయి. హిందూ, పఠాన్, మొగల్, మరాఠీ, సిక్కు, ఇంగ్లీషు వారు అంతా పాలకులైపోతున్నారు. అయితే గ్రామ కమ్యూనిటీల్లో మాత్రం మార్పు రావడం లేదు. సంక్షోభ సమయాల్లో వారు ఆయుధాలు చేతబూని బలోపేతం అవుతున్నారు. సైన్యం దేశం అంతటా సంచరిస్తుంది. గ్రామ కమ్యూనిటీలు నిర్ణీత పరిధి మేరకు సంచరిస్తూ సైన్యాన్ని ఎటువంటి కవ్వింపు లేకుండా తమ ప్రాంతాల్లో సంచరించేందుకు అనుమతిస్తారు."

కె.టి.షా ఎ.కె. అయ్యంగార్, షిబ్బన్‌లాల్ సక్సేనా వంటి ప్రముఖులు అంబేద్కర్‌ను విమర్శించారు. మౌలానా హస్రత్ మొహానీ "గ్రామ సొవియట్" ను మన రాజ్యాంగం యూనిట్‌గా చెయ్యాలని సూచించారు.

"సంతానం 31 ఎ నియామవళిని ప్రవేశపెడుతూ ఈ విధంగా అన్నారు. "గ్రామ పంచాయితీలు స్పష్టంగా ఉండేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వశాఖలుగా పని చేసేందుకు అవసరమైన అధికారాలు వాటికి కల్పించాలి."

పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ఒక యంత్రాంగంగా రాజ్యాంగం ఏర్పాటు చేసింది. ఒక వ్యక్తి - ఒక ఓటు అనేది ఈ వ్యవస్థలో ముఖ్య లక్షణం. ఈ రాజ్యాంగంలో రాజకీయ ప్రజాస్వామ్యం నెలకొల్పబడుతుంది. ఆర్థిక ప్రజాస్వామ్యం కూడా నెలకొనాలనేది ప్రజల ఆకాంక్ష.

రాజ్యాంగ నిర్మాతలు కావాలనే ఆదేశిక సూత్రాల్లో వినూత్న ఆలోచన విధానాన్ని ప్రవేశపెట్టారు. అందువల్ల ఆదేశిక సూత్రాల గురించి విభిన్న రకాలుగా ఆలోచించే అవకాశం ఏర్పడింది. ముఖ్యంగా ఆర్థిక ప్రజాస్వామ్యం సాధించాలనే లక్ష్యాన్ని సాధించే విషయమై విభిన్న ఆలోచన విధానాలు ద్యోతకమవుతున్నాయి. రాజ్యాంగాన్ని రూపొందించడంలో రెండు రకాల ధ్యేయాలు ఉన్నాయనే విషయాన్ని గ్రహిస్తే అవగాహనా రాహిత్యం అంతరిస్తుందని అంబేద్కర్ పేర్కొన్నారు. రాజకీయ ప్రజాస్వామ్యం కల్పించడం మొదట ధ్యేయం కాగా భారతదేశ నిజమైన ఆదర్శమైన ఆర్థిక ప్రజాస్వామ్యం సాధించడం రెండవది.

అంబేద్కర్ ఈ విధంగా వ్యాఖ్యానించారు.

> "ఆదేశిక సూత్రాలను రూపొందించడంలో మా లక్ష్యం ఆర్థిక ప్రజాస్వామ్యం సాధించడం. రాజ్యాంగంలోని వివిధ నియంత్రణలు సూచించిన విధంగా ఆర్థిక లక్ష్యంపై దిశ, నిర్దేశం లేని కేవలం పార్లమెంటరీ తరహా ప్రభుత్వం ఏర్పాటు చేయడం కాదు. మన సామాజిక వ్యవస్థలో ఏమేమి ఉండాలనే విషయమై ఖచ్చితమైన అవగాహన ఆలోచన విధానం గల ప్రభుత్వం ఏర్పాటు కావాలనేది మా ఉద్దేశం. అందువల్లనే మేము రాజ్యాంగంలో ఆదేశిక సూత్రాలను జోడించాము."

ఆర్థిక ప్రణాళికపై ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చెయ్యాలని అంబేద్కర్ సూచించారు. దేశ ప్రజల ఆర్థిక జీవనానికి సంబంధించి ఖచ్చితమైన ప్రణాళికను రూపొందించడంపై సూచనలు చెయ్యాలని ఆ కమిటీకి నివేదించాలని ఆయన సూచించారు. ఆధునిక పరిస్థితుల్లో వ్యక్తిగత స్వేచ్ఛను పరిరక్షించుకునేందుకు ఆర్థిక ప్రణాళిక అవసరమని అన్నారు. "కార్మికులు, ముఖ్యంగా షెడ్యూల్డ్ కులాల వారు ఈ విషయమై ఆందోళన చెందుతున్నారు. "నేను షెడ్యూల్డ్ కులాల ప్రతినిధిని" ప్రతిపాదనలు వాటి హేతుబద్ధత ప్రాతిపదికగా పరిశీలింపబడే విధంగా చూడటం నా విధి" అని అంబేద్కర్ పేర్కొన్నారు. ఆర్థిక ప్రజాస్వామ్యం సాధించేందుకు అనేక మార్గాలున్నాయని ఆయన సూచించారు. అది ఇండివిడ్యుయలిజం కావచ్చు లేదా సామాజిక వ్యవస్థ రూపంలో కావచ్చు లేదా కమ్యూనిస్ట్ విధానం కావచ్చు.

ఆదేశిక సూత్రాలు ఆచరణ సాధ్యం కాని పవిత్ర ప్రకటనలు మాత్రమేననే విమర్శలపై అంబేద్కర్ ప్రతిస్పందిస్తూ ఈ ఆదేశిక సూత్రాలపై కేవలం వాగాడంబరం ప్రదర్శించడం రాజ్యాంగ పరిషత్ ఉద్దేశం కాదని పేర్కొన్నారు. ఆదేశిక సూత్రాలను శాసనపరంగా,

ప్రభుత్వపరంగా ఆచరణలోకి తీసుకురావాల్సి ఉంది. దేశపాలనా వ్యవస్థలో ఇవి మార్గదర్శకాలు కాగలవని తాము నమ్ముతున్నామని అన్నారు. రాజ్యాంగ నిర్మాణం కేవలం రాజకీయ ప్రణాళికగా భావించడాన్ని ఆయన గట్టిగా వ్యతిరేకించారు. సోషలిస్ట్ వ్యవస్థ నెలకొల్పేందుకు ఆదేశిక సూత్రాలు దోహదం చేస్తాయని అన్నారు. ఆదేశిక సూత్రాలు సామాజిక వ్యవస్థ సారాంశమని అంబేద్కర్ పేర్కొన్నారు. ఆదేశిక సూత్రాలు దిశా నిర్దేశంలో సోషలిస్ట్ తరహా కాకపోతే వాటి సారాంశం సోషలిస్ట్ సిద్ధాంతం కాకపోతే సోషలిజం అంటే ఏమిటో తనకు అర్థం కావడం లేదని అంబేద్కర్ అన్నారు.

37వ నియామవళి ప్రకారం ఆదేశిక సూత్రాలకు చట్టబద్ధత లేదనే విషయాన్ని అంబేద్కర్ అంగీకరించారు. వీటి ఆధారంగా ప్రభుత్వంపై ఎవరూ వాజ్యం వేసే అవకాశం లేదు. ఆదేశిక సూత్రాల గురించి ఈ విధంగా ఆలోచించడం తగదని అంబేద్కర్ పేర్కొన్నారు. రాజ్యాంగపరమైన అంశాలకు సంబంధించి కోర్టుల తీర్పులను ఆదేశిక సూత్రాలు ప్రభావితం చేస్తాయి. మాగ్నకార్టా నిబంధల ప్రభావం బ్రిటన్ న్యాయమూర్తులపై ఉంది. స్వతంత్ర్య ప్రకటనకు రూపొందించిన ముందు అమెరికా న్యాయ మూర్తులపై ప్రభావం చూపింది. ఆదేశిక సూత్రాలు ప్రాథమిక హక్కులకు అనుబంధంగా ఉండాలన్నది న్యాయ వ్యవస్థ వైఖరిగా ఉంది. రాజ్యాంగంలోని మరే ఇతర నిబంధనకు వ్యతిరేకంగా ఉండే ఆదేశిక సూత్రాల అమలు ఆచరణ సాధ్యం కాదనేది కూడా కోర్టుల అభిప్రాయంగా ఉంది. ఆదేశిక సూత్రాలను చట్టబద్ధంగా ఆచరించడం సాధ్యం కాదు.

ఆదేశిక సూత్రాలు ప్రచ్ఛన్న అధికార సిద్ధాంత నిబంధనల సమూహంగా అంబేద్కర్ అభివర్ణించారు. ఈ సిద్ధాంతంలోని నిబంధనలు ఆదేశిక సూత్రాల్లో పరోక్షంగా ప్రస్తావనకు వస్తాయని అంబేద్కర్ వ్యాఖ్యానించారు. కోర్టులు వాటిని అనుసరించాలని, పార్లమెంటు రాష్ట్రాల చట్టసభలు చేసే శాసనాలకు మద్దతు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగం నిర్దేశించిన ఆదేశిక సూత్రాలను అమల్లోకి తీసుకువస్తే శాసనాలను తమ తీర్పుల్లో పరిగణలోకి తీసుకోవాలని అంబేద్కర్ కోర్టులకు విజ్ఞప్తి చేశారు. ఆదేశిక సూత్రాలనేవి రాష్ట్ర ప్రభుత్వాలు విధిగా అనుసరించాల్సిన కొన్ని నియమావళిగా అంబేద్కర్ 1951 మే 18న రాజ్యాంగ (తొలి సవరణ) బిల్లుపై జరిగిన చర్చలో జోక్యం చేసుకుంటూ పేర్కొన్నారు. వీటిని విధిగా, చట్టబద్ధంగా అమలు చేయడం సాధ్యంకాదని 37వ నియమావళి సూచిస్తున్నప్పటికీ న్యాయవ్యవస్థకు వీటి ప్రయోజనం భారత అటార్నీజనరల్ ఎం.సి. సెతల్వాడ్ చేసిన వ్యాఖ్యల బట్టి అర్థం చేసుకోవచ్చు. ఆయన ఈ విధంగా వ్యాఖ్యానించారు. "న్యాయ సమీక్షకు సంబంధించిన అధికారాలను వినియోగించుకోవడంలో ఈ సూత్రాలు కోర్టులకు ఎంతగానో సహకరించాయి. భారత రాజ్యాంగానికి ముందుమాటను పటిష్టం చేసేందుకు ఉపయోగపడే సాధనాలు."

సెతల్వాడ్ ఉద్దేశంలో ఆదేశిక సూత్రాలు గవర్నర్ జనరల్, 1935 భారత ప్రభుత్వ చట్టం (సెక్షన్లు 13 నుండి 53 వరకు) ప్రకారం గవర్నర్‌కు జారీ చేసిన "సూచనల పట్టిక" వంటిది. తమ అధికారాలను ఎలా వినియోగించుకోవాలనే విషయమై పాలకులు, చట్ట సభలకు ఇవి సూచనలు, మార్గదర్శకాలు. ఈ ఉదారవాద సిద్ధాంతాలు భారత రాజ్యాంగా నిర్మాణంతో సహకరించడంతో పాటు తమ ప్రభుత్వాల ఎంపికలో ప్రజలకు సహకరిస్తాయని

ప్రొఫెసర్ కె.సి. వీర్ పేర్కొన్నారు. అవి కేవలం హేతుబద్ధమైనవి మాత్రమే కాదు, అంతకుమించి స్థాయిగలవి. మరీ లోతుకు పోకుండా ఉంటే ఇవి మంచి తీర్మానాలు. సులభంగా గోప్యం చేసుకునేందుకు పాటించే పరోక్ష మార్గంపై రాళ్ళుపరచడం వంటిది. అధికారాన్ని చేజిక్కించుకునే వారైనా ఈ ఆదేశిక సూత్రాలను గౌరవించాల్సి ఉంటుందని ప్రొఫెసర్ వీరే అన్నారు వీటిని ఉల్లంఘిస్తే కోర్టులో సమాధానం చెప్పుకోవాల్సిన అవసరం లేకపోయినా ఎన్నికల సమయంలో ప్రజలకు జవాబు చెప్పుకోవాల్సి ఉంటుందని అన్నారు. ఈ ఆదేశిక సూత్రాలు అపురూపమైన విలువ కలిగి ఉన్నాయి. వామపక్ష శక్తులు అధికారం కైవసం చేసుకునేందుకు ప్రయత్నం చేసే సందర్భంలో వీటి ప్రాధాన్యత మరింత ప్రస్ఫుటమవుతుంది అన్నారు

ఆదేశిక సూత్రాలు ఎంతో ముఖ్యమైనవి వాస్తవానికి ప్రాథమిక హక్కులు వీటికి లోబడి ఉండేవే. రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులు, ప్రభుత్వ విధానాల ఆదేశిక సూత్రాల మధ్య స్వాభావికసిద్ధమైన వైరుధ్యం ఉంది. ఈ వైరుధ్యాన్ని అంతమొందించి ప్రాథమిక హక్కులను ప్రభుత్వ విధానాల ఆదేశిక సూత్రాలకు లోబడి ఉండే విధంగా చూసే బాధ్యత ఈ పార్లమెంటుపై ఉందని రాజ్యాంగం నాల్గవ సవరణపై జరిగిన చర్చలో పాల్గొంటూ అంబేద్కర్ పేర్కొన్నారు.

భారత రాజ్యాంగ అధినేతగా రాష్ట్రపతి వ్యవహరిస్తారు. ఆ పదవిలో ఉన్న వారిని అంబేద్కర్ బ్రిటన్ రాజుతో, అమెరికా అధ్యక్షునితో పోల్చారు. అమెరికా అధ్యక్ష వ్యవస్థలో అధ్యక్షుడు ప్రభుత్వాధినేత. బ్రిటన్ రాజ్యాంగంలో రాజు ఎంత హోదా కలిగి ఉంటాడో భారత రాజ్యాంగ ముసాయిదా ప్రకారం అంతే హోదా కలిగి ఉంటారు. ఆయన దేశాధినేత అయితే ప్రభుత్వాధినేత కాదు. ఆయన దేశానికి ప్రాతినిధ్యం వహిస్తారు. ప్రభుత్వానికి కాదు తన మంత్రిమండలి సిఫార్సులకు అనుగుణంగా వ్యవహరిస్తారు. అమెరికా అధ్యక్ష వ్యవస్థలో ప్రభుత్వాధినేత, చట్టసభల అధినేత మధ్య స్పష్టమైన విభజన ఉంది. అధ్యక్షుడు, మంత్రులు కాంగ్రెస్ సభ్యులు కారు. అయితే భారత రాజ్యాంగ ముసాయిదా ఈ సిద్ధాంతాన్ని గుర్తించ లేదు.

పార్లమెంటరీ, అధ్యక్ష వ్యవస్థలు రెండూ ప్రజాస్వామ్యబద్ధమైనవే. ప్రజాస్వామ్య ప్రభుత్వం రెండు పరీక్షలను నెగ్గవలసి ఉంటుందని అంబేద్కర్ పేర్కొన్నారు ఆయన ఈ విధంగా వ్యాఖ్యానించారు. "అమెరికా, స్విట్జర్లాండ్ వ్యవస్థలు మరింత సుస్థిరత కల్పిస్తాయి. అయితే బాధ్యత మాత్రం లోపిస్తుంది. బ్రిటిష్ న్యాయవ్యవస్థ మాత్రం సుస్థిరత కంటే బాధ్యతకే అధికార ప్రాధాన్యతనిస్తుంది. భారత రాజ్యాంగ ముసాయిదా కూడా సుస్థిరత కంటే బాధ్యతకే అధికార ప్రాధాన్యతనిస్తుంది. అది పార్లమెంటరీ పాలనా వ్యవస్థను సిఫార్సు చేసింది.

రాష్ట్రపతి ఎన్నికల విధానంలో మార్పు రావాలని, వయోజన పౌరులు రాష్ట్రపతిని ఎన్నుకునే విధానం ప్రవేశపెట్టాలని కె.టి.షా సూచించారు. ఎలక్టోరల్ కాలేజ్ ద్వారా రాష్ట్రపతిని ఎన్నుకునే విధానం ప్రజల అభిమతాన్ని ప్రతిబింబించబోదని ఆయన అన్నారు భారీస్థాయిలో ఓటర్లుండటం, ఎన్నికల నిర్వహణకు అవసరమైన స్థాయిలో యంత్రాంగం లేకపోవడం రాజ్యాంగాధినేతగా రాష్ట్రపతి స్థాయి వంటి విషయాలను తాము పరిగణనలోకి తీసుకున్నామని అంబేద్కర్ చెప్పారు. మన దేశంలో రాష్ట్రపతికి అమెరికా అధ్యక్షునికి ఉన్న స్థాయిలేదని, ప్రధానమంత్రి వయోజన ఓటరు చేత ఎన్నుకోబడతారని అంబేద్కర్ పేర్కొన్నారు.

భారత రాజ్యాంగంపై రాసిన వ్యాఖ్యానంలో డి.డి. బాసు ఈ విధంగా పేర్కొన్నారు. "ఆదేశిక సూత్రాల్లో ఏ ఒక్కదానికైనా విరుద్ధంగా ఉండే బిల్లును చట్టసభల్లో ప్రవేశపెట్టి ఆమోదం పొందితే ఆ బిల్లుపై సంతకం చేసేందుకు రాష్ట్రపతి లేదా గవర్నర్ నిరాకరించవచ్చు."

కోర్టులు ఈ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని కొట్టి వేయవచ్చుని వారు పేర్కొనవచ్చు. ఈ అభిప్రాయంతో అంబేద్కర్ ఏకీభవించలేదు. ఆయన ఈ విధంగా అన్నారు. "మన రాజ్యాంగం దానిని డిమాండ్ చెయ్యదు. మనది పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ . రాష్ట్రపతి, మంత్రిమండలి సిఫార్సుల మేరకు నడుచుకుంటారు. ఆయన ఆజ్ఞలకు అనుగుణంగా మంత్రివర్గం వ్యవహరించబోదు. ఇంగ్లండ్‌లో ఉన్న మంత్రివర్గ పాలనా వ్యవస్థను దేశంలోనూ కొనసాగించడం ఉత్తమమని అంబేద్కర్ పేర్కొన్నారు. అమెరికాలోని అధ్యక్ష తరహా పాలన కంటే ఇది అనుసరణీయమని పేర్కొన్నారు.

మొత్తం మంత్రివర్గ పాలనా వ్యవస్థ సమిష్టి బాధ్యత ప్రాతిపదికపై ఉంటుంది. ప్రధానమంత్రి అభిమతం మేరకు పాలన సాగుతుంది. ఆయన మంత్రివర్గంలో కీలక వ్యక్తి. మంత్రులను నియమించే లేదా తొలగించే అధికారం ఆయనకు లేకపోతే సమిష్టి బాధ్యతత్వం నెలకొనదు. రాజ్యాంగం రెండు ప్రధానాంశాలపై ఆధారపడి ఉంటుంది. ప్రధానమంత్రి సలహా మేరకే ఏ వ్యక్తినైనా మంత్రిగా రాష్ట్రపతి నామినేట్ చేస్తారు. ఉద్వాసన చెప్పాలని ప్రధానమంత్రి భావించిన ఏ వ్యక్తీ మంత్రిగా కొనసాగలేరు.

మన రాజ్యాంగంలో సమిష్టి బాధ్యతాతత్వం ఉందని అంబేద్కర్ అన్నారు. ప్రధానమంత్రిని చట్ట ప్రకారం ఎన్నుకోరాదని కె.టి.షా సవరణను ప్రతిపాదించారు. ప్రధానమంత్రిని పాలనా వ్యవస్థలో ఒక భాగంగా ఉన్నా తనకు అభ్యంతరం లేదని ఆయన అన్నారు. ఈ ప్రతిపాదన విధ్వంసకరంగా ఉందని అంబేద్కర్ వ్యాఖ్యానించారు. సమిష్టి బాధ్యతాతత్వానికి ఇవి విఘాతం కలిగిస్తుందని అన్నారు.

> "దామాషా ప్రాతినిధ్య వ్యవస్థ ఆమోదయోగ్యం కాకపోవదానికి మూడు కారణాలను అంబేద్కర్ సూచించారు. దామాషా ప్రాతినిధ్య విధానం భారీస్థాయిలో అక్షరాస్యత ప్రాతిపదికగా ఉంటుంది. దేశంలో అక్షరాస్యత స్థాయిని బట్టి అది అచరణ సాధ్యంకాదు. పార్లమెంటరీ తరహాపాలనా వ్యవస్థ అమలులో ఉన్న పార్లమెంటులో మెజారిటీ ఉన్న పార్టీ ఒకటి ఉండాలి. అది ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలి. దామాషా ప్రాతినిధ్య వ్యవస్థ వల్ల ఒక ఇబ్బంది ఏమంటే చట్ట వ్యవస్థ చిన్న గ్రూపులుగా విభజింపబడుతుంది."

1910లో బ్రిటిష్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన రాయల్ కమిషన్ కూడా దామాషా ప్రాతినిధ్య పద్ధతిని వ్యతిరేకించింది. ఇందువల్ల సుస్థిర ప్రభుత్వం అధికారంలో కొనసాగే అవకాశం లేదని అది సూచించింది. శాంతి భద్రతలను పర్యవేక్షించే సుస్థిర ప్రభుత్వం ఏర్పాటు కావాలని అది సూచించింది.

మన దేశంలో మెజారిటీలు, మైనారిటీలు చాలాకాలంగా ఉనికిలో ఉంటూనే ఉన్నారు. రాజ్యాంగ పరిషత్ సమావేశం కాకముందు ఈ రెండు వర్గాల మధ్య ఒక ఒప్పందం కుదిరింది. ప్రత్యేక ఎలక్టోరేట్ విధానం రద్దు చేయబడింది. కొన్ని స్థానాల రిజర్వేషన్‌తో సమిష్టి ఎలక్టోరేట్ విధానం సూచించబడింది. మైనారిటీలకు కొంత కోటా కేటాయించబడింది. దామాషా ప్రాతినిధ్య వ్యవస్థ పరోక్షంగా అమలు జరగడం వల్ల మైనారిటీలకు ఒక చేత్తో ఇచ్చి మరో చేత్తో తీసుకున్నట్లవుతుంది. మైనారిటీలకు వారు కోరుకున్నది, అంటే ఖచ్చితమైన కోటా లభించలేదు.

కేంద్రం, రాష్ట్రాల మధ్య వివాదం చెలరేగితే ఫెడరల్ రాజ్యాంగం ప్రకారం సుప్రీం కోర్టు మధ్యవర్తిగా వ్యవహరిస్తుంది. అందువల్ల ఫెడరల్ వ్యవస్థలో సుప్రీం కోర్టు కీలక పాత్ర పోషిస్తుంది. భారత న్యాయ వ్యవస్థలో ఇది శిఖరాగ్ర వ్యవస్థవంటిది. మొత్తం న్యాయవ్యవస్థ పర్యవేక్షణ, నియంత్రణ సుప్రీంకోర్టుపై ఉంది. ఈ వ్యవస్థ స్వభావం గురించి అంబేద్కర్ ఈ విధంగా వివరించారు. "భారత ఫెడరల్ పాలనా వ్యవస్థలో రెండంచెలున్నప్పటికీ ద్వంద్వ న్యాయ వ్యవస్థ ఉనికిలో లేదు. హైకోర్టులు, సుప్రీం కోర్టు ఏకైక న్యాయ వ్యవస్థలో విభిన్న వ్యవస్థలు. ఏకీకృత న్యాయ వ్యవస్థలో భాగాలు. రాజ్యాంగ చట్టం లేదా క్రిమినల్ ప్రకారం అన్ని వర్గాల ప్రజలకు పరిష్కారాలు ప్రసాదిస్తూ నిర్దిష్టమైన పరిధి కలిగి ఉంటాయి. భారత, అమెరికాల్లో న్యాయ వ్యవస్థ సమీక్షా విధానం అమల్లో ఉంది.

సుప్రీం కోర్టు న్యాయమూర్తులకు సంబంధించి వాదనలను అంబేద్కర్ మూడు భాగాలుగా విభజించారు. (1) సుప్రీం కోర్టు న్యాయమూర్తులను ప్రధాన న్యాయమూర్తి సమ్మతి మేరకు నియమించాలి (2) రాష్ట్రపతి జరిపే నియామకాలను పార్లమెంట్ మూడింట రెండు వంతుల మెజార్టీతో ధృవీకరించాలి (3) రాష్ట్రాల మండలితో సంప్రదించి న్యాయమూర్తుల నియామకాలు జరపాలి. చట్టసభల అంగీకారంతో ప్రభుత్వం న్యాయమూర్తులను నియమించే ప్రక్రియ సరైంది కాదు. ఎందువల్లనంటే ఈ నియామకాలపై రాజకీయ ఒత్తిళ్ళు ఉండవచ్చు. రాజకీయ అంశాల ప్రాతిపదికగా ఉండే అవకాశం ఉంది.

పౌరుల మధ్య వివాదాలు పరిష్కారం చేయడం కోర్టుల సాధారణ బాధ్యత. అవి అరుదుగా పౌరులు, ప్రభుత్వం మధ్య వివాదాలను కూడా పరిష్కరిస్తూ ఉంటాయి. న్యాయాధికారి ప్రవర్తనను (తీరును) ప్రభుత్వం ప్రభావితం చేసే అవకాశాలు ఉండవు. ఫెడరల్ సర్వీస్ కమిషన్‌కు వర్తించే నిబంధనలు న్యాయ వ్యవస్థకు వర్తించవు. ఈ సందర్భంగా అంబేద్కర్ ఈ విధంగా వ్యాఖ్యానించారు. "పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులెవరూ పదవీ విరమణ చేసిన తరువాత కొంతకాలం పాటు ప్రభుత్వాధినేత కింద పని చేయరాదనే నిబంధన విధించారు." పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యకలాపాలు ప్రభుత్వాధినేతతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉంటాయి. న్యాయపరమైన అంశాలతో సంబంధం లేని అంశాలను సుప్రీం కోర్టు ప్రస్తుత న్యాయమూర్తికి పాత్ర కల్పించడానికి తాను వ్యతిరేకమని అంబేద్కర్ పేర్కొన్నారు. ఉదాహరణకు దౌత్యాధికారి పదవిలో నియమించడం, ఆ బాధ్యతల నిర్వహణ తరువాత తిరిగి న్యాయమూర్తి బాధ్యతలు అప్పగించడం.

గ్రేట్ బ్రిటన్ రాజ్యాంగంలో అనేక సంవత్సరాల పాటు కొన్ని రిట్‌లు ఉనికిలో వున్నాయి. వీటిని అంచనా వేయాల్సిన అవసరం ఏర్పడింది. అంబేద్కర్ వీటిని స్వీయ నిర్ణయాధికార హక్కుగా అభివర్ణించారు. ఎటువంటి దావా లేదా న్యాయపరమైన కార్యకలాపాలు చేపట్టకుండా బాధిత వ్యక్తికి తగిన న్యాయం చేకూర్చేందుకు ఉద్దేశించిన సౌలభ్యం. తాత్కాలిక ఊరట కలిగేలా చూడటం దాని ధ్యేయం.

> శాసన వ్యవస్థ, న్యాయ వ్యవస్థ మధ్య సంబంధం గురించి అంబేద్కర్ ఈ విధంగా వ్యాఖ్యానించారు. రాజ్యాంగంలోని 'డ్యూ ప్రాసెస్ క్లాజ్' శాసన వ్యవస్థ చేసే చట్టాలను ప్రశ్నించే అధికారాన్ని కోర్టులకు కలుగజేస్తుంది. ఈ విషయంలో రెండు రకాల అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం కలిగించే విధంగా శాసన వ్యవస్థ ఎటువంటి చట్టాలను చేయబోదని విశ్వసించాల్సి ఉంటుంది. ఇక రెండవ అభిప్రాయం ఏమిటంటే శాసన వ్యవస్థను విశ్వసించలేము. రెండు అభిప్రాయాల్లోను ప్రమాదం పొడచూపి ఉంది.

రాష్ట్రాల్లో గవర్నర్ కీలక స్థాయిలో ఉంటారు. ఆయన కేంద్రం ఏజెంట్‌గా ఉంటూ మంత్రివర్గ ఏర్పాటుపై ప్రభావం చూపుతారు. ఆయన రాష్ట్రానికి రాజ్యాంగ అధినేత. విధి నిర్వహణల్లో ఆయన ప్రధాన పరిపాలకుడు అయినప్పటికీ నిజమైన అధికారం మంత్రిమండలి చేతిలో ఉంటుంది.

వ్యక్తిత్వం ఆధారంగా గవర్నర్‌ను ఎంపిక చేయాలనేది అంబేద్కర్ అభిప్రాయం. ఆయనకు ఎన్నికల ద్వారా ఆ పదవితో అధిష్టింపచేయడం అనవసరమైన ప్రక్రియ. ఇది ఎంత ఖర్చు ఇబ్బందితో కూడిన ప్రక్రియ. గవర్నర్ పదవి కేవలం అలంకార ప్రాయమైంది. గవర్నర్‌ను ఎన్నుకోవాలా లేదా నామినేట్ చెయ్యాలా అనేది కాదు అసలు సమస్య. ఆయనకు విచక్షణాధికారాలు ఉండాలా, అక్కర్లేదా అన్నదే అసలు సమస్య. గవర్నర్‌కు విచక్షణాధికారాలను కొనసాగించడం రాష్ట్రాల్లో బాధ్యతాయుతమైన ప్రభుత్వాలకు సహజంగానే ఇష్టం ఉండదు. గవర్నర్లకు విచక్షణాధికారాలను కొనసాగించడం లేదా కొన్ని అధికారాలు కల్పించడం బాధ్యతాయుతమైన ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరించడమే అవుతుంది.

రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వానికి లోబడి పనిచేయాల్సి ఉంటుంది. అవి కేంద్ర ప్రభుత్వానికి లోబడి పనిచేసేలా చూసేందుకు రాజ్యాంగ నిబంధనల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నదీ లేనిదీ రాష్ట్రపతికి తెలియజేసేందుకు గవర్నర్ కొన్ని అంశాలను తన పరిధిలో ఉంచుకుంటారు. ప్రభుత్వం మెజారిటీ సభ్యుల విశ్వాసం కోల్పోయిన సందర్భాల్లో గవర్నర్ తన విచక్షణాధికారాన్ని వినియోగించి ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయవచ్చు.

రాజ్యాంగం ప్రకారం గవర్నర్ తనకు తానుగా నిర్వహించే బాధ్యతలంటూ ఏమీ లేవు. అయినప్పటికి కొన్ని విధులను ఆయన నిర్వహించాల్సి ఉంటుంది. మంత్రిమండలి సలహాలను ఆయన పాటించాల్సి ఉంటుంది. ఆయన ఒక పార్టీకి ప్రతినిధి కాదు. ఆయన మొత్తం రాష్ట్ర ప్రజల [illegible] ప్రజల పేరుతో ఆయన పాలనా బాధ్యతలు నిర్వహిస్తారు.

గవర్నర్ అధికారాలు కేవలం నామమాత్రమైనవి. గవర్నర్‌ను ఎన్నుకునేందుకు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం వృథా అని అంబేద్కర్ చర్చను ముగించారు.

శాసన మండలుల ఏర్పాటుపై ఎటువంటి నిర్ణయం తీసుకోవాలని రాజ్యాంగ పరిషత్ భావించలేదు. ఈ అంశాన్ని ఆయా రాష్ట్రాల శాసనసభలకే వదిలి వేయాలని నిర్ణయించింది. రాజ్యాంగ పరిషత్ సభ్యులు ఎగువ సభల ఏర్పాటును వ్యతిరేకించారు ఆయా రాష్ట్రాల్లో రెండవ సభను ఏర్పాటు చేయడం వృథా అని వారు భావించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ ఈ విధంగా వ్యాఖ్యానించారు. "ఫ్రాన్స్ రాజ్యాంగ పరిషత్ సమావేశమైనప్పటి నుండి రెండవ ఛాంబర్ ఏర్పాటుపై నిలకడగా వ్యతిరేకత వ్యక్తమవుతూనే ఉంది ఇక నా విషయానికి వస్తే రెండవ ఛాంబర్స్‌కు నేను అనుకూలమని గట్టిగా చెప్పలేను." ఆ రెండవ ఛాంబర్ రాజ్యాంగంలో శాశ్వత స్థానం పొందలేదని ఆయన అన్నారు

వ్యవసాయ కార్మికులకు ప్రాతినిధ్యం లభించేలా నిబంధన రూపొందించాలని నాగప్ప అనే రాజ్యాంగ పరిషత్ సభ్యుడు సూచించారు. ఎగువ సభలో వ్యవసాయ కార్మికులకు ఇటువంటి నిబంధన అవసరం ఉందని అంబేద్కర్ పేర్కొన్నారు దిగువ సభను ఎన్నుకొనేవారు వయోజన ఓటర్లే అయినందున ఎగువ సభలో వ్యవసాయ కార్మికులకు ప్రాతినిధ్యం కల్పించేందుకు ప్రత్యేకంగా నిబంధన రూపొందించాల్సిన అవసరం లేదని చెప్పారు.

ఎగువ ఛాంబర్స్‌లో షెడ్యూల్డ్ కులాల వారికి ప్రత్యేక ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందని మునిస్వామి పిళ్ళే పేర్కొన్నారు. షెడ్యూల్డ్ కులాలకు కేంద్ర, రాష్ట్ర శాసన వ్యవస్థల్లా దిగువ సభల్లో గ్యారంటీ ఇస్తే సరిపోతుందని అంబేద్కర్ పేర్కొన్నారు

ప్రభుత్వ పాలనా యంత్రాంగం న్యాయ వ్యవస్థ మధ్య లేదా ఆదేశిక సూత్రాల్లో స్పష్టంగా ఉంది. మేజిస్ట్రేట్ వ్యవస్థకు సాధారణ పరిపాలనా వ్యవస్థతో సన్నిహిత సంబంధం ఉంటుందని అంబేద్కర్ పేర్కొన్నారు. మేజిస్ట్రేట్ వ్యవస్థ హైకోర్టు అధీనంలో ఉండదని అన్నారు. ఆయన ఇంకా ఈ విధంగా అన్నారు. "1935 భారత ప్రభుత్వ చట్ట నిబంధనల ప్రకారం జిల్లా న్యాయమూర్తి నియామకం, ప్రమోషన్ పూర్తిగా గవర్నర్ చేతుల్లో ఉంది. ఈ నియామకాలు జరిపే సమయంలో హైకోర్టును సంప్రదించాలనే నిబంధనను కొత్తగా చేర్చారు

కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి న్యాయ వ్యవస్థకు, పాలనా యంత్రాంగానికి మధ్య స్పష్టమైన విభజన ఉండాలన్న ఆకాంక్ష ఉండేది. "దాన్ని మేము కావాలని ప్రాథమిక అంశంగా రూపొందించలేదు దానికి మేము అంత మౌలిక ప్రాధాన్యత గల సమస్యగా మారిస్తే అది తప్పనిసరి బాధ్యతగా పరిణమిస్తుంది. రాజ్యాంగం ఆమోదం పొందగానే రెండు వ్యవస్థల మధ్య అంతరం సృష్టించాల్సి వస్తుంది" అని అంబేద్కర్ పేర్కొన్నారు ఆదేశిక సూత్రాలు నిబంధనలు రూపొందించేవే గాని, వాటి అమలు జోలికి పోరాదని ఆయన వ్యాఖ్యానించారు.

ఈ అంశాన్ని ఆదేశిక సూత్రాల్లో జోడించి యుండాల్సిందని పండిట్ హెచ్.ఎన్ కుంజ్రు వ్యాఖ్యానించారు. అందుకు పండిట్ నెహ్రూ ఈ విధంగా సమాధానమిచ్చారు

"నాకైతే పండిట్ కుంజ్రు పూర్తిగా గాడి తప్పినట్లుగా అనిపిస్తుంది. ఆయన ఎందుకో ప్రభుత్వ చిత్తశుద్ధిపై సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి సంబంధించినంతవరకు స్వయం పాలనా వ్యవస్థల మధ్య విభజనకు అనుకూలంగా ఉంది. ఈ సమస్యల ప్రాధాన్యతను తగ్గించేందుకు అంబేద్కర్ సవరణ ఉద్దేశించబడినప్పటికీ ఈ సమస్యకు దేశంలో ఉన్నత స్థాయిలో చర్చ జరగాలన్నది ప్రభుత్వ అభిమతం."

అఖిల భారత సర్వీసులకు సంబంధించిన నిబంధనలు రాజ్యాంగంలో ప్రత్యేకత సంతరించుకున్నాయి. ఫెడరల్ వ్యవస్థలో కేంద్ర, రాష్ట్రాలకు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేశారు. సమర్థవంతమైన సివిల్ సర్వీసులు లేకపోతే ప్రభుత్వం తన విధానాలను సమర్థవంతంగా అమలు చేయలేదు. కొనసాగించలేదు. అటువంటి అధికారాలను సస్పెండ్ చేసే అధికారంపై పరిమితి విధించడాన్ని అంబేద్కర్ సమర్థించుకున్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు అప్పీలు చేసుకునే అధికారం కల్పించడాన్ని కూడా ఆయన సమర్థించుకున్నారు. ప్రతి రాష్ట్రం పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాటు చెయ్యాలని, రెండు లేదా మూడు రాష్ట్రాలకు కలిపి ఒక ప్రాంతీయ కమిషన్ ఉండాలని సూచించారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఉద్యోగులకు హైకోర్టు, సుప్రీంకోర్టు ఆడిటర్ జనరల్ ఉద్యమాలకు మధ్య వివక్షత ఎందుకు పాటించాలన్నది అనేకమంది విమర్శకులు ప్రశ్నించారు. అంబేద్కర్ అందుకు ఈ విధంగా సమాధానం ఇచ్చారు.

న్యాయ పాలనా శాఖతో అత్యున్నత స్థానాల్లో పనిచేస్తున్న హైకోర్టు సిబ్బంది న్యాయ పాలనకు సంబంధించి కొంత మేరకు విచక్షణాధికారం పాటించాల్సి ఉంటుంది. వారి జీతాలు, పెన్షన్లను రాష్ట్రపతి ఆమోదంతో ప్రధాన న్యాయమూర్తి నిర్ణయిస్తారు. వారి సర్వీసుల స్థితిగతులను కూడా ప్రధాన న్యాయమూర్తి నిర్ణయిస్తారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ సిబ్బంది ఎక్కువ భాగం – వాస్తవానికి మొత్తం సిబ్బంది – పాలనా నిర్వహణ బాధ్యతలు నిర్వహిస్తారు. వీరికి ఎటువంటి అధికారం, విచక్షణాధికారం ఉండవు.

పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుల నియామకం గురించి షెడ్యూల్డ్ కులాలకు చెందిన వారిని ఇందులో చేర్చాలని కొంతమంది సభ్యులు డిమాండ్ చేశారు. ఈ విషయమై అంబేద్కర్ ఈ విధంగా వ్యాఖ్యానించారు.

"షెడ్యూల్డ్ కులాలు, తెగలు, వెనుకబడ్డ తరగతులకు చెందిన వ్యక్తిని కమిషన్‌లో సభ్యునిగా నియమించే విషయంలో రాష్ట్రపతిపై బాధ్యత పెట్టడం వల్ల ప్రయోజనం ఉంటుందని నేను భావించబోను. పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుడు నిర్వహించవలసిన బాధ్యతలు సాధారణ తరహాకు చెందినవి. ఒక ప్రత్యేక వర్గం ప్రయోజనాలు, వారి రక్షణ కోసం ఆయన ఆ పదవిలో ఉండబోడు."

ప్రతి సభ్యునికీ కొన్ని ప్రత్యేక అధికారాలు, హక్కులు ఉంటాయి. "సంభాషణా హక్కు ఏ విషయంపైనైనా పేర్కొన్న దానిపై కోర్టులో వాజ్యం నిర్వహించకుండా ఉండే హక్కులు,

పార్లమెంట్ లేదా అది నియమించిన కమిటీల్లో ఓటు వేసే హక్కు కలిగి ఉంటారు. ఈ విషయమై అంబేద్కర్ ఈ విధంగా అన్నారు.

> "మనం మూడు మార్గాలు అనుసరించాల్సి ఉంది. (1) వాటిని రాజ్యాంగంలోనే పొందుపరచాలి. పార్లమెంట్, దాని సభ్యుల ప్రత్యేక అధికారాలను స్పష్టంగా నిర్వచించుకోవాలి. (2) ఒక ప్రత్యేక విషయానికి సంబంధించి పార్లమెంట్ ఒక నిబంధన లేదా ఏర్పాటు చేస్తుంది. ఆ విధమైన ఏర్పాటు చేసేవరకు లేదా నిబంధన విధించే వరకు యధాతథ పరిస్థితి కొనసాగుతుంది. 1935 చట్టం పార్లమెంట్‌కు గానీ, దాని సభ్యునికి గానీ ప్రత్యేక అధికారం లేదా సదుపాయం కలిగించలేదు. అది కల్పించిన రక్షణ లేదా హక్కు ఏమిటంటే పార్లమెంట్‌లో జరిగే చర్చల్లో తన అభిప్రాయాలు వివరించే హక్కు ఉంటుంది. దీనిని ఆధారంగా ఆ సభ్యుని ప్రాసిక్యూట్ చేసే అవకాశం లేదు (3) మనం అనుసరించిన మార్గం ప్రకారం పార్లమెంట్‌కు ఎటువంటి అధికారాలు, హక్కులు ఉంటాయో హౌస్ ఆఫ్ కామర్స్‌కు అదే విధమైన హక్కులు, అధికారాలూ ఉంటాయి.

పార్లమెంట్ సమావేశాలు జరగని రోజుల్లో అత్యవసరమని భావించిన సందర్భాల్లో ఆర్డినెన్స్‌లు జారీ చేసే అధికారం రాష్ట్రపతికి ఉంది. ఆ ఆర్డినెన్స్‌లకు చట్టానికి ఉన్న అధికారం ఉంటుంది. అయితే అది కొంతకాలం పరిమితమై ఉంటుంది. అటువంటి ఆర్డినెన్స్ పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం కలిగించే విధంగా ఉండరాదని సాకర్ పార్లమెంట్‌లో చేసిన ప్రసంగంలో పేర్కొన్నారు. సంబంధిత కొత్త విచారణ అనంతరం నిర్ణయిస్తే మినహా పౌరుల స్వేచ్ఛకు భంగం కలిగించేదిగా ఉండరాదు. అంబేద్కర్ ఆర్డినెన్స్‌లు జారీ చేసే ఏర్పాటును సమర్ధించారు. "పార్లమెంట్ సమావేశాలు జరగని రోజుల్లో అత్యవసర సందర్భాల్లో ఇటువంటి చర్యలు తీసుకోవడం తప్పని సరి పరిస్థితి ఏర్పడవచ్చు. దీనిని మనం నియంత్రించలేం."

రాజ్యాంగం అనేది ఒక శక్తివంతమైన పత్రం. అభివృద్ధి చెందుతున్న దేశంతో పాటు అది కూడా అభివృద్ధి చెందుతూ ఉండాలి. మారుతున్న పరిస్థితులు, ప్రజలకు అనుగుణంగా అందులో కూడా మార్పులు చోటు చేసుకుంటూ ఉండాలి. రాజ్యాంగం ప్రకారం అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తున్నంత కాలం, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పరిఢవిల్లినంత కాలం రాజ్యాంగంలో చోటు చేసుకునే సవరణలు దేశ అవసరాలను ప్రతిబింబించేవిగా ఉంటాయి. సవరణలు చేయాల్సిన అవసరాన్ని అంబేద్కర్ నొక్కి వక్కాణించారు. ఆయన ఈ విధంగా అన్నారు.

> "కొంతమంది వ్యక్తుల సమ్మేళనం లేదా రిఫరెండం ద్వారా నిర్ణయాలు తీసుకునే విస్తృతమైన శ్రమతో కూడిన ప్రక్రియలను ముసాయిదా రాజ్యాంగం నిర్మూలించింది. రాజ్యాంగంలో సవరణలు చేసే అధికారం కేంద్ర, రాష్ట్రాల శాసన వ్యవస్థలకు ఉంది. రాజ్యాంగాన్ని సవరించేందుకు ఇంతకంటే తేలికైన మార్గాన్ని గుర్తించడం కష్టం. ఇది. ఆచరణ సాధ్యమైంది. పరిస్థితులకు అనుగుణమైంది. శాంతియుత లేదా యుద్ధ సమయాల్లో దేశాన్ని సమైక్యంగా ఉంచగలిగేదిగా ఉంటుందని నేను భావిస్తున్నాను."

కెనడా, స్వతంత్ర ఐర్లండ్, స్విట్జర్లాండ్, ఆస్ట్రేలియా, అమెరికా రాజ్యాంగాల్లోని నిబంధనలు, ప్రత్యేక లక్షణాలను అంబేద్కర్ తన ప్రసంగంలో వివరించారు. ఎక్కడా కూడా సాధారణ మెజారిటీతో రాజ్యాంగంలో సవరణలు చేసే అవకాశం లేదని ఆయన అన్నారు. ఆయన ఇంకా ఈ విధంగా అన్నారు.

> "వివిధ నియమావళిని మూడు రకాలుగా వర్గీకరించవచ్చు. ఇందులో కొన్ని పార్లమెంట్‌లో సాధారణ మెజారిటీతో సవరించగలవిగా ఉంటాయి. రాజ్యాంగం మొత్తాన్ని పార్లమెంట్‌లో సాధారణ మెజారిటీ ద్వారా సవరించే అవకాశం ఉండాలని సూచించడం హేతుబద్ధమైంది కాదు. రాజ్యాంగం ఏర్పాటుకు బాధ్యులైన వారు ఆమోదించే అంశం కాదు. నా ఉద్దేశం ప్రకారం మితిమీరిన చర్య. ఇక రెండవ రకం నియమావళిని సవరించేందుకు మూడింట రెండు వంతుల మెజారిటీ అవసరం. మూడవ తరగతి నియమావళిలో పార్లమెంట్ మూడింట రెండు వంతుల మెజారిటీతో పాటు రాష్ట్రాలు కూడా ఆమోదం తెలపాల్సి ఉన్న నియమావళి."

రాజ్యాంగాన్ని సవరించేందుకు ఇంత తేలికైన, సరళమైన విధానానికి ప్రపంచంలో ఏ రాజ్యాంగ పరిషత్ అయినా అవకాశం కల్పించిందా అని అంబేద్కర్ ప్రశ్నించారు.

రాజ్యాంగ పరిషత్‌లో స్వతంత్ర భారత రాజ్యాంగాన్ని ప్రవేశపెట్టేందుకు చేసిన అవిరళ కృషికి, అంకిత భావానికి అంబేద్కర్‌ను దేశం ఘనంగా కీర్తించింది. పూనా ఒప్పందంపై సంతకం చేసిన వ్యక్తిగా భారతదేశంలో నివసించే అన్ని వర్గాల, శ్రేణుల ప్రజలకు సమాన హక్కులు కల్పించడం ద్వారా ఆనందం అనుభవించి ఉంటారని కొంతమంది అభిప్రాయం వ్యక్తం చేశారు. తన సామర్థ్యాన్ని ఆయన హరిజనులు మాత్రమే కాక అన్ని వర్గాలకు చెందిన వారు గుర్తించడం గర్వంగా భావిస్తున్నానని మద్రాసుకు చెందిన ఒక సభ్యుడు అభినందించారు. ఆయన అందించిన సేవలు, ఆయన పడ్డ తపన, చేసిన అవిరళ కృషి హరిజనుల ఆత్మ విశ్వాసాన్ని పెంచాయి. రాజ్యాంగాన్ని విజయవంతంగా రూపొందించి రాజ్యాంగ పరిషత్‌లో ప్రవేశపెట్టినందుకు ఆయన దేశ వ్యాప్తంగా అందరూ బహుధా ప్రశంసించారు. విజ్ఞతతో కూడిన ఆయన ప్రసంగాలు దేశవ్యాప్తంగా ప్రశంసలు చూరగొన్నాయి. రాజ్యాంగ నిర్మాణంలో రాజ్యాంగ కమిటీ ఛైర్మన్ ప్రదర్శించిన న్యాయపరమైన మేధాశక్తి, అవిశ్రాంత కృషి, సునిశిత నైపుణ్యం, స్థిరచిత్తం, అంకితభావం, ఆధునికత సంతరించుకున్న భావనాపటిమ, అద్భుత నిర్మాణాల గురించి వర్ణించేందుకు మాటలు చాలవు. ఆయన అందరి ప్రజల హృదయాలను చూరగొన్నారు. అందరి హృదయాల్లో ఎంతో ఎత్తుకు ఎదిగారు. ఆయన షెడ్యూల్డ్ కులాల నాయకునిగా భావించుకోవడం విరమించుకొని కాంగ్రెస్ పార్టీలో చేరాలని, తద్వారా అధిష్టానవర్గం పరివృతంలో చేరాలని ఠాకూర్ దాస్ భార్గవ్ విజ్ఞప్తి చేశారు. ఆయన నేడు ఉన్న సంకుచిత పరిస్థితి కంటే ఇది ఎంతో ఉన్నతమైంది కాగలదని అన్నారు. అంబేద్కర్ ఎంతగానో శ్రమించారని, కఠోర శ్రమ చేయడం మాత్రమే కాకుండా ప్రత్యేక హోదా, ప్రతిపత్తి కల్పించాలనే ఆలోచనను విరమించుకుని సలహా కమిటీ ఉపసంఘంలో సమాన హక్కుల కోసం ఓటు చేశారని హరిజన సభ్యులు ఎం.జె. ఖండేకర్ పేర్కొన్నారు.

అనేకమంది రాజ్యాంగ పరిషత్ సభ్యులు ఆయనను అభినవ మనువుగా అభివర్ణించారు. "భావవ్యక్తీకరణ, ఆలోచనాపటిమలో విశిష్టత సముపార్జించుకున్నారని, ఆర్థిక సమస్యలతో పాటు రాజ్యాంగ సమస్యలపై ఆయన సాధించిన నైపుణ్యం అసాధారణం. అత్యద్భుతం, అనితరసాధ్యం, పరిపూర్ణమని" ప్రశంసల జల్లులు కురిపించారు ఆయన అందించిన సేవలు అన్ని సందేహాలు, భయాలను రూపుమాపాయి. ఉన్నత దేశభక్తుల్లో ఆయన ఒకరని గుర్తింపు పొందారు. దేశానికి స్వాతంత్ర్యం సంపాదించి పెట్టిన ఘనత మహాత్మా గాంధీజీకి దక్కితే దాని క్రోడీకరణ ఘనత గాంధీ తీవ్ర విమర్శకుల్లో ఒకరైన మన అద్భుత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్‌కు దక్కుతుంది" అని ఎస్. సహాయ అన్నారు "ఆయన ఈ ఒక్క రాజ్యాంగ పరిషత్ మాత్రమే కాకుండా మొత్తం దేశం, జాతి ఆయనకు కృతజ్ఞతలు వ్యక్తం చేస్తోంది. రాజ్యాంగ నిర్మాణంలో ఆయన ప్రదర్శించిన అద్భుత నైపుణ్యాన్ని ఈ తరం మాత్రమే కాదు భావితరాలు కూడా గుర్తుంచుకుంటాయి" అని కూడా ఆయన అన్నారు. అంబేద్కర్ పేరు స్వతంత్ర భారత చరిత్రలో చిరస్థాయిగా మిగిలిపోతుందని మరో సభ్యుడు అన్నారు. ఆయన స్పష్టత, భావ వ్యక్తీకరణ పటిమ అనితరసాధ్యం.

ఆర్.వి. ధులేకర్ ఈ విధంగా అన్నారు.

> "అంబేద్కర్ నిర్వహించిన పాత్ర "హెర్క్యులియన్" అని వ్యాఖ్యానించబోను ఎందుకంటే అది ఒక చిన్న ప్రపంచం. అంబేద్కర్ పాండవుల్లో ఒకరైన భీముడు నిర్వహించిన పాత్రతో సమానమైన పాత్ర పోషించారు. 'భీంరావు' అనే తన పేరు సార్థకం చేసుకున్నారు. ఆయన ఈ పాత్రను ఎంతో అవగాహనతో, స్పష్టమైన ఆలోచనతో సరళమైన భాషతో తన బాధ్యతలను నిర్వర్తించారు

రాజ్యాంగ నిర్మాణ కమిటీలో సభ్యుడైన అల్లాడి కృష్ణస్వామి అయ్యర్ తన ప్రసంగాన్ని ఈ విధంగా ముగించారు. "నా మిత్రుడు, గౌరవనీయుడు డాక్టర్ అంబేద్కర్ ఈ రాజ్యాంగాన్ని నిర్మించడంలో ప్రదర్శించిన అవిశ్రాంత కృషి, రాజ్యాంగ కమిటీ చైర్మన్‌గా ఆయన పడ్డ తపన, ప్రదర్శించిన అంకిత భావం, నైపుణ్యం, సమర్థత గురించి ప్రశంసించకపోతే నేను నా బాధ్యతలను నిర్వర్తించడంలో విఫలమైనట్లే భావిస్తాను" అని అన్నారు. గోవింద వల్లభ్ పంత్ ఆయనను 'పండిట్' అని సంబోధించారు. "ఆయన పాండిత్య ప్రకర్ష ముసాయిదా రాజ్యాంగాన్ని రూపొందించడంలో, అందులోని వివిధ నిబంధనలు, అంశాలను ఈ సభకు వివరించడంలో వెల్లడైంది" అన్నారు. డాక్టర్ పట్టాభి సీతారామయ్య ఈ విధంగా అన్నారు "ఈ అత్యద్భుత, అపురూప బాధ్యతలను నిర్వర్తించడం ప్రశంసనీయం. తిరుగులేని, అనితరసాధ్యం కాని, ఎవరూ అధిగమించలేని కృషితో మేధోవంతమైన రాజ్యాంగాన్ని రూపొందించారు. తాను సరియైనదని భావించిన దానికి పరిణామాలను వెరవకుండా కట్టుబడి ఉన్నారు."

రాజ్యాంగాన్ని పఠించిన ఎవరైనా, దాని నేపథ్యాన్ని విశ్లేషించిన ఎవరైనా డాక్టర్ అంబేద్కర్ ఎంత పెద్ద రాజ్యాంగవేత్తో అర్థం చేసుకుంటారు

> "ఈ అద్భుత రాజ్యాంగ నిర్మాణంలో ఆయన అద్భుత, విశిష్ట లక్షణాలు. మేధోసంపత్తి, పాండిత్యం, ఊహాశక్తి, తర్కం, భావ ప్రకటనా విధానం,

అనుభవంతో ఉపయోగించారు ముసాయిదా రాజ్యాంగంలో కొన్ని అంశాలపై విమర్శలు వచ్చిన సందర్భంగా వారిని వివరించేందుకు ఆయన ఉపయోగించిన పదకోశం, భావవ్యక్తీకరణ అద్భుతం ఆయన కూర్చోగానే సందేహాల పొగమంచు వీడిపోయేది సందేహాలు, అస్పష్టతా మేఘాలు అంతరించిపోయేవి. ఆయన వాస్తవానికి ఆధునిక మనువు. "భారత రాజ్యాంగ ప్రధాన సృష్టికర్త లేదా పిత అని పిలవ తగ్గవాడు "

అందించిన సేవల ద్వారా ఆయన బడుగు వర్గాల నాయకునిగా పరిమితం కాకుండా జాతీయ నాయకుల్లో ఒకరిగా ఎదిగారు బడుగు వర్గాలకు ప్రత్యేక హోదా, హక్కులు కల్పించాలనే డిమాండ్‌ను వదులుకుని జాతీయ నాయకత్వంతో చేతులు కలిపి మైనారిటీల ప్రయోజనాలను పరిరక్షించే రాజ్యాంగాన్ని రూపొందించారు రాజకీయ, ఆర్థిక ప్రజాస్వామ్యానికి మార్గం సుగమం చేశారు

రాజ్యాంగ నిర్మాణంలో అంబేద్కర్ నిర్వహించిన పాత్రను డాక్టర్ కె వి రావు మరింత విశ్లేషించారు. అంబేద్కర్ రాజ్యాంగ 'పిత' కాదని, 'మాత' అని ఆయన అభివర్ణించారు. 'పిత' అంటే భవిష్యత్ జీవన విధాత. ఆలోచనల సృష్టికర్త. అయితే అంబేద్కర్ నిర్వహించిన పాత్ర గురించి మరింత లోతైన విశ్లేషణ అవసరం నిర్ణయాలు తీసుకోవడంలో ఆయన నిర్వహించిన పాత్ర ఏమీ లేదు. ఆలోచనలు రేకెత్తించడం సంగతి అటుంచి తన ఆలోచనల్లో రాజీపడాల్సి వచ్చింది తన ఆలోచనలు కార్యరూపంలో పెట్టడంలో విఫలమయ్యారు. ఇతరుల ఆలోచనలను గౌరవించి ప్రచారం చేయాల్సిన పరిస్థితిలో పడ్డారు. షెడ్యూల్డ్ కులాల ప్రయోజనాలను పరిరక్షించేందుకు ఆయన వచ్చారు అందులో ఆయన ఘోరంగా విఫలమయ్యారు. తమ వర్గం వారికి సీట్ల రిజర్వేషన్‌ను ఎక్కువ కాలం అమలులో ఉండే విధంగా చేసుకోలేకపోయారు. పటేల్ వర్గం నుండి స్వల్ప రాయితీ కూడా సాధించలేకపోయారు. రాజ్యాంగంలో ప్రవేశపెట్టిన అనేక అంశాలను ఆయన వ్యక్తిగత అభీష్టానికి వ్యతిరేకంగా ప్రవేశపెట్టారు. ఉదాహరణకు ఆయన వ్యక్తిగత రచనలు పరిశీలిస్తే ఈ విషయం బోధపడుతుంది భారతదేశ పరిస్థితులకు అధ్యక్ష పాలనా వ్యవస్థ సరిపోతుందని ఆయన తొలుత భావించారు. దీనినే ఆయన నలుగురికీ వివరించారు. తరువాత ఆయన దానిని రాజ్యాంగ రూపకర్తగా దానిని వ్యతిరేకించాల్సి వచ్చింది. లక్ష్యాల తీర్మానం స్పష్టంగా లేదని, ఈ దేశంలో సామాజిక, ఆర్థిక న్యాయం చేకూర్చేవిగా లేదని, ఈ దేశంలో పరిశ్రమలు, భూమిని జాతీయం చేయడం గురించి స్పష్టమైన వివరణ లేదని ఆయన విమర్శించారు. సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ లేని పక్షంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం చేకూర్చాలనే భవిష్యత్ ప్రభుత్వాల వైనం ఎలా నెరవేరుతుందో నాకు అర్థం కావడం లేదని ఆయన మరో సందర్భంలో విమర్శించారు. భారతదేశాన్ని 'సోషలిస్టు దేశం'గా పిలవాలని కోరుతూ కె.టి. షా ప్రతిపాదించిన సవరణను అంబేద్కర్ వ్యతిరేకించారు. "ఏ రాజ్యాంగంలోనూ తరువాతి సిద్ధాంతం ఉండరాదు" అని ఆయన తన వైఖరికి మద్దతుగా వ్యాఖ్యానించారు 'డ్యూ ప్రాసెస్' క్లాజ్ రాజ్యాంగంలో ఉండాలని ఆయన వ్యక్తిగత అభిప్రాయం. వ్యక్తి కోసం గాలింపు, అతని ఇంట అన్వేషణ నిషేధిస్తూ కూడా నిబంధన రూపొందించాలని అంబేద్కర్ భావించారు. అయితే అది సాధ్యం కాలేదు.

"డాక్టర్ అంబేద్కర్"ను 'రాజ్యాంగ పిత'గా పిలవడం తగదని రాజ్యాంగం పఠించిన తరువాత నాకు కలిగిన అభిప్రాయం. ఎవరైనా అలా పిలవతగ్గ అర్హత ఉందో వారు జవహర్‌లాల్ నెహ్రూ, వల్లభ్‌భాయ్ పటేల్. అయితే నేను వారిని 'అధిష్టించిన దేవతామూర్తులు'గా – రాజ్యాంగంలో అన్ని ఆలోచనల మూలస్తంభాలుగా, రాజ్యాంగ నిజ నిర్మాతలుగా పిలుస్తాను. పితృత్వం రాజ్యాంగ నిర్మాణ కమిటీ సభ్యులకు ఆపాదిస్తాను. అంబేద్కర్‌ను ఈ గౌరవం నుండి వేరు చేస్తాను. ఆయన్ను మనం రాజ్యాంగ 'మాత'గా అభివర్ణించవచ్చు. పరాచికాలాడటం, అంబేద్కర్ కృషిని తక్కువ చేసి మాట్లాడటం నా ఉద్దేశ్యం కాదు. ఇతరుల ఆలోచనను కూడా మనసులో పెట్టుకోవడం, ప్రోత్సహించడం, వాటిని తన ఆలోచనలుగా బయటపెట్టడం వంటి వ్యవహారాలను అంబేద్కర్ తన న్యాయపరమైన మేధస్సును, అవిశ్రాంత కృషి, తిరుగులేని నైపుణ్యం, ఆధునిక భావ పరంపరలో ప్రదర్శించారు.

ప్రస్తుత అంచనాలు, విశ్లేషణలను డాక్టర్ రావు విశ్లేషణ తలక్రిందులు చేసింది. రాజ్యాంగ పరిషత్‌లో అంబేద్కర్ స్థానం రెండవ స్థాయిలోఉంది. గ్రహం సూర్యుని చుట్టూ పరిభ్రమించే విధంగా ఆయన కాంగ్రెస్ నాయకత్వం చుట్టూ పరిభ్రమించారు. స్వతంత్ర భారతదేశంలో బడుగు వర్గాల ప్రయోజనాలను పరిరక్షించేందుకు ఆయన ఈ విధంగా వ్యవహరించారు. డాక్టర్ రావు విశ్లేషణ మనల్ని నిజానికి దగ్గరగా తీసుకువెళుతుంది. ఆ దృష్టితోనే మనం ఆయన విమర్శను చదవవచ్చు.

# అధ్యాయం 6

# జాతీయవాదం, జాతీయోద్యమం మరియు జాతీయ సమైక్యత

## సెక్షన్-1

### జాతీయ ఉద్యమం

మానవ ఇతిహాసంలో జాతీయతావాదం ఒక శక్తిగా లోకమంతా అంగీకరించిన విషయం. అది మానవజనితం, కాబట్టి మనిషి జీవితానికి, ఆత్మాభిమానానికి, తను చేసే పనీపాటలకు, తన బాగోగులకు సంబంధించినది. దానిని ఒక ముఖ్యమైన శక్తిగా అంగీకరించాలి. దానిలో కొంత విచ్ఛిన్న ధోరణి ఉన్నప్పటికీ, వివేచనా రహిత ప్రవృత్తిగానూ లేదా వట్టి చిత్తభ్రమగానూ దానిని ఎవరైనా ఎంచినప్పటికీ, అది సామ్రాజ్యాలను కూడా కూలద్రోయగల బలీయమైన భావనాశక్తి అన్నది నిజం. జాతీయభావం ఒకే కుటుంబానికి చెందిన ఆలోచనను కలిగించే సమిష్టి ఏకత్వభావన. అంబేద్కర్ దానినే రెండువైపులా పదునున్న భావనగా వర్ణించారు. మరో ఇతర కూటమికి చెందని భావన, ఇదే జాతీయవాదం మరియు జాతీయభావం.

19వ శతాబ్దపు భారతీయ నాయకులనేకులు భారతదేశంలో బ్రిటిష్‌వారి జోక్యాన్ని దైవదత్తంగా భావించారు. పాత ఆచారాలు, భావాల నుండి బయటకు వచ్చేందుకు వారి పాత్ర సహాయకారిగా అవుతుందని ఆశించారు. ఒక సమయంలో అంబేద్కర్ కూడా అదే ధోరణిలో ఆలోచించారు. ఇతర లోపాలు, నష్టాలే కాకుండా, బ్రిటిష్ పరిపాలకుల వలన రెండు ప్రయోజనాలు కూడా భారతీయులకు కలిగాయి. అవి ఒకటే కేంద్ర ప్రభుత్వం, ఆ ఒకే ప్రభుత్వానికి చెందిన వారమనే భావన అన్ని మతాలకు చెందిన ప్రజలకు కలగటం. ఆయన ఈ విషయానికిగాను బ్రిటిష్ ప్రభుత్వానికి కృతజ్ఞతలను తెలిపారు. ఆయన బ్రిటిష్ పరిపాలనను ద్వేషించటం వలన తన ప్రజలు ఎదుర్కోవలసి వచ్చే జంట వైరాలను గుర్తించగలిగారు. కాబట్టి ఆయన ఆ హక్కులను సాధించే వీలును పొందే పరిధిలో బ్రిటిష్ పరిపాలనకు సహకరించటం సబబుగా ఉంటుంది అని భావించారు.

అంబేద్కర్ జాతీయవాదం నిమ్న, పేదవర్గాల సంక్షేమమనే మరో ప్రయోజన సాధన కోసం ప్రారంభమైంది. ఆయన వారు శతాబ్దాలుగా పొందలేని సమానత్వాన్ని, పౌరహక్కులను

పొందాలని ఆశించారు. ఆయనకు తన దేశం గొప్పతనం పట్ల, తన జాతి ప్రజల ఆత్మగౌరవం పట్ల పూర్తి విశ్వాసం ఉంది జాతీయవాదం ఆయనలో విదేశీ ఆధిపత్యం, అంతర్గత దోపిడీల నిరసనతో మొదలయింది. లక్షలాది ప్రజల సంక్షేమ బాధ్యతని బ్రిటిష్ పరిపాలన నిర్లక్ష్యం చేసిందన్నారు. అణగారిన వర్గాలకు సమాజంలో ఏ రకమైన భాగస్వామ్యమూ లేదని, ఆ పేద ప్రజలకు ఉన్నదల్లా బానిస, అర్థబానిసల మధ్యన ఉన్న స్థాయి మాత్రమేనని అన్నారు. అంటకట్టబడిన దాస్యం, మానవ సంబంధాలకు దూరంగా ఉంచటానికి కల కారణం అంటరానితనమని అన్నారు. అంటరానితనమంటే, సామాజిక జీవన విధానంలో వివక్షతే కాకుండా అవసరమైన అవకాశాలనందుకునే పూర్తి సమానత్వాన్ని, మౌలిక మానవ హక్కులను లేకుండా తయారుకావించబడ్డ విధానంగా అభివర్ణించారు మన సొంత ప్రభుత్వం మాత్రమే మొత్తం జీవన సామాజిక ఆర్థిక సూత్రాలను సరిచేసి సవరించగలదని, బ్రిటిష్ ప్రభుత్వం అటువంటి విధానాన్ని అమలు జరుపలేదని అన్నారు 'అది ప్రజల, ప్రజల కొరకు, ప్రజల చేత ఎన్నుకోబడ్డ ప్రభుత్వం వలన మాత్రమే నెరవేరుతుంది' అంతేకాదు, అగ్రకులాలతో తనకు కొన్ని అంశాలలో విభేదాలు ఉన్నప్పటికీ, దేశరక్షణ కోసం తన ప్రాణాలను కూడా ఫణంగా పెట్టటానికి సిద్ధమని ఎలాంటి సందేహాలకు తావివ్వకుండా చెప్పారు. తన ప్రజల పట్ల, దేశం పట్ల గల ఆత్మగౌరవ అభిజాత్యాలు ఆయనలో జాతీయతా భావాన్ని కలిగించాయి.

ప్రపంచమంతా అనుకునేట్లుగా బ్రిటిష్‌వారు సామాజిక మతపర విధానాలలో తటస్థంగా ఉంటారనే భావం నిజం కాదని అంబేద్కర్ స్పష్టపరిచారు 'బ్రిటిష్ ప్రభుత్వం తన పూర్తి శక్తియుక్తులను ఉపయోగించి, అణగారిన ప్రజల హక్కులను పునరుద్ధరించేందుకు, అప్రజాస్వామికంగా వారి మానవహక్కులను నిరాకరించే అంటరానితనాన్ని దెబ్బతీసేందుకు ఎటువంటి చొరవనూ చూపించలేకపోయింది' అని చెప్పారు. భారతీయులు రాజకీయ అధికారాన్ని సాధించగలిగినప్పుడే, ఆ అధికారం సామాజికంగా అణగార్తుల చేతుల్లోకి వచ్చినప్పుడే సామాజికంగా, న్యాయపరంగా, సాంస్కృతికంగా ఆ వర్గం గురికాబడేందుకు కారణమైన అనర్హతలను తుడిచిపెట్టటం సాధ్యమవుతుంది. ఆయన ఒక దేశ స్వాతంత్ర్యానికి, ఆ దేశ ప్రజల స్వేచ్ఛకూ ఉన్న, పశ్చిమదేశాల రాజకీయ విశ్లేషకుల దృష్టికి రాని తేడాను స్పష్టంగా తెలియచెప్పారు. స్వేచ్ఛ లేని జాతీయతావాదం, పేద బడుగు వర్గాలను అంతర్గత బానిసత్వానికి దోపిడీకి గురిచేసే సాధనంగా ఉపయోగపడుతుంది దాని ముఖ్య ఉనికల్లా ప్రజల స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు.

అంబేద్కర్‌కు బ్రిటిష్ వారి మాటలలో వ్యక్తపరిచే ప్రజాస్వామ్య స్వాతంత్ర్యాల పట్ల విశ్వాసం ఉండేది కాదు. తాను హిందూ అగ్ర కులస్తులతోనూ. బ్రిటిష్‌వారితోనూ కూడా రాజకీయ హక్కుల సాధన కోసం పోరాడాలనే విషయం ఆయనకు తెలుసు. ఆయనిలా స్పష్టపరిచారు, 'మన దేశస్వాతంత్ర్యం కోసం మాత్రమే మన దృష్టిని కేంద్రీకరించి, అంతకన్నా గంభీరమైన సమస్య అయి, సామాజిక ఆర్థిక స్వాతంత్ర్యాలను నిర్లక్ష్యం చేయటం ఘోరతప్పిదమవుతుంది. రాజకీయ స్వాతంత్ర్యాన్నే సర్వతోముఖ స్వాతంత్ర్యంగా భావించటం ఆత్మహత్యాసదృశ్యమాన మవుతుంది.' రాజకీయంగానే కాక, సామాజికంగా కూడా దేశ ఐక్యత ఆయనకున్న ముఖ్య ఆశయం. పరప్రభుత్వంతో వైరం కన్నా కూడా, ఐక్యత ఆయన దృష్టిలో ఎంతో ఉన్నత గమ్యంగా రూపుదిద్దుకుంది.

మరాఠీ మాతృభాషగా కల అంబేద్కర్ హిందీ మాట్లాడే రాష్ట్రానికి చెందినవాడు కానప్పటికీ, ప్రజస్వామ్యం అమలుకు, జాతుల వైషమ్యాలనూ, సామాజిక ఒత్తిళ్లను తొలగించే బాటను సుగమం చేసేందుకు ఉపకరించే విధంగా దేశప్రజలందరూ ఒకే భాషను అంగీకరిస్తారనే నమ్మకం ఆయనకు ఉండేది. హిందీ ఒకే ఉమ్మడి భాషగా ఉంటే రెండు విషయాలు సాధ్యమనుకున్నారు, ఒకటి – ఐక్యతా భావం, రెండవది – జాతీయభావం. ఆయనకు భారతీయ సాంస్కృతిక సమైక్యత పట్ల అపార విశ్వాసం ఉండేది సాంస్కృతిక సమైక్యత రాజకీయ, కుల విభజనలను దాటి మనగలిగిందని పేర్కొన్నారు.

అంబేద్కర్ అంచనాలో కులవ్యవస్థకున్న ముఖ్య లక్షణం – సంకుచిత ప్రయోజనాలు, ఆచారాలు, శుష్క నినాదాలతో కూడుకున్న గుంపుతత్వం. అది అరాచక కార్యకలాపాలను సృష్టిస్తుంది ప్రాంతీయ భాషా కులమత తత్వాలతో పోరాడవలసిన ముఖ్య ఆవశ్యకతను ఆయన గట్టిగా చెప్పేవారు. ఆయన దృష్టిలో కులతత్వం జాతీయభావ చైతన్యానికే విరుద్ధం 'కులం సార్వజనీన ఔదార్యాన్నే నాశనం చేసింది. కులం ప్రజాభిప్రాయానికి తావు లేకుండా చేసింది సౌజన్యశీలతపై కులం స్వారీ చేస్తోంది, నీతినియమాలు కులచట్రంలో ఇరుక్కు పోయాయి ' ఈ కులాభిమానమే మతతత్వానికి జన్మనిస్తుంది. ఆయన దృష్టిలో జాతీయవాదం కులతత్వాన్ని నిరాకరిస్తుంది, కులతత్వం అంటే వేళ్ళు పాదుకుపోయిన మతతత్వం ఆయన మతదురభిమానాన్ని జాతీయ సమైక్యతను నిర్వీర్యం చేసేదిగా భావించారు. సమాజంలో వర్ణకులజాతి వివక్షత లేకుండా అందరిలోనూ సోదరభావం విలసిల్లితే జాతీయభావం పరిపూర్ణతను సంతరించుకుంటుందని ఆయన నమ్మకం.

అంబేద్కర్ సంఖ్యాబలం పునాదిగా కల జాతీయవాదం పట్ల తన భావాలను వ్యక్తపరిచారు. 'ఆయన దృష్టిలో భారతీయ జాతీయవాదం ఒక నూతన పంథాను అభివృద్ధి కావించింది, దానినే భగవద్దత్తమైన హక్కుగా మెజార్టీ వర్గం, వారి స్వంత ప్రయోజనాలకు అనుగుణంగా మైనార్టీలను పాలిస్తూ, పాలనాధికారంలో పాలు పంచుకునేందుకు తమ హక్కులను కోరే వారిని మత లేక కులతత్త్వవాదులుగా ముద్రవేస్తూ, పూర్తి అధికారాన్నంతా తమ గుప్పెటలో ఉంచుకునే ప్రక్రియే జాతీయభావం.' మతం జాతీయతల పేరిట చేసుకుంటున్న ఆత్మవంచన, జరుపుతున్న అణిచివేత ధోరణిని ఆయన తూర్పారబట్టారు. ఆయన దృష్టిలో దేశభక్తి జాతీయభావాలంటే, ఆర్థిక, సామాజిక, రాజకీయ సాంస్కృతిక సమానత్వం, స్వేచ్ఛ, ఇంకా సచ్ఛీలతలు. జాతీయవాదమంటే బానిసత్వం నుండి పరతంత్ర పాలన నుండి అన్ని దేశాల విముక్తే కాదు, స్వతంత్ర దేశాలలోని పౌరులందరి మరియు పరాధీనతకు లోనయిన అణగార్తులందరి విముక్తి కూడానని ఆయన భావించారు.

రాజకీయవాదులు 'భారతీయ ప్రజలు' అన్న మాటను రాజ్యాంగ సభలో నిరసించారు.వారు దానికి బదులుగా 'భారత జాతి' అన్న పదానికి మొగ్గ చూపారు. అంబేద్కర్ వారిని, 'అనేక వేల వర్ణాలుగా చీలిపోయిన ప్రజలు ఒకే జాతిగా ఎలా అవుతారు' అని ప్రశ్నించారు. అంతేకాకుండా మనం సామాజిక దృక్పథంలో, మానసిక పరంగా ఒక జాతిగా ఇంకా ఎదగలేదన్న నిజాన్ని ఎంత త్వరగా గ్రహిస్తే అంత మంచిదని చెప్పారు.

సైమన్ కమీషనులో భారతీయులెవరూ ప్రతినిధులుగా లేరు, అందువల్ల భారత జాతీయకాంగ్రెసు జాతీయవాదులందరినీ దానిని బహిష్కరించవలసినదిగా కోరింది. దానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలను నిర్వహించింది. అటువంటి ప్రదర్శనలే బొంబాయిలో జరిగాయి. అదే కాలంలో అంబేద్కర్ గవర్నమెంట్ న్యాయ కళాశాలలో ప్రొఫెసర్‌గా ఉన్నారు. ఆయన ఆ కమీషన్‌కు సహకరించే ఉద్దేశ్యంతో, బొంబాయిలో ఏర్పాటు చేసిన కమిటీలో సభ్యుడిగా పాల్గొనేందుకు తన అంగీకారాన్ని తెలిపారు. అదే కాలేజీలో విద్యార్థులుగా ఉన్న యూసఫ్ మర్చంట్, అల్వాలు యువజనోద్యమాలలో పాల్గొనేవారు. వారు మిగతా కొద్దిమంది విద్యార్థులతో సహా, అంబేద్కర్ కమీషన్‌తో సహకరించి, దేశానికి ద్రోహం చేస్తున్నాడని గట్టిగా విశ్వసించారు. ఆయనను రాజకీయంగా పరిపాలకుల దయాదాక్షిణ్యాల కోసం వెంపర్లాడే రాజకీయ బిచ్చగాడిగా భావించారు. అంబేద్కర్ వారి సందేహాలను నివృత్తి చేస్తూ, 'ఆ కమిటీలో నేనెల్లప్పుడూ ప్రజల శ్రేయస్సు కోసమే నిలబడ్డాను, కాని ప్రజల చేతిలోని అధికారం ఎప్పుడు దుర్వినియోగమవుతుందో అప్పుడు నేను ప్రస్తుతమున్న ప్రభుత్వాన్ని బలపరిచేందుకు వెనుకాడను' అని అన్నారు.

అంబేద్కర్ 1930లో గాంధిజీ ప్రారంభించిన సహాయ నిరాకరణోద్యమాన్ని వ్యతిరేకించారు. ఆ ఉద్యమం నిర్వహించేందుకు అది ఏమాత్రం సరైన సమయం కాదని ఆయన భావించారు. బ్రిటిష్ అధికారాన్ని తొలగించలేదు కనుక ఆ ఉద్యమం ఒక తిరుగుబాటు చర్యగా పరిగణించలేమని ఆయన వ్యాఖ్యానించారు. క్విట్ ఇండియా ఉద్యమ సందర్భంగా కూడా ఆయన ఇలాంటి వైఖరినే అవలంభించారు. ఆయన గాంధీజీ సంపూర్ణ తిరుగుబాటు ఉద్యమాన్ని ఆలోచనలేని బాధ్యతారాహిత్య చర్యగానే కాక, రాజకీయ దివాళాకోరుతనాన్ని, ప్రపంచయుద్ధం తరువాత తగ్గిపోయిన కాంగ్రెసు ప్రతిష్టను కాపాడుకునే ప్రయత్నంగా అభివర్ణించారు. 'యుద్ధోన్మాదులు దేశంలో ప్రవేశించి, ఆక్రమించే ప్రయత్నం చేస్తున్న తరుణంలో, అంతర్గతంగా శాంతభద్రతలను బలహీనపరచటం పిచ్చితనం. యుద్ధంలో ప్రజాస్వామ్యం విజయం సాధిస్తే, భారతదేశ స్వాతంత్ర్య సముపార్జనను ఎవరూ ఆపలేరు.' 1942 అగస్టులో ప్రభుత్వం తీవ్రమైన చర్యలు చేపట్టక పోయి ఉంటే, దేశం జపాన్, జర్మనీల హస్తగతమయ్యేదని ఆయన అన్నారు. అంబేద్కరీయులు ఆ ఉద్యమానికి దూరంగా ఉండి, తమ ప్రయత్నాలను యుద్ధ సన్నాహాల వైపుకు మరలించారు.

అంబేద్కర్ ధోరణి సహాయనిరాకరణోద్యమానికి వ్యతిరేకంగా ఉన్నప్పటికీ, పెరుగుతున్న జాతీయవాదుల ప్రభావం ఆయనపై ఉంటూనే ఉంది. దేశమంతటా ఉప్పు సత్యాగ్రహం జరుగుతున్న తరుణంలో (1930) అది బహుముఖంగా తన ప్రభావాన్ని చూపింది. దేశంలోని అడవులంతటా సత్యాగ్రహం మొదలయింది. మహారాష్ట్రలోని కొలాబా జిల్లాలో గల చిర్నార్ అడవిలో సత్యాగ్రహం 25 సెప్టెంబర్ 1930లో మొదలయింది. అప్పుడు అక్కడ కాల్పులు, మరణాలు అరెస్టులూ జరిగాయి. అంబేద్కర్ 16 మార్చ్ 1931లో దోషులుగా నిలబెట్టిన నలుగురి తరుపున న్యాయవాదిగా కోర్టుకు హాజరయి, గొప్పగా వాదించారు. చిర్నార్ విచారణలో ఆయన అందచేసిన సేవల ద్వారా చూపించిన దేశభక్తికి ప్రజలు ఆయనకు కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

దేశంలో ప్రారంభమైన ఉద్యమాలకు అంబేద్కర్ దూరంగా ఉన్నా, ప్రభుత్వాన్ని ఎల్లప్పుడూ సమర్ధించలేదు. దేశంలోని అంతర్గత దురదృష్టకర పరిస్థితిని ప్రపంచంలో బ్రిటిష్ పాలన ప్రచారం చేయటం రాజకీయంగా మన దేశ ప్రయోజనాలను అడ్డుకునే ప్రయత్నం తప్ప ఆ పరిస్థితిని తొలగించేందుకు కాదని ఆయనకు తెలుసు. బ్రిటిష్‌వారి విదేశీపాలనలో మన పరిస్థితులలో ఎటువంటి మార్పూ రాదు. ఆయనిలా చెప్పారు:

'అంటరానితనాన్ని తొలగించేందుకు బ్రిటిష్ ప్రభుత్వం ఏ చర్య అయినా చేపట్టిందా? గ్రామాలలో అంతకు పూర్వం మీరు నీరు తోడుకోలేకపోయేవారు, ఆ హక్కును వారు మీకు కల్పించారా? వారి పాలనకు ముందు మీకు దేవాలయాలలోకి ప్రవేశించే హక్కు లేదు. ఇప్పుడు వెళ్ళగలరా? పోలీసు బలగంలో కానీ, సైన్యంలో గానీ అంతకు పూర్వం మీకు ప్రవేశం లేదు ఇప్పుడు ఉందా? అయ్యలారా, ఈ ప్రశ్నలన్నింటికీ మీ వద్ద అవునన్న సమాధానం లేదు.'

అంటరానివారి పరిస్థితిలో ఖచ్చితంగా ప్రాధమికంగా ఎటువంటి మార్పూ లేదు అని ఆయన పేర్కొన్నారు. అంతే కాక, ఆయనిలా చెప్పారు:

"ఎవరూ మీకన్నా మిన్నగా మీయొక్క కష్టనష్టాలను తీర్చలేరు, వీటన్నింటినీ మీకు మీరుగా తీర్చేకునేందుకు మీకు రాజకీయ అధికారం ఉండాలి. బ్రిటిష్ ప్రభుత్వం ఇలాగే అధికారంలో కొనసాగినంతకాలం మీకు అధికారంలో భాగస్వామ్యం ఉండదు. మీ ప్రజల విముక్తిని సాధించేందుకు అవసరమయిన ఆ అధికారం పొందగలిగే వీలు ఏమాత్రం ఉన్నా, అది స్వరాజ్య రాజ్యాంగంలో మాత్రమే ఉన్నది."

అణగార్చబడిన వర్గాల ప్రయోజనాలు, వారి విముక్తిని ఉమ్మడి జాతీయ ఉద్యమంతో ఆయన అనుసంధానం చేసారు. ఆయన ఈ భావాలను సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలుగా సత్యాగ్రహాలు మరియు సహాయనిరాకరణోద్యమాలకు చెందిన ఆలోచనలు ద్వారా గాంధీజీ నాయకత్వంలో రూపు దిద్దుకుంటున్న సమయంలో వ్యక్తపరిచారు కాని ఇంత గొప్ప వ్యవస్థ బ్రిటిష్ వ్యతిరేక భావం దాస్యవిముక్తిని సాధించే ఉమ్మడి జాతీయపోరాట స్థాయిను అందుకోలేకపోయింది జాతీయ విధానం నుండి దూరమైన ఒంటరితనాన్ని ఆయన జాతీయ వ్యతిరేకత దానివల్ల కలిగిన బ్రిటిష్ అనుకూలతా భావాల వ్యక్తీకరణగా భావించారు. ఈ ఉద్యమ వ్యతిరేక ధోరణి అణగార్చబడిన వర్గాలలో ఆ కాలంలో ఉండేది.

విదేశీ ప్రభుత్వంతో అవసరమైనప్పుడు సహకరిస్తూ, అలాగే జాతీయ శక్తులను ప్రత్యక్షంగా విమర్శించకుండా ఉండటమనే అంబేద్కర్ అనుసరించిన విధానాలకు నిర్దేశక మార్గాలుగా ఉండేవి. రెండవ ప్రపంచయుద్ధం ప్రారంభమవగానే ఆయన బ్రిటిష్ ప్రభుత్వానికి ఎట్టి మినహాయింపులూ లేని మద్దతు పలికారు. ఆయన ఈ యుద్ధాన్ని నియంతృత్వానికి, ప్రజాస్వామ్యానికి మధ్య జరిగే యుద్ధంగా వర్ణించారు ఆయన దృష్టిలో నియంతృత్వం జాతీయదురహంకారంపై తప్ప మరే ఇతర నైతికాంశాలపై ఆధారపడ్డది కాదు. ఆయన నాజీలకు వ్యతిరేకంగా పోరాడమని శ్రామికవర్గానికి పిలుపునిచ్చారు. నాజీయిజం గెలుపొందితే, స్వేచ్ఛ

అణిచివేయబడి సమానత్వానికి చోటు ఉండదని చెప్పారు. యుద్ధం తరువాత బ్రిటిష్‌వారి ఆధిపత్యం బలహీనపడుతుందని, స్వాతంత్ర్యం మరియు నూతన సామాజిక విధానాలు యుద్ధవిజయ ఫలాలుగా అందుతాయని ఆయన ఆశించారు. యుద్ధనిర్మూలనకు యుద్ధంలో విజయం అవసరమని, అప్పుడే శాంతి నెలకొల్పబడుతుందని ఆయన అన్నారు.

1945లో కాంగ్రెసు నాయకుల విడుదల తరువాత, తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు ఎజెండాగా ఉంది. ముస్లింలీగ్ మరియు జిన్నా ప్రదర్శించిన పట్టుదల దానికి ప్రతిబంధకంగా మారింది. కొందరు వ్యక్తులు కాంగ్రెసు, అంబేద్కర్‌ల మధ్య సయోధ్యను కుదిర్చేందుకు ప్రయత్నం చేసినా ఆయన కాంగ్రెసు వ్యతిరేక ధోరణి మారలేదు. ఆయన ఇలా చెప్పారు, 'ఆత్మగౌరవం లేని వారు మాత్రమే కాంగ్రెసుతో సహకరిస్తారు. ఇతర ఏ కాంగ్రెసు సభ్యుని కన్నా కూడా నేను మరింత గొప్ప జాతీయవాదిని.' ఆయన ఉద్దేశ్యంలో స్వాతంత్ర సమస్య పరిష్కారాన్ని మత సమస్యతో బ్రిటిష్ పరిపాలకులు ముడిపెట్టారు. ఆయన భారతదేశానికి రాజకీయ స్వాతంత్ర్యం ప్రాముఖ్యతను గట్టిగా చెప్పారు. వివిధ మతాల సమ్మతిపై స్వాతంత్ర్య సమస్య ఆధారపడటం అంటే నిరవధికంగా దాని పరిష్కారాన్ని వాయిదా వేయటమేనని పేర్కొన్నారు.

ఇంగ్లీషువారు భారతదేశంలో తన అధికారాన్ని వదులుకుని వెనుతిరుగుతారు అని అందరూ భావిస్తున్న వాస్తవం అంబేద్కర్‌ను కాంగ్రెసు పట్ల కొంత రాజీ ధోరణికి పురిగొలిపింది. దేశవిభజన తదుపరి దేశ విశ్వాసాన్ని చూరగొనగల, దేశాన్ని పాలించగల రాజకీయ సంస్థ కాంగ్రెసు మాత్రమేనని స్పష్టమయింది. రాజ్యంగాన్ని ఆవిష్కరిస్తూ అంబేద్కర్ భారతదేశం రాజకీయాలలో సమానత్వాన్ని సాధించగలిగింది కాని సామాజిక ఆర్థిక రంగాలలో మాత్రం అసమానతలు అలాగే ఉండిపోయాయని చెప్పారు. సత్వరమే ఈ వైరుధ్యాన్ని తొలగించవలసినదిగా కోరారు. 'అలా చేయకుంటే ఈ రాజ్యంగ సభ ఎంతో శ్రమకోర్చి సమకూర్చిన రాజకీయ ప్రజాస్వామ్యం యొక్క నిర్మాణం కూలిపోతుంది' ప్రజలు ఈ రాజకీయ ప్రజాస్వామ్యాన్ని సామాజిక ఆర్థిక ప్రజాస్వామ్యంగా మలచాల్సిన ఆవశ్యకత ప్రాముఖ్యతను తెలిపారు. ప్రజలు మతం కంటే దేశం ముఖ్యమనుకుంటారా లేదా దేశం కంటే మతం ముఖ్యమనుకుంటారా అన్నదే మన దేశం ఎదుర్కొంటున్న సమస్య. 'రాజకీయ సంస్థలు మతాన్ని దేశం కంటే ముఖ్యమనుకుంటే, మన స్వాతంత్ర్యానికి ముప్పు వాటిల్లుతుంది...బహుశా ఎప్పటికీ దానిని కోల్పోతాం కూడా.' కాబట్టి ప్రజలు ఖచ్చితంగా నిర్ణయించుకోవాలి, 'మన చివరి రక్తపుబొట్టుతో కూడా మన స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవాలి.' ఇప్పటి వరకూ ప్రజలు బ్రిటిష్ ప్రభుత్వాన్ని నిందిస్తూ వచ్చారు, ఇప్పుడిక జరిగిన ప్రతి తప్పుకూ నిందించేందుకు అవకాశం లేదని హెచ్చరించారు.

అంబేద్కర్ అందించిన నినాదం, 'పాలక జాతిగా మనండి.' ఆయన నిమ్నవర్గాలను ఒక రాజకీయసైన్యంగా మలచి వారి రాజకీయహక్కుల కోసం తెచ్చిన ఒత్తిడి వల్ల 1935లో రాజ్యాంగం వారికి ప్రత్యేక ప్రాతినిధ్యం కలిపించింది. భారత ప్రజలు రాజకీయ అధికారాన్ని పొందలేకపోతే ఆ అధికారం సమాజంలోని బలహీనుల చేతుల్లో కేంద్రీకృతమవుకుంటే, ఆ వర్గాలకున్న అన్ని రకాల సామాజిక న్యాయ సాంస్కృతిక బలహీనతలను పూర్తిగా తుడిచిపెట్టటం అసాధ్యమని ఆయన తలచారు.

అస్పృశ్యతా నిర్మూలన భారతసమాజపు ప్రాథమిక సామాజిక ఆర్థిక పునర్నిర్మాణంతో ముడిపడిన సమస్య. ఒక ఉద్యమంగా రూపొంది, తరువాత ఊపందుకున్న అస్పృశ్యతా వ్యతిరేకత పురోగమిస్తున్న భారతీయుల జాతీయ ప్రజాస్వామ్య ఉద్యమం యొక్క భావవ్యక్తీకరణ మరియు దాని ముఖ్యభాగం. అస్పృశ్యతని రూపుమాపటాన్ని ఒక కార్యక్రమంగా కాంగ్రెసు ఉద్యమంలో రూపొందటంతో ప్రక్షాళనా ఉద్యమాలు వేగవంతమయ్యాయి. స్వరాజ్య సమరానికి కుల మతాలన్నింటి ప్రజాస్వామ్య ఐక్యత అవసరమయింది. అంటరానివారిలో ఎక్కువమంది భూమిలేని కూలీలు, అర్ధబానిసలూ లేదా నికృష్టమైన పనులకు వినియోగించబడ్డవారు. వారు సామాజిక, ఆర్థికపరమైన రెండురకాల చెడుల వలన బాధలననుభవించారు. వారి సామాజిక స్థితి వారిని దోపిడికి గురిచేసేందుకు ఆలంబనయితే, వారి ఆర్థికస్థితి వారి సామాజిక స్థితిని అలాగే నిలకడగా కింది స్థాయిలోనే కొనసాగించేందుకు ఊతమయింది.

బ్రిటిష్ పరిపాలనా కాలంలో, భారతీయులలో ప్రాథమిక మానవ హక్కుల పట్ల పెరిగిన చైతన్యం సాధారణ జాతీయ ప్రజాస్వామ్య ఉద్యమంలో ఒక భాగంగా రూపొందింది. ఉన్నత వర్గాలలోని కొందరి మానవీయతా ధోరణులు, ఆర్థిక శక్తులు, పెరుగుతున్న పారిశ్రామిక నాగరికత, అంతేకాక ఆధునిక విద్యలు అంటరానితనం పట్ల ఉన్న అపోహలను బలహీనపరిచేందుకు తోడ్పడ్డాయి. భారత ప్రభుత్వ చట్టం 305కు లోబడి ఏర్పడిన కాంగ్రెసు మంత్రివర్గపు ఏర్పాటు, ఒక ప్రతిపక్షపార్టీ నేత యొక్క పాత్రలు అంబేద్కర్‌ను కొన్ని అంశాలపై నిర్దిష్ట వైఖరిని అవలంభించేలా చేశాయి. 1938లో బొంబాయిలోని కాంగ్రెసుపార్టీ సమ్మె వ్యతిరేక చట్టాన్ని ప్రవేశపెట్టటంపై అతివాదపార్టీలు తమ నిరసనను తెలియజేశాయి. అప్పుడు అంబేద్కర్ కమ్యూనిస్టులతోనూ, ఇతర కార్మికసంఘాల నాయకులతోనూ కలిసి బొంబాయిలో కార్మికుల సమ్మెను విజయవంతం చేశారు. ప్రజల కోర్కెలను వెల్లడించే సమయంలోనూ, వారికి నాయకత్వం వహించే సమయంలోనూ, అంబేద్కర్ తనను అనుసరించే వారి కన్నా ఎంతో ముందు ఉండేవారు. కాని ప్రజా ఉద్యమాల మద్దతు లేని సందర్భాలలో ఆయన ఒంటరి అయ్యేవాడు, ఆయనలో ప్రభుత్వానుకూల ధోరణులు మరింత ప్రస్ఫుటమయ్యేవి.

గాంధీజీ ఎగిసిపడుతున్న భారతీయ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటానికి సంకేతం. అనేక జాతీయ ఉద్యమాలను ప్రారంభించి నాయకత్వం వహించి వాటి ద్వారా ప్రజలను కూడగట్టేవారు. సత్యాగ్రహం, శాసనోల్లంఘన సహాయనిరాకరణోద్యమాలు, జాతీయ విద్య వంటి కార్యక్రమాలను జాతీయ విమోచన పోరాటానికి ప్రజలను ఉద్యమింపచేసే శక్తివంతమైన ఆయుధాలుగా ఆయన ఉపయోగించారు. గాంధిజీ కాంగ్రెసుకు నాయకుడు, కాదు, నాయకులకే నాయకుడు. ఆయన మాట వేదవాక్కు. వందలూ వేలల్లో ఆయన ద్వారా ఉత్తేజితులైన ప్రజల శక్తియుక్తులకు కాంగ్రెసు వాహిక అయింది. కాంగ్రెసు సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తుల ఆయుధమయ్యింది.

ఈ నేపథ్యంలో అంబేద్కర్ గాంధీజీ కాంగ్రెసులపై చేసిన విమర్శలు, స్వరాజ్య పోరాటంపై వెలిబుచ్చిన అసభ్య వ్యాఖ్యానాలు ప్రజల మనోభావాలను దెబ్బతీశాయి. అనేకమంది నాయకులు ఆయనను జాతివ్యతిరేకిగా, బ్రిటిష్ పాలకుల తొత్తుగా నిందించారు. జాతీయ నాయకులందరితో పాటు జాతీయ సంస్థలన్నీ సైమన్ కమిషన్‌ను బహిష్కరించాయి. కాని

అంబేద్కర్ కమీషన్ ముందు తన సాక్ష్యాన్ని ఇచ్చారు. న్యాయకళాశాలలోని ఆయన విద్యార్థులు ఆయనకు వ్యతిరేకులయ్యారు, ఆ సమయంలో ఆయనను జాతి వ్యతిరేకిగా తలచారు.

గాంధీజీ మరియు కాంగ్రెసులు జాతికి ప్రాతినిధ్యం వహించేందుకు ప్రయత్నిస్తూ ఆ ప్రాతినిధ్యతను కాంగ్రెసు సంస్థ మాత్రమే వహించాలని వాంఛించారు. అలా మాత్రమే భారతీయ స్వాతంత్ర్య పోరాటం ఒక్కటిగా పదునెక్కి, ఐక్యతతో వాంఛించే స్వాతంత్ర్య సిద్ధికి అన్ని రకాల మద్దతు లభిస్తుంది. సంఘటిత శ్రేణులలో వేర్పాటుకు చోటు ఉండదు ఈ విధానం విభజించి పాలించే సామ్రాజ్యవాద విధానాన్ని తిరుగులేని దెబ్బ తీస్తుంది. 1931లో రౌండ్ టేబుల్ సభలో గాంధీజీ కాంగ్రెసు నాయకుడిగా తాను మాత్రమే అంటరానివారికి ప్రాతినిధ్యం వహించాలని పట్టుబట్టారు. కాని ఇది అంబేద్కర్ ఆత్మాతిశయాన్ని గాయపరిచింది. ఆయన కాంగ్రెసునూ, గాంధీజీని వదిలి బయటకు వచ్చి, ఇండిపెండెంట్ లేబర్ పార్టీని మరియు షెడ్యూల్డ్ కులాల ఫెడరేషన్‌లను ఏర్పాటు చేశారు.

ఇప్పుడో ప్రశ్న ఉదయిస్తున్నది : ఇంత పెద్ద జాతి జాతీయ పోరాటానికి ఎందుకు దూరమైంది? ఏ కారణం వారిని వేర్పాటు ధోరణులకు మద్దతు ఇచ్చే దిశగా పురిగొల్పింది? ఈ మొత్తం పరిణామాన్ని వారు ఏవిధంగా విశ్లేషిస్తున్నారు?

ఈ చేదు భావాలే స్వాతంత్రోద్యమ కాలంలో మిగిలిన భారతీయులకు అణగారిన వర్గాలు దూరమయ్యేందుకు ముఖ్యకారణమయ్యాయి అంబేద్కర్ వట్టి రాజకీయ స్వాతంత్ర్యం మాత్రమే సరిపోదని, సామాజిక విముక్తి కూడా సాధించాలని ఎల్లప్పుడూ చెబుతూ ఉంటారు. స్వాతంత్ర్య సముపార్జన తరువాత ఆయన తన ఆలోచనను మార్చుకొని, తన సహచరులకు సమాజంలోని ఇతర వర్గాలతో సహకరించవలసినదిగా సూచించారు. ఈ ఆలోచనా విధానమే ఆయనను రాజ్యాంగ సభలోనూ, తరువాత నెహ్రూ మంత్రివర్గంలోనూ ప్రవేశించేలా చేసింది.

## సెక్షన్-2

### జాతీయ నాయకత్వం

భౌతిక శక్తులు చరిత్రను సృష్టించటాన్ని నిర్ణయించే అంశాలని అంబేద్కర్ అభిప్రాయం, కాని భావరహిత శక్తులను మనిషి ప్రభావితం చేస్తాడన్న విషయాన్ని అంగీకరించాలి. ఆయన దృష్టిలో చరిత్రను సృష్టించటంలో మహా వ్యక్తుల పాత్ర ఉంటుంది. ఆయన దృక్పథంలో మనిషి కాలం రూపుదిద్దిన ప్రాణి అనే సిద్ధాంతం చరిత్రకు చెప్పిన తప్పుడు వ్యాఖ్యానం.

మహావ్యక్తులకుండే మొదటి లక్షణం నిష్కాపట్యం. ఆయన దృష్టిలో నిష్కాపట్యం మేథోసంపదలు లేకుండా ఏ ఒక్కరూ మహాత్ములు కాలేరు. ఒక మహాత్ముడు, ఒక ప్రఖ్యాత వ్యక్తి – ఇద్దరిలో ఒక తేడా ఉంది. మహాత్ముడు సంక్షోభంలో ఉన్న సమాజాన్ని రక్షించేందుకు మార్గాన్ని కనుగొంటాడు. సమాజ ప్రయోజనశీలత అతడ్ని ప్రభావితం చేస్తుంది. సమాజానికి ఒక కొరడాలా, మలినాన్ని తొలగించేవాడిగా మనగలగాలి. అంబేద్కర్ విగ్రహాలను ఆరాధించేవాడు కాదు. వాటిని పగలగొట్టడంలో నమ్మకం ఉన్నవాడు. ఆయన దృష్టిలో దేశం

మహాత్ముల కన్నా గొప్పది మహాత్ములను ఆరాధించటం, దేశ సేవ చేయటం - రెండూ వేరు వేరు విషయాలు, అంతేకాక రెండూ విరుద్ధ అంశాలు.

అంబేద్కర్ భావంలో, జస్టిస్ ఎమ్. జి రానడే ధీమంతుడు, కలుపుగోలుతనం దయ కలిగిన బహుముఖ ప్రజ్ఞాశాలి.

మహరులకు చెందిన అధికారికంగా, అనధికారికంగా నియుక్తులయిన సైనిక ఉద్యోగులు కొందరు సైన్యంలో మహర్లకు ఉద్యోగాలను ఇవ్వటాన్ని నిషేధిస్తూ1892లో జారీ చేయబడ్డ ఉత్తరువుల ఉపసంహరణను కోరుతూ భారత ప్రభుత్వానికి ఒక పిటిషన్ పంపారు వాకబులో ఆ పిటీషన్‌ను రానడే మహర్ల సమస్యకు పరిష్కారం కోసం తయారు చేసినట్లు తెలిసింది

రానడేలో ఆయనకున్న అన్ని గుణాలను కలబోస్తే తేలేది ఆయనలోని నిజాయితీ. వకీలుగానే కాక, హైకోర్టు జడ్జిగా కూడా ఆయన మేధోసంపత్తి గొప్పది. ఆయన ప్రధమ శ్రేణికి చెందిన అర్ధికవేత్త, ప్రధమశ్రేణికి చెందిన చరిత్రకారుడు, ప్రధమశ్రేణి విద్యావేత్త, ప్రధమశ్రేణి మహాత్ముడు ' రాజకీయవేత్త కానప్పటికీ, ఆ రంగంలో అపారజ్ఞానమున్న విద్యార్ధి. 'భారతీయ చరిత్రలో ఏ ఒక్కరూ విషయపరిజ్ఞానపు లోతులో, మేధోసంపత్తి వైశాల్యంలో, దూరదృష్టి తీక్షణతలోనూ ఆయనతో సరితూగరు. ఆయన పాండితీగరిమ అపారమైనది. ఆయనలోని ప్రతి అణువూ పాండిత్యంతో తొణికిసలాడుతుంది.' ఆయన చరిత్రకారుడిగా, విద్యావేత్తగా, అర్ధికవేత్తగా కన్నా కూడా సామాజిక సంస్కర్తగా వినుతికెక్కారు. 'ఆయన గొప్పతనం కొలత ఆయనున్న కాలపు ప్రమాణాలతోనే కాదు, ఏ ప్రమాణాల కొలబద్దతో కొలిచినా అపూర్వం.'

రానడే హిందూ సామాజిక వ్యవస్థలోని కొన్ని బలహీనతలే మన సమాజ పతనానికి కారణమని తెలుసుకున్నారు. అందువల్లనే సమాజ సంస్కరణ ఆయన జీవిత ప్రధాన ఆశయమయ్యింది. సమాజ సభ అనే పేరుతో ఒక భారతీయ సంఘాన్ని, జాతీయ కాంగ్రెసుకు అనుబంధ సంస్థగా స్థాపించారు ఆ సభలకు ఆయన ఒక తీర్థయాత్రలా హజరవుతూ, సామాజిక సంస్కరణ ప్రయోజనానికి ఆలంబనగా పెంచి పోషించారు. అంబేద్కర్ ఆయన పట్ల ఎంతో గౌరవభావాన్ని కనపరచేవారు.

సంఘ సంస్కర్తకు సాహసం, ఆత్మవిశ్వాసం ఉండాలి. అతనికున్న పూర్తి శక్తియుక్తులను సమాజ సంస్కరణకు వినియోగించాలి సమాజంతో సంఘర్షణ పడే సందర్భంలో వెలివేతకు కూడా సంసిద్ధమవ్వాలి. అతనిని ఒక త్యాగశీలిగా ఎవరూ తలచరు. అంబేద్కర్, 'కారాగారాలకు వెళ్ళటమే త్యాగం చేయటమని అనుకోవటం భారతదేశంలో ఒక ఆనవాయతీ' గా పేర్కొన్నారు. సామాజిక సంస్కర్త కన్నా ఎక్కువ త్యాగశీలిగా రాజకీయఖైదీని గుర్తించరాదని ఆయన ఉద్దేశం

19వ శతాబ్దపు చివరి రెండు దశాబ్దాల కాలంలో మహారాష్ట్రలో రెండురకాల భావాలు ప్రముఖంగా ఉండేవి ఒక ఆలోచనా విధానం పాత ఆచారాలను విశ్వసిస్తూ రాజకీయాతీత

దృష్టిని కలిగిఉండేది. రెండవది తన విశ్వాసాలలో ఆధునికతను కలిగి, ఆశయాలూ సిద్ధాంతాలలో ప్రాథమికంగా రాజకీయతను కలిగి ఉండేవి. అంబేద్కర్ అభిప్రాయంలో మొదటి ఆలోచనా విధానానికి వి.కె.చిప్లంకర్ రెండవదానికి లోకమాన్య తిలక్ నాయకత్వం వహించేవారు. ఈ రెండు ధోరణులూ రానడే విధానాలను వ్యతిరేకించటంలో కలిసేవి.

సమాజం యొక్క ప్రజాస్వామ్య రూపం ప్రజాస్వామ్య రాజకీయ స్వరూపంపై ఆధారపడి ఉంటుంది.

సామాజిక ప్రజాస్వామ్యం లోపించినట్లైతే సాధారణ ప్రజాస్వామ్య చట్రం నిరుపయోగం. ఈ అంశాల ఆధారంతో అంబేద్కర్ రాజకీయ ఆలోచనా ధోరణులు ప్రజాస్వామ్యాన్ని ప్రభుత్వ నిర్వహణకు వాడుకునే విధానంగా తప్ప సామాజిక ప్రజాస్వామ్యంగా ఎప్పుడూ గుర్తించలేదని స్పష్టం చేశారు. 'ఒట్టి ఒంటరి ప్రజాస్వామ్యం అసంగతమై పొందికలేకుండా పోయి, అన్ని హక్కులూ, అవకాశాలూ ఉన్నవారికీ, అవి లేనివారికి మధ్యన అంతరం పెరిగిపోతుందని రానడేను వ్యతిరేకించేవారు ఎప్పటికీ గుర్తించలేదు.' హిందూ సమాజంలో వాస్తవ హక్కులు లేవని, కల్పించబడ్డ అదనపు సౌకర్యాలు ఉన్నాయని రానడే వాదించారు. ఈ అదనపు సౌకర్యాలు కొద్దిమందికి మాత్రమే కల్పించబడ్డాయి. అంతులేని జనబాహుళ్యానికి మిగిలింది అనర్హతలూ అసౌకర్యాలు. ఆయన ఈ జీవం కోల్పోతూ రోగగ్రస్థమైన సమాజ భావనా చైతన్యానికి జవసత్వాలు కలిగించాలని కోరుకున్నారు. నిలకడ కల రాజకీయ నిర్మాణానికి అవసరమైన నిజమైన సామాజిక ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పాలని ఆశించారు. రాజకీయంగా అభ్యుదయవాదులుగానూ, సామాజికంగా అభివృద్ధి నిరోధక పాత్రను వహించటాన్ని విమర్శించారు. 'మీరు రాజకీయరంగంలో అభ్యుదయంగానూ, మతపరంగా సాంప్రదాయ ధోరణిని అనుసరించలేరు. హృదయం బుద్ధీ రెండూ కలిసి మనాలి' అని రానడే అన్నారు. అన్నింటికంటే ఎక్కువగా ఆయన దృష్టిలో నైతిక నిబ్బరం రాజకీయ స్వాతంత్ర్యం కన్నా కూడా ముఖ్యమైనది. అంబేద్కర్ అంచనాలో కులమత సమస్యకు పరిష్కారం లేకపోవటమే రాజకీయ అనిశ్చిత పరిస్థితికి కారణం. మన సామాజిక వ్యవస్థ 'ఎంతో అప్రజాస్వామికంగా, ఎంతో ఎక్కువగా ఉన్నత వర్గాల పక్షమై, జనబాహుళ్య విరుద్ధమై, విపరీతమైన కులమతాల భావాలతో నిండి ఉందని' అంబేద్కర్ నమ్మకం.

రానడే ఆశయం సమాజపు పాత సాంప్రదాయం బూజు దులిపి సాధ్యపడితే నూతన వ్యవస్థను నిర్మించటం. హిందూ సమాజపు నైతిక స్వరాన్ని పెంపు చెయ్యాలని గట్టిగా కోరుకున్నారు. అంబేద్కర్, 'రానడే చెప్పినది విని, ఆచరించి ఉంటే, కులవ్యవస్థ సమస్యకు పరిష్కారాన్ని నిర్లక్ష్యం చేయకుండా ఉండిఉంటే ఈ సంక్లిష్టపరిస్థితి ఏర్పడి ఉండేది కాదు.' సామాజిక సంస్కరణోద్యమాన్ని మరింత విస్తృత పరిధిలోకి తీసుకు వెళ్ళి ఉండిఉంటే, వర్గాల మధ్య సామరస్యత ఎదిగి, ఈ సమస్యే తల ఎత్తేది కాదు. సంస్కరణ సభను వదిలివేయటమంటే సామాజిక సంస్కర్తల పై రాజకీయనాయకుల సాధించిన విజయమేనని అర్థం చేసుకోవాలన్నారు. ఆయన దృష్టిలో రానడే గెలిచే పక్షంవైపు లేకపోయినప్పటికీ, ఆయన అనుసరించినది సరిఅయిన దారి. అంబేద్కర్, 'రానడే బదులు తీర్చుకున్నాడు. రాజ్యాంగంలో ఏర్పరిచిన రక్షణలు సామాజిక సంస్కరణల అవసరాన్ని గుర్తించని అపరాధానికి చెల్లించుకున్న మూల్యం కాదా?' అని అన్నారు.

అంబేద్కర్ ప్రకారం, 'రానడే రాజకీయతాత్విక ధోరణి ప్రధాన నిబంధనలలో మొదటిది. రానడే తన ముందు భావాత్మక ఊహను కాక, ఆచరణాత్మకమైన ఆశయాన్ని లక్ష్యంగా పెట్టుకోవడం, రెండవది రాజకీయాలలో మేథో వికాసం, సిద్ధాంతాల కన్నా జనుల ఆలోచనాసరళి వారి భావనలు ముఖ్యమని అనుకోవడం, మూడవది రాజకీయ సర్దుబాట్ల చర్చలలో అనుసరించవలసిన సూత్రం, సాధ్యాసాధ్యాలలో ఏది సాధ్యమో గుర్తించడం.

ఈ సందర్భంగా ఆయనిలా అన్నారు, 'వాస్తవానికి ఈ విషయంగానే కాంగ్రెసుతో లిబరల్స్ విభేదించారు. నేను సంస్కరణవాదిని కాను, కాని రానడే అభిప్రాయం సరిఅయినదని ఖచ్చితంగా చెబుతాను.' రానడే తిలక్‌ల సాధారణ తత్త్వాల విశ్లేషణలో ఆయన తేల్చినదేమంటే, 'తిలక్ తన కార్యసాధనకు అతివాద కార్యాచరణను అనుసరించితే, రానడే వాటిని అనుమానాస్పద దృక్పథంతో చూసేవారు. మిగిలిన అన్ని విషయాలలోనూ వారు ఏకాభిప్రాయంతో ఉండేవారు. రానడే ధోరణిలో లేని ఈ అతివాద ధోరణి వలన ఆయన సిద్ధాంతం తన విలువను కోల్పోలేదు.' రానడేలోని నిరాడంబరత అందరినీ ఆకట్టుకునేది. 'ఆయన సాధించుకున్న మేథో జ్ఞాన సంపదలకు గర్వాన్నే కాదు, అహంకారాన్ని కలిగి ఉన్నా అది అసహజమనిపించదు.' కాని ఆయనలో ఇసుమంత కూడా గర్వం కనిపించదు. ఆయనలోని జ్ఞానసంపద, కలివిడితనమూ యువతరాన్ని ఎంతో ఆకట్టుకునేవి. ఆయనలోని ఔన్నత్యానికి ఇతరులను ప్రభావితం చేసే గుణం ఉంది.' 'ఆయన ఈ తరానికే కాదు, ముందు తరాలకు కూడా మార్గదర్శి, హితుడు, తత్త్వవేత్త కూడా కాగలడన్నది ఆయనలోని గొప్పతనాన్ని తెలియజేస్తుంది.' రానడే బ్రిటిష్ వారు భారతదేశాన్ని ఆక్రమించటం ఒక అదృష్టంగా భావించారని చెప్పుకుంటూ ఉండేవారు. రానడే స్వరాజ్య పోరాటానికి వ్యతిరేకిగా విమర్శలకు గురి అయ్యారు. ఈ ఆరోపణలను అంబేద్కర్ త్రోసిపుచ్చుతూ, వాటిని 'ఆధారరహిత అవాస్తవాలుగా' పేర్కొన్నారు.

మన జాతీయ నాయకులలో అంబేద్కర్ లాలాలజపతి రాయ్‌తో ఎంతో సన్నిహితంగా మెసలేవారు. భారతదేశాన్నించి బహిష్కృతులైన లాలాజీ అమెరికాలో 1913 నుండి 1916 వరకూ ఉన్నారు. ఆయన రాజకీయంగా అతివాదియే కాక, రాటు తేలిన సంఘ సంస్కర్త కూడా. అంబేద్కర్ సంస్కరణవాదిగా ఆయనలోని నిజాయితీని నిస్సంకోచంగా ధృవీకరించారు. లాలాజీ హిందూ అగ్రవర్ణాల వారు అంటరానివారికి విద్యను నెరపి, సమాజంలో వారికి ఉన్నత స్థానాన్ని కలుగ జేసేందుకు నిజాయితీతో ప్రయత్నించాలని అభిప్రాయపడ్డారు. ఎక్కువగా ఈ విషయంగా అంబేద్కర్ ఆయనను గౌరవించేవారు.

అంబేద్కర్ కొలంబియా యూనివర్సిటీలో విద్యాభ్యాసం చేస్తూ ఉండేవారు. ఆయన క్రమం తప్పకుండా లైబ్రరీకి వెళ్ళి ఒక ప్రత్యేక స్థానంలో కూర్చుంటూ ఉండేవారు. లాలాజీ అదే లైబ్రరీకి తరుచుగా వెళుతూ ఉండేవారు. ఆయన ఒక భారతీయ విద్యార్థి నియమంగా ఎంతో శ్రద్ధతో అక్కడ రోజూ చదువుతూ ఉండటాన్ని గమనించారు. లాలాజీ ఆ విద్యార్థిని గురించి వాకబు చేసారు. అంబేద్కర్ అంటరాని వర్ణానికి చెందినవాడని తెలిసి, ఆయన అంబేద్కర్‌ను ఒప్పించి, రాజకీయాలోకి వీలుంటే గదర్ ఉద్యమంలోకి తీసుకు వచ్చేందుకు ప్రయత్నించారు. లాలాజీ ప్రయత్నాలు ఫలించలేదు. సెప్టెంబరు 1916లో లాలాజీ అమెరికాలోని

విద్యార్థుల కొరకు భారతీయ విద్యార్థుల సభను నిర్వహించారు. కాని దానికి అంబేద్కర్ హాజరవలేదు.

1928 అక్టోబరు 30న లాలాజీ లాహోర్‌లో సైమను కమీషనుకు వ్యతిరేకంగా ప్రదర్శనను నిర్వహిస్తుండగా లాఠీలతో పోలీసులు జరిపిన దాడిలో గాయపడి 1928 నవంబరు 17తేదీన కన్నుమూశారు. పత్రికలలో ఈ వార్తను చదివిన అంబేద్కర్ కళ్ళనీళ్ళ పర్యంతం అయ్యారు. ఒక బహిరంగ సభలో పోలీసుల దౌర్జాన్యాన్ని ఖండించారు. బహిష్కృతి భారత్‌లో వ్రాసిన ఒక ప్రత్యేక వ్యాసంలో ఇలా అన్నారు, 'లాలాజీ నిజాయితీపరుడు, నిస్వార్థి, నమ్మిన ఆశయం కోసం త్యాగం చేసేందుకు వెనుకాడనివాడు. ఆయన రాజకీయాల నుండి సాంఘిక సంస్కరణలను విడదీయలేదు.' జాతీయ నాయకుడిగా, సంఘసంస్కర్తగా, విద్యావేత్తగా, ఒక పాత్రికేయునిగా (పీపుల్‌కు ఆయన సంపాదకుడు), ఆయనకున్న విలువైన గుణాలను అంబేద్కర్ ఎంతో కొనియాడారు. అంటరానివారి అభివృద్ధికి లాలాజీ వ్యక్తపరచిన సానుభూతి అనుకూల వైఖరి నిజాయితీతో కూడినదే అయినా, అంబేద్కర్ ఈ ధోరణి అంటరానివారి పురోగమనానికి సరిపోదని అభిప్రాయపడ్డారు.

## సెక్షన్-3

### గాంధీజీతో పోరాటం

గాంధీజీని విమర్శించినంతగా మరే ఇతర జాతీయనాయకుడిని అంబేద్కర్ విమర్శించలేదు.

గాంధీజీ భారత జాతీయ కాంగ్రెసుకు నాయకుడు. భారతీయ స్వరాజ్యపోరాటానికి అంకితమయిన ముఖ్య సంస్థ కాంగ్రెసు కనుక, ఆయన ఆ పోరాటం నెరపే భారత జాతీయతకు చిహ్నమయ్యారు. వందల వేల సంఖ్యలో ఆయన అనుచరులు ఆయన కోసం దేశం కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధపడేవారు. గాంధీజీ కారణంగా అంటరానితనం నిర్మూలన కాంగ్రెసు యొక్క రాజకీయ ప్రణాళికలో ఒక కార్యక్రమంగా చోటు చేసుకున్నది. గాంధీజీ మాట్లాడుతూ, 'ఈ చెడును తొలగించకపోతే స్వరాజ్యం అర్థ రహితమవుతుంది.' అని అన్నారు. కాని అంబేద్కర్ గాంధీజీ తను కన్న కలలను నిజం చేసుకునేందుకు తన వాదనలకు బలం చేకూర్చుకునేందుకు భ్రమలను కలిపించటానికి ఇష్టపడతారని తలపోశారు.

గాంధీజీ అంబేద్కర్ మధ్య మొదటి సమావేశం బొంబాయిలో అగస్టు 17, 1931లో జరిగింది. ఆ చర్చల సందర్భంగా గాంధీజీ తన సహచరుల నుండి వ్యతిరేకత వచ్చినప్పటికీ, తాను ఏ విధంగా అంటరానితనాన్ని కాంగ్రెసు ముఖ్య కార్యక్రమంగా ప్రవేశపెట్టారో వివరించారు. కాని అంబేద్కర్ దానికి బదులుగా 'సమస్యకు సాధారణ గుర్తింపును ఇవ్వటం తప్ప కాంగ్రెసు ఏమీ చేయలేకపోయింది' అని అన్నారు. ఇంకా, 'అది గనుక తన ప్రయత్నాలలో చిత్తశుద్ధిని కలిగిఉంటే, కాంగ్రెసులో చేరేందుకు ఖాదీని ధరించటంలా అంటరానితనపు నిర్మూలనను కూడా ఒక నిబంధనగా చేసి ఉండేది.' అంటరానివారి సమస్య పట్ల హిందువుల ధోరణిలో

ఎటువంటి మానసిక పరివర్తనా రాలేదని ఆయన తన అసంతృప్తిని వ్యక్తపరిచారు. 'గొప్ప నాయకులలోనూ, మహాత్ములలోనూ నమ్మకం ఉంచేందుకు మేం సిద్ధంగా లేం. ఈ విషయంలో నిష్కర్షతో కూడిన నిజాయతీతో నేను ఉండాలి. చరిత్ర మహాత్ములు ఎగిరిపోయే అవాస్తవిక నీడలలా దుమ్ము ధూళిని రేపుతారే కాని ఉపరితలానికి చేరుకోరని చెబుతోంది. ఈ విమర్శతో పాటుగా, 'కాంగ్రెసు వారు మా ఉద్యమాన్ని వ్యతిరేకించి నన్నెందుకు ఒక ద్రోహిగా చిత్రీకరిస్తారు?' అని ప్రశ్నించారు. అంటరానివారు ఈ నేలను తమదిగా ప్రేమించలేరు, తమదిగా చెప్పుకోలేరు, ఎందుచేతనంటే వారికి జరిగిన అన్యాయం వలన అని వివరించారు. ఇంకా, 'నేనేదైనా జాతీయసేవను చేసానంటే అది కళంకమంటని నా మనోభావనతో తప్ప, దేశం పట్ల ఉన్న మరే ఇతర భక్తి భావంతో కాదు.'

గాంధీజీ సమాజంలోని అంటరానివారితో సహా అన్ని వర్గాలకు, ప్రతినిధిగా తన హక్కును ముందుంచారు. గాంధీజీ ఈ ధోరణిని ప్రతిఘటించ వలసినదిగా అంబేద్కర్ తన వారిని కోరారు. గాంధీజీ ప్రత్యేక ప్రాతినిధ్యాన్ని తీవ్రంగా ప్రతిఘటించారు. గాంధీజీ తనను అహింసావాదిగా, లేదా స్వరాజ్య పోరాట ప్రతినిధిగా కన్నా అంటరాని వారి రక్షకుడిగా గుర్తింపబడటానికి ఎక్కువ విలువనిస్తారని అంబేద్కర్ ఆరోపించారు. 'ఐక్యతను సాధించే శక్తిగా గాంధీజీ విఫలమయ్యారు' అని ఆయన అభిప్రాయం.

రౌండ్ టేబుల్ సభలో పాల్గొన్నవారిలో ఎవరైనా మైనారిటీల ఒడంబడిక ప్రతిపాదనను ప్రవేశపెడితే వారిని ఆయన గట్టిగా విమర్శించేవారు. ప్రత్యేక రాజకీయ ప్రతిపత్తిగా అంటరానివారిని గుర్తించటాన్ని ఆయన గర్హించారు. 'ఇతర వర్గాల వాదనలను అర్థం చేసుకోగలను. కాని అంటరాని వారి తరువున వచ్చిన ఈ వాదన అన్నింటికన్నా దయారహితమైనది. అదే జరిగితే అది ఆ కళంకానికి చెందిన శాశ్వత మచ్చగా మిగిలిపోతుంది. భారత దేశస్వాతంత్ర్యాన్నే ఫణంగా పెట్టినా, అంటరానివారి ముఖ్య ప్రయోజనాలను తాకట్టు పెట్టేందుకు అంగీకరించను.' అప్పుడు గాంధీజీ రిఫరెండాన్ని నిర్వహిస్తే తను నెగ్గుతానని, ప్రత్యేక ఓటర్లజాబితా, ప్రత్యేక రిజర్వేషన్లు కళంకాన్ని తొలగించలేవని హెచ్చరించారు. హిందూ మతంలో అంటరానితనం ఒక భాగం కాదని ఆయన తలచారు. ఆయన 'అంటరానితనం బట్టకట్టడం కన్నా హిందూ మతం మరణించటం మేలని తలుస్తాను' అని అన్నారు. గాంధీజీ గమనికలో 'తను అనుభవించిన చేదు అనుభవాలు అంబేద్కర్ నిర్ణయాలకు తెర వేసింది.' గాంధీజీ అభిప్రాయంలో అంబేద్కర్ మొత్తం అంటరానివారికి ప్రతినిధి అన్న వాదన చెల్లదు. అంబేద్కర్ భావాల వల్ల హిందూమతంలో వేర్పాటుధోరణులు చోటు చేసుకుంటాయని ఆయన తలచారు. అందువలన, గాంధీజీ, 'మొత్తం ప్రపంచాన్ని ముట్టచెప్పినా, వారి హక్కుల విషయంలో రాజీ పడను.. వారు కోరితే వారు క్రైస్తవ లేదా ఇస్లాం మతాలలోకి మారిపోయినా నేను లెక్కచేయను.' గాంధీజీ అంటరాని వర్గాలలో ఎటువంటి వేర్పాట్లు చోటు చేసుకోరాదని తలచారు. తన ప్రాణాన్ని ఫణంగా పెట్టి అయినా అటువంటిది ఏదీ జరగకుండా చూస్తానని హెచ్చరించారు.

ముస్లింలు, సిక్కులు సంఘటితమై క్రమబద్ధీకరించబడిన వర్గాలు, కాని అంటరానివారు అలా సంఘటితమైన వారు కారు. గాంధీజీ అభిప్రాయంలో, ప్రత్యేక ఓటర్ల జాబితా

అంటరానివారి కోసం ఏర్పడితే, గ్రామస్థుల మధ్య వేర్పాట్లు పెరుగుతాయి, గ్రామస్థులుగా అంటరానివారి స్థితి దయనీయమైపోతుంది, ఎందుచేతనంటే గ్రామాలపై హిందూ ఛాందసవాదుల పట్టు బలమైనది. ముస్లిం, క్రైస్తవులకు ప్రత్యేక ప్రాతినిధ్యాన్ని తప్పనిసరి అయిన చెడులా సహించవచ్చు, కాని అంటరానివారి విషయంలో అలా ఏర్పడటం వారికి ఖచ్చితంగా ప్రమాదహేతువేనని అభిప్రాయపడ్డారు. గాంధీజీ ధోరణికి అంబేద్కర్ ఆయన అనుచరులతో సహా మండిపడ్డారు. గాంధీజీ అభిప్రాయం ప్రకారం ఉన్న ఒకే ఒక మార్గం వారిని ఓటర్ల జాబితాలో చేర్చి రాజ్యాంగపరంగా ప్రాథమిక హక్కులను కల్పించటం మాత్రమే. గాంధీజీ దృష్టిలో అంటరానితనం హిందూ మతంపై ఏర్పడ్డ కళంకం. సమీప భవిష్యత్తులో అంటరానితనం నామరూపాలు లేకుండా పోతుంది. కాని ప్రత్యేక ఓటర్ల జాబితా ఈ కళంకాన్ని శాశ్వతం చేస్తుంది. 'ప్రత్యేక జాబితా వారిని శాశ్వత బానిసత్వానికి గురి చేస్తుంది.' గాంధీజీ అంటరానితనం అంతరించిపోతే అంటరానివారే ఉండరు, ప్రత్యేక ఓటర్ల జాబితా కాకుండా వయోజన ఓటుహక్కును కలిపించటం ద్వారా వారికి పూర్తి రక్షణ కలిపించటం సాధ్యమని అభిప్రాయపడ్డారు. పూనా ఒడంబడిక గరిష్ట వాటా స్థానాలను పెంచింది, కాని రెండు ఓట్ల హక్కును హరించింది. అంబేద్కర్ కమ్యూనల్ అవార్డు ద్వారా అందుకున్న ఆ రెండో ఓటు హక్కును ఎంతో అమూల్యమైనదిగా భావించారు. రాజకీయ ఆయుధంగా దాని విలువ గణించ వీలు లేనిది. హిందువులకు అయిష్టమై, అంటరానివారికి సమ్మతి కాని పూనా ఒడంబడిక గుర్తింపు పొంది, భారత ప్రభుత్వ శాసనంగా 1935లో ఇమడ్చబడింది.

ఆలయ ప్రవేశ ఉద్యమం పూనా ఒడంబడిక రద్దుకు మొదలైన అంటరానితనానికి వ్యతిరేక పోరాటానికి ఉపలక్ష్యంగా ప్రారంభమైంది. అంబేద్కర్ అభిప్రాయంలో గాంధీజీ ఆలయప్రవేశ ఉద్యమంలో పాలు పంచుకోవడం, హిందువులకు వారికి ఉన్న అడ్డుగోడను తొలగించే అంటరానివారు కోరుతున్న రాజకీయ హక్కులకున్న ప్రాతిపదికను నాశనం చేయటమే. ఆలయ ప్రవేశ ఉద్యమంలోకి గాంధీజీ అడుగుపెట్టడాన్ని వింత రాజకీయ సాముగారడీగా ఆయన వర్ణించారు. 'ఎన్నికలలో హిందువులు కాంగ్రెసును ఓడిస్తామని బెదిరిస్తే గాంధీజీ కాంగ్రెసు చేతిలోని రాజకీయ అధికారాన్ని కోల్పోకుండా చేసేందుకు ఆలయ ప్రవేశ ఉద్యమానికి నీళ్ళొదులుతారు' అని అంబేద్కర్ చెప్పారు. అంటరానివారు ఆర్థిక, విద్య, రాజకీయ రంగాలలో పురోగతి సాధిస్తే, ఆలయ ప్రవేశం దానంతటదే సాధ్యమవుతుందని ఆయన నమ్మకం.

కాంగ్రెసు నాయకత్వ పగ్గాలు గాంధీజీ చేపట్టిన తరువాత, కాంగ్రెసు అతివాద కార్యాచరణను అవలంభించింది. ఒక పార్టీ యంత్రాంగాన్ని గాంధీజీ ఏర్పాటు చేయగలిగారని అంబేద్కర్ అన్నారు. కాంగ్రెసు అంటే గాంధీజీ ఆయుధాలలో కొన్ని, సహాయ నిరాకరణ, బహిష్కరణ, శాసనోల్లంఘనం మరియు నిరాహారదీక్ష, కారాగార వాసాన్ని ఎదుర్కొని జైళ్ళను నింపి, ప్రభుత్వాన్ని అప్రతిష్టపరిచేందుకు ఉద్దేశపూరకంగా ప్రభుత్వ శాసనాన్ని ధిక్కరించేందుకు ఉపయోగపడింది సహాయనిరాకరణోద్యమం. దానిని సామూహికంగానూ లేదా వ్యక్తిగతంగానూ చేపట్టారు. నిరాహారదీక్ష మాత్రం గాంధీజీకి మాత్రమే ప్రత్యేకంగా కేటాయించబడింది. అంబేద్కర్

దృష్టిలో 1920 నుండి 42 వరకు ఆంక్షల కొరకు నిర్వహించిన ప్రదర్శనలు ఉద్యమాలు స్వరాజ్య పోరాటాలుగా వర్ణించబడ్డాయి, కాని 'విచక్షణారహితంగా ఉపయోగించిన ఆంక్షల వలన భారత విభజన పూర్తిగానూ, ఖచ్చితంగానూ మరింత చేరువలోకి తెచ్చింది.'

ఆయన గాంధీజీ సత్యాగ్రహాన్ని వ్యతిరేకించారు. ఎందుచేతనంటే తన ఆయుధాన్ని అంటరానివారు చేదబావులను వాడుకోవటానికి, ఆలయాల ప్రవేశానికి ఏనాడూ ఉపయోగించలేదు కనుక. అంటరానితన నిర్మూలనకై ఒక్కసారి కూడా గాంధీజీ నిరాహారదీక్షను చేపట్టలేదని ఆయన పేర్కొన్నారు.

అంబేద్కర్ గాంధీజీతో సమావేశమయినా మతమార్పిడి సమస్యలో ఏకాభిప్రాయానికి రాలేకపోయారు.

వాల్‌చంద్ హీరాచంద్ మరియు జమన్‌లాల్ బజాజ్‌లు అణగార్తులను అభివృద్ధి కావించేందుకు అంతులేని వనరుల అందుబాటులోకి తెచ్చుకునేందుకైనా, గాంధీజీ అనుచరగణంలో ఎందుకు చేరరని అంబేద్కర్‌ని అడిగారు, దానికి తనకు గాంధీజీతో అనేక ముఖ్యఅంశాలపై విభేదాలు ఉన్నాయని, 'ఆయన తన విజయం కోసం తన భావనలను వదులుకోరు' అని బదులు చెప్పారు. గాంధీజీ ఎప్పుడూ అంటరానివారి, ఇతర వర్గాల రాజ్యాంగ హక్కుల విషయంలో వివక్షధోరణిని అనుసరిస్తారని, కాని అలా ఎందుకు చేస్తున్నారో కారణం మాత్రం వివరించలేదని అంబేద్కర్ పేర్కొన్నారు. ముస్లింలు, సిక్కులు పాత పరిపాలక అవశేషాల వర్గాలు కనుక వారికి గాంధీజీ అనుకూలంగా ఉంటారు. కాబట్టి అంటరానివారు అటువంటి వ్యక్తిని నిజాయితీపరుడని విశ్వసించలేరు. ఆయన అభిప్రాయంలో గాంధీజీ అంటరానితనాన్ని నిర్మూలించి వర్ణాలు మాత్రం ఉండిపోవాలని భావించారు. 'అటువంటి వ్యక్తి అంటరానివారికి హితుడు కాలేడు'అని ఆయన అన్నారు.

గాంధీజీకి అగ్రకులాలవారితో వైరం తెచ్చుకోవటం ఇష్టం లేదని అంబేద్కర్ భావన. అంటరానివారు హిందువులకు వ్యతిరేకంగా చేస్తున్న సత్యాగ్రహాలను విమర్శిస్తూ ఒక ప్రకటన చేసి వారిని ఆశ్చర్యచకితులను చేసారు. ఆయన ఇలా ప్రకటించారు, 'సత్యాగ్రహాన్ని విదేశీ పరిపాలకులపై మాత్రమే ఉపయోగించాలి' గాంధీజీ అంటరానివారు సంఘటితశక్తిగా బలపడేందుకు ఇష్టపడలేదని అంబేద్కర్ విశ్వసించారు. ఆయన దృష్టిలో 'హరిజనసేవక సమాజం సేవ ముసుగులో అంటరాని వారిలోని స్వరాజ్యభావనను తుద ముట్టించేందుకు మాత్రమే ముందుకు వచ్చింది.'

గాంధీజీ నిర్ద్వందంగా, అంటరానితనాన్ని నిర్మూలించటం అంటే సహపంక్తి భోజనాలు వర్ణాంతర వివాహాలు కాదని ప్రకటించారు. ఆయన అంటరానితనం వ్యతిరేకత అంటే అంటరానివారు అతిశూద్రులుగా బదులు శూద్రులు అని వర్గీకరించబడటం. వారు వారివారి కులవృత్తులను అనుసరించాలి. హిందూమతం కులం, గోపూజ, కర్మ సిద్ధాంతం, ప్రపంచంలో మనిషి స్థితి విధిపై ఆధారపడి ముందుగానే నిశ్చయించబడుతుంది అనే విధివాదం, శాస్త్ర ఆధిపత్యాన్ని సమ్మతించటం, భగవంతుడి అవతారాలను విగ్రహాలను విశ్వసించటం వంటి

వాటినెల్లా గాంధీయిజం అంగీకరిస్తుంది. 'గాంధీజీ చేసినదల్లా హిందూమతానికి దాని విశ్వాసాలకు ఒక తాత్విక ప్రాతిపదికను కనుగొనటమే' అని అంబేద్కర్ వివరించారు

సహాయనిరాకరణోద్యమం పుట్టింది ఖిలాఫత్ ఉద్యమంలో కాని కాంగ్రెసు స్వరాజ్య ఉద్యమంలో కాదు, ఖిలాఫిస్టులు టర్కీకి సహాయపడేందుకు మొదలైన దానిని ఖిలాఫిస్టులకు సహాయపడేందుకు గానూ కాంగ్రెసు తనదిగా చేసుకుంది. కాంగ్రెసు ప్రాథమిక ఆశయం ఖిలాఫత్, హిందువులను దానిలోకి తెచ్చేందుకు దానికి స్వరాజ్య ఉద్యమం అనుబంధం గావించబడింది. బ్రిటిష్‌వారిని ఎదుర్కునేందుకు ఒక ఉమ్మడి వేదికగా అది ప్రారంభింపబడింది. గాంధీజీ దీని ద్వారా జంట ప్రయోజనాలను సాధించగలిగారని అంబేద్కర్ అభిప్రాయం. మొదటిది, కాంగ్రెసు దాని పరిపూర్ణతను సాధించటం కొరకు ముస్లింలను చేర్చుకోగలిగింది, రెండవది కాంగ్రెసును ఒక శక్తివంతమైన సంస్థగా రూపొందించగలగటం. ముస్లింలు చేరకపోయింటే అది సాధ్యపడేది కాదు.'

ముస్లింలకు ప్రాతినిధ్యం వహించేది ముస్లింలీగ్ కాదని, పాకిస్తాన్ జిన్నా ఊహాజనిత కల మాత్రమేనని గాంధీజీ నిరసన వ్యక్తం చేశారు. అంబేద్కర్ దృష్టిలో 'ఇది గాంధీజీ అసాధారణ దృక్పథం. దీనికి అధారం జాతీయవాద ముస్లిముల ఉనికి మాత్రమే" కాంగ్రెసు, జాతీయ ముస్లింలు వ్యతిరేకించినప్పటికీ కమ్యూనల్ అవార్డుకు ప్రతికూలంగా స్పందించేందుకు అన్సారీ తిరస్కరించటాన్ని ఈ సందర్భంగా ఆయన చూపించారు. ఆయన అభిప్రాయంలో గాంధీజీ తన వాదానికి చూపించిన ఆధారాలన్నీ చెల్లాచెదురయ్యాయి. గాంధీజీ ముస్లింలకు అనుకూలంగా ఉన్నా ఆయన ఆధారరహిత వాదనలేవీ మతసమస్యను పరిష్కరించలేకపోయాయి.

అంబేద్కర్ దృష్టిలో గాంధీజీ నాయకత్వంలో కాంగ్రెసు రాజకీయ పిచ్చాసుపత్రి కాకపోయినా, కాంగ్రెసు మాత్రం రాజకీయాలకై పిచ్చిదైంది. సహాయనిరాకరణ, శాసనోల్లంఘనం, స్వరాజ్య నినాదాలు ఒకప్పుడు హిందువుల ఆలోచనలో స్థానమేర్పరుచుకున్న సామాజిక సంస్కరణల స్థానాన్ని ఆక్రమించాయి. ఆయన గాంధీజీని వైవాహిక జీవితానికి దూరంగా ఉండగలిగిన ఒక భక్తుడిగా గౌరవించారు. గాంధీజీ నిరాహారదీక్షపై మంచి అభిప్రాయం కలిగి ఉన్న అంబేద్కర్ దీక్షను ఎన్ని రోజులైనా కొనసాగించగల గాంధీజీ శక్తినీ పట్టుదలను శ్లాఘించారు. మంత్రముగ్ధులును చేయగలరని చెప్పుకునే గాంధీజీ తనను ఆకట్టుకోలేక పోయారని, జవహర్‌లాల్ నెహ్రూబోస్‌లు లొంగినా, తను మాత్రం అలా కాలేనని వివరించారు. కాంగ్రెసులోకి తనంటూ ప్రవేశిస్తే తన స్వయం ప్రతిభతో అక్కడ వెలుగొందగలనని ఆయన భావించారు. ఆయన పూర్తి అహింసావాదాన్ని ఒక గమ్యంగా ఆయన అభిమానించారు. ఆ గమ్యానికి పరిమిత హింసను ఒక సాధనంగా విశ్వసించారు. ఆయన గాంధీజీ అహింసావాదం, బుద్ధుడి నుండి కాక అహింసావాదాన్ని అతిఛాందసంగా బోధించే జైనమతం నుండి గ్రహించినదిగా భావించారు.

అంబేద్కర్ రానడే తరాన్ని పునర్నవీకరణ తరంగా ఎంచారు. ఆ తరంలోని నాయకులు భారతదేశాన్ని ఆధునీకరణ చేసేందుకు పాటుపడ్డారు. ఆ తరంలో నాయకులు అనుభవంపై ఆధారపడితే, గాంధీతరంలో వారి మార్గదర్శకత్వానికి 'అంతరంగ ప్రబోధాన్ని' ఆశ్రయించారు. నాయకులు రానడే భారతానికంటే గాంధీ భారతం గొప్పదిగా చెప్పుకున్నారు. వారు గాంధీతరం

ఉద్యమ ఉద్రేకభరితమయి, ఆశలను రేకెత్తించేదిగానూ, రానడే తరం దానికి పూర్తి విరుద్ధమైనదిగానూ వాదించారు. 'రానడే నాటి భారతదేశంలో ఉద్యమాలు కొరవైనా నిజాయతీ ఎక్కువ, ఆశలు రేకెత్తించకపోయినా మరింత జ్ఞానవంతమైనది.' ఆయన అభిప్రాయంలో రానడే యుగంలో స్త్రీపురుషులు ఛాందసవాదుల నుండి ఎంతటి వ్యతిరేకత ఎదురైనా కూడా జీవితంలో ఎదురైన వాస్తవాంశాల అధ్యయనం ద్వారా ఆర్జించిన జ్ఞానదీపంతో తమ జీవితాలను, వ్యక్తిత్వాన్ని మలుచుకునేందుకు ఎంతో గంభీరతతో పాటుపడేవారు. గాంధీతరంలో ఉన్నటువంటి అదే వైవిధ్యం ఒక విద్యార్థి మరియు రాజకీయవాదుల మధ్య ఉండేది కాదు, విద్యార్థి కానటువంటి రాజకీయవేత్తను ప్రమాదకరంగా లేదా భరించలేని చికాకుగా ఎంచేవారు. 'గాంధీజీ యుగంలో ప్రజలు పురాతనత్వానికి మరలి, వారి కోసం ఆలోచించటం మానేశారు, వారి జీవితాల వాస్తావాంశాల అధ్యయన పరిశీలనలను వదిలివేశారు.

## సెక్షన్-4

### భారత జాతీయ కాంగ్రెస్ పట్ల ధోరణి

భారత జాతీయ కాంగ్రెసు భారతదేశాన్ని బ్రిటిష్ సామ్రాజ్యవాద అధికారం నుండి విముక్తిని సాధించేందుకు కంకణం కట్టుకున్న ముఖ్య సంస్థ. 1885లో అది ప్రారంభమయిన నాటినుండీ, దేశ స్వాతంత్ర్యం కొరకు పెద్ద ఎత్తున పోరాటాలను జరిపింది. దాని కార్యక్రమాలకు ముందుగా మేధావివర్గం, తరువాత కార్మిక కర్షక వర్గాలు ఆకర్షితులయ్యారు. 1909 నుండి ముస్లింలీగ్ బలపడి ప్రత్యేక ఓటర్ల జాబితా కోసం పట్టు పట్టసాగారు. రాజకీయ సంస్కరణల కంటే ఎప్పుడూ రాజకీయ ఉద్యమాలు ప్రథమస్థానాన్ని ఆక్రమించి ఉండేవి. సామాజికంగానూ, ఆర్థికంగానూ విడిపోయిన శక్తుల సమీకరణ రోజురోజుకూ బలపడి భారతదేశం స్వాతంత్ర్య దిశగా తన పయనాన్ని సాగించింది.

సామాజిక సంస్కరణల నుండి కాంగ్రెసు దూరమయే ధోరణి సోషల్ రిఫార్మ్ కాన్ఫరెన్స్‌కు అసంతృప్తి కలిగించింది. కాంగ్రెసు నాయకులు సామాజిక సంస్కరణల ఆవశ్యకతను గుర్తించినప్పటికీ ఆ సంస్థను దాని కొరకు వేదికగా ఉపయోగించటానికి ఇష్టపడలేదు. భారత జాతీయ కాంగ్రెసు సోషల్ రిఫార్మ్ కాన్ఫరెన్స్‌లు రెండూ సమాంతర సంస్థలుగా తమ తమ ప్రత్యేక ఆశయాల గమ్యాల కొరకు కార్యక్రమాలను కొనసాగించేవి. సోషల్ రిఫార్మ్ కాన్ఫరెన్స్ ఉనికి కాంగ్రెసులోని సామాజిక సంస్కరణలను వ్యతిరేకించే వర్గాలకు కంటగింపుగా ఉండేది. ఈ వర్గాలకు అగ్రస్థానంలో తిలక్ ఉండేవారని అంబేద్కర్ చెప్పారు.

గాంధీజీ కాంగ్రెసు నాయకుడిగా ఎదగటంతో మరో నూతన యుగం మొదలైంది. రాజకీయ అంశమే కాక సామాజిక పురోభివృద్ధి కూడా కాంగ్రెసు కార్యక్రమాలలో చోటు చేసుకుంది. కలకత్తా 1917 కాంగ్రెసు మహాసభలో గాంధీజీ జోక్యంతో అస్పృశ్యతను నిర్మూలించేందుకు చేసిన ఒక తీర్మానాన్ని అంగీకరించారు. అంబేద్కర్ అభిప్రాయంలో అస్పృశ్యతా నివారణ తీర్మానం పూర్తిగా ప్రకటిత కాంగ్రెసు ఆచరణ సూత్రాలకు భిన్నమైంది.

రెండు వేర్వేరు వేదికలపై అణగారిన వర్గాలు ప్రతిపాదించిన తీర్మానాల వలన కాంగ్రెసు ఆ తీర్మానాన్ని అంగీకరించింది. మొదటి సభ బొంబాయిలో సర్ నారాయణ్ చందావర్కర్ అధ్యక్షతన జరిగింది. బ్రిటిష్ ప్రభుత్వానికి విధేయత ప్రకటించి, మిత్రరాజ్యాల విజయాన్ని ఆకాంక్షిస్తూ వారి యొక్క సంఖ్యను ఆధారం చేసుకుని అదే నిష్పత్తిలో కౌన్సిల్‌లో అణగారిన వర్గాలకు ప్రాతినిధ్యం వహించే హక్కును కలుగజేయాలని విజ్ఞప్తి చేసింది. అంతేకాకుండా భారత జాతిని ఉద్దేశించి అణగార్తులపై రుద్దబడిన కులమతాల కట్టుబాట్లను నిర్మూలించటం అవసరమూ న్యాయసమ్మతమూ సమంజసమని ప్రకటిస్తూ ఒక ఖచ్చితమైన, ప్రత్యేక తీర్మానాన్ని రాబోయే జాతీయ మహాసభలో ప్రవేశపెట్టాలని కాంగ్రెసును కోరేందుకు ఆ సభాధ్యక్షుడికి అధికారం ఇచ్చింది. రెండో మహాసభ నవంబరు 1917లో బ్రాహ్మణేతర పార్టీకి నాయకుడైన బి.ఎన్. బగాడే అధ్యక్షతన జరిగింది. ఈ సభ కూడా బ్రిటిష్ ప్రభుత్వానికి తమ విధేయతను ప్రకటించింది. కాంగ్రెస్ ముస్లింలీగ్‌ల పథకానికి తమ వ్యతిరేకతను వ్యక్తపరిచింది. అన్ని వర్గాల ప్రజలు అందునా ముఖ్యంగా అణగారిన వర్గాలు ప్రభుత్వ నిర్వహణలో ప్రతిభావంతంగా పాలు పంచుకునే స్థితికి ఎదిగే దాకా భారతదేశం ఎక్కువగా బ్రిటిష్ ప్రభుత్వం పరిపాలనలోనే కొనసాగాలని స్పష్టపరిచింది. వారు పౌర రాజకీయ హక్కులను సాధించుకునే దిశగా వివిధ చట్టసభలలో అస్పృశ్యులకు సొంత ప్రాతినిధ్యం కల్పించాలని ప్రభుత్వానికి విన్నవించింది. ఆ సభ బహిష్కృత్ భారత్ సమాజ్‌ను, భారత ప్రభుత్వ సెక్రటరీ ఆఫ్ స్టేట్ మోంటేగ్‌ను కలుసుకునేందుకు దాని ప్రతినిధులను పంపే నిర్ణయాన్ని బలపరచింది.

1916లో రెండు పథకాలు ప్రచారంలో ఉన్నాయి. ఒకటేమో ఇంపీరియల్ లెజిస్లేటివ్ కౌన్సిల్ పంథొమ్మిదిమంది సభ్యుల పథకమైతే, రెండవది లక్నో ఒడంబడికగా పేరొందిన కాంగ్రెసు - లీగ్‌ల పథకం. కాంగ్రెస్ - లీగ్‌ల పథకాన్ని భారత జాతి బలీయమైన వాంఛగా చూపేందుకు కాంగ్రెసు ఆరాటపడింది. 1895 నాటి కాంగ్రెసుకు వ్యతిరేకంగా పీడితవర్గాల వారు పూనాలో ఒక ప్రదర్శనను నిర్వహించారు. అందులో దాని దిష్టిబొమ్మను నిజంగానే దహనం చేశారు. కాని జస్టిస్ చందావర్కర్‌కు నిమ్నవర్గాలలో ఉన్న పలుకుబడి వలన వారిలోని అధిక సంఖ్యాకులు కాంగ్రెసు పథకాన్ని బలపరిచేందుకు అంగీకరించారు.

కాంగ్రెసు వర్కింగ్ కమిటీ తీర్మానం (1922) అఖిల భారత హిందూ మహాసభను అస్పృశ్యతను తుడిచిపెట్టి హిందూసమాజం నుండి ఈ చెడును నిర్మూలించే దిశగా కార్యాచరణను చేపట్టవలసినదిగా కోరింది. అంబేద్కర్ అభిప్రాయంలో 'అంటరాని సమస్యను చేపట్టేందుకు ఏ అర్హత లేనిదంటూ ఏదైనా ఉంటే అది హిందూ మహాసభ మాత్రమే. అది సంస్కరణలను చేపట్టే సామాజిక సంస్థ కాదు. ముస్లింల రాజకీయ ప్రాబల్యాన్ని ఎదుర్కొనే ఆశయంతో ఏర్పడ్డ పూర్తి రాజకీయ సంస్థ.'

అంబేద్కర్ దృష్టిలో అంటరానివారి అగచాట్లకు కారణం వారి పట్ల విరోధ భావాన్ని పెంచుకున్న ప్రభుత్వ యంత్రాంగం. హిందువుల నియంత్రణలో ఉన్న ఆ యంత్రాంగం తన వెంట తెచ్చుకున్న పాత దురభిప్రాయాలే కాని అమలులో ఉన్న చట్టాలు కావు, అస్పృశ్యులకు

పోలీసుల నుండి రక్షణ, న్యాయవ్యవస్థ నుండి న్యాయం, ప్రభుత్వ యంత్రాంగం నుండి రాజ్యాంగ ప్రయోజనాలూ అవి హిందువుల చేతుల్లో ఉన్నంత కాలం లభించవు. మైనార్టీల ప్రతినిధులెవరినీ తమ మంత్రివర్గంలో చేర్చుకునేందుకు అంగీకరించకపోవటానికి, సమిష్టి బాధ్యతను వహించాలంటే మంత్రివర్గం పార్టీకి చెందినదిగా ఉంటేనే సాధ్యమనే కారణాన్ని చూపింది. వాగ్దాన పత్రంపై సంతకం పెట్టి కాంగ్రెసు పార్టీలో చేరేందుకు అంగీకరించితేనే మైనార్టీలను మంత్రివర్గంలో చేర్చుకున్నారు. అంబేద్కర్ దృష్టిలో మంత్రివర్గంలో చేరేందుకు అస్పృశ్యులకున్న అర్హతను గాంధీజీ సమర్ధనతో రూపొందిన కాంగ్రెసు విధానం గుర్తించ నిరాకరించింది. ఉన్నత విద్యార్హతలున్న బ్రాహ్మణ మరియు ఇతర అగ్రవర్ణాలవారిని, ఒక మోస్తరు విద్యార్హతలున్న బ్రాహ్మణేతర కులాల ప్రతినిధులను, అరకొర విద్యార్హతలున్న అంటరానివారిని శాసనసభకు కాంగ్రెసుతో ఎంపిక చేయించారు. ఇతరులెవ్వరూ కాకుండా బ్రాహ్మణ మరియు ఇతర ఉన్నత కులాల వారు మాత్రమే మంత్రివర్గంలో ముఖ్య భూమికను వహించేలా, శాసనసభ్యులుగా గుర్తింపబడటం తప్ప మరో ఇతర ప్రయోజనం లేని, మేధో జ్ఞానం లేని ఇతర కులాల, అంటరానివారి ప్రతినిధులు గుడ్డిగా వారిని అనుసరించటం తప్ప ప్రతిఘటించలేని విధేయుల గుంపుగా ఉంచబడేందుకు రూపొందించిన విధానమది.

1935 చట్టం ప్రకారం, జనాభాలోని 10 శాతం ప్రజలకు ఓటు హక్కు కల్పించ బడింది. 1937 సాధారణ ఎన్నికల ఫలితాలను అంబేద్కర్ విశ్లేషించి, 50శాతం ఓట్లు కూడా కాంగ్రెసు పొందలేదని, కనుక ఆ పార్టీకి మెజార్టీ రాలేదన్న నిర్ణయానికి వచ్చారు. అన్ని వర్గాల తరగతుల ప్రజలకు కాంగ్రెసు ప్రాతినిధ్యం వహిస్తుందన్న వాదనలో పసలేదు, వాస్తవానికి ఆధార రహితం. అమలులో ఉన్న ఉమ్మడి నియోజకవర్గాలు మరియు ప్రత్యేక నియోజకవర్గాల పద్ధతి అంటే జంట సభ్యుల నియోజకవర్గ విధానం. హిందువులు కాంగ్రెసు పెత్తనంలో పూర్తిగా వ్యవస్థీకరించబడి, ఎటువంటి పోటీ అయినా అసాధ్యమై, దాని వల్ల కలిగే ఓట్ల దుర్వినియోగాన్ని అరికట్టారు. దాని వలన ప్రత్యేకంగా కేటాయించబడ్డ నియోజకవర్గాలలో కూడా గెలిచి, షెడ్యూల్డ్ కులాల ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేశారు.

పొందిన ఓట్లకు, గెలిచిన సీట్లకు అన్ని సందర్భాలలోనూ పొంతన ఉండేది కాదు. దాని వలన అనేక సందర్భాలలో ఒక పార్టీ తక్కువ ఓట్లను సాధించినా, ఎక్కువ స్థానాలను పొందగలిగేది. ప్రత్యేకంగా ఏక సభ్య నియోజకవర్గాల పద్ధతి అమలులో ఉన్న భారతదేశంలో ఇలా జరుగుతూ ఉండటం సర్వసాధారణం. ప్రాథమిక ఎన్నికలలో అస్పృశ్యులు కాంగ్రెసు అభ్యర్థులపై వారి వర్గ ప్రజల ఓట్లలో 82శాతం ఓట్లను సాధించి, గెలిచారని అంబేద్కర్ ఋజువు చేశారు.

అంటరానివారికి ఎలాంటి చట్టపరమైన రక్షణలు లేని, వయోజనులందరికి కలిపించిన ఓటు హక్కు ఆధారంపై ఏర్పడే ప్రజాస్వామ్య ప్రభుత్వ ఏర్పాటును కాంగ్రెసు ఆకాంక్షించింది. అంటరానివారికి రాజ్యాంగపరమైన హక్కులు కల్పించకపోతే, సంఖ్యాధికులైన హిందూ వర్గాలు చట్టసభలనే కాక, ప్రభుత్వ శాసన పరిపాలనా విభాగాలను కూడా వశపరుచుకోవటమే కాక, చట్టసభలూ శాసనపరిపాలనా విభాగాలన్నింటా వారి పెత్తనం వ్యాప్తి చెందుతుంది. దేశం ఈ శక్తివంతమైన రాజ్యంగ అధికార యంత్రాంగం, అల్ప సంఖ్యాకుల ప్రయోజనాలను కాపాడటం

బదులుగా, హిందూ వర్గాల ప్రయోజనాలనే కాపాడుతుంది. సంఖ్యాధిక్యత కల హిందువులు కాంగ్రెసుకు వెన్నెముకగా నిలిచారు, ఆ పార్టీ హిందువులతో ఏర్పడి, హిందూధర్మంతో పోషింపబడి, ఆ సంఖ్యాధిక్యత కల హిందువులు దానికి వెన్నెముకగా నిలిచారు. కనుక వారి ప్రయోజనాలను కాంగ్రెసు కాపాడుకోక తప్పదని అంబేద్కర్ భావించారు. దురాచార కట్టుబాట్లతో ప్రభావితమయిన హిందూ ఆధిక్యత సామాజిక ఆలోచన అసమానతలను గుర్తించటమే కాదు, వర్గీకరించిన అసమానతలను వివిధ వర్ణాల మధ్య సంబంధాలను నిర్దేశించే ఆదేశిక సూత్రంగా భావించింది. అంబేద్కర్ దృష్టిలో 'ఈ వర్గీకృత అసమానతలనే మత కట్టుబాటు స్వేచ్ఛ సమానత్వాలకు అడ్డుగోడ.' ఈ వర్గీకృత అసమానతల విధానాన్ని ఎదుర్కొనేందుకు రాజకీయ భద్రతలను ఏర్పరిస్తే, దాని వలన చట్టసభలలోనూ, పరిపాలనా విభాగాలలోనూ, అధికార యంత్రాంగంలోనూ కొంత ప్రాతినిధ్యం ఏర్పడుతుంది. షెడ్యూల్డ్ కులాల ఈ కోర్కెలను 'కుల రాజకీయాలుగా' పేర్కొంటూ కాంగ్రెసు తప్పుపట్టింది, దాని నాయకులు అస్పృశ్యులను 'ఉద్యోగాల వేటగాళ్ళు'గా విమర్శించారు.

హిందువుల, అస్పృశ్యుల మధ్య నెలకొన్న ఈ తగవును ఇంటర్నేషనల్ బోర్డ్ ఆఫ్ ఆర్బిట్రేషన్‌కు నివేదించవలసిందిగా అంబేద్కర్ బహిరంగంగా కోరారు. ఆయనకు బ్రిటిష్ ప్రజల పట్ల అపార విశ్వాసం ఉంది. ఆయన 'బ్రిటిష్ ప్రజలను, హిందువులు అనుమానించేందుకు అస్పృశ్యులకు ఏ కారణమూ కనిపించటం లేదు' అని అంబేద్కర్ వ్యాఖ్యానించారు.

అంబేద్కర్ మరో సమస్యను లేవనెత్తారు, భారత జాతీయ జీవనంలో అంటరానివారి స్థానం విడిగా ఉన్నదా? దీనికి ఆయన అవునని సమాధానమిచ్చారు. 'వారు హిందువులకు భిన్నంగానూ వేరుగానూ ఉన్నారు' ఈ ప్రశ్నకు కాంగ్రెసు కాదని జవాబిచ్చింది.

యూరోపియన్ జాతీయులు సహజంగానే మతం రీత్యా క్రైస్తవులయినా వారు వేరువేరుగా ఒకరికొకరు భిన్నంగా ఉన్నారు. తెల్లవారు, నీగ్రోలు క్రైస్తవులయినప్పటికీ వేరువేరు సంతతులకు చెందినవారుగా ఉన్నారు. భారతీయ క్రైస్తవులు, ఆంగ్లో ఇండియన్లు, యూరోపియనులు ఒకే మతాన్ని అవలంభించినప్పటికీ ఒకే జాతికి చెందినవారు కారు. సిక్కులు, మజిబీ సిక్కులు, సమదాసియా సిక్కులు - వీరంతా సిక్కుమతాన్ని పాటించినా వారు ఒకే జాతికి చెందినవారు కారన్నది సమ్మతించిన విషయం.

రాజ్యాంగ హక్కులు ఏర్పరచాలా లేదా అన్నది జనాభాలోని ఒక సామాజిక వర్గం విలీనీకరణం మరియు వేర్పడటానికి చెందిన సమస్యగా గుర్తించటంలో కాంగ్రెసు విఫలమయిందని అంబేద్కర్ అభిప్రాయపడ్డారు. ముస్లింలకు, క్రైస్తవులకు వారు హిందువులకు భిన్నమైన వర్గాలు కనుక రాజకీయంగా గుర్తింపు లభించింది. ఆయన 'హిందువులు మరియు సామాజిక ఐక్యతలు రెండూ విరుద్ధ అంశాలని, హిందువులు ఒకటిగా మనగలగాలని కోరుకుంటే, వారు హిందుత్వాన్ని వదులుకోవాలని, హిందూమతం హిందూ ఐక్యతకు పెద్ద అటంకం' అని పేర్కొన్నారు. ఉన్న సమస్య స్వేచ్ఛను, అల్పసంఖ్యాకులకు వారంటే వైషమ్యం కల అధిక సంఖ్యాకుల నుండి సమానత్వాన్ని సాధించటం. కాబట్టి అంటరానివారి సమస్య ప్రాథమికంగా రాజకీయ సమస్య.

అంటరానితనం నిర్మూలన వలన హిందువుల ప్రయోజనాలు దెబ్బ తింటాయి. హిందువులకు అస్పృశ్యత బంగారు గని వంటిది. ఈ సమాజంలో యాజమాన్య, దానికి ఊడిగం చేసే దాస్య వర్గాలు ఉన్నాయి. 25 శాతం ప్రజలు అంటరానివారు. దాస్య వర్గాలకు చెందినవారు. అంటరానితనం మత విధానానికి మించిన, బానిసత్వం కన్నా ఘోరమైన ఆర్థిక విధానం. ఎలాంటి మినహాయింపులూ లేని రీతిలో బానిసత్వాన్ని అనుమతించిన ఒక ఆర్థిక విధానం. అంటరానితనం సంపూర్ణ ఆర్థిక దోపిడీ విధానమే కాక, అడ్డూ అదుపు లేని ఆర్థిక దోపిడీ విధానం. ఎందుచేతనంటే దీనిని గర్హించే జనాభిప్రాయం కాని, దీనిని కట్టడి చేసే నిష్పక్షపాత ప్రభుత్వ యంత్రాంగం కానీ లేవు. హిందువులు దోపిడీ వర్గానికి చెందినవారు. అంటరానితనానికి శాశ్వతత్వాన్ని కల్పించటం హిందువులకు ఆర్థికంగా ప్రయోజనకరం. అంటరానితనాన్ని ఎప్పటికీ కొనసాగించటంలో వారి స్వార్థం ఉంది. బయటి శక్తులు బలవంతంగా వారిని తమ విధానాలను విడిచిపెట్టేలా చేయగలిగితే తప్ప, తమ స్వార్థ ప్రయోజనాలను వారు వదులుకోరన్నది జగమెరిగిన సత్యం. అంటరానితనాన్ని అంబేద్కర్ గ్రా౧ధంగా చిత్రీకరించారు.

ఉన్న.
సంకీర్ణ అంబేద్కర్ దృష్టిలో స్వరాజ్యం అంటరానితనాన్ని అంతం చేయడానికి బదులుగా అభిప్రాయ మరింత జీవం పోస్తుంది. స్వరాజ్యంలో అంటరానివారికి ఏ హక్కులూ లేకపోగా బాధ్యతా ానిసత్వం సంక్రమిస్తుందని భావించారు.

త్రాస్తవానికి పెట్టుబడిదారీ భూస్వామ్య, వడ్డీవ్యాపారుల వంటి అభివృద్ధి నిరోధక అల్పసంఖ్యాక తున్న కాంగ్రెసు పార్టీకి యూరప్, అమెరికా దేశాలకు చెందిన వామపక్ష రాడికల్ మరియు ఇతర మద్దతివ్వటాన్ని అంబేద్కర్ విమర్శించారు. విదేశీ పత్రికా విలేఖరులలో సిద్ధంగా లేరు. 19ఎప్పుడూ కాంగ్రెసుకు చెందినవారిగానే ఉన్నారు. విలేఖరులు అమెరికాకు విభజించే ఏ విధ౦రి బ్రిటిష్ వ్యతిరేకత కారణంగా వారు కాంగ్రెసు పక్షపాతులవుతున్నారని లాహోర్ వార్షికసు. వారు ఇతర రాజకీయ పార్టీలను పట్టించుకోరు, ఆ పార్టీల విధానాలను అధికంగా ఉన్నుకొనేందుకు ప్రయత్నించారు. వారు భారతీయుల మిత్రులవటం అటుంచి, కాంగ్రెసు 1ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు ఆటంకం. విదేశస్తుడు కాంగ్రెసు ప్రాతినిధ్య పాత్రను ఒక నూత భారతదేశం కొరకు పోరాడుతుందని భావిస్తాడు. కాని ఆయన 1937 ఎన్నికలు లేదా వా అలా ప్రాతినిధ్యం వహించటం లేదని రుజువు చేశాయని అన్నారు. కాంగ్రెసు పాకిము నిరాకరణోద్యమం, సత్యాగ్రహం వంటి ఉద్యమాలను చేపట్టింది, మిగిలిన రాజకీయ పేర్గాలు వాటికి దూరంగా ఉన్నాయి. విదేశీయుడెవరూ దేశ స్వాతంత్ర్యానికి, దేశ ప్రజల స్వాతంత్ర్యానికి గల తేడా గురించి ఆలోచించలేదు. భారతదేశం స్వాతంత్ర్యం సంపాదించుకున్నా, భారత ప్రజలు (అంటరానివారిలా) స్వేచ్ఛను పొందలేరు. కాంగ్రెసును సమర్థించటమంటే నిరంకుశత్వం, బానిసత్వాన్ని యథేచ్ఛగా అమలుచేయటాన్ని సమర్థించటమేనని వారికి తెలియజెప్పవలసిన అవసరం ఉందా, లేదా అని అంబేద్కర్ ప్రశ్నించారు.

బ్రాహ్మణులు వారు పరిపాలించే వర్గంగా ప్రకటించుకున్నా లేదా, పరిపాలనా విభాగాలలో వారి ఆధిపత్యాన్ని అణగారిన వర్గాలు అంగీకరించడమన్న విషయం వారు పాలిత

అంబేద్కర్ వివరణలలోనూ, ఉద్యమాలలోనూ పటిష్టమైన కాంగ్రెసు వ్యతిరేకత కనపడుతూనే ఉంటుంది. 1885 నుండి 1944 వరకూ ఏ అంటరానివ్యక్తి కూడా కాంగ్రెసు అధ్యక్షుడిగా ఎన్నుకోబడలేదని ఒక సందర్భంగా చెప్పారు. నవంబరు 1939లో కాంగ్రెసు మంత్రివర్గాల రాజీనామాల తరువాత జిన్నా భారతదేశమంతటా ఉన్న ముస్లిములందరినీ 1939, 22 డిసెంబరు దినాన్ని 'విముక్తిదినం'గా పాటించమని పిలుపు నిచ్చారు. అంబేద్కర్ విముక్తిదిన ఉత్సవాలలో తాను కూడా జిన్నాతో కలిసి పాలుపంచు కుంటానన్నారు. అది హిందూ వ్యతిరేక ఉద్యమం కాదని, కాంగ్రెసు వ్యతిరేక ఉద్యమమని, కాబట్టి పూర్తిగా రాజకీయపరమైనదని వివరించారు. ఆయన, ఆయనతో పాటుగా ఆయన ఇండిపెండెంట్ లేబర్ పార్టీ కూడా అందులో పాల్గొన్నారు. కాంగ్రెసు మంత్రివర్గాల నిరంకుశ అణచివేత చర్యలపై రాయల్ కమీషన్‌ను నియమించవలసినదిగా పత్రికాముఖంగా ఆయన కోరారు.

ముస్లింలీగ్ కాంగ్రెసుల సంబంధాలు బీటలు వారటానికి కారణాలు రెండున్నాయని అంబేద్కర్ అభిప్రాయం. మొదటిది ముస్లింలీగ్‌ను ముస్లింల ఏకైక ప్రాతినిధ్య సంస్థగా గుర్తించేందుకు కాంగ్రెసు నిరాకరించటం. రెండవ కారణం, 1937లో కాంగ్రెసుకు సంఖ్యాబలం ఉన్న ప్రాంతాలలో సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకు అంగీకరించకపోవడం. కాంగ్రెసు దృష్టిలో సంకీర్ణ మంత్రివర్గాల ఏర్పాటు మంత్రివర్గ సమిష్టి బాధ్యతా విధానానికి విరుద్ధం. ఈ అభిప్రాయాన్ని ముస్లింలీగ్ అంగీకరించ నిరాకరించింది. అంటే కాంగ్రెసు ప్రభుత్వంలో సమిష్టి బాధ్యతా విధానం బదులుగా పరిపాలనా విభాగాల చేత నడుపబడే ప్రభుత్వమవుతుంది.

అంబేద్కర్ ఉద్దేశంలో, హిందువులు పాలక వర్గంగానూ, ముస్లిం మరియు ఇతర అల్పసంఖ్యాకులు స్వరాజ్యంలో పరిపాలించబడే వర్గంగానే ఉండాలా అన్నదే సమస్య. ముస్లిం మరియు ఇతర నిమ్నవర్గాలు తమను పాలించబడే వర్గంగా ఉంచే స్థితిని అంగీకరించేందుకు సిద్ధంగా లేరు. 1940, ఏప్రిల్ మాసంలో జరిగిన రాంఘర్ వార్షిక సభలో కాంగ్రెసు భారతదేశాన్ని విభజించే ఏ విధమైన ప్రయత్నాన్ని కూడా ఖండించింది. అదే సమయంలో ముస్లింలీగ్ దాని లాహోర్ వార్షికసభలో దేశ పశ్చిమోత్తర, తూర్పు ప్రాంతాలలో ఎక్కడైతే ముస్లింల సంఖ్య అధికంగా ఉన్నదో అక్కడ, స్వతంత్ర ప్రతిపత్తి కల రాజ్య స్థాపనను డిమాండ్ చేస్తూ తీర్మానించారు. కాంగ్రెసు 1937లో మంత్రివర్గాలను చేపట్టిన తరువాత, ప్రజా సంబంధ ఉద్యమంలో ఉన్న ఒక నూతన శక్తిని గుర్తించారు. ఆ ఉద్యమం ద్వారా ఆ వర్గ నాయకులను పక్కన పెట్టడమో లేదా వారు లేకుండా హిందూ ముస్లిం ప్రజల మధ్య ఐక్యతను సాధించేందుకు ఉద్దేశించబడింది. పాకిస్తాన్ అవతరణకు ఈ ప్రజా సంబంధం ఉద్యమ ఉన్మాద ప్రణాళిక కూడా ఒక కారణమని పేర్కొన్నారు. ఎందువల్లనంటే ఆ ప్రణాళిక హిందూ ముస్లింల మధ్యన ఉన్న అడ్డుగోడను దాటటం అటుంచి, కనీసం ప్రాథమిక ఐక్యతను కూడా సాధించలేకపోయింది.

1916లో లక్నోలో కాంగ్రెసు, ముస్లిం లీగ్‌లు సమావేశమయ్యారు. వారి ప్రయత్నాలు ఫలించాయి. సహాయ నిరాకరణ, కౌన్సిల్‌ల బహిష్కరణలను కాంగ్రెసు అంగీకరించిన పిదప జిన్నా కాంగ్రెసును వదిలి వెళ్ళారు. 1928లో సైమన్ కమీషన్‌ను బహిష్కరించే సందర్భంగా ఆయన కాంగ్రెసుతో చేతులు కలిపారు. ఆ సమయంలో ముస్లింలలోని ఒక వర్గం కాంగ్రెసులో చేరేందుకు సిద్ధమయితే, మరో వర్గం బ్రిటిష్‌వారిపై ఆధారపడేందుకు నిర్ణయించుకుని, దానితో

సహకరించేందుకు నిరాకరించింది. ఖిలాఫత్ ఉద్యమ సమయంలో మాత్రమే విడివిడిగా పారుతున్న ప్రవాహాలు రెండూ ఒకటిగా పారాయి. కాని అంబేద్కర్, 'ముస్లిం రాజకీయం ఏనాటికీ హిందూ రాజకీయంతో ముడివడలేదు' అని పేర్కొన్నారు. అంబేద్కర్ అభిప్రాయంలో హిందువులకు హిందుస్థాన్ అనే విధానం దురాతిశయంతో కూడినదే కాక, మూర్ఖతతో కూడుకున్న తప్పుడు నినాదం. కాంగ్రెసు ముస్లింలను బుజ్జగించే ధోరణి ముస్లింల సమస్యను మరింత క్లిష్టపరిచింది. ఈ సమస్యకున్న ఒకే ఒక్క ముగింపు పరిష్కారం. 'ఆ పరిష్కారం పాకిస్తాన్ అయినట్లయితే ఆ మార్గాన్ని గురించి ఆలోచించటమే మంచిదని' ఆయన అన్నారు. ఈ శాశ్వత బుజ్జగింపు ధోరణికి ముగింపు ఇదే పరిష్కారమైతే ఈ మార్గాన్ని అందరూ ఆహ్వానించటం మంచిది. కాంగ్రెసుకు చెందని వ్యక్తులను రాజకీయపక్షాలను దూరంగా ఉంచే అహంభావ దివాళాకోరు విధానాలను గాంధీజీ కాంగ్రెసులు విడనాడితే కాని, అల్పసంఖ్యాకుల సమస్య పరిష్కారమవదని ఆయన భావించారు.

కె. సంతానం తన పుస్తకం, 'అంబేద్కర్స్ అటాక్'లో అంబేద్కర్‌పై బలమైన దాడి చేశారు. అంబేద్కర్ రచన అయిన 'కాంగ్రెస్ అండ్ గాంధీజీ'ని సందర్భాన్ని పేర్కొనకుండా ఏరిన సంఘటనల అయోమయపు అల్లికగా అభివర్ణించారు. సాక్ష్యాధారాలు లేని ఆరోపణలు, హేతువాద రహిత సిద్ధాంతీకరణలు, అన్నింటినీ కూర్చి అల్లిన ఈ రచన ప్రయోజనం కాంగ్రెసు గాంధీజీలు చేసినది, చేస్తున్నదంతా పూర్తిగా హానికరమని చెప్పటం తప్ప వేరొకటి కాదు.' ఆయన అంబేద్కర్‌ను తనదంటూ ఒక విధానం లేని పండితుడిగా పేర్కొన్నారు. 'ఆయన తనను తాను షెడ్యూల్డ్ వర్గాల నాయకుడిగా గుర్తింపబడాలని వాంఛించారు.' జులై, 1942లో అంబేద్కర్ వైస్రాయ్ కౌన్సిల్‌కు సభ్యునిగా నియమింపబడ్డారు. సంతానం ఇలా వ్యాఖ్యానించారు, 'కాంగ్రెసు వ్యతిరేకత ముఖ్య అర్హత అయిన ఆ ఖాళీగా ఉన్న పదవికి 1942, అగస్టు 15నాటి స్వాతంత్ర్యపోరాట సందర్భాన నియమింపబడే మహోన్నతమైన అవకాశం అంబేద్కర్‌కు దక్కింది.

అంబేద్కర్ 1945లో, వైస్రాయ్ కౌన్సిల్ సభ్యునిగా ఉన్నప్పుడు 'కాంగ్రెస్ అండ్ గాంధీజీ'ని రచించారు. సంతానం అంబేద్కర్‌ను అటువంటి ప్రచారం చేసినందుకు నిందించారు. 'నిర్వహణ సంఘ సభ్యులుగా, ప్రజావిమర్శకు అవకాశంలేని అధికార రక్షణలో ఉండి, వారి అధికారాన్ని వెలయాడి, రాజకీయ వ్యతిరేకులను అప్రతిష్టపాలు చేయటం సహింపరానిది' అని ఆయన విమర్శించారు. అంబేద్కర్ రచన ముఖ్యంగా విదేశీ పాఠకులను దృష్టిలో పెట్టుకుని రచించినది. పుస్తకమంతటా ఆయన అంటరానివారు అన్న పదాన్ని వాడారు. ఆయన, 'అణగారితవర్గాలు' అన్న పదాన్ని అగౌరవపరిచేదిగా ఉందని భావించారు. సంతానం అంబేద్కర్ ఆశయం విదేశీయుల చవకబారు సానుభూతిని పొందటమేనని భావించారు. దీనిని రచించిన అంబేద్కర్, వైస్రాయ్ కౌన్సిల్ సభ్యుడు కనుక, సంగతి తెలియని విదేశీయుడు అంబేద్కర్ ప్రకటనలు, ఆరోపణలకు అధికార ఆమోదముద్ర ఉందని అపోహపడే అవకాశం ఉంటుందని ఆయన భావించారు.

సంతానం 1930-32లో జరిగిన రౌండ్ టేబిల్ సమావేశంలో నెలకొన్న స్థితిని చర్చిస్తూ అంబేద్కర్‌ను నిశితంగా విమర్శించారు. సంతానం అంచనాలో, 'అందులోని సభ్యులు వారి కాంగ్రెసు వ్యతిరేకత కారణంగా నియమింపబడ్డారు. ప్రథమంలో అంబేద్కర్ అర్హత

ఆయన కాంగ్రెసు వ్యతిరేకతే. ఆయన వ్యతిరేకత ఎన్నాళ్ళు ఉంటుందో, బ్రిటిష్ ప్రభుత్వం ఆయనను ఎంతకాలం బలపరుస్తుందో అంతకాలం ఆ పదవి కొనసాగుతుందనే ఆలోచన ఆయనను పట్టివేసింది.' తనపై గాంధీజీ కుట్ర చేసారన్న అంబేద్కర్ ఆరోపణను తిప్పిగొడుతూ, 'కులమత హక్కుల వివాదాన్ని పెద్ద సమస్యగా చూపి గాంధీజీ మరియు కాంగ్రెసు పార్టీలపై, కుట్ర చేసింది, బ్రిటిష్ ప్రభుత్వంచే ఎంపిక కాబడ్డ కమ్యూనిస్టులు' అని సంతానం ప్రత్యారోపణను చేశారు. అంటరానితనానికి వ్యతిరేకంగా కావలసినది, వయోజన ఓటు హక్కు మరియు శక్తివంతమూ, నైతిక బలం కలిగిన సామాజిక ఉద్యమాలని, అవే విముక్తికి సరైన సాధనాలని గాంధీజీ అభిప్రాయమని సంతానం భావించారు.

బొంబాయిలో తప్ప అంబేద్కర్‌కు ఇతర ప్రాంతాల శాసనసభలలో ఎక్కువ స్థానాలు దక్కలేదు. దీనికి ఉన్న రెండు కారణాలను వివరిస్తూ, సంతానం ఈ ప్రాంతాలలో షెడ్యూల్డ్ కులాలవారిని బొంబాయిలో తాను సమీకరించిన విధంగా సమీకరించ గలిగిన విధంగా సమకూర్చగల సహచరులు అంబేద్కర్‌కు లేకపోవటం కాని, లేదా ఆ కులాలవారిని కాంగ్రెసు, జాతీయసంస్థతో చేతులు కలపటంలో తమ ప్రయోజనం ఉందని ఒప్పించగలగి ఉండవచ్చు.

కాంగ్రెసు లక్ష్యాలను, కుల మతాలపై దాని ప్రతిస్పందననూ విశ్లేషిస్తూ, సి. రాజగోపాలాచారి ఆ పార్టీ లక్ష్యం ఒక ప్రజాస్వామ్య ప్రభుత్వ ఏర్పాటని వివరించారు. సంఖ్యాధిక పరిపాలనను గౌరవించటం, ప్రతి వ్యక్తికి న్యాయపరమైన పరిరక్షణలు ప్రజాస్వామ్యం యొక్క ముఖ్య లక్షణాలని ఆయన వివరించారు. స్వరాజ్యం యొక్క ఉనికి ప్రజాస్వామ్య పరిధిలోనే ఉంటుందని భావించారు. కాంగ్రెసు ఉద్యమం నుండి షెడ్యూల్డ్ కులాలవారిని వేరు చేశారని అంబేద్కర్‌ను నిరసించారు.

1937 ఎన్నికల ప్రచార సందర్భంగా అంబేద్కర్ ఒక బహిరంగసభలో ప్రసంగిస్తూ, కాంగ్రెసును పెట్టుబడిదారుల చేతులలో పనిముట్టుగా అభివర్ణించి, కార్మిక వ్యవసాయకూలీల ప్రయోజనాలకు వ్యతిరేకంగా అది ప్రవర్తిస్తుందని ఆరోపించారు. 1938లో మహాడ్‌లో జరిగిన వ్యవసాయ కూలీల సభలో మాట్లాడుతూ, బొంబాయి మంత్రివర్గం సర్దార్ పటేల్ చేతిలో ఉపకరణాలనీ, బొంబాయి శాసనసభ సభ్యులు గుజరాతీ పెట్టుబడిదారుల మరియు పటేల్ ఇంటి కాపలా కుక్కలనీ, వారంతా మహారాష్ట్రీయులకు, అంటరానివారికీ శత్రువులని విమర్శించారు.

బీహార్ వ్యవసాయ కార్మిక నాయకుడు స్వామి సహజానంద, 1938, అగస్టు 15న అంబేద్కర్‌ను బొంబాయిలోని ఆయన స్వగృహం వద్ద కలిసి, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సంఘటనను ఏర్పాటు చేసేందుకు కాంగ్రెసుతో కలవమని ఒప్పించేందుకు ప్రయత్నించారు. కాంగ్రెసు కనుక సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడితే ఇండిపెండెంట్ లేబర్ పార్టీని రద్దుచేసి కాంగ్రెసులో చేరేందుకు తాను సిద్ధమేనని, కానీ, కాంగ్రెసు పెట్టుబడిదారీ వర్గాల ప్రయోజనాల కొరకు కార్మిక, వ్యవసాయ కార్మికుల ప్రయోజనాలను తాకట్టు పెట్టిందని, అందువలన తాను అటువంటి సంస్థలో చేరలేనని అంబేద్కర్ తెలిపారు.

అంబేద్కర్, నెహ్రూ ప్రభుత్వం మరియు కాంగ్రెసు పార్టీలు ప్రజలకు పరిశుద్ధమైన అవినీతిరహిత పరిపాలనను అందివ్వలేకపోయాయని విమర్శించారు. కాంగ్రెసు ప్రజలకు

తిండి, బట్టను ఇవ్వలేకపోయిందనీ, అవినీతి, లంచం, ఆశ్రిత పక్షపాతాలు లేని స్వచ్ఛమైన పాలనను ఇవ్వటంలో విఫలమయిందని ఆయన ఆరోపించారు. ఈ చర్యలను అమలు చేసేందుకు అడ్డంకి స్వయంగా కాంగ్రెసేననీ, దానికి స్వచ్ఛమైన పరిపాలనలో నమ్మకం లేదనీ ఆయన అన్నారు. కాంగ్రెసు వ్యక్తిగత విధేయతల ఆధారంతో నిర్వహింపబడుతుందని ఆయన ఆరోపించారు.

## సెక్షన్-5

### రాజ సంస్థానాలు

బ్రిటిష్ సామ్రాజ్యవాద ప్రయోజనాల జేబుసంస్థలుగా ఉన్న రాజ్య సంస్థానాలు అభివృద్ధి నిరోధకత్వానికి ఆలవాలంగా ఉండేవి. ప్రజాపోరాటాలు ఆ రాజ్యాలలో సాధారణ దినచర్య అయ్యాయి. భారత ప్రజల స్వాతంత్ర్య పోరాటం సంస్థాన ప్రజలను తమ రాజకీయ హక్కుల మరియు స్వాతంత్ర్యాల కోసం పోరాడేందుకు ప్రభావితం చేసింది.

స్వీయ పంథాలో గాంధీజీ 1938లో రాజకోట్ సంస్థాన ప్రజల పోరాటానికి నాయకత్వం వహించారు. ఆ సంక్లిష్ట సమయంలో అంబేద్కర్ రాజ్‌కోట్‌కు వెళ్ళి ఒక సభలో ప్రసంగిస్తూ అణగారిత వర్గాలను వారి రాజకీయహక్కుల కోసం తమ పోరాటాన్ని కొనసాగించమని కోరారు. ఒక పత్రికా సమావేశంలో అంబేద్కర్ 'బాధ్యతాయుత ప్రభుత్వ ఏర్పాటు, భారత ప్రభుత్వ శాసనం, 1935 ప్రకారం ఏర్పాటయే అల్ ఇండియా ఫెడరేషన్‌లో చేరేందుకు రాజసంస్థానాలు కనపరిచే ఉత్సాహం కానీ మరే ఇతర కారణం కానీ ఆధారం కాకూడదు' అని గట్టిగా చెప్పారు.

ప్రతిపాదించిన ఫెడరేషన్ ముస్లింలు, హిందువులు మరియు సంస్థానాధీశులను కలిగి ఉంటుంది. కాంగ్రెసు పార్టీకి మెజారిటీ దక్కలేదు కనుక, సంస్థానాధీశులతో కానీ లేదా బ్రిటిష్ ప్రభుత్వంతో కానీ సహకరించక తప్పదు. అమెరికా, స్విట్జర్లాండు, కెనడా మరియు ఆస్ట్రేలియా వంటి దేశాలలోని వివిధ ఫెడరల్ విధానాలను అంబేద్కర్ చర్చించారు. ఆయన అమెరికా రాజ్యాంగానికి ప్రతిపాదించిన భారత ఫెడరేషన్‌ల మధ్య నున్న తేడాలను ముందుంచి ఇలా పేర్కొన్నారు, 'అమెరికా రాజ్యాంగం మదింపు చేయబడి ఒక యూనియన్ స్థాపనకు కారణమయింది. భారతీయ ఫెడరేషన్ మదింపులో వెలువడి మదింపుతోనే కొనసాగుతుంది.'

నియమింపబడటం ద్వారా సంస్థానాలకు కేటాయించిన స్థానాలకు సంస్థానాధీశులను, బ్రిటిష్ ప్రభుత్వం చేత పరిపాలింపబడుతున్న భారతదేశానికి కేటాయించిన స్థానాలను ఎన్నికల ద్వారా భర్తీ చేయబడ్డాయి. కొంత భాగం నియమింపుల ద్వారా, కొంత భాగం ఎన్నికల ద్వారా ఏర్పాటుకై ప్రతిపాదించబడ్డ ఫెడరేషన్ శాసనసభ వైవిధ్యాల కలగూరగంప అవుతుంది. అంబేద్కర్ 'ఈ ఫెడరేషన్ సంస్థానాధీశులను మా లక్ష్యాలను నిర్ణయించే నిర్దేశకులను చేస్తుంది. వారి అభీష్టం లేనిదే రాజకీయంగా భారతదేశం ముందుకు వెళ్ళలేదు.' అందువలన ప్రతిపాదిత ఫెడరేషన్ భారతీయ సంస్థానాల ప్రజాస్వామీకరణకు పెద్ద ఆటంకం. ఈ చర్యను చేపట్టేందుకు ప్రేరణ, సంస్థానాధీశులను సామ్రాజ్యవాద ప్రయోజనాలకు మద్దతిచ్చే విధంగా

వాడుకోవటం, ఎగసిపడుతున్న భారత ప్రజాస్వామ్య కెరటాన్ని వెనక్కి మళ్ళించటం.' ముస్లింలకు కావలసినది కేంద్రం బలహీనంగా ఉండటం మరియు నామావశిష్ట అధికారాలను సంస్థానాలకు కట్టబెట్టటం. హిందూ మహాసభవాదులకు సంస్థానాల విలీనం హిందూమతాన్ని శక్తివంతం చేయడం. కాంగ్రెసు వెనుక ఉన్న వ్యాపారవర్గాలు వ్యాపారరంగం నుండి యూరోపియన్లను తొలగించి, జాతీయవాదం పేరుతో ఆ స్థానాన్ని వారు భర్తీ చేయాలని వాంఛించారు. 'ఫెడరేషన్, స్వేచ్ఛా మనిషికి నిలువెత్తు ప్రమాదం మరియు పేద మనిషి అభ్యున్నతికి అడ్డంకి' అని అంబేద్కర్ వ్యాఖ్యానించారు.

ఫెడరేషన్ ప్రతిపాదనపై కాంగ్రెసు చేసిన తీర్మానం గురించి మాట్లాడుతూ, కాంగ్రెసుకు లిబరల్స్‌కు మధ్యన వ్యత్యాసమేమీ లేదని అంబేద్కర్ చెప్పారు. కాంగ్రెసును లిబరల్ ఫెడరేషన్ యొక్క వామపక్షంగా భావించవచ్చని అన్నారు. కాని లిబరల్స్ నిజాయతీపరులు, కాంగ్రెసు ఒకవైపు పదవులను అంగీకరించడమంటే దేశద్రోహమన్ని అంటూనే మరోవైపు 'పదవులను స్వీకరించటం రాజ్యంగాన్ని దెబ్బతీసేందుకేనని' సిగ్గువిడిచి తన చర్యలను సమర్థించుకున్నది. వారు ప్రజలను ఎప్పుడూ మోసం చేస్తూనే ఉన్నారని అన్నారు.

1947, అగస్టు 15న భారతదేశం రాజ్యాధికారాన్ని పొందినప్పుడు, అధికార బదలాయింపు సమస్యను సత్వరం పరిష్కరించే సమయంలో తిరువాన్కూర్, హైదరాబాద్ సంస్థానాలు స్వాతంత్ర్యాలను ప్రకటించుకున్నాయి. అంబేద్కర్ ఆ సంస్థానాలను ఇండియన్ యూనియన్‌లో చేరమని సలహా ఇచ్చారు. ఈ ప్రయత్నాలకు ప్రతిగా ఎలాంటి చర్యను చేపట్టినా కూడా భారతదేశం ముక్కలయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రాజ్యంగ ప్రతిలో సంస్థానాలకు వారి స్వంత సైన్యాలను ఉంచుకునే స్వేచ్ఛను ఇవ్వటం తిరోగమన చర్య అని, ప్రమాదకర చర్య అని, దాని వలన భారత ఐక్యత దెబ్బతిని, కేంద్రాన్ని కూలద్రోసే ప్రమాదం ఉందని ఆయన భావించారు. 'మొత్తం సార్వభౌమాధికారాన్ని బదలాయించినప్పుడు, ఒక సంస్థానాధీశుని సరిహద్దు భారతదేశ సరిహద్దు అయి, దాని సార్వభౌమాధికారం మొత్తం భారత యూనియన్‌కు చెందుతుంది' అని వివరించారు.

తరువాత అంబేద్కర్ సర్వోన్నత అధికారం గురించి చర్చించారు. మొదటగా సర్వోన్నత అధికారం, సింహాసనాధికారానికి ఇచ్చిన మరో పేరు. రెండవది, సర్వోన్నత అధికారం రాజుకు చెందిన అధికారం. అందరూ అనుకునే విధంగా అది ప్రపంచన్యాయ సూత్రాల పరిధిలోకి రాదు. కాని మున్సిపాల్ శాసనం లాంటి బ్రిటిష్ రాజ్యాంగ శాసన పరిధిలోకి అది వస్తుంది. దాని ప్రకారం, రాజుకు సర్వోన్నత అధికారం ఉన్నప్పటికీ దానిని స్వేచ్ఛగా అమలు చేసే అవకాశం రాజుకు ఉండదు. దానికి మంత్రివర్గం ఆమోదముద్ర అవసరం. భారతదేశం సార్వభౌమాధికారాన్ని పొందాక, రాజ్య సింహాసనం దాని సర్వోన్నత అధికారాన్ని భారత కేంద్ర మంత్రివర్గం సలహాతో అమలుచేయాలి. బ్రిటిష్ రాజ్యంగం బాధ్యతాయుత ప్రభుత్వానికి, సార్వభౌమాధికారానికి మధ్యన ఒక ముఖ్యమైన తేడాను చేర్చింది. సార్వభౌమాధికారం ఉన్న దేశం విషయంలో సింహాసనం అంతరంగిక, విదేశాంగ విధానాలలో మంత్రివర్గ నిర్ణయాలను ఆమోదించి తీరాలి. స్వతంత్ర దేశంగా భారతదేశం తన సర్వోన్నత అధికారాన్ని చేపట్టేందుకు పూర్తి హక్కును కలిగి వుంది. చిన్న సంస్థానాలు ఉన్నా, అవి సర్వ స్వతంత్రతను కలిగి ఉండవు. భారతదేశం వాటి స్వయం ప్రతిపత్తిని గుర్తించదు, ప్రపంచదేశాలు వాటికి స్వతంత్ర

ప్రతిపత్తిని ఇవ్వవు. తమపై ఉన్న సింహాసనాధిపత్యాన్ని తొలగించుకునే ఏకైక మార్గం, సర్వాధికారాన్ని లేదా సంస్థానాధికారాన్ని విలీనం చేయటమే ఆ మార్గం. రాజ్యాంగ సంస్థలుగా భారత యూనియన్‌లో చేరటం ద్వారా అది సాధ్యమవుతుంది. ఎవరైనా దివాను (సి. పి. రామస్వామి అయ్యర్) అతని సంస్థానాధీశుడికి యూనియన్‌లో చేరవద్దని సలహా ఇస్తే, అతను ఆ రాజుకు శత్రువయితే తప్ప అలా చేయడు. యూనియన్ ఆ సంస్థానాధీశుడి వారసత్వ అధికారాన్ని గుర్తిస్తుంది. ఈ రోజులలో అదే గొప్ప విషయం. ఆయన అభిప్రాయంలో సర్వ స్వతంత్రతను పొంది, యు.ఎన్.ఒ. నుండి గుర్తింపు పొందాలనుకోవడం అంటే ఊహాలోకాలలో విహరించటమే.

అంబేద్కర్ తాత్కాలిక ప్రభుత్వాన్ని ఈ క్రింది చర్యలను చేపట్టవలసిందిగా కోరుతానని చెప్పారు.

1. బ్రిటిష్ పార్లమెంటుకు సర్వోన్నత అధికారాన్ని రద్దుచేసే హక్కు లేదని, భారతదేశానికి సార్వభౌమ అధికారాన్ని ఇచ్చే శాసనంలో అలా చేస్తూ ఎటువంటి నిబంధనను పొందుపరిచినా, దానిని భారత ప్రజలు తమ సర్వ స్వతంత్ర హక్కులకు భంగకరంగా భావించి, చెల్లనిదిగా పరిగణిస్తారని బ్రిటిష్ ప్రభుత్వానికి తెలియపరచాలి.

2. భారత ప్రభుత్వం ఏ భారతీయ సంస్థానాన్ని సర్వ స్వతంత్ర రాజ్యంగా గుర్తించదని ప్రకటించాలి.

*3. స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్న ఎటువంటి భారత భాగాన్ని కూడా తన సభ్యరాజ్యంగా చేర్చుకుంటే భారతీయులు ఆ చర్యను తమ సర్వ స్వతంత్ర ప్రతిపత్తికి గల హక్కును ఉల్లఘించినట్లుగా భావించి గట్టిగా వ్యతిరేకిస్తారని యు.ఎన్.ఒ.కు తెలియజేయాలి.*

అంబేద్కర్ రాజ్య సంస్థానాల విషయంలో భారత సార్వభౌమాధికారాన్ని సమర్థించారు. ఆయన ఈ విషయంలో భారత సామాన్య జాతీయ మనోవాంఛానుగుణంగా అభ్యుదయ భావాన్నే వ్యక్తపరిచారు.

కాంగ్రెసు పెట్టుబడిదారీవర్గ అనుకూల విధానాలను గుర్తించారు. సహజానందకు జవాబిస్తూ కాంగ్రెసు నిజమైన సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాన్ని చేపడితే తాను కాంగ్రెసులో చేరతానన్నారు. కాని ఆయన తానుగా ఎలాంటి సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాన్ని చేపట్టలేదు, కనుక దేశంలో *సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమం శక్తివంతమవలేదు.* పైగా ఆయన వైస్రాయ్ ఎగ్జిక్యూటివ్‌లో సభ్యుడయ్యారు. లిబరలిజమ్ మరియు రాజ్యాంగ నిర్దేశికత ఆయన విధానాల ముఖ్య లక్షణం.

# అధ్యాయం 7

# మైనారిటీల సమస్యలు-పాకిస్తాన్

## సెక్షన్-1

### మైనారిటీల సమస్యలు

రాజ్యాంగ పరిషత్ రెండు తక్షణ సమస్యలను ఎదుర్కోవలసి వచ్చింది. మైనారిటీల సమస్య, భారత రాష్ట్రాలకు సంబంధించిన సమస్య. అఖిల భారత షెడ్యూల్డ్ కులాల సమాఖ్య తరఫున రాజ్యాంగ పరిషత్‌కు ఒక వినతిపత్రం సమర్పించారు. ఆ వినతి పత్రానికి 'రాష్ట్రాలు - మైనారిటీలు' అనే పేరు పెట్టారు. స్వతంత్ర భారతదేశ రాజ్యాంగంలో మైనారిటీలను మమేకం చేసేందుకుగాను అనుసరించాల్సిన మార్గాలు, వారికి కల్పించాల్సిన హక్కులను అంబేద్కర్ ఆ వినతి పత్రంలో సవివరంగా పొందుపరిచారు. ప్రాథమిక హక్కులు, మైనారిటీల హక్కులు, షెడ్యూల్డ్ కులాల వారి భద్రత కోసం తీసుకోవాల్సిన చర్యలను ఆ వినతిపత్రంలో వివరించారు. షెడ్యూల్డ్ కులాల వారు మైనారిటీల స్థాయికి మించి వున్నారని, పేదలు, మైనారిటీల పరిరక్షణకు సాధారణంగా తీసుకునే చర్యలు షెడ్యూల్డ్ కులాల వారి విషయంలో సరిపోవని అంబేద్కర్ విశదీకరించారు. మెజారిటీ వర్గం పాటించే వివక్షత, నియంతృత్వం, అణచివేతలకు వ్యతిరేకంగా ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

రాష్ట్రాల కూటమికి సంబంధించిన రాజ్యాంగం రూపంలో అంబేద్కర్ ఆ వినతిపత్రాన్ని పొందుపరిచారు. అందులోని 21 నియమావళుల్లో ప్రాథమిక హక్కులను, వాటిపై జరిగే దాడులకు తీసుకోవాల్సిన పరిష్కార మార్గాలను ఆయన సూచించారు. అధికారుల నిరంకుశత్వం, అసమానత్వం, వివక్షత, ఆర్థికపరమైన దోపిడీలకు వ్యతిరేకంగా తీసుకోవాల్సిన పరిష్కారాలను, చర్యలను సూచించారు. మైనారిటీల పరిరక్షణకు సంబంధించి మతోన్మాద పాలకులు, సామాజిక, ఆర్థిక నియంతృత్వం, అణచివేత, సంఘ బహిష్కరణ వంటి అకృత్యాలకు వ్యతిరేకంగా తీసుకోవాల్సిన చర్యలను అంబేద్కర్ సూచించారు. చట్ట వ్యవస్థలో ప్రాతినిధ్య హక్కులకు సంబంధించి నిర్దిష్టమైన హామీలు ఇవ్వడం షెడ్యూల్డ్ కులాల భద్రత, పరిరక్షణ దిశగా

తీసుకోవాల్సిన చర్యగా పేర్కొన్నారు. పూనా ఒప్పందం ప్రవేశపెట్టిన ఎన్నికల విధానాన్ని రద్దు చేసి దాని స్థానంలో కొత్త ప్రత్యామ్నాయ విధానాన్ని ప్రవేశపెట్టాలని ఆయన సూచించారు. వయోజన ఓటు హక్కు కల్పించడం, క్యూములేటివ్ ఓటింగు చట్ట వ్యవస్థలో, సర్వీసుల్లో ప్రాతినిధ్యం, ఉన్నత స్థాయి విద్యావకాశాలు కల్పించాలనేవి వారి డిమాండ్లుగా ఉన్నాయి.

ఈ డిమాండ్లకు సంబంధించి బ్రిటిష్ లేదా పార్లమెంటరీ వ్యవస్థలోని ముఖ్యాంశాలను అంబేద్కర్ ప్రతిపాదించారు. అదే వ్యవస్థను ఆయన మన దేశంలో ప్రవేశపెట్టారు. చట్ట సభలో మెజారిటీ గల పార్టీ ఏర్పాటు చేసిన మంత్రివర్గం ద్వారా పరిపాలన సాగించే విధానాన్ని ఆయన మన దేశంలో ప్రవేశపెట్టారు. ఇక్కడ మెజారిటీ అంటే రాజకీయపరమైన మెజారిటీ అని ఆయన సూత్రీకరించారు. అంబేద్కర్ అభిప్రాయం ప్రకారం భారతదేశంలో మెజారిటీ అంటే మతపరమైన మెజారిటీ అని అర్థం. బ్రిటిష్ తరహా పాలనా వ్యవస్థను మన దేశంలో ప్రవేశపెట్టడం మైనారిటీలు, ముఖ్యంగా అస్పృశ్యుల జీవితం, స్వేచ్ఛ, సంతోషం కోసం సాగించే జీవన పోరాటంపై ప్రభావం చూపే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

భారతదేశంలో పాలనా వ్యవస్థ పూర్తిగా హిందువుల చేతిలో ఉందని అంబేద్కర్ భావించారు. అది వారి గుత్తస్వామ్యంగా పరిణమించిందని ఆయన అభిప్రాయపడ్డారు. పోలీసులు, న్యాయవ్యవస్థ, రెవెన్యూ సర్వీసుల్లో వారిదే పై చేయిగా వుంది. పాలనా వ్యవస్థలో ప్రతి విభాగంలో వారిదే ఆధిపత్యం. పాలనా వ్యవస్థకు వెలుపల ఉన్న హిందువుల్లో ఉండే విధంగానే పాలనా వ్యవస్థలో భాగస్వాములుగా ఉన్న హిందువుల్లో కూడా అస్పృశ్యుల పట్ల అదే సామాజిక వ్యతిరేక, శత్రుభావంతో కూడిన ఆలోచనా విధానం ఉండేవి. ఫలితంగా అస్పృశ్యులు హిందూ జనాభా, హిందూ పాలకుల మధ్య నలిగిపోయారు. తమ పట్ల హీనంగా వ్యవహరించేవారు, అలా హీనంగా వ్యవహరించే వారిని రక్షించే వారి మధ్య అస్పృశ్యులు బందీలై పోయారు. మరి వారికి స్వరాజ్యం వచ్చిందని ఎలా చెప్పగలమని అంబేద్కర్ ప్రశ్నించారు. ఆయన దృష్టిలో స్వరాజ్యం అంటే ఒక్కటే అర్థం. బ్రిటిష్ పాలనా వ్యవస్థలో ఒక్క పరిపాలన మాత్రమే హిందువుల చేతిలో ఉండేది. స్వరాజ్యం వచ్చిన పిమ్మట శాసన వ్యవస్థ, పాలనా యంత్రాంగం అన్నీ హిందువుల చేతుల్లోకి వెళ్ళిపోతాయని, ఇది అస్పృశ్యుల బాధలు, ఇబ్బందులను మరింతగా జటిలం చేస్తుందని అంబేద్కర్ అభిప్రాయపడ్డారు.

బ్రిటిష్ వ్యవస్థ బ్రిటన్ ప్రజలకు సుస్థిరమైన పాలనను అందించింది. మరి అది భారతదేశంలో కూడా అదే విధంగా సుస్థిరమైన పాలనను అందించగలుగుతుందా అనేదే ఇక్కడ ప్రధానమైన ప్రశ్న. ఇందుకు అవకాశాలు బాగా తక్కువ అని అంబేద్కర్ అభిప్రాయపడ్డారు. ప్రభుత్వాన్ని కూలదోసే లక్ష్యంతో కొన్ని వర్గాలు విలీనం కావడం, పునఃస్సమీకరణ కావడం అత్యంత సునాయాసమైన విషయం. మెజారిటీ పార్టీల సంఘీభావం ఇందువల్ల కొనసాగే

అవకాశం ఉంటుందని భావించలేమని ఆయన అన్నారు. ఇలా ప్రభుత్వాలను తరచూ కూలదోయడం అరాచకత్వానికి దారి తీస్తుందని హెచ్చరించారు.

అంబేద్కర్ ఈ పాలనా వ్యవస్థను సూచించారు.

(1) మైనారిటీలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే అవకాశాలు కలిగించని విధంగా మెజారిటీ వర్గీయులు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయకుండా నిరోధించడం, (2) మైనారిటీలపై మెజారిటీ వర్గీయులు నిరంకుశత్వం ప్రదర్శించడం అసాధ్యమయ్యే విధంగా పాలనా యంత్రాంగంలో వారికి పూర్తి నియంత్రణ లేకుండా చెయ్యడం, (3) మైనారిటీల విశ్వాసం చూరగొనని వ్యక్తులను వారి ప్రతినిధులుగా మెజారిటీ వర్గీయులకు చోటు కల్పించకుండా చెయ్యడం (4) మంచి, సమర్ధవంతమైన పాలన అందించేందుకు సుస్థిరమైన పాలనా యంత్రాంగాన్ని రూపొందించడం.

చివరిగా మైనారిటీల వ్యవహారాల పర్యవేక్షక అధికారిని నియమించాలని ఆయన సూచించారు. ఉమ్మడి నియోజకవర్గ విధానం వల్ల పరిస్థితులు మరింతగా దిగజారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యవస్థలో షెడ్యూల్డు కులాల వారు వారి ఓటు హక్కు వినియోగించుకోకుండా పూర్తిగా నిరోధించే అవకాశం వుందని సార్వత్రిక ఎన్నికలు నిర్ద్వంద్వంగా నిరూపించాయి. రక్షిత కులం లేదా వర్గం ప్రాతినిధ్యం బాగా తక్కువ పరిమాణంలో ఉన్న సందర్భాల్లో కొన్ని స్థానాలను వారికి కేటాయించే విధానం ఆచరణ కాకుండా నిలిచిపోతుందని సైమన్ కమిషన్ వ్యాఖ్యానించిన విషయాన్ని అంబేద్కర్ గుర్తు చేశారు.

అనవసరమైన సమస్యలు సృష్టించే ప్రాథమిక ఎన్నికల వ్యవస్థను రద్దు చేసి దాని స్థానంలో ప్రత్యేక పోలింగ్ విధానం ప్రవేశపెట్టడం ఈ నూతన విధానం లక్ష్యమని అంబేద్కర్ సూచించారు. షెడ్యూల్డ్ కులాల వారికి ప్రత్యేకంగా పోలింగ్ వ్యవస్థ ఏర్పాటుకు వ్యతిరేకంగా ఈ క్రింది ఐదు కారణాలను పేర్కొన్నారు.

1) షెడ్యూల్డు కులాల వారు మైనారిటీలు కాదు.

ఒక వర్గం మైనారిటీయా, కాదా అనే విషయాన్ని నిర్ధారించేందుకు సామాజిక వివక్ష నిజమైన పరీక్షగా నిలుస్తుంది. షెడ్యూల్డ్ కులాల వారు భారతదేశంలో నిజమైన మైనారిటీలని గాంధీజీ అభిప్రాయపడ్డారు.

2) షెడ్యూల్డ్ కులాల వారు హిందువులు. అందువల్ల వారికి ప్రత్యేక ఓటు హక్కు కల్పించలేం.

మతపరమైన అనుసంధానం ప్రాతిపదికగా రాజ్యాంగ రక్షణ చర్యలు తీసుకోవడం యుక్తం కాదు. ఇది సామాజిక వేర్పాటువాదం, వివక్షతకు దారితీయవచ్చుననే అంశాన్ని విస్మరించడమే అవుతుంది. సామాజిక వివక్షత ప్రాతిపదికగా హిందూ, ముస్లిం సంబంధాల

నేపథ్యంలో ముస్లింలకు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించడమైంది. మత ప్రాతిపదికన కాకుండా సామాజిక వేర్పాటు నిర్ణయాత్మకం కావాలి.

3) ప్రత్యేక హోదా కల్పించడం అస్పృశ్యతకు దారితీస్తుంది. ఇది అనవసరమైన చర్య అని అంబేద్కర్ వ్యాఖ్యానించారు.

(4) ప్రత్యేక హోదా కల్పించడం దేశ వ్యతిరేక చర్య.

జాతీయవాదం, జాతి వ్యతిరేక వాదంతో ఎన్నికల వ్యవస్థకు సంబంధం లేదు. ఇవి ఎన్నికలకు అతీతమైన శక్తుల ఫలితమే.

(5) దేశ ప్రయోజనాలకు భిన్నంగా వ్యవహరించేలా బ్రిటిష్ సామ్రాజ్యవాద శక్తులు ప్రభావం చూపించడానికి ఈ ప్రత్యేక ప్రతిపత్తి దోహదం చేసింది.

**ఈ వాదన పలాయనవాదం తప్ప మరొకటి కాదు**

ప్రత్యర్థుల గురించి అంబేద్కర్ ఈవిధంగా వ్యాఖ్యానించారు. (1) ఎన్నికల వ్యవస్థకు, మతపరమైన, కులపరమైన వ్యవస్థకు మధ్య సంబంధం లేదని గుర్తించడంలో వారు విఫలమయ్యారు. (2) ప్రత్యేక హోదా విషయంలో మెజారిటీ వర్గీయులు, మైనారిటీ వర్గీయులు చేస్తున్న డిమాండ్ల మధ్య వ్యత్యాసాన్ని గుర్తించడంలో వారు విఫలమయ్యారు. దీనిని బట్టి అంబేద్కర్ దృష్టిలో సరైనదేమంటే (1) ఎన్నికల వ్యవస్థ అనేది మైనారిటీల వ్యవస్థ కోసం రూపొందించిన యంత్రాంగం, తమకు ఏది ఎక్కువమేలు చేస్తుందో దానిని ఎంపిక చేసుకునే అవకాశం మైనారిటీ వర్గీయులకు కల్పించాలి. (2) అధికారం చెలాయించగల స్థితిలో వున్న మెజారిటీ వర్గీయులకు ఎన్నికల విధాన రూపకల్పనలో ఎటువంటి పాత్ర కల్పించరాదు. మైనారిటీల నిర్ణయం ఏమిటో తెలుసుకొని దానికి కట్టుబడి వుండటమే వారు చేయవలసిన పని. ప్రభుత్వ సర్వీసుల్లో షెడ్యూల్డ్ కులాల వారికి తగిన ప్రాతినిధ్యం కల్పించే విషయంలో పూనా ఒప్పందంలోని 8వ క్లాజ్ నిర్దిష్టమైన హామీనిచ్చింది. పోలీసులు, న్యాయమూర్తులు తమ విధుల కంటే తమ పదవులు తెచ్చే హోదాలపైనే ఎక్కువ మక్కువ చూపుతారని అంబేద్కర్ పేర్కొన్నారు. దురదృష్టవశాత్తు మెజారిటీ వర్గీయులు తమ అభిమతాలకు అనుగుణంగా మైనారిటీలను పరిపాలించే 'పవిత్ర హక్కు'గా పిలబడే కొత్త సిద్ధాంతాన్ని భారత జాతీయవాదం రూపొందించింది. అధికారంలో తమకు భాగస్వామ్యం కల్పించాలని మైనారిటీ వర్గీయులు కోరితే దానిని వర్గతత్వంగా, అదే మెజారిటీ వర్గీయులు గుత్తాధికారం చెలాయిస్తే దానిని జాతీయవాదంగా అభివర్ణించడం పరిపాటిగా మారిందని అంబేద్కర్ పేర్కొన్నారు. ఆర్థిక భద్రత లేకపోతే ప్రాథమిక హక్కుల వల్ల ఒనగూరే ప్రయోజనం ఏమీ ఉండదని అంబేద్కర్ తన పుస్తకం "స్టేట్స్ – మైనారిటీస్'లో పేర్కొన్నారు.

అంబేద్కర్ భయపడినట్లుగా మతతత్వం, వర్గతత్వం భారతీయుల్లో బాగా లోతుగా వేళ్ళూనుకుంది. రానున్న అనేక సంవత్సరాల్లో రాజకీయాలు మతం, కులపరంగా చీలిపోయే పరిస్థితి నుంచి బయటపడే అవకాశాలు లేవు.

ప్రత్యేక హోదా విషయాన్ని అంబేద్కర్ రౌండ్ టేబుల్ సమావేశం సందర్భంగా గట్టిగా ప్రతిపాదించారు. అయితే జాతీయవాద ఒత్తిడి, మత ప్రాతిపదికపై అవార్డు ప్రదానం చేయడాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అంబేద్కర్ ఆమరణ నిరాహారదీక్ష చేపడతానని గాంధీజీ చేసిన హెచ్చరిక దరిమిలా వర్గం, పూనా ఒప్పందానికి ఆమోదం తెలపాల్సి వచ్చింది. గాంధీ నిరాహారదీక్ష సందర్భంగా అంబేద్కర్ సెంటిమెంట్‌పరంగా చేసిన పొరపాటుకు విచారం వ్యక్తం చేశారు. దానిని వినతిపత్రంలో సరిచేసుకున్నారు. భారత రాజ్యాంగ పరిషత్తులో మైనారిటీలు, మెజారిటీ వర్గీయుల పాత్రను ఆయన నిశితంగా విమర్శించారు. వారు పొరపాటు మార్గాన్ని అనుసరించారని అన్నారు. మైనారిటీల ఉనికిని ప్రతి మెజారిటీ వర్గీయులు ఆమోదించి తీరాలని ఆయన అన్నారు. వారిని మైనారిటీలుగానే కొనసాగించడం సహేతుకం కాదన్నారు. ఏదో ఒకరోజు మైనారిటీలు మెజారిటీ వర్గీయులు ఒకరిగా విలీనం కావలసి ఉంటుందని జోస్యం చెప్పారు.

## సెక్షన్-2

### దేశ విభజన - పాకిస్తాన్

మొత్తం భారతదేశంపై ఆధిపత్యం చెలాయించే కేంద్ర ప్రభుత్వ ఏర్పాటుపై వ్యక్తమైన వ్యతిరేకత పాకిస్తాన్ ఏర్పాటుకు చోదక శక్తిగా పనిచేసిందని అంబేద్కర్ అభిప్రాయపడ్డారు. రెండు కేంద్ర ప్రభుత్వాలు అవసరమని పాకిస్తాన్ భావించింది. ఒక కేంద్ర ప్రభుత్వానికి అంగీకరించడం అంటే ప్రాంతీయ ముస్లిం ప్రభుత్వాలను ఒకే కేంద్ర హిందూ ప్రభుత్వ పర్యవేక్షణ కింద ఉంచడమేనని ముస్లింలు భావించారు. ముస్లిం ప్రభుత్వాల ఏర్పాటు వల్ల సాధించిన ప్రయోజనాన్ని కేంద్రంలో హిందూ ప్రభుత్వానికి ఫణంగా పెట్టడమేనని వారు భావించారు. కేంద్రంలో హిందూ ప్రభుత్వ నియంతృత్వం నుండి తప్పించుకునేందుకు ముస్లిం తరహా పరిష్కారం అసలు కేంద్ర ప్రభుత్వం అంటూ ఒకటి లేకపోవడమే. ఇస్లాం మతాన్ని అనుసరించేవారికి పాకిస్తాన్‌ను ఏర్పాటు చేయాలని ముస్లింలీగ్ డిమాండ్ చేసింది.

ఇస్లాం మతం ప్రవచించే సోదరభావం సర్వమానవ సోదర భావం కాదు. అది ముస్లింల కోసం ముస్లింలందరూ సోదరభావంతో ఉండాలని చేసే ప్రబోధ మాత్రమే. ముస్లింలు కోరేది ఒకే తరహాకు చెందిన పాలనా ప్రాంతాల సృష్టి మాత్రమేనని అంబేద్కర్ పేర్కొన్నారు. ముస్లింల ఆధిపత్యం గల ఒకే తరహా ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేయడానికి ఈ క్రింది కారణాలను ఆయన పేర్కొన్నారు. (ఎ) ముస్లింలు తమకంటూ ఒక ప్రత్యేక జాతిగా ఏర్పడి ఒక ప్రత్యేక దేశం కావాలని కోరుకోవడం (బి) ముస్లింలు తమది కాని ఒక పరాయి దేశంలో రెండవ శ్రేణి పౌరులుగా ఉండే విధంగా మెజారిటీ హిందువులు వారి పట్ల వ్యవహరిస్తారని అనుభవం నేర్పిన పాఠం.

ముస్లింల ఆధిక్యత గల ప్రాంతాలను స్వతంత్ర రాష్ట్రాలుగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ముస్లిం లీగ్ మార్చి 26, 1940న లాహోర్‌లో జరిపిన సమావేశంలో ఒక తీర్మానం చేసింది. 1935 చట్టంలో ప్రతిపాదించబడిన సమాఖ్య ఈ దేశంలో నెలకొన్న ప్రత్యేక

పరిస్థితుల దృష్ట్యా ఆచరణ సాధ్యం కాని, అవసరాలకు అనుగుణంగా లేని ప్రతిపాదనగా ఆ తీర్మానం వ్యాఖ్యానించింది. ఈ ప్రతిపాదిత సమాఖ్య ముస్లింలీగ్‌కు ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేసింది. ఏ ఇతర ప్రతిపాదన అయినా ముస్లింలకు ఆమోదయోగ్యమైతేనే తాము అంగీకరిస్తామని అది పేర్కొంది. ఇలా ఏర్పాటు చేసే రాజ్యాంగ ప్రాంతాలు స్వతంత్ర ప్రతిపత్తి గల సార్వభౌమత్వం గలవిగా ఉండాలని పేర్కొంది. 'రాజ్యాంగ ప్రాంతాలు' అని ముస్లిం లీగ్ పేర్కొనడం వెనుక ఉద్దేశం సమాఖ్యగా ఏర్పాటు కావాలనే యోచనే అని అంబేద్కర్ భాష్యం చెప్పారు. ఈ ప్రతిపాదిత ప్రాంతాలు సార్వభౌమత్వం కలవిగా ఉండాలని డిమాండ్ చేయడం అర్థరహితం అవుతుంది. ప్రాంతాల సమాఖ్య, సార్వభౌమిక ప్రాంతాలు అనేవి పరస్పర విరుద్ధమైన పదాలు. ముస్లింలు ప్రత్యేక దేశంగా ఆవిర్భవించాలని లాహోర్ తీర్మానం డిమాండ్ చేసింది. స్వీయ ప్రభుత్వానికి, జాతీయతత్వానికి మధ్య అవినాభావ సంబంధం ఉంది. ముస్లింలు ప్రత్యేక దేశంగా ఆవిర్భవించడం అంటే భారతదేశానికి ఒక దేశ హోదా లేకపోవడమే.

ఈ ప్రతిపాదన పట్ల అంబేద్కర్ మూడు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. (1) మద్రాసులోని బ్రాహ్మణులు పంజాబ్‌లోని బ్రాహ్మణుల మధ్య కంటే మద్రాసులోని ముస్లింలు, బ్రాహ్మణుల మధ్య హేతుబద్ధమైన సంబంధాలు ఎక్కువగా ఉన్నాయి. (2) హిందువులు, ముస్లింలకు మధ్య భాషాపరమైన సంబంధాలున్నాయి. ముస్లింలకు ఉమ్మడి భాషలేదు. పట్టణల్లోని ముస్లింలు మాత్రమే ఉర్దూ భాషలో మాట్లాడతారు. హిందువుల విషయంలో అలా కాదు. వారు ఆ ప్రాంతంలో వాడుకలో ఉన్న భాషలో మాట్లాడతారు. గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం హిందువులు, ముస్లింల మధ్య భాషాపరమైన సమైక్యత నెలకొని వుంది. (3) భారతదేశం అనేది ప్రామాణికంగా హిందువులకో, ముస్లింలకో చెందినది కాదు. ముస్లింలు, హిందువులు కలసికట్టుగా ఉండేందుకు సానుకూలంగా ఉండే అంశాల కంటే రాజకీయ, మతపరమైన కార్పణ్యాలు ఎక్కువ పదునుగా ఉండటం వారి మధ్య చీలికలు సృష్టించింది. ముస్లింలు, హిందువులు తమ గతాన్ని విస్మరించలేరు. ఈ పరిణామాలక్రమం నేపథ్యంలో హిందువులు, ముస్లింలు ఒకే దేశంలోని భాగస్వాములనే హిందువుల అభిప్రాయం నేలకూలిపోయింది.

ఒక దేశానికి సంబంధించి జాతీయత అనేది పటిష్టమైన సామాజిక సమైక్యత ప్రాతిపదికగా ఉండాలని అంబేద్కర్ సూచించారు. అలాగే అంతర్జాతీయతత్వానికి సంబంధించి జాతీయత మానవ సోదరతత్వం ప్రాతిపదికగా ఉండాలని ఆయన అన్నారు. జాతీయత అనేది నిరంకుశత్వంగా, నిర్బంధంగా ఆపాదించబడేది, ఇతర దేశాల, ఇతర మతస్తులకు ముప్పుగా పరిణమించేది కాదని ఆయన సూచించారు.

ముస్లింలు తొలుత తమను ఒక ప్రత్యేక మతస్థులుగా భావించారు. తాము ఒక ప్రత్యేక దేశమనే భావన వారిలో ఆ తరువాత మాత్రమే అంకురించింది. ఈ సందర్భంలో రెండు ప్రత్యేక అంశాలను గమనించాల్సి ఉంది. (1) జాతీయత, జాతీయతత్వం మధ్య ఉన్న తేడాను అర్థం చేసుకోవాలి. జాతీయత అంటే 'కారుణ్య భావం, సంబంధ బాంధవ్యాల పట్ల పరిపూర్ణమైన అవగాహన కలిగి వుండటం. జాతీయతత్వం అంటే పరస్పర సంబంధ బాంధవ్యాలు గల వ్యక్తుల కోసం ప్రత్యేక దేశం కావాలనే ఆకాంక్ష కలిగి ఉండటం. (2) జాతీయత ఉనికిని

గుర్తించకుండా జాతీయతత్వం ఉండదు. జాతీయత అన్ని సందర్భాల్లో జాతీయతకు దారితీయా (ఎ) అది ఒక దేశంగా జీవించాలనే ఆకాంక్షను స్పష్టంగా, సూటిగా వ్యక్తం చెయ్య (బి) జాతీయతత్వం అనేది ఒక దేశంగా సాంస్కృతిక కేంద్రంగా మలచగల నిర్దిష్ట భూభాగం పరిధిలో ఉండాలి. తమ ఉనికిని, హక్కులను పరిరక్షించుకునే హక్కు మతానికి ఉంటుందని అంబేద్కర్ అన్నారు. వేర్పాటు కోరే హక్కు దేశానికి ఉంది. ఒక దేశంగా జీవించాలనే కోరికను ముస్లింలు పెంపొందించుకున్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా జాతీయత సిద్ధాంతం సార్వభౌమిక ప్రజాస్వామ్య సిద్ధాంతంలో ఒక భాగంగా పొందుపరచబడినట్లు చరిత్ర స్పష్టం చేస్తుంది.

ముస్లింలు తమ ప్రాధాన్యతను పరిరక్షించుకుని ప్రత్యేక హోదా గల వ్యక్తులుగా జీవించేందుకు అవకాశం కల్పించిన కమ్యూనల్ అవార్డు వారు మెజారిటీ హిందువుల నియంతృత్వాన్ని ప్రతిఘటించేందుకు దోహదం చేసిందని అంబేద్కర్ అన్నారు. అంతేకాకుండా ముస్లింలు మెజారిటీలో ఉన్న ప్రాంతంలో వారికి మెజారిటీ సీట్లు కలిగి వుండటాన్ని చట్టబద్ధం చేసింది. హిందువులు మెజారిటీగా గల ఆ ప్రాంతాల్లో మైనారిటీ ముస్లింలకు ప్రాధాన్యతనిచ్చిందనే కారణంతో మత సమస్యకు పరిష్కారంగా జారీ చేసిన ఈ అవార్డులో ఎటువంటి అసమానత్వం లేదు. ఎందువల్లనంటే ముస్లిం మెజారిటీ ప్రాంతాల్లో మైనారిటీ హిందువులకు కూడా ఈ అవార్డు అదే హోదా కల్పించింది. ముస్లిం ప్రాంతాల్లోని ముస్లింలకు చట్టపరమైన మెజారిటీ హోదాతో పాటు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించబడింది. అంతేకాకుండా హిందూ మైనారిటీలపై ముస్లిం చట్టాన్ని ఈ అవార్డు నిర్బంధం చేసింది. దీనిని వారు మార్చే అవకాశం కానీ, ప్రభావితం చేసే అవకాశం కానీ లేదు.ఇదే కమ్యూనల్ అవార్డులోని మౌలిక తప్పిదం. రాజకీయ అంశాల్లో తమ అభిప్రాయాలను వ్యక్తీకరించే అవకాశం కల్పించాలని మైనారిటీలు చేసే డిమాండ్‌కు సానుకూలంగా ప్రతిస్పందించనవసరం లేకుండానే మైనారిటీ మతస్తులపై అధికారం చెలాయించే అధికారాన్ని మెజారిటీ మతస్తులకు కట్టబెట్టడం రాజ్యాంగ సూత్రాలకు తిలోదకాలివ్వడమేనని అంబేద్కర్ వ్యాఖ్యానించారు. అంతేకాకుండా మైనారిటీ హిందువుల భద్రతను నిర్లక్ష్యం చేయడమేనని ఆయన పేర్కొన్నారు.

ఈ రాజ్యాంగపరమైన రక్షణ అనేది ప్రధానంగా మూడు అంశాలకు సంబంధించి ఉండాలని అంబేద్కర్ పేర్కొన్నారు. అవి (1) సరిహద్దు సమస్య (2) వనరులకు సంబంధించిన సమస్య (3) సాయుధ దళాలకు సంబంధించిన సమస్య.

పాకిస్తాన్ ఎటువంటి శాస్త్రీయమైన సరిహద్దు కలిగి ఉండదు. ఆ మాటకు వస్తే ఏ దేశానికీ శాస్త్రీయమైన సరిహద్దు అంటూ ఏదీ ఉండదని అంబేద్కర్ వ్యాఖ్యానించారు. ఇదీ హద్దు అంటూ ఒక నిర్దిష్టమైన ప్రాంతాన్ని నిర్ణయించుకోవడం వల్ల ఒనగూరే ప్రయోజనం ఉండదని ఆయన అన్నారు. సహజసిద్ధమైన సరిహద్దుల ప్రాధాన్యతను ఆధునిక పరిజ్ఞానం హరించి వేసిందని వ్యాఖ్యానించారు. సరిహద్దులుగా కృత్రిమ కట్టడాలను నిర్మించుకోవచ్చు. హిందూస్తాన్‌లో వనరులు పాకిస్తాన్‌లో వనరుల కంటే ఎక్కువగా ఉన్నాయి. అందువల్ల పాకిస్తాన్‌ను ఏర్పాటు చేయడం హిందూస్తాన్‌ను బలహీనపరచబోదని అంబేద్కర్ వ్యాఖ్యానించారు.

పోరాట దళాలు ఎక్కువమంది పాకిస్తాన్‌లో చేర్చబడిన ప్రాంతాల నుండే ఉన్నారనే వాస్తవాన్ని సైమన్ కమిషన్ నివేదిక వెల్లడించింది. పాకిస్తాన్ మాత్రమే సైనికులను రూపొందించగలదని, భారత్ ఆ పనిచేయలేదనే వాదన నిలవబోదని అన్నారు. ఇది వాస్తవ విరుద్ధమని వ్యాఖ్యానించారు. సరిహద్దు దళాల్లో వాయువ్య సరిహద్దు ప్రాంతానికి ప్రాధాన్యత 1857 సైనిక తిరుగుబాటుకు ముందు కల్పించబడలేదు. మార్షల్, మార్షల్‌యేతరపరంగా విభజన ఏకపక్షంగా, కృత్రిమంగా మాత్రమే జరిగిందని ఆయన అన్నారు. అర్హత ప్రాతిపదికగా కాకుండా జన్మ కారణంగా గుర్తింపు ఇచ్చే హిందూ మతంలోని కుల వ్యవస్థ ఎంత అవివేకంగా, అర్థరహితంగా ఉందో ఈ విభజన కూడా అంతే అవివేకంగా, అర్థరహితంగా ఉందని అన్నారు. ఆ విషయంలో భారత్‌ను పాకిస్తాన్ బలహీనపరచజాలదని అన్నారు.

ఆయన ఇంకా ఇలా అన్నారు.

> "పాకిస్తాన్‌లోని రాష్ట్రాలు హిందూస్తాన్‌లోని రాష్ట్రాలపై భారం మోపేవిగా ఉన్నాయి. వాటివల్ల హిందూస్తాన్ రక్షణ బలహీనపడటానికి బదులు మరింత పటిష్టం అవుతుంది. ముస్లిం సైన్యంపై వెచ్చించే సొమ్ములో అధిక భాగం హిందూ రాష్ట్రాలు సమకూర్చి పెట్టినవేనన్న విషయం ఎంతమంది హిందువులకు తెలుసు? ఇందుకు పెడుతున్న వ్యయం ఎంతో ఎంతమందికి తెలుసు? దీనికి భరత వాక్యం పలకడానికి అత్యుత్తమ పరిష్కారం పాకిస్తాన్ ఏర్పాటు చేసే ప్రక్రియను అనుమతించడమే. దీనిని వ్యతిరేకించడం తమ విధ్వంసాన్ని తెచ్చిపెట్టుకునే ఆయుధాన్ని కొనితెచ్చుకోవడమే. సురక్షితమైన సరిహద్దు కంటే సురక్షితమైన సైన్యమే ఉత్తమం."

ప్రత్యేక హోదా ప్రాతిపదికగా మతపరమైన మెజారిటీ వ్యవస్థకు చట్టబద్ధత కల్పించడం, మైనారిటీలపై నియంతృత్వ పోకడలకు అవకాశం కల్పించేలా మతపరమైన రాష్ట్రాలు ఏర్పాటు చేయడం మతోన్మాద సమస్యకు దారితీసే రెండు చెరుపు చేసే అంశాలని అంబేద్కర్ వ్యాఖ్యానించారు. దుందుడుకుతత్వం గల మెజారిటీ, మైనారిటీలు పరస్పరం ఎదురైనపుడు ఇంతకుముందు ఈ సమస్య ఎదురైంది. ఇతర దేశాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొని వుందని అంబేద్కర్ పేర్కొన్నారు. పాకిస్తాన్‌లోని హిందువుల పరిస్థితి కూడా టర్కీల ఆధిపత్యంలోని ఆర్మీనియన్లు, రష్యా సాలిన్ట్‌లోని యూదుల పరిస్థితి, జర్మనీలో నాజీల పరిస్థితి మాదిరిగానే ఉంటుంది. పాకిస్తాన్‌ను ఒకే మతస్థుల దేశంగా రూపొందిస్తే వివిధ జాతుల లేదా తెగలతో కూడిన దేశంలోని దుష్ఫలితాలు వాటంతట అవే అంతరిస్తాయి. ప్రత్యేక హోదా కల్పించే పరిస్థితి శాశ్వతంగా అంతరిస్తుంది. హిందూస్తాన్‌లో ముస్లిం మెజారిటీ గల రాష్ట్రాలను ఏర్పాటు చేయడం వల్ల ముస్లింల పరిస్థితి బలహీనపడబోదని ఆయన వ్యాఖ్యానించారు.

జర్మనీ ప్రత్యేక దేశంగా ఏర్పడటం ద్వారా చెకోస్లోవేకియాలోని సూడెటన్లకు పరిపూర్ణమైన రక్షణ కల్పించగలిగింది. పాకిస్తాన్ ఏర్పాటు చేయడం వల్ల ఉత్తర, తూర్పు ప్రాంతాల్లోని ముస్లింలు, హిందూస్తాన్‌లోని ముస్లింల మధ్య సంబంధ బాంధవ్యాలు విచ్ఛిన్నమవుతాయి. అది హిందువులకు అదనపు ప్రయోజనం కలిగించే పరిణామం. అదే విధంగా ప్రధాన భాగస్వామ్యపక్షంగా ముస్లింల దౌర్జన్యం నుండి హిందువులకు రక్షణ లభిస్తుంది.

హిందువుల్లోని అగ్రవర్ణాల్లో ఒక ప్రత్యేక లక్షణం ఉంది. అది తరచుగా వారిని ఇబ్బందులకు గురిచేస్తోందని అంబేద్కర్ పేర్కొన్నారు. జీవితంలో ముఖ్యమైన వస్తువులను సేకరించే తత్వం, వాటిని ఇతరులతో పంచుకోవడానికి విముఖత వారి ప్రత్యేక లక్షణాలుగా పేర్కొనవచ్చు. విద్య, సంపదల్లో వారు గుత్తాధిపత్యం సంపాదించారు. ఈ రెండింటితో వారు తమ కులంపై ఆధిపత్యం పొందారు. తమ వర్గంపై సాధించిన ఈ స్వార్థ చింతనతో కూడిన ఆధిపత్యంతో హిందువుల్లో తక్కువ స్థాయిలో ఉన్న బడుగు వర్గాల వారిని సంపద, విద్య, అధికారం నుండి దూరం చేసేందుకు తాము చేయగలిగినదంతా చేశారు. ఉన్నత వర్గాల వారిని సేవించడమే వారి జీవిత పరమావధి అని వారు బడుగు వర్గాల వారికి బోధించారు. ఇతర వర్గాల వారిని అధికారం నుండి, తమ నివాస ప్రాంతాల నుండి దూరంగా ఉంచడం, హిందువుల్లో అగ్రవర్ణాల వారి ముఖ్యమైన ప్రవృత్తిగా ఉంది. ముస్లింల విషయంలోనూ వారు ఇదే విధంగా వ్యవహరిస్తారనడంలో సందేహం లేదు. ఆ వర్గం వారు అనుసరించే రాజకీయాలను అర్థం చేసుకోవాలంటే ఈ విషయం గ్రహించడం తప్పనిసరి. హిందూ అగ్రవర్ణాల వారి ఈ వైఖరిని అంబేద్కర్ వ్యతిరేకించారు. తమ కెరీర్స్‌ను అభివృద్ధి చేసుకోవడానికి పరిమితి విధిస్తుందనే అంశం మినహా హిందువుల్లో అగ్రశ్రేణి వర్గాలు పాకిస్తాన్‌ను వ్యతిరేకించేందుకు మరో కారణం లేదని అంబేద్కర్ నిర్ధారించారు. జాతీయవాదం పేరుతో హిందువుల్లో తక్కువ వర్గం వారిని అగ్రవర్ణం వారు మోసగించే అవకాశం ఉందని అన్నారు. ముస్లింల ఆధిక్యత ఉన్న ప్రాంతాల్లో మెజారిటీ ముస్లింలను వారు ఈ విధంగా వంచించి అధికారం, స్థానబలం ప్రదర్శించలేరు. బెంగాల్ విభజన సందర్భంగా ఆవిర్భవించిన జాతీయోద్యమం, దాని ప్రభుత్వ వ్యతిరేక వైఖరి హిందువుల్లో అగ్రవర్ణాల స్వార్థపూరిత చర్యల పర్యవసానమని అంబేద్కర్ భావించారు.

ముస్లిం లీగ్ రాజకీయాలకు వ్యతిరేకత హిందూ మహాసభ నుండి వచ్చింది. హిందూ మహాసభ ఏర్పాటైన నాటి నుండి ముస్లింలీగ్ వ్యూహాలు, ప్రయత్నాలను వ్యతిరేకించడమే కార్యక్రమంగా వ్యవహరించసాగింది.

ఇస్లాం లేదా క్రైస్తవ మతాల మాదిరిగా హిందూ మతం ఒక నిర్దిష్ట కార్యక్రమం కోసం ఏర్పాటైన మతం కాదు. ఇది వేరే మతం నుండి రూపాంతరం చెందిన మతం కాదు. హిందూ సమాజం కుల వ్యవస్థను అభివృద్ధి చేసినప్పటి నుండి అది ఒక నిర్దిష్ట లక్ష్యం ప్రాతిపదికగా ఏర్పాటైన మతం స్థాయిని కోల్పోయింది. ఎందువల్లనంటే కులాన్ని మార్చుకోవడం సాధ్యం కాదు.

హిందువులు ఒక దేశానికి ప్రతిరూపాలని సావర్కర్ అన్నారు. ఒక దేశమా లేదా రెండు దేశాలా అనే విషయంలో సావర్కర్, మహమ్మద్ అలీ జిన్నా మధ్య పరిపూర్ణ ఏకాభిప్రాయం ఉండేది. వారు ఒకరినొకరు వ్యతిరేకించుకునేవారు కాదు. సావర్కర్ అభిప్రాయాల్లో పరస్పర వైరుధ్యాన్ని అంబేద్కర్ బహిర్గతం చేశారు. ముస్లింలు ఒక ప్రత్యేక జాతికి చెందిన వారనే విషయాన్ని సావర్కర్ అంగీకరించారు. అయితే ముస్లింలకు ప్రత్యేక దేశం అనే నినాదాన్ని వ్యతిరేకించారు. హిందూ రాజ్యం అనేది నిజమైతే అది ఈ దేశానికి అతి పెద్ద ముప్పు అనే విషయంలో సందేహమే లేదని అంబేద్కర్ పేర్కొన్నారు. హిందువులు ఏమి చెప్తారనేది అప్రస్తుతమని అన్నారు. స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావాలకు హిందూయిజం బెడదగా పరిణమించిందని ఆయన అన్నారు. ఆ విషయం ప్రజాస్వామ్యంతో పొసగని తత్వమని అన్నారు. హిందూ రాజ్యాన్ని ఎటువంటి పరిస్థితిలోనూ అంగీకరించరాదని, దానిని ప్రతిఘటించాలని ఆయన పిలుపునిచ్చారు. ఉమ్మడి ప్రయోజనాలను సాధించేందుకై ముస్లింలతో కలిసి పనిచేసేందుకు హిందూ సమాజంలోని అట్టడుగు వర్గాలు మరింత సుముఖంగా వుంటాయని ఆయన అన్నారు. శతాబ్దాల తరబడి తమకు సాధారణ మానవ హక్కులను దూరం చేసిన హిందువులలోని ఉన్నత స్థాయీ వర్గాలతో కలిసి వ్యవహరించడం కంటే అదే ఉత్తమమని వారు భావించవచ్చని అన్నారు. హిందూ రాజ్‌కు దేశ విభజన విరుగుడుగా భావించడం వృథా అని ఆయన భావించారు.

1927 నుండి హిందువులు, ముస్లింల మధ్య పరస్పర దాడులు దేశాన్ని కుదిపేశాయి. రెండు దేశాలకు చెందిన మతస్థులు పరస్పర హత్యాకాండకు పాల్పడ్డారు. 1920 - 40 మధ్య హిందూ - ముస్లింల మధ్య సంబంధాలను అధ్యయనం చేస్తే ఇరు వర్గాల మధ్య అంతర్యుద్ధం నడుస్తున్న విషయం బోధపడగలదు. సాయుధ దళాలు అంతర్గత పోరాటానికి తాత్కాలిక విరామం మాత్రమే తీసుకురాగలిగాయని అంబేద్కర్ అభిప్రాయపడ్డారు. భారత రాజకీయ భవిష్యత్ విషయంలో ఉభయ వర్గాల మధ్య చెలరేగిన ఉద్రిక్తతలు, స్వార్థ ఆలోచనలను మత కల్లోలాలు ప్రతిబింబించే విధంగా ఉన్నాయని సైమన్ కమిషన్ నివేదిక పేర్కొంది.

మతపరమైన కల్లోలాలు, అలజడులు చెలరేగుతున్నప్పటికీ గాంధీజీ హిందూ - ముస్లిం సమైక్యతనే ప్రబోధించేవారు. ఇది వృథా ప్రయత్నం మాత్రమేనని అంబేద్కర్ అభివర్ణించారు. హిందూ - ముస్లిం సమైక్యత అనేది రెండు అంశాలపై ఆధారపడి ఉంది (1) విభిన్న తత్వాలు గల వర్గాల వారిని ఒక దేశంగా మలచడంలో కేంద్ర ప్రభుత్వ సమర్థతపై సాధారణ అభిప్రాయం (2) ముస్లింల డిమాండ్లను పరిష్కరించడమే హిందూ - ముస్లిం ఐక్యతను పెంపొందించే ఏకైక మార్గమనే సాధారణ అభిప్రాయం. నిత్యం పెరిగే ముస్లింల రాజకీయ డిమాండ్లు, హిందువుల బలహీనతలను అనుకూలంగా మలచుకోవడం, ఇక మూడవది రాజకీయాల్లో గూండాగిరీ అనుసరిచడం అనేవి కీలకాంశాలుగా పరిణమించాయి. గూండాగిరీ అంటే అంబేద్కర్ దృష్టిలో అలజడులు సృష్టించడమే. ఈ గూండాగిరీ ద్వారా భారీ స్థాయిలో రాజకీయ, సామాజిక హక్కులు సాధింపబడతాయి. ఇది సూడెటాన్ జర్మన్లను అనుసరించడమే. ఈ అంశాలన్నిటినీ దృష్టిలో ఉంచుకుని అంబేద్కర్ ఈ విధంగా వ్యాఖ్యానించారు.

(1) పాకిస్తాన్ ఏర్పాటు చేయాలనే ముస్లింల ప్రతిపాదన బేరం చేయదగ్గది కాదు. పాకిస్తాన్ ఏర్పాటుకు ప్రత్యామ్నాయంగా ముస్లింలు చేస్తున్న డిమాండ్ అత్యంత ప్రమాదకరమైనది. ప్రతి రంగంలో తమ ఆధిక్యత నెలకొనాలని వారు డిమాండ్ చేస్తున్నారు. రాయితీలు ఇస్తూ బుజ్జగించడం వల్ల వారిలో దుందుడుకుతత్వం మరింత పెరిగింది. తమకు ఈ విధంగా రాయితీలను ప్రకటించడం హిందువుల ఓటమిగా, ప్రతిఘటనాతత్వం లోపించడంగా వారు భావిస్తున్నారు.

గత మూడు దశాబ్దాలుగా (రెండు, మూడు, నాల్గవ) రాజకీయ శక్తుల కార్యకలాపాలు, ప్రతిస్పందనలను అంబేద్కర్ ఈ విధంగా సూత్రీకరించారు. ఈ అసౌకర్య పరిస్థితి మూడు విధాలుగా వ్యక్తమైంది. (1) సామాజిక ప్రతిష్టంభన (2) మత దురహంకారం (3) జాతీయ రాజకీయ పరిస్థితి భవితవ్యంపై నిరాశావాదం. సంఘ సంస్కరణ ఉద్యమానికి అంబేద్కర్ ఎంతో విలువ ఇస్తారు. అయితే ఇది ముస్లిం జాతిలో లేకపోవడం పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. ముస్లిం జాతి అభివృద్ధికాముకమైనది కాకపోవడమే ఇందుకు కారణం. సామాజిక సంస్కరణ విషయంలో వారిలో ఒక క్రమపద్ధతిలో ఉద్యమం లేకపోవడం మరో కారణం. ఈ పరిస్థితుల నేపథ్యంలో ముస్లిం జాతిలో ప్రతిష్టంభన నెలకొంది. శత్రుత్వ కొనసాగింపు ముస్లిం నాయకుల రాజకీయ ప్రాతిపదికగా పరిణమించింది. ఈ ధోరణి 20వ శతాబ్దం మూడవ దశకంలో ఎక్కువగా కనిపించింది. స్వాతంత్ర్యం పట్ల ఆకాంక్ష పెరుగుతున్నప్పటికీ మరోవైపు మత విద్వేషం కూడా పెరగసాగింది. ముస్లింలకు మహాత్మాగాంధీ కంటే కూడా మహ్మద్ జిన్నా అలి సమర్థుడైన నాయకునిగా ఆవిర్భవించారు.

ఒక వర్గం లేదా తెగ, దేశం మధ్య వైరుధ్యం పాక్తిస్తాన్‌కు ప్రాతిపదికగా మారిందని అభిప్రాయపడ్డారు. తనను తాను రక్షించుకునే హక్కు వర్గం లేదా తెగకు ఉంటుంది. విభజనను కోరే హక్కు జాతికి వుంది. అందువల్ల హిందువుల నుండి విభజన కోరుతూ ముస్లింలు డిమాండ్ చేస్తున్న రెండు దేశాల సిద్ధాంతం సమర్థనీయమే అవుతుంది

పాకిస్తాన్ సాధించాలనే లక్ష్యం ముస్లిం నాయకుల సిద్ధాంతపరమైన సంస్కరణకు దారితీసిందని అంబేద్కర్ అభిప్రాయపడ్డారు. ముస్లిం జాతికి చెందిన అందరినీ ఒక ఇస్లాం దేశంగా దగ్గరకు చేర్చే కలను సాకారం చేసుకునేందుకు ఈ వైఖరి దోహదం చేసింది. రెండు దేశాల సిద్ధాంతంలో ద్వంద్వ తత్వం అనే వైరస్ వ్యాపించి ఉందని అంబేద్కర్ వ్యాఖ్యానించారు. "అది సమాజాన్ని, దేశాన్ని స్థూలంగా విభజించడమే" అని అంబేద్కర్ పేర్కొన్నారు. పాకిస్తాన్ ఏర్పాటు లక్ష్యంగా నిర్దేశించుకోవడం ద్వారా ముస్లింలు బ్రిటిష్ వారిపై చేస్తున్న పోరాటం గురించి మరచిపోయారు.

స్వయం నిర్ణయాధికారం అంటే ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునే హక్కు కలిగి ఉండటం. "ఏ తరహా ప్రభుత్వమైనప్పటికీ విదేశీ శక్తుల నుండి జాతీయ స్వాతంత్ర్యం పొందే హక్కే స్వయం నిర్ణయాధికారం" అని అంబేద్కర్ పేర్కొన్నారు. స్వయం నిర్ణయాధికారం సిద్ధాంతం ప్రాతిపదికగా పాకిస్తాన్ డిమాండ్ ఆవిర్భవించింది. ఈ స్వయం నిర్ణయాధికారాన్ని ప్రజలకు ఉండాలి. దేశ ప్రయోజనం కోసం ముస్లిం లీగ్ ఈ స్వయం నిర్ణయాధికారాన్ని డిమాండ్ చేసింది. అయితే అదే సమయంలో ఈ సిద్ధాంతం

పాలస్తీనా విషయంలో వర్తింపచేసేందుకు ముస్లిం లీగ్ వ్యతిరేకత వ్యక్తం చేసింది. ఈ స్వయం నిర్ణయాధికార సిద్ధాంతం అత్యంత అవసరమైంది. తక్షణావసరమైన లక్షణం కలది కాదు. ఇది విశ్వజనీయ సిద్ధాంతం కాదు. ఇది పరిపూర్ణమైంది కూడా కాదు. భాష, మతం, ప్రాంతం, భౌగోళిక పరిస్థితులు వంటి అనేక అంశాల నేపథ్యంలో దీనిని పరిగణించాల్సి ఉంది.

మైనారిటీలను సంరక్షించేందుకు అంబేద్కర్ రెండు పద్ధతులు సూచించారు. ఒకటి మైనారిటీలకు రక్షణ కల్పించడం, రెండవది పాకిస్తాన్ నుండి హిందూ జనాభాను తరలించేందుకు ఏర్పాటు చేయడం, పంజాబ్, బెంగాల్ మధ్య సరిహద్దులను తిరిగి ఏర్పాటు చేయడం వల్ల జనాభాను బదిలీ చేసే ప్రక్రియ సమర్థవంతంగా అమలు చేయవచ్చు.

జనాభాను బదిలీ చేసే ప్రక్రియను అపహాస్యం చేసేవారు టర్కీ, గ్రీస్, బల్గేరియా దేశాల మధ్య మైనారిటీల సమస్యకు సంబంధించిన చరిత్రను అధ్యయనం చేయాలని అంబేద్కర్ సూచించారు. మతపరమైన శాంతికి మైనారిటీల బదిలీ శాశ్వత పరిష్కారం. దీనిని అనుసరించడం వల్ల భద్రతాపరమైన రక్షణ విషయంలో సమస్యలు తలెత్తవు. భారతదేశంలో ఏకత్వం సాధించేందుకు జనాభా బదిలీకి చర్యలు తీసుకోవడమే ఏకైక మార్గం. ఇది జరిగే వరకు, ఒకవేళ పాకిస్తాన్ ఏర్పాటైనప్పటికీ మెజారిటీ, మైనారిటీల మధ్య ఘర్షణ వాతావరణం అలాగే కొనసాగుతుందని మనం అంగీకరించక తప్పదు. హిందూస్తాన్‌లో పరస్పర వైరుధ్యం కొనసాగుతూనే వుంటుంది. ఈ జనాభాను బదిలీ చేసే ప్రక్రియ నిర్వహణ బాధ్యతను ఒక కమిషన్‌కు అప్పగించాలని, ఆ కమిషన్‌లో రెండు మతాలకు చెందిన వారికి సమాన ప్రాతినిధ్యం కల్పించాలని అంబేద్కర్ సూచించారు.

ప్రాథమిక ఏర్పాట్ల చట్టం నామమాత్రమేనని అంబేద్కర్ వ్యాఖ్యానించారు. అది ఒక నమూనా మాత్రమే. ఆ చట్టం ప్రధానాంశాలు ఈ విధంగా ఉన్నాయి. (1) విభజనపై ముస్లిం, ముస్లింయేతరుల అభిప్రాయాలు సేకరించడం. ముస్లింలలో అధిక సంఖ్యాకులు విభజనకు అనుకూలంగా ఉంటే, ముస్లింయేతరుల్లో అధిక సంఖ్యాకులు వేర్పాటుకు వ్యతిరేకంగా ఉంటే జాతి, సంస్కృతిపరంగా ముస్లిం మెజారిటీ ప్రాంతాలను, ముస్లింయేతర మెజారిటీ ప్రాంతాల మధ్య సరిహద్దులను అవకాశం ఉన్నంత మేరకు పునర్వచించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. (2) సరిహద్దు కమిషన్‌ను ఏర్పాటు చెయ్యాలి. అది అంతర్జాతీయ కమిషన్ అయితే అది మరీ మంచిది. (3) దేశాన్ని హిందూస్తాన్, పాకిస్తాన్‌గా విభజించడం.

అంబేద్కర్ దృష్టిలో పరిశీలనలోకి తీసుకోవాల్సిన ఇతర అంశాలు ఈ విధంగా ఉన్నాయి :

(1) అంతిమ పరిష్కారానికి సంబంధించి నిర్ణయం తీసుకునే విషయంలో మెజారిటీ ప్రజల హక్కులను వీటో చేసే అధికారం, హక్కు మైనారిటీలకు లేదు. ఈ కారణం వల్లనే పాకిస్తాన్ ఏర్పాటు చేసే విషయంలో ప్రజాభిప్రాయ సేకరణను ముస్లిం మతస్తులకు మాత్రమే పరిమితం చేయడం జరిగింది.

(2) మైనారిటి మతస్థులు తమ ఆదేశాలకు అనుగుణంగా నడుచుకోవాలని మెజారిటీ మతస్థులు డిమాండ్ చేసే అవకాశం ఉంది.

రాజకీయ మైనారిటీలో ఉన్న వారిని మెజారిటీలో ఉన్న వారు పరిశీలించేందుకు అనుమతించవచ్చు.

విడిగా ముస్లింయేతర ప్రజల్లో అభిప్రాయ సేకరణ వారు పాకిస్తాన్‌లో ఉండదలచుకున్నదీ, హిందూస్తాన్‌కు రాదలచుకున్నదీ నిర్ణయించుకునేందుకు మాత్రమే పరిమితం కావాలనే సూచనతో అంబేద్కర్ ఏకీభవించారు. నిర్ణయం తీసుకునే అధికారం ముస్లింయేతరులకే ఇవ్వబడింది. ఈ సందర్భంగా వారికి ఈ క్రింది అవకాశాలు కల్పించవచ్చని అంబేద్కర్ సూచించారు. (1) 10 సంవత్సరాల పాటు కలిసి ఉండి తరువాత వేరుపడటం (2) 10 సంవత్సరాల పాటు వేరుపడి ఆ తరువాత తిరిగి విలీనం కావడం. ఈ రెండు ప్రత్యామ్నాయాల్లో అంబేద్కర్ రెండవ దానిపై మొగ్గు చూపారు. ముస్లింలు ప్రత్యేక దేశంగా పాకిస్తాన్ ఏర్పాటు కావాలి. అయితే రెండు దేశాల మధ్య పరస్పర సంబంధాలు ఉండటం తప్పనిసరి. అంబేద్కర్ రూపొందించిన వ్యవస్థలో కౌన్సిల్‌కు అవకాశం కల్పించారు. దానిని సమాఖ్యగా పొరపాటు పడరాదని అంబేద్కర్ పేర్కొన్నారు. అది ఒక కూటమి కూడా లేదు. హిందువులు, ముస్లింలను అనుసంధానం చేసే కప్లింగ్‌గా మాత్రమే దీనిని వినియోగించాలని అంబేద్కర్ సూచించారు.

మతపరమైన అభిప్రాయ సేకరణ ప్రాతిపదికగా అంబేద్కర్ ఈ పథకం రూపొందించారు. ఇది హిందువులు, ముస్లింలను వేరు చేయడం కాదు. న్యాయపరమైన విభజన మాత్రమే. క్రిప్ రాష్ట్రాన్ని నిర్ణయాత్మక శక్తిగా తీసుకున్నారు. అయితే ఇది సరికాదని అంబేద్కర్ అభిప్రాయపడ్డారు. ఒకే ప్రాంతంలోని రెండు మతాలకు చెందిన వారి మధ్య సమస్యే పాకిస్తాన్ ఆవిర్భావానికి దారితీసింది.

తన ప్రణాళికను మూడు విధాలుగా ఆచరణలోకి పెట్టవచ్చని అంబేద్కర్ సూచించారు. (1) బ్రిటిష్ ప్రభుత్వం ఈ విషయంలో నిర్ణయాధికారం కలిగి ఉండాలి (2) సమస్యను అంతర్జాతీయ మధ్యవర్తిత్వ చర్చకు నివేదించేందుకు హిందువులు, ముస్లింలు అంగీకరించాలి (3) అంతర్గత కలహం ద్వారా అనుకున్నది సాధించాలి. పాకిస్తాన్ సమస్యను పరిష్కరించేందుకు పాకిస్తాన్ పరిధిలోకి వచ్చే ప్రాంతాల్లో రిఫరెండం నిర్వహించడం ఉత్తమమైన, రాజ్యాంగబద్ధమైన పద్ధతి.

పాకిస్తాన్ సరిహద్దులను స్పష్టంగా ప్రకటించడానికి నిరాకరించే మహ్మద్ అలీ జిన్నా మొండివైఖరి రాజనీతిజ్ఞుల్లో క్షమించరాని విషయమని అంబేద్కర్ అభిప్రాయపడ్డారు. అనుబంధ దేశం ఏర్పాటు చేసే అవకాశం ఇంతకు ముందెన్నడూ కనీవినని విషయం. అది అత్యంత మూర్ఖమైన ఆలోచన మాత్రమే కాదు, ఆచరణ సాధ్యం కాని విషయం కూడా. దేశం, అనుబంధ దేశం మధ్య సంబంధాలు మానవుడు, అతని చరాస్తుల మధ్య సంబంధాలు లేదా ఆస్తులు, దానికి సంబంధించిన పరిణామాల మధ్య సంబంధాల కంటే ఉత్తమమైనది ఏమీ కావు. చరాస్తులు యజమానితో, పరిణామాలు ఆస్తులతో సహజీవనం చేస్తూ ఉంటాయి. అలాగే

అనుబంధ దేశం దేశంతో సహజీవనం చేస్తుంది. జిన్నా వాదనలో ఇటువంటి ఆలోచనలు చోటుచేసుకుంటూ ఉండేవి.

ముస్లింలలో రోజురోజుకు పెరుగుతున్న జిన్నా ప్రభావాన్ని, ఆయన తన శక్తియుక్తులన్నిటినీ పోరాటానికి అనువుగా కూడదీసుకుంటున్న విషయాన్ని గాంధీజీ ఎలా విస్మరించారో అర్థం చేసుకోలేని విషయమని అంబేద్కర్ వ్యాఖ్యానించారు. జిన్నా ఇంతకుముందెన్నడూ పేద ప్రజల కోసం పాటుపడిన వ్యక్తి కాదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం మెట్రిక్యులేట్స్ వారికి మాత్రమే పరిమితం కావాలని జిన్నా కోరుకున్నారు. పేద ప్రజలను సైతం ఆయన విశ్వసించలేదు. రాజకీయ అధికారం వారికి దక్కకుండా చేసేందుకై ఉన్నత స్థాయీ వర్గాల వారికే ఓటు హక్కు కల్పించాలని భావించేవారు. జిన్నా ఎన్నడూ చిత్తశుద్ధి గల మతవాది కాదు. ముస్లిం మతాన్ని ప్రవచించే పవిత్రమైన వ్యక్తి కాదు. ఎం.ఎల్.ఎ గా ప్రమాణస్వీకారం చేసే సందర్భాల్లో పవిత్ర ఖురాన్‌ను ముద్దాడటం మినహా అందులోని అంశాల గురించి, దాని ప్రబోధాల గురించి అంతగా పట్టించుకున్న వ్యక్తి కాదు. ఆయన తరచూ మసీదుకు మత భావనతో, ఆసక్తితో వెళ్ళేవారా అనే విషయం కూడా అనుమానమే. ముస్లింలు ఒకచోట రాజకీయపరంగాగానీ, మతపరంగా గానీ సమావేశమైన సందర్భాల్లో జిన్నా అక్కడ కనిపించడం చూడలేదు. అటువంటి వ్యక్తి పేద ప్రజల వ్యక్తిగా ఎదగగలిగాడు. ఆయన వారి కంటే ఎక్కువ స్థాయిలో లేడు. వారిలో ఒకరిగా మారిపోయాడు. ఆయన ఒక్కసారిగా ఇస్లాం మతం పట్ల విశ్వాసం ఉన్న వ్యక్తి అయిపోయాడు. ఆ తరువాత కలామా కంటే ఇస్లాం మతం గురించి ఎక్కువగా తెలుసుకున్నాడు.

1947 ఆగస్టు 15న భారత్ రెండుగా చీలిపోయింది. రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ సంఘాన్ని ఫజల్ అలీ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఆ కమిషన్ ముందు అంబేద్కర్ ఈ విధంగా చెప్పారు. "పాకిస్తాన్ నుండి భారత్ వేరుపడినందుకు నాకెంతో సంతోషంగా ఉంది. ఒక విధంగా చెప్పాలంటే నేను పాకిస్తాన్ తాత్వికుడ్ని. నేను దేశ విభజనకు అనుకూలవాదిని. దేశ విభజన ద్వారా మాత్రమే హిందువులు స్వాతంత్ర్యం పొందడమే కాదు స్వేచ్ఛగా ఉండగలరని నేను భావించాను."

దేశ విభజన తరువాత పాకిస్తాన్‌లో అస్పృశ్యత సమస్య ఉత్పన్నమైంది. పాకిస్తాన్, హైదరాబాద్ (సింధు)లోని అస్పృశ్యులు భారత్ రావాలని అంబేద్కర్ పిలుపునిచ్చారు. మరీ ముఖ్యమైన విషయం ఏమంటే, పాకిస్తాన్‌లోని అస్పృశ్యులు ప్రయోజనాల పరిరక్షణ నిమిత్తం ఒక అధికారిని నియమించేలా పండిట్ నెహ్రూను అంబేద్కర్ ఒప్పించగలిగారు. ఈ పదవికి బాబూరావు గైక్వాడ్ పేరును ప్రతిపాదించారు. తమ దేశంలోని అస్పృశ్యులు భారత్ రాకుండా పాకిస్తాన్ నిషేధిస్తున్న విషయాన్ని డిసెంబర్ 18, 1947న ఒక లేఖ ద్వారా పండిట్ నెహ్రూ దృష్టికి తీసుకువచ్చారు. భూమిలేని కార్మికులు భూ కామందుల వద్ద పనిచేసేలా చేయడమే పాకిస్తాన్ ఉద్దేశంగా కనిపిస్తోందని అంబేద్కర్ వ్యాఖ్యానించారు.

# అధ్యాయం 8

# పార్లమెంటరీ ప్రజాస్వామ్యం

ప్రభుత్వమనేది ప్రజల యొక్క ప్రజల చేత, ప్రజల కోసం ఏర్పడే పాలనా వ్యవస్థ అనే ప్రజాస్వామ్య మౌలిక సిద్ధాంతాన్ని ఆచరణలో సాధించేందుకు వయోజన ఓటింగ్ హక్కు కల్పించడం అవసరమని పాశ్చాత్య రచయితలు అభిప్రాయపడ్డారు. ' ప్రజల యొక్క ప్రభుత్వం' అనే న్యాయబద్ధమైన హక్కును వయోజన ఓటు హక్కు సాధించి పెడుతుంది. ఇది రాచరిక వ్యవస్థకు పూర్తి భిన్నమైన పరిపాలనావ్యవస్థ. అయితే ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రభుత్వమనే సిద్ధాంతం కూడా ప్రజాస్వామ్య ప్రభుత్వం దానంతట అదే ఆవిర్భావించేందుకు దోహదం చేయబోదు.

ప్రజాస్వామ్యం, స్వీయపరిపాలనకు సంబంధించిన రాజకీయాలపై పాశ్చాత్య దేశాల రచయితల అభిప్రాయాలను అంబేద్కర్ వ్యతిరేకించారు. ఆయన ఇలా అన్నారు.

(1) ప్రతి దేశంలోనూ పరిపాలించే వర్గం ఒకటుంటుందనే తిరుగులేని వాస్తవాన్ని వారు పరిగణలోకి తీసుకోరు.

(2) పరిపాలించే వర్గం ప్రతిఘటనాతత్వం అనేది 'ప్రజాస్వామ్యం, స్వీయ పరిపాలన' అనే మౌలిక లక్ష్యాలకు పూర్తిగా భిన్నమైంది.

(3) అధికార వర్గం అధికారాన్ని చేజిక్కించుకునే సామర్థ్యాన్ని కోల్పోయినప్పుడే ప్రజాస్వామ్యం, స్వీయపాలన అనేవి వాస్తవంగా ఆచరణలోకి వస్తాయి.

(4) ప్రజాస్వామ్య మౌలిక లక్ష్యాన్ని సాధించేందుకు పాలిత వర్గానికి వయోజన ఓటు హక్కుతో పాటు ఇతర సంరక్షణ చర్యలు అవసరమని గుర్తించడం పరిపాలించే వర్గం మరింత పటిష్టం కావడానికి దోహదం చేస్తుంది.

(5) పరిపాలించే వర్గం సామాజిక దృక్పథం, సామాజికతత్వాన్ని వారు పరిగణలోకి తీసుకోలేదు.

అంబేద్కర్ దృష్టిలో 'పార్లమెంటరీ ప్రజాస్వామ్యం' అంటే 'ఒక వ్యక్తి ఒక ఓటు'. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అంటే దైనందిన వ్యవహారాల్లోనూ, ఒక నిర్దిష్ట సమయం ముగిసిన అనంతరం ప్రభుత్వ పనితీరును సమీక్షించే అవకాశం ఓటర్లకు కల్పించడం.

అంబేద్కర్ దృష్టిలో ప్రజాస్వామ్యం ఎప్పటికప్పుడు తన రూపాన్ని మార్చుకుంది. భారత ప్రజాస్వామ్యం అమెరికా ప్రజాస్వామ్యానికి పూర్తి భిన్నమైంది. ఒకే దేశంలో కూడా ప్రజాస్వామ్య మనేది ఎప్పుడూ ఒకే రీతిలో లేదు. ఇంగ్లీషు ప్రజాస్వామ్యం 1688 ముందు, తరువాత భిన్నంగా ఉన్నాయి. ప్రజాస్వామ్య ధ్యేయం కూడా ఎప్పటికప్పుడు మారిపోతూ ఉంటుంది. అంబేద్కర్ ప్రజాస్వామాన్ని ఈ విధంగా నిర్వచించారు. 'ఎటువంటి రక్తపాతం లేకుండా ప్రజల ఆర్థిక, సామాజిక జీవనంలో విప్లవాత్మక మార్పులు తీసుకోవచ్చే స్వరూపం, పాలనా వ్యవస్థే ప్రజాస్వామ్యం. అది విజయవంతంగా పనిచేసేందుకు ముందుగా ఈక్రింది జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

(1) సమాజంలో పైకి వ్యక్తమయ్యే విధంగా అసమానతలు ఉండరాదు. ఒక వర్గం వారికి అదనపు సదుపాయాలు కల్పించరాదు. (2) ప్రతిపక్షం ఉండాలి (3) చట్టం, పాలనాయంత్రాంగంలో సమానత్వం ఉండాలి (4) రాజ్యాంగ పరమైన నైతిక నియమాలు పాటించాలి. (5) మెజారిటీ వర్గం నియంతృత్వం వహించరాదు (6) సమాజంలో నైతిక నియమాలు పాటించే వ్యవస్థ ఉండాలి (7) ప్రజా చైతన్యం ఉండాలి

ప్రజలలో న్యాయం, స్వేచ్ఛ సంపాదించడమే అంబేద్కర్ ధ్యేయం. ప్రజాస్వామ్యం, ఆయన దృష్టిలో సమిష్టి జీవన విధానం. ప్రజాస్వామ్య మూలాలు సమాజంలో భాగమైన ప్రజల సమిష్టి జీవనానికి సంబంధించిన సామాజిక సంబంధాల్లో ఉంటాయని అంబేద్కర్ భావించారు. పేదరికం, నిరక్షరాస్యత, కుల వివక్షత వంటి సమస్యలు ప్రజాస్వామ్యానికి ముప్పుగా పరిణమిస్తాయి.

అంబేద్కర్ ఆలోచన ప్రకారం ప్రజాస్వామ్యంలో ఎటువంటి వర్గతత్వానికి చోటు ఉండరాదు. వర్గతత్వంతో ఒకవైపు నియంతృత్వం, దురాశ, స్వార్థం, తలబిరుసుతనం, అసహజత్వం, మరోవైపు అభద్రత భావం, పేదరికం, స్వేచ్ఛ, స్వావలంబన, స్వాతంత్ర్యం, హోదా, ఆత్మగౌరవానికి భంగం కలగడం, ఆత్మన్యూనతాభావం చోటు చేసుకుంటాయి. ప్రజాస్వామ్యం అనేది సమాజంలోని సభ్యులందరితో కూడిన సామాజిక సంస్థగా అంబేద్కర్ భావించారు. "ప్రజాస్వామ్య సమాజం తన పౌరులందరికీ విశ్రాంతితో కూడిన సాంస్కృతిక

జీవనాన్ని హామి ఇవ్వాలి" ప్రజాస్వామం సామాన్య మానవునికి సురక్షితమైనదిగా, దేశానికి మేలు చేసేదిగా చేయడమే అంబేద్కర్ జీవిత ప్రధాన లక్ష్యం. జీవనం, స్వేచ్ఛ, సంతోషం కోసం అన్వేషణ వంటి ప్రజాస్వామ్య సిద్ధాంతాలు మానవ జీవితానికి ప్రధానమైన విషయాలని అంబేద్కర్ పేర్కొన్నారు. మానవ హక్కులకు ఆయన విశేష ప్రాముఖ్యత కల్పించారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ వాటిని అనుభవించాలని అంబేద్కర్ పేర్కొన్నారు. మానవ హక్కుల ఆచరణలో ఎటువంటి వివక్ష ఉండరాదని భావించారు. వివక్ష సామాజిక, రాజకీయ ప్రజాస్వామాన్ని నిర్వీర్యం చేస్తోంది. జీవితంలో వివిధ రంగాల్లో సంఘాలు ఏర్పాటు చేసుకునే స్వేచ్ఛకు ఆయన అధిక ప్రాముఖ్యత నిచ్చారు. అందుకు ఆయన రాజ్యాంగవ్యవస్థ సహాయం కోరారు. రాజ్యంగపరమైన ప్రభుత్వం లేకుండా స్వేచ్ఛ అనేది ఉండదని ఆయన అభిప్రాయపడ్డారు. అటువంటి సంస్థలు స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం మౌలిక స్వరూపాలని ఆయన అభిప్రాయపడ్డారు.

అంబేద్కర్ దృష్టిలో ప్రజాస్వామ్యం అనేది ప్రభుత్వం యొక్క ఒక రూపం కాదు, సామాజికసంస్థ రూపం. సానుకూల, సామాజిక వ్యవస్థ ప్రజాస్వామ్యం విజయవంతమయ్యేందుకు ముఖ్యావసరమని అంబేద్కర్ భావించారు. సానుకూల సామాజిక వ్యవస్థ లేకుండా ప్రజాస్వామ్యం దీర్ఘకాలం మనజాలదు. ప్రజాస్వామ్య తరహా ప్రభుత్వం ప్రజాస్వామ్యతరహా సమాజపు మరో రూపం. సామాజిక ప్రజాస్వామ్యం లేని ప్రజాస్వామిక వ్యవస్థ మౌలిక రూపం నిరూపయోగమైనది మాత్రమే కాకుండా సమాజ అవసరాలకు సరిపోనిది. ప్రజాస్వామ్యమనేది ఒక తరహా ప్రభుత్వం కాదని, అది ప్రధానంగా ఒక తరహా సమాజమని మన రాజకీయవేత్తలు ఎప్పుడూ గుర్తించలేదని ఆయన వ్యాఖ్యానించారు.

అంబేద్కర్ దృష్టిలో సామాజిక ప్రజాస్వామ్యంలో రెండు అంశాలు మిళితమై ఉన్నాయి. మానసిక దృక్పథం, సహచరుల పట్ల గౌరవం, సమానత్వంతో కూడిన దృక్పథం, సంక్లిష్టమైన సామాజిక అవరోధాలు, పరిమితులు లేని సామాజిక వ్యవస్థ. రాజకీయ లక్ష్యాలు ఉన్నత స్థాయిలోనే ఉండాలి. అయితే అవి సామాజిక లక్ష్యాలకు అనుగుణంగా ఉండాలి. ప్రజాస్వామ్య మనేది సామాజిక ఆదర్శం, రాజకీయ విధానం.

రాజకీయ ప్రజాస్వామ్యం నాలుగు అంశాలపై ఆధారపడి ఉంటుందని అంబేద్కర్ పేర్కొన్నారు (1) మనిషి తనకు తాను పరిమితమవుతాడు.(2) ప్రతి వ్యక్తీ రాజ్యాంగం హామీ ఇచ్చిన కొన్ని బదిలీ చేసుకోవడానికి వీలులేని హక్కులు కలిగి ఉంటాడు (3) ప్రత్యేక సదుపాయం లేదా రక్షణ పొందేందుకు రాజ్యాంగబద్ధంగా తనకు సంక్రమించిన హక్కులను వదులుకోవాల్సిన



సుందరయ్య గ్రంథాలయ సంస్థ
A. C. No. 88664

అవసరం ఏ వ్యక్తికీ ఉండదు.(4) ఇతరులను పరిపాలించేందుకు ప్రైవేటు వ్యక్తులకు ప్రభుత్వం అధికారాన్ని దత్తంచెయ్యలేదు. ప్రజాస్వామ్యంలో ప్రతి పార్టీకీ విమర్శించే హక్కు, అధికారాన్ని చేజిక్కించుకునే హక్కు ఉంటాయి. అధికారంలో ఉన్న పార్టీ దానిని కాపాడుకొనేందుకు ప్రయత్నిస్తుంది. ప్రభుత్వాధికారం అధికారపార్టీ నుండి ఇతర రాజకీయ పార్టీ లేదా పార్టీలకు బదలాయింపు అయినపుడు పార్టీ వ్యవస్థ నిజమైన పరీక్షను ఎదుర్కొంటుంది.

చట్టాలు మనిషికోసం మనిషి రూపొందించుకున్నవి అంటారు అంబేద్కర్. చట్టాలు మనిషిని రూపొందించలేదు. మనిషి తన సుఖం కోసం చట్టాన్ని రూపొందించుకున్నాడు. చట్టానికి సవరణలు అవసరం కావచ్చు. ఈ సవరణలు అందరి అంగీకారంతో చెయ్యాలి. చట్టం అందరికీ ఒకే విధంగా ఉండాలి, అందరికీ ప్రయోజనం కలిగించేదిగా ఉండాలి. అది సామాజిక పరంగా మానవత్వంతో కూడుకున్నదై ఉండాలి. అంటే అందరిపై సమాన ప్రభావం కలిగించేదిగా ఉండాలి. అంబేద్కర్ దృష్టిలో చట్టాన్ని శిక్ష రూపంలో కాకుండా ప్రజలను చైతన్యపరచడం ద్వారా అమలు పరచాలి. సమాజ స్ఫూర్తితో, మానసిక చైతన్యంతో అమలు పరచాలి. చట్టం పై సిద్ధాంతాల ప్రాతిపదికగా ఉండాలనే విషయాన్ని రాజ్యాంగ పీఠిక వివరించింది. రాజ్యాంగ నిబంధనలకు సంబంధించి అంబేద్కర్ ఆలోచనలు మానవత్వ ప్రాతిపదికగా ఉన్నాయి. అవి అయిదు మౌలిక అంశాలపై ఇమిడి ఉన్నాయి. (1) అది ప్రజల ప్రయోజనాల కోసం రూపొందించబడిన చట్టం (2) అది ఏకపక్షమైన శక్తి కాదు (3) అది అందరికీ వర్తించే లౌకిక చట్టం (4) దైవిక ప్రోద్బలంతో కాక మానవ ప్రోద్బలంతో రూపొందింపబడింది. (5) దానిని కాలానుగుణంగా అవసరాల మేరకు మార్చుకోవచ్చు.

అంబేద్కర్ ప్రజాస్వామ్యాన్ని ఒక జీవన విధానంగా భావించారు. అది హేతుబద్ధమైన పరిశీలన, ప్రయోగంపై ఆధారపడి ఉంది. వ్యక్తులకే ప్రాధాన్యత, దేశ స్వభావానికి అనుగుణమైన స్వచ్ఛందతత్వం, ఉదాత్తమైన మార్గాలు, చర్చ, ఒప్పందం ద్వారా, మౌలిక సమానత్వం, చట్టాల అనుసరణీయత, శాశ్వతమైన నిబంధన లేకపోవడం వంటి అంశాల ప్రాతిపదికగా రూపొందింపబడుతుంది. ఆదర్శవంతమైన సమాజం లేకుండా ప్రజాస్వామ్య బద్ధమైన జీవనాన్ని యోచించలేం. అంబేద్కర్ దృష్టిలో ఆదర్శ సమాజం చలనమైందిగా ఉండాలి. మార్పులను ఒక ప్రాంతం నుండి ఇతర ప్రాంతాలకు బదిలీ చేసే మార్గాలతో కూడి ఉండాలి. ఆదర్శవంతమైన సమాజంలో అనేక ప్రయోజనాలను ఎరుకతో ఒకరితోఒకరు పంచుకోవాలి. ఇంకో మాటలో చెప్పాలంటే సామాజిక దృక్పథం ఉండాలి.

కొన్ని రాజకీయ పరమైన హక్కులు కలిగి ఉండటమే ప్రజాస్వామ్యానికి ప్రాతిపదిక కాదని అంబేద్కర్ అన్నారు. సామాజిక తత్వం, నైతిక నియమావళి ప్రజాస్వామ్యానికి రెండు

ముఖ్యమైన మౌలిక అంశాలు. మానవులు ఒక క్రమ పద్ధతిలో సాగేలా నియంత్రించి వారిని ఒకరిగా కలిపి ఉంచే సామాజిక, ఆర్థిక, రాజకీయ విలువల రూపకల్పనతో ప్రతి ఒక్కరికీ భాగస్వామ్యం, కల్పించే అవసరాన్ని పెంపొందింపచేసే జీవన విధానమే ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రాథమిక సిద్ధాంతం. అంబేద్కర్ ఆలోచనల్లో స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం, హేతువు, మానవ అనుభవం, చట్టం సహజసిద్ధమైన హక్కులు, సామాజిక సంబంధాలలో వ్యక్తుల, ప్రాధాన్యత ప్రజాస్వామ్య మౌలిక లక్ష్యాలు

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు ఈ క్రింది విధానాలు అవసరమని అంబేద్కర్ పేర్కొన్నారు. (1) రాజ్యాంగ పద్ధతులు, విప్లవం, చట్టాల ఉల్లంఘన, సహాయనిరాకరణ, సత్యాగ్రహం వంటి పద్ధతులకు స్వస్తి చెప్పాలని ఆయన ఉద్బోధించారు. ఈ పద్ధతులు అరాచకత్వానికి ప్రతి రూపాలని ఆయన భావించారు.(2) స్వేచ్ఛను గొప్పవారి పాదాల వద్ద తాకట్టు పెట్టడం : గొప్పవారి పట్ల కృతజ్ఞతతో ఉండటంలో ఎటువంటి తప్పులేదని అంబేద్కర్ అన్నారు. మతంలో భక్తి భావం అంతరాత్మను శోధించడానికి దోహదం చేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే రాజకీయాల్లో భక్తి భావం, వ్యక్తి ఆరాధన ఆత్మన్యూనతతో, అంతిమంగా నియంతృత్వానికి దారి తీస్తుందని అంబేద్కర్ హెచ్చరించారు (3) రాజకీయ ప్రజాస్వామ్యాన్ని సామాజిక ప్రజాస్వామ్యంగా రూపొందించాలి, సామాజిక ప్రజాస్వామ్య వ్యవస్థ మౌలిక లక్ష్యంగా, లేని రాజకీయ ప్రజాస్వామ్యం మనుగడ సాధించలేదు. ఆయన దృష్టిలో సామాజిక ప్రజాస్వామ్యం అంటే స్వేచ్ఛ సమానతత్వం, సోదరభావం మౌలిక సిద్ధాంతాలుగా గుర్తించే జీవన వ్యవస్థ. ఈ మూడు భావాల సమ్మిళిత రూపమే ప్రజాస్వామ్యం. ఒకదాని నుండి మరొకదానిని వేరు చేయడం ప్రజాస్వామిక మౌలిక లక్ష్యాన్ని దెబ్బ తీస్తుంది. "సామాజిక వ్యవస్థకు సంబంధించి స్థాయిల వారీగా అసమానత్వం ప్రాతిపదికగా గల సమాజం భారతదేశంలో నెలకొని ఉంది. రాజకీయాల్లో మనకు సమానత్వం ఉంటుంది. సామాజిక, ఆర్థిక జీవనాల్లో మాత్రం అసమానత్వం కొనసాగుతుంది. ఈ వైరుధ్యాన్ని వీలైనంత త్వరగా అంతమొందించాల్సిన అవసరం ఉంది. లేనిపక్షంలో అసమానత్వం వల్ల బాధపడే వారు రాజకీయ ప్రజాస్వామ్య వ్యవస్థనే విచ్ఛిన్నం చేసే ప్రమాదం ఉంది" అని అంబేద్కర్ హెచ్చరించారు. భారత రాజ్యాంగం ఆర్థిక ప్రజాస్వామ్య సిద్ధాంతాన్ని ప్రవచించింది. ఈ సూచనాత్మక సిద్ధాంతాలకు ఎంతో ప్రాధాన్యత వుందని అంబేద్కర్ అన్నారు. ఎందువల్లనంటే అవి 'ఆర్థిక ప్రజాస్వామ్యమే మన ఆదర్శం' అని ప్రబోధిస్తాయి.

ప్రాథమిక అవసరాలకు సైతం నోచుకోని లక్షలాదిమంది ప్రజల సంతృప్తిపై మన ప్రజాస్వామ్య వ్యవస్థ విజయం ఆధారపడి వుంటుంది. పేద ప్రజల స్వేచ్ఛ, సుఖం కోసం

అన్వేషణ, ఆస్తి హక్కుకు హామీ ఇవ్వడంలో వైఫల్యం చెందినందువల్లే మన పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ పట్ల అసంతృప్తి నెలకొని ఉంది. దురదృష్టవశాత్తు భారతదేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఆర్థిక అసమానతలను గుర్తించడంలో విఫలమైంది. సామాజిక, ఆర్థిక ప్రజాస్వామ్యం లేని పార్లమెంటరీ ప్రజాస్వామ్య విజయం సాధించలేదని గుర్తించడంలో అది విఫలమైంది. మన రాజకీయ ప్రజాస్వామ్య వ్యవస్థకు అవే మౌలికాంశాలు.

రాజకీయ సమాజాలు రెండు రకాలుగా విభజింపబడ్డాయని అంబేద్కర్ చెప్పారు. వారు పాలకులు, పాలితులు. పాలకులందరూ పాలకుల వర్గం నుండి వచ్చినవారై ఉంటారు. పాలితులందరూ పాలింపబడే వర్గానికి చెందినవారే. ఇందువల్లే రాజకీయ ప్రజాస్వామ్యం "ప్రజల యొక్క ప్రజల చేత ప్రభుత్వం" కాలేకపోయింది. ప్రజాస్వామ్య వ్యవస్థ మౌలిక లక్ష్యాల్లో విఫలమైతే తిరుగుబాటు, అరాచకత్వం, కమ్యూనిజం సంభవమని ఆయన అన్నారు.

# అధ్యాయం 9

# సోషలిస్టు ఆలోచన

## సెక్షన్- 1

**కార్మిక సంఘాల ఉద్యమం**

అణచివేతకు గురవుతున్న వర్గం వారు కూడా కార్మికులేనని, వారిని కార్మిక, అణచివేతకు గురవుతున్న వర్గాలకు చెందిన ఓటర్లుగా రెండు రకాలుగా నమోదు చేసి సమస్యకు పరిష్కారం ఎలా చూపుతారని సైమన్ కమీషన్ సభ్యుడైన మేజర్ అట్లీ కమిషన్ ముందు సాక్షిగా హాజరైన అంబేద్కర్‌ను ప్రశ్నించారు. అణచివేతకు గురవుతున్న వర్గం వారంతా దాదాపు కార్మికులేనని, ఉదాహరణకు జౌళి పరిశ్రమలో వారు ప్రత్యేకంగా కొన్ని విభాగాల్లో నియమితులై ఉంటారని అంబేద్కర్ సమాధానం ఇచ్చారు. అణచి వేతకు గురవుతున్న వర్గానికి మాత్రమే చెందిన కార్మికులు జౌళి కర్మాగారాల్లో నేత విభాగం వంటి అత్యధిక వేతనం లభించే విభాగాల్లో పనిచేసేందుకు అనుమతించేవారు కాదు. అంబేద్కర్‌ను మేజర్ అట్లీ మరో ప్రశ్న అడిగారు. "మైనారిటీ వర్గానికి చెందిన ప్రతి వర్గం వారికీ ఇలా అధిక ప్రాధాన్యత ఇస్తూ పోతే మెజారిటీ వర్గం ఎక్కడ ఉంటుంది?" అటువంటి సందర్భాల్లో విభజన అనేది పెట్టుబడిదారులు, కార్మికుల మధ్య ఉంటుందని అంబేద్కర్ బదులిచ్చారు.

1928 లో బొంబాయిలో జౌళి కర్మాగారాల్లో సార్వత్రిక సమ్మె విఫలమైంది. 1929 ఏప్రిల్‌లో రెండోసారి సమ్మె ప్రారంభించబడింది. మొదటి సమ్మెకు మద్దతు పలికిన అంబేద్కర్ రెండో సమ్మెను వ్యతిరేకించారు. సమ్మె సందర్భంగా అస్పృశ్యుల డిమాండ్‌ను గుర్తించి వాటిని సమస్యలుగా ముందుకూ తీసుకురావాలని కార్మిక సంఘాలపై వత్తిడి వచ్చింది. అయితే యజమానులు అస్పృశ్యత కారణంగా దానిని అపహాస్యం చేశారు.

సమ్మె అనే ఆయుధాన్ని ఆచితూచి మాత్రమే వాడాలని అంబేద్కర్ పేర్కొన్నారు. రుణదాతలు, అప్పులు ఇచ్చేవారి కబంధ హస్తాల్లో చిక్కటం వల్ల అణచివేతకు గురవుతున్న

వర్గానికి చెందిన కార్మికుల పరిస్థితి మరింత దుర్భరమైంది. వారికి బ్రాహ్మణీకం, పెట్టుబడిదారి విధానం రెండు శత్రువులని అంబేద్కర్ పేర్కొన్నారు.

రాజీ, మధ్యవర్తిత్వం ద్వారా పారిశ్రామిక వివాదాలను శాంతియుతంగా,సౌహార్ధ పూరితంగా పరిష్కరించేందుకు దోహదం చేసే అవకాశం కల్పించే ఉద్దేశంతో పారిశ్రామిక వివాదాల బిల్లును 1938లో బొంబాయి శాసన మండలిలో ప్రవేశపెట్టారు. అంబేద్కర్ ఉద్దేశంలో "సమ్మె అంటే సర్వీసు కాంట్రాక్టును ఉల్లంఘించడం కంటే ఎక్కువేమి కాదు. ఇది పౌరతప్పిదం లేదా నేరం" కావచ్చు. అది పౌరతప్పిదం మాత్రమే గానీ నేరం కాదని అంబేద్కర్ భావించారు. సమ్మె అంటే స్వేచ్ఛగా ఉండే హక్కుకు మరో పదం. సమ్మెను శిక్షించే ఈ బిల్లు కార్మికులను బానిసలుగా మారుస్తుంది. ఈ బిల్లు "కార్మికుల పౌరస్వేచ్ఛ సస్పెన్షన్ చట్టం మాత్రమేనని అయన అభివర్ణించారు.

తన ప్రసంగంలో అంబేద్కర్ ఈ విధంగా వ్యాఖ్యానించారు.

> మేనేజింగ్ ఏజెంట్లతో ఏదో విధమైన బాంధవ్యం కారణంగా పందలాది మంది నిరుపయోగమైన వ్యక్తులు, సమర్థత లోపించిన వ్యక్తులు ఉన్నత స్థానాల్లో నియమింపబడుతున్నారు.
>
> సమర్థులయినప్పటికీ, కాకపోయినప్పటికీ, వారి అవసరం ఉన్నప్పటికీ, లేకపోయినప్పటికీ కర్మాగారాల్లో ఈ విధంగా నియమింపబడిన వారిని పోషించేందుకు కార్మికుల సంపాదనల్లో ఎక్కువభాగం దోపిడి చేయబడుతోంది. పరిశ్రమను తమ అదుపులో ఉంచుకునే వీరంతా పెట్టుబడులు పెడుతుంటారు. కాగితాలపై జరిపే లావాదేవీలతో దానిని పెంచివేస్తూ ఉంటారు. తాము సరైన వేతనాలు పొందడంలేదని కార్మికుడు ఫిర్యాదు చేస్తుంటే పరిశ్రమను అదుపులో ఉంచుకునేవారు 'ఇది నా పెట్టుబడి' అంటుంటారు. ఇదంతా బోగస్ పెట్టుబడి, స్టాక్ ఏక్స్చేంజ్ పెట్టుబడి, స్పెక్యులేటర్లు కృత్రిమంగా పెంచివేసే పెట్టుబడి, పరిశ్రమ ఆదాయంలో ఎక్కువ భాగాన్ని వీరు మింగేస్తూ ఉంటారు. ఇక మిగిలిన స్వల్ప మొత్తంతో కార్మికులు తమ ఉనికిని వెళ్ళదీయాల్సి ఉంటుంది. గౌరవనీయులైన ప్రధానమంత్రి సమానత్వం కావాలని వాంఛిస్తూ ఉంటే పరిశ్రమలు గడించే లాభాల్లో తొలి వాటా కార్మికుల జీతాలకు కేటాయించేలా ఆయన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కర్మాగారాల యజమానులు, పరిశ్రమల అధిపతులు ప్రతి ఏడూ బడ్జెట్‌ను కల్పించేలా చర్యలు ఎందుకు రూపొందించరో నాకు అర్థం కాదు.
>
> గౌరవనీయులైన ప్రధానిగారూ, నేను సూచించిన విధంగా కార్మికులు పెట్టుబడికి సమాన హోదా కల్పించాలని కోరుకుంటే అలా సమానత్వాన్ని చూపించాల్సి ఉంది. అయితే ఈ బిల్లులలో ఇందుకు సంబంధించిన ప్రాతిపదిక ఏదీ లేదు. ఇక రెండో అంశం ఏమిటంటే పెట్టుబడి, కార్మికుల మధ్య సమానత్వానికి

ప్రాతిపదిక ఏమీ లేదు. ఎందువల్లనంటే ఏ వివాదంలోనైనా ప్రభుత్వం తప్పకుండా యజమానుల పక్షంవైపే ఉంటుంది. పోలీసులను ఉపయోగించే ప్రభుత్వ చర్య సమ్మెకు పురిగొల్పుతూ ఉంటుంది. ప్రజల నుండి సమకూర్చిన నిధితో పోలీసు వ్యవస్థ నిర్వహించబడుతూ ఉంటుంది. మనమంతా చెల్లించే పన్నుల నుండి వారిని నిర్వహిస్తూ ఉంటారు. మనందరి ప్రయోజనం కోసం అది ఉద్దేశింపబడింది. కార్మికుల సమ్మెను అణచివేసేందుకు ఏ ప్రభుత్వం ఈ వ్యవస్థను ఉపయోగించుకోకూడదు. కార్మికుల సమ్మెవల్ల శాంతికి విఘాతం ఏర్పడుతోందనే సాకుతో పోలీసులను ప్రయోగించడం సమంజసం కాదు. శాంతికి ఏర్పడ్డ ఈ విఘాతం పరిశ్రమలోని ఒక ప్రత్యేకవర్గం వల్ల ఏర్పడిందని గ్రహించాలి. కార్మికుల అనుచితమైన డిమాండ్ కారణంగా శాంతికి విఘాతం ఏర్పడితే వారిపై పోలీసులను ప్రయోగించడం సరైన చర్యే కావచ్చు. అయితే యజమాని హేతుబద్ధంగా వ్యవహరించకపోవడం వల్ల సమానత్వం, న్యాయబద్ధంగా వ్యవహరించకపోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడితే కార్మికులపై పోలీసులను ప్రయోగించే హక్కు ప్రభుత్వానికి ఉండదు. ఈ రెండు నియమాలను పాటించడం వల్ల మాత్రమే యజమానులు, ఉద్యోగుల మధ్య నిజమైన ఐక్యత సాధించవచ్చు. యజమాని బడ్జెట్‌ను ప్రతి ఏడు వెల్లడించేలా వత్తిడి తీసుకురావాలి. శాంతికి విఘాతం కలిగిందనే ఏకైక కారణంతో కార్మికులపై పోలీసులను ప్రయోగించడాన్ని ప్రభుత్వం మానుకోవాలి. ఇది లేకుండా బేరమాడే శక్తికి సంబంధించినంత మేరకు పెట్టుబడి, శ్రామికశక్తి మధ్య సమానత్వం ఉండదు. మీరు ఈ పని చెయ్యగలరా? ఈ పని మీరు చేస్తే యజమానుల మద్దతు కోల్పోతారు. చేయకపోతే మీరు కార్మికుల మైత్రి పొందలేరు. ఈ బిల్లును యధాతథ రూపంలో ఆమోదించరాదని నా నిశ్చితాభిప్రాయం. ఇది కార్మికులకు మాత్రమే నష్టదాయకం. ఈ బిల్లువల్ల తమకు సంభవించే నష్టం కార్మికులకు తెలియకపోవచ్చు. ఈ బిల్లు అమలులోకి వస్తే కార్మికులు దీన్ని నేరుగా ఎదుర్కోవాల్సి వస్తుంది. అప్పుడు మాత్రమే బిల్లు దుష్టమైందని, హేయమైందని, కర్కశమైందని కార్మికుడు చెప్పగలుగుతాడు. అందువల్ల నేను ఈ బిల్లుతో భాగస్వామ్యం కాలేను ప్రధానమంత్రిగారూ.

ప్రతిఘాతమైన, తిరోగమన ధోరణిగల ఈ బిల్లు ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేసేదిగా ఉందని అభివర్ణింపబడింది. దుష్ట, కర్కశ, దుర్మార్గ పూరితంగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు.

బొంబాయి రాష్ట్రంలోని ప్రతిపక్షపార్టీలు ఈ బిల్లును వ్యతిరేకించాయి. కార్మికుల మద్దతు సమీకరించుకునేందుకై అవి 1938 నవంబర్ 7న కార్మిక సమ్మెకు పిలుపునిచ్చాయి. ఈ చట్టానికి నిరసనగా బొంబాయిలో సుమారు 60 కార్మికసంఘాలు సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయి. తన పార్టీని బలోపేతం చేసుకునేందుకు అంబేద్కర్ ఈ సమ్మెను వినియోగించుకుంటున్నారనే ఆలోచనతో కాంగ్రెసులోని సోషలిస్టులు సమ్మెకు మద్దతు

తెలిపేందుకు నిరాకరించారు. కాంగ్రెస్ నాయకుడు ఎస్.కె. పాటిల్ సమ్మెకు వ్యతిరేకంగా సభలు కూడా ఏర్పాటు చేశారు.

స్వార్థపరశక్తుల వ్యతిరేకత నేపథ్యంలో ప్రజాప్రభుత్వంపై కార్మికనాయకులు నిర్వహించిన సమ్మె విజయవంతం కావడం ఇదే ప్రథమం. కమ్యూనిస్టులతో కలసి ఉమ్మడి సమాఖ్యగా పోరాటం చేయటం జరిగింది. అంబేద్కర్, జామ్నాదాస్ మెహతా వంటి 'కుల' నాయకులతో కలిసి పోరాటాలు నిర్వహించడంపై కమ్యూనిస్టు నాయకులపై విమర్శలు వచ్చాయి. స్వార్థపరశక్తులపై అంబేద్కర్, కమ్యూనిస్టులు కలిసి సంయుక్త కార్యాచరణ నిర్వహించడం ఇదే మొదటిసారి, చివరిసారి.

## సెక్షన్- 2

### కార్మిక సభ్యునిగా ఎదుర్కొన్న కార్మిక సమస్యలు

అధికారం గల పదవులు సంపాదించాలనే ఉద్దేశంతో వైస్రాయ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో కార్మిక సభ్యుని పదవినిఅంబేద్కర్ ఆమోదించారు.

అలా చెయ్యకపోతే అస్పృశ్యులకు అధికారం అందదు. ఏ వర్గం వారిపై స్వేచ్ఛనైనా ఎటువంటి ఆంక్ష విధించకుండా ఉండేలా తాను ప్రయత్నించగలనని అంబేద్కర్ అన్నారు. యజమానులు కార్మికుల మధ్య జరిగే అన్ని పోరాటాల్లో తాను కార్మికుల పక్షాన నిలవగలవని ఆయన హామీనిచ్చారు.

కేంద్ర ప్రభుత్వంలో అయిదు నుండి 6 శాతం వరకు పదవులు అస్పృశ్యులకే లభించేలా చెయ్యడంలో కార్మిక సభ్యునిగా అంబేద్కర్ విజయం సాధించారు. విదేశాల్లో సాంకేతిక విద్యనభ్యసించగోరిన అస్పృశ్య వర్గానికి చెందిన విద్యార్థులకు ఆయన సహాయం చేశారు. కనీసం యుద్ధానికి సంబంధించి పనులు నిర్వహించే కర్మాగారాలు, పారిశ్రామిక సంస్థల్లో సమిష్టి కార్మిక- మేనేజ్‌మెంట్లు ఉండాలని ఆయన భావించారు. కార్మికుల ప్రయోజనాల కోసం ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్‌లను నెలకొల్పారు. వివిధ పథకాల క్రింద శిక్షణ పొందుతున్న నైపుణ్యం గల, అర్థనైపుణ్యం గల లేబర్ టెక్నిషియన్లను వీధుల్లోకి విసిరివేయకుండా చూసేందుకు ఇవి ఉపయోగపడతాయి. వారు కొత్త ఉద్యోగాలకు అవకాశాలు పొందాలి.

1943 మే 10న బొంబాయిలో జరిగిన సమావేశంలో కార్మిక ఉద్యమంలో సంభవించిన దురదృష్టకరమైన చీలిక పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. తన ఉద్దేశంలో భారత కార్మిక ఉద్యమం కేవలం పటాటోపమని, నిరుపయోగమైందని ఆయన అన్నారు. భారతదేశ శాంతి, కార్మికరాజ్యం ఏర్పాటుకు కార్మికులు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. భారతదేశానికి స్వరాజ్యం ఒక్కటే వస్తే సరిపోదని, ఆ స్వరాజ్యం ఎవరి చేతుల్లో ఉందనేది కూడా ముఖ్యమని ఆయన అన్నారు.

కార్మికులకు మరింత ప్రయోజనం కలిగించేందుకు ఆయన మరో అడుగు ముందుకేశారు. శాశ్వత ఉనికి గల కర్మాగారాల్లో పనిచేసే పారిశ్రామిక కార్మికులకు వేతనంతో కూడిన సెలవు రోజుల సౌలభ్యం కల్పించే సవరణ బిల్లును ఆయన ప్రతిపాదించారు. నిర్బంధ సయోధ్య, మధ్యవర్తిత్వం కార్మికులకు ఎంతో ప్రయోజనకరమని అంబేద్కర్ భావించారు. కార్మిక కోడ్‌లో ఇది శాశ్వత అంశం కలదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

1945 నవంబర్ 27న జరిగిన 7వ భారత కార్మిక సదస్సులో చేసిన అధ్యక్షోపన్యాసంలో ఆయన ఈ విధంగా వ్యాఖ్యానించారు.

> "సంపన్న వర్గాన్ని కార్మికులు ఎప్పటికప్పుడు ఒక ప్రశ్న అడగవచ్చు. యుద్ధంపై చేసే ఖర్చు కోసం పన్నులు చెల్లించేందుకు బాధపడని మీరు కార్మిక ప్రమాణాలు పెంచేందుకు ఉద్దేశింపబడిన నిధుల సేకరణకు ఎందుకు అభ్యంతరం చెబుతారు? యుద్ధంపై ఖర్చు చేసే మొత్తాన్ని ప్రజాసంక్షేమం కోసం వినియోగిస్తే ఎంతమంది నిరక్షరాస్యులు అక్షరాస్యులుగా మారతారు? ఎంతమంది రోగుల ఆరోగ్యాన్ని పునరుద్ధరించవచ్చు?"

ప్రాంతీయ లేబర్ కమీషనర్ల సమావేశాన్ని ప్రారంభిస్తూ అంబేద్కర్ ఈ విధంగా అన్నారు. పారిశ్రామిక అస్తవ్యస్థ పరిస్థితిని తగ్గించేందుకు లేదా నిరోధించేందుకు మూడు అంశాలు అవసరం - రాజీ యంత్రాంగం, పారిశ్రామిక వివాద చట్టానికి సవరణ, కనీసవేతనాల చట్టం. ఇందులో మొదటిది ఇప్పటికే ఆచరణలో ఉంది. మిగిలిన రెండిటికి సంబంధించిన ప్రతిపాదనలను త్వరలో చేయగలనని పేర్కొన్నారు. సామాజిక న్యాయం ప్రాతిపదికగా ఉండే పారిశ్రామిక శాంతి ఆశావహమైందని అంబేద్కర్ అభిప్రాయపడ్డారు.

చట్టం ప్రాతిపదికగా దానిని సాధించవచ్చు. అయితే ఇవి పూర్తిగా నికరం అని చెప్పలేం. అయితే అధికారం ప్రాతిపదికగా మాత్రం పారిశ్రామిక శాంతిని సాధించలేమని అంబేద్కర్ నిర్ద్వంద్వంగా చెప్పారు.

కార్మిక సమస్యల గురించి చర్చించే సమయంలో పారిశ్రామిక కార్మికులను మాత్రమే కాకుండా వ్యవసాయ కార్మికులను కూడా అంబేద్కర్ దృష్టిలో పెట్టుకున్నారు. పనికి సంబంధించిన నిబంధనలు, అందుకు సంబంధించిన సానుకూల పరిస్థితులు, ప్రావిడెంట్‌ఫండ్, యజమానుల బాధ్యతలు, కార్మికులకు నష్టపరిహారాలు, ఆరోగ్య బీమా, పెన్షన్లు, అన్ని రకాల కార్మికులకు అందుబాటులో ఉండాలని, పారిశ్రామిక, వ్యవసాయ కార్మికులకు సమానంగా వర్తించాలని అంబేద్కర్ పేర్కొన్నారు.

# సెక్షన్-3

## మార్క్సిజం × బుద్ధిజం

మార్క్సిజం దృష్టిలో చరిత్ర అధ్యయనం అంటే సంపూర్ణ మానవ చరిత్రకు సంబంధించిన సహజ సిద్ధమైన చట్టాలను గుర్తించడం. ఇందుకోసం వ్యక్తులను కాకుండా వివిధ రకాల తెగలకు చెందిన వారిని అది దృష్టిలో పెట్టుకొంటుంది. ఈ విషయంలో మార్క్సిస్టులతో అంబేద్కర్ విభేదించారు. ప్రైవేటు ఆస్తులను, కలిగి ఉండటం దోపిడీకి దారితీస్తోందనే సిద్ధాంతంతో ఆయన ఏకీభవించారు.

భారత రాజ్యాంగ పరిషత్తులో రాజ్యాంగంలో సామాజిక సిద్ధాంతాలు లేదా కట్టుబాట్లుగా చెప్పబడిన అంశాల పట్ల విమర్శలు వ్యక్తమయ్యాయి. దేశంలో పాలకవర్గం అంటూ ఒకటి ఆవిర్భవిస్తుందని ఆనంద్ మిశ్రా విమర్శించారు. కార్ల్‌మార్క్స్ కాకుండా గాంధీజీ ఉద్బోధించిన వర్గ రహిత సమాజ ధ్యేయాన్ని రాజ్యాంగంలో ప్రతిపాదించ లేదని జాదూబాన్స్ సాహే పేర్కొన్నారు. చర్చకు అంబేద్కర్ సమాధానం చెప్పారు. ఆయన తన ప్రసంగంలో ఇలా అన్నారు.

ఈ దేశంలో రాజకీయ అధికారం దీర్ఘకాలం పాటు కొందరు వ్యక్తుల గుత్తస్వామ్యంగా ఉంది. అనేకమంది ఇతరులను కొల్లగొట్టి, హతమార్చే శక్తులుగా రూపొందారు. బడుగు వర్గాలు వర్గపోరాటాలకు పాల్పడే పరిస్థితి తీసుకురాకూడదు. అన్ని రంగాల్లో సమానత్వం, సోదరభావం తీసుకురావడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. సమాజంలో వర్గతత్వం, ఆర్థిక వ్యవస్థను అనివార్యమైందిగా గుర్తించడం అంబేద్కర్ దృష్టిలో ప్రజాస్వామ్య విరుద్ధం, అసహజం. హేతుబద్ధమైన మానవ సంబంధాలకు హానికరమైన ప్రభావాలను అది ఆచరణలో పెట్టింది. అందులో ఉమ్మడి ప్రయోజనకరమైన అంశాలు లేవు. వర్గతత్వం తెచ్చిన ఒంటరిభావం, ప్రత్యేకతత్వం, సంఘ వ్యతిరేక తత్వాన్ని ప్రోదిచేసిందని అంబేద్కర్ అన్నారు. వివిధ తెగల, ప్రజలకు మధ్య తేడాల కారణంగా నియంతృత్వం, గర్వం, తల బిరుసుతనం, దురాశ, స్వార్థం ఒకవైపు అభద్రతా భావం, పేదరికం, స్వేచ్ఛాహరణం, ఆత్మ న్యూనత, స్వావలంబన, హోదా, ఆత్మగౌరవం దెబ్బతినడం వంటి ఫలితాలు మరోవైపు ఏర్పడతాయని అంబేద్కర్ పేర్కొన్నారు. సమాజంలో వర్గ తత్వాన్ని అంబేద్కర్ వ్యతిరేకించారు.

భారత సమాజంలో పేదవర్గాల తరుపున అంబేద్కర్ నిలబడ్డారు. పేదరికాన్ని పెంచి పోషించే అన్నిటినీ ఆయన ఖండించారు. అంబేద్కర్ దృష్టిలో సోషలిజం అంటే పేదరికంపై దాడి. యంత్రాంగం దుష్ఫలితాలను ఆయన గుర్తించారు. ప్రైవేటు ఆస్తులు, వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాల అన్వేషణ పవిత్రమైనదిగా తలపింపచేసే మన సామాజిక వ్యవస్థ ఇందుకు

కారణంగా ఆయన విశ్లేషించారు. దీనికి నివారణ యంత్రాంగాన్ని, నాగరికతను ఖండించడం కాదని, ప్రయోజనాలను కొందరు మాత్రమే దోపిడి చేసే విధంగా కాకుండా దాని ఫలాలను అందరికీ అందించే విధంగా సామాజిక వ్యవస్థలో మార్పులు చెయ్యడం అవసరమని అంబేద్కర్ అన్నారు. యంత్రాంగం, ఆధునిక నాగరికత అందరికీ ప్రయోజనకరంగా ఉండాలని ఆయన అన్నారు. " యంత్రాంగం, మరింత పటిష్టమైన యంత్రాంగం, నాగరికత. మరింత పరిపూర్ణమైన నాగరికత ప్రజాస్వామ్య సోషలిజం నినాదం కావాలని అంబేద్కర్ అన్నారు.

ఆర్థిక సంబంధాల హేతుబద్ధమైన ప్రాతిపదికలో రెండు అంశాలు ఇమిడి ఉంటాయని అంబేద్కర్ పేర్కొన్నారు. "ప్రభుత్వ సోషలిజం", "రాజ్యాంగ చట్టాలు పార్లమెంటరీ ప్రజాస్వామ్యం", ప్రస్తుత ఆర్థిక సంక్షోభం నుండి బయటపడేందుకు కొంతమేరకు ప్రభుత్వ నియంత్రణ అవసరం. "ప్రభుత్వ సోషలిజం" ప్రధాన ఉద్దేశం ప్రతి మార్గాన్ని ప్రైవేటు సంస్థలకు ధారాదత్తం చెయ్యకుండా, సంపదను అందరికీ సమానంగా అందుబాటులోకి తీసుకొచ్చే విధంగా, గరిష్ట స్థాయిలో ఉత్పాదకతకు దోహదం చేసే విధంగా ప్రజల ఆర్థిక జీవనాన్ని ప్రణాళీకరించే కర్తవ్యాన్ని ప్రభుత్వంపై ఉంచడం."

అంబేద్కర్ సంపూర్ణ 'ప్రభుత్వ గుత్తాధిపత్యాన్ని వ్యతిరేకించారు. ఆయన ఉద్దేశంలో ప్రభుత్వ యజమాన్యం అంటే ప్రజాస్వామ్యయుతంగా సమిష్టి సాగు విధానం అనుసరించే వ్యవసాయ భూమి. పారిశ్రామిక రంగంలో ప్రభుత్వ సోషలిజం, బీమా, పరిశ్రమల జాతీయకరణకు పరిమితం, ప్రైవేట్ వ్యక్తులను అదుపులో ఉంచాలని అంబేద్కర్ భావించలేదు. ప్రజాసంక్షేమం, ప్రభుత్వ ఆర్థికరంగం దృష్ట్యా ప్రభుత్వ సోషలిజం అవసరమని ఆయన అన్నారు. అది భారతదేశం వేగంగా పారిశ్రామికంగా అభివృద్ధి చెందేందుకు దోహదం చేస్తుందన్నారు. "యాజమాన్యహక్కు", "కౌలుదారి చట్టం వల్ల భూమిలేని కార్మికులు, శ్రామికవర్గం, శూద్రులు, అస్పృశ్యులకు ఎటువంటి ప్రయోజనం ఉండబోదని అంబేద్కర్ భావించారు. సమిష్టి వ్యవసాయం మాత్రమే వారికి ఉపయోగకరమని, అందుకు వ్యవసాయం "ప్రభుత్వ పరిశ్రమ" కావడం అవసరమని అన్నారు. అంబేద్కర్ దృష్టిలో ఈ సమిష్టితత్వం ఒకే ఒక మూలసూత్రంపై ఆధారపడి ఉంటుంది. ప్రజాస్వామ్య సిద్ధాంతాలను మానవ సమాజంలో రాజకీయ అంశాల నుండి రాజకీయేతర అంశాల వరకు విస్తృతంగా అచరింపబడే ప్రజాస్వామ్య సోషలిజమే ఈ మూల సూత్రం. హేతుబద్ధమైన ప్రభుత్వ సోషలిజం వ్యవస్థ ద్వారా ప్రభుత్వ నియంత్రణ, ప్రైవేటు సంస్థల మధ్య సమతూకం ఉండేందుకు ఆయన కృషి చేశారు.

పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ రద్దు కాకుండానే ప్రభుత్వ సోషలిజం నెలకొనాలని అంబేద్కర్ ఆకాంక్షించారు. ప్రణాళికా ఆర్థికవిధానం విజయవంతం కావాలంటే అది సస్పెన్షన్ లేదా రద్దుకు గురికాకూడదని అంబేద్కర్ అన్నారు. అది ఆర్థిక రంగంలో శాశ్వత వ్యవస్థగా నిలిచిపోవాలని అన్నారు. "సామాజిక ఆర్థిక వ్యవస్థ ప్రభుత్వ సోషలిజం తరహాలో ఉండాలని

కోరుకునేవారు. దాని ఆచరణ సాధారణ చట్టాల పరిధికి వదిలివేయలేమనే విషయం గ్రహించాలని" అంబేద్కర్ అన్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ కొనసాగాలని, ప్రభుత్వ సోషలిజం రాజ్యాంగ నిబంధనలకు లోబడి ఉండాలని అంబేద్కర్ అభిప్రాయపడ్డారు. పార్లమెంటరీ మెజారిటీ ద్వారా దానిని నిలిపివేయడం, సవరించడం లేదా రద్దు చెయ్యడం వంటివి సాధ్యపడకూడదని అన్నారు. ప్రభుత్వ సోషలిజం ఏర్పాటు పార్లమెంటరీ ప్రజాస్వామ్యం కొనసాగింపు, నియంతృత్వం ఏర్పడకుండా నిరోధించడం అనే మూడు లక్ష్యాలను సాధించేందుకు ఇది ఒక్కటే మార్గం. రాజ్యాంగ చట్టాలు మన ప్రజాస్వామ్య వ్యవస్థ ఏ రూపంలో, ఎలా ఉండాలని నిర్దేశించడం మాత్రమే కాకుండా సమాజ ఆర్థిక వ్యవస్థ మౌలిక స్వరూపాన్ని కూడా నిర్దేశించాలని అంబేద్కర్ అన్నారు. ఆర్థిక జీవనంలోని ముఖ్య రంగాల్లో ప్రభుత్వ సోషలిజం ఉండాలని ఆయన ప్రతిపాదించారు. భారతదేశ సత్వర పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వ సోషలిజం అత్యవసరమని, ప్రైవేటు సంస్థల ద్వారా ఇది సాధ్యం కాదని అంబేద్కర్ భావించారు. ప్రైవేటు పెట్టుబడి దారీ వ్యవస్థ యూరప్‌లో మాదిరిగా సంపదలో వ్యత్యాసాలను మాత్రమే నెలకొల్పుతోందని, ఇది భారతదేశానికి హెచ్చరిక కావాలని అంబేద్కర్ అన్నారు. ప్రభుత్వ సోషలిజం ఏర్పాటన్నది శాసనవ్యవస్థపై ఆధారపడి ఉండరాదు. అది రాజ్యాంగ చట్టాల్లో ఒక భాగం కావాలి. అది శాసనాలు గానీ, పాలకులు గానీ మార్చేందుకు వీలు కలిగేదిగా ఉండరాదు.

ధనికవర్గం అంతరించి పోవాలని అంబేద్కర్ కోరుకోలేదు. మానవ వ్యవహారాలకు సంబంధించి వారి ఆలోచనా విధానాల్లో సమూలమైన మార్పులు రావాలని మాత్రమే ఆకాంక్షించారు. అపరిమితమైన ఆస్తి, యాజమాన్యం అంతరించాలని ఆయన భావించారు. తాము ఆస్తులు ఉన్న వారి బానిసలమని శ్రామిక జీవులు భావించరాదు. వారు ధనిక వర్గాలను ఒక ప్రశ్న అడగాలి. యుద్ధానికయ్యే వ్యయాన్ని భరించేందుకు పన్నులు చెల్లించేందుకు సిద్ధపడే మీరు కార్మిక ప్రమాణాలు మెరుగుపరిచేందుకై అవసరమైన నిధులు ఏర్పాటు చేసేందుకు ఎందుకు అభ్యంతరం చెబుతున్నారు?" అని.

ట్రస్టీషిప్ ఆలోచనను అంబేద్కర్ వ్యతిరేకించారు. ప్రస్తుత సమస్యలకు ఇది ఏ విధంగానూ పరిష్కారం కాదని ఆయన భావించారు. పేదలు గత జన్మల్లో చేసిన పాపాలకు ఫలితం అనుభవిస్తున్నరనే వేదాంతపరమైన భావనలను ధనవంతులు తమ ఆధిక్యతను నిలుపుకొనేందుకు ఆశ్రయిస్తున్నారని అంబేద్కర్ భావించారు. సమాజం, మానవ జీవితంపట్ల ఆయనకు ఉన్నది వేదాంతధోరణి కాదు. పేదరికం. అమాయకత్వాన్ని సమర్థించే వేదాంత ధోరణి ఆయన నైజం కాదు.

చాతుర్వర్ణ వ్యవస్థ సోషలిజానికి పూర్తిగా భిన్నమైన సిద్ధాంతమని అంబేద్కర్ భావన. అది ప్రజల మధ్య చీలికలు సృష్టిస్తుంది. ఆర్థికపరంగా ఇవి ఎంతో హానికరమైన వ్యవస్థ, మానవుల సహజ సిద్ధమైన శక్తులు ఆకాంక్షలను సామాజిక నిబంధనలు, ఆంక్షలకు దాసోహం చెయ్యడమే. ఈ వ్యవస్థ మానవులపై అయిష్టమైన పని భారాన్ని మోపుతుంది.

కులతత్వం అన్ని విధాల ఆర్థికాభివృద్ధికి ప్రతిబంధకంగా నిలుస్తోందని అంబేద్కర్ హెచ్చరించారు. వ్యవసాయరంగం, ఇతర కార్యకలాపాల్లో సమిష్టి కృషికి హానికరమైన పరిస్థితులను అది సృష్టించింది. కులతత్వం, ఆర్థికాభివృద్ధి పరస్పర విరుద్ధమైన అంశాలని ఆయన వ్యాఖ్యానించారు. కుల సంబంధాల ప్రాతిపదికగా గ్రామీణాభివృద్ధి సోషలిజం సిద్ధాంతాలకు వ్యతిరేకం. కులతత్వం ప్రాతిపదికగా ఏర్పడే ఎస్టేట్‌లను విచ్ఛిన్నం చేసి, సాగు చేసే రైతుకే భూమిని పంచి ఇవ్వాలని ఆయన పిలుపు నిచ్చారు. నగరాలు, గ్రామాల సత్వరాభివృద్ధికి అవసరమైన వస్తువులను ఉత్పత్తి చేసే వారికే ఆ భూములు పంచాలని అంబేద్కర్ సూచించారు. భారతదేశంలో సోషలిజం ఆర్థిక పరంగా కంటే ఎక్కువ సామాజికపరమైందని ఆయన అన్నారు. ప్రస్తుత సమస్యల పరిష్కారానికి అది ఏ మేరకు ఉపయోగపడిందన్నది కాకుండా మనుషులు, మనుషులకు మధ్య సంప్రదాయపరమైన వస్తున్న అడ్డుగోడలను ఏ విధంగా నిర్మూలిస్తోందన్నదే ఇక్కడ నిజమైన పరీక్ష. అంబేద్కర్ దృష్టిలో ప్రస్తుత ఆర్థిక, సామాజిక, రాజకీయ,నైతిక వ్యవస్థ ప్రజల్లో సామాజిక స్ఫూర్తిని కలిగించేదిగా లేదు. సోషలిజం సామాజిక భాగస్వామ్యాన్ని కోరుకుంటుంది. అయితే ప్రస్తుత సామాజిక వ్యవస్థ సామాజిక అవగాహన, కలిసి పని చెయ్యడానికి సర్వమానవ సమానత్వానికి పూర్తి భిన్నంగా ఉంది. "సోషలిజం నిశ్చయమైన వాస్తవం కావాలని ఆకాంక్షించే వారు సామాజిక సంస్కరణ ప్రాథమిక అంశమని, దానికి మించిన ప్రత్యామ్నాయం లేదని గుర్తించాలి" అన్నారు. సాంఘిక దురాచారాలను అంతమొందించడం ప్రాథమిక అవసరం. సామాజిక వ్యవస్థలో మార్పులు చేయని పక్షంలో ప్రస్తుత వ్యవస్థ త్వరలో కుప్పకూలిపోతుంది. ప్రజాస్వామ్య వ్యవస్థ భారతదేశంలో పనిచేయకపోతే కమ్యూనిజమే ప్రత్యామ్నాయమని ఆయన సూచించారు.

భారత జపాన్ సాంస్కృతిక సమ్మేళనం తనకు ఏర్పాటు చేసిన సన్మాన సభలో ప్రసంగిస్తూ అంబేద్కర్ ఇలా అన్నారు. "ప్రస్తుత లేదా భవిష్యత్ తరం చివరకు గౌతమ బుద్ధుని ప్రవచనాలు, కారల్‌మార్క్స్ ప్రబోధాల మధ్య ఒక దానినిఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. బుద్ధుని ప్రబోధాలు అనుసరించని పక్షంలో యూరప్‌లో నెలకొన్న సంక్షోభమే ఆసియాలో పునరావృతమయ్యే ప్రమాదం ఉంది."

ఈ జగత్తు విచారమయం అన్నారు గౌతమ బుద్ధుడు. దోపిడి అనే పదాన్ని బుద్ధుడు ఉపయోగించకపోయినప్పటికీ దుఃఖం అనే పునాది మీద ఆయన తన మతం స్థాపించారు. దుఃఖం అనే పదాన్ని అస్తి అనే ఆలోచనతో బుద్ధుడు ఉపయోగించారు. దోపిడీని నివారించేందుకు ఉత్పత్తి సాధనాలు ప్రభుత్వం అధీనంలో ఉండాలని మార్క్స్ ప్రబోధించారు. మత గురువు లెవరికీ ప్రైవేటు ఆస్తులుండరాదని బుద్ధుడు అన్నారు. ప్రైవేటు ఆస్తికి సంబంధించిన నిబంధనలు ఆయన ప్రబోధాల్లో కనిపిస్తాయి. దుఃఖాన్ని నివారించేందుకు బుద్ధుడు చూపిన మార్గం సురక్షితంగా ఉందని, అది ఒక్కటే మార్క్సిజంకు ఏకైక ప్రత్యామ్నాయమని అంబేద్కర్ అన్నారు.

"డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్! రైటింగ్స్, స్పీచెస్" సంపాదకవర్గం డాక్టర్ అంబేద్కర్ రాత ప్రతులను కనుగొంది. దానిని 3వ సంపుటలో ప్రచురించింది. క్రింద తెలిపిన విభాగం 3 సంపుటి 441-62 సంక్షిప్తీకరణ.

## బుద్ధ లేదా కార్ల్‌మార్క్స్ :

బుద్ధుడు అహింసా సిద్ధాంతాన్ని ప్రబోధించాడు. ఆయన ప్రబోధాల్లో ఇదే మూల సూత్రంగా భావింపబడుతోంది. అయితే ఆయన ప్రకటించింది ఇంతకంటే విస్తృతమైందని, అహింసా సిద్ధాంతానికి మించి ఉందనే విషయం ఎవరికీ తెలియదు.

శాస్త్రీయ సోషలిజం అనడంలో కార్ల్‌మార్క్స్ ఉద్దేశం అది అనివార్యమైందని, తప్పించుకోగలది కాదని, మొత్తం సమాజం దాని వైపుగా సాగుతోందని, అలా సాగకుండా, ఎవరూ నిరోధించలేరని. తన సిద్ధాంతాన్ని నిరూపించేందుకు మార్క్స్, ప్రధానంగా ఈ విషయాలపై దృష్టి సారించారు. (i)ఈ ప్రపంచ మూలాన్ని వివరించడంలో కాలాన్ని వృథా చేసుకునే బదులు ఈ ప్రపంచాన్ని పునర్నిర్మించడమే తత్వజ్ఞానం ప్రధాన లక్షణం (ii) విభిన్న వర్గాల ప్రయోజనాల మధ్య వైరుధ్యం ఉంటుంది (iii) ప్రైవేటు ఆస్తులు ఒక వర్గానికి అధికారం కట్టబెడుతుండగా మరో వర్గం దోపిడీకి గురి అవుతోంది. (iv) శాస్త్రీయ సోషలిజం మన సమాజానికి మేలైంది. ప్రైవేటు ఆస్తి విధానాన్ని రద్దు చెయ్యడం ద్వారా దుఃఖాన్ని తొలగించవచ్చు.

మనిషిలో సంస్కరణ తీసుకువచ్చేందుకు గౌతమ బుద్ధుడు అనుసరించిన విధానం తనకు అనుకూలించిన మార్గాన్ని స్వచ్ఛందంగా అనుసరించేలా అతని మానసిక దృక్పథంలో మార్పు తీసుకురావడం. కమ్యూనిస్టులు అనుసరించిన మార్గాలు కూడా ఇంత స్పష్టంగా, సంక్షిప్తంగా, వేగంగా ఫలితాలు ఇచ్చేవిగా ఉన్నాయి. అవి (1) అహింస (2) పారిశ్రామిక కార్మికవర్గం నియంతృత్వం. కమ్యూనిజం నెలకొల్పేందుకు రెండు మార్గాలు మాత్రమే ఉన్నాయని కమ్యూనిస్టులు అంటారు. మొదటిది అహింస. ప్రస్తుత వ్యవస్థను కూకటివేళ్ళతో పెకిలించి వేసేందుకు అహింసకు మించిన సాధనం మరొకటి లేదు. మరొకటి పారిశ్రామిక కార్మిక వర్గ నియంతృత్వం. బుద్ధుడు. కార్ల్‌మార్క్స్ మధ్య సారూప్యాలు, తేడాలు ఇప్పుడు స్పష్టం. ఇద్దరి అంతిమ లక్ష్యం ఒక్కటే. అనుసరించే మార్గాల్లో మాత్రమే తేడాలున్నాయి.

బుద్ధుడు అహింసకు వ్యతిరేకం. ఆయన న్యాయాన్ని కూడా ఆకాంక్షించారు. న్యాయం కోసం అవసరమైతే బల ప్రయోగాన్ని కూడా ఆయన అనుమతించారు. చివర్లో హింసాకాండ సముచితమైతే పూర్తిగా సమర్ధనీయమేనని ఆయన పేర్కొని ఉండేవారు. అంతిమంగా బల ప్రయోగం తప్ప వేరే మార్గం లేని దశలో ప్రైవేటు యజమానులకు కూడా దీని నుండి ఆయన మినహాయింపు కల్పించే వారు కాదు. ప్రొఫెసర్ దేవే పేర్కొన్న విధంగా బలప్రయోగానికి

మరోపేరే హింసాకాండ. సృజనాత్మక కార్యక్రమాలకు బల ప్రయోగం ఉపయోగించాల్సి వచ్చినా దానిని శక్తిగా ఉపయోగించడానికీ, హింసాకాండగా ఉపయోగించడానికీ మధ్య వ్యత్యాసం ఉండేలా మార్చాలి.

నియంతృత్వ నివారణకు విప్లవం శాశ్వత పరిష్కారం. ఇది విలువైన అంతిమ పరిష్కారం కూడా. ఈ లక్ష్య సాధనలో ఇతర విలువైన సాధనాలను విధ్వంసం చెయ్యలేదని కమ్యూనిస్టులు చెప్పగలరా? స్వేచ్ఛలేక పోవడం, లేదా పార్లమెంటరీ ప్రభుత్వం లేక పోవడమే నియంతృత్వానికి తరచూ నిర్వచనంగా చెప్పబడుతోంది. ఈ రెండు అన్వయాలు స్పష్టంగా లేవు. పార్లమెంటరీ తరహా ప్రభుత్వం ఉన్నప్పటికీ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఉండవు. చట్టం అంటే స్వేచ్ఛపై ఆకాంక్ష. నియంతృత్వం, పార్లమెంటరీ ప్రభుత్వం మధ్య తేడా ఇక్కడే ఉంటుంది. పార్లమెంటరీ ప్రభుత్వంలో స్వేచ్ఛపై ప్రభుత్వం విధించిన ఆంక్షలను విమర్శించే హక్కు ప్రతి పౌరునికీ ఉంటుంది. పార్లమెంటరీ ప్రభుత్వంలో మీకు బాధ్యత, హక్కు రెండు ఉంటాయి. బాధ్యత చట్టాన్ని పాటించడం, హక్కు దానిని విమర్శించడం. నియంతృత్వంలో మీరు పాటించే బాధ్యత ఒక్కటే ఉంటుంది. విమర్శించే హక్కు ఉండదు. నిజమనే రాజ్యానికి సెంట్రీలా వ్యవహరించేలా ప్రతివ్యక్తికీ నైతికంగా శిక్షణ ఇవ్వాలని బుద్ధుడు కోరుకున్నారు.

రాజ్యం శాశ్వత నియంతృత్వం అనే తమ సిద్ధాంతం తమ రాజకీయ దృక్పథంలో బలహీనత అనే విషయాన్ని కమ్యూనిస్టులు అంగీకరిస్తారు. ప్రభుత్వం అనేది చిట్ట చివరకు అంతరించిపోతుందనే వాదన మాటున ఆత్మసంతృప్తి చెందేందుకు వారు ప్రయత్నిస్తారు. దీనికి కమ్యూనిస్టులు ఎటువంటి పరిష్కారం సూచించలేదు. రాజ్యం పతనమైతే దాని స్థానంలో ఏది ఉనికిలోకి వస్తుందనే ప్రశ్నకు సంతృప్తికరమైన సమాధానం లభించదు. ప్రభుత్వం లేదా రాజ్యం పతనమవుతుందనే దానికంటే ఇది మరింత ప్రాధాన్యత గల అంశం. రాజ్యం స్థానంలో అరాచకత్వం చోటు చేసుకుంటుందా? అదే జరిగితే కమ్యూనిస్ట్ రాజ్య నిర్మాణం వృథా ప్రయత్నం మాత్రమే అవుతుంది. బల ప్రయోగం లేకుండా దానిని నిలుపుకోవడం అసాధ్యమైతే, దానిని నిలబెట్టే బలప్రయోగాన్ని ఉపసంహరించుకోగానే అరాచకత్వానికి దారితీస్తే కమ్యూనిస్ట్ ప్రభుత్వం వల్ల ఒనగూడే ప్రయోజనం ఏమిటి? దాని ఘనత ఏమిటి?

బల ప్రయోగాన్ని ఉపసంహరించుకోగానే ప్రభుత్వాన్ని నిలబెట్టగలిగే శక్తి ఒక్క మతానికి మాత్రమే ఉంది. అయితే మతం అనేది కమ్యూనిస్టులు పరిత్యజించిన అంశం. బల ప్రయోగాన్ని ఉపసంహరించుకున్న తరువాత కమ్యూనిజాన్ని పరిరక్షించుకునేందుకు బుద్ధిజం అంతిమ సాధనంగా రష్యన్లు ఎన్నడూ భావించినట్టు కనబడదు. రష్యన్లు తమ కమ్యూనిజాన్ని గర్వమైనదిగా భావిస్తారు. అయితే వింతల్లో కల్లా వింత ఏమంటే బుద్ధుడు నియంతృత్వానికి దారితీయని కమ్యూనిజాన్ని నెలకొల్పడం. రష్యన్లు ఈ విషయాన్ని మరచిపోతారు. అది చిన్న స్థాయిలో కమ్యూనిజం కావచ్చు. అయితే అది నియంతృత్వానికి తావు లేని కమ్యూనిజం. దీనిని నెలకొల్పడంలో లెనిన్ విఫలమయ్యారు.

రష్యాలో కమ్యూనిస్ట్ నియంతృత్వం అనేక అద్భుత విజయాలు సాధించింది. ఆ విషయాన్ని ఎవరూ కాదనలేదు. అందువల్లనే రష్యన్ల నియంతృత్వం అన్ని వెనుకబడిన దేశాలకు అనుసరణీయం అవుతుంది. అయితే ఇది శాశ్వత నియంతృత్వం కోసం చేసే వాదన కాదు. మానవత్వం ఆర్థిక విలువలనే కాదు భావోద్వేగాలకు సంబంధించిన విలుపలను కూడా కోరుకుంటుంది. శాశ్వత నియంతృత్వం భావోద్వేగంపై దృష్టి సారించలేదు. అటువంటి ఉద్దేశం కూడా దానికి ఉన్నట్లు అనిపించదు. కార్లైల్ రాజకీయ ఆర్థిక వ్యవస్థను వరాహ వేదాంతంగా అభివర్ణించారు. కార్లైల్ అభిప్రాయం బహుశ పొరపాటు కావచ్చు. మనిషికి భౌతిక సౌకర్యాలు కూడా అవసరమే. మనుషులు పందులకంటే మెరుగైన వారు కానప్పటికీ కమ్యూనిస్ట్ సిద్ధాంతం లక్ష్యం కొవ్వెక్కిన పందులు మాదిరిగా కనబడుతోంది. అందువల్ల కమ్యూనిస్ట్ సిద్ధాంతం కూడా లోపభూయిష్టంగానే కనబడుతోంది. మనిషి భౌతికంగా, ఆధ్యాత్మికంగా ఎదగాలి. ఫ్రెంచ్ విప్లవం సూచించిన విధంగా కొత్త పునాది నిర్మించాలని సమాజం లక్ష్యంగా నిర్దేశించుకుంటోంది. సోదరభావం, స్వేచ్ఛ, సమానత్వం, ఈ నూతన పునాది ప్రధాన భూమికలు. ఈ నినాదం కారణంగానే ఫ్రెంచ్ విప్లవాన్ని ప్రజలు హర్షించారు. అయితే అది సమానత్వాన్ని తీసుకు రావడంలో విఫలమైంది. రష్యా విప్లవం ప్రధాన లక్ష్యం సమానత్వం సాధించడం. అందువల్లనే మనం దానిని మనం స్వాగతిస్తున్నాం. అయితే సమసమాజస్థాపన కోసం సోదరభావాన్ని, స్వేచ్ఛను త్యాగం చెయ్యలేం. సోదరభాపం, స్వేచ్ఛ లేకుండా సమానత్వానికి విలువలేదు. బుద్ధుడు సూచించిన మార్గం అనుసరించడం ద్వారా మాత్రమే ఈ మూడు సహజీవనం చెయ్యగలుగుతాయి. కమ్యూనిజం ఒక్కదానిని మాత్రమే ఇవ్వగలుగుతుంది. అన్నిటినీ కాదు.

# అధ్యాయం 10

# రాజకీయ పార్టీలు

## సెక్షన్-1

### పార్టీలపై దృష్టి కోణం

అణచివేతకు గురైన వర్గాలు అణచివేత వర్గాల మిషన్ క్రింద సమీకృతమయ్యాయి. అస్పృశ్యుల అభ్యున్నతి, సామాజిక అభ్యున్నతి దాని ముందున్న ప్రధాన లక్ష్యం. సామాజిక సమస్యలను ప్రస్తావించడం హిందు కులాల అణచివేత వైఖరికి నిరసన వ్యక్తం చెయ్యడం. వారి ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడం - అణచివేతకు గురవుతున్న వర్గాల కార్యక్రమం ప్రధాన లక్షణాలు. 1919 మౌంట్‌ఫర్డ్ సంస్కరణలకు ముందు వారు ఏ రూపంలోనూ రాజకీయ శక్తిగా లేరు. కొన్ని సమస్యలపై వినతి పత్రాలు సమర్పించినప్పటికీ అవి రాజకీయపరమైన డిమాండ్లు కావు. ఆవర్గం పురోగతి కోసం ఉద్దేశింపబడిన సామాజిక కార్యకలాపాలు మాత్రమే. రౌండ్ టేబుల్ సమావేశాల్లో అంబేద్కర్, శ్రీనివాసన్ ఈ వర్గాలకు ప్రాతినిధ్యం వహించేవారు. ఏ రాజకీయ సదస్సుల్లో వారికి అంతకుముందు ప్రాతినిధ్యం ఉండేది కాదు.

1937లో సార్వత్రిక ఎన్నికలు జరగాలని 1935 చట్టం నిర్దేశించింది. వివిధ పార్టీలు ఈ ఎన్నికలకు సమాయత్తం కావడం ప్రారంభించాయి. ప్రతి రాష్ట్రంలోనూ బలం గల అతి పెద్ద పార్టీ భారత జాతీయ కాంగ్రెస్. ఉదారవాద పార్టీలు, ముస్లిం లీగ్, ఇతర పార్టీలు ఉండేవి. అయితే అస్పృశ్యులకు వారికంటూ ప్రత్యేక పార్టీ లేదు. ఇటువంటి కీలక సమయంలో అంబేద్కర్ చొరవ చూపి వారికి నాయకత్వం వహించారు. 1936 ఆగస్టు ఇండిపెండెంట్ లేబర్ పార్టీ (ILP)ని నెలకొల్పారు.

ILP బొంబాయి ఎన్నికల్లో మాత్రమే పోటీ చేసింది. ఆ ఒక్క రాష్ట్రంలోనే ఆ పార్టీ కార్యకలాపాలు నిర్వహించడమే ఇందుకు కారణం. బాంబే ప్రెసిడెన్సీ షెడ్యూల్డ్ కులాల వారికి 15 సీట్లు కేటాయించగా, అందులో ILP 13 స్థానాలు కైవసం చేసుకుంది. వాటికి తోడు రెండు జనరల్ స్థానాల్లో కూడా విజయం సాధించింది. అంబేద్కర్ బొంబాయిలో గెలుపొందారు. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటి చేసిన ప్రముఖ క్రికెటర్ పి.బాలుపై ఆయన గెలుపొందారు. బొంబాయి

రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో ఆయన పర్యటించారు. 1935 రాజ్యాంగం రూపొందించేందుకు అంబేద్కర్ కృతనిశ్చయంతో పని చేశారు. ఈ రాజ్యాంగాన్ని విధ్వంసం చేసేందుకే కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని స్వీకరించింది.

ILP ప్రధాన బలం మహర్లేనని ఆ పార్టీ ఏర్పాటైన తర్వాత వ్యాఖ్యలు వచ్చాయి. అంబేద్కర్ మహార్ల కులానికి చెందినవారు. అణచివేతకు గురవుతున్న వర్గాల్లో మహర్లు ఎక్కువగా ఉంటే అది తన తప్పిదం కాదని అంబేద్కర్ అన్నారు.

అస్పృశ్యులకు కాంగ్రెస్ ప్రాతినిధ్యం వహిస్తుందా, లేదా అన్నది ఎన్నికల్లో ప్రధాన అంశంగా పరిణమించింది అస్పృశ్యులకు కాంగ్రెస్ పార్టీ ప్రాతినిధ్యం వహించదని నిరూపించడమే రౌండ్ టేబుల్ సమావేశం అనంతరం అంబేద్కర్ ప్రయత్నంగా ఉంది. షెడ్యూల్డ్ కులాలకు రిజర్వ్ చేసిన అన్ని స్థానాలనూ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుందని, ILP విఫలమైందనే కథనం దురుద్దేశపూరితమైందని అంబేద్కర్ వ్యాఖ్యానించారు.

ILP తన ఎన్నికల ప్రణాళికలో ఆర్థిక, సామాజిక విద్యా కార్యక్రమాన్ని రూపొందించింది.

ILP పార్టీని ప్రత్యేకంగా అణచివేతకు గురవుతున్న వర్గాలకు చెందిన పార్టీగా నిర్వహించాలన్నది అంబేద్కర్ అసలు ఉద్దేశంగా ఉంది. ఆయన ఈ విధంగా వ్యాఖ్యానించారు. "మతపరంగా నిర్వహింపబడే పార్టీలకు ప్రస్తుతం సమయం అనుకూలం కాదు. తన స్నేహితుల ఆకాంక్షలతో ఆయన ఏకీభవించారు. తన పార్టీ పేరును విస్తరించారు. అణచివేతకు గురైన వర్గాలు ఇతర వర్గాల మధ్య రాజకీయ సహకారాన్ని ప్రోది చేసే విధంగా పార్టీ కార్యక్రమాన్ని విస్తరించారు. శ్రామికశక్తి గురించి ఆయన ఈ విధంగా వివరణ ఇచ్చారు." పార్టీ ఒక కార్మిక సంస్థ. శ్రామిక వర్గాల సంక్షేమాన్ని పెంపొందింప చేయడం పార్టీ ప్రధాన కార్యక్రమం."అణచివేతకు గురవుతున్న వర్గాలు" అనే పదాలకు బదులు 'కార్మికులు' అనే పదాన్ని ఉపయోగించడం జరిగింది. ఎందుకంటే కార్మికులలోనే అణచివేతకు గురవుతున్నవారు కూడా ఉన్నారు.

భూమి లేని నిరుపేద కౌలుదారులు, వ్యవసాయదారులు, కార్మికుల తక్షణ అవసరాలు, ఇబ్బందుల పరిష్కారానికి పార్టీ సమగ్ర కార్యక్రమాన్ని రూపొందించింది. ILP రూపొందించిన కార్యక్రమం సమగ్రంగాను, హేతువాద సిద్ధాంతంతోనూ కూడి ఉంది. కాంగ్రెస్ కార్యక్రమం ప్రాథమిక హక్కులపై కరాచీ తీర్మానం (1931) ప్రాతిపదికగా రూపొందింపబడింది. అంబేద్కర్ ఆ సిద్ధాంతాలను అనుసరించి ప్రత్యేకంగా ఒక కార్యక్రమాన్ని రూపొందించారు.

1937లో కాంగ్రెస్ ఎనిమిది రాష్ట్రాల్లో ప్రభుత్వాలను ఏర్పాటు చేసింది. బొంబాయి ప్రెసిడెన్సీలో ILP ప్రతిపక్ష పార్టీగా వ్యవహరించింది. కౌలుదారీ విధానం, సమ్మెల నిషేధం,

బిల్లు, ఖోటీ బిల్లు, ఇతర కార్యక్రమాలపై అధికార కాంగ్రెస్ పార్టీ విధానాలను ILP తీవ్రంగా ఖండించింది. ఆయన బొంబాయి శాసనసభలో చేసిన ప్రసంగాలు ఆలోచనను రేకెత్తించేవిగా, మనసులో చొచ్చుకుపోయే విధంగా బాగా అధ్యయనం చేసి రూపొందించినవిగా ఉన్నాయి. ప్రజలకు ILP మార్గదర్శకంగా, కన్నులు తెరిపించేదిగా వ్యవహరించింది.

యాక్సిస్ శక్తులపై మిత్రపక్షాల యుద్ధం పూర్తి స్థాయిలో ఉంది. భారత్ దుందుడుకు దేశంగా ప్రకటింపబడింది. అందువల్ల దాని తటస్థ వైఖరి ఉనికిలో లేదా మిత్రపక్షాల యుద్ధ లక్ష్యాలేమిటో ప్రకటించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. అయితే ప్రభుత్వం వాటిని ఎప్పుడూ ప్రకటించలేదు. వైస్రాయ్ మండలిని విస్తరించి యుద్ధ చర్యలను పటిష్టంగా అమలు చేయాలని భారత వైస్రాయ్ 1940 ఆగస్టున వివిధ రాజకీయ పార్టీలకు ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనలో అస్పృశ్యుల కనీస రాజకీయ డిమాండ్లను పరిగణనలోకి తీసుకోలేదు.

వైస్రాయ్ కౌన్సిల్ సభ్యత్వం పొందినందుకు గాను అంబేద్కర్‌ను అభినందించేందుకు అణచివేతకు గురవుతున్న వర్గాల సమావేశాన్ని ఏర్పాటుచేశారు. అణచివేతకు గురవుతున్న వర్గాల వారికోసం అఖిల భారత రాజకీయపార్టీ అవసరాన్ని ఆ సమావేశంలో ప్రసంగించిన వక్తలు నొక్కి చెప్పారు. దరిమిలా ILP ని అఖిల భారత షెడ్యూల్డ్ కులాల సమాఖ్య (AISCF)గా 1942 జూలైలో రూపాంతరం చేశారు. ఎన్.శివరాజ్‌ను పార్టీ అధ్యక్షునిగా సమావేశం ఎన్నుకుంది. షెడ్యూల్డ్ కులాల వారికి ఎటువంటి రాజకీయ, ఆర్థిక అధికారం లేదని అంబేద్కర్ పేర్కొన్నారు. అందువల్ల రాజకీయ అధికారాన్ని దక్కించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. యుద్ధంలో సహకరించేందుకు ఆయన సుముఖత వ్యక్తం చేశారు. అయితే అస్పృశ్యుల డిమాండ్‌ను బ్రిటిష్ ప్రభుత్వం ఆమోదించలేదు. ప్రభుత్వం హిందువులకు రాజకీయ హక్కులను కల్పిస్తే వారు (హిందువులు) అస్పృశ్యులను దోపిడీ చేస్తారని, అందువల్ల రాజకీయ అధికారాన్ని విభజించాలని అంబేద్కర్ భావించారు.

ప్రజలందరికీ మతపరమైన, ఆర్థిక, రాజకీయ స్వేచ్ఛ కల్పించడం, కోరిక, భయం నుండి విముక్తి కల్పించే బాధ్యత ప్రభుత్వానిదే. స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం పరిరక్షణ, మనుషులు, వర్గాలు, దేశాలు ఒకరినొకరు అణచివేసుకుంటూ దోపిడికి పాల్పడకుండా చూడటం పార్లమెంటరీ పాలన వ్యవస్థ AISCF ప్రణాళికలో ప్రధానమైన అంశాలుగా ఉన్నాయి.

లిబరల్ పార్టీ పతనం కావడం లిబరల్స్‌కు ఖేదం కలిగించింది. వాస్తవానికి ఇది దేశానికి నష్టదాయకమని అంబేద్కర్ భావించారు. ఏకపార్టీ పాలన ప్రజా ప్రభుత్వానికి నష్టదాయకమని ఆయన అభిప్రాయబడ్డారు. జాతీయ సార్వభౌమికత పేరుతో దేశంలో ఏకపార్టీ వ్యవస్థ నెలకొనడం పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. ఈ వ్యవస్థలో నిరంకుశత్వం, ప్రజా వ్యవహారాలు సరైన దిశలో నిర్దేశింపబడే అవకాశం ఉండదని అంబేద్కర్ అభిప్రాయపడ్డారు. వాస్తవానికి ఇది ప్రజా ప్రభుత్వ లక్ష్యానికే విరుద్ధమని అన్నారు. ప్రభుత్వాన్ని నిర్వహించే అవకాశం ఒకే పార్టీకి కల్పించడం నిరంకుశత్వానికి దారితీస్తుందని ఆయన హెచ్చరించారు. ఏక పార్టీ పాలన నిరంకుశత్వంతో సమానమని అన్నారు. అంబేద్కర్ దృష్టిలో నిరంకుశత్వం

– అది దేశీయమైనదైనా, విదేశీయమైనదైనా – స్వేచ్ఛకు భంగకరం. "ప్రజలచే ఎన్నుకోబడినంత మాత్రాన నిరంకుశత్వం నిరంకుశత్వం కాకమానదు. నియంతలు మనకు చెందినవారే అయినంత మాత్రాన వారు ఆమోదయోగ్యం కాజాలదు. ఇలా నిరంకుశత్వం ఏర్పడకుండా హామీ ఇచ్చేది ఏమంటే అటువంటి ప్రభుత్వాన్ని గద్దెదింపే అవకాశం కలిగి ఉండటమే. ప్రతిపక్ష పార్టీ దానిని అదుపులో ఉంచేది. అవసరమైతే దానిని అక్రమించే అధికారాన్ని చేజిక్కించుకునే విధంగా ఉండటమే" స్వేచ్ఛ. అంతరార్థం ధైర్యమేనని అంబేద్కర్ వ్యాఖ్యానించారు. విభిన్న వ్యక్తులు పార్టీగా ఏర్పడటంలోనే ధైర్యం కలుగుతుంది. ప్రభుత్వాన్ని నడిపేందుకు ఒక పార్టీ అవసరం. అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీ – ఈ రెండు పార్టీల వ్యవస్థ ఉన్నప్పుడే ప్రజాస్వామ్య ప్రభుత్వం ప్రజాస్వామికంగా వ్యవహరించగలుగుతుంది.

పార్టీ నిర్వహణలో మూడు రకాల వ్యవస్థలుంటాయని అంబేద్కర్ భావించారు. అవి (1) అధిష్టాన వర్గం (2) పార్టీ యంత్రాంగమైన ప్రొఫెషనల్ రాజకీయవేత్తలు (3) సంప్రదాయం, భావోద్వేగంతో కూడిన విధేయత కల వ్యక్తుల కలయిక. ఏ పార్టీ రికార్డు కోసం కాకుండా పార్టీ సిద్ధాంతాలకు వారు ఓటు వేస్తారు. రెండవ రంగంలో ఉన్న వారు రాజకీయ పార్టీ కార్యచరణలో ప్రధాన అంగమైన వారు కలిసికట్టుగా, సమిష్టిగా వ్యవహరించడం ప్రతి రాజకీయ పార్టీకి అత్యవసరం. వ్యక్తిగత అభిప్రాయాలను, ప్రజల అభిప్రాయాలను మలచడం, సిద్ధాంతపరంగా రాజకీయ పార్టీలు ప్రజల అభిప్రాయాలను వ్యక్తం చేసి ఆచరణలో పెట్టే ఏజెన్సీల వంటివి. అయితే ఆచరణలో రాజకీయ పార్టీలు ప్రజల అభిప్రాయాలను సృష్టించి, మార్గదర్శకత్వం వహించి ప్రభావితం చేసి నియంత్రిస్తున్నాయి. అవి రెండు రకాల బాధ్యతలు నిర్వర్తించాలని అంబేద్కర్ పిలుపునిచ్చారు. (1) ప్రజలతో సంబంధాలు పెట్టుకోవాలి (2) ప్రజల్లో ప్రచారం చెయ్యాలి. సమిష్టి చర్యలను నిర్వహించలేని పార్టీలు అసలు పార్టీలుగా ప్రచారం చేసుకునే హక్కు కలిగి ఉండవు. లిబరల్ పార్టీకి అధిష్టాన వర్గం మాత్రమే ఉందని, యంత్రాంగం లేదని అంబేద్కర్ అన్నారు. ప్రజలతో సంబంధాలు పెట్టుకోవడంపై దానికి నమ్మకం, ఆసక్తి లేవు. అందువల్లనే అది ప్రజలకు దూరమైంది. ప్రధానమైన ప్రజల నుండి చీలిపోయింది. మార్పు పట్ల దానికి నమ్మకం లేదు. హిందూ మతం మాదిరిగానే అది నమ్మకం అభిప్రాయం మార్చుకునేందుకు సుముఖత చూపని జాతికి చెందింది. ప్రచారం, సమిష్టి చర్య లిబరల్ పార్టీకి సహించని విషయాలు.

సమతూకం వహించే మూడవ పార్టీని స్థాపించే అవకాశాలను గురించి కూడా అంబేద్కర్ అధ్యయనం చేశారు. రాజకీయ అధికారం అన్ని రకాల సామాజిక పురోగతికి ప్రధానమని అంబేద్కర్ పేర్కొన్నారు. మూడవ పార్టీగా వ్యవహరించడం వల్లనే షెడ్యూల్డ్ కులాలు రాజకీయ అధికారం సాధించగలవని సూచించారు. ప్రత్యామ్నాయ పార్టీ, ప్రత్యర్థి పార్టీలైన కాంగ్రెస్, సోషలిస్టుల మధ్య సమతూకాన్ని సాధించడం ద్వారా తృతీయ పార్టీగా రూపొంది షెడ్యూల్డ్ కులాలు అధికారం సాధించగలవన్నారు.

## సెక్షన్-2

### ప్రతిపక్ష పార్టీ ఏర్పాటు

ప్రతిపక్ష పార్టీ ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని అంబేద్కర్ 1951 డిసెంబర్‌లోనే గుర్తించారు. 1952 సార్వత్రిక ఎన్నికల ముందు నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా ఎన్నికల్లో SCF గెలిచే అవకాశం లేదని ఆయన గ్రహించారు. అందుకోసం ఇతర వామపక్ష పార్టీలతో పొత్తు పెట్టుకోవడం అనివార్యమైంది.

ప్రజా సోషలిస్ట్ పార్టీతో సహకరించే అంశాన్ని SCF సమగ్రంగా చర్చించింది. ఆ పార్టీ కార్యక్రమంలో సామాజిక సమానత్వం, అస్పృశ్యత నిర్మూలన అంశాల గురించి సమగ్రంగా చర్చలు జరిపింది. అయితే సోషలిస్టులు నమ్మదగ్గవారు కాదని అంబేద్కర్ అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ "సోషలిస్టు పార్టీకి నేను అనుకూలమే. వారు మతోన్మాదులు కాదు. రాజకీయంగా వారు చెప్పే విషయాలు సరైనవే" అని అంబేద్కర్ పేర్కొన్నారు.

మార్క్సిజాన్ని తన దాభాదీ సిద్ధాంతంలో పెజెంట్స్ & వర్కర్స్ పార్టీ (PWP) ఆమోదించింది. PWP నాయకుడు S.S. మోరే కమ్యూనిస్ట్ అనుకూలవ్యక్తి అనీ, కమ్యూనిస్టు పార్టీలో తమ పార్టీని విలీనం చెయ్యాలని కోరుకున్నారనీ అంబేద్కర్‌కు జయప్రకాశ్ నారాయణ్ తెలియజేశారు. ఇలా చెయ్యడం ప్రజలను మోరే నాశనం చేస్తున్నట్లేనని అంబేద్కర్ వ్యాఖ్యానించారు. PWPకి హృదయపూర్వక మద్దతు ఇవ్వరాదని, బాబారావు గ్వెక్రెడ్‌కు అంబేద్కర్ సూచించారు. అయినప్పటికీ జేదే, మోరే, రావత్ (వీరంతా మహారాష్ట్రలో PWP నాయకులు)లకు మద్దతు ఇవ్వాలని తన అనుచరులకు సూచించారు. అంబేద్కర్‌కు ఈ పార్టీ అంటే ప్రత్యేక శ్రద్ధ లేదు. PWP మరాఠాల ఆధిపత్యంలోని మతతత్వ పార్టీ అని అంబేద్కర్ భావించారు. కమ్యూనిస్టులకు SCF సహకరిస్తున్నదని PWP ప్రకటించింది. ఈ నేపథ్యంలో PWPతో SCF కలిసి పనిచేసే అవకాశాలు శాశ్వతంగా మృగ్యమయ్యాయి. హిందూ మహాసభ, జనసంఘ్ మతతత్వ పార్టీలని అంబేద్కర్ అభివర్ణించారు.

స్వతంత్ర భారతదేశంలో వయోజన ఓటు హక్కు కల్పించి తొలి సార్వత్రిక ఎన్నికలు జరిగిన సందర్భంగా షెడ్యూల్డ్ కులాల సమాఖ్య (SCF) ప్రజా సోషలిస్టు పార్టీతో చేతులు కలిపింది. దానితో ఎన్నికల పొత్తు పెట్టుకుంది. (1951 నవంబర్). సోషలిస్టులు (PSP), షెడ్యూల్డ్ కులాల సమాఖ్య సంయుక్తంగా నిలబెట్టిన అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని అంబేద్కర్ విజ్ఞప్తి చేశారు. "రాజకీయాల్లో కూడా నేను అస్పృశ్యునిగా ఉండిపోవాలని ప్రజలు ఎందుకు ఆలోచిస్తున్నారు?" అని ఆయన ప్రశ్నించారు.

సార్వత్రిక ఎన్నికల కోసం షెడ్యూల్డ్ కులాల సమాఖ్య 1952లో ఎన్నికల ప్రణాళికను విడుదల చేసింది. ఎన్నికల ప్రణాళిక ప్రథమార్థంలో అంబేద్కర్ కొన్ని సిద్ధాంతాలను ప్రస్తావించారు, సమానత్వానికి భారతీయులు అర్హులు. ప్రతి భారతీయునికి – మతపరమైన, ఆర్థిక, రాజకీయపరమైన స్వేచ్ఛ ఉంది. కోరిక, భయం నుండి ప్రతి భారతీయునికి విముక్తి కల్పించే బాధ్యత ప్రభుత్వానిదే. స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం కల్పించాలనే స్థిర సంకల్పం,

మనుషుల మధ్య మనుషులు, వర్గాల మధ్య వర్గాలు, విభిన్న దేశాల మధ్య అణచివేత, దోపిడీల నుండి విముక్తి, పార్లమెంటరీ తరహా ప్రభుత్వం అనే ఈ సిద్ధాంతాలు భారతదేశంలో బడుగు వర్గాలకు ప్రయోజనం చేకూర్చేందుకు ఉద్దేశింపబడ్డాయని ఎన్నికల ప్రణాళిక స్పష్టం చేసింది.

ఆర్థిక కార్యక్రమానికి సంబంధించి SCF బీమా జాతీయకరణకు అనుకూలం - ప్రభుత్వోద్యోగులకు బీమా తప్పనిసరి. మద్యపాన నిషేధం రద్దుకు అది కట్టుబడి ఉంది. 'త్రాగుబోతా? ఆకలిగొన్న వ్యక్తా?' వీరిలో ఎవరు ప్రాధాన్యత గలవారో నిర్ణయించుకోవాలని ఎన్నికల ప్రణాళిక సూచించింది.

ఇతర రాజకీయ పార్టీలతో సహకారానికి సంబంధించి SCF కొన్ని సూత్రాలు నిర్దేశించింది. (1) ఇండిపెండెంట్ అభ్యర్థులకు మద్దతు ఇవ్వబోదు (2) హిందూ మహాసభ, జనసంఘ్ వంటి ప్రతివాద శక్తులతో ఎటువంటి పొత్తు పెట్టుకోబోదు. (3) వెనుకబడిన తరగతులకు సంబంధించిన సంస్థలతో కలసి పనిచేస్తుంది (4) భారత కమ్యూనిస్టు పార్టీతో ఎటువంటి పొత్తు పెట్టుకోబోదు (5) అధిక సంఖ్యలో రాజకీయ పార్టీలు ఏర్పడటాన్ని అది వ్యతిరేకిస్తుంది. (6) క్రిషక్, మజ్‌దూర్ ప్రజాపార్టీ, సోషలిస్టులను సమైక్యపరిచేందుకు సమాఖ్య సంసిద్ధంగా ఉంది. రెండు పార్టీల వ్యవస్థ ఆదర్శనీయమైందని భావిస్తుంది.

1952 జనవరిలో పార్లమెంట్‌కు జరిగిన ఎన్నికల్లో అంబేద్కర్ ఓడిపోయారు. కాశ్మీర్ విభజనకు సానుకూలత వ్యక్తం చెయ్యడం, ముస్లింలకు ప్రత్యేక సదుపాయాల కల్పనకై బొంబాయి ముస్లింల సమావేశంలో ఆయన చేసిన ప్రసంగం, ప్రజలను ఆకర్షించలేని ప్రసంగాలు, పటిష్ట యంత్రాంగం లేని పార్టీ ఆయన ఓటమికి కారణాలు. ఆయన ముందు ఎటువంటి ప్రత్యామ్నాయ కార్యక్రమం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపైనే ఆయన ఎక్కువగా దృష్టి సారించారు. 1954 మేలో జరిగిన ఉపఎన్నికల్లో కూడా ఆయన ఓడిపోయారు. గ్రామ ప్రాంతాల్లో ప్రజాబలం లేని పార్టీకి మనుగడ ఉండబోదనే వాస్తవాన్ని ఆయన గ్రహించారు.

సార్వత్రిక ఎన్నికలకు ముందే కేంద్ర, రాష్ట్ర శాసనసభలతో పాటు దేశ వ్యాప్తంగా జిల్లా, స్థానిక బోర్డుల్లో సైతం షెడ్యూల్ కులాల వారికి సీట్లు రిజర్వు చేసే విధానాన్ని రద్దు చేసే ప్రక్రియకు ఆమోదం తెలుపుతూ 1955 అక్టోబర్‌లో జరిగిన AISCF వర్కింగ్ కమిటి తీర్మానం ఆమోదించింది. బౌద్ధమతం స్వీకరించిన తర్వాత 1956 అక్టోబర్ 15న చేసిన తొలి ప్రసంగంలో అంబేద్కర్ ఈ ప్రతిపాదన చేశారు. షెడ్యూల్డ్ కులాల వారికి సీట్లు రిజర్వ్ చెయ్యడం వల్ల ఎటువంటి ఉపయోగం ఉండదని, దేశ సమైక్యత అత్యంత అవసరమని అన్నారు. కొత్త పార్టీ సిద్ధాంతాలను ఆయన 1956 అక్టోబర్ 13న ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు.

కొత్త పార్టీ రాజ్యాంగాన్ని ఆయన రూపొందించారు. స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం అనే సిద్ధాంతాల ప్రాతిపదికగా కొత్త పార్టీని పటిష్టం చెయ్యాలని ఆయన పిలుపునిచ్చారు.

1956 నవంబర్‌లో న్యూఢిల్లీలోని అంబేద్కర్ నివాసంలో ఒక సమావేశం జరిగింది. ఆ సమావేశంలో సంయుక్త మహారాష్ట్ర సమితి, SCF మధ్య ఎన్నికల అవగాహన కుదిరింది. 1960కి ముందు భాషా ప్రాతిపదికగా సమైక్య మహారాష్ట్ర ఏర్పాటు కోసం పోరాటం సల్పే

మహారాష్ట్రలోని వివిధ పార్టీల సంకీర్ణ ఫ్రంటే సంయుక్త మహారాష్ట్ర సమితి. ఎన్నికల అవగాహనలో నాలుగు నిబంధనలున్నాయి. 1) జనరల్ సీట్లలో SCF అభ్యర్థులను నిలబెట్టాలి. 2) రిజర్వ్ సీట్లన్నిటిని SCF కు కేటాయించాలి. 3) గ్రామీణ ప్రాంతాల్లో అస్ప ృశ్యులకు జరిగిన అన్యాయాన్ని నిర్మూలించేందుకు సమిష్టిగా ప్రయత్నించాలి. 4) అస్ప ృశ్యులు ఎదుర్కొంటున్న ఇతర సమస్యల పరిష్కారానికి ఉమ్మడిగా కృషి చేయాలి.

రాష్ట్ర పునర్విభజన కమిషన్ అనుసరిస్తున్న మహారాష్ట్ర వ్యతిరేక వైఖరికి నిరసనగా మరాఠీ భాష మాట్లాడే శాసనసభ్యులందరూ రాజీనామా చేయాలనే ప్రతిపాదన వచ్చింది. దీనిని అంబేద్కర్ వ్యతిరేకించారు. ఇది మూర్ఖమైన, నిష్ప్రయోజనమైన ఆలోచనగా ఆయన అభివర్ణించారు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా పేరుతో ప్రతిపక్ష పార్టీ ఏర్పాటయ్యే అవకాశం ఉందని ఆయన సూచనప్రాయంగా వెల్లడించారు. ప్రజాస్వామ్యం నియంతల చేతుల్లోకి పోకుండా కాపాడేందుకు ఇది పోరాటం జరుపుతుందని ఆయన అన్నారు. "ఏక వ్యక్తి నియంతృత్వానికి మెజారిటీ వ్యక్తుల నియంతృత్వం లోబడి ఉంటుంది" అని బైన్ చేసిన వ్యాఖ్యను అంబేద్కర్ ప్రస్తావించారు. ప్రతిపక్షం ఏర్పాటు చెయ్యడం ద్వారా ఈ పరిస్థితిని నివారించలేకపోతే ప్రపంచంలో నిజమైన ప్రజాస్వామ్యం నెలకొనదని ఆయన వ్యాఖ్యానించారు.

ILP నుండి రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా పార్టీ వరకు కొనసాగిన అంబేద్కర్ స్థానం భారతదేశ అణచివేతకు గురవుతున్న బడుగు వర్గాల చరిత్రలో ముఖ్యమైన పరిమాణం. ILP పూర్తి స్థాయిలో క్రియాశీలకంగా ఉన్న సమయంలో అది సమాజానికి విధేయంగా ఉండేది. మహారాష్ట్రలో ఎక్కువగా ప్రాచుర్యంలో ఉండేది. AISCF ఏర్పాటు తదనంతర చర్య. అది భారతదేశంలో అస్పృశ్యుల ప్రధాన పార్టీగా మారింది. "AISCF అస్పృశ్యుల జాతీయపార్టీ. అయితే అది రాజకీయ ఒంటరితనం, మతపరమైన ఆలోచనలతో సమస్యలను ఎదుర్కొంది." ఈ పార్టీ తన బలాన్ని క్రమంగా నిరూపించుకోసాగింది. అయితే వివిధ రాష్ట్రాల్లో అది నిలకడలేకుండా చేసుకొన్న పొత్తులు ఆ పార్టీ బలం క్రమంగా అంతరిస్తోందని స్పష్టం చేసింధి. ఆ పార్టీ స్వతంత్ర శక్తిగా వ్యవహరించలేదని వెల్లడైంది.

> "డాక్టర్ నార్మన్ డి. పామడ్ ఈ విధంగా వ్యాఖ్యానించారు. "భారత దేశంలో అస్పృశ్యుల ప్రధాన పార్టీ SCF. మరణించేవరకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ దానికి నాయకునిగా ఉన్నారు. ఆయన భారతదేశంలో అస్పృశ్యుల్లో అత్యంత ప్రముఖుడు. మహారాష్ట్రలోని అస్పృశ్యులైన మహార్లు దాని ప్రధాన బలం. అది ఎన్నడూ నిజమైన జాతీయ పార్టీకాదు. భారతదేశంలో అస్పృశ్యులకు హిందువులతో సమానంగా లేదా ఆ స్థాయిలో సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థాయి సాధించడం దాని ధ్యేయం."

ఆరంభ సమయంలో వారు సంకుచిత ధృక్పథంతో ఉండేవారని, తమ కులం సంక్షేమాన్ని మాత్రమే వారు కోరుకునే వారనే విషయం అంబేద్కర్ తెలుసు. దేశం స్వాతంత్ర్యం గడించుకున్న తరువాత వారి ఆలోచనల్లో, వైఖరిలో మార్పు రావాల్సిన అవసరం ఉందని,

ఇతరులతో సహకారం పెంపొందించుకోవలసిన అవసరం ఉందని, కులాల ప్రయోజనాలను కూడా దృష్టి ఉంచుకుని కొత్తగా సంపాదించుకున్న స్వాతంత్ర్యాన్ని పటిష్టం చేసుకోవాల్సి ఉందనే విషయాన్ని అంబేద్కర్ గుర్తించారు.

1952లో జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికల్లో AISCF ఓటమిపాలు కావడం అంబేద్కర్‌లో కొత్త ఆలోచనలకు తెర లేపింది. పాత పద్ధతులు ఆలోచన విధానాలు భారత ప్రజల్లో క్రమంగా పెరుగుతున్న ప్రజాస్వామ్య దృక్పథానికి అనుగుణంగా లేవని ఆయన గుర్తించారు. అందరితో సహకారాత్మక ధోరణితో వ్యవహరించేందుకు ఆయన కొత్త సిద్ధాంతాలను రూపొందించారు. అయితే అకాల మరణం కారణంగా ఆయన లక్ష్యాలకు, ఆలోచన సరళికి అనుగుణంగా రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (RPI) ఆవిర్భవించలేదు. అంబేద్కర్ ప్రతిపాదించిన సిద్ధాంతాలు ఈ విధంగా ఉన్నాయి. (1) సమాన హక్కులు కలిగి ఉండేందుకు భారతీయులందరూ అర్హులు, పార్టీ సమానత్వం సాధిస్తుంది (2) అభివృద్ధి చెందేందుకు ప్రతి భారతీయునికి హక్కు ఉంది, అధికారంలోకి రావడమే అందుకు ఏకైక మార్గం (3) మతపరమైన, ఆర్థిక, రాజకీయ స్వేచ్ఛకు ప్రతి ఒక్క భారతీయునికి హక్కు ఉంది (4) సమానమైన అవకాశాలు పొందేందుకు ప్రతి భారతీయుడూ అర్హుడు (5) ప్రతి భారతీయుడు కోరిక, భయం నుండి విముక్తి పొందేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది (6) మనిషిని మరో మనిషి, వర్గాన్ని మరో వర్గం, దేశాన్ని మరో దేశం అణచివేయకుండా, దోపిడీ చెయ్యకుండా అవసరమైన చర్యలు తీసుకునేందుకు పార్టీ కృషి చేస్తుంది. పార్లమెంటరీ పాలనా వ్యవస్థకు పార్టీ కట్టుబడి ఉంది. ప్రజలు, వ్యక్తుల ప్రయోజనాల రీత్యా పార్లమెంటరీ తరహా పాలన అత్యుత్తమమైంది. ఇది కమ్యూనిజం, సోషలిజం, గాంధీయిజం, మరి ఏ ఇతర ఇజం వంటి సిద్ధాంతాలకు బందీయైలేదు. ఫాసిజం, స్వేచ్ఛ, ప్రజాస్వామ్య సిద్ధాంతాలను కాలరాసే దురహంకారాలకు పార్టీ దూరం. జాతీయ సమగ్రతకు పార్టీ కట్టుబడి ఉంటుంది. భాషావాదం, కులతత్వం, మతోన్మాదం వల్ల తలెత్తే సమస్యలను పరిష్కరించుకోవాలి. కులతత్వం అంటే సామాజిక న్యాయాన్ని పాటించకపోవడమే. ఎటువంటి అవినీతికి తావులేని అధికార యంత్రాంగం, స్పష్టమైన విదేశాంగ విధానం, దేశ ఉత్తర సరిహద్దులను సమర్ధవంతంగా రక్షించుకునే సమర్ధవంతమైన రక్షణ విధానం - ఈ పార్టీ సిద్ధాంతాల్లో ముఖ్యమైన అంశాలు. నూతన ప్రజాస్వామ్యం, స్వేచ్ఛావాదం, హేతుబద్ధత, మానవత్వం, సోషలిజం, ప్రేమా, మైత్రీలకు కొత్త భాష్యాన్ని పార్టీ ప్రకటించింది.

అంబేద్కర్ ఆలోచనలకు అనుగుణంగా RPI నెలకొల్పబడింది. భారత్‌లో ప్రతిపక్షం, ప్రత్యామ్నాయ ప్రభుత్వం లేకపోవడాన్ని ఆయన గుర్తించారు. ఏకపార్టీ ప్రభుత్వం వల్ల ఎదురయ్యే ప్రమాదాలను ఆయన దృగ్గోచరింపచేసారు.

# అధ్యాయం 11

# భాషా ప్రయుక్త రాష్ట్రాలు

ఒకే భాష, ఒకే మతం, ఒకే జీవన మార్గం జాతీయ వాదానికి మూలస్తంభాల వంటివి భాషా ప్రాతిపదికపై దేశంలోని వివిధ ప్రాంతాలను విలీనం చేయడం కంటే భారతీయుల మధ్య సమైక్యత సాధించడం ముఖ్యమని అంబేద్కర్ పేర్కొన్నారు అంబేద్కర్ దృష్టిలో భాషా ప్రయుక్త రాష్ట్రం అంటే సామాజిక ప్రాతిపదికగా జనాభా వర్గీకరణ ఒకే విధంగా ఉండే రాష్ట్రం లేదా ప్రాంతం. అది సామాజిక ప్రయోజనాలను నెరవేర్చేందుకు మరింత అనుకూలమైంది. వీటిని నెరవేర్చే బాధ్యత ప్రజాస్వామిక ప్రభుత్వంపై ఉంటుంది. ఆయన దృష్టిలో భాషా ప్రయుక్త రాష్ట్రానికి, ఆ రాష్ట్రంలో వాడుకలో ఉన్న భాషకు మధ్య ఎటువంటి సంబంధం లేదు. "ప్రతి రాష్ట్ర అధికార భాష కేంద్ర ప్రభుత్వ అధికార భాషగా ఉండాలి. ఈ సిద్ధాంతం ప్రాతిపదికగా భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు కోసం వస్తున్న డిమాండ్‌ను అంగీకరించేందుకు నేను సిద్ధంగా ఉన్నాను."

రాష్ట్రాలను ప్రత్యేక ఉపజాతులు (నేషనాలిటీస్)గా మార్చే ఉద్దేశం భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ప్రచారం చేసే వారికి లేదు. కాలక్రమేణా దుష్పరిణామాలు ఏర్పడే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. వేరే సందర్భంలో ఆయన ఇలా అన్నారు. "ఫెడరల్ దేశంలో విభిన్న భాగాలుండాలి. అయితే ఆ విభాగాలు భాషా ప్రాతిపదికగా ఉండాలి " పాలనాపరమైన సౌలభ్యం కోసం వీటిని నెలకొల్పాలి. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటులో ప్రతి భాష ఆ రాష్ట్ర అధికార భాష కావడం భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు వల్ల కలిగే ముప్పు. ఇది ప్రాంతీయ దేశీయవాదాన్ని సృష్టించే పరిస్థితికి దారి తీయవచ్చని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు ప్రాంతీయ భాషలను అధికార భాషలుగా వినియోగించడం ప్రాంతీయ సంస్కృతులు వేరుపడి కరుడుకట్టే విధంగా మారిపోయే పరిస్థితి ఉత్పన్నమవుతుంది "విభిన్న సంస్కృతులకు అవకాశం

కల్పించడం రాష్ట్రాలు స్వతంత్ర దేశాలుగా మారిపోడానికి అనుమతించడమే"నని ఆయన వ్యాఖ్యానించారు.

భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు కేంద్రం, రాష్ట్రాల మధ్య పాలనాపరమైన సంబంధాల్లో అనవసర సమస్యలకు దారి తీస్తుంది. అవి భారతదేశ విచ్ఛిన్నతకు దారితీస్తుంది. కేంద్ర శాసన వ్యవస్థ దేశాల కూటమిగా పరిణమిస్తుంది. రాజకీయ ధిక్కార వైఖరిని పెంపొందింపచేస్తుంది. ఈ ధోరణి ప్రభుత్వ పని నిర్వహణను అసాధ్యం చేస్తుంది. భాషా ప్రయుక్త రాష్ట్రాల వల్ల నష్టాలతో పాటు కొన్ని లాభాలూ ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. 'మిశ్రమ రాష్ట్రాల్లో కంటే భాషా ప్రయుక్త రాష్ట్రాల్లో ప్రజాస్వామ్యం మరింత సమర్ధవంతంగా పనిచేస్తుంది. అది సామాజిక ఏకత్వాన్ని సాధిస్తుంది. రాజకీయ అధికార దుర్వినియోగానికి దారితీసే కృత్రిమ అవరోధాలుండవు. సామాజిక ఏహ్య భావాలకు చోటు ఉండదు. ఒకే ఉమ్మడి భాష మాట్లాడటం ద్వారా "మీరు భారతదేశాన్ని సమైక్య పరచాల్సి ఉంది. అందుకోసం హిందీ భాష నేర్చుకోవాలి" అని అంబేద్కర్ వ్యాఖ్యానించారు. దేవనాగరి లిపి ప్రాముఖ్యతను ఆయన వివరించారు. "దేవనాగరి భాషలో ప్రచురిస్తే ఇతర భాషల పట్ల మనం అభిమానం చూపుతాం." అమెరికాలో విభిన్న రాష్ట్రాలకు వేర్వేరు భాషలున్నాయి. ఒకే భాష ప్రయోగం అక్కడ అమలు చేశారు. అందరికీ ఇంగ్లీషు భాష బోధించారు. ఒక జనరేషన్‌లో అందరూ ఆంగ్ల భాష నేర్చుకున్నారు.

వివిధ రకాలైన అధికార భాషల వల్ల ప్రయోజనం ఉండదని, వాటిని సముద్రంలో కలపాలని ఆయన సూచించారు. ఒకే భాషగా హిందీ భాష ఉండాలి. అది జాతీయ భావనలను పెంపొందింపచేస్తుంది. ఒక భాష హిందీ ద్వారా భావనాపరమైన సమన్వయం లేదా జాతీయ సమగ్రత సాధించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. "మరి ధ్యానేశ్వర్ లేదా తుకారాంల మరాఠీ భాష గురించి ఏమిటి? (మహారాష్ట్రకు చెందిన రుషితుల్యులైన కవులు) అంబేద్కర్ ఇలా చెప్పారు. "మరాఠీ భాషకు స్థానం కల్పించరాదు. ప్రస్తుత ప్రపంచంలో ఆ విలువైన పుస్తకాల వల్ల ప్రయోజనం ఏమిటి? ఆ భాషను చదవాలనుకునేవారు చదవవచ్చు. జాతీయ సమగ్రతకు ఇది అవరోధంగా ఎందుకు పరిణమించాలి? హిందీ భాషను బలవంతంగా రుద్దితే ద్రావిడులు తిరుగుబాటు చేసే ప్రమాదం పొంచివున్న హెచ్చరికల గురించి అంబేద్కర్ ప్రస్తావిస్తూ "తిరుగుబాటు చెయ్యనివ్వండి. మన దేశ అవసరాలలో అత్యవసరమైన వాటిని కొన్నయినా మనం చెయ్యాల్సి ఉంటుంది, హిందీని జాతీయ భాషగా అంబేద్కర్ ప్రచారం చేసినప్పటికీ ఆంగ్ల భాష ప్రాముఖ్యతను కూడా ఆయన అంగీకరించారు. ఒక ఉమ్మడి ఆంగ్ల భాష ద్వారా భారతదేశంలో జాతీయవాదం మేల్కొంది. భాషా ప్రయుక్త రాష్ట్రాల భావనకు గాంధీజీ, కాంగ్రెస్ పార్టీ ప్రాచుర్యం కల్పించారని అంబేద్కర్ అన్నారు. అప్పటికే

బలహీనంగా ఉన్న భారత సామాజిక జీవన వ్యవస్థలో విచ్ఛిన్నకర శక్తులు ప్రవేశించే అవకాశం గురించి ఆలోచించిన దాఖలా లేదు. సాంస్కృతిక విభేదానికి మరో పేరే భాషా విభేదమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రాంతీయ దేశభక్తికి ఇది అభ్యర్థన వంటిది.

'థాట్స్ ఆన్ లింగ్విస్టిక్ స్టేట్స్' అనే పేరుతో అంబేద్కర్ ఒక బ్రోచర్‌ను ప్రచురించారు. రాష్ట్రాల పునర్విభజన కమిషన్ ముందు ఆయన సాక్ష్యం ఇచ్చారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల అంశాల గురించి కూడా ఆయన ప్రస్తావించారు. "ఒక రాష్ట్రం, ఒక భాష" సిద్ధాంతాన్ని రెండు విధాలుగా అమలు చేయవచ్చు. (1) ఒక రాష్ట్రం – ఒక భాష (2) ఒక భాష – అనేక రాష్ట్రాలు – రెండవదాని పట్ల అంబేద్కర్ సుముఖత వ్యక్తం చేశారు. వేర్వేరు రాష్ట్రాల మధ్య అంతరాలను తొలగించడం అంబేద్కర్ ధ్యేయం. రాష్ట్రాల పునర్విభజన కమిషన్ (SRC) సభ్యుడైన కె.ఎం. ఫణిక్కర్ నివేదికపై తన వ్యతిరేకత వ్యక్తం చేస్తూ ఒక నోట్ రాశారు. ఆ నోట్‌లో ఆయన ఈ విధంగా రాశారు. "ఫెడరేషన్ (సమాఖ్య)లోని వివిధ దేశాల మధ్య సమతూకం పాటించాలి. అంబేద్కర్ ఈ వాదనను సమర్థించారు. ప్రజలు, అధికారాల మధ్య తేడాలు దేశానికి ముప్పు వాటిల్లజేస్తాయని ఆయన హెచ్చరించారు.

రాష్ట్రాల పునర్విభజన కమిషన్ నివేదిక సమర్పించిన తరువాత ఉమ్మడి రాష్ట్రాలు బీహార్, మహారాష్ట్ర ఏర్పాటును అంబేద్కర్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ రాష్ట్రాల వల్ల కేంద్ర ప్రభుత్వానికి, మైనారిటీలకు ముప్పు వాటిల్లుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. బొంబాయి నగరం మహారాష్ట్ర పరిధిలోకి రావాలని SCF డిమాండ్ చేసింది. బొంబాయికి ప్రత్యేక రాష్ట్రం ఇచ్చినా తనకు అభ్యంతరం లేదని ఆయన పేర్కొన్నారు. "షెడ్యూల్డు కులాల వారిని అసలు ప్రజలుగా సైతం గుర్తించని అత్యధికుల అధీనంలోని ప్రభుత్వంలో వారికి రక్షణ లేదు. షెడ్యూల్డ్ కులాల వారికి ప్రస్తుతం ఎటువంటి భద్రత లేదు."

హిందీని జాతీయ భాష చేయడం ద్వారా ఉత్తర ప్రాంతం పటిష్టమవుతుంది, దక్షిణ ప్రాంతం విచ్ఛిన్నమవుతుంది. ఈ సందర్భంగా ఆయన రాజాజీ తెలిపిన విషయాన్ని ప్రస్తావించారు.

> "మీరు పెద్ద పొరపాటు చేస్తున్నారు. మొత్తం భారతదేశానికి వివిధ ప్రాంతాలకు సమాన ప్రాతినిధ్యం కల్పిస్తూ సమాఖ్య ఏర్పాటు చేయడం వల్ల ఉపయోగం ఉండదు. అటువంటి సమాఖ్యలో భారత రాష్ట్రపతి, ప్రధాని ఎప్పుడూ హిందీ మాట్లాడే ప్రాంతాలకు చెందిన వారై ఉంటారు. వాస్తవానికి రెండు సమాఖ్యలను ఏర్పాటు చేయవలసి వుంది. ఒక సమాఖ్య ఉత్తర భారతదేశానికి, మరొకటి దక్షిణ భారతదేశానికి వేర్వేరుగా ఉండాలి. రెండు సమాఖ్యలకు సమాన ప్రాతినిధ్యం కల్పిస్తూ ఉత్తర, దక్షిణ సమాఖ్యను ఏర్పాటు చేయాలి."

వివిధ రాష్ట్రాలను ఈ విధంగా విభజించాలని అంబేద్కర్ సూచించారు. (1) ఉమ్మడి రాష్ట్రాలు (హిందీ) (ఎ) మీరట్ (బి) కాన్పూర్ (సి) అలహాబాద్ (2) బీహార్‌కు రెండు రాష్ట్రాలు (ఎ) పాట్నా (బి) రాంచి (3) మధ్యప్రదేశ్‌కు రెండు రాష్ట్రాలు (ఎ) ఉత్తర ఎంపి (బి) దక్షిణ ఎంపిలుగా విభజించాలని ఆయన సూచించారు. భారత సంయుక్త రాష్ట్రాలుగా రూపొందించడంలో ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు "ఉత్తర ప్రాంత పటిష్టీకరణ, దక్షిణ ప్రాంత విభజన ఇందుకు అనుసరించాల్సిన మార్గం కాదు "

బహుళ భాషా రాష్ట్రాల ఏర్పాటు పట్ల అంబేద్కర్ సానుకూలత వ్యక్తం చేశాడు. బహుళ భాషా రాష్ట్రాల విజయానికి క్రింది జాగ్రత్తలు తీసుకోవాలని అంబేద్కర్ సూచించారు. మైనారిటీలను కాపాడేందుకు ప్రభుత్వానికి ప్రత్యేక అధికారాలు కల్పించడం, వివిధ భాషా ప్రయుక్త రాష్ట్రాలకు చెందిన వ్యక్తులతో కమిటీలు ఏర్పాటు చేయడం, గవర్నర్‌కు అప్పీలు చేసుకునే అధికారం! "ఈ చర్యల ద్వారా కూడా మనం విజయం సాధించలేమని చివరకు మనం తెలుసుకుంటే అంతిమంగా భాషా ప్రయుక్త రాష్ట్రం ఏర్పాటుకు దారితీస్తుంది.

ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం నిరాహారదీక్ష చేసిన పొట్టి శ్రీరాములు అశువులు బాశారు. "మరి ఏ ఇతర దేశంలోనైనా అప్పటికే ఆమోదింపబడిన సిద్ధాంతం కోసం ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోతే ప్రభుత్వానికి ఏమి జరిగి ఉంటుంది? విచారణ సైతం లేకుండా ప్రభుత్వాన్ని ఉరితీసే అవకాశం ఉంది. అయితే ఇక్కడ అటువంటిదేమీ జరగలేదు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చెయ్యాలని ప్రభుత్వం నిర్ణయించింది. కొత్త రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌ను ఏర్పాటు చేయడం ఇటువంటి ఇతర భాషా ప్రయుక్త రాష్ట్రాల ఉనికికి దారితీసింది.

మహారాష్ట్ర విలీనీకరణాన్ని ఆయన వ్యతిరేకించారు. "మహారాష్ట్ర గౌరవం ప్రాతిపదికగా ఆలోచించే అలవాటును మీరు వదులుకోవాలి. ఉన్నతమైన, ఉదాత్తమమైన, విస్తృతమైన ఆలోచనా విధానాన్ని పెంపొందించుకోవాలి. "నేను ఒక భారతీయుడను," "నేను ఒక ఆసియన్‌ను", నేను ఈ ప్రపంచానికి చెందిన నాగరిక పౌరుడను" అని ఆలోచించే దృక్పథం అలవాటు చేసుకోవాలి. "నేను మహారాష్ట్రకు చెందిన వాడను" అనే సంకుచిత దృక్పథం విడనాడని, మరాఠీ భాష మాట్లాడే ప్రజలను విలీనం చేయడం వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండబోదు. మరాఠీలను దృష్టిలో పెట్టుకున్నా కూడా అసలు విలీనం ఎందుకు జరగాలి? సతారాలో ఉన్న మరాఠీ వ్యక్తికీ, ఔరంగాబాద్‌లో ఉన్న మరాఠీకి ఉన్న అనుబంధం ఏమిటి? మహారాష్ట్ర ప్రజలు దేశం పట్ల, తమ విధుల పట్ల చిత్తశుద్ధి, స్ఫూర్తి గల వారని, దేశం కోసం త్యాగాలు చేసేందుకు సుముఖంగా ఉంటారని అంబేద్కర్ అన్నారు. ఆయన ఒక సందర్భంలో ఇలా అన్నారు. "దేముడా, మళ్ళీ జన్మించాలని నేను కోరుకుంటే, మహారాష్ట్రలోనే పుట్టించమని నేను ప్రార్థిస్తాను " అయితే ఆయన ప్రకటనల్లో పరస్పర విరుద్ధమైన అంశాలను గమనించవచ్చు.

ఆయన రాజ్యసభలో ఒకసారి ఈ విధంగా అన్నారు. "మహారాష్ట్ర వాడినని చెప్పుకోవడం కూడా నాకిష్టం ఉండదు. నాకు హిందీ భాష అంటే ఇష్టం. సమస్య ఏమంటే హిందీ మాట్లాడేవారు హిందీ భాషకు ప్రబల శత్రువులు."

మహారాష్ట్ర ఏకీకరణకు అంబేద్కర్ వ్యతిరేకమైనప్పటికీ మహారాష్ట్రలోని అన్ని ప్రాంతాలను ఒక ఏక రాష్ట్రంగా విలీనం చేయాలని ఆయన పట్టుబట్టారు. మహారాష్ట్ర మరో రాష్ట్రంగా మాత్రమే ఉండబోదు. విస్తీర్ణం, జనాభా, రెవెన్యూపరంగా బలమైన రాష్ట్రం అవుతుందని ఆయన వ్యాఖ్యానించారు. బొంబాయి నగరాన్ని మహారాష్ట్రలో చేర్చడం వల్ల బొంబాయి ఓడరేవును ఇంతకుముందులా ఉపయోగించుకునే మహారాష్ట్రేతరుల హక్కుపై ఎటువంటి ప్రభావం చూపబోదని ఆయన హామీ ఇచ్చారు. బొంబాయిలో పరిశ్రమ, వ్యాపారాలు అభివృద్ధి చేసింది యూరోపియన్లేనని, గుజరాతీలు కాదని ఆయన వ్యాఖ్యానించారు. వాణిజ్య సంబంధాలుగా ఉపయోగించుకునే ఉద్దేశంతో ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారులు గుజరాతీలను బొంబాయి తీసుకువచ్చారని అంబేద్కర్ పేర్కొన్నారు. అంతేకానీ వారు వ్యాపారులుగా రాలేదని అన్నారు.

బొంబాయి నిధులపై మహారాష్ట్రకు అధికారం ఉందని అంబేద్కర్ వ్యాఖ్యానించారు. బొంబాయి నగరానికి మహారాష్ట్ర నుండే అధికంగా కార్మికుల సరఫరా జరుగుతుంది. బొంబాయి మిగులు ఒక్క మహారాష్ట్రకే లభించదు. మొత్తం భారతదేశం దానిని అనుభవిస్తుంది. బొంబాయి నుండి ఆదాయపు పన్ను, సూపర్ పన్నులు వసూలవుతాయి.' ఆయన ఈ విధంగా వ్యాఖ్యానించారు. "బొంబాయిని వేరు చేసినప్పటికీ మహారాష్ట్రకు దానీ వంతు ఆదాయం లభిస్తుంది. పొరుగు ప్రాంతాలను విలీనం చేసి గ్రేటర్ ముంబయిని ఏర్పాటు చేయడం ఆ నగరాన్ని పటిష్టవంతం చేస్తుంది. మరో ముఖ్యమైన విషయం ఏమంటే బొంబాయి నగరానికి మంచినీరు, విద్యుచ్ఛక్తి మహారాష్ట్ర నుండి సరఫరా అవుతాయి. మహారాష్ట్ర నుండి బొంబాయి నగరాన్ని వేరు చేయడం ఆ నగర ఆర్థిక జీవనాన్ని అస్తవ్యస్తం చేస్తుంది. మహారాష్ట్ర మేధావులను పేదల నుండి వేరు చేస్తుంది. మేధావులు లేకుండా మహారాష్ట్ర పేదల ఉనికి ఉండదు. అంబేద్కర్ ఈ విధంగా అన్నారు. "మీరు సోషలిజం గురించి మాట్లాడతారు. కర్మాగారాలు, పరిశ్రమలు జాతీయం కాకుండా చూసేందుకు మహారాష్ట్ర నుండి బొంబాయి నగరాన్ని వేరు చేస్తారు. ఇదేనా సోషలిస్టు విధానమంటే? బొంబాయి నగరం మహారాష్ట్రకు చెందుతుంది. మరాఠీ భాష మాట్లాడేవారికి దానిపై హక్కు వుంది. ఎవరూ, బ్రహ్మదేవుడు కూడా, మహారాష్ట్ర నుండి దానిని వేరు చేయలేరు." 1952 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా అశోక్ మెహతా అధ్యక్షతన బొంబాయి నగరంలో జరిగిన సమావేశంలో అంబేద్కర్ ప్రసంగిస్తూ భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు తాను సుముఖుడనేనని, అయితే మహారాష్ట్రతో బొంబాయి నగరాన్ని కలిపి ఉంచాలని పేర్కొన్నారు.

అంబేద్కర్ సూచించినట్లుగా హిందీ మాట్లాడే ఉత్తరప్రదేశ్ రాష్ట్రాన్ని మూడు రాష్ట్రాలుగా విభజించిన విధంగానే మరాఠీ భాష మాట్లాడే ప్రాంతాలను (1) మహారాష్ట్ర సిటీ స్టేట్ (2) పశ్చిమ మహారాష్ట్ర (3) మధ్య మహారాష్ట్ర (4) తూర్పు మహారాష్ట్రగా విభజించాలని ఆయన సూచించారు. ఆస్తి పన్ను, విద్యుచ్ఛక్తి పన్నుల ద్వారా ప్రధానంగా ఆదాయం లభిస్తుంది. ఆస్తిపన్నును మరొకరు తీసుకెళ్ళడం సాధ్యం కాదు. విద్యుచ్ఛక్తి ద్వారా లభించే మొత్తం ఆదాయాన్ని వినియోగించుకునే హక్కు బొంబాయి నగరానికి లేదు. ఆయన ఇంకా విస్పష్టమైన రీతిలో ఇలా అన్నారు. "విద్యుచ్ఛక్తి పన్ను రూపేణా లభించిన ఆదాయాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకుని మహారాష్ట్రలోని నాలుగు రాష్ట్రాలకు పంచాలి" అని సూచించారు.

మహారాష్ట్రలోని మూడు ప్రాంతాల మధ్య ఆర్థిక, పారిశ్రామిక, విద్యాపరమైన అసమానత్వాలు అంగీకరింపబడిన విషయమే. "మధ్య మహారాష్ట్ర పూనా విశ్వవిద్యాలయం పరిధిలోకి వెళితే పూనా భవిష్యత్ నాశనమే"నని అంబేద్కర్ హెచ్చరించారు. అభివృద్ధికి నోచుకోని మరత్వాడా ప్రాంతం పూనా విశ్వవిద్యాలయం క్రిందకు వస్తే ఏమి జరుగుతుందనే విషయం ఆలోచించేందుకు సైతం నేను భయపడతాను." ఉమ్మడి మహారాష్ట్ర డిమాండ్‌తో పాటు ఏకైక విశ్వవిద్యాలయం నెలకొల్పాలని డిమాండ్ కూడా రావచ్చునని ఆయన హెచ్చరించారు. ఉమ్మడి మహారాష్ట్ర కోసం మూర్ఖత్వం ఒకే ఉమ్మడి విశ్వవిద్యాలయం కోసం మూర్ఖత్వంగా మారే అవకాశం ఉంది. ఉమ్మడి మహారాష్ట్రతో పాటు మరత్వాడాలో పూనా, నాగపూర్‌లోని బ్రాహ్మణులు ఉద్యోగాల కోసం డిమాండ్ చేయవచ్చు.

రక్షణ పరంగా భారత్‌కు రెండో రాజధాని అవసరమని దక్షిణాది రాష్ట్రాల వారు అభిప్రాయపడుతున్నట్లు అంబేద్కర్ పేర్కొన్నారు. ఢిల్లీ అభేద్యమైంది కాదు. పొరుగు దేశాలు బాంబులు ప్రయోగించేందుకు అనువుగా ఉన్న ప్రాంతం. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుంటే హైదరాబాద్, సికిందరాబాద్ లేదా బొలారంను దేశ రెండవ రాజధానిగా ఎంచుకోవచ్చునని అంబేద్కర్ అభిప్రాయపడ్డారు. ఉత్తర, దక్షిణ ప్రాంతాల్లో నెలకొన్న ఉద్రిక్తతలను తగ్గించేందుకు కూడా ఇది దోహదం చేస్తుంది.

బొంబాయి నగరాన్ని భారతదేశ వాణిజ్య రాజధానిగా చెయ్యాలనే ప్రతిపాదనను అగ్రశ్రేణి కాంగ్రెస్ నాయకులు చేశారు. అంబేద్కర్ ఈ ప్రతిపాదనను గట్టిగా వ్యతిరేకించారు. దీనిని గట్టిగా ప్రతిఘటించాలని ఆయన మహారాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. రెండే ప్రత్యామ్నాయాలున్నాయని అంబేద్కర్ అన్నారు. అవి బొంబాయిని మహారాష్ట్రలో ఒక భాగం చెయ్యడం లేదా బొంబాయి నగరాన్ని ఒక ప్రత్యేక రాష్ట్రంగా చెయ్యడం.

ఉమ్మడి మహారాష్ట్ర కోసం పోరాటాన్ని ఒక రాజకీయేతర సంస్థ ద్వారా నిర్వహించారు. డి.ఆర్. గాడ్గిల్, డి.వి. పొద్దర్, ఎస్.ఎ. డాంగే, శంకర్‌రావ్ దేవ్, ఎం.ఆర్. జయకర్ వంటి

విభిన్నాభిప్రాయాలు గల ప్రముఖ వ్యక్తులు సంయుక్త మహారాష్ట్ర పరిషత్ ఏర్పాటుతో భాగస్వామ్యం వహించారు. అయితే అంబేద్కర్ వంటి పండితుడు, నాయకుడు ఈ చర్యలన్నిటికీ దూరంగా ఉన్నారు. సంయుక్త మహారాష్ట్ర పరిషత్ ఎస్.ఆర్.సి. ముందు తన ప్రతినిధుల ద్వారా తన అభిప్రాయాలను తెలియజేసింది. అంబేద్కర్ తన అభిప్రాయాలను కమిషన్‌కు విడిగా తెలియజేశారు.

ఎస్.ఆర్.పి. నివేదిక వల్ల మహారాష్ట్రలో ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. వ్యతిరేకతను ఖాతరు చేయకుండా ద్విభాషా బొంబాయి రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారు. సమైక్య మహారాష్ట్ర ప్రచారకులు సంయుక్త మహారాష్ట్ర సమితిని ఏర్పాటు చేసి శాంతియుత, చట్టబద్ధ కార్యకలాపాలతో ద్విభాషా బొంబాయి రాష్ట్రానికి వ్యతిరేకంగా సత్యాగ్రహ ఉద్యమాన్ని నిర్వహించారు. వామపక్షాలు మహారాష్ట్రలో సమితిని ఏర్పాటు చేశాయి. ఈ అన్ని కార్యక్రమాల్లో అంబేద్కర్ నేతృత్వంలోని షెడ్యూల్డ్ కులాల సమాఖ్య భాగసామ్యం వహించింది. ఈ సందర్భంగా అంబేద్కర్ ఈ విధంగా అన్నారు. “ద్విభాషా బొంబాయి రాష్ట్రం రద్దు కావడం నా ప్రధాన విధి. సాంస్కృతిక సరిహద్దులను మనం మార్చలేం.” ద్విభాషా బొంబాయి రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించిన శాసనసభ్యులు మూకుమ్మడిగా రాజీనామాలు చేసే అంశాల గురించి అంబేద్కర్ తన వైఖరిని వివరించారు. “ద్విభాషా బొంబాయి రాష్ట్రాన్ని రద్దు చెయ్యాలి. బొంబాయి నగరం మహారాష్ట్రలో ఒక భాగం. ఒక్క బొంబాయి నగరం విషయంలో మాత్రమే నేను మహారాష్ట్రీయన్లతో ఏకీభవిస్తాను. నేను ఉమ్మడి మహారాష్ట్రను వ్యతిరేకిస్తాను. శాసనసభ నుండి రాజీనామా చేయడం ‘నాటకం’ మాత్రమే. రాజీనామా చేయడానికి బదులు స్థానిక సంస్థల మొత్తం అధికార యంత్రాంగాన్ని స్తంభింపచేయాలి” అని అంబేద్కర్ పేర్కొన్నారు. “థాట్స్ ఆన్ లింగ్విస్టిక్ స్టేట్స్” అనే తన పుస్తకానికి రాసిన ముందుమాటలో ఆయన భాషా ప్రయుక్త రాష్ట్రాల వల్ల సంభవించే దుష్పరిణామాల గురించి హెచ్చరించారు. అతి ముఖ్యమైన అంశాలను గూండాయిజం ద్వారా నిర్ణయించలేమని ఆయన అభిప్రాయపడ్డారు. పార్టీ ప్రయోజనాలకు అవకాశం కల్పించే రీతిలో సమస్యలను పరిష్కరించడాన్ని ఆయన వ్యతిరేకించారు.

అంబేద్కర్ దృష్టిలో మన దేశంలో మతతత్వానికి మరో పేరు భాషా వాదం. భాషా పరంగా ఏర్పాటైన రాష్ట్రాల్లో అధికార యంత్రాంగాన్ని మెజారిటీ మతానికి అప్పగించడమేనని అంబేద్కర్ వ్యాఖ్యానించారు. మతతత్వాన్ని అదుపులో ఉంచేందుకు అంబేద్కర్ రెండు పరిష్కారాలను సూచించారు. ‘పాలనా యంత్రాంగంపై సంపూర్ణ అధికారాన్ని గవర్నర్‌కు కట్టబెట్టడం’, ‘మంత్రి వర్గానికి లేదా గవర్నర్‌కు వినతి పత్రాలు సమర్పించే చిన్న కమిటీలు ఏర్పాటు చేయడం.’

బొంబాయి రాష్ట్రం నుండి విడిపోతామని కర్ణాటక 1938లో డిమాండ్ చేసింది. బొంబాయి శాసనసభ ఈ మేరకు ప్రవేశపెట్టిన తీర్మానంపై అంబేద్కర్ తన ఆందోళనను వ్యక్తం చేశారు ప్రత్యేక రాష్ట్రంగా కదలికను ఏర్పాటు చేస్తే ఇతర కులాలకు వ్యతిరేకంగా వ్యవహరించే లింగాయత్‌లు ఆధిక్యత ప్రదర్శించే రాష్ట్రంగా కర్నాటక మారిపోతుందని అంబేద్కర్ వ్యాఖ్యానించారు. బొంబాయి శాసనసభలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని అంబేద్కర్ గట్టిగా వ్యతిరేకించారు. భారత స్టాట్యుటరీ కమిషన్ (సైమన్)కు సమర్పించిన నివేదికలో ఆయన ఇదే కారణంతో కర్ణాటక రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించారు.

మహర్ వతన్ బిల్లును బొంబాయి శాసన మండలిలో ప్రవేశపెట్టిన సందర్భంగా మహారాష్ట్ర దీనిని వ్యతిరేకించకుండా అంబేద్కర్ గట్టి జాగ్రత్తలు తీసుకున్నారు. పార్లేలో 1929 జోనల్ దామోదర్ హాలులో జరిగిన 14వ సత్య శోధక సదస్సులో రావు సాహెబ్ ముకుందరావు పాటిల్ అధ్యక్షునిగా వ్యవహరించారు. మరాఠాలు మహర్ వతన్ బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు స్పష్టమైంది ముకుందరావు పాటిల్ కూడా బిల్లుకు వ్యతిరేకంగా ఓటు చేశారు మహర్‌ని, మరాఠాల మధ్య చీలిక మరింత విస్తృతమైంది.

మహారాష్ట్రలో మరాఠాలు మెజారిటీగా ఉన్నారు అంబేద్కర్ ఈ విధంగా వ్యాఖ్యానించారు. “పరిపాలించేది భాషాపరంగా మరాఠాలు కాదు. కులపరమైన మరాఠాలు – మరాఠాలు రాజకీయంగా వెనుకబడ్డ కులాలకు చెందిన వారనే విషయాన్ని కాదనలేం.” మరాఠాల రీతిలో షెడ్యూల్డ్ కులాలు, తెగల వంటి మైనారిటీలు న్యాయం పొందలేరని చరిత్ర చెబుతోంది. మహారాష్ట్రీయన్లు నేడు దేనికీ లెక్కలోకి రాకుండా పోతున్నారని అంబేద్కర్ వ్యాఖ్యానించారు. మూడు మహారాష్ట్ర రాష్ట్రాలు ఉంటే ముగ్గురు మరాఠాలకు ముఖ్యమంత్రులుగా, 30 మంది మరాఠీలకు మంత్రులుగా శిక్షణ ఇవ్వవచ్చునని అంబేద్కర్ వ్యాఖ్యానించారు. మన మంత్రులకు విద్య నేర్పడం ద్వారా మనకు మనం నిజమైన సేవ చేసుకోవచ్చున్నారు

“చెట్టు నీడలో పొదలు పెరగవు. మరర్వాడా ప్రజలు ఈ కథలో నీతిని మరిచి పోకూడదని అంబేద్కర్ అన్నారు.

భారతదేశంలో సామాజిక వ్యవస్థ కుల వ్యవస్థపై నిర్మింపబడింది. అది హిందూ నాగరికత, సంస్కృతిల ప్రత్యేక ఉత్పత్తి, ఎన్నికలపై కూడా కులాల ప్రభావం ఎక్కువగానే ఉంది. అంబేద్కర్ ఈ విధంగా వ్యాఖ్యానించారు.

(1) ఓటింగ్ ఎన్నడూ కుల, మత, వర్గ ప్రాతిపదికపైనే ఉంటుంది.

(2) మెజారిటీ కులస్థులకే సీటు దక్కుతుంది.

(3) మెజారిటీ కులస్థుల అభివృద్ధికి మైనారిటీ కులాలు తప్పక ఓటు వేయాల్సి వస్తుంది.

(4) మైనారిటీల ఓట్లు అభ్యర్థి విజయానికి సరిపోవు.

(5) మెజారిటీ వర్గానికి చెందిన ఓటరు మైనారిటీ వర్గానికి చెందిన అభ్యర్థికి ఓటు వేస్తారని ఎన్నడూ భావించరాదు.

(6) మెజారిటీ వర్గానికి చెందిన అభ్యర్థికి ఓట్లు వేయడంలో మైనారిటీ వర్గ ప్రజలు గర్వంగా భావిస్తారు.

భాషా ప్రయుక్త రాష్ట్రాల్లో కుల వ్యవస్థ దుష్పరిణామాలు పెరుగుతాయి. ఆయా నియోజకవర్గాల్లో అత్యధిక సంఖ్యలో ఉన్న కులస్తులనే కాంగ్రెస్ పార్టీ తన అభ్యర్థులుగా ఎప్పుడూ నిలుపుతూ ఉంటుందని అంబేద్కర్ వ్యాఖ్యానించారు. మైనారిటీలు నిరంకుశ వైఖరితో అణచివేయబడతారు. వారిపై వివక్షత ప్రదర్శించడం తథ్యమవుతుంది. చట్టంలోనూ, ప్రజా జీవనంలోనూ వారికి సమాన అవకాశాలు నిరాకరించబడుతున్నాయి.

రెండు రకాల మెజారిటీలుంటాయని అంబేద్కర్ పేర్కొన్నారు. ఒకటి రాజకీయ మెజారిటీ కాగా రెండవది కులపరమైన మెజారిటీ. రాజకీయ మెజారిటీని ఎప్పటికప్పుడు మార్చుకోవచ్చు. అది పెరుగుతూ ఉంటుంది. రాజకీయ మెజారిటీ ప్రాతిపదికగా విధాన నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ అందరికీ అన్ని వేళల్లో అందుబాటులో ఉంటుంది. అందులో ప్రవేశం కూడా అందరికీ అందుబాటులో ఉంటుంది. కుల మెజారిటీ జన్మపరంగా వస్తుంది. దాని ద్వారాలు ఇతరులకు మూసుకొని ఉంటాయి. మెజారిటీ కులం నిరంకుశత్వం ఒక కల కాదు. ఇది అనేకమంది మైనారిటీల అనుభవంలోని విషయం.

కులపరమైన నిరంకుశత్వాన్ని ప్రతిఘటించేందుకు తీసుకోవాల్సిన చర్యలను అంబేద్కర్ వివరించారు. రాష్ట్రం ఎంత పెద్దదిగా ఉంటే మెజారిటీలతో మైనారిటీల నిష్పత్తి అంత తక్కువగా ఉంటుంది. అందువల్ల చిన్న రాష్ట్రాలను ఏర్పాటు చేయడం మైనారిటీలకు భద్రతాదాయకంగా ఉంటుంది. శాసనసభలో మైనారిటీలకు ప్రాతినిధ్యం కల్పించడం వారికి రెండో విధంగా రక్షణ కల్పిస్తుంది. ప్రత్యేక హోదా కల్పించడం లేదా సీట్లను రిజర్వ్ చేయడం వంటి వాటికి పాల్పడకూడదని అంబేద్కర్ అన్నారు. బహుళ సంఖ్యలో (2 లేదా 3) నియోజకవర్గాలు ఏర్పాటు చేస్తే సరిపోతుంది. ప్రస్తుత రాజ్యాంగంలో పొందుపరచిన ఏక వ్యక్తి నియోజకవర్గం స్థానంలో సంచిత ఓటింగ్ ప్రవేశపెట్టాలని అంబేద్కర్ సూచించారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల గురించి మైనారిటీల్లో నెలకొన్న భయాందోళనలను తొలగించేందుకు ఇది ఉపయోగపడుతుంది.

భాషా ప్రయుక్త రాష్ట్రాల గురించి అంబేద్కర్ ఆలోచనా విధానాలను ఈ విధంగా సంక్షిప్తీకరించవచ్చు.

(1) మిశ్రమ రాష్ట్ర ఆలోచనను పూర్తిగా విడనాడాలి.

(2) ఏక భాషా ప్రాతిపదికగా ఒక రాష్ట్రం, ఒక భాష గల రాష్ట్రాలు ఉండాలి.

(3) ఒక భాష - ఒకే రాష్ట్రం అనే ఆలోచనకు స్వస్తి చెప్పాలి. ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లో మాదిరిగా ఒకే భాష మాట్లాడే ప్రాంతాలను అనేక రాష్ట్రాలుగా విభజించాలి.

(4) నాలుగు సూత్రాలను తప్పనిసరిగా పాటించాలి.

(ఎ) సమర్థవంతమైన పాలనా యంత్రాంగం (బి) వివిధ ప్రాంతాల అవసరాలు (సి) వివిధ ప్రాంతాల సెంటిమెంట్లు (డి) మెజారిటీ, మైనారిటీల మధ్య నిష్పత్తిని పరిగణనలోకి తీసుకోవాలి.

(5) రాష్ట్రాలు చిన్నవిగా ఉండాలి. విస్తీర్ణం పెరిగిన కొద్దీ మెజారిటీ, మైనారిటీల మధ్య నిష్పత్తి కూడా పెరుగుతుంది.

(6) మెజారిటీ వర్గం నిరంకుశత్వం నుండి మైనారిటీలకు రక్షణ కల్పించాలి. ఇందుకోసం రాజ్యాంగాన్ని సవరించి బహుళ సంఖ్యలో నియోజకవర్గాలను ఏర్పాటు చెయ్యాలి (2 లేదా 3). క్యుములేటివ్ ఓటింగ్ కల్పించాలి.

# అధ్యాయం 12

# అంతర్జాతీయ రాజకీయ సమస్యలు

## సెక్షన్-1

### రెండవ ప్రపంచ యుద్ధం

నాజీ జర్మనీ పోలండ్‌ను ఆక్రమించుకోవడంతో 1939 సెప్టెంబర్ 3న రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభమైంది. పోలండ్‌కు ఇంగ్లండు మద్దతు తెలిపింది. భారత్‌ను యుద్ధంలో పాల్గొంటున్న దేశంగా ప్రకటించింది.

పోలండ్ వైఖరి కూడా అంతా సజావుగా ఉందని చెప్పలేమని పేర్కొంటూ అంబేద్కర్ యుద్ధం ప్రారంభమైన తర్వాత ఒక ప్రకటన చేశారు. ముఖ్యంగా యూదుల పట్ల ఆ దేశం వ్యవహరిస్తున్న తీరు సవ్యంగా లేదన్నారు. ఈ యుద్ధంలో పోలండ్ సమస్య ఒక సంఘటన మాత్రమేనని, తనతో ఏకీభవించని దేశాలపై తన అభిప్రాయాలను బలవంతంగా రుద్దే ప్రయత్నమే యుద్ధం చేయడమని అంబేద్కర్ వ్యాఖ్యానించారు. ఇంగ్లండ్ కష్టం భారత్‌కు అవకాశమని భావించే వారితో ఆయన విభేదించారు. కొత్త యాజమాని కోసం భారత్ ప్రయత్నించరాదని సలహా ఇచ్చారు. యుద్ధ ప్రకటనలో, శాంతిని నెలకొల్పడంలో, విదేశాంగ విధానంలో భారత్ ఎటువంటి బాణి వినిపించకపోవడం సరికాదని అన్నారు. బ్రిటిష్ కామన్‌వెల్త్ దేశాల పరిధిలోనే భారత్ ఉండాలని ఆయన అన్నారు. అందులో సమాన భాగస్వామ్యం కోసం కృషి చెయ్యాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తమ దేశాన్ని రక్షించుకునే బాధ్యతను భారత్‌కే వదిలివేస్తున్నట్లు రౌండ్ టేబుల్ సమావేశంలో అంగీకరించిన విషయాన్ని బ్రిటిష్ ప్రభుత్వానికి అంబేద్కర్ గుర్తు చేశారు. ఈ దిశగా భారతీయులను సంసిద్ధం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బ్రిటిన్ సామ్రాజ్యంలో భారత్‌కు కల్పించే హోదా విషయంలో తిరిగి హామి ఇవ్వడం బ్రిటన్ బాధ్యతని చివరగా ఆయన యుద్ధం ముగిసిన పిమ్మట పేర్కొన్నారు. యుద్ధంలో విజయం సాధించిన తరువాత ఆ ప్రయోజనాలను విస్తరింప చేస్తామని ఇచ్చిన హామీల విషయంలో పోరాటం చేసే పరిస్థితి భారత్‌కు కల్పించరాదని ఆయన సూచించారు. స్వీయ ప్రయోజనాల కోసం యుద్ధానికి మద్దతు తెలపాలని ఆయన

భారత ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నిర్ణీత వయస్సు వారికి నిర్బంధ సైనిక శిక్షణ అమలు చేయాలని అంబేద్కర్ సూచించారు. సైన్యంలో అన్ని మతాలకు, కులాలకు ప్రవేశం కల్పించాలని పేర్కొన్నారు. యుద్ధంలో బ్రిటన్‌కు సహకరించాలని భారత్ వైస్రాయ్ చేసిన విజ్ఞప్తికి ఇండిపెండెంట్ లేబర్ పార్టీ మద్దతు తెలిపింది. ఈ మద్దతు బేషరతుగా ఉండాలని అది సూచించింది.

రెండవ ప్రపంచ యుద్ధం ప్రపంచ ప్రాంతాల విభజనకు ఉద్దేశించింది కాదని, మనిషికీ మనిషికీ, దేశానికీ దేశానికీ మధ్య సహ జీవనానికి సంబంధించిన మౌలికమైన మార్పును కోరే విప్లవమని అంబేద్కర్ వ్యాఖ్యానించారు. సహజీవన విలువల పునరుజ్జీవనం కోరిన విప్లవంగా ఆయన అభివర్ణించారు. నాజీయిజంపై విజయం నాజీ నిరంకుశత్వానికి అంతం పలికింది. నాజీ హయాంలో స్వేచ్ఛ అంతరించింది. సమానత్వం నిరాకరింపబడింది. సోదరభావం విధ్వంసకర నేరంగా పరిగణింపబడింది. వాస్తవానికి అది ద్వేషం. యుద్ధం, శత్రుత్వం పురిగొల్పిన పాలనగా పరిగణింపబడింది. ఇటువంటి దుష్టశక్తులపై విజయం ప్రజలకు స్వేచ్ఛ, సమానత్వం కల్పిస్తుందని సమ సమాజస్థాపనకు దారీ తీస్తుందని అంబేద్కర్ పేర్కొన్నారు. ఆ ఆలోచనతో ఆయన యుద్ధాన్ని సమర్థించారు. ఆయన దృష్టిలో యుద్ధం అంటే స్వేచ్ఛ, సమానత్వం, స్వాతంత్ర్యం, మంచిప్రభుత్వం, జీవితంలో నూతన విలువలను పరిరక్షించే ధర్మబద్ధమైన సమాజం. "మనపై దాడి జరిగినపుడు పోరాటం సల్పేందుకు నిరాకరించడం ద్వారా మనల్ని మనం అంతం చేసుకోలేం. యుద్ధాన్ని అంతమొందించేందుకు దానిపై విజయం సాధించి శాంతిని నెలకొల్పాలి" అని ఆయన అన్నారు.

స్వతంత్ర ప్రజాస్వామిక భారతదేశం పరస్పర రక్షణ కోసం స్వతంత్ర దేశాలతో సంతోషంగా కలసి మెలసి వ్యవహరించగలదని కాంగ్రెస్ 1939 సెప్టెంబర్ 14న చేసిన తీర్మానం పేర్కొంది. భారతదేశానికి సంబంధించినంత వరకు ప్రజాస్వామ్యం సామ్రాజ్యవాదం గురించి బ్రిటిష్ ప్రభుత్వం తన వైఖరిని వెల్లడించాలని అది డిమాండ్ చేసింది. యుద్ధాల లక్ష్యాలను వెల్లడించేందుకు బ్రిటిష్ ప్రభుత్వం నిరాకరించిన నేపథ్యంలో అనేక రాష్ట్రాల్లో మంత్రులు రాజీనామాలు సమర్పించారు. దేశం తరపున డిమాండ్లను సమర్పించనందుకు, కాంగ్రెస్ అధిష్టాన వర్గానికి విధేయంగా 1939లో రాజీనామా చేసినందుకు బొంబాయి ముఖ్యమంత్రిని అంబేద్కర్ నిందించారు. యుద్ధ విధ్వంసంపై ఆయన తన వైఖరిని పునరుద్ఘాటించారు. తమను రాజకీయ శూద్రులుగా చేసే రాజకీయ స్థాయిని అస్పృశ్యులెప్పటికీ ఆమోదించబోరని అన్నారు. వారిపై హిందువులు ప్రదర్శించే రాజకీయ, ఆర్థిక, మతపరమైన ఆధిపత్యానికి రాజకీయ దురహంకారం జోడించడాన్ని తాను సహించబోనని అంబేద్కర్ పేర్కొన్నారు. అస్పృశ్యులకు స్వేచ్ఛ, సమానత్వం, కల్పించకపోవడాన్ని, వారి పట్ల మోజారిటీ వర్గీయులు సోదరభావం చూపక పోవడాన్ని ఆయన విశదీకరించారు. ఉద్యోగాల్లో అస్పృశ్యుల శాతానికి సంబంధించిన వివరాలను ఆయన ప్రచురించారు.

అక్టోబర్ 3, 1939న సయుక్త ప్రదర్శన నిర్వహిస్తున్న ఉదారవాదులు (సర్ చిమన్‌లాల్ సెతల్వాడ్ ప్రాతినిధ్యం వహించారు), షెడ్యూల్డ్ కులాలు (బి.ఆర్. అంబేద్కర్ ప్రాతినిధ్యం వహించారు) హిందూ మహాసభ ( వి.డి. సావర్కర్), పార్శీలు (కోవాస్జీ జహంగీర్) లను వైస్రాయ్ ఆహ్వానించారు. మహాత్మాగాంధి సూచించిన పరిస్థితికి లోను కావద్దని, కాంగ్రెస్, ముస్లింలీగ్ పార్టీలు మొత్తం భారతదేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న శక్తులుగా భావించరాదని వైస్రాయ్‌కు వారు సూచించారు. తాను ఒక్కటే భారతదేశంలో ఏకైక పార్టీ వాదనను అంగీకరించడం ప్రజాస్వామ్యానికి చావు దెబ్బ వంటిదని ఆ నాయకులు హెచ్చరించారు.

వివిధ పార్టీల నాయకులను వైస్రాయ్ ఇంటర్వ్యూ చేశారు. అంబేద్కర్‌ను 1939 అక్టోబర్ 9న ఇంటర్వ్యూ చేశారు. పూనా ఒప్పందం అమలు సంతృప్తికరంగా లేదని అంబేద్కర్ ఫిర్యాదు చేశారు. రాజ్యాంగం తదుపరి పునశ్చరణ చేసే సమయంలో దీనిని గురించి ప్రస్తావించాలని భావించారు. యుద్ధం ముగిసిన పిమ్మట భారత ప్రభుత్వం చట్టాన్ని మైనారిటీల అనుమతితో పునశ్చరణ చేస్తామని వైస్రాయ్ ప్రకటించారు. ఈ లోపు ఎన్నికల సమయంలో సలహా సంఘాన్ని ఏర్పాటు చేస్తామని, అందులో అన్ని పార్టీలకు ప్రాతినిధ్యం కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు.

1941 జూలైలో రక్షణ సలహా సంఘంలో అంబేద్కర్‌ను నియమించారు. వైస్రాయ్ కార్య నిర్వాహక మండలిలో తమకు స్థానం కల్పించకపోవడంతో సిక్కులు, బడుగువర్గాలు నిరసన వ్యక్తం చేశారు. ఆ సమయంలో భారత విదేశాంగ మంత్రిగా ఉన్న అమెరీకి తన నిరసన తెలుపుతూ అంబేద్కర్ కేబుల్‌గ్రామ్ పంపారు. అంబేద్కర్ డిమాండ్‌కు వి.డి. సావర్కార్ మద్దతు తెలిపారు. కార్య నిర్వాహక మండలిలో అంబేద్కర్‌కు స్థానం కల్పించాలని కోరుతూ ఆయన వైస్రాయ్‌కు టెలిగ్రామ్ ఇచ్చారు.

చదువులు నిలిపివేసి మిలిటరీ కమీషన్లలో చేరేందుకు అర్హత సంపాదించాలని మహర్ యువకులకు అంబేద్కర్ పిలుపునిచ్చారు. వారు తమ ఉన్నత మార్షియల్ సంప్రదాయలను నిలబెట్టుకోవాలని సూచించారు. మహర్ బెటాలియన్లను నెలకొల్పాలని మార్షల్, మార్షల్ యేతర విభాగాల మధ్య అంతరం చూపాలని ప్రభుత్వానికి ఆయన సూచించారు. సైనికీకరణ ఉద్యమంపై, ముఖ్యంగా తమ కులానికి చెందిన వారిని సైన్యంలో చేర్చడంపై ఆసక్తి ప్రదర్శించడం ద్వారా రెండవ ప్రపంచ యుద్ధం నుండి లబ్ధి పొందేందుకు ఆయన ప్రయత్నించారు.

## సెక్షన్-2

### భారత విదేశాంగ విధానం

శాంతి, అలీన విధానం, వర్గ, జాతి వివక్షతను అంతమొందించడం, అణచివేతకు గురవుతున్న వారికి విముక్తి కల్పించడం, స్వాతంత్ర్య పరిరక్షణ వంటి దేశాలకు (ఇతర దేశాల ప్రాంతీయ సమగ్రత, పంచశీల సిద్ధాంతానికి ఇతర దేశాల సార్వభౌమత్వాలను గౌరవించడం,

ఇతర దేశాలపై దాడులు జరపకపోవడం, ఇతర దేశాల అంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకోకపోవడం, సమానత్వం, పరస్పర ప్రయోజనకర, శాంతియుత సహజీవనం) కట్టుబడి ఉండటం మన విదేశాంగ విధానంలో ప్రధాన సూత్రాలని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పేర్కొన్నారు. భారత విదేశాంగ విధానానికి శాంతి, కమ్యూనిజం, స్వేచ్ఛాయుత ప్రజాస్వామ్యం మధ్య సహజీవనం, సియాటో పట్ల వ్యతిరేకత ప్రాతిపదికలని అంబేద్కర్ పేర్కొన్నారు. పార్లమెంటరీ ప్రభుత్వం కావాలంటే దాడుల నుండి ఈ తరహా పరిపాలనను కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్న దేశాలతో మైత్రిగా వ్యహరించడం తప్పనిసరని అంబేద్కర్ పేర్కొన్నారు.

1954 ఏప్రిల్‌లో ఎన్నికల ప్రచార సభల్లో చేసిన ప్రసంగాల్లో నెహ్రూ ప్రభుత్వంపై, ఆయన నాయకత్వంపై అంబేద్కర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. భారత ప్రభుత్వ విదేశాంగ విధానం దేశానికి మిత్రులెవరూ లేకుండా చేసిందని వ్యాఖ్యానించారు. నెహ్రూ కాశ్మీర్ సమస్యను గందరగోళం చేశారు. చిత్తశుద్ధి లేని వ్యక్తులకు ఆశ్రయం కల్పించారని విమర్శించారు. ఇస్లాం సంయుక్త రాష్ట్రాలు ఒకవైపు, రష్యా చైనాల కమ్యూనిస్ట్ బ్లాక్ మరోవైపు భారత్ చుట్టూ పరివృతమై ఉంది. భారత్‌ను కమ్యూనిజం క్రిందకు తీసుకురావడమే చైనా, రష్యా దేశాల ధ్యేయంగా ఉంది. పాకిస్తాన్‌కు అమెరికా సహాయం అందించడం చాలా తీవ్రమైన విషయం. ఇది వినాశకర ఫలితాలకు దారి తీస్తుందని అంబేద్కర్ హెచ్చరించారు. పాకిస్తాన్‌కు అమెరికా అందిస్తున్న ఈ సహాయం కారణంగా ఇప్పటివరకు పుట్టకొకటి చెట్టుకొకటిగా చెల్లా చెదురుగా ఉన్న ఇతర ముస్లిం దేశాలు యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ ఇస్లామ్‌తో పొత్తు పెట్టుకుని మొత్తం భారతదేశాన్ని ఇరుకున పెట్టే అవకాశం ఉందనే విషయాన్ని గ్రహించవచ్చు. అమెరికా సహాయాన్ని స్వీకరించిన ఆఫ్ఘనిస్తాన్ ప్రతిపాదిత ఆఫ్ఘనిస్తాన్-పాకిస్తాన్ సమాఖ్య ఏర్పాటును వ్యతిరేకించడం భ్రమ మాత్రమేనని అన్నారు.

కాశ్మీర్ సమస్య భారత్‌కు తలనొప్పి కలిగించే సమస్య. వివిధ రాజనీతిజ్ఞులు ఈ సమస్యకు విభిన్న పరిష్కారాలు సూచించారు. మత ప్రాదికపై కాశ్మీరును విభజించాలని అంబేద్కర్ సూచించారు. వ్యూహాత్మక, రాజకీయ కారణాలతో కాశ్మీర్‌ను పాకిస్తాన్ కోరుకుంటోంది. అంబేద్కర్ సూచనకు నేషనల్ కాన్ఫరెన్స్ కార్యదర్శి మహమ్మద్ సయూద్ ఈ విధంగా వ్యాఖ్యానించారు. "అమెరికా, బ్రిటన్‌దేశాల స్ఫూరితో షెడ్యూల్డ్ కులాల నాయకులు ఈసూచన చేశారు. ఎన్నికల కోసం ఈ రెండు దేశాల నుండి నిధులు రాగలవని డాక్టర్ అంబేద్కర్ భావిస్తున్నారు. మొత్తం రాష్ట్రాన్ని పాకిస్తాన్‌కు అప్పగించడం ఆయన ఉద్దేశంగా కనిపిస్తోంది. డాక్టర్ అంబేద్కర్ పథకానికి మద్దతు ఇవ్వడం ద్వారా ప్రజాపరిషత్ రెండవ పొరపాటు చేయరాదు" అన్నారు. అంబేద్కర్ పథకం గురించి బెంగాల్‌కు చెందిన షెడ్యూల్డ్ కులాల నాయకుడు జె.న్. మండల్ ఈ విధంగా వ్యాఖ్యానించారు. "మతపరంగా కాశ్మీర్‌ను విభజించాలనే అంబేద్కర్ పథకం దురుద్దేశంతో చేయబడింది. దేశ విభజన సమయంలో నెలకొన్న భయానక పరిస్థితులు పునరావృతమయ్యే అవకాశాలున్నాయి". ఆయన ఇంకా ఇలా అన్నారు. "ఈ ఆలోచనను పూర్తిగా వ్యతిరేకిస్తున్నాను. షెడ్యూల్డ్ కులాలకు చెందిన

మెజారిటీ సభ్యులు కూడా నా అభిప్రాయంతో పాలు పంచుకుంటారని నమ్ముతున్నాను" అన్నారు. "కాని కాశ్మీర్ సమస్య ను పరిష్కరించడంలో మనం ఎన్నడూ విజయం సాధించలేదు" అని అంబేద్కర్ వ్యాఖ్యానించారు.

టిబెట్ ను చైనా తన అధీనంలోకి తీసుకోవడాన్ని అంబేద్కర్ ఈ విధంగా విశ్లేషించారు. చైనా తన సరిహద్దును భారత సరిహద్దు వైపుకు విస్తరింప చెయ్యడంలో ప్రధాని సహాయం చేస్తున్నారని అన్నారు. లాసాను ఆక్రమించడానికి ఆయన అనుమతి ఇచ్చారని విమర్శించారు. మన సమస్యలను పరిష్కరించడంలో విదేశాంగ విధానం దోహదం చేయలేదని అన్నారు. "ఇతర దేశాల సమస్యలను పరిష్కరించడమే మన విదేశాంగ విధాన మౌలిక లక్ష్యం. మన సమస్యలను పరిష్కరించడం కాదు" అని అంబేద్కర్ వ్యాఖ్యానించారు. అంబేద్కర్ దృష్టిలో పంచశీల బౌద్ధమతంలో ప్రధాన భాగం. పంచశీల పట్ల మావోకు ఏమైనా నమ్మకం ఉంటే తమ దేశంలోని బౌద్ధులపట్ల ఆయన మరింత మెరుగ్గా వ్యవహరించి ఉండేవారని అంబేద్కర్ అన్నారు. ఆయన ఇంకా ఈ విధంగా అన్నారు. పంచశీల, బాండుంగ్ సిద్ధాంతాల వల్ల ప్రజల విశ్వాసం చెదిరింది. భారత విదేశాంగ విధానాన్ని మొత్తానికి పునఃసమీక్షించాల్సి ఉంది.

గోవా తనలో అంతర్భాగమని భారత్ పేర్కొన్న సందర్భంలో చర్చిల్ పోర్చుగీస్‌కు మద్దతు తెలిపారు. అంబేద్కర్ ఇందుకు ఆగ్రహం వ్యక్తం చేశారు. "బలప్రయోగం చేయవద్దని మనకు సలహా ఇస్తూనే చర్చిల్ పోర్చుగీస్‌కు రహస్యంగా మద్దతు ఇవ్వడం దురదృష్టకరం" అన్నారు.

అంబేద్కర్ అహింసావాది కాదు. తమ దేశాన్ని కాపాడుకోవాలని, దాడి జరిగినపుడు ప్రతిదాడి చెయ్యడానికి దానిని సన్నద్ధం చెయ్యాలని ఆయన కోరుకున్నారు. పొరపాటుకు తలవంచడం. దుష్టశక్తుల ముందు సాగిలపడటం పిరికితనం. ఇది ఒకరి ఆత్మగౌరవానికి, హోదాకు భంగకరం. శాంతి న్యాయబద్ధం, గౌరవప్రదంగా ఉన్న పక్షంలో శాంతికి అంబేద్కర్ వ్యతిరేకం కాదు. అంబేద్కర్ దృష్టిలో అంతర్జాతీయ సంబంధాలంటే దేశాలు స్వేచ్ఛగా, శాంతియుతంగా జీవించడం. ప్రజాస్వామ్య యంత్రాంగాన్ని శాస్త్రీయ సామాజిక పరిస్థితులకు అనుగుణంగా మలచడానికి చేసే నిర్మాణాత్మక కృషి. అంతర్జాతీయ సంబంధాల్లో ముఖ్యంగా, ప్రపంచంలో స్వేచ్ఛాయుత జీవనం గడిపే చిన్న దేశాలముందు ఉన్న కీలక సమస్య కమ్యూనిజం విస్తరణ. శాంతి సిద్ధాంతం గురించి ఆయన ప్రస్తావిస్తూ "మనకు శాంతి కావాలి. ఎవరూ యుద్ధం కోరుకోరు. ప్రశ్న ఒక్కటే: దీని మూల్యం ఎంత? శాంతికి మనం ఎంత మూల్యం చెల్లిస్తున్నాం?" అని.

1956 అక్టోంబర్ 15న నాగపూర్‌లో అంబేద్కర్ ఉపన్యసించారు. ఆయన నెహ్రూ విదేశాంగ విధానాన్ని విమర్శించారు. నాజర్ సుయాజ్ కాల్వను జాతీయం చెయ్యగా నెహ్రూ ఆయనకు మద్దతు తెలిపారు. తద్వారా తన అస్థిర, అనిశ్చిత విధానాలను బయటపెట్టుకున్నారు. సూయజ్ కాల్వ ద్వారా భారత్‌కు ఆయుధాల సరఫరాను ఈజిప్టు అడ్డుకుని, పాకిస్తాన్ అనుకూల

విధానాన్ని అవలంభిస్తే భారతదేశ భద్రతకు ముప్పు వస్తుంది. ప్రమాదకర ఫలితాలకు తావిచ్చే విదేశాంగ విధానాన్ని విడనాడాలని అంబేద్కర్ విజ్ఞప్తి చేశారు.

భారతదేశ విదేశాంగ విధానం గురించి అంబేద్కర్ చేసిన వ్యాఖ్యలను పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చౌపట్టిలో జరిగిన బహిరంగ సభలో విమర్శించారు. భారత ప్రభుత్వం అనుసరిస్తున్న అలీన విధానం వల్ల మిత్రులెవరూ లేని పరిస్థితి నెలకొందని అంబేద్కర్ చేసిన విమర్శ గురించి ప్రస్తావిస్తూ ఈ విదేశాంగ విధానం వల్ల ప్రపంచంలో మనదేశానికి పేరు ప్రతిష్టలు పెరిగాయని అన్నారు. కేంద్ర మంత్రిమండలిలో సభ్యునిగా ప్రభుత్వంలోని కాంగ్రెస్ పార్టీ విధానాలల్లో లోపాలను ఎందుకు గ్రహించలేకపోయారని, గ్రహిస్తే ఎందుకు మౌనం పాటించారని నెహ్రూ ప్రశ్నించారు. ఇది వివేకం, బాధ్యత అనిపించుకొంటుందా, అంబేద్కర్ ప్రజలను ఎందుకు మోసం చేస్తున్నారు? ప్రతి దేశం ఏదో ఒక రూపంలో అధికార కూటమి ఆధిక్యానికి లోబడి వ్యవహరించాల్సి ఉంటుంది. స్వేచ్ఛాదేశంగా ఐక్యరాజ్యసమితిలో తనను తాను నిరూపించుకున్న ఒకే ఒక్కదేశం భారతదేశం అని నెహ్రూ అన్నారు.

పై అంశాలను బట్టి అంబేద్కర్ ఆంగ్లో అమెరికన్లు, సియాటోకు అనుకూలమని, సోవియట్‌కు భారతదేశ అలీనోద్యమానికి వ్యతిరేకమని స్పష్టమవుతుంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, కమ్యూనిజం మధ్య సహజీవనం చేయడం అంబేద్కర్ దృష్టిలో ఒక పురాణం వంటిది.

## అధ్యాయం 13

# విద్య, జర్నలిజంపై ఆలోచనలు

### సెక్షన్-1

**విద్య**

దాదాపు అందరూ జాతీయవాదులు, సంఘ సంస్కర్తలు, ఆధునిక భారత సిద్ధాంత కర్తలు దేశ విద్యా గంధాన్ని మరింత పరిమళభరితం చెయ్యడంలో పాత్ర పోషించారు. ఇందులో కొందరి గురించి చెప్పాలంటే బాలగంగాధర్ తిలక్, గోఖలే, లాలాలజపతిరాయ్, ఆశుతోష్ ముఖర్జీ, శ్యాంప్రసాద్ ముఖర్జీ. ఈ అద్భుత వ్యక్తుల జాబితాలో అంబేద్కర్ పేరు కూడా చేర్చవచ్చు.

భారత స్టాట్యుటరీ కమిషన్, 1928 (సైమన్ కమిషన్)కు బహిష్కృతి హితకారణి సభ తరపున సమర్పించిన ప్రకటనలో అంబేద్కర్ ఈ విధంగా పేర్కొన్నారు. బడుగు వర్గాల్లో విద్యా వ్యాప్తి గురించి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వం కొన్ని నిర్దిష్ట చర్యలు తీసుకోవాలి. ఈ దిశగా ప్రభుత్వం ఏమి చెయ్యాలనే విషయంపై సభకు స్వీయ అభిప్రాయాలున్నాయి. అవి ఈ క్రింది విధంగా ఉన్నాయని చెప్పాలని భావిస్తున్నాను.

1) నిర్బంధ ప్రాథమిక విద్యా చట్టాన్ని రద్దు చేసి ప్రాథమిక విద్య బోర్డు స్కూల్స్‌కు బదిలీ అయ్యే ప్రక్రియ నిలుపకపోతే అణచివేతకు గురవుతున్న వర్గాల విద్యకు గట్టి ఎదురుదెబ్బ తగులుతుందని సభ ఆందోళన చెందుతోంది.

2) నిర్బంధ ప్రాథమిక విద్యను విధిగా పాటించాల్సిన అంశంగా చెయ్యకపోతే, ప్రాథమిక పాఠశాలల్లో ప్రవేశాన్ని ఖచ్చితంగా అమలు జరపకపోతే, వెనుకబడిన తరగతుల్లో విద్యా పురోగతి ఆచరణకు నోచుకోదు, కార్యరూపం ధరించదు.

3) మహమ్మదీయుల విద్యకు సంబంధించి హంటర్ కమిషన్ సిఫార్సులను అణచివేతకు గురవుతున్న వర్గాలకు కూడా వర్తింప చెయ్యకపోతే విద్యా రంగంలో వారి పురోగతి ఆచరణ సాధ్యం కాదు.

4) ప్రభుత్వ సర్వీసుల్లో ప్రవేశం విషయంలో స్పష్టమైన హామీ లేని పక్షంలో విద్య వల్ల వారికి ఆసక్తి కలగబోదు.

సంస్కరణల్లో భాగంగా ప్రెసిడెన్సీ అనుసరించిన విద్యా విధానం – అణచివేతకు గురవుతున్న వర్గాలపై దాని ప్రభావం గురించి ఈ వ్యాఖ్యలు చేయడంలో ఉన్నత విద్య, స్కాలర్‌షిప్పులు, హాస్టళ్ళ ఏర్పాటు ద్వారా అణచివేతకు గురవుతున్న వర్గాల ప్రత్యేక నిబంధనలను సభ పరిగణనలోకి తీసుకోలేదు. ప్రాథమిక విద్య అభివృద్ధి చెందని పక్షంలో ఉన్నత స్థాయి విద్య అభివృద్ధికి తీసుకునే చర్యలు నిష్ప్రయోజనమని సభ పేర్కొంది. అంతేకాకుండా ఈ రాయితీలు కొనసాగుతాయని ఎటువంటి గ్యారంటీ లేదు. విద్యాశాఖ మంత్రి అవలంభించే విధానం, శాసనమండలిలో బడుగువర్గాల ఓటింగు బలంపై ఇవి ఆధారపడి ఉంటాయి. వీటిపై ఖచ్చితంగా ఆధారపడి ఉండలేం.

"ఈ సందర్భంగా గౌరవనీయులైన విద్యాశాఖమంత్రి దృష్టికి నేను తీసుకురాదలచిన అంశమేమంటే ప్రాథమిక విద్యకు మనం ప్రస్తుతం ఖర్చు పెడుతున్న మొత్తంలో ఎక్కువభాగం వృథా అవుతోంది. ప్రాథమిక పాఠశాలల్లో ప్రవేశించే ప్రతి బాలుడు లేదా బాలిక అక్షరాస్యుడుగా మాత్రమే బయటపడి వారి జీవిత పర్యంతం విద్య కొనసాగించేలా చూడటం ప్రాథమిక లక్ష్యం ధ్యేయం కావాలి. అయితే గణాంకాలను పరిగణనలోకి తీసుకుంటే ప్రాథమిక పాఠశాలల్లో ప్రవేశించే ప్రతి 100 మందిలో 18 మంది మాత్రమే నాల్గవ తరగతి స్థాయికి చేరుకుంటున్నారనే విషయం వెల్లడవుతుంది. అంటే 82 మంది నిరక్షరాస్యులుగా మిగిలిపోతున్నారు." ఈ పరిస్థితిని నివారించడం ఎలా? విద్యా సమీక్షపై కేంద్ర ప్రభుత్వం తన నివేదికలో దిగువ వ్యాఖ్యలు చేసింది.

విద్య కోసం చేసే ఖర్చులో వృథా ఎక్కువగా ఉంటోంది. దీనికి పరిష్కారం లేదని అనేకమంది విద్యావేత్తలు పేర్కొన్నారు. ఇది అనివార్యమైనదిగా పరిణమించిందని వారు పేర్కొన్నారు. విద్య కోసం అవుతున్న మొత్తం వృథాలో సమారు 50 శాతం ప్రాథమిక తరగతుల్లో పెడుతున్న నిధుల్లోనే ఉంటుంది.

ఆర్ట్స్ కళాశాలలపై మనం పెడుతున్న మొత్తం వ్యయం సుమారు 36 శాతం ఫీజుల రూపంలో వసూలవుతున్న ఆదాయం నుండి పెడుతున్నాం. అలాగే హైస్కూల్స్‌పై పెడుతున్న వ్యయంలో 31 శాతం మాధ్యమిక పాఠశాలలపై పెడుతున్న వ్యయంలో 26 శాతం ఫీజుల రూపంలో వసూలవుతున్న ఆదాయాల నుండి పెడుతున్న విషయం నేను గుర్తించాను. ఇది విద్యను వాణిజ్యీకరించడం కాక మరేమీ కాదు. విద్యను ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తీసుకురావాలి.

సాధ్యమైన అన్ని మార్గాల ద్వారా విద్యను వీలైనంత తక్కువ ధరకు అందుబాటులోకి తీసుకురావాలి.

విద్యవంటి కీలక అంశాలు అప్పగించబడిన సంస్థలు బడుగు వర్గాలను నిర్లక్ష్యం చెయ్యకుండా తన ప్రత్యక్ష నియంత్రణలో కొన్ని పర్యవేక్షక ఏజెన్సీలను ప్రభుత్వం నియమించాలి.

ఈ వ్యయాన్ని వెనుకబడ్డ తరగతుల్లో విద్యా వ్యాప్తి కోసం ప్రభుత్వం తనంతట తాను నెలకొల్పే లేదా ప్రైవేటు ఏజెన్సీలు స్థాపించే హాస్టల్స్ అభివృద్ధి కోసం వెచ్చించడం మంచిదని గౌరవనీయులైన మంత్రికి విజ్ఞప్తి చేస్తున్నాను. ఇది రెండు విధాలుగా పొదుపు చెయ్యడం అవుతుంది. ఇది విద్యార్థులను చెడు వాతావరణం నుండి దూరం చేస్తుంది. సమర్థవంతమైన తనిఖీకి అవకాశం కలుగచేస్తుంది. హాస్టల్స్‌ను ప్రైవేటు ఏజెన్సీ నిర్వహించడం వల్ల ప్రభుత్వానికి కొంత పొదుపు అవుతుంది (అంబేద్కర్ రైటింగ్స్ స్పీచెస్, రెండవ వాల్యూమ్ 40,44 పేజీలు).

గాంధీ సిద్ధాంతం ప్రాతిపదికగా వార్ధా విద్యా పథకం రూపొందింపబడింది. బొంబాయి శాసన సభ్యునిగా అంబేద్కర్ ప్రాథమిక విద్యా సవరణ చట్టాన్ని (1938) విమర్శించారు. చరఖాను స్వీకరించడం ద్వారా గ్రామాల్లో ప్రజలకు విద్య అందుబాటులో ఉండబోదు. విద్యా ప్రమాణాలు దిగజారతాయి. మరోవైపు నగరాల్లోని మేధావులు విద్య, ఉద్యోగాలు పొందడం ద్వారా లబ్ధి పొందుతారు. ఈ పథకంపై తీర్పు చెప్పే అధికారం అంబేద్కర్‌కు లేదని బొంబాయి హోంమంత్రి మున్షి విమర్శించారు. అలాగే విద్యావేత్తలు కాని ఎక్కువమంది శాసనసభ్యులు కూడా ఈ పథకాన్ని సరిగా అర్థం చేసుకోలేరని ఆయన అన్నారు. పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ తరపున బొంబాయిలో సిద్ధార్థ కళాశాలను అంబేద్కర్ 1946 జూన్ 20న ప్రారంభించారు. లక్షలాది రూపాయల విరాళం స్వీకరించి కళాశాలకు ఒక కోటీశ్వరుని పేరు పెట్టి ఉండవచ్చునని, అయితే ఆ మార్గాన్ని తాను ఎంపిక చేసుకోలేదని, బుద్ధుని పేరు పెట్టానని అంబేద్కర్ అన్నారు. గౌతమబుద్ధుని భక్తులు పాటించాల్సిన ఆదర్శ సూత్రాలను సిద్ధార్థ కళాశాల ప్రారంభోత్సవాలకు ముందు వివరించారు (1) సత్యాన్వేషణ చేయడం (2) మానవత్వాన్ని ప్రబోధించే మత సిద్ధాంతాలను అనుసరించడం పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటిని ఆయన నెలకొల్పినప్పటికే విద్యావకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని ఆయన అన్నారు.

ప్రస్తుత విద్యావ్యవస్థ మంచి ప్రొఫెసర్లను తయారు చెయ్యలేదని అంబేద్కర్ అభిప్రాయపడ్డారు. వివిధ సబ్జెక్టులను ఒక గ్రూప్‌గా చేసే వ్యవస్థ ఉండాలని ఆయన అన్నారు. బోధన, పరిశోధన (రీసెర్చ్) బాధ్యతలు ప్రొఫెసర్లవేనని ఆయన అభిప్రాయపడ్డారు. వారందరికీ సమాన జీతాలు ఉండాలని సూచించారు.

ఆరంభం నుండి బొంబాయి విశ్వవిద్యాలయం అనుబంధ సంస్థగానే ప్రారంభింప బడింది. అంబేద్కర్ దీనిని విమర్శించారు. సమానత్వం ప్రాతిపదికగా విశ్వవిద్యాలయం, కళాశాలలను నెలకొల్పాలని, అండర్ గ్రాడ్యుయేట్, పోస్టుగ్రాడ్యుయేట్ కోర్సులను అభివృద్ధి చెయ్యడంలో భాగస్వామ్యం వహించాలని అంబేద్కర్ అన్నారు. ఈ విషయంలో సాడ్లర్ కమిషన్ సిఫార్సులు బొంబాయి విశ్వవిద్యాలయ కమిటీ సిఫార్సుల కంటే మేలైనవని అంబేద్కర్ అభిప్రాయపడ్డారు.

1937 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఇండిపెండెంట్ లేబర్ పార్టీ తన ఎన్నికల ప్రణాళిక విడుదల చేసింది. 1935 చట్టానికి అనుగుణంగా ఈ సమస్యలపై తన విధానాన్ని ప్రకటించింది. సంపూర్ణ, నిర్బంధ సమస్యను అది ప్రతిపాదించింది. సాంకేతిక విద్యకు ప్రత్యేక ప్రాధాన్యత నిచ్చింది. విద్యాపరంగా వెనుకబడ్డ వర్గాల్లో అర్హులైన వారికి ప్రభుత్వం స్కాలర్‌షిప్పులు చెల్లించాలని డిమాండ్ చేసింది. విశ్వవిద్యాలయాల విద్యను పునర్వ్యవస్థీకరించేందుకు, బోధనా విశ్వవిద్యాలయాలను నెలకొల్పేందుకు శాసనం చేయాలని అది భావించింది.

బాల బాలికలకు ఒకే విద్యను అందించరాదని అంబేద్కర్ భావించారు. మెట్రిక్యులేషన్ వరకు ఒకే తరహా విద్య అందించాలని ఆయన భావించారు. బాలురతో సమానంగా బాలికలకు విద్యను బోధించడం సమయం, డబ్బు, శక్తి వృథా చేసుకోవడమేనని అంబేద్కర్ తలపోశారు. బాలికలకు బర్కే, షేక్స్‌పియర్‌ల గురించి బోధించడం వల్ల ఉపయోగం ఏమి లేదని ప్రశ్నించారు. బాలికలు గృహ విద్యలో నిష్ణాతులు కావాలని ఆయన వ్యాఖ్యానించారు.

అంబేద్కర్ బొంబాయిలోని ప్రభుత్వ కళాశాలలో పార్ట్‌టైం ప్రొఫెసర్‌గా పనిచేశారు. 1935 జూన్ 1న ఆయనను ప్రిన్సిపాల్‌గా నియమించారు. ఆ కళాశాల కార్యకలాపాలు, అభివృద్ధిపై ఆయన అమితాసక్తి ప్రదర్శించారు. 1938 మే నెలలో ఆ పదవికి రాజీనామా చేశారు. ఆయన ప్రసంగాలకు బాగా సన్నద్ధమయ్యేవారు. కళాశాల లైబ్రరీపై అమితాసక్తి ప్రదర్శించి దానిని పరిపుష్టం చేశారు.

ఆదర్శవంతమైన ప్రొఫెసర్‌కు ఉండాల్సిన లక్షణాలను ఆయనకు పేర్కొన్నారు. బాగా చదువుకున్నవారు అయి ఉండటం మాత్రమే కాకుండా, స్పష్టమైన వాక్కు, బాగా మాట్లాడగలిగే వారుగా ఉండాలి. ఎంచుకున్న అంశంపై పరిపూర్ణజ్ఞానం కలిగి ఉండాలి. నాలోని లక్షణాలను ప్రొఫెసర్ సెలిగ్మన్, ఇతరులు అభివృద్ధి చేశారు. "నీ పని నువ్వు కొనసాగించు పరిశోధనా పద్ధతులు ఎలా కొనసాగించాలో నీకే తెలుస్తుంది అన్నారు."

విద్యాభ్యాసం చేసే రోజుల్లో రాజకీయాల్లో పాలు పంచుకోరాదని అంబేద్కర్ విద్యార్థులకు సూచించారు. స్వీయ సంస్కృతి, స్వయం సహాయం ప్రాధాన్యతలను విద్యార్థులకు వివరించారు. జీవితంలో గమ్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో కృషి చెయ్యడం ద్వారా దానిని సాధించాలని ఉద్బోధించారు.

విశ్వవిద్యాలయ విద్య ఆధునిక ప్రపంచ అవసరాలను తీర్చేదిగా ఉండాలని 1952 డిసెంబర్‌లో బొంబాయిలోని ఎల్ఫిన్‌సన్ కళాశాలలో హాజరైన జనసమూహన్ని ఉద్దేశించి చేసిన ప్రసంగంలో అంబేద్కర్ అన్నారు. విశ్వవిద్యాలయం గుమాస్తాలకు శిక్షణ ఇచ్చే కేంద్రంగా కాకుండా విజ్ఞానానికి నెలవుగా రూపొందించాలని సూచించారు. అంబేద్కర్ దృష్టిలో చదవడం, తెలుసుకోవడం కంటే మిగిలిన లేదా ఎక్కువ పవిత్రకరమైనదేమీ లేదు. రణడే, తిలక్, గోఖలే ప్రజా జీవనంలో పాటించిన ఉన్నత విలువలు, వారి ఉన్నత లక్ష్యాలు, సమున్నతమైన సంప్రదాయాలు, వారు అనుసరించిన అలుపు ఎరగని అఖండ పరిశ్రమ (కృషి) గురించి అంబేద్కర్ విద్యార్థులకు ఉద్బోధించారు.

## సెక్షన్-2

### జర్నలిజం

పేరున్న ప్రతి నాయకుడూ దినపత్రికలు ప్రారంభించారు. అది వారి కెరీర్‌లో ఒక భాగంగా, ప్రవృత్తిగా మారింది. సామాజిక, రాజకీయ నిరంకుశత్వంపై ఆలోచనలు రేకెత్తించి పోరాటం సాగించేందుకు దినపత్రిక ఆయుధంగా రూపొందింది. లోకమాన్య తిలక్ 'కేసరి' పత్రికను ప్రారంభించారు. మహాత్మగాంధీ 'యంగ్ ఇండియా', 'హరిజన' పత్రికలను ప్రారంభించారు. లాలాలజపతిరాయ్ 'ది పీపుల్', జవహర్‌లాల్ నెహ్రూ లక్నోలో 'దినేషనల్ హెరాల్డ్' స్థాపించారు. అంబేద్కర్ కూడా ఇందుకు మినహాయింపు కాదు.

బడుగు వర్గాల సమస్యలను ప్రస్తావిస్తూ అంబేద్కర్ 'మూకానాయక్' (మూగవారి నాయకుడు) అనే వారపత్రికల్లో 1920లో వ్యాసాలు రాశారు. ఆ పత్రిక తొలి సంచిక 1920 జనవరి 31న విడుదలైంది. ఆయన ఈ విధంగా రాశారు" అనేక పత్రికలు ఒక వర్గం కులం వారి ప్రయోజనాలు పోషించేవిగా వ్యవహరిస్తాయి. ఇతర కులాల ప్రయోజనాలను అవి విస్మరిస్తాయి."

'బహిష్కృత్ భారత్' (బహిష్కరింపబడిన భారత్), సమత (సమానత్వం) లో ఆయన వర్తమాన అంశాలపై వ్యాసాలు రాశారు.

'జనత' (ప్రజలు) అనే పత్రికను నాగపూర్‌లో జరిగిన బడుగు వర్గాల సదస్సు అనంతరం 24.11.1930న, ప్రారంభించారు. తరువాత కొంతకాలం పాటు నిలిచిపోయింది. 1943లో తిరిగి ప్రారంభించేందుకు ప్రయత్నాలు జరిగాయి. ఆ పత్రిక ధ్యేయం ఇలా ఉంది.

"నువ్వు బానిసవని ఒక బానిసకు చెప్పండి. అతడు తిరుగుబాటు చేస్తాడు". పెట్టుబడి దారులకు, బ్రాహ్మణులకు రాజకీయ అధికారం ఇవ్వడం ద్వారా ఆ వర్గాల పేరు ప్రతిష్టలు ఇనుమడిస్తాయి. అలా కాకుండా అస్పృశ్యులు, వెనకబడ్డ తరగతులు ప్రజలకు చేతుల్లో అధికారం ఉంచడం దేశ ప్రతిష్టను ఇనుమడింపచేస్తుంది, భౌతిక అభివృద్ధికి దోహదం చేస్తుంది. అంబేద్కర్ నాయకత్వంలో నడిచిన 'జనత' పత్రిక ఈ విధానాన్ని అనుసరించింది. ఆ పత్రికపేరును ఆ తరువాత 'ప్రబుద్ధ భారత్' (మేల్కొన్న భారత) అని మార్చారు. ఆ పత్రికల ద్వారా ఆయన కొన్ని నినాదాలు వ్యాప్తిలోకి తెచ్చారు. పోరాటం, మరింత పోరాటం... త్యాగం మార్గం అనుసరించడం ద్వారా బడుగు వర్గాలకు అద్భుత భవిష్యత్ ఉంది. అధికారం మన ధ్యేయం - పులిలా వ్యవహరించండి". సామాజికాభివృద్ధికి కృషి చేసిన వారికే విమర్శించే హక్కు ఉంటుంది. 'బహిష్కృత్ భారత్' అనే పత్రికకు ఆయన 1919 నుండి 1942 వరకు సంపాదకునిగా ఉన్నారు. వాణిజ్య ప్రకటనకు సంబంధించిన ఛార్జీలు ముందుగానే చెల్లించినప్పటికీ బడుగువర్గాల పత్రికకు సంబంధించిన వాణిజ్య ప్రకటనను ప్రచురించేందుకు నిరాకరించిన 'కేసరి' (పూనా) పత్రికను ఆయన ఘాటుగా విమర్శించారు.

సంపాదకునిగా ఆయన సామాజిక, మతపరమైన అంశాలను అధ్యయనం చేశారు. తన ఆలోచనలు, భావాలను, సరళమైన భాషతో,హుందాగా వ్యక్తం చేశారు. సామాజిక విప్లవానికి

ఆయన పడిన తపనకు ఆయన రాతలు ప్రతీకలుగా నిలిచాయి. తన వ్యతిరేకులపై ఆయన నిశితంగా, హేతుబద్ధంగా దాడి చేసేవారు.

ఒకప్పుడు వృత్తిగా ఉన్న జర్నలిజం నేడు వ్యాపారంగా మారిందని అంబేద్కర్ వ్యాఖ్యానించారు. తాను ప్రజలకు గౌరవ ప్రదమైన సలహాదారునిగా వ్యవహరించాలనే విషయాన్ని అది విస్మరిస్తుంది. ఆయన ఈ విధంగా వ్యాఖ్యానించారు. ఎటువంటి దురుద్దేశాలు, ఆపాదించకుండా వార్తలు ఇవ్వడం, సమాజానికి మేలు చేసే విధంగా ప్రభుత్వ విధానాలపై వ్యాఖ్యానాలు చేయడం, ఎంతటి ఉన్నత స్థానాలకు సంబంధించిన వారి వార్తలను సైతం నిర్భీతితో ప్రచురించడం, వారిని చక్కదిద్దేందుకు ప్రయత్నించడం... తన ప్రాథమిక బాధ్యత అనే విషయాన్ని భారతీయ జర్నలిజం గుర్తించలేదు. ఒక వ్యక్తిని హీరోగా గుర్తించి అతనికి భజన చెయ్యడమే దాని ప్రధాన బాధ్యత. ప్రవృత్తిగా మారిపోయింది. ఆయన ఇంకా ఇలా అన్నారు.

"వార్తల ముసుగులో సంచలనాలకు ప్రాధాన్యతనిస్తుంది. సహేతుకం కాని రీతిలో వ్యాఖ్యానాలు ఇస్తుంది. బాధ్యత లేని వ్యక్తుల్లో భావోద్వేగాలను రెచ్చగొట్టే రీతిలో ఉండే విధంగా బాధ్యత లేని వ్యక్తులను ప్రభావితం చేసే విధంగా వ్యవహరిస్తుంది." నార్త్ క్లిఫ్ జర్నలిజం ఆఫీస్ బాయ్స్ కోసం ఆఫీస్‌బాయ్స్ రాసేదని లార్డ్ సాలిస్‌బరీ వ్యాఖ్యానించారు. భారత జర్నలిజం దానికి మరికొంత జోడించింది. ఇవి తమ హీరోలను స్తుతిస్తూ భజనపరులు రాసే రాతలు. భారతదేశంలో హీరోవర్షిప్ ఇంత గుడ్డిగా ఇంతకు ముందెన్నడూ లేదు". ఆధిపత్యం చెలాయించడం ద్వారా తమ అనుచరులను పతనం చేశారు. రాజకీయాలను కలుషితం చేశారు. తమ అనుచరుల్లో సగం మందిని మూర్ఖులుగా, మిగిలిన సగం మందిని కపటులు, వంచకులుగా మార్చింది.

ఆధిక్యత సంపాదించడంలో భారత జర్నలిజం కూడా బడా వ్యాపారం, మనీ మాగ్నెట్స్ సహాయం తీసుకుంది. ధనం నిర్వాహణ సామర్థ్యాన్ని అంబేద్కర్ నొక్కి చెప్పారు. అవినీతికి మారుపేరుగా మారిపోయేదిగా భారత రాజకీయాలు లాభాపేక్షగలవిగా పరిణమించాయి. రాజకీయాలు భరించ శక్యంగాని దుర్గంధపూరితమైన మురుగునీటి కాల్వలాగా మారిపోయాయి. రాజకీయ నాయకుడు కావడమంటే మురుగునీటి కాల్వలో పని చెయ్యడంగా మారిపోయింది." పత్రిక చేతిలో ఉంటే గొప్ప వ్యక్తులను తయారు చేయవచ్చునని అన్నారు, చారిత్రక గొప్ప వ్యక్తులు అనేక బ్యాంకు నోట్లవంటి వారని కార్లైల్ వ్యాఖ్యానించారు. జేబుదొంగలుంటారు జాగ్రత్త అనే హెచ్చరికల వంటి నోటిసు బోర్డుల మాదిరిగా గొప్ప వ్యక్తులున్నారు జాగ్రత్త, అనే బోర్డులు అవసరమవుతాయని ఆయన అన్నారు.

భారతీయ జర్నలిజంలో గుత్తాధిపత్య మూలధనం దుష్ట పాత్ర పోషిస్తోంది. అనేక గొలుసు పత్రికలున్న నేపథ్యంలో పోటీ కష్టంగా ఉంటుంది. ప్రైవేటు సంస్థలను గొప్పవి చేసి రాయడం, అణచివేతకు గురవుతున్న వర్గాల పోరాటాలను కించపరచడం ఆ గొలుసు పత్రికల మార్గంగా ఉంది. ఈ నేపథ్యంలో అంబేద్కర్ వ్యాఖ్యలు సందర్భోచితంగా, గమనార్హంగా ఉన్నాయి.

# అధ్యాయం 14

# ఆర్థిక ఆలోచన

అంబేద్కర్ ఆర్థికశాస్త్రం పట్ల విశేష ఆసక్తి గల విద్యార్థి. 'ఎవల్యూషన్ ఆఫ్ ప్రావిన్షియల్ ఫైనాన్స్ ఇన్ బ్రిటిష్ ఇండియా' అనే అంశంపై సమర్పించిన థీసిస్‌కు గాను ఆయన ఎం.ఎస్.సి. డిగ్రీ పొందారు. 'ది ప్రాబ్లమ్ ఆఫ్ ది రూపీ' అనే థీసిస్ కు డి.ఎస్.సి. డిగ్రీ లభించింది. హిల్టన్ – యంగ్ కమిషన్ ముందు ఆయన ఇచ్చిన సాక్ష్యం భారతదేశంలో కరెన్సీ సమస్యపై జరిగిన చర్చలో ప్రాముఖ్యత సంతరించుకుంది. భూమి లేని నిరుపేద కార్మికులు, ఖోటీవ్యవస్థ, చిన్న కమతాలు, మహర్‌వతన్, సమిష్టి వ్యవసాయం, భూమి నుండి శిస్తు, భూస్వామ్య వ్యవస్థ రద్దు వంటి సమస్యలపై వివిధ సందర్భాల్లో అంబేద్కర్ దృష్టి సారించారు. అస్పృశ్యతకు గురవుతున్న వారిలో అధికులు భూమిలేని కార్మికులే కావడంతో అంబేద్కర్ సహజంగా పై సమస్యలకే ఎక్కువ ప్రాధాన్యత నిచ్చారు. పరిశ్రమల జాతీయకరణ, ఆహార పరిస్థితి, సోషలిజం, సామాజిక సమానత్వం వంటి వివిధ అంశాలపై ఆయన తన ఆలోచనలను వెల్లడించారు. బడ్జెట్‌పై చేసిన ప్రసంగాల్లో టాక్సేషన్ సమస్యల గురించి ఆయన ప్రస్తావించారు.

ఆర్థికరంగంపై అంబేద్కర్ రాసిన పుస్తకాల్లో 'ది ఎవల్యూషన్ ఆఫ్ ప్రావిన్షియల్ ఫైనాన్స్ ఇన్ బ్రిటిష్ ఇండియా', 'ది ప్రాబ్లమ్ ఆఫ్ ది రూపీ' చెప్పుకోతగ్గవి. వివిధ అంశాలతో పాటు భారతదేశ అభివృద్ధి ప్రాతిపదికగా సమీకృత ఆర్థిక విధానాన్ని అంబేద్కర్ ప్రముఖంగా ప్రస్తావించారు. ఇండిపెండింట్ లేబర్ పార్టీ షెడ్యూల్డ్ కులాల సమాఖ్య ఎన్నికల ప్రణాళికల్లో, భారత రాజ్యాంగంపై చేసిన ప్రసంగాల్లో అంబేద్కర్ దానిని ప్రస్తావించారు. భారత రాజ్యాంగ రూపకల్పనలో ఆయన ప్రముఖ పాత్ర పోషించారు.

## సెక్షన్-1

### భూసంస్కరణలు

'భారతదేశంలో చిన్న కమతాలు – దాని పరిష్కారాలు' అనే అంశాలపై ఇండియన్ ఎకనామిక్ సొసైటీ పత్రికలో అంబేద్కర్ ఒక చిన్న వ్యాసం రాశారు. చిన్న కమతాలన్నింటిని ఒకటిగా కలిపి వేయడం చెల్లాచెదురుగా ఉన్న ఆస్తులు లేదా పొలాల వల్ల ఏర్పడే నష్టాలు, దుష్పరిణామాలను నివారిస్తుంది. అయితే ఈ విధంగా విలీనం చెయ్యడం ఆర్థికంగా పటిష్టంగా

ఉంటే మినహా (ఎకనామిక్ హోల్డింగ్) చిన్న కమతాల వల్ల దుష్పరిణామాలు నివారణ కావు. ఎకనామిక్ హోల్డింగ్ సాధారణ నిర్వచనం ఏమిటంటే అవసరమైన ఖర్చుల అనంతరం తనకు, తన కుటుంబ సభ్యులకు సౌఖ్యమివ్వడానికి సరిపోయినంతగా ఉత్పత్తి చేసేందుకు దోహదం చేసే స్థాయిలో ఉన్న భూ పరిమాణం.- ఈ నిర్వచనాన్ని అంబేద్కర్ విమర్శించారు. ఎకనామిక్ హోల్డింగ్ నిర్వచనం వినియోగపరంగా ఉండాలే గాని ఉత్పత్తి పరంగా ఉండకూడదని అంబేద్కర్ పేర్కొన్నారు. ఆయన ఈ విధంగా వ్యాఖ్యానించారు.

> "వినియోగపరంగా నిర్వచనం చెప్పడం ఎకనామిక్ హోల్డింగ్ ధ్యేయాన్ని తప్పుగా అర్థం చేసుకోవడమే. ఈ నిర్వచనం ఉత్పత్తి చేయగల సంస్థలు లేదా భూమికి మాత్రమే వర్తిస్తుంది. ఉత్పత్తికి దోహదం చేసే అన్ని కారకాలను విలీనం చేసే ప్రక్రియ ఉత్పత్తికి ముఖ్యోద్దేశం."

భూమి విస్తీర్ణం ఒక్కటే ఉత్పత్తి సామర్థ్యం పెంపుకు దోహదం చేసే నిర్ణయాత్మక అంశం కాబోదు.

> "ప్రస్తుతం ఉన్న కమతాలు ఆర్థికపరంగా పటిష్టమైనవి కావు. అవి చిన్నవిగా ఉండటం వల్ల కాదు. మరీ ఎక్కువ పరిమాణంలో ఉండటం వల్ల భారతదేశంలో వ్యవసాయ రంగంలో ఎదురవుతున్న ఇబ్బందులు, ముఖ్యంగా భూ పరిమాణానికి ముడిపడి ఉన్నవి కావు. పెట్టుబడి, పెట్టుబడి వస్తువుల పెరుగుదలకు సంబంధించినవి."

మూలధనం పొదుపు నుండి ఆవిర్భవిస్తుందని అంబేద్కర్ పేర్కొన్నారు. మిగులు ఉన్నప్పుడు మాత్రమే పొదుపు సాధ్యమవుతుంది. అంటే మూలధనం అంటే ఘనీభవించిన మిగులు. అయితే వ్యవసాయంలో మిగులు సాధ్యపడదనే విషయం అతి ముఖ్యమైనఅంశం. కారణాలు అందరికీ తెలిసినవే. వ్యవసాయ రంగంలో ఉన్న వారిలో అధికులు చాలా తక్కువ విస్తీర్ణం పొలం గలవారై ఉంటారు. వారు సాగు చేసే విస్తీర్ణం కూడా చాలా తక్కువగా ఉంటుంది. అంటే వ్యవసాయ రంగంలో ఉన్న వారిలో అధికులు ఏ నిర్మాణాత్మకమైన వ్యవసాయ సంబంధమైన పని చేయకుండా సోమరిగా మిగిలిపోతారు. మన జాతీయ డివిడెండ్ పడిపోవడం కూడా రైతులు సోమరిగా మిగిలిపోవడానికి గల కారణం. భూమిపై రైతులు ఎక్కువ వత్తిడి తీసుకురావడం వల్ల దేశంలో గ్రామీణీకరణ పెరుగుతోంది. ప్రపంచ వ్యాప్తంగా భూమిపై వత్తిడి పెరిగిపోతుండటమే చిన్న కమతాలు ప్రపంచవ్యాప్తంగా ఉనికిలో ఉండటానికి కారణం. ఇది భూమిపై వత్తిడి ప్రభావాన్ని అంచనా వేయడంలో వైఫల్యమేనని అది వారసత్వ చట్టాన్ని సమస్యాత్మకంగా మారుస్తోందని అంబేద్కర్ వ్యాఖ్యానించారు.

చిన్న కమతాల వల్ల ఇబ్బందులు భారతదేశంలో ప్రాథమికమైనవి కావని అంబేద్కర్ పేర్కొన్నారు. సామాజిక ఆర్థిక రంగంలో దీర్ఘకాలంగా వస్తున్న అనుచిత ధోరణుల వల్ల ఉత్పన్నమైనటువంటివని అన్నారు. భూమి ముక్కలు ముక్కలుగా చీలి పోకుండా నివారించేందుకు

కమతాలనన్నిటినీ విలీనం చేయడమే పరిష్కారమని సూచించారు. ప్రస్తుత సామాజిక రాజకీయ వ్యవస్థలో ఇది సాధ్యం కాదు. ఇది కేవలం న్యాయపరంగా తీసుకున్న కంటితుడుపు చర్య మాత్రమేనని పేర్కొంది.

ఏకవ్యక్తి వారసత్వపాలనా విధానాన్ని అనుసరించిన తరువాత ఆదర్శప్రాయమైన ఆర్థిక హోల్డింగ్‌ను నిర్ణీత పరిమాణం మేరకు సర్వే సభ్యునికి అవకాశం కల్పించబడుతుంది. ప్రత్యేక గుర్తింపు నెంబర్‌ను కేటాయించి కేటాయించే భూమి ఆర్థిక యూనిట్‌కు తక్కువ స్థాయిలో ఉండరాదు. అంబేద్కర్ ప్రతిపాదించిన ఆర్థిక యూనిట్ ఈ విధంగా ఉంది. విలీనం, భూసేద్యం ఒకదానికి కొకటి భిన్నంగా ఆలోచించడం కూడా సాధ్యం కాని రీతిలో పరస్పర సంబంధమైన అంశాలని అంబేద్కర్ పేర్కొన్నారు.

పారిశ్రామికీకరణ వ్యవసాయ రంగ అభివృద్ధికి ఏ విధంగా దోహదం చేస్తుందో వివరించే 'లండన్‌టైమ్స్' పత్రికలో పేర్కొన్న అంశాలను అంబేద్కర్ తన వ్యాసంలో (పత్రికలో) పొందు పరిచారు. ఆయన వివరణ ఈ విధంగా ఉంది. "పారిశ్రామికీకరణ విలీనానికి అవకాశం కల్పిస్తుంది. భూమిపై ఒత్తిడిని అది తగ్గిస్తుంది. తర్వాత లభించిన ప్రయోజనాలను మరింత పటిష్టం చేసుకోవడానికి దోహదం చేస్తుంది. భవిష్యత్తులో మళ్ళీ విభిన్న భాగాలుగా విడిపోవడానికి, విలీనం కావడానికి అవరోధంగా నిలుస్తుంది."

ఖోటీ వ్యవస్థ మాజీ ముంబాయి రెసిడెన్సీలో అమలులో ఉన్న స్వల్ప వ్యవసాదాయ వ్యవస్థ. అది ఎక్కువగా రత్నగిరి జిల్లాలో, కొలాబా, థానా జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఇది ఎక్కువగా వ్యాప్తిలో ఉండేది. ఆ ప్రాంతంలో వ్యవసాయ కార్మికులను దోపిడీ చేసి నిరుపేదగా మార్చే ఈ వ్యవస్థ ప్రధాన సమస్యగా ఉండేది. రైత్వారీ (వ్యవసాయ కూలీల యాజమాన్యం) వ్యవస్థలో భూమి ఎవరి అధీనంలో ఉంటుందో వారి వద్ద నుండి ప్రభుత్వం శిస్తులను నేరుగా వసూలు చేసేది. ఖోటీ వ్యవస్థలో శిస్తులు నేరుగా వసూలు చేసేందుకు ప్రభుత్వం ఖోటీల సేవలు స్వీకరించింది.

ఈ వ్యవస్థపై మొట్టమొదటిసారిగా నిరసన వ్యక్తం చేసింది అంబేద్కరే. ఖోటి వ్యవస్థ రద్దుకు పోరాటం జరపాల్సిందిగా ఆయన 1929 ఏప్రిల్‌లో రత్నగిరిలో జరిగిన అణచివేతకు గురవుతున్న వర్గాల సదస్సులో పిలుపునిచ్చారు. ఖోటి వ్యవస్థ రద్దుకు ఉద్దేశించిన ఒక బిల్లును బొంబాయి శాసన మండలిలో 1937 సెప్టెంబర్ 7న ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ద్వారా కౌలుదారులకు యాజమాన్య హక్కులు కల్పించడం, రైత్వారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయ వ్యవస్థను రూపొందించడం అంబేద్కర్ ధ్యేయంగా ఉంది.

ఆయన తన బిల్లులోని ఉద్దేశాలను ఈ విధంగా వివరించారు.

"(1) ఖోటీ వ్యవస్థను రద్దుచేసి ప్రభుత్వం, మేనేజ్‌మెంట్ లేదా ఖోటీ వ్యవస్థ ద్వారా లబ్ధిపొందుతూ భూమి వాస్తవంగా ఎవరి అధీనంలో ఉన్నదో వారు

ప్రభుత్వం నేరుగా సంబంధాలు నెలకొల్పడం (2) హక్కులు కోల్పోయిన ఖోటీలకు సముచితమైన నష్టపరిహారం లభించేలా అవకాశం కల్పించడం (3) భూమి శిస్తు కొరకు అనుగుణంగా భూమి ఎవరి అధీనంలో ఉంటుందో వారికి యాజమాన్య హక్కులు కల్పించడం. ఖోటీ వ్యవస్థ భూమి శిస్తు కోడ్ క్రిందకు రాదు. అది పూర్తిగా విభిన్నమైన అంశం.

వారసత్వ కార్యాలయాల చట్టం ప్రకారం మహర్‌పదవిలో ఉన్న వారు రేయింబవళ్ళు పని చేయాల్సి ఉంటుంది. మహర్ లేని పక్షంలో అతని తండ్రి లేదా కుటుంబంలోని ఇతర సభ్యుడ్ని ప్రభుత్వ సర్వీసులోకి తీసుకుంటారు. ఈ కష్టానికి గాను వారికి వతన్ పేరుతో కొంతభూమి ఇచ్చేవారు. గ్రామస్థులు కొన్ని మొక్కజొన్నలు ఇచ్చేవారు. నెలకు రెండు అణాలనుండి రూపాయిన్నర వరకు స్వల్ప నెలసరి వేతనం లభించేది. మహర్లు ఆత్మగౌరవం కోల్పోయి జీవించాల్సి వచ్చేది. వారి ఆకాంక్షలు, శక్తియుక్తులు నికృష్ట ఉద్యోగాలచాటున అణచివేయబడేవి. ఈ విధానం మహర్ వర్గాన్ని క్షీణింపచేసిన విషయాన్ని అంబేద్కర్ గుర్తించారు. ఆ పరిస్థితి నుండి వారికి విముక్తి కల్పించాలని ఆయన సంకల్పించుకున్నారు. 1874 బొంబాయి వంశ పారంపర్య ఉద్యోగాల చట్టాన్ని సవరించేందుకు ఉద్దేశించిన ఒక బిల్లును ఆయన 1928 మార్చి 19న బొంబాయి శాసనమండలిలో ప్రవేశపెట్టారు.

ఈ బిల్లు లక్ష్యాలను ఆయన ఈ విధంగా పేర్కొన్నారు.

(1) వతన్‌దార్లకు మెరుగైన ప్రతిఫలం పొందే అవకాశం కల్పించడం

(2) వంశపారం పర్యంగా వస్తున్న గ్రామసేవకుల మధ్య సంబంధాలకు అవకాశం కల్పించడం

(3) బలూటాను ద్రవ్య సుంకంగా మార్చటం

(4) రైతులకు సేవ చేయాలనే బాధ్యతల నుండి తక్కువ స్థాయి గల వతన్ దార్లకు విముక్తి కల్పించడం

(5) వతన్‌దార్ల బాధ్యతలను, విధులకు స్పష్టంగా నిర్వచించడం

ఈ బిల్లు ఉద్దేశ్యాలు, లక్ష్యాలను అనేక సమావేశాలు, సదస్సుల్లో అంబేద్కర్ స్పష్టం చేశారు. మొదటిది వతన్‌దార్లు తమ బాధ్యతలను బదిలీ చేసుకునే స్వేచ్ఛ కల్పించడం, రెండవది కొన్ని రకాల వేతనదార్లకు ప్రతిఫలం చెల్లింపుతో అదనపు భద్రత కల్పించడం ఇక మూడవది వతన్‌దార్ల బాధ్యతలను స్పష్టంగా నిర్వచించడం. 1928 ఆగష్టు 3న బొంబాయి శాసనమండలిలో బిల్లును ప్రవేశపెడుతూ అంబేద్కర్ సుదీర్ఘ ప్రసంగం చేశారు. పురాతన కాలంలో చక్రవర్తులు భూములను మహర్లకు ఇచ్చిన విషయాన్ని అంబేద్కర్ సభ దృష్టికి తీసుకువచ్చారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ భూమి విస్తీర్ణాన్ని పెంచడం గానీ, వారికి చెల్లించే ప్రతిఫలంపై దృష్టి సారించడంగానీ చెయ్యలేదు. అసలు వారికి లభించే ఆదాయం కూడా లెక్కలోకి రాదు. వతన్ భూములను వాటి స్వాధీన దారులకు పూర్తి అంచనా విలువకు ఇవ్వాలి. సేవలు చేసే బాధ్యతల నుండి

వారికి విముక్తి కల్పించాలి. మహర్ల భూమికపై విధించే శిస్తునుండి లభించే ఆదాయం నుండి, బలూటా నుండి వారికి ప్రతిఫలం చెల్లించాలి. బలూటా అంటే వతన్‌దార్ మహర్లు గ్రామస్థుల నుండి సేకరించిన ధాన్యం.

అంబేద్కర్ ఇలా అన్నారు.

> "ఇటువంటి బిల్లు కావాలని మహర్లు కోరుకుంటున్న విషయాన్ని నేను సభకు స్పష్టంగా చెప్పగలను. అసౌకర్యం లేదా మరే ఇతర కారణం చూపి మహర్లకు విముక్తి కల్పించేందుకు ప్రభుత్వం నిరాకరిస్తే రెవెన్యూ విభాగం, మహర్ల మధ్య పోరాటం అనివార్యం. ఈ బిల్లు ఆమోదానికి నోచుకోకపోతే నా జీవితంలో శేషభాగాన్ని మహర్లు సమ్మె చేసేలా ప్రోత్సహించడంలో వెచ్చిస్తాను."

మహర్ వర్గం పురోభివృద్ధిలో వతన్ వ్యవస్థ పెద్ద అవరోధమని అంటూ అంబేద్కర్ తన ప్రసంగం ముగించారు. బిల్లును 23 మంది సభ్యుల సభా సంఘానికి నివేదించారు. 1929 జూన్ ప్రారంభంలోగా నివేదిక సమర్పించాలని సభా సంఘాన్ని కోరడం జరిగింది. సభా సంఘం బిల్లును గుర్తుపట్టేందుకు వీలులేని విధంగా మార్చివేసింది. బలూటాను ద్రవ్య సుంకంగా మార్చాలని అంబేద్కర్ ప్రతిపాదించారు. పూర్తి అంచనా విలువ చెల్లింపు ప్రాతిపదికగా వతన్ భూములను వతన్‌దారులకు అప్పగించరాదని కమిటీ అభిప్రాయపడింది. పొలం నుండి లభించే ఆదాయంలో సగం ధరకు అప్పగించాలని సూచించింది. స్వార్థ శక్తుల ప్రతినిధులు ఈ బిల్లు మౌలిక లక్ష్యాన్ని వ్యతిరేకించారు. చిట్టచివరకు 1929 జూలై 24న అంబేద్కర్ ఈ బిల్లును ఉపసంహరించుకున్నారు.

భూమి శిస్తు నుండి మహర్లకు మినహాయింపు కల్పించారు. వారికి వతన్ భూముల క్రింద భూములిచ్చారు. పేష్వాల హయాం నుండి మహర్ల నుండి తక్కువ మొత్తం అసెస్‌మెంట్ వసూలు చేయడం జరిగింది. వతన్‌దారీ మహర్ల నుండి వసూలు చేసిన మొత్తాన్ని జూడీ అని పిలిచేవారు. అయితే ఇది నగదు రూపంలో కాకుండా మొక్కజొన్నల రూపంలో ఉండేది. మహర్ లీడర్లు జూడీని అసెస్‌మెంట్‌కు మార్చాలని కోరుకున్నారు. ప్రభుత్వానికి, గ్రామస్తులకు తామందిస్తున్న సేవలకు గాను నెలసరి వేతనాలు చెల్లించాలని వారు కోరుకునేవారు. ఈ పద్ధతిని వ్యతిరేకించాలని బొంబాయి ప్రెసిడెన్సీలో మొట్టమొదటి కాంగ్రెస్ ప్రభుత్వం (1937 – 39) నిర్ణయించింది. అహ్మద్‌నగర్ జిల్లాలోని హరేగావ్‌లో 1939 డిసెంబర్ 16న సమావేశం నిర్వహించబడింది. బొంబాయి గవర్నర్‌కు నివేదిక సమర్పించారు. జూడీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం ప్రారంభమైంది. బొంబాయి ప్రభుత్వం అంబేద్కర్‌తో సమావేశమైంది. తమ వతన్ భూములను రైత్వారీ భూములుగా మార్చాలని, తమను దిగువ తరగతి సేవకులుగా గుర్తించి నెలసరి వేతనాలు చెల్లించాలని, ప్రభుత్వ సేవలకు మాత్రమే తమను వినియోగించాలనేవి ప్రభుత్వం ముందు మహర్లు ఉంచిన డిమాండ్లు.

1927 నుండి తాను పోరాటం చేస్తున్న మహర్ వతన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 1937 సెప్టెంబర్ 17న బొంబాయి శాసనమండలి పూనా సమావేశంలో అంబేద్కర్

మరోసారి బిల్లును ప్రవేశపెట్టారు. ఈ బిల్లును ప్రవేశపెట్టడం వెనుక మూడు ధ్యేయాలున్నాయి. మొదటిది వతన్‌ను మార్చుకునేందుకు అనుమతి ఇవ్వడం, కొన్ని తరగతుల వతన్‌దార్లకు ప్రతిఫలం చెల్లింపులో అదనపు భద్రత కల్పించడం రెండవది కాగా ఇక మూడవది వతన్‌దార్లు నిర్వహించాల్సిన బాధ్యతలను నిర్దిష్టంగా నిర్వచించడం.

వ్యవసాయ కార్మికుల బానిసత్వం రద్దుకు భారతదేశంలో బిల్లు తీసుకు వచ్చిన తొలి శాసనసభ్యుడు అంబేద్కర్. న్యాయం, రాజ్యాంగబద్ధమైన విధానాల ద్వారా మహర్ వతన్ సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరుకున్నారు. వతన్ వ్యవస్థపై ప్రారంభమైన ఆందోళన సత్యాగ్రహంగా మారాలని తాను కోరుకోవడం లేదని గైక్వాడ్‌కు రాసిన లేఖలో ఆయన పేర్కొన్నారు. యుద్ధం కారణంగా అత్యవసర పరిస్థితి నెలకొని వున్న సమయంలో మహర్ల పోరాటం సమంజసం కాదని ప్రభుత్వం పేర్కొంది. వైస్రాయ్ కార్యనిర్వాహక మండలిలో సభ్యుడైన తరువాత ఉద్యమాన్ని నిలిపివేయగలనని ఆయన హామీ ఇచ్చారు. పోరాటం జరపడం కంటే వైస్రాయ్ కార్యనిర్వాహక మండలి సభ్యునిగా మహర్ల సంక్షేమం కోసం తాను ఎక్కువగా కృషి చేయగలనని ఆయన భావించారు. జూడీని పెంచబోమని ప్రభుత్వం హామీ ఇచ్చింది. వతన్ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం సల్పేందుకు ఆయన 1956 జూన్ 16న బొంబాయి రాష్ట్ర వెనుకబడ్డ గ్రామాల వతన్‌దార్ అసోసియేషన్‌ను ఆయన నెలకొల్పారు. ఆయన దానికి ఛైర్మన్ అయ్యారు. ఈ అసోసియేషన్ లక్ష్యాలను ఆయన స్పష్టంగా వివరించారు. ప్రభుత్వం ఈ సమస్యను సుహృద్భావపూర్వకంగా పరిష్కరించకపోతే ప్రభుత్వాన్ని ప్రాసిక్యూట్ చేయాలనే తన ఆకాంక్షను వ్యక్తం చేశారు. వతన్‌దార్లకు భూమి ఇచ్చేందుకు గ్రామస్తులు నిరాకరించారు. ఇందుకు తమ వ్యతిరేకతను తమకు అందుబాటులో వున్న అన్ని విధానాల ద్వారా వ్యక్తం చేశారు. మహర్‌వతన్‌దార్ల సమస్య కంటే తమ పశువుల సమస్యే ఎక్కువని వారు భావించారు. 'దున్నే వానికి భూమి' సిద్ధాంతాన్ని ప్రభుత్వం ఆమోదించిందని అంబేద్కర్ తెలిపారు. అయితే ఈ చట్టం పరిధిలోకి ప్రభుత్వ భూములను (పోరంబోకు భూములను) చేర్చేందుకు అది సిద్ధంగా లేదు. వతన్ వ్యవస్థ రాజ్యాంగ నిబంధనలకు వ్యతిరేకమని అంబేద్కర్ భావించారు. ఈ విషయంలో హైకోర్టులో రిట్ పిటిషన్ వేయాలని ఆయన అభిప్రాయపడ్డారు. అక్కడ విజయం సాధించలేకపోతే సుప్రీం కోర్టుకు వెళ్ళాలని భావించారు.

చిట్టచివరకు బొంబాయి ఇన్ఫీరియర్ విలేజ్ వతన్స్ అబాలిషన్ చట్టం 1959 కింద వతన్ వ్యవస్థ రద్దయింది.

భూమి శిస్తు అసెస్‌మెంట్ వ్యవసాయ ఆదాయంపై ఆధారపడి ఉండేది కాదు. భూమి శిస్తును అద్దెగా పరిగణించాలా లేక పన్నుగా భావించాలా అనే విషయమై వివాదం ఏర్పడింది. "అసలు భూమి శిస్తును ఎలా అసెస్ చేస్తారు?" అనేది ఒక్కటే అసలు సమస్య.

వ్యవసాయ ఆదాయం ప్రాతిపదికగా భూమి శిస్తును అసెస్ చేయాలని భావించబడింది. అయితే ఇది సరైన పద్ధతి కాదని అంబేద్కర్ భావించారు. ఈ విషయాన్నే తాను రాసిన ఒక వ్యాసంలో వివరించారు. అసెస్‌మెంట్ శాతం పన్ను చెల్లింపు సామర్థ్యంపై ఆధారపడి ఉండలేదు. ఆదాయం పెరిగిన కొద్దీ పన్ను చెల్లించే సామర్థ్యం పెరుగుతుంది. అందువల్ల పన్ను అసెస్‌మెంట్ వ్యవస్థ అసమంజసంగా ఉందని ఆయన భావించారు. అందరి

పద్ద నుండి సమానమైన పన్నులు వసూలు చేయడం సరికాదు. ఒక నిర్దిష్ట ఆదాయం పరిమితికి దిగువ స్థాయిలో ఉన్న వారికి పన్ను మినహాయించాలి. భూమి శిస్తును పేదలు, ధనవంతులకు ఒకే మాదిరిగా విధిస్తున్నారు. భూమి శిస్తు కోడ్ 107వ నియమావళిని రద్దు చేయాలని అంబేద్కర్ సూచించారు. వ్యవసాయ ఆదాయాన్ని ఆదాయపు పన్ను నిబంధనల పరిధిలోకి తీసుకురావాలని పేర్కొన్నారు.

వ్యవసాయ కార్మికుల కష్టాలు భూకామందుల జల్సాల్లో ఉత్పన్నమవుతాయని అంబేద్కర్ పేర్కొన్నారు. సాగు చెయ్యని భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని దానిని భూమిలేని వ్యవసాయ కార్మికులకు అప్పగించడం ద్వారా వారి సమస్యలను పరిష్కరించడం తక్షణ అవసరమని ఆయన సూచించారు. భూమిలేని వ్యవసాయ కార్మికుల విషయంలో భూమి కోసం ఆరాటం కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. దానిని సంతృప్తి పరిచేందుకు తీసుకువచ్చిన కౌలుదారీ చట్టం వ్యవసాయ కార్మికుల సమస్యలను పరిష్కరించలేకపోయింది. భూకమతాల విలీనం, కౌలుదారీ చట్టం నిరుపయోగాలుగా మారిపోయాయి. వ్యవసాయంలో సౌభాగ్యం తీసుకురావడంలో అవి కృతకృత్యం కాలేకపోయాయి. "వాటి వల్ల భూమిలేని వ్యవసాయ కార్మికులైన అస్పృశ్యులకు ఎటువంటి మేలు చేకూరలేదు. సమిష్టి వ్యవసాయం మాత్రమే వారికి సహాయపడుతుంది."

భూమి శిస్తు వ్యవస్థలో భూకామందుదారీ విధానం అనుచితంగా ఉంది. దానిని రద్దు చెయ్యాలని అంబేద్కర్ డిమాండ్ చేశారు. ఆయన ఈ విధంగా అన్నారు.

> "అవును, నేను అంగీకరిస్తాను. భూకామందు వ్యవస్థను రద్దు చేసిన తరువాత ప్రభుత్వమే భూమి యజమాని కావాలి. వ్యవసాయ కార్మికుడు కాదు. భూకామందుదారీతనాన్ని రద్దు చేయడం వల్ల ఏర్పడే సహజ పరిణామం సమిష్టి లేదా సహకార వ్యవసాయ విధానం కావాలి. అయితే మనం కూడా మనుష్యులమే. సహకార వ్యవసాయ విధానం ఉపయోగకరం, ఉత్పత్తి పెంచేది అయినప్పటికీ మన వ్యవస్థపై జరుగుతున్న దాడిగా వ్యవసాయ కార్మికుడు భావిస్తాడు. మన వ్యవసాయదారుల వ్యక్తిగత విధానాలే ఇందుకు కారణం. భూకామందు వ్యవస్థను రద్దు చేసినప్పటికీ మన ఆర్థిక రంగాన్ని ఈ పద్ధతుల ద్వారా పటిష్టం చేసుకోలేం. మన వ్యవసాయ కార్మికుల ఆలోచనా విధానంలోనే సమగ్ర మార్పు రావాలి. అప్పుడు మాత్రమే యజమానుల కట్టు బానిసత్వం నుండి వారికి విముక్తి కల్పించేందుకు చేస్తున్న విప్లవాత్మక ప్రయత్నాలు ఫలితాలనిస్తాయి."

వ్యవసాయ ఉత్పాదకతను పెంచేందుకు భూమి తనఖా బ్యాంకుల, వ్యవసాయోత్పత్తిదారుల సహకార సంఘాలు, మార్కెటింగ్ సొసైటీలను ప్రారంభించాలని ఐసిపి సూచించింది. వ్యవసాయ భూమిని చిన్న చిన్న విభాగాలుగా విభజించడం వల్ల జనాభా సమస్య వల్ల ఉత్పన్నమయ్యే వత్తిడి ప్రభావం భూమిపై పడుతోంది. ఇది వ్యవసాయదారుల పేదరికానికి నేరుగా కారణమవుతోంది. వ్యవసాయ కౌలుదార్లను రక్షించడం తక్షణ అవసరం.

పారిశ్రామిక కార్మికులు పొందుతున్న ప్రయోజనాలను వ్యవసాయ కార్మికులకు కూడా విస్తరింపచెయ్యాలి. నిరుద్యోగులకు, భూమిలేనివారికి భూములను కేటాయించడం ద్వారా భూ సమస్యను పరిష్కరించాలి. పారిశ్రామికాభివృద్ధి జరిగినప్పటికీ వ్యవసాయమే భారతదేశ ఆర్థిక వ్యవస్థ పునాదిగా కొనసాగుతోంది. వ్యవసాయోత్పత్తిని పెంచేందుకు యంత్రాలను వినియోగించడం, భారీ విస్తీర్ణంలో ఉన్న భూములు, సహకార, సమిష్టి వ్యవసాయ విధానాలను ప్రవేశపెట్టడం వంటి విధానాలను రూపొందించాలి. వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాల చట్టాన్ని ప్రవేశపెట్టాలి.

షెడ్యూల్డ్ కులాల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యల విషయమై అఖిల భారత షెడ్యూల్డ్ కులాల సమాఖ్య తరపున భారత రాజ్యాంగ పరిషత్‌కు సమర్పించేందుకై అంబేద్కర్ ఒక వినతిపత్రం రూపొందించారు. 'స్టేట్స్ అండ్ మైనారిటీస్' పేరుతో 1947లో ఒక బ్రోచర్‌ను ప్రచురించారు. అస్పృశ్యులు స్పృశ్యులపై ఆర్థికంగా అధారపడ్డవారని అంబేద్కర్ భావించారు. ఆర్థికంగా – సామాజికంగా పటిష్టంగా ఉన్న హిందువులు, ఆర్థికంగా – సంఖ్యాపరంగా బలహీనంగా వున్న అస్పృశ్యుల మధ్య పోటీని హిందువుల కులాలు, అస్పృశ్యుల మధ్య యుద్ధంగా ఆయన భావించారు. ప్రభుత్వ యాజమాన్యంలో సమిష్టి వ్యవసాయం, పరిశ్రమల రంగంలో ప్రభుత్వ సోషలిజాన్ని ఆయన ప్రతిపాదించారు. వ్యవసాయం, పరిశ్రమలకు అవసరమైన పెట్టుబడిని ప్రభుత్వమే సమకూర్చాలని సూచించారు. భారతదేశం వేగంగా, పారిశ్రామికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వ సోషలిజం అత్యవసరమని ఆయన అన్నారు.

ఎస్.ఎ. డాంగేతో అంబేద్కర్ కొన్ని సమస్యల గురించి చర్చించారు. "అందరికీ ఇచ్చేందుకు సరిపడా భూమి ఎక్కడ ఉంది?" అని అంబేద్కర్ ప్రశ్నించారు. ఆయన ఇంకా ఈ విధంగా అన్నారు. "నేను రష్యా వ్యవస్థకు ప్రాధాన్యతనిస్తాను. ఈ సమస్యల పరిష్కారానికి సమిష్టి వ్యవసాయమే పరిష్కారం. నా ఉద్దేశంలో సోవియట్ తరహా వ్యవసాయ విధానమే ఉత్తమం."

## సెక్షన్-2

### కరెన్సీ సమస్యలు

కరెన్సీ సమస్యల గురించి అంబేద్కర్ తన ది ప్రాబ్లమ్ ఆఫ్ ది రూపీ (1923లో ప్రచురింపబడింది) పుస్తకంలో, 1926లో హిల్టన్ యంగ్ కమిషన్ ముందు ఇచ్చిన సాక్ష్యంలో ప్రస్తావించారు.

ఎక్స్ఛేంజ్ స్టాండర్డ్ ఏర్పాటుకు దారి తీసిన పరిస్థితులు దాని సిద్ధాంత ప్రాతిపదిక గురించి విశ్లేషించేందుకు అంబేద్కర్ ప్రయత్నించారు. ఎక్స్ఛేంజ్ స్టాండర్డ్ అనేది భారత ప్రభుత్వం వాస్తవంగా ప్రతిపాదించిన ప్రమాణాలనే భావనను కొంతమంది రచయితలు ప్రచారం చేశారు. అయితే ఇందులో స్థూలమైన పొరపాటు ఉందని అంబేద్కర్ గుర్తించారు. ఆయన ఈ విధంగా వ్యాఖ్యానించారు.

"సాధారణ కొనుగోలు శక్తిని స్థిరీకరించకపోతే ఏదీ స్థిరీకరింపబడదనే విషయాన్ని ప్రొఫెసర్ కీన్స్ విస్మరించినట్లు కనిపిస్తోంది. తేడా అంతా ఈ ప్రాథమిక అంశం నుండే ఏర్పడుతోంది. ఎక్స్చేంజ్ స్టాండర్డ్ ఒక్కటే సరిపోదు. ఆ ప్రమాణం వ్యాధి మూలం గురించి కాకుండా వ్యాధి లక్షణాల గురించి మాత్రమే యోచిస్తుంది. ఇది సమస్య తీవ్రతను పెంచుతుంది."

ఎక్స్చేంజ్ స్టాండర్డ్‌ను అంబేద్కర్ వ్యతిరేకించారు. మారకానికి సాధ్యం కాని నిర్ణీత పరిమితి మేరకు రూపాయిని జారీ చేయడమే ఉత్తమమని అంబేద్కర్ పేర్కొన్నారు. రూపాయిలను కరిగించి బులియన్లుగా విక్రయించి ఆ మొత్తాన్ని రెవెన్యూ నిమిత్తం, లోటును మార్పుకు సాధ్యం కాని కాగితంతో భర్తీ చేయడమే పరిపూర్ణమైన హేతుబద్ధమైన చర్య కాగలదు. అయితే దీనిని గురించి అంబేద్కర్ వత్తిడి చెయ్యలేదు. మింట్‌ను మూసివెయ్యడమే కీలకమైన అంశం. "బంగారం నిల్వల ప్రాతిపదికగా స్థిరమైన రూపాయి విలువతో ముద్రించే భారత కరెన్సీ ఇంగ్లీష్ కరెన్సీ వ్యవస్థ నిబంధనలకు అనుగుణంగా ఉంటుందని చెప్పేందుకు నేను సాహసిస్తున్నాను" అన్నారు. ఫౌలర్ కమిటీ నివేదికను అర్థరహితమైనదిగా అంబేద్కర్ వ్యాఖ్యానించారు. "భారతీయ కరెన్సీ నిలకడగా ఉండాలంటే ఫౌలర్ కమిటీ సిద్ధాంతాలను ప్రక్కన పెట్టాలి అని అంబేద్కర్ స్పష్టం చేశారు. ఈ మొత్తం వాదన ఒకే అంశంపై కేంద్రీకరించబడి ఉంది. కరెన్సీలో వివిధ విభాగాల మధ్య స్థిరమైన విలువ కలిగి ఉండటం సక్రమంగా నిర్వహించబడుతున్న ఆర్థిక వ్యవస్థ ముఖ్యావసరం. అలా స్థిరమైన విలువ లేని పక్షంలో అది కూడా ఒక వస్తువు లేదా సరుకుగా మారిపోతుంది. దాని విలువ మార్కెట్ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది.

ఎక్స్చేంజ్ స్టాండర్డ్ పట్ల ఛాంబర్లియన్ కమిషన్ సానుకూలత వ్యక్తం చేసింది. ప్రభుత్వ ఫైనాన్సెస్ తేలికతనం, వ్యాపారాభివృద్ధి పట్ల కమిషన్ ఆకర్షితురాలైంది. బంగారంతో సమానంగా ఒక నిర్దిష్ట విలువ వద్ద రూపాయి మారకపు విలువను స్థిరీకరించగల కరెన్సీ వ్యవస్థపై అది ప్రధానంగా ఆధారపడింది.

"బంగారంతో సమాన విలువను కాపాడుకోవడంలో రూపాయి విఫలమైందా?" అని అంబేద్కర్ ప్రశ్నించారు. "రూపాయి విలువ పతనం కావడానికి ఒకే ఒక్క శాస్త్రీయ కారణం అది తన కొనుగోలు శక్తిని కోల్పోవడమే"నని అంబేద్కర్ అన్నారు. ఈ వివరణతో భారత ప్రభుత్వం ఏకీభవించలేదు. బంగారంతో రూపాయి విలువ తగ్గడానికి వ్యాపార ప్రతికూల సమతుల్య పరిస్థితే కారణమన్నది అధికార వర్గాల వివరణ. కీన్స్, షిర్రాస్ వంటి ప్రముఖులు కూడా మారకపు ప్రముఖులు, మద్దతుదారులు కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఛాంబర్లియన్ కమిషన్ గానీ, స్మిత్ కమిటీ గానీ భారత దేశంలో ధరల పెరుగుదల గురించి పట్టించుకోలేదనేది అంబేద్కర్ ప్రధాన విమర్శ. భారతదేశంలో ధరలు బంగారం ధరలతో సమానంగా కాకుండా అంతకంటే ఎక్కువగానే పెరిగాయని ఆయన అన్నారు. కీన్స్ కూడా దీనితో ఏకీభవించారు. ఈ వైరుధ్యాన్ని ఆయన ఈ విధంగా వివరించారు. రెండు కరెన్సీలకు సంబంధించి మారకపు విలువలు అన్ని రకాల వస్తువులకు కాకుండా కొన్నిటిపై

మాత్రమే, అంటే దేశంలో అంతర్లీనంగా వర్తకమయ్యే కొన్ని రకాల వస్తువులపై మాత్రమే సమానంగా ఉంటాయి." ఆయన తన వాదనలను ఈ విధంగా సంక్షిప్తీకరించారు.

"భారత ప్రజల సంక్షేమానికి కరెన్సీ రూపాయే ప్రధాన ఆందోళన కారకంగా ఉంది. రూపాయి ముద్రణకు సంబంధించిన సూత్రాలే ఇందుకు దోహదం చేస్తున్నాయి. ప్రొఫెసర్ కీన్స్, షిర్రాస్, ఛాంబర్లియయన్ కమిషన్ దీనికి మద్దతు తెలపడం ఆశ్చర్యం కలిగించే విషయం. అంతగా పరిపూర్ణతలేని సూత్రాలపై రూపాయి కరెన్సీ నిర్వహించే ప్రభుత్వ సామర్థ్యాన్ని మనం సరి చెయ్యలేం."

అందుబాటులో ఉన్న రూపాయి కాయిన్ లాభాలను దేశ నైతికత, భౌతిక అభివృద్ధికి ఉపయోగించడంలో ప్రభుత్వ వైఫల్యాన్ని నిందించిన జి.ఆర్. గోఖలే, ప్రొఫెసర్ వి.జి. కాలే వైఖరిని అంబేద్కర్ విమర్శించారు. 1907లో రూపాయిపై గడించిన లాభాలను రైల్వేల విస్తరణకు ఉపయోగించారు. కరెన్సీని దుర్వినియోగం చెయ్యడం వల్ల సంభవించే ప్రమాదాలను అంబేద్కర్ ఈ విధంగా వివరించారు.

"నిర్వహణ తీరును మార్చడం అవసరమైతే మారకపు విధానం సరైంది కాదు. అలా మారిన రూపాయి విలువ కూడా మనం ఏర్పరచుకున్నదే. రూపాయి నాణేల ముద్రణను నిలిపివేయడమే భారత కరెన్సీ నిర్వహణలో ప్రభుత్వ జోక్యాన్ని అంతమొందింపచేస్తుంది. దీనినే మనం డిమాండ్ చేయాల్సి ఉంది. ఆశ్చర్యంగా కనిపించవచ్చు గానీ నిర్దిష్ట పరిమితిలో మార్పు చెయ్యడానికి వీలులేని రూపాయిలోనే భద్రత దాగి ఉంది.

భారత కరెన్సీ, ఫైనాన్స్‌పై రాయల్ కమిషన్‌ను (ఛైర్మన్ : హిల్టన్‌యంగ్) 1925లో నియమించారు. ఆర్థికవేత్తగా అంబేద్కర్ కమిషన్ ముందు హాజరై తన అభిప్రాయాలు తెలియజేశారు. ఎంపిక చేసుకోవాల్సింది బంగారం ప్రమాణం, బంగారం మార్పిడి మధ్య ప్రమాణం కాదని బంగారం ప్రమాణం ప్రొఫెసర్ జెవాన్‌ని మధ్య ప్రమాణం లేదా ప్రొఫెసర్ ఫిషర్ పరిహార ప్రమాణం మధ్య అని అంబేద్కర్ పేర్కొన్నారు. బంగారం ప్రమాణం అంటే కరెన్సీ ముద్రణ స్వయంగా ఉన్నది కాకుండా ఆయా సమయాల్లో ఉండే ధర. కరెన్సీకి అదే ప్రమాణంగా వుంది.

మారకపు విలువ కంటే స్థిర విలువకే అంబేద్కర్ సానుకూలత చూపారు. మారకపు వ్యవస్థ అన్నది మనం రూపొందించుకున్నది. నిర్ణీత విలువ పద్ధతిని అనుసరించడం వల్ల కరెన్సీలో బంగారానికి మరింత ప్రాధాన్యత ఇవ్వడం సాధ్యపడుతుంది.

బంగారం తరుగుదల వల్లనే ధరలు పెరిగాయి. అందువల్ల దానిని పెంచాల్సి ఉంది. 1910 తరువాత బంగారం ఉత్పత్తి పెరిగింది. అందువల్ల ఎక్స్ఛేంజ్ స్టాండర్డ్‌ను కొనసాగించడం వల్ల ధరల పెరుగుదలను అరికట్టడం వివిధ దేశాలకు సాధ్యం కాలేదు. అంతేకాకుండా అది ధరల పెరుగుదలకు నేరుగా కారణమైంది. యుద్ధ సమయంలో కాగిత ద్రవ్యం ఉపయోగించడం బంగారం విలువ మరింత తగ్గడానికి దోహదం చేసింది. కరెన్సీగా బంగారాన్ని వినియోగించడంలో పొదుపు పాటించడమే ఇందుకు కారణం.

బంగారం స్టాండర్డ్ రిజర్వ్ ఒక విధంగా వింతైన విషయం. ఆస్తులు అంటే రిజర్వ్, అప్పులు అంటే రూపాయల మధ్య ప్రమాదకరమైన అంతర్గత సంబంధం ఉంది. కరెన్సీ రూపాయి పెరగకుండా రిజర్వ్‌ను పెంచడం సాధ్యం కాదు. రూపాయి కాయిన్ల నుండి వచ్చిన లాభాలతో రిజర్వ్ నిర్వహిస్తారు. అందువల్లనే బంగారం స్టాండర్డ్ రిజర్వ్ విధానానికి అంబేద్కర్ సానుకూలత వ్యక్తం చేయలేదు. కరెన్సీ విలువ స్థిరీకరణకు ఇది ఆచరణాత్మకంగా ఎంతమాత్రం ఉపయోగకరం కాదని అన్నారు.

ఎక్స్ఛేంజ్ స్టాండర్డ్‌కు, గోల్డ్‌స్టాండర్డ్ రిజర్వ్ స్థానంలో కరెన్సీ వ్యవస్థను నెలకొల్పడం ఉత్తమమని అంబేద్కర్ నిర్ధారించారు. రూపాయి కరెన్సీని గణనీయంగా తగ్గించేందుకు గోల్డ్ స్టాండర్డ్ రిజర్వ్‌లో కొంత భాగాన్ని వినియోగించాలని సూచించారు. రిజర్వ్ తరుగుదల సమయంలో కూడా అది ఆయా సందర్భాల అవసరాలకు తగిన విధంగానే ఉంటుందని అన్నారు. యూరోపియన్ దేశాల్లో సమస్య కరెన్సీ తగ్గించడానికి సంబంధించిందిగా ఉంటుంది. అంటే దాని విలువ పెరుగుతుంది. అది ధరలను తగ్గించడానికి దోహదం చేస్తుంది. భారతదేశంలో సమస్య కరెన్సీ పెంచడానికి సంబంధించింది. అంటే దాని విలువ తగ్గించడం. ఇది ధరల పెరుగుదలకు దోహదం చేస్తుంది.

మారకం అంతర్గత ధరల స్థాయి ఒకదాని మీద మరొకటి ఆధారపడి ఉంటాయి. అయితే మారకపు విలువ, దేశ మొత్తం ధరల స్థాయి మధ్య సంపూర్ణ సమన్వయం సాధ్యం కాదని అంబేద్కర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ వాణిజ్యంలో ప్రవేశించిన వస్తువులపైనే మారకపు విలువ ప్రభావం చూపింది. అంబేద్కర్ మారకపు నిష్పత్తుల కంటే ధరల గురించే ఎక్కువ ఆలోచించారు. రెండు కరెన్సీల మధ్య మారకపు నిష్పత్తి ఒకే రకంగా ఉన్నప్పటికీ దేశంలో అంతర్గత ధరల స్థాయిలు భిన్నంగా ఉండవచ్చునని ఆయన అంగీకరించారు. అంతర్గత కరెన్సీ, బంగారం ధరలకు మధ్య సంబంధం ఉంటుందనే సిద్ధాంతాన్ని తాను అంగీకరించనని ఆయన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. అంతర్జాతీయ విషయంలో ఇది సుస్థిరంగా ఉండవచ్చునేమోగానీ అంతర్గత వ్యవహారాల విషయంలో నిశ్చలంగా ఉండబోదని ఆయన అన్నారు.

బంగారం వినియోగం పట్ల అంబేద్కర్ మరింత సుముఖత వ్యక్తం చేశారు. బంగారం కూడా ద్రవ్యోల్బణం ప్రభావానికి లోను కావచ్చునని ఆయన అన్నారు. బంగారానికి సంబంధించి అంతర్గత యూనిట్ స్థిరంగా ఉండాలని, అయితే ఇది వస్తువుల రూపంలో ఉండాలని సూచించారు. రూపాయి కాయిన్లను మొత్తానికి నిలిపి వేయాలని, దాని స్థానంలో బంగారాన్ని ఉపయోగించాలని అంబేద్కర్ పేర్కొన్నారు. ప్రొఫెసర్ జెవాన్స్, ప్రొఫెసర్ ఫిషర్‌ల వైఖరిని ఆయన ఖండించారు. ప్రొఫెసర్ ఫిషర్ ఒక నిర్దిష్ట సూచిక మేరకు బంగారం యూనిట్‌లో లోహాన్ని మార్పు చేయవచ్చు. ప్రొఫెసర్ జవాను ఒక నిర్దిష్ట సూచిక మేరకు ఎక్కువ లేదా తక్కువ యూనిట్లను ఇచ్చేందుకు అనుమతించవచ్చు. ఈ రెండు సంక్లిష్టమైనవేనని అంబేద్కర్ అన్నారు. అన్నిటికీ బంగారాన్ని ప్రమాణంగా తీసుకోవడం సముచితమనేది తన భావన అని ఆయన అన్నారు. బంగారాన్ని భారతదేశం కరెన్సీగా ఉపయోగించాలని తాను భావిస్తున్నట్లు

చెప్పారు. బంగారం అన్వయించే యూనిట్‌గా మాత్రమే కాకుండా కరెన్సీగా కూడా వ్యవహరించాలని అన్నారు.

బంగారాన్ని ప్రమాణంగా తీసుకోవడంలో ఉపయోగాలు గురించి ప్రస్తావిస్తూ హెచ్చు తగ్గులపై ఇది నిర్దిష్టమైన పరిమితులు విధిస్తుందని అంబేద్కర్ అన్నారు. ప్రత్యామ్నాయ వ్యవస్థలు ఆచరణ సాధ్యమైనవి కాకపోవడం కూడా ఆయన బంగారాన్ని ప్రమాణంగా తీసుకోవడానికి సుముఖత చూపడానికి ఒక కారణం. ఆయన ఈ అంశాన్ని మరింతగా విశదీకరిస్తూ బంగారాన్ని నేరుగా వినియోగించే బదులు దాని ఆధారంగా ముద్రించే నోట్లను ఉపయోగించడం శ్రేయస్కరమని అన్నారు. "బంగారం ఒకరి నుండి మరొకరికి పరస్పరం బదిలి కావాలన్నది నా ఉద్దేశం కాదు" అన్నారు. బంగారాన్ని ప్రమాణంగా తీసుకోవడం వాణిజ్య సైకిల్ పరిణామాలను మెరుగుపరచలేదని అంబేద్కర్ ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

"ధరల స్థాయిలను సరిదిద్దేందుకు మారకపు వ్యవస్థను తప్పనిసరి చెయ్యాలని సూచిస్తారా?" అని రాయల్ కమిషన్ అంబేద్కర్‌ను ప్రశ్నించింది. అంబేద్కర్ ఈ విధంగా సమాధానమిచ్చారు. 1914లో 1 ఎస్ 4డి, 1926లో 1ఎస్ 4డి ఒకే విధంగా లేవని నేనుచెప్పను. ధరల స్థాయిని తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలి" పశ్చిమదేశాల్లో సమస్యలకు, భారతదేశంలో సమస్యలకు మధ్య తేడా ఏమి లేదని అంబేద్కర్ ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ధరలు స్థిరంగా ఉండటమనేది ప్రధాన సమస్య అన్నారు. బంగారం కరెన్సీలో బంగారం ప్రమాణాల ద్వారా ధరలు నిలకడగా ఉండే విధంగా చెయ్యవచ్చునని సూచించారు. అందువల్ల దేశంలో ధరలు బంగారం ధరలతో ముడిపడి ఉంటాయి. బంగారం ధరలు పెరిగితే ఇతర వస్తువుల ధరలు కూడా పెరుగుతాయి. బంగారం మార్పిడి ప్రమాణాలను ఆటోమేటిక్ చేసినట్లయితే అది నిర్దేశిత లక్ష్యాలను సాధించలేదు " అని అంబేద్కర్ వ్యాఖ్యానించారు. కొంతమంది ఈ అభిప్రాయంతో ఉండవచ్చునని, అయితే అది సరికాదని అన్నారు. అది బంగారం విలువను తగ్గించిందని, అందువల్ల ధరల ప్రమాణంగా ఉపయోగపడదని అన్నారు. బంగారం మార్పిడి ప్రమాణం మన ఆర్థిక వ్యవస్థలో బంగారాన్ని నిరుపయోగమైనదిగా మార్చింది. బంగారం మార్పిడి ప్రమాణంగా ఉపయోగించడం కంటే బంగారం ప్రమాణం వల్ల ధరలు నిలకడగా ఉంటాయి." బంగారం కొనుగోలు శక్తిని స్థిరీకరించే ఉద్దేశంతో బంగారం మార్పిడి ప్రమాణాన్ని జెనీవా అంతర్జాతీయ సదస్సు ఆమోదించిందని నేను భావించను. వారి కరెన్సీని స్థిరీకరించేందుకే ఈ విధంగా చేశారు. అని అంబేద్కర్ అన్నారు. దేశ అవసరాలకు అనుగుణంగా కరెన్సీ ప్రమాణాన్ని పరిమితం చేసే సాధనమే మార్పిడీ అని అంబేద్కర్ అభిప్రాయపడ్డారు. మార్పిడీ వ్యవస్థ పరిపూర్ణంగా ఉన్నప్పుడే అది మరింత సమర్థవంతంగా పనిచెయ్యగలుగుతుంది.

1926 భారతదేశంలో నెలకొన్న పరిస్థితులు బంగారం ప్రమాణం, బంగారం కరెన్సీ మధ్య అవినాభావసంబంధాన్ని సూచిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో భారతదేశంలో బంగారం కరెన్సీని విలాసకర వస్తువుగా పరిగణించలేం. ఇందువల్లనే బంగారం కరెన్సీ ప్రమాణాన్ని పాటించాలని భారతీయ సాక్షులు మాత్రమే కాకుండా డాక్టర్ కానన్, డాక్టర్ గ్రెసరీ వంటి విదేశీ సాక్షులు కూడా హిల్టన్ యంగ్ కమిషన్‌కు సూచించారు.

బంగారాన్ని 2S వద్ద అనుసంధానం చెయ్యడంలో పెరుగుదల వాస్తవ లక్షణాన్ని విస్మరించింది. ఆ విలువను పరిరక్షించేందుకు కరెన్సీని తగ్గించాల్సిన అవసరాన్ని ఇది తక్కువగా అంచనా వేసింది. 2S బంగారం ధర అంటే ఒక నిర్దిష్ట సమయంలో బంగారం విలువకు సమానంగా కొనుగోలు శక్తికి మించి రూపాయి విలువను అధికంగా విలువకట్టడం. రూపాయికి బంగారంలో నిర్దిష్ట విలువ ఇచ్చేందుకు ప్రయత్నించడం తొందరపాటే అవుతుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరల్లో పెను మార్పులు సంభవిస్తూ నిలకడగా ఉండటం లేదు. ధర తక్కువ కాపడం దిగుమతులను నిరుత్సాహపరిచేదిగా ఉంటుంది. తక్కువ మారకం రేటుతో విలువ తగ్గిన కరెన్సీలో భారత ప్రపంచ పోటీని సమర్థవంతంగా తట్టుకోగలుగుతుంది, తక్కువ మారకం శాతం ఉంటే ఇంగ్లాండ్‌కు ఎక్కువ మొత్తంలో చెల్లింపులు జరపాల్సి ఉంటుంది. మారకపు శాతం ఎక్కువగా ఉండడం వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రయోజనం చేకూరుతుంది. విదేశాలకు చెల్లించాల్సిన మొత్తాలు తగ్గిపోతాయి. ఎక్కువ మారకపు శాతం ఉండటం యంత్రాలు అవసరమైన పరిశ్రమలకు ప్రయోజనకరంగా ఉంటుంది. దిగుమతి చేసుకున్న వస్తువుల ధరలు రూపాయిల్లో తక్కువగా ఉంటాయి. మధ్యతరగతి ప్రజల్లో కొంతమంది కూడా లబ్ధి పొందుతారు. తక్కువ మారకం శాతం ఉండటం వల్ల విదేశాల నుండి దిగుమతి చేసుకున్న వినియోగదారుల వస్తువులు, ముడి సరుకులు, క్యాపిటల్ వస్తువుల ధరలు మరింత ప్రియమవుతాయి. కార్మిక వర్గాలపై ఎటువంటి ప్రభావం ఉండబోదు. మరోవైపు మారకశాతం ఎక్కువగా ఉండటం వల్ల వ్యవసాయోత్పత్తుల ధరలు పడిపోతాయి. గిట్టుబాటు ధరలు లభించబోవు. దీని ప్రభావం వ్యవసాయదారులపై పడుతుంది. ఫలితంగా పారిశ్రామిక, వ్యాపార వర్గాలు కూడా ప్రభావితమవుతాయి.

ఇందుకు అంబేద్కర్ బంగారం లాంటి పరిష్కారాన్ని రూపొందించారు. 1S4d, 1S6d మధ్య సగటు పాటించడమన్న దాని మార్గమే ఉత్తమ పరిష్కారమని అంబేద్కర్ పేర్కొన్నారు. మారక శాతం ఎక్కువగా ఉండటం వల్ల గ్రామీణ రుణ భారం పెరుగుతోందని దానిని వ్యతిరేకించేవారు పేర్కొన్నారు. అయితే వ్యవసాయ పరికరాలు ధరలు తగ్గడం, వారి ఉత్పత్తి వ్యయం తగ్గుతుందనే అంశాన్ని వారు పరిగణనలోకి తీసుకోలేదు.

## సెక్షన్-3

### ఫైనాన్స్ సమస్యలు

ఎం.ఎస్.సి(ఎకనామిక్స్) డిగ్రీ కోసం అంబేద్కర్ సమర్పించిన థీసిస్ 'ది ఎవల్యూషన్ ఆఫ్ ప్రావిన్షియల్ ఫైనాన్స్ ఇన్ బ్రిటిష్ ఇండియా', 277 వ రాజ్యాంగ నియమావళిపై రాజ్యాంగ పరిషత్తులో జరిగిన చర్చ సందర్భంగా ఆయన చేసిన ప్రసంగం. ILP ఎన్నికల ప్రణాళికలో పొందుపరిచిన టాక్సేషన్ విధానం, బడ్జెట్ ఎస్టేట్ సుంకంపై ఆయన చేసిన ప్రసంగాలు ఫైనాన్స్. సమస్యలపై చేసిన అనేక రచనల్లో భాగాలుగా ఉన్నాయి.

ప్రావిన్షియల్ ఫైనాన్స్ 1855 నుండి మూడు దశలుగా విస్తరించిన విషయాన్ని అంబేద్కర్ గుర్తించారు. ప్రతి దశ దాని కంటూ సరఫరా (బడ్జెట్‌లో ప్రతిపాదిత కేటాయింపులు,

ఆదాయాలు, పంచుకున్న ఆదాయాలు) ఉన్నాయి. సరఫరా విధానం ప్రాతిపదికగా వివిధ దశల విభజన జరిగింది. దీనిని కేంద్ర ప్రభుత్వం అనుసరించింది. ఒక ముఖ్యమైన విషయం ఏమంటే ప్రావిన్షియల్ ఫైనాన్స్ స్వతంత్ర ప్రతిపత్తి లేదు. ప్రావిన్షియల్ ఫైనాన్స్‌కు ఫైనాన్స్ వికేంద్రీకరణ ఒకదాని కొకటి పరస్పర పర్యాయపదాలు కావు. వికేంద్రీకరణ అనే పదం సమగ్రంగా లేదు.

1855 లో చోటు చేసుకున్న వికేంద్రీకరణ స్థానిక ఫైనాన్స్ నుండి సామ్రాజ్యవాద ఫైనాన్స్‌ను వేరు చేసింది. ఇంపీరియల్ ఫైనాన్స్ వికేంద్రీకరణ ప్రావిన్షియల్ ఫైనాన్స్ నుడి ఇంపీరియల్ ఫైనాన్స్‌ను వేరు చేసింది. 1882 లో ప్రావిన్షియల్ ఫైనాన్స్, ఫైనాన్స్ వికేంద్రీకరణ ప్రారంభమైంది. ఇది స్థానిక ఫైనాన్స్‌కు ప్రావిన్షియల్ ఫైనాన్స్ నుండి వేరు చేసింది.

ఆయా రాష్ట్రాలు, బడ్జెట్‌లలో అంచనావేసిన ఆదాయాలు, ఖర్చులను ప్రతి అయిదవ సంవత్సరం సవరించాలనే జస్టిస్ ఎం.జి. రానడే. యాంత్రిక పథకాన్ని అంబేద్కర్ వ్యతిరేకించారు. 'ప్రావిన్షియల్ ఫైనాన్స్ వికేంద్రీకరణ అనే పేరుతో ప్రచురించిన పత్రాన్ని' అశ్రద్ధతో కూడిన పదజాలంగా వ్యాఖ్యానించారు. ప్రావిన్షియల్ ఫైనాన్స్ అభివృద్ధి గురించి చర్చించినప్పటికీ స్థానిక ఫైనాన్స్ అభివృద్ధే అందులోని ప్రధానాంశమని విద్యార్థి భావించే ఆస్కారం ఉంది. వికేంద్రీకరణలో వివిధ రకల గురించి జస్టిస్ రానడేకు అవగాహన ఉండి ఉంటే పత్రం వేరు, అందులోని అంశాలు అసత్యాలనే విషయాన్ని గ్రహించి యుండేవారు.

సామ్రాజ్యవాద వ్యవస్థను ప్రారంభించేవరకు తమ బడ్జెట్‌లో ప్రతిపాదించిన ఖర్చులకు అవసరమైన నిధులను సేకరించే బాధ్యత ఆయా రాష్ట్ర ప్రభుత్వాల మీదే ఉండేది. గ్రాంట్‌లను ఎన్నడూ జాగ్రత్తగా రూపొందించడం గానీ, వాటి విషయంలో విధించిన పరిమితులను పాటించడం గానీ జరగలేదు. తదుపరి దశలో ఆర్థిక రంగ ప్రయోజనాల దృష్టిలోనే కాకుండా ఈక్విటి ప్రయోజనాల దృష్టిలో కూడా సమాఖ్య గురించి ప్రచారం చెయ్యడం జరిగింది. మూడవ దశలో దాని స్వభావరీత్యా రాజ్యాంగ సామ్రాజ్యవాదానికి, రాజ్యాంగ ఫెడరలిజంకు మధ్య రాజీ విధానం పాటించేవారు. రాజీ ఫార్ములాలో భాగంగా ఆదాయాలు, వ్యయాలు, సామ్రాజ్యవాద హోదా కలిగి ఉండేవి. ఆయా రాష్ట్రాల్లో సేకరించే ఆదాయాల పరిధిలో వ్యయాలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం ఇవ్వబడింది.

వికేంద్రీకరణపై రాయల్ కమీషన్ నివేదికను 1909లో వెల్లడించారు. గ్రాంట్స్ మంజూరు చెయ్యడం వికేంద్రీకరణకు బ్రేక్‌గా గుర్తించిన కమిషన్ ఈ చర్య కేటాయింపులను వీలైనంత కనిష్ట స్థాయికి కుదించడం ద్వారా రాష్ట్ర ఫైనాన్స్‌కు గరిష్ట స్థాయిలో విస్తృతి కల్పిస్తుందని సిఫార్సు చేసింది. అర్థశాశ్వత, శాశ్వత పరిష్కారాల మధ్య ఒక్కటే తేడా ఉంది. సంయుక్త రెవిన్యూ ఖర్చుల పద్దుల్లో భాగస్వామ్యాలను పెంచడం ద్వారా నిర్దిష్ట కేటాయింపుల్లో పాక్షిక మార్పులు చేయడానికి ఇది దోహదం చేస్తుంది.

అంబేద్కర్ దృష్టిలో రెండు ప్రభుత్వాల మధ్య ఆర్థిక సంబంధం ఒకే సిద్ధాంతంపై ఆధారపడి ఉంది. అది వనరులకు ఒకటిగా కలిపి వేసి ఆదాయాన్ని పంచుకోవడమని ఆయన అన్నారు. ఇందుకు సంబంధించిన వాస్తవాలు, ఆమోదింపబడిన చట్టాలను ఆయన ఈ

సందర్భంగా ప్రస్తావించారు. మరో మాటలో చెప్పాలంటే ప్రావిన్షియల్ ఫైనాన్స్ అంటే భారత ప్రభుత్వం తన ట్రెజరీ పుస్తకాల్లో ప్రావిన్షియల్ సర్వీసెస్ ఖాతాలను తెలిపింది. ఈ ఖాతాల నుండి ప్రావిన్షియల్ ప్రభుత్వాలు మాత్రమే సొమ్ము డ్రా చేసుకోడానికి అనుమతినిచ్చారు. పన్నులు విధించుకుని, ఖర్చు చేసుకునే స్వేచ్ఛ కలిగి ఉండే విధంగా స్వతంత్ర వ్యవస్థగా ఉండే బదులు ప్రావిన్షియల్ ఫైనాన్స్ కేంద్ర ప్రభుత్వ పూర్తి అదుపు ఆజ్ఞల్లో ఉంటుందనడం అతిశయోక్తి కాదు. సంబంధిత ఖాతాల్లో డెబిట్, క్రెడిట్ అంశాలపై భారత ప్రభుత్వానికి పూర్తి నియంత్రణ ఉంటుంది. రాష్ట్రాలు భారత ప్రభుత్వం మధ్య ఆర్థిక సంబంధాన్ని హిందూ సమిష్టి కుటుంబ వ్యవస్థతో పోల్చవచ్చు. వేర్వేరు పేర్లతో కుటుంబ పెద్ద (భారత ప్రభుత్వం) ఖాతాలను తెరచినప్పటికీ ఏ కుటుంబ సభ్యుడూ పరిమితికి మించి డ్రా చేసుకునే (వాడుకునే) హక్కును నియంత్రించే అధికారం కలిగి ఉంటాడు. రాష్ట్రాల ఆర్థికవ్యవస్థ సంకుచితం, రాజ్యాంగపరమైన న్యాయ నిబంధనల ఇరుసులో బంధింపబడే తీరును అంబేద్కర్ నిశితంగా విమర్శించారు. 1919 సంస్కరణలలో చట్టం ఫలితంగా రాష్ట్రాల ఆర్థికవ్యవస్థలో చోటు చేసుకున్న మార్పులు సమయంలో అందులో ఉండే లోపాల ప్రాతిపదికగా ఏర్పడినవి కావు. అసలు వ్యవస్థే అసమగ్రంగా, అస్థిరంగా ఉండటం వల్లే ఈ మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రభుత్వ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చేందుకు ఈ సంస్కరణల చట్టం ఉద్దేశింపబడింది.

రాష్ట్రాల సర్దుబాట్లు వాటి ఆర్థిక వనరులపై కాకుండా అవసరాల ప్రాతిపదికగా ఉండాలని 1919 లో తీసుకువచ్చిన ఈ చట్టం నిర్దేశించింది. అందువల్ల కేంద్ర అదుపు ఆజ్ఞల్లో ఉండటం అనివార్యమవుతుంది. రాష్ట్రాల అంశాలు 52 శాతం ఉంటాయి. ఇక్కడే కేంద్ర రాష్ట్రాల ప్రాతిపదికగా స్పష్టమైన విభజన ఏర్పడింది. పరిపాలన, ఆర్థిక పరమైన అంశాల్లో ఈ స్పష్టమైన విభజననే భారత రాజకీయ నాయకులు, రాజనీతిజ్ఞులు కోరుకున్నారు. వికేంద్రీకరణ అంశంపై ఏర్పాటు చేసిన రాయల్ కమీషన్ ముందు ఈ అభిప్రాయాన్నే జి.ఆర్. గోఖలే వ్యక్తం చేశారు. 1919 చట్టంపై చేసిన సమీక్షలో అంబేద్కర్ అందులోని వివిధ అంశాలను సమగ్రంగా విమర్శనాత్మకంగా వివరించారు. సంకర ప్రభుత్వాధికారులు. బాధ్యతలు, విధుల విభజన, అధికారాలపై ఆంక్షలు సమర్థవంతమైన పాలనా వ్యవస్థకు దారితియ్యవని అంబేద్కర్ వ్యాఖ్యానించారు. సమర్థవంతమైన మంచిపాలనా వ్యవస్థ లేకపోతే లోపరహితమైన, పరిపూర్ణమైన, ఆర్థిక వ్యవస్థ గురించి ఆశలు పెట్టుకునే ఆస్కారం ఉండదు. సమిష్టి బాధ్యత గల విభజన లేని ప్రభుత్వం ఉండటమే దీనికి పరిష్కారమని ఆయన సూచించారు.

పరిపాలన, ఆర్థిక అంశాలపై బాధ్యత ఒకరికే లేకపోవడం పాత వ్యవస్థలో ప్రధాన లోపం. ఈ లోపాన్ని చక్కదిద్దేందుకు రాష్ట్రాల ఆర్థికవ్యవస్థను ప్రారంభించడం జరిగింది. భారత ప్రభుత్వం తన నిధుల్లో కొన్నిటిని రాష్ట్రాలకు పంపిణీ చేసింది. రాష్ట్రాలు తనకు కేటాయించిన నిధులతో భారత ప్రభుత్వం తరపున కొన్ని సర్వీసులను నిర్వహించాయి.

రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థ డిపార్ట్‌మెంట్ ఆర్థిక వ్యవస్థను పోలి ఉంది. పేరుకే రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థ, అందులో రాష్ట్రాల హోదా అంటూ ఏదీ లేదు. అది కేవలం కొన్ని ఖాతాలకు సంబంధించింది మాత్రమే. ఖాతాల్లో డెబిట్, క్రెడిట్ వైపు గల వివిధ అంశాలు. భారత

ప్రభుత్వ పూర్తి పర్యవేక్షణలోనే ఉన్నాయి.రాష్ట్రాల ఆర్థికవ్యవస్థ ఆచరణలో పెట్టతగిందే. అది భారతదేశానికి అనేక ప్రయోజనాలు సమకూర్చి పెట్టింది. రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థికంగా నిర్వహించ గల అంశాలను వాటికి ఇవ్వడం జరిగింది. 1935లో తీసుకువచ్చిన భారత ప్రభుత్వ చట్టం రాష్ట్రాలకు స్వయం నిర్ణాయాధికారాన్ని కల్పించింది. రాష్ట్రాలకు స్వీయ నిర్ణయాధికారం కల్పించే వ్యవస్థను అంబేద్కర్ వ్యతిరేకించారు. ఇందువల్ల అధికారం ఆయా వర్గాల వారికి చేరుతుంది గానీ ప్రజలకు దక్కదని ఆయన వాదించారు.

(1) ఆదాయపు పన్ను (2) కేంద్ర ఎక్స్చేంజ్ సుంకాల్లో వాటా, (3) కొన్ని గ్రాంట్లు, కేటాయింపుల్లో మార్పులు చేసే అధికారాన్ని రాజ్యాంగంలోని 277 వ నియమావళి రాష్ట్రపతికి కల్పించింది. దీనిని H.N.కుంజ్రు విమర్శించారు. "కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో నైనా రాష్ట్రాలకు ఆర్థిక స్వేచ్ఛ కల్పించకపోతే అది ఏ మాత్రం స్వాతంత్ర్యం కలిగి ఉండవు. అవి మున్సిపాలిటీలు, జిల్లాబోర్డులతో సమానమవుతాయి." అని ఆయన వ్యాఖ్యానించారు. 277వ నియమావళి కేంద్రప్రభుత్వం తిరుగులేని, ఆర్థిక నిరంకుశ అధికృతను చాటేది తప్ప మరేమీ కాదని ఆయన అన్నారు.

ఈ విమర్శకు అంబేద్కర్ ఈ విధంగా సమాధానం చెప్పారు.

> "ఏకపక్షంగా ఎటువంటి సిఫార్సు చేసే కారణం లేదా అవకాశం లేదు. కేంద్ర ప్రభుత్వ కేటాయింపులను రాష్ట్రాలు పొందుతున్నవి. అలా పొందేహక్కు కలిగి ఉన్న వాటిని రాష్ట్రపతి పూర్తిగా నిర్మూలించడం లేదు. ఇలానే వ్యవహరించాలని రాష్ట్రపతి చేతులను కట్టివెయ్యడం సముచితం కాదు. రాష్ట్రాలకు సూచనలిచ్చే స్వేచ్ఛ, అధికారాన్ని రాష్ట్రపతి నుండి తీసివెయ్యడం భావ్యం కాదు."

ఆయన ఇంకా ఈ విధంగా అన్నారు. "పార్లమెంట్‌కు అధికారం కల్పించడం అంటే కేంద్రంలో అధిక పాతినిధ్యం గల రాష్ట్రాలకు అధిక ప్రాధాన్యత కల్పించడమే. ఇవి నా ఉద్దేశంలో ఇతర రాష్ట్రాల న్యాయాన్ని సమూలంగా కాలరాయడమే." రాష్ట్రపతి ఫైనాన్స్ కమిషన్ సిఫార్సుల మేరకు నడుచుకుంటారు. ఆదాయపు పన్ను ద్వారా లభించే ఆదాయం నుండి మరింత ఎక్కువ వాటాను ఆశించే రాష్ట్రాలు, రాష్ట్రపతి మధ్య ఫైనాన్స్ కమిషన్ సంధానకర్తగా వ్యవహరిస్తుంది.

ఇండిపెండెంట్ లేబర్ పార్టీ (1936) ఎన్నికల ప్రణాళికలో టాక్సేషన్ సమస్య గురించి అంబేద్కర్ వివరంగా ప్రస్తావించారు. ఆ సమయంలో అమలులో వున్న పన్నుల విధానం అసమంజసంగా ఉందని ఆయన పేర్కొన్నారు. అది ఎక్కువగా పేద తరగతి వారిపై భారం మోపేదిగా ఉందని ఆయన అన్నారు. భూమి శిస్తు విధించే పద్ధతికి ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. అది మరింత హేతుబద్ధంగా, విస్తృతంగా ఉండాలని సూచించారు. భూమి శిస్తు తగ్గించేందుకు, ధనికులపై పన్ను విధించేందుకు సిద్ధంగా లేని బొంబాయి ప్రభుత్వాన్ని ఆయన 1938లో అహ్మదాబాద్‌లో జరిగిన సమావేశంలో నిశితంగా విమర్శించారు. ఆయన సూచించిన పన్నుల విధానంలో ముఖ్యాంశాలు ఈ విధంగా ఉన్నాయి. (1) పన్నులు అవి చెల్లించగల సామర్థ్యంపై విధించాలే గాని ఆదాయంపై కాదు (2) పన్నుల వ్యవస్థ పురోగమన

విధానంలో ఉండాలి అంటే ధనికులకు ఎక్కువ పన్ను, పేదవారికి తక్కువ పన్ను విధించాలి (3) నిర్ణీత పరిధి వరకు పన్ను చెల్లింపుదారులకు మినహాయింపులు ఇవ్వాలి (4) భూమి శిస్తు మరీ కఠినంగా ఉండరాదు. అవి పరిస్థితులకు అనుగుణంగా ఉండాలి. పన్నుల విషయంలో వైఖరిని మార్చుకోవాల్సిన అవసరం ఉందని అంబేద్కర్ నొక్కి చెప్పారు. టాక్సేషన్ వ్యవస్థకు రెండు ప్రత్యామ్నాయ విధానాలున్నాయని అన్నారు (1) వివిధ వర్గాల మధ్య సమానత్వం ఉండాలి (2) ప్రజల జీవన ప్రమాణాలను దెబ్బతీసేదిగా ఉండరాదు. ఆర్థిక వ్యవస్థలో ఒక లోపాన్ని ఆయన వెల్లడించాడు. రాష్ట్రాలు తమ వనరుల కోసం కేంద్రం ఇచ్చే గ్రాంట్లపై ఎక్కువగా ఆధారపడతాయి. అమ్మకం పన్ను రాష్ట్రాల పరిధిలోనే ఉండాలనే వాదన ఆయన అంగీకరించారు. ఎందుకంటే అది రాష్ట్రాలకు ముఖ్యమైన ఆదాయ మార్గం.

ఆయన ఇలా వాదించారు.

> "అమ్మకం పన్ను విధించేందుకు రాష్ట్రాలకు అనుమతినిస్తే తమ రాష్ట్రంలో మార్పు చెందే పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చేసుకునే స్వేచ్ఛ కూడా వాటికి కల్పించాలి. కేంద్రం ఆంక్షలు లేదా పరిమితులు విధించడం అమ్మకం పన్ను వ్యవస్థకు తీవ్ర అవరోధంగా పరిణమిస్తుంది. అమ్మకం పన్ను అనేది మౌలికంగా వినియోగంపై పన్ను వలే ఉండాలి."

వాణిజ్య ప్రకటనలపై పన్ను విధించడం రాజ్యాంగంలోని 13వ నియమావళిని ఉల్లంఘించడమేననే అభ్యంతరాలు రాజ్యాంగ పరిషత్‌లో ప్రస్తావించబడ్డాయి. అలా పన్ను విధించడం చెల్లదని పేర్కొన్నారు. అంబేద్కర్ ఈ అన్యాయాన్ని వ్యతిరేకించారు. ఆయన వాదనలు ఇలా ఉన్నాయి.

> "ప్రాథమిక హక్కులు హామీ ఇవ్వబడటంతో పన్నులు విధించే అధికారాన్ని కూడా వినియోగించరాదనే వాదన ప్రాథమిక హక్కుల పరిమితి లేదా విధ్వంసానికి దారితీస్తుంది. ఇది చాలా విస్తృతమైన అంశం. ఎవరైనా దీనిని ఆమోదించగలరని నేను భావించబోను."

తన వాదనకు మద్దతుగా అమెరికా సుప్రీం కోర్టు తీసుకున్న వైఖరిని ఆయన ప్రస్తావించారు. ప్రాథమిక హక్కులు అవి ఎంత ప్రాథమికమైనవైనప్పటికీ పరిపూర్ణ హక్కులు కావని ఆయన పేర్కొన్నారు. వాటికి కొన్ని మినహాయింపులుండాలి.

అనేక సందర్భాల్లో సాధారణ బడ్జెటింగ్‌ను అంబేద్కర్ ప్రస్తావించారు. సామాజిక న్యాయానికి తక్కువగా కేటాయింపులు జరపడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. అన్ని రకాల సామాజిక ప్రయోజనాలకు కేటాయింపులు లేవు. మన నిధుల్లో సింహభాగాన్ని రక్షణ ఖర్చులే హరించి వేస్తున్నాయి. సాధారణ బడ్జెట్‌లో ఆయన ప్రధానంగా రెండు అంశాలపై దాడి చేశారు. రక్షణ వ్యయాన్ని భారత ప్రభుత్వం నిలకడగా నిరంతరం ఎందుకు పెంచుతుందో తను అర్థం చేసుకోలేకపోతున్నానని అంబేద్కర్ పేర్కొన్నారు.

ఎస్టేట్‌లపై పన్ను విధించడానికి అంబేద్కర్ మద్దతు తెలిపారు. మరణించిన వ్యక్తి వదిలివెళ్లిన ఎస్టేట్‌ను అధికారులు ఎలా గుర్తిస్తారని ఆయన ప్రశ్నించారు. ఎవరు, ఎప్పుడు

మరణించారో తెలుసుకోవడం కష్టమైన విషయం. ఇంగ్లండ్‌లో ప్రతి ఒక్కరూ మరణించడానికి ముందు వీలునామా రాస్తారు. అందువల్ల అక్కడ ఎస్టేట్ సుంకం విధించే ప్రక్రియ సరళమవుతుంది. వీలునామాను రూపొందించుకునేందుకు ఎటువంటి దరఖాస్తు చేశారనే విషయాన్ని నిర్ధారణ చేసుకునేందుకు రెవెన్యూ అధికారులు హైకోర్టు రిజిస్ట్రార్‌ను కలవాల్సి ఉంటుంది. అయితే భారతదేశంలో ఇలా దరఖాస్తు చేసే అలవాటు లేదు. పెట్టుబడి సమకూర్చుకునేందుకు పన్ను విధించే ప్రక్రియను యునెస్కో సమర్థించింది. పారిశ్రామిక, ఆర్థిక పురోభివృద్ధిలో ఆసియా దేశాలు వెనుకబడి వున్నాయని యునెస్కో నివేదిక పేర్కొంది. ఈ దేశాల్లో పొదుపు చేసే అలవాటు బాగా తక్కువగా ఉందని, అందువల్ల పెట్టుబడులు సమకూరే పరిస్థితి లేదని ఆ నివేదిక వెల్లడించింది. పెట్టుబడులు లేకపోతే పరిశ్రమలు ఉండవు. పెట్టుబడులు సమకూర్చుకోవాల్సిన అవసరం గురించి ప్రస్తావిస్తూ అంబేద్కర్ ఈ విధంగా అన్నారు.

> "మనది కమ్యూనిస్టు దేశమై ఉంటే మన ఆర్థిక జీవనాన్ని, పారిశ్రామిక జీవనాన్ని, వ్యవసాయ జీవనాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ఉండేది. లేదా మనమంతా ఒకే స్థాయిలో ఉండి ఉండేవారం. మనం ఎంత పొదుపు చేశాం, ఎంత చెయ్యలేదు అనే వాటికి ప్రాధాన్యత ఉండబోదు. ప్రజల సంక్షేమానికి, విద్యకు కమ్యూనిస్టు ప్రభుత్వమే సంపూర్ణ బాధ్యత తీసుకుంటుంది. అటువంటి కమ్యూనిస్టు పాలన లేనంత వరకు పెట్టుబడుల సృష్టికి వీలైనంత ఆదాయం లభించే విధంగా మన పన్నుల వ్యవస్థ ఉండాలి."

సెంట్రల్ అసెంబ్లీలో ఎస్టేట్ సుంకం బిల్లు చరిత్ర గురించి అంబేద్కర్ ప్రస్తావించారు. 1935 చట్టంలో ఎస్టేట్ సుంకం విధించే నిబంధన ఏదీ లేదు. 1944–45లో సర్ జెర్మీ రైస్‌మన్ (అప్పటి ఆర్థిక మంత్రి ఈ బిల్లును ప్రవేశపెట్టారు). కాంగ్రెస్, ముస్లిం లీగ్ సభ్యులు దీనిని వ్యతిరేకించారు. దాంతో దీనిని నిలిపివేశారు. భారత ఆర్థిక మంత్రి సర్ షణ్ముఖం శెట్టి ఈ బిల్లును ప్రవేశపెట్టారు. దానిని సభాసంఘానికి నివేదించారు. మితాక్షరీ చట్టం ఉనికిలో ఉన్నంత కాలం ఇటువంటి చర్య తీసుకోవడం వల్ల ఎటువంటి ఉపయోగం ఉండబోదని సభా సంఘం అభిప్రాయపడింది. ఆస్తి అనేది జన్మతః వచ్చేది కాబట్టి అది బదిలీ అయ్యే అవకాశం లేదని మితాక్షరీ చట్టం నిర్దేశించింది. ఈ చట్టాన్ని నిర్వీర్యం చేయడం ద్వారా ఈ సమస్యను అధిగమించడం జరిగింది (2వ క్లాజ్). 44 దేశాల్లో ఎక్సైజ్ సుంకం విధానం ఉందని అంబేద్కర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు.

## సెక్షన్-4

### ఇతర సమస్యలు

1952 – 53లో దేశంలో ఆహార పరిస్థితి క్షీణించింది. వినియోగదారునికి కాకుండా ఉత్పత్తిదారునికి సబ్సిడీ ఇచ్చే విధానం ఆర్థికమంత్రి ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. ఆహార శాఖ, భారత ప్రభుత్వం పరస్పర విరుద్ధమైన వైఖరులు అవలంబించడమే మరింత ఆహార

ధాన్యాలు ఉత్పత్తి చేసే ఉద్యమం విఫలం కావడానికి కారణమని అంబేద్కర్ పేర్కొన్నారు. వాణిజ్య పంటలు సాగు చేసే ధోరణి ఆహార ధాన్యాల ఉత్పత్తి పెంపునకు ప్రతిబంధకమని అన్నారు. "ఆహార ధాన్యాలు కాకుండా ఇతర వాటిని ఉత్పత్తి చేసే ధోరణిని ప్రభుత్వం అదుపులో పెట్టాలి" అని అంబేద్కర్ పేర్కొన్నారు. ఆర్థిక మంత్రి తన వైఖరిని పునస్సమీక్షించుకుని వాణిజ్య పంటలు, ఆహారోత్పత్తి మధ్య విభజనను నివారించగలడన్న ఆశాభావాన్ని అంబేద్కర్ వ్యాఖ్యానించారు. అధిక ఆహారోత్పత్తి ప్రణాళిక పూర్తిగా విఫలమైందనే రిజర్వు బ్యాంక్ నివేదికను ఆర్థిక మంత్రి పరిశీలించాలని కోరారు. పెరిగిపోయిన జీవన వ్యయం నుండి ప్రజలకు ఊరట కల్పించేందుకు సబ్సిడీలను కొనసాగించాలని అంబేద్కర్ తన ప్రసంగంలో ప్రభుత్వానికి సూచించారు.

విదేశీ పాలన వల్లే కరువులు, ఆహార కొరతలు ఏర్పడుతున్నాయనే పేలవమైన ప్రచారాన్ని విశ్వసించరాదని అంబేద్కర్ ప్రజలకు సూచించారు. ప్రతి చిన్న వైరుధ్యాన్ని విదేశీ పాలనకు ఆపాదించరాదని హితవు చెప్పారు. బ్రిటిష్ వారు మన వనరులను అభివృద్ధి చెయ్యలేదని, ఆర్థిక ప్రయోజనాలు కల్పించే విధంగా ప్రజలకు శిక్షణ ఇవ్వలేదని వాదించుకోవడం, విమర్శించుకుంటూ కూర్చోవడం మన సమస్యల పరిష్కారానికి ఎంత మాత్రం దోహదం చెయ్యబోదని ఆయన రాజ్యసభలో చేసిన ప్రసంగంలో పేర్కొన్నారు.

మంత్రుల జీతాలపై ఒక బిల్లును అంబేద్కర్ బొంబాయి శాసన మండలి (1938)లో ప్రవేశపెట్టారు. నాలుగు అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని ఆయన అన్నారు. సామాజిక ప్రయాణం, సామర్థ్యం, ప్రజాస్వామ్యం, పరిపాలనలో చిత్తశుద్ధి, స్వచ్ఛత, నిజాయితీ, పార్టీ ఓటు ద్వారా బిల్లును ఆమోదించడానికే పరిమితం చెయ్యరాదని ఆయన సూచించారు. విదేశాల్లో మంత్రుల జీతాలకు సంబంధించిన వివరాలను కూడా ఆయన బిల్లులో పొందుపరిచారు. మన మంత్రుల జీతాలు పెంచాలని ఆయన వాదించారు.

రాజ్యాంగ పరిషత్తులో ఒక సవరణను ప్రవేశపెడుతూ పండిట్ ఠాకూర్‌దాస్ భార్గవ ఈ విధంగా అన్నారు. "గోవధ వంటి అంశాలు ప్రాథమిక హక్కుల్లో కాకుండా ఆదేశిక సూత్రాల్లో చేర్చాలనేది అంబేద్కర్ కోరిక." నిర్దేశిత లక్ష్యాన్ని సవరణ సాధించింది. ఆదేశిక సూత్రాలు, ప్రాథమిక హక్కులకు మధ్యే మార్గంగా ఉంది. సవరణ అంశాలను నిర్దేశిస్తోంది (1) శాస్త్రీయ, ఆధునిక పద్ధతుల ద్వారా వ్యవసాయాన్ని మెరుగుపరచాలి (2) పశువుల దాణా నాణ్యతను మెరుగుపరచాలి (3) గోవులు, ఇతర పశువులు కబేళాకు తరలించబడకుండా జాగ్రత్త వహించాలి. ఈ దేశ మొత్తం వ్యవసాయ, ఆహార సమస్య ఆవులు, దాని సంతతి అభివృద్ధికి సంబంధించి సమస్య కాక మరింకేమీ కాదు. మొగల్ చక్రవర్తుల పాలనలో కూడా భారతదేశంలో గోవధ ఆచరణలో లేదు. చైనాలో ఆవులను వధించడం నేరం. పండిట్ భార్గవ ప్రతిపాదించిన సవరణకు అంబేద్కర్ మద్దతు తెలిపారు.

దేశవాళీ మద్యంపై సుంకం ఎక్కువగా ఉండటం వల్లనే కల్తీ మద్యం ఉత్పత్తి అధికమవుతోందని అంబేద్కర్ గట్టిగా అభిప్రాయపడ్డారు. "ఆర్థిక పరిష్కారం పైనే సమస్య ఆధారపడి ఉంది" అని అంబేద్కర్ అన్నారు. మద్యం ఉత్పత్తి, పంపిణీని నియంత్రించాలని

ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పంపిణీ రేషనింగ్ పద్ధతిపై ఉండాలి. మెడికల్ సర్టిఫికెట్‌ను తప్పనిసరి చెయ్యాలి. పన్నుల రూపంలో వసూలవుతున్న ఆదాయాన్ని రుణాల నుండి రైతులకు విముక్తి కల్పించేందుకు పేదరిక నిర్మూలనకు, విద్యాబోధనకు ఉపయోగించాలని నాసిక్‌లోని హెచ్.పి.టి. కాలేజ్‌లో ఏర్పాటు చేసిన తేనీటి విందులో ప్రసంగిస్తూ అంబేద్కర్ అన్నారు. అయితే మద్యపాన నిషేధానికి ఈ ముఖ్యమైన సమస్యలకంటే అధిక ప్రాధాన్యత ఇస్తే అది సాధ్యం కాదని అన్నారు. మద్యపాన నిషేధానికి సంబంధించినంత వరకు "ఏది ప్రాముఖ్యత సంతరించుకుంటుంది? త్రాగుబోతా లేదా ఆకలి గొన్నవారా?" అని ఎస్‌సిఎఫ్ తన ఎన్నికల ప్రణాళికలో ప్రశ్నించింది.

> రాష్ట్రాల పటిష్టత గురించి వివరిస్తూ అంబేద్కర్ ఈ విధంగా అన్నారు. 'అర్థం, విచక్షణ లేని, వాస్తవం కాని సిద్ధాంతం కోసం ఎక్సైజ్ ఆదాయం త్యాగం చేయబడుతోంది. కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న మద్యపాన నిషేధం విధానం గురించి ఎటువంటి సందేహం లేకుండా ఈ క్రింది నిర్ధారణలకు రావచ్చు. (1) ఆదాయంలో ఎక్కువ భాగం వృథాగా త్యాగం చేయబడుతుంది (2) ప్రజలు మద్యం సేవించడం మానలేదు. అక్రమ సారా ఉత్పత్తి బాగా ఎక్కువగా ఉంటోంది. అది ప్రజలకు రహస్యంగా విక్రయించబడుతోంది. (3) ప్రభుత్వం కోల్పోయిన ధనాన్ని అక్రమ మద్యం ఉత్పత్తిదారు పొందుతున్నాడు. (4) మద్యపాన నిషేధం సమాజాన్ని అవినీతిమయం చేసింది. ఇంతకుముందు కుటుంబంలోని మగ సభ్యులు మాత్రమే మద్యం దుకాణం వద్దకు వెళ్ళేవారు. ప్రస్తుతం అక్రమ సారా తయారుచేయడం గృహ పరిశ్రమగా మారిపోయింది. మద్యం ఇంట్లోనే ఉండటంతో పురుషులే కాదు మహిళలు కూడా తాగుతారు. (5) మద్యపాన నిషేధం వల్ల ప్రభుత్వానికి ఆదాయం తగ్గిపోవడంతో పాటు దానిని అమలు చేసేందుకు పోలీసులపై అదనపు వ్యయాన్ని వెచ్చించాల్సి ఉంటుంది. అయితే నిషేధాన్ని అమలు చేయడంలో పోలీసులు ఎన్నడూ విజయం సాధించలేదు.

మద్యపాన నిషేధం అమలులో విజయం సాధించినా, సాధించలేకపోయినా అది పూర్తిగా ఆర్థిక పరిష్కారంపై ఆధారపడి ఉంటుంది. కొత్త ఎక్సైజ్ విధానం ఫలితంగా సంభవించే నష్టాన్ని ఎలా భర్తీ చేస్తారనే విషయంపై ఇది ఆధారపడి ఉంది.

పన్నులను - ప్రభుత్వాలను నడిపేందుకు, పాలన సాగించేందుకు మాత్రమే ఉపయోగిస్తే అదనపు పన్నుల విధింపును మేము తప్పకుండా వ్యతిరేకిస్తాం. జీవితాన్ని ఉత్సాహభరితంగా చేసేటట్లయితే ఏ పన్నుకైనా మద్దతు ఇచ్చేందుకు మేము సిద్ధమే. నిషేధం విధింపు వల్ల కోల్పోయే ఆదాయాన్ని ఎలా భర్తీ చెయ్యాలనే విషయమై స్పష్టమైన నిర్ణయం తీసుకునే వరకు ఏ ప్రభుత్వం నిషేధంపై ఎటువంటి హామీ ఇవ్వరాదు. (అంబేద్కర్ రైటింగ్స్ - స్పీచెస్ - వాల్యూమ్ 2, పేజ్-165).

బ్యాంక్ వివాదాలకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుపై అంబేద్కర్ రాజ్యసభలో ప్రసంగించారు. భారమైన వేతనాల బిల్లు కారణంగా లాభాలు తగ్గాయనే వాదాన్ని ఆమోదించడం సాధ్యం కాదని ఆయన అన్నారు. మన దేశంలో భారతీయ బ్యాంకులు, విదేశీ బ్యాంకుల మధ్య తేడా చూపాల్సిన అవసరం ఉందని సేన్ కమిటీ గానీ, శాస్త్రి అవార్డు గానీ, అప్పిలేట్ ట్రిబ్యునల్ గానీ అభిప్రాయపడలేదని ఆయన అన్నారు. స్వదేశీ పరిశ్రమలు, వ్యాపారానికి విదేశీ మారక బ్యాంకులు చేసిన సహాయం చాలా తక్కువే. అవి పెద్ద సంఖ్యలో తమ సిబ్బందిని ఇక్కడకు తీసుకువచ్చాయి. భారతీయులను అట్టడుగు స్థానాల్లో మాత్రమే నియమించాయి.

దేశాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాల్సి ఉందని అంబేద్కర్ అన్నారు. పరిశ్రమల్లో ప్రభుత్వ యజమాన్యం, ప్రభుత్వ నిర్వహణ సిద్ధాంతాన్ని అమలు చెయ్యాలి. పరిశ్రమ అభివృద్ధి చెందడానికి సామాజిక బీమా, ఉపాధిపై అదుపు, అలాగే ఉద్యోగాల తొలగింపుపై నియంత్రణ కలిగి ఉండటం వంటి సదుపాయాలు కల్పించడం అవసరం. ఈ చర్యలు తీసుకునే సమయంలో మధ్యతరగతిలో దిగువ శ్రేణి వారి గురించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఎటువంటి పాజిటివ్ చర్య తీసుకోకుండా జాతీయం చేయడం 'మరణశిక్ష అమలు చేయడాన్ని నిలిపివేయడం'తో సమానం. జీవిత బీమా, బస్ రవాణా రంగాలను జాతీయం చేయాలని ఆయన సూచించారు.

మనిషిని మనిషి, ఒక వర్గాన్ని మరో వర్గం, ఒక దేశాన్ని మరో దేశం అణిచివేయడం, దోపిడీ చేయడాన్ని అంతమొందించేందుకు కృషి చేయగలనని షెడ్యూల్డ్ కులాల సమాఖ్య (1952) తన ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చింది. అత్యవసరమైతే పరిశ్రమలు జాతీయీకరణకు అది మద్దతు తెలిపింది. నిధుల సేకరణకు అంబేద్కర్ ఈ సూచనలు చేశారు. (1) సైన్యంపై వ్యయం తగ్గింపు (2) అమ్మకం పన్నుపై తిరిగి లెవీ విధించడం (3) మద్యపాన నిషేధం రద్దు చెయ్యడం, ఎక్సైజ్ ఆదాయాన్ని పొదుపు చెయ్యడం (4) బీమా రంగాన్ని జాతీయ చెయ్యడం (5) ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులకు నిర్బంధ బీమా.

ఆర్థిక శక్తి కేంద్రీకరణ కాకుండా ఉండేందుకు అంబేద్కర్ రెండు మార్గదర్శక సూత్రాలు ప్రతిపాదించారు. అవి (1) ఉమ్మడి ప్రయోజనం సిద్ధించేలా భౌతిక వనరుల యాజమాన్యం, నిర్వహణను పంపిణీ చెయ్యడం (2) సంపద ఒక చోట కేంద్రీకృతం కాకుండా, ఉత్పత్తికి విఘాతం కల్పించకుండా ఉండే విధంగా ఆర్థిక వ్యవస్థను నిర్వహించడం, నిర్బంధ శ్రమ, బాల కార్మిక వ్యవస్థను రాజ్యాంగం నిషేధించింది. ఆస్తి హక్కులు హామీ ఇవ్వబడ్డాయి. పని చేసేందుకు అందరికీ సమాన హక్కు, సమాన పనికి సమాన వేతనం, పురుషులు, మహిళల జీవన భృతికి సమాన హక్కులు హామీ ఇవ్వబడ్డాయి. రాజ్యాంగంలో ఇందుకు సంబంధించిన నిబంధనలు చేర్చడాన్ని అంబేద్కర్ సమర్థించారు.

ప్రభుత్వ జోక్యం లేని చోట స్వేచ్ఛ లభిస్తుంది. ఈ స్వేచ్ఛ ఎవరికి లభించింది? కౌలు పెంచుకునేందుకు భూకామందులకు, పనిగంటలు పెంచి, వేతనాలు తగ్గించేందుకు పెట్టుబడిదారులకు లభించింది. రాజకీయపరంగా ప్రభుత్వం ఏకపక్షంగా ఆంక్షలు విధించడాన్ని పరిమితం చెయ్యడం. ఆర్థిక రంగంలో తక్కువ శక్తి గల వారిపై ఎక్కువ శక్తి గల వ్యక్తులు

ఏకపక్షంగా ఆంక్షలు విధించకుండా చట్టాల ద్వారా రక్షణ కల్పించడం ప్రజాస్వామిక దేశాలు ఇందుకు అవలంభించాల్సిన పరిష్కార మార్గాలు.

సమానత్వంపై అంబేద్కర్ అపరిమితమైన విశ్వాసం పెంచుకున్నారు. అన్ని సామాజిక సిద్ధాంతాలకు ఇదే మూలమని ఆయన భావించారు. అంబేద్కర్ దృష్టిలో సమానత్వం అంటే అందరి పట్ల ఒకే విధంగా వ్యవహరించడం కాదు, సంపదను సమానంగా పంపిణీ చేయడం కాదు. అవసరాలు, సామర్థ్యాల్లో మనుషుల మధ్య అంతరాలు కొనసాగుతున్నంత కాలం అంతిమ సమానత్వం సిద్ధించబోదని అంబేద్కర్ అంగీకరించారు. లస్కి మాదిరిగా ఆయన అమితంగా ప్రేమించే సమానత్వం అంటే అవసరాలు, సామర్థ్యాలను సమం చెయ్యడం, కొందరికి ప్రత్యేక సదుపాయాలు, హక్కులు లభించకుండా ఉండటం, అందరికీ సమాన అవకాశాలు లభించడం.

కార్మికుల నియామకం, యంత్రాల వినియోగానికి వ్యతిరేకత గాంధీ ఆర్థిక ఆలోచనా విధానానికి వెన్నెముకలు. ఒక సందర్భంలో గాంధీజీ ఇలా అన్నారు. "యంత్రాలు అన్నీ అదృశ్యమైతే నేనేమీ రోదించబోను. అది అసలు వైపరీత్యంగా భావించబోను." చరఖాను ఆయన ఆదర్శవంతమైనదిగా చేశారు. "పాశ్చాత్య దేశాల నాగరికత సాతాను సృష్టి" అని ఆయన వ్యాఖ్యానించారు. నిర్హేతుకం, జంతుప్రాయమైన జీవన విధానం నుండి విముక్తి కల్పించి, నీతి నియమబద్ధమైన జీవన మార్గాన్ని కల్పించి విశ్రాంతి కల్పించేందుకు యంత్రాలు, ఆధునిక నాగరికత నుండి దూరం కావడం అత్యవసరం. అయితే ప్రజాస్వామిక సమాజంలో యంత్రాల పట్ల విముఖత చూపడం సాధ్యంకాదని అంబేద్కర్ అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్యం ఆదర్శప్రాయమైనదిగా ఎంచుకోని సమాజానికి గాంధీ ఆలోచనా విధానం సరిపోవచ్చునని ఆయన అన్నారు. ఈ విశ్లేషణ సరైనదైతే ప్రజాస్వామిక సమాజం నినాదం "యంత్రాలు - మరిన్ని యంత్రాలు, నాగరికత - మరింత నాగరికత" అవుతుంది." లోపం యంత్రాలది. ఆధునిక నాగరికతది కాదని అంబేద్కర్ అన్నారు. ప్రైవేట్ యాజమాన్యం, వ్యక్తిగత ప్రయోజనం కోసం అన్వేషణ ఆరాధ్య భావంగా ఉండే లోపభూయిష్టమైన సామాజిక వ్యవస్థ ఇందుకు కారణమన్నారు. అంబేద్కర్ ఈ విధంగా వ్యాఖ్యానించారు. "ప్రకృతికి ముందు వెళ్ళాలని పిలుపు ఇవ్వడం నగ్నత్వం, కపటత్వం, పేదరికం, అజ్ఞానానికి తిరిగి జారుకోవడమే."

చరిత్రకు మార్క్సిజం చెప్పిన భాష్యాన్ని గాంధీజీ ఆమోదించలేదు. "భారత చరిత్ర పెట్టుబడి, కార్మిక శక్తి మధ్య సజావుగా లేని సంబంధాలకు సంబంధించింది కాదు," "ఆందోళనకారులు ఎన్నడూ ప్రజల విరాళాలు, దాతృత్వంపై ఆధారపడి ఉండరాదు." "కిసాన్ ఉద్యమం వారి స్థాయిని పెంచేందుకు, జమిందారులు, రైతుల మధ్య సంబంధాలను అభివృద్ధి చేయడానికి మాత్రమే పరిమితం కావాలి" - ఈ గాంధీ సూత్రాలు ధనిక వర్గాలను గాయపరచరాదనే గాంధీజీ ఆకాంక్షలకు తగిన సాక్ష్యమని అంబేద్కర్ పేర్కొన్నారు. ఆ వర్గాలను ఆయన 'బంగారు గుడ్లు పెట్టే బాతు'గా అభివర్ణించారు. రోశ్కు, రస్కిన్, టాల్‌స్టాయ్ అభిప్రాయాలను, వారి ఆలోచనా విధానాలనూ గాంధీ పునశ్చరణ చేస్తున్నారని ఆయన (అంబేద్కర్) భావించారు. గాంధీజీ ట్రస్టీషిప్ సిద్ధాంతం హాస్యాస్పదంగా ఉందని అన్నారు.

"గాంధీయిజం ఆచరణకు అసాధ్యమైంది. అది ఒక వర్గం మరో వర్గంపై వంశ పారంపర్యంగా ప్రదర్శించే ఆధిపత్యం, ఒకరిపై మరొకరు పెత్తనం చెలాయించడాన్ని పదిలంగా కొనసాగించడానికి అనుమతించే వ్యవస్థ" అని అంబేద్కర్ వ్యాఖ్యానించారు.

గాంధీయిజం పూర్తిగా ఊహాజనితమైందని అంబేద్కర్ అభివర్ణించారు. గ్రామాలకు తిరిగి వెళ్ళడం, గ్రామాలు స్వయంసమృద్ధి సాధించేలా చూడటం గాంధీ సిద్ధాంతానికి మూలం. అంటే అది కేవలం ప్రాంతీయ వాదం. అంబేద్కర్ దృష్టిలో అది విప్లవాత్మకమైంది కాదు. పురాతన వాదానికి పిలుపు ఇచ్చే పేరుతో తిరోగమన వాదం. అది అంతరించిన గతాన్ని పునరుజ్జీవింపచేసే ప్రయత్నమే.

సూక్ష్మంగా చెప్పాలంటే గాంధీయిజం అంటే ధనికులు, విశ్రాంతి తీసుకునే వర్గాల సిద్ధాంతం. తమ దురదృష్టాన్ని అదృష్టంగా భావించేలా అది ప్రజలను భ్రాంతికి గురి చేస్తుంది. పారిశుధ్య పనిని సమాజంలో అత్యంత ఉన్నతమైన సేవగా ప్రశంసిస్తూ దానిని గాంధీయిజం ప్రోత్సహిస్తోందని అంబేద్కర్ భావించారు. ఇది ఒక వర్గంపై మరో వర్గం బలవంతంగా రుద్దే దుష్ట సాంప్రదాయం.

**జనాభా నియంత్రణ**

కుటుంబ నియంత్రణ అంశాలపై అంబేద్కర్ తరఫున ఎంఎల్ఏ పి.జె. రోహమ్ ఉపన్యసించారు. "భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు సుభాష్ చంద్రబోస్ తన అధ్యక్షోపన్యాసంలో ఈ విధంగా అన్నారు. ఇటీవలి కాలంలో జరిగిన విధంగా జనాభా విపరీతంగా పెరిగిపోతే మన ప్రణాళికలు కుప్పకూలిపోతాయి. "మహాత్మాగాంధీ కూడా చాలాకాలం క్రితం ఇలా రాశారు : ఈ దేశంలో పుట్టుకల గురించి విన్న సందర్భంగా నాలో కలిగే విచారాన్ని నేను పాఠకుల వద్ద దాచుకోకూడదు."

ఆధునిక యుద్ధాల్లో అనేకమైన వాటికి జనాభా వత్తిడి కారణంగా ఏర్పడే ఆర్థిక ఇబ్బందులే మూల కారణమని అనేక యుద్ధాలకు బాధ్యులైన రాజనీతిజ్ఞుల ప్రసంగాలు స్పష్టం చేశాయి. బెర్న్‌హార్‌లు, హిట్లర్, ముస్సోలినీ, జోరింగ్ విస్పష్టమైన మాటల్లో దీనిని వివరించారు. ఉదాహరణకు అడాల్ఫ్ హిట్లర్ తన పుస్తకం "మైం కాంఫ్"లో ఇలా రాశారు : యుద్ధానికి ముందు జర్మనీ జనాభా బాగా పెరిగిపోవడంతో వారికి రోజువారీగా ఆహారం అందించడం ప్రధాన సమస్యగా పరిణమించింది. భూభాగం, జనాభాల మధ్య విలోమ నిష్పత్తి తగ్గించడానికి జాతీయ సోషలిస్టు ఉద్యమం కృషి చెయ్యాలి. మన విదేశీ రాజకీయాలకు భూభాగం లక్ష్యం కావాలి.

శాశ్వత ప్రపంచ సోదరభావం ఆకాంక్షించే వారు జనాభా పెరుగుదలను నియంత్రించేందుకు కృషి చెయ్యడం అవసరం. జనాభా నియంత్రణ ద్వారా జనాభా పెరుగుదలను అదుపులో ఉంచేందుకు కృషి చెయ్యాలి.

మితిమీరిన జనాభా సమస్యకు వలస వెళ్ళడం పరిష్కారంగా సూచించారు. రవాణాకు దోహదం చేసే నిర్బంధ వలస విధానం అసాధ్యమైన విషయం.

బాల్య వివాహాలకు స్వస్తి చెప్పి ఆలస్య వివాహ విధానం ప్రారంభిస్తే జనాభా పెరుగుదలను అదుపులో ఉంచవచ్చునని కొందరు భావిస్తారు. అయితే ఈ నమ్మకం కూడా నిజం కాదని వెల్లడైంది. 1931 జనాభా లెక్కల సందర్భంగా సంతాన సాఫల్యంపై ప్రత్యేకంగా జరిపిన దర్యాప్తు ఆధారంగా పి.కె. పట్టల్ ఈ క్రింది అంశాలను నిర్ధారించారు.

(1) 20 ఏళ్ళ వయస్సు పైబడిన వయస్సులో వివాహం చేసుకున్న వారికంటే ఆలోపు వివాహం చేసుకునే బాలికలు తక్కువ సంఖ్యల్లో పిల్లల్ని కంటారు.

(2) ఇరవై ఏళ్ళ లోపు వయస్సు ఉన్న బాలికలకు జన్మించిన శిశువుల జీవన శాతం 20 ఏళ్ళ పైబడి ఉన్న యువతులకు జన్మించిన శిశువుల జీవన శాతం కంటే బాగా తక్కువగా ఉంది.

డాక్టర్ రాధా కుమార్ ముఖర్జీ తన 'ఫుడ్ ప్లానింగ్ ఫర్ 400 మిలియన్స్' పుస్తకంలో ఇలా రాశారు.

> "జనాభా పెరుగుదలపై కొంత నియంత్రణ లేకపోతే ఏ పరిష్కారమైనా తాత్కాలిక ప్రభావం చూపేదే అవుతుంది. దేశంలో జనాభా భూమి (గరిష్ఠ స్థాయిలో) భరించగల స్థాయికి మళ్ళీ పెరిగిపోతుంది. విద్యా సదుపాయాల కంటే వేగంగా జనాభా పెరిగిపోతుంది. పన్ను విధించగల సామర్థ్యం పెరిగే అవకాశం ఉండదు. జనాభాపై వత్తిడిని కేవలం ఆహార సరఫరా దృష్టిలో మాత్రమే చూడకూడదు. జనాభా పెరుగుదల వల్ల సర్దుబాటు మరింత కష్టమవుతుంది. హేతుబద్ధమైన కుటుంబ నియంత్రణ, జననాల నియంత్రణపై ప్రజలను చైతన్యం చెయ్యడం, జనాభా పెరుగుదల సమస్యపై పోరాటానికి సమర్ధవంతమైన సాధనాలు" (అంబేద్కర్ రైటింగ్స్ అండ్ స్పీచెస్ రెండవ ప్రకరణలో 263, 269, 270, 272, 276 పేజీల సంక్షిప్తీకరణ చేయడమైంది).

**సామాజిక బీమా :**

ఎం.ఆర్. ఇద్గుంజి రాసిన 'సోషల్ ఇన్సూరెన్స్ అండ్ ఇండియా' అనే పుస్తకానికి ముందుమాటలో అంబేద్కర్ ఇలా రాశారు. సామాజిక బీమా పథకాల అమలుకు అవసరమైన ఆర్థిక వనరులకు సంబంధించిన వివిధ సమస్యలను వివరించేందుకు సామాజిక బీమాతో ఆర్థిక అంశాలపై చర్చ ఉద్దేశించబడింది. సామాజిక బీమా పథకం సజావుగా అమలు జరిగేందుకు వనరులను సక్రమంగా నిర్వహించుకోవచ్చు. సామాజిక బీమాలో ఆర్థిక అంశాల పర్యవేక్షణకు సంబంధించిన సమస్యలను పరిష్కరించుకోవచ్చు.

రెండవ విభాగంలో భారతదేశ పరిస్థితులకు అనుగుణంగా సామాజిక బీమా సమస్యల గురించి చర్చించడమైంది. ఈ విభాగంలో 1923 కార్మిక నష్ట పరిహార చట్టం, అస్వస్థత బీమా గురించి చర్చించారు. దీనికి తోడుగా బెవెరిడ్జ్ సామాజిక భద్రతా పథకం, న్యూజిలాండ్‌లో పాటించిన సామాజిక భద్రతా పథకం గురించి కూడా ఈ విభాగంలో చర్చించారు.

భారతదేశంలో సామాజిక భద్రత సాధ్యాసాధ్యాల గురించి అన్వేషణతో చర్చ ముగుస్తుంది. కొన్ని ప్రాథమిక ఇబ్బందులను పరిష్కరించకపోతే భారతదేశంలో సామాజిక భద్రతా చర్యలను అమలు చేయడం సాధ్యంకాదని రచయిత అభిప్రాయపడ్డారు. దేశం ఆర్థికంగా గణనీయంగా అభివృద్ధి చెంది దుర్భర దారిద్ర్యం నుండి విముక్తి పొందితే మినహా ఈ చర్యలను అమలు చేయడం సాధ్యం కాదని రచయిత అభిప్రాయం వ్యక్తం చేశారు. తాను ఈ విధంగా అభిప్రాయపడటానికి దోహదం చేసిన కారణాలను ఆయన స్పష్టంగా, నిర్భీతిగా వివరించారు. భారతదేశం స్థూలంగా వ్యవసాయక దేశమని, వ్యవసాయంతో సంబంధం గల వ్యక్తులకు రక్షణ కల్పించడం అవసరమని ఆయన గుర్తించారు. సామాజిక బీమా సూత్రాల ప్రాతిపదికగా పంటల బీమా పథకాన్ని రచయిత సూచించారు. రచయిత సూచనల మేరకు రూపొందించే పంటల బీమా పథకం మన గ్రామీణ ప్రజల స్థితిగతులను మెరుగుపరిచేదిగా, క్షామ భయాన్ని తగ్గించేదిగా ఉండాలి. (అంబేద్కర్ స్పీచెస్ అండ్ రైటింగ్స్ రెండవ ప్రకరణ 693, 694 పేజీలను సంక్షిప్తీకరించడమైనది).

## సెక్షన్-5

### ఆర్థికవేత్తగా అంబేద్కర్

భూసంస్కరణలు, వ్యవసాయ విధానం, పారిశ్రామికీకరణలపై తన అభిప్రాయాలను అంబేద్కర్ వివిధ సందర్భాల్లో వివరించారు. స్థూలంగా భూమిలేనివారు, చిన్న కృషీవలురుగా ఉండే అస్పృశ్య వర్గాన్ని ఉద్ధరించడమే ఆయన ఆలోచనా విధానంలోని ముఖ్యోద్దేశం. ఆయన అభిప్రాయాలు ఆయన అభివృద్ధికాముకతత్వానికి అద్దం పట్టేవిగా ఉన్నాయి. కాలం చెల్లిన వ్యవసాయ పద్ధతుల స్థానంలో ఉమ్మడి లేదా సమిష్టి వ్యవసాయ విధానం అనుసరించాలనేది అంబేద్కర్ మౌలిక ఆలోచన.

వ్యవసాయ కార్మికుల సమస్యలను సంస్కరించబడిన, మెరుగుపరచబడిన వ్యవసాయ విధానం పరిధిలో కూడా పరిష్కరించడం సాధ్యం కాదు. పారిశ్రామికీకరణ ఒక్కటే వారి జీవన స్థితిగతులను మెరుగుపరిచేందుకు ఏకైక పరిష్కారం. కార్మికులు తగిన పని లేకుండా మిగులుగా ఉన్న దేశాల్లో ఒక్క పారిశ్రామికీకరణ వల్ల మాత్రమే ఉపయోగం ఉండదు. పరిశ్రమల నుండి వ్యవసాయాన్ని వేరు చేయడం దేశ ఆర్థిక వ్యవస్థకు హానికరం. ప్రాసెసింగ్ పరిశ్రమలతో వ్యవసాయాన్ని అనుబంధం చెయ్యడం రైతు కూలీల సమస్యల పరిష్కారానికి దోహదం చేస్తుంది. వ్యవసాయ కార్మికులకు ఇతర విధాలుగా ఉపాధి కల్పించి నిరుద్యోగాన్ని రూపుమాపేందుకు పారిశ్రామికీకరణ, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పారిశ్రామికీకరణ అవసరం.

ఈ సందర్భంలో భూసమస్య, భారతదేశంలో దాని పరిష్కారం గురించి ఇతర అధికారులు ఏమి చెబుతున్నారో అధ్యయనం చేయడం అవసరం. ఢిల్లీ విశ్వవిద్యాలయానికి

చెందిన డాక్టర్ రాజ్‌కృష్ణ 'భారతదేశంలో భూసంస్కరణలు, ఆర్థికాభివృద్ధి'పై చర్చించారు. భూసంస్కరణలను ఆయన విముక్తి కారకంగా, సంస్థాగతంగా, అభివృద్ధికాముకంగా, పంపిణీపరమైందిగా వర్గీకరించారు. విముక్తిదాయకమైన, పంపిణీపరమైందిగా, సంస్థాగత పరమైందిగా తీసుకునే చర్యలు భూసంస్కరణలు, వ్యవసాయ సంస్కరణల ఉపభాగాలుగా పరిగణించాలని ఆయన సూచించారు. ఉత్పాదక కార్యక్రమాలు చేపట్టి, దాని ప్రయోజనాలు అనుభవించేందుకు దోహదం చేసే వ్యవసాయ సమాజాన్ని ఇవి నిర్ణయిస్తాయి. ప్రస్తుత వ్యవస్థ ఎలా ఏర్పడిందనే విషయాన్ని ఆయన అధ్యయనం చేశారు. మౌలిక స్థాయి కంటే తక్కువగా వున్న వ్యవసాయ కమతాలు (భూగరిష్ట పరిమితులు విధించడం ద్వారా పొందిన) మిగులు భూమి సేద్యానికి మాత్రమే.

సహకార, సమిష్టి వ్యవసాయ విధానాన్ని అమలు చెయ్యాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వ్యవసాయ సంస్కరణల కమిటీ (1949) సూచించింది. సమీప భవిష్యత్తులో సహకార వ్యవసాయ విధానాన్ని ప్రయోగాత్మకంగా అనుసరించాలని ప్రథమ పంచవర్ష ప్రణాళిక సిఫార్సు చేసింది. అయితే 'సహకార గ్రామ నిర్వహణ' సమగ్ర లక్ష్యం కావాలని అది సూచించింది. గ్రామంలో మొత్తం సాగు భూమి, సాగులో లేని భూమిని పర్యవేక్షించడంలో గ్రామ సమాజానికి సహకరించేందుకు భూనిర్వహణ శాసనం చెయ్యాలని ప్రణాళిక సిఫార్సు చేసింది. సమిష్టి నిర్వహణకు భూమిని సమీకరించడం సహకార సేద్య విధానం మౌలికాంశంగా ఉంది. భారత జాతీయ కాంగ్రెస్ విధానాన్ని కూలంకషంగా పరిశీలిస్తే ప్రజాస్వామ్య సేద్యానికి అది మొగ్గు చూపుతున్నట్లు అర్ధమవుతుంది. భూమికి సంబంధించిన సమస్యలపై ఒక తీర్మానాన్ని 1959 జనవరిలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశం ఆమోదించింది. మిగులు భూమిని భూమిలేని వారి సమిష్టి వ్యవసాయ సహకార సంస్థలు సాగు చెయ్యాలని ఈ తీర్మానం సిఫార్సు చేసింది. భూమి, సమిష్టి వ్యవసాయంపై అది పరిమితులు విధించింది. పరిమితులు విధించడం, సమిష్టి వ్యవసాయ విధానంతో ముడిపడి ఉంది.

మొత్తం ఆర్థికోత్పత్తిలో పెట్టుబడుల సమీకరణ ప్రధాన చోదకశక్తిగా ఉంటుంది. ఈ ప్రక్రియ వల్ల ప్రయోజనాలు రెండు విధాలుగా ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో మిగులు కార్మికులను మానవశక్తి పెట్టుబడులు సమకూర్చుకోవడంలో సమర్ధవంతంగా ఉపయోగించుకోవచ్చు. మార్కెట్ చేసుకోతగ్గ మిగులు పెరిగి పట్టణ రంగంలో పెట్టుబడులు పెట్టే కార్యక్రమం వేగం పుంజుకుంటుంది. వివిధ రంగాల్లో ఉపాధి అవకాశాలు వస్తాయి.

డాక్టర్ రాజ్‌కృష్ణ మాటల్లో చెప్పాలంటే అంబేద్కర్ మూడు రకాల గ్రామీణ సంస్కరణలకు అనుకూలం. స్వేచ్ఛాయుత సంస్కరణలకు ఆయన అధిక ప్రాధాన్యతనిచ్చినప్పటికీ అఖిల భారత స్థాయిలో పరిష్కారానికి మూడు అంశాలు అత్యవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. భూమిలేని కార్మికుల్లో హరిజనుల సమస్యకు పరిష్కారం భారత వ్యవసాయ సమస్య లేదా మరింత విస్తృత స్థాయిలో భారత ఆర్థిక సమస్యలకు పరిష్కారంపై ఆధారపడి

ఉంటుంది. అస్పృశ్యుల వ్యూహం విస్తృత స్థాయిలో ఆర్థికాభివృద్ధి కోసం రూపొందించే జాతీయ వ్యూహానికి అనుగుణంగా రూపొందించాలి.

వ్యవసాయ ఆదాయం ఆదాయపు పన్ను పరిధిలోకి తీసుకురావాలని అంబేద్కర్ సూచించారు. డాక్టర్ జాన్ ముత్తయ్య అధ్యక్షతన గల టాక్సేషన్ విచారణా సంఘం కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేసింది. భూమిపై యాజమాన్యం, మహర్‌వతన్ వ్యవస్థ రద్దు చెయ్యాలని ఆయన పట్టుబట్టడం గమనార్హం. అణచివేసే వర్గాలపై అణచివేతకు గురవుతున్న వర్గాలు ఒక జరిపే పోరాటం లేదా ఆర్థిక పోరాటంగా ఆయన భావించారు.

అత్యంత వివాదాస్పద అంశంపై వివరణాత్మక విశ్లేషణే 'ది ప్రాబ్లమ్ ఆఫ్ రూపీ' పుస్తకం. రూపాయికి సంబంధించిన సమస్యలను పరిష్కరించారు. ఆయన చరిత్ర గతాల్లోకి వెళ్ళి అన్ని రకాల అభిప్రాయాలను విశ్లేషించి తన తీర్పు ఇచ్చారు. అధికారంలో ఉన్న వారు నిజాన్ని గుర్తించడంలో ప్రదర్శించిన నిర్లక్ష్యం ఫలితంగానే ఈ సమస్య ఉత్పన్నమైంది. మారకపు విలువ కంటే అంతర్గత కొనుగోలు శక్తే అధిక ప్రాధాన్యత సంతరించుకుంటుందనే సత్యాన్ని గుర్తించడంలో వారు నిర్లక్ష్యం ప్రదర్శించారు. బంగారం విలువకు సంబంధించి కరెన్సీ సుస్థిరంగా ఉండటం బంగారం డీలర్లకు మాత్రమే ప్రాధాన్యత సంతరించుకుంటుంది. అయితే సరుకులకు సంబంధించిన సుస్థిరత అందరిపై ప్రభావం చూపింది. బంగారం కరెన్సీకి ఉన్న ప్రాముఖ్యతను మన పాలకులు దశాబ్దాల పాటు విస్మరించారు. 1893లో వెండి నాణాల ముద్రను నిలిపివేయడం రూపాయి కొనుగోలు శక్తి మరింత తగ్గడానికి దోహదం చేసింది. అయితే ఈ చర్య తరుగుదలను నిలిపివేయడానికి దోహదం చెయ్యలేకపోయింది. ఎందువల్ల? ప్రజలు తమ వద్ద వున్న వెండిని మింట్‌కు తీసుకురాలేదు. ప్రభుత్వం మాత్రమే అలా చెయ్యగలదు. చేసినందువల్ల 1893-1914 మధ్య కాలంలో ఇతర దేశాల్లో కంటే భారతదేశంలో ధరలు ఎక్కువగా పెరిగాయి. వాణిజ్య కార్యక్రమాలు ముమ్మరంగా ఉండే సీజన్‌లో వర్తకం అవసరాలకు అనుగుణంగా రూపాయిలను ముద్రించడమే ఇందుకు కారణం. ఆ విధంగా పెరిగిన ద్రవ్య అందుబాటు వ్యాపారం తక్కువగా ఉండే సీజన్‌లో అందుకు అనుగుణంగా తగ్గకపోవడం కూడా ఇందుకు కారణం. కోశాగారం నుంచి రూపాయి ఏ సంవత్సరానికా సంవత్సరం బయటకు వెళ్ళింది ఆ నిష్పత్తిలో తిరిగి రాలేదు. బడా వర్తకులు ఎప్పటికప్పుడు చేసే డిమాండ్లకు అనుగుణంగా రూపాయి కాయిన్ల ముద్రణ ధరల పెరుగుదల అత్యంత ఆందోళనకరమైన అంశంగా మార్చింది.

రూపాయి కరెన్సీని బంగారం కరెన్సీ మాదిరిగా సాధారణంగా కుదించలేకపోవడం ఇందుకు కారణం. ఎగుమతులు లేదా కరిగించడం ద్వారా దీనిని కుదించలేం. ఒకసారి సర్క్యులేషన్‌లో పెట్టిన ధనం అంత తేలికగా, వేగంగా ఫౌంటెన్ హెడ్‌కు తిరిగి రాకపోవడం భారత సమాజం ఆర్థిక వ్యవస్థ లక్షణంగా ఉంది. అందువల్ల మింట్‌ను ప్రజలకే కాదు ప్రభుత్వానికి కూడా మూసివెయ్యాలని అంబేద్కర్ సూచించారు (ఒక పరిమితికి మించి). ఇది ద్రవ్యోల్బణాన్ని,

అంతర్గత ధరల స్థాయిలో హెచ్చుతగ్గులను నియంత్రిస్తుందని అన్నారు. విలువ ప్రమాణం బంగారం రూపంలో ఉండాలి. ద్రవ్య విస్తరణ దీని ఆధారంగానే ఉండాలి. బంగారం ప్రాతిపదికగా ద్రవ్య విస్తృతి, కుదింపు తేలికగా ఉండాలి.

అంబేద్కర్ ఎంతో మేధోసంపత్తి ప్రదర్శించి ఈ పుస్తకంపై ఎంతగానో శ్రమించారు. రూపాయిపై వెలువడిన అన్ని ప్రచురణలను అది అధిగమించింది. భారత ఆర్థిక రంగానికి ఈ పుస్తకం ద్వారా అంబేద్కర్ విశేష సేవలందించారు. ఆలోచనను రేకెత్తించే ఈ పుస్తకం ద్వారా ఆయన బహు ప్రశంసలు పొందారు. ఈ పుస్తకంపై పత్రికారంగం ఈ విధంగా అభిప్రాయాలు వ్యక్తం చేసింది.

ది టైమ్స్ (లండన్) : అద్భుతమైన పుస్తకం. ఆంగ్లభాష సులభశైలిలో ఉంది. ఈ అంశంపై అంబేద్కర్‌కు ఉన్న విజ్ఞానం అపారం.

ది ఎకనామిస్ట్ (లండన్) : ఇది స్పష్టంగా, చక్కని శైలితో రాయబడిన పుస్తకం. ద్రవ్య సంబంధమైన సమస్యల్లో అన్ని అంశాలపై రాయబడిన పుస్తకాల్లో అత్యుత్తమ రీడబిలిటీ గల పుస్తకం అనడంలో సందేహం లేదు.

ది స్టేట్స్‌మన్ : అత్యంత జాగ్రత్తగా, ఎంతో పరిశోధన చేసి రాసిన తపన, కృషి పుస్తకంలో ఆసాంతం ప్రస్ఫుటమవుతుంది. ప్రొఫెసర్ కానన్ ముందుమాట రాసిన ఈ పుస్తకం చక్కని భావప్రకటనకు నిలువెత్తు నిదర్శనం. భారత ఆర్థిక శాస్త్రాన్ని అభ్యాసం చేసే విద్యార్థులందరూ చదవదగ్గ పుస్తకం.

ది ఫైనాన్షియర్ : సమస్యను అంబేద్కర్ ధారాళమైన, స్పష్టమైన శైలిలో ప్రశంసనీయంగా రాశారు. సమస్య లోతులను అధ్యయనం చేయడం మాత్రమే కాకుండా విలువైన పరిష్కారాలు కూడా ఇచ్చారు. బ్యాంకర్లు, ఎక్స్ఛేంజ్‌పై వ్యాపారం ఆధారపడ్డ వర్తకులు తప్పక చదవాల్సిన పుస్తకం.

ఈ పుస్తకానికి ముందుమాట రాసిన అంబేద్కర్ గురువైన ప్రొఫెసర్ ఎడ్విన్ కానన్ అంబేద్కర్ చేసిన కొన్ని విమర్శలతో ఏకీభవించలేదు. అంబేద్కర్ వ్యక్తం చేసిన కొన్ని అభిప్రాయాలతో నేను ఏకీభవించకపోయినప్పటికీ, అతడు పొరపాటు పడినట్లు భావించినప్పటికీ ఆయన రాతల వెనుక ఆలోచనలు రేకెత్తించే అభిప్రాయాలు, కారణాల తాజాదనం తనను ఎంతగానో ఆకర్షించిందాయని ఆయన అన్నారు. ఆచరణాత్మక ముగింపు విషయంలో అంబేద్కర్ అభిప్రాయాలు సరిగానే ఉన్నాయన్నారు. భారత కరెన్సీ సమస్యలపై పుస్తకాలు రాసిన రచయితలు అంబేద్కర్ పుస్తకం గురించి ప్రస్తావించారు. తమ పుస్తకాల్లో అంబేద్కర్ పుస్తకం నుండి కొన్ని అంశాలను స్వీకరించారు. "డాక్టర్ అంబేద్కర్ బంగారం, కరెన్సీ ప్రమాణాలను ప్రోత్సహించారు. మార్పిడికి వీలుకాని స్థిరమైన పరిమితి గల రూపాయి పట్ల సానుకూలత చూపారు. ఆయన వ్యక్తం చేసిన అభిప్రాయాలు స్పష్టంగా వున్నాయి. వాదనలు అంగీకారయోగ్యంగా, స్పష్టమైన శైలిలో ఉన్నాయి."

'ది ఎవల్యూషన్ ఆఫ్ ప్రొవిన్షియల్ ఫైనాన్స్ ఇన్ బ్రిటిష్ ఇండియా' పుస్తకంలో అంబేద్కర్ వ్యక్తం చేసిన అభిప్రాయాలు ఇంపీరియల్ ఫైనాన్స్ వికేంద్రీకరణపై పరిశోధనల ప్రాతిపదికగా ఉన్నాయి. ప్రొఫెసర్ ఆర్.ఎ. సెలిగ్మన్ ఈ పుస్తకానికి రాసిన ముందుమాటలో ఈ విధంగా పేర్కొన్నారు. "వాస్తవాల సేకరణ, దేశంలో చోటు చేసుకున్న తదనంతర ఆసక్తికరమైన పరిణామాలపై నిష్పక్షపాత విశ్లేషణ ఈ దిశగా సాగిన చర్చలో అంబేద్కర్ చేసిన కృషికి సాక్ష్యంగా నిలుస్తాయి. నాకు తెలిసినంతవరకు ఆర్థిక సిద్ధాంతాలకు సంబంధించి ఇంతటి లోతైన పరిశోధన జరిగిన సందర్భం లేదు."

పరిశ్రమలు, జీవిత బీమాను జాతీయం చేయడంపై అంబేద్కర్ వ్యక్తం చేసిన అభిప్రాయాలు భారత ఆర్థిక సమస్యలపై ఆయన ఎంత విస్తృతంగా పరిశోధనలు చేసిందీ తెలియజేస్తున్నాయి. ప్రభుత్వరంగం, జీవిత బీమా సంస్థ ఏర్పాటు ఆయన ఇతర ప్రముఖ ఆర్థికవేత్తల అభిప్రాయాలతో ఏకీభవించిన విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. మద్యనిషేధ సమస్యపై ఆయన వ్యక్తం చేసిన అభిప్రాయాలు కూడా కాలానుగుణంగా ఉన్నాయి.

గ్రామాల్లో భూవ్యవస్థను మార్చడంలో జరుగుతున్న జాప్యమే ఆర్థికరంగంలో భారత్ వెనుకబాటుకు కారణమని అంబేద్కర్ విశ్లేషించారు. ఆర్థిక సామర్థ్యం, ఉత్పాదకత, గ్రామ ఆర్థిక వ్యవస్థను సమూలంగా మార్పు చేయడం, సమిష్టి యాజమాన్యం, ఉత్పాదన ఈ సమస్యకు అసలు సిసలు పరిష్కారాలని అంబేద్కర్ సూచించారు. ఆర్థిక దోపిడీ, సామాజిక అన్యాయాన్ని రూపుమాపేందుకు ఇవి ఉద్దేశింపబడ్డాయి. భూకామందు, కౌలుదారు, భూమిలేని కార్మికుడు ఉండరాదని ఆయన ఆకాంక్షించారు. స్వేచ్ఛ, సంక్షేమాన్ని ఆయన కోరుకున్నారు. తన వాస్తవ ఆర్థిక ఆలోచనల్లో ఇవి రెండూ సాధ్యమేనని అభిప్రాయపడ్డారు. సహకార వ్యవసాయ విధానంలో భూమిలేని కార్మికునికి సరియైన స్థానం కల్పించలేదని అభిప్రాయపడ్డారు. ఈ విధంగా భారత్ ఆర్థిక రంగంలో ప్రతి సున్నితమైన అంశాన్ని ఆయన సృజనాత్మకంగా విశ్లేషించారు.

అయితే వ్యవసాయ జాతీయీకరణపై ఆయన ఆలోచనలు ఆచరణరీత్యా అసాధ్యమైనవి, లక్ష్య సాధనకు దోహదం చేసేవి కావు. తిరోగమన శక్తులు వీటిని తిరస్కరించడమే ఇందుకు కారణం. శాస్త్రీయ సోషలిజం, లైసెజ్ ఫైర్‌ను వ్యక్తం చేసిన అభిప్రాయాలు ఆర్థిక సమస్యలకు సంబంధించి ఆయన ఆలోచనలకు అద్దం పడుతున్నాయి. పైకి స్పష్టంగా కనిపించే అన్ని సామాజిక, ఆర్థిక అసమానతలను నుండి బయటపడి సమాజం ప్రగతిశీలక సమాజంగా అవతరించాలని ఆయన విశ్లేషించారు. పెట్టుబడిదారీ వ్యవస్థే సామాజిక, ఆర్థిక అసమానతలకు కారణమని పేర్కొన్నారు. మిశ్రమ ఆర్థిక వ్యవస్థే ఆయన ప్రవచించిన ఆర్థిక సిద్ధాంతంలో మైలురాయి వంటిది. సమాజంలో పేద వర్గాల ఆర్థిక సంక్షేమానికి దోహదం చేసేవిగా ఉన్నంత వరకు, ఆర్థిక విలువలు సమస్యల పరిష్కారంలో అంతర్లీనంగా ఉన్నంతవరకు ఆర్థిక సంబంధాలకు సంబంధించి అంబేద్కర్ ఆలోచనలు హేతుబద్ధమైనవే.

ప్రభుత్వ సోషలిజం, ప్రభుత్వ విధానపరమైన ఆదేశిక సూత్రాల్లో సోషలిజం సిద్ధాంతాల మేళవింపు, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, సోషలిజం స్థాపనకు అవసరమైన మార్గాలని అంబేద్కర్ చేసిన ప్రవచనం జాగ్రత్తగా పరిశీలించ తగ్గ అంశం. పేదవర్గాల సంక్షేమం, పుట్టుక ప్రాతిపదికగా వచ్చే అసమానత్వం, సమాజంలో వివక్షతతో కూడిన ప్రవర్తనలను రూపుమాపడం, సమాజంలో అందరి ప్రయోజనాల కోసం రాజకీయ ఆర్థిక విధానాన్ని పునర్వ్యవస్థీకరించడం, బలహీన, అణగారిన వర్గాలకు సామాజిక భద్రత కల్పించడం, పరిపూర్ణ ఉపాధి, విద్యావకాశాలు కల్పించడం, చివరగా సహకారం, ప్రేమ, వాత్సల్యం, స్నేహం ప్రాతిపదికగా, సామాజిక కట్టుబాట్ల ప్రాతిపదికగా మానవుల విభజనకు అవకాశం లేని భారతీయ సమాజం నిర్మించడం అంబేద్కర్ ఆలోచనల్లోని సోషలిజం, సమాజం లక్షణాలుగా ఉన్నాయి. నిరంతర ప్రజాస్వామిక కృషి ద్వారా భారతీయ సమాజంలో ఈ ధోరణులను వేగవంతం చెయ్యవచ్చు. ప్రజలను చైతన్యపరచడం ద్వారా, ప్రజాస్వామ్యం, సోషలిజం కోసం పోరాటం సల్పడం ద్వారా మాత్రమే ఈ లక్ష్యాన్ని సాధించవచ్చు.

అంబేద్కర్ రాజకీయ ఆర్థిక వ్యవస్థకు ఒక నైతిక లక్ష్యం ఉంది. మానవ సంక్షేమంపై ప్రసరింపచేసే ప్రభావం ప్రాతిపదికగా ఆర్థిక కార్యకలాపాలను అధ్యయనం చేయడం ఇందులోని ప్రధానాంశం. ఆర్థిక సంపద, ఆర్థిక సంబంధాలతో నిమిత్తం లేకుండా మానవులు, వారి ఆశయాలు, అభీష్టాలకు మాత్రమే అది ప్రాధాన్యతనిస్తుంది. ప్రజలందరికీ సంపద సమానంగా పంపిణీ చేయడం అంబేద్కర్ ఆర్థిక సిద్ధాంతాల మౌలిక లక్ష్యం. ఈ విషయంలో ఆయన శిశ్మోండి, మాల్థస్ వంటి ఆర్థికవేత్తలతో ఏకీభవించారు. ఆర్థిక సమస్యలకంటే పంపిణీ పరమైన సమస్యలే ప్రాధాన్యత సంతరించుకుంటాయని వారు ప్రవచించారు.

స్వతంత్ర, జనసంఘ్, ఇతర రైటిస్ట్ పార్టీలు అంబేద్కర్ ఆర్థిక విధానాన్ని నిరంతరం విమర్శించేవి. సోషలిజం వైపు వేసే అడుగులకు ప్రతిబంధకం కల్పించేవి. బడుగు వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సోషలిజమే సాధనమని ఆయన భావించారు. సోషలిజం సాధనకు అవసరమైన ప్రగతిశీలక చర్యలకు ఆయన మద్దతు తెలిపారు.

రాజకీయవేత్త, రాజనీతిజ్ఞుడు అయిన అంబేద్కర్‌కు ప్రతిరూపమే ఆర్థికవేత్తగా అంబేద్కర్. రాజకీయవేత్తగా తాను నమ్మిన సిద్ధాంతాల ప్రాతిపదికగానే ఆయన ఆర్థిక ఆలోచనలు ఉన్నాయి. రాజకీయంగా ఉపయుక్తంగా భావించిన సందర్భాల్లోనే ఆర్థిక వ్యవహారాల గురించి ఆయన రాశారు. రాజకీయ కార్యకలాపాల నీడలో ఆర్థిక పరిశోధనలు మరుగునపడిపోయాయి. ఆర్థికవేత్తగా ఆయన్ను కోల్పోవడం తీవ్ర నష్టదాయకం అనడం అతిశయోక్తి కాదు. ఆర్థికవేత్తగా ఆయన సామర్థ్యం తక్కువేమీ కాదు.

# అధ్యాయం 15

# సామాజిక, రాజకీయ ఆలోచనాపరునిగా అంబేద్కర్

సుమారు 40 ఏళ్ళ అంబేద్కర్ ప్రజా జీవనంలో అనేక దశలున్నాయి. మొదటి దశ సన్నాహక దశలో 1918 నుండి 1928 వరకు న్యాయవాదిగా ఆయన జీవితంలో నిలదొక్కుకున్నారు. 'ది ప్రాబ్లమ్ ఆఫ్ రూపీ' పేరుతో సమర్పించిన థీసిస్‌కు గాను అర్థిక శాస్త్రంలో అత్యున్నత డిగ్రీ పొందారు. చెరువుల్లో మంచినీరు తీసుకునే విషయంలో అస్పృశ్యుల హక్కు కోసం మహర్‌లో సత్యాగ్రహం నిర్వహించారు. వారికి మానవ హక్కుల కోసం ఆయన పోరాటం జరిపారు. అస్పృశ్యులకు సమానత్వం, స్వేచ్ఛ, పౌర హక్కుల కోసం అవిరళ కృషి సల్పారు.

అంబేద్కర్ ప్రజా జీవనంలో రెండవ దశ 1929 నుండి 1936 వరకు కొనసాగింది. అస్పృశ్యులకు ప్రత్యేక హక్కుల కోసం ఆయన రాజ్యాంగ పోరాటం నిర్వహించారు. దేశంలో రాజకీయ పరిస్థితులు, తన అనుభవాలకు అనుగుణంగా ఆయన తన ఆలోచనలను మలచుకున్నారు. సిద్ధాంతరీత్యా ప్రత్యేక హక్కులు అంటే హిందువుల్లో అగ్రకులాల నుండి బానిస వర్గాల రాజకీయ వేర్పాటుతనం. సామాజికంగా వేర్పాటుకు గురైన వారు రాజకీయంగా కూడా వేర్పాటుకు గురవుతారని అంబేద్కర్ భావించారు. 'అస్పృశ్యులు భారత జాతీయ జీవనంలో ప్రత్యేక శక్తులు" అని అంబేద్కర్ వాదించారు. అస్పృశ్యులకు ప్రత్యేక కాలనీలు ఉండాలని అంబేద్కర్ పేర్కొన్నారు. ఇలా వారికి ప్రత్యేక వాడలు ఏర్పాటు చెయ్యడం హిందువుల్లో చీలికలు సృష్టిస్తుందని అన్నారు. హిందూ సామాజిక వ్యవస్థపై తీవ్ర తిరుగుబాటుతనాన్ని ఆయన పెంపొందించుకున్నారు. హిందూయిజంతో తెగతెంపులు చేసుకోవాలనే తన సంకల్పాన్ని ఇయోలా సమావేశంలో ఆయన వ్యక్తం చేశారు.

ఇక మూడవ దశ 1937 నుండి 1946 వరకు కొనసాగిందని భావించవచ్చు. ఇండిపెండెంట్ లేబర్ పార్టీని స్థాపించారు (1937తో బొంబాయి శాసన మండలికి జరిగిన ఎన్నికల్లో రెండు సాధారణ స్థానాలతో పాటు 15 రిజర్వ్‌డ్ స్థానాలకు గాను 13 స్థానాలను ఆ పార్టీ గెలుచుకుంది). బొంబాయి శాసన మండలిలో ప్రతిపక్ష నాయకునిగా ఉన్నారు.

1942లో వైస్రాయ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో సభ్యుడయ్యారు. 1946 వరకు ఆయన ఈ పదవిలో కొనసాగారు. ఆ సమయంలో అధికార బదిలీపై విస్తృత స్థాయిలో చర్చలు జరిగేవి.

నాల్గవ దశలో భారత రాజ్యాంగ పరిషత్ రూపకల్పన కమిటీ ఛైర్మన్‌గా సమర్ధవంతంగా వ్యవహరించారు. ఆధునిక మనువుగా పేరు పొందారు. స్వతంత్ర భారతదేశంలో తొలి న్యాయశాఖ మంత్రిగా వ్యవహరించారు. ఆ పదవికి రాజీనామా చేసిన తరువాత పార్లమెంట్‌లో ప్రతిపక్ష నాయకునిగా వ్యవహరించారు.

ఇక ప్రజా జీవనం చివరి దశలో పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. 1956లో బౌద్ధమతం స్వీకరించారు. తన వేలాదిమంది సహచరులను కూడా బౌద్ధమతంలో చేర్చారు. మార్పిడిజానికి వ్యతిరేకంగా బౌద్ధమతానికి విస్తృత ప్రచారకునిగా వ్యవహరించారు. అస్పృశ్యులు, బడుగు వర్గాలను సామాజిక బానిసత్వం నుండి విముక్తి కల్పించడం, వారి రాజకీయ ఆకాంక్షలు మతపరమైన భావోద్వేగాలకు, సంస్కరణ ఉద్యమాలకు లోబడి ఉండాలనే స్థిర సంకల్పం అంబేద్కర్‌లో కలిగింది. అందువల్ల వారికి ప్రత్యేక హక్కులు కల్పించడం, నివాసానికి ప్రత్యేక కాలనీలు ఏర్పాటు చెయ్యడం వంటి అంశాలకు అంబేద్కర్ ఒత్తిడి చెయ్యడం విరమించారు.

ఈ నాలుగు దశల్లో ఆయన తన దేశవాసులు, ప్రపంచానికి ముందు ప్రొఫెసర్‌గా, బారిస్టర్‌గా, మేధావిగా, శాసనసభ్యునిగా, రాజ్యాంగవేత్తగా, సంఘ సంస్కర్తగా, రాజకీయ నాయకునిగా, మంత్రిగా, ఆధునిక మనువుగా. రాజ్యాంగ నిర్మాతగా, వీటన్నిటికీ మించి ఒక వర్గం నాయకునిగా ఆయన దర్శనం ఇచ్చారు.

రాజకీయ స్వేచ్ఛ లభించే అవకాశాలు కనిపించిన వెంటనే వయోజన ఓటు హక్కుపై దృష్టి సారించారు. మతపరమైన చైతన్యం, సంఘ సంస్కరణ ఆయన ఆలోచనా ప్రక్రియలో ముఖ్యమైన అంశాలు. మానవ జీవితం సమిష్టి అంశాలకు ఆయన ప్రాధాన్యతనిచ్చారు. భౌతిక, ఆధ్యాత్మిక వివేచన మధ్య సమతూకం అవసరమని, అది లేకుండా సమాజం అభివృద్ధి చెందదని ఆయన భావించారు.

అంబేద్కర్ అభిప్రాయాలతో ఎంతగా విభేదించే వారయినా ఆయనను ఆరాధించకుండా ఉండలేరు. అట్టడుగు స్థాయిలో జన్మించి అత్యున్నత స్థాయికి ఎదిగారు. భారత నాయకుల్లో అత్యంత మేధావుల్లో ఆయన ఒకరు. భారత్, బ్రిటన్, అమెరికా, జర్మనీ... ఆయన్ను ఎంతగానో గౌరవించాయి. డాక్టరేట్లు ప్రదానం చేశాయి. ఆర్థికవేత్త – న్యాయవాది, ప్రొఫెసర్ – రచయిత, పోరాట యోధుడు – రాజకీయ నాయకుడు – ఇలా ఆయన జీవితంలో ఎన్నో ముఖాలున్నాయి. గోల్డ్‌స్మిత్ గురించి జాన్సన్ చెప్పినదంతా అంబేద్కర్‌కు వర్తిస్తుంది. "ఆయన చేపట్టిన దేనిలోనూ వెలుగు వెలగకుండా లేరు."

## సెక్షన్-1

### సామాజిక ఆలోచన

హిందువుల్లో అగ్రవర్ణాల వారు తమ కులం పట్ల ప్రదర్శించిన వివక్షతకు, నిస్పృహకు గురికావడమే అంబేద్కర్ ఆలోచనా విధానానికి ఆలంబనగా మారింది. ఈ వివక్షత ఆయనలో కొత్త ఆలోచనలు నింపింది. ప్రజాభిప్రాయాన్ని సమీకరించి విప్లవాలు తీసుకురావడంతో ఆయన నిష్ణాతుడు. దేశ చట్టాలను మార్చి అనేక విప్లవాలకు మూలమయ్యారు. కలల్లో విహరించే వ్యక్తి కాదు. ఆచరణవాది. ఆయనకు బలమైన సిద్ధాంతాలున్నాయి. ఆ సిద్ధాంతాలు పొరపాటు ఆలోచనలతో రూపొందినవి కావు.

ఆయన తత్వం మూలాలు మతంలో ఉన్నాయి, రాజకీయాల్లో లేవు. భారతదేశంలో సామాజిక విప్లవం తీసుకువచ్చేందుకు దోహదం చేసేదే ఆ తత్వం. సామాజిక సిద్ధాంతం, రాజకీయ సిద్ధాంతం పరస్పర విరుద్ధమైనవి. రాజకీయ సిద్ధాంతం, స్వాతంత్ర్యం, సమానత్వాన్ని అనుమతిస్తుంది. అయితే సామాజిక సిద్ధాంతం వాటిని త్యజిస్తుంది. మెజారిటీ వ్యక్తుల రాజకీయ సిద్ధాంతం అందరి సామాజిక సిద్ధాంతం కావాలని ఆయన ఆకాంక్షించారు. సామాజిక సమున్నతి, రాజకీయ చైతన్యం, ఆధ్యాత్మిక భావోద్వేగం, అంబేద్కర్ తత్వంలో ప్రధాన అంశాలు. పేద ప్రజల ఆర్థిక సౌభాగ్యానికి అది తగిన ప్రాధాన్యతనిస్తుంది. రాజకీయ, సామాజిక జీవిగా మానవుని వైఖరి కారణంగా రాజకీయ సిద్ధాంతం సామాజిక చైతన్యానికి ప్రేరణగా నిలుస్తుంది. ప్రాథమిక హక్కుల పట్ల ఆయనకు అపార నమ్మకం ఉంది. పురుషులు, మహిళల మధ్య సమాన హక్కులు, వ్యక్తి గౌరవం, సామాజిక, ఆర్థిక న్యాయం, సామాజిక అభివృద్ధిని పెంపొందింపచెయ్యడం, మానవ జీవితానికి సంబంధించిన అన్ని రంగాల్లో ప్రశాంతత, భద్రత చేకూరడం ద్వారా ఉన్నత జీవన ప్రమాణాలపై అంబేద్కర్‌కు ఉన్నత విశ్వాసాలున్నాయి. సామాజిక వాస్తవాలను అధ్యయనం చేసే వైఖరి ఆయన రాజకీయతత్వానికి శోభ చేకూర్చింది. రాజకీయంగా, ఆచరణాత్మకంగా వ్యవహరించేందుకు ఇది దోహదం చేసింది. అదే సమయంలో ఆయన నైతిక విలువలు, సాంప్రదాయాలను కూడా పాటించారు.

### పూలే - అంబేద్కర్

అంబేద్కర్ వివిధ రంగాల్లో చేసిన కృషి ఆయనకు ముందు నాయకులు నిర్వహించిన కృషికి ఎంతో విభిన్నమైంది. ఆయన లక్షలాది బడుగు వర్గాలకు చెందిన ప్రజల సామాజిక దాస్య శృంఖలాల నుండి స్వేచ్ఛ, రాజకీయ అభ్యున్నతి, ఆర్థికోద్ధరణ అంశాల కోసం శ్రమించారు. ఇంత బలమైన దృక్పథంతో, సమర్ధవంతంగా ఏ ఇతర అగ్రకుల హిందూ నాయకుడు ఈ బాధ్యతను చేపట్టలేదన్నది నిర్వివాదాంశం. పులే, అంబేద్కర్ మాదిరిగా ఇతర సామాజిక విప్లవ కారకులెవరూ రాజకీయ సంస్థలపై సిద్ధాంతాల ప్రాతిపదికగా ఇంత ధైర్యంగా దాడి చేయలేకపోయారు. సామాజిక వివక్షత, బానిసత్వాలను సమాజం ఆసాంతం తిరస్కరించాలని,

కూకటి వేళ్ళతో పారద్రోలాలన్నది వారి సిద్ధాంతం, ఆలోచన కాదు. ఆధునిక అనివార్య పరిస్థితులు, హేతువుల నేపథ్యంలో పవిత్ర రచనల అన్వయాల్లో మార్పు మాత్రమే వారు ఆకాంక్షించారు. అంబేద్కర్‌లో ఈ పరిమితి లేదు.

ఆధునిక భారతదేశంలో బ్రాహ్మణేతర సామాజిక సంస్కరణ ఉద్యమం మౌలిక లక్ష్యానికి జ్యోతీబా పూలే, అంబేద్కర్ ప్రతీకలుగా నిలిచారు. జాతీయ స్థాయిలో సాధారణ చైతన్యం, ప్రజాస్వామ్య స్ఫూర్తి, సంఘ సంస్కరణ ఉద్యమం ఫలితమే. ఇప్పటి వరకు స్పృశించని తరగతులకు సంస్కరణల సందేశం అందింది. భారత సమాజంలో ప్రత్యేకంగా ఒక వర్గానికి ఇది ఉద్దేశింపబడింది. అయినప్పటికీ విస్తృత స్థాయిలో సంస్కరణలు వేగవంతంగా, పటిష్టవంతంగా ప్రవేశం తీసుకురాగల సామర్థ్యం దానికి ఉంది. పూలే, అంబేద్కర్‌లు అందించిన సేవలు పైకి కనిపించే స్థాయి కంటే విస్తృతంగా ఉన్నాయి.

అంబేద్కర్ తనలో సంఘ సంస్కర్త, రాజకీయ నాయకుడు, అస్పృశ్యుల పాలిట చైతన్యమూర్తి స్వరూపాలను ఇముడ్చుకున్నారు. తన వర్గం రాజకీయ దృక్పథం, మనసులను మలచడంలో ఆయన కీలక పాత్ర పోషించారు.

గౌతమ బుద్ధుడ్ని అంబేద్కర్ తన గురువుగా భావించారు. ఆయన బోధనలు హిందూ మత ప్రబోధాలకు పూర్తి భిన్నమైనవని ఆయన అభిప్రాయపడ్డారు. గౌతమ బుద్ధుడు మానవత్వాన్ని ప్రబోధించిన ఉత్తమ ఉపాధ్యాయుడని, అత్యున్నతమైన ప్రేమ సిద్ధాంతాన్ని ప్రవచించాడని అంబేద్కర్ వ్యాఖ్యానించారు. స్వేచ్ఛ, సమానత్వం, సోదర భావాలను వ్యతిరేకించే బ్రాహ్మణిజంపై బుద్ధిజం శక్తివంతమైన తిరుగుబాటు అని పేర్కొన్నారు. ప్రార్థనలు, సంప్రదాయాలు, త్యాగాలకు తావులేని జీవితాన్ని భారతీయుల జీవన విధానంలో ప్రవేశపెట్టేందుకు బౌద్ధమతం ప్రయత్నించింది. బౌద్ధమత స్థాపకుడు వ్యక్తిత్వం, తాత్విక పటుత్వం అంబేద్కర్‌ని విశేషంగా ఆకర్షించాయి. ఈ కారణం వల్లే ఆయన బౌద్ధమతానికి మారారు.

మహారాష్ట్ర మార్టిన్‌లూథర్‌గా పేరుగాంచిన మహాత్మాపూలే అత్యుత్తమ సంఘ సంస్కర్తగా అంబేద్కర్ పేర్కొన్నారు. పూలేని అత్యుత్తమ శూద్రునిగా అంబేద్కర్ అభివర్ణించారు. ఉన్నత వర్గాలకు తమ కట్టు బానిసతనాన్ని బడుగు వర్గాలు గుర్తించేలా చేశారు. విదేశీ పాలన నుండి స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు పొందడం కంటే భారత సామాజిక ప్రజాస్వామ్యం అత్యంత ముఖ్యమనే మూలసూత్రాన్ని ప్రబోధించిన వ్యక్తియని అంబేద్కర్ పేర్కొన్నారు. (అంబేద్కర్ : హూవర్ సాధూస్? పి.వి.) మహారాష్ట్ర ఉదారవాద, సంస్కరణాత్మక సాంప్రదాయాలకు అంబేద్కర్‌ను పూలే చేరువ చేశారు. పూలే ప్రభావానికి గురైన అంబేద్కర్ సంఘ సంస్కర్తల, రాజకీయ ఉద్యమకారుల తత్వాన్ని అంగీకరించడమే కాకుండా గట్టిగా సమర్థించడం కూడా చేశారు. ఉదారవాద సంస్కరణ ఉద్యమంలోని లోపాలను ఆయన అధిగమించారు. ప్రజల మనిషిగా మారారు. ప్రజలతో నిరంతరం సంబంధాలు నెలకొల్పుకునేందుకుగాను రాజకీయ సంస్థను స్థాపించారు.

## మత సాహిత్యంపై దాడి

నమ్మకానికి ప్రాధాన్యత లభించడం అంబేద్కర్ ఫిలాసఫీలో ప్రధాన సిద్ధాంతం. మత సాహిత్యంపై ఆయన స్వయంగా దాడి చెయ్యడం కూడా ఈ సిద్ధాంతం ప్రాతిపదికగా చేసిందే. తన నమ్మకానికి అనుగుణంగా నడుచుకునే స్వేచ్ఛ హిందువులకు లేదని అంబేద్కర్ అభిప్రాయపడ్డారు. హిందువులు మనువు, వేదాలు, స్మృతులు, సదాచారాలకు అనుగుణంగా నడచుకోవాలి. వేదాలు, స్మృతులను అన్వయించే హేతుబద్ధతను 'మనువు' తీవ్రంగా ఖండించారు. అది నాస్తికత్వం అంత దుర్మార్గమైనదిగా పరిగణింపబడింది. వెలివేయడమే వారికి విధింపబడిన శిక్ష.

మత సాహిత్యంపై హిందువుల విధానాలపై అంబేద్కర్ చేసిన దాడి. వాస్తవానికి వారు (హిందువులు) అనుమతించిన నిచ్చెన మెట్ల అసమానత్వంపై దాడి, ఈ అసమానత్వ విధానం కేవలం ఊహాజనితమైనది కాకుండా న్యాయబద్ధమైనదిగా హిందువుల వైఖరిపై జరిపిన వాస్తవిక దాడి. సాంఘిక సంస్కరణలపై అంబేద్కర్ ఆలోచనా సరళి ఆయన కంటే ముందున్న వారి ఆలోచనా ధోరణికంటే విస్తృతమైంది. అస్పృశ్యతా నిర్మూలన అనివార్యంగా మత పుస్తకాలపై విమర్శలు చేసేందుకు దోహదం చేసింది. దీని హేతుబద్ధ ఆవశ్యకతను అంబేద్కర్ కంటే ముందు అస్పృశ్యతపై పోరాటం సల్పినవారు గుర్తించలేదు. మతపరమైన పుస్తకాలు, సంప్రదాయాల అన్వయం పాశ్చాత్య దేశాల సంప్రదాయాలకు అనువుగానే ఉంది. మితిమీరని విమర్శ, హేతుబద్ధమైన మత విశ్లేషణ వారి ప్రత్యేకతలు.

అంబేద్కర్ సామాజిక సంస్కరణ ఉద్యమంలో మరో ముఖ్యమైన విశేషం హిందూ మత ప్రధాన లక్షణం. ఆలోచనా సరళిపై నిలకడతో కూడిన నిశితమైన దాడి చెయ్యడం. హిందూ సాంఘిక సంస్థల ప్రమాదకరమైన ఫలితాలపై ప్రజల నిర్లిప్త ధోరణిని కూడా ఆయన గట్టిగా వ్యతిరేకించారు. మతం అనేది మనిషికే కాక, సమాజానికి కూడా అత్యవసరమని అంబేద్కర్ అభిప్రాయం. వ్యక్తుల పురోభివృద్ధికి అది సాధనంగా మారాలని ఆయన అభిప్రాయ పడ్డారు.

## పోరాటంపై దృష్టి

"యాచన ద్వారా, ఆత్మ ప్రబోధానికి పిలుపు ఇవ్వడం ద్వారా కోల్పోయిన హక్కులు తిరిగి పొందలేమని, అవిశ్రాంత పోరాటం ద్వారానే అది సాధ్యమని అంబేద్కర్ ఉద్బోధించారు. అందుకే పోరాటం చెయ్యాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. కనీస ప్రతిఘటన సిద్ధాంతాన్ని ఆయన వ్యతిరేకించారు. మహద్‌లో చౌదర్ చెరువు, నాసిక్‌లో కళారాం దేవాలయం, మలబార్‌లో గురవాయూర్ దేవాలయాలకు సంబంధించి కొన్ని రోజుల పాటు అమలు చేసిన ప్రత్యక్ష కార్యాచరణ ప్రభావం లక్షలాది రోజుల సంఘ సంస్కర్తల ఉద్బోధనల కంటే శక్తివంతమైంది.

సంఘ సంస్కర్తల బోధనలు సాధించలేని పనిని ప్రత్యక్ష కార్యాచరణ స్వల్ప కాలంలోనే సాధించింది (కీర్. op.cdt.p-222).

రాజకీయ హక్కులు, రాజకీయ అధికారం లేకుండా బడుగు వర్గాల అభ్యున్నతి సాధ్యం కాదనే విషయం అంబేద్కర్‌కు తెలుసు. హిందూ సమాజాన్ని సంపూర్ణ ప్రక్షాళన చెయ్యాలని పట్టుబట్టాలని బడుగు వర్గాలకు నేను మాటిస్తాను. హిందూ సమాజంలో తాము అంతర్భాగమని గుర్తించే ముందు వారు ఈ పని చెయ్యాలి. బడుగు వర్గాల్లో ఉత్సాహం నింపి తమ స్థానం గురించి అవగాహన కలిగించేందుకు నేను దేవాలయ ప్రవేశ సత్యాగ్రహాన్ని ప్రారంభించాను. నేను సాధించానని నమ్ముతున్నాను. అందువల్లనే దేవాలయ ప్రవేశ ఆందోళన వల్ల ఉపయోగం లేదు. బడుగు వర్గాలు తమ శక్తిని, వనరులను రాజకీయాలు, విద్యపై కేంద్రీకరించాలని నేను కోరుతున్నాను.

కుల వ్యవస్థ, అస్పృశ్యత రద్దు కావాలనే అంబేద్కర్ సామాజిక సంస్కరణ పథకం మతంపై ఆయన హేతుబద్ధ దృక్పథంలో అంతర్భాగంగా ఉంది. గుడ్డి నమ్మకం, ఆలోచనా రహితమైన ఆచరణ కన్నా విధాన సాధనంలో విశ్వాసం, హేతుబద్ధత అవసరమని అంబేద్కర్ నొక్కి చెప్పారు. మతపరమైన సమస్యల పరిష్కారానికి సామాజిక వైఖరి అవసరం. తమ సహచరుల సామాజిక అభ్యున్నతి, రాజకీయ విముక్తి, ఆర్థిక బానిసత్వం నుండి విముక్తి కోసం ఆయన అవిశ్రాంత పోరాటం సల్పారు.

అంబేద్కర్ తన యావజ్జీవితం బ్రాహ్మిణిజానికి, కుల వ్యవస్థ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం జరిపారు. అమానుషమైన, అస్పృశ్యుల పురోగమనానికి ప్రతిబంధకమైన కుల వ్యవస్థ నిర్మూలన కావాలని ఆయన ఆకాంక్షించారు. కుల వ్యవస్థపై పోరాటం అస్పృశ్యతపై పోరాటంగా పరిణమిస్తుందని ఆయన భావించారు. మాన్‌ఫోర్డ్ సంస్కరణల నుండి మంత్రివర్గ ఉపసంఘం ప్రతిపాదనల మిషన్ వరకు తన వర్గానికి ప్రాతినిధ్యం కల్పించేలా ఆయనకు ఆహ్వానం పలికారు. అన్ని సందర్భాల్లోనూ ఆయన తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు. కార్మిక నాయకునిగా కంటే తన వర్గానికి ప్రాతినిధ్యం వహించేందుకే తాను ప్రాధాన్యతనిస్తానని ఆయన క్రిప్స్‌కు తెలియ చేశారు. బడుగువర్గాలకు అందించిన సేవల ప్రాతిపదికగా ప్రతి ఒక్క నాయకుని అంచనావేశారు. తన వర్గం పట్ల ఆయన ప్రదర్శించిన విధేయత ఆయన అఖిల భారత నాయకత్వ గరిమకు నిదర్శనంగా నిలిచింది. తన వర్గానికి చెందిన వారిలో ఆత్మగౌరవభావాన్ని రేకెత్తింపచేయడం కులం, వర్గం పట్ల ఆయనకున్న విధేయతను వెల్లడించింది. స్వరాజ్యసాధన కంటే తమ వర్గం స్వేచ్ఛ, సమానత్వాలకే ఆయన పెద్ద పీట వేశారు.

మహిళల అభివృద్ధి పట్ల అంబేద్కర్‌కు అపార నమ్మకం. మహిళలు సాధించిన అభివృద్ధి ప్రాతిపదికగా ఒక వర్గం అభివృద్ధిని ఆయన అంచనా వేసేవారు. ఆయన పురుషులు, మహిళల హక్కుల కోసం సమానంగా పోరాటం సల్పారు. మహిళలు విద్య నేర్చుకోవాలని, పరిశుభ్రంగా ఉండాలని, దురలవాట్లకు దూరంగా ఉండాలని, తమ పిల్లలకు చదువులు చెప్పించాలని, వారిలో ఆత్మన్యూనతాభావం తొలగించాలని, వారిలో లక్ష్యాన్ని పెంపొందింపచెయ్యాలని, ఉన్నత స్థానాలకు చేరగల సామర్థ్యం కలిగి ఉన్నారని వారికి

వివరించాలని, వివాహం విషయంలో తొందరపాటు పనికిరాదని తెలియజేయాలని అంబేద్కర్ ఉద్బోధించారు. "అస్పృశ్యుని"గా నిన్ను నువ్వు ఎన్నడూ భావించవద్దు అని అంబేద్కర్ ప్రబోధించారు.

గ్రామస్థాయిల్లో పరిమిత స్థాయిలో జరిగే ఆర్థిక పోరాటంలో కులం, వర్గంపై ఆలోచనలు తలెత్తుతాయి. దిగువ, ఉన్నత కులాలకు చెందిన వారిమధ్య పోరాటమే నిజమైన వర్గ, కుల పోరాటం అని అంబేద్కర్ అభివర్ణించారు. భూమిలేని కార్మికులు పారిశ్రామిక కార్మికులయ్యారు. వారు దీర్ఘకాలంగా నివాసం ఉంటున్న గ్రామాలను వదిలివేశారు. అస్పృశ్యులు కార్మికులుగా మారి పారిశ్రామిక పట్టణాలకు వలస వెళ్ళారు. కొత్తతరహా విద్యావ్యాప్తి అస్పృశ్యుల్లో కొత్త మధ్య తరగతి వర్గాన్ని రూపొందించింది. ఆ వర్గం మొత్తం అస్పృశ్యత నిర్మూలనా ఉద్యమాన్ని తమ చేతుల్లోకి తీసుకుంది. పారిశ్రామిక కార్మికులు అస్పృశ్యతా నిర్మూలన ఉద్యమ కేంద్రాలుగా మారారు. అంబేద్కర్ చేపట్టిన వివిధ కార్యక్రమాలు ఇందుకు నిదర్శనాలు.

అంబేద్కర్ దృష్టిలో జీవితంలో విజయమంటే మానవుల్లో అట్టడుగు వర్గాల స్థాయిని పెంచడంలో విజయం సాధించడం. ఆయన ఇలా అన్నారు. "నేనుఏమి సాధించినా అది పూర్తిగా నా కులం బలం వల్ల సాధించిందే. హరిజన కులంలో జన్మించినందుకు నేను గర్వపడుతున్నాను." మరో సందర్భంలో ఆయన ఇలా అన్నారు. 'నా పనిలో ముఖ్య కర్తవ్యం నా కులం సంక్షేమమే', నాకు మరే ఇతర కోరిక లేదు. అందుకోసమే నేను కాంగ్రెస్ పార్టీతో సహకరించాను. ఈ విజయం సాధించడంలో సమాజంలో ఏ ఇతర వర్గానికి అన్యాయం చెయ్యలేదు. "తన తదుపరి జీవితాన్ని గ్రామ సమాజానికి కేటాయించాలన్న ఆకాంక్షను అంబేద్కర్ వ్యక్తం చేశారు. 1955 మార్చి 18న ఆయన చేసిన ప్రసంగంలో జీవితంలో తనకు మూడు లక్ష్యాలున్నాయని చెప్పారు. (1) విద్యను వ్యాప్తి చెయ్యడం (2) ప్రభుత్వోద్యోగాల్లో అస్పృశ్యులకు మరింత ప్రాతినిధ్యం కల్పించడం (3) గ్రామాల్లో అస్పృశ్యుల పరిస్థితిని మెరుగుపరచడం. తన ప్రసంగం చివర్లో ఆయన ఈ విధంగా వ్యాఖ్యానించారు. గ్రామాలను వీడి వెళ్ళేందుకు స్థిరపడేవరకు అస్పృశ్యుల పరిస్థితిలో మార్పురాదు". అస్పృశ్యుల పరిస్థితులకు ఆయన ఎంతగానో కలత చెందారు. గ్రామాల్లో ఉన్న నా సోదరులకు ఏమి జరిగింది? అని ఆయన ప్రశ్నించుకున్నారు. గ్రామాల్లో కుల దురహంకారాలను ఆయన ప్రత్యక్షంగా తిలకించారు.

అస్పృశ్యత ఎప్పుడు ఆరంభమైంది, శూద్రులు ఎప్పుడు ఆవిర్భవించారనే విషయమై ఆయన రూపొందించిన సిద్ధాంతాలపై వివాదం చెలరేగింది. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు ఆయన గణనీయమైన కృషి చేశారు. ఆయన మేధస్సుకు ఇది అద్దం పడుతుంది.

వైదిక మతం, బ్రాహ్మణిజంపై ఆయన చేసిన దాడులు సత్యశోధకుల (సత్యాన్వేషకులు) మనస్సుల్లో ఆశలు రేకెత్తించాయి. బ్రాహ్మణ వ్యతిరేక వాదాన్ని పెంచి పోషించడంలో వారు అంబేద్కర్‌ను తమతో కలుపుకుపోయేందుకు ప్రయత్నించారు. అయితే అస్పృశ్యుల పట్ల వారి వైఖరి ఏమిటో అంబేద్కర్‌కు తెలుసు. బ్రాహ్మణుల సాంస్కృతిక ఆధిపత్యాన్ని కూల్చివేయడమే

వారి ఉద్దేశంగా ఉండేది. వారు ఫూలే సిద్ధాంతాలను విస్మరించారనే విషయం అంబేద్కర్‌కు తెలుసు. వారు అస్పృశ్యతా నిర్మూలనా ఉద్యమాన్ని కులపరమైన విధానాలకు మళ్ళిస్తున్న విషయాన్ని ఆయన గ్రహించారు. న్యాయబద్ధమైన కోరికను నిస్సిగ్గుగా మోసం చేసినందుకు వారిని ఆయన శిక్షించారు. ఈ విషయంలో ఆయన ప్రదర్శించిన ధైర్య సాహసాలు నిరుపమానమైనవి.

సామాజిక సమానత్వం కోసం అంబేద్కర్ ఎన్నో పోరాటాలు చేశారు. ఒక చెరువులో నీటిని వాడుకోవడంపై విధించబడిన అసమంజసమైన నిషేధానికి వ్యతిరేకంగా మహద్‌లో ఆయన సత్యాగ్రహం చేశారు. సామాజిక ఆంక్షలపై పోరాటమే తన మతంగా చేసుకున్నారు. నాసిక్‌లోని కళా మందిరం దేవాలయంలో అస్పృశ్యుల ప్రవేశం కోసం తలుపులను తెరిపించేందుకు ఆయన ప్రయత్నించారు. దేవాలయ ప్రవేశం కోసం ఆయన అనుసరించిన వైఖరి సమంజసమైనదే. అస్పృశ్యుల జీవన ప్రమాణాలు దేవాలయాల్లో ప్రవేశం లభించినంత మాత్రాన మెరుగుపడబోవని, వారి సామాజిక అభ్యున్నతే ఇందుకు మార్గమని ఆయన భావించేవారు. సమాజంలో అస్పృశ్యుల స్థితిగతులను మెరుగుపరచడం. కులతత్వం, బ్రాహ్మణిజం విధించిన సంకెలలను బద్దలుకొట్టడం ఆయన సామాజికోద్యమంలో ముఖ్య అంశాలు. ఇందుకు ఆయన అనుసరించిన విధానాలపై వివాదం రేకెత్తించి ఉండవచ్చు గానీ అస్పృశ్యుల అభ్యున్నతికి ఆయన పడ్డ తపనను తప్పు పట్టలేం. ఆయన ఎన్ని బృహత్తర కార్యాలు నిర్వహించినప్పటికీ, భారత రాజ్యాంగం రూపకల్పనలో నిమగ్నమైనప్పటికీ తన కులం గురించి  ఆలోచనలు ఆయన్ను ఎన్నడూ వీడలేదు.

మొత్తం మానవ ఉనికికే ముప్పుగా పరిణమించి నైతిక, సామాజిక వ్యవస్థల పునాదులనే కదిలించే పొరపాటు సామాజిక సంబంధాల నుండి ఎదురయ్యే సవాళ్ళను ప్రతిఘటించడం అంబేద్కర్ జీవితంలో ప్రధాన ఆలోచనగా ఉండేది. పురుషులు, మహిళల మధ్య సరైన సంబంధాలు నెలకొనేలా చూడటం అంబేద్కర్ జీవితాశయం. ఆయన ఎప్పుడూ ఉహాజనిత అంశాలకంటే ఆచరణాత్మక విషయాలకే ఎక్కువ ప్రాధాన్యత నిచ్చేవారు. భారత సమాజంలో నెలకొన్న పరిస్థితులకు అనుగుణంగా అభివృద్ధి సాధించడం ఆయన సిద్ధాంతం. ఆయన చదువుకున్న విజ్ఞానవంతుడే కాదు ప్రపంచంలో అత్యంత పేదవారి అభ్యున్నతి కోసం తన జీవితాన్ని, హోదాను సైతం త్యాగం  చేసిన మేధావి. నిర్లక్ష్యానికి గురైన వారి ప్రతినిధిగా ఆయన ప్రతి ఒక్కరికి మానవ హక్కులను సృష్టించారు. అందరికీ సామాజికంగా సమానత్వం సాధించేందుకు పోరాడారు. ఆయన ధ్యేయం ఏదో ఒక వర్గానికి, కులానికి మేలు చెయ్యడం కాదు. వ్యక్తిగత ప్రయోజనం కోసం ఉద్దేశించింది కాదు. అది సామాజిక, మానవతాపరమైంది. బానిసత్వం, అన్యాయం నిరంకుశత్వం, దోపిడీకి గురయ్యే వారి మానవ హక్కులకు సంబంధించిన పోరాటం. సంప్రదాయం, మత లేదా సనాతన, మూఢనమ్మకాల శృంఖలాలను ఆయన ఛేదించారు. ఆయన ఏ సమస్యనూ నైతిక విలువల దృక్కోణంలో దర్శించలేదు. విస్తృత జీవిత స్థాయిలోనే ఆలోచించేవారు. అన్ని సమస్యలను విడివిడిగా కాకుండా సమిష్టిగా పరిశీలించేవారు.

ఆయన నిరాదరణకు గురైన వర్గానికి ప్రాతినిధ్యం వహించారు. వారి ప్రతినిధిగా వ్యవహరించారు. "ఏ అణచివేతకు గురైన వర్గంలో జన్మించానో, పెరిగానో, ప్రస్తుతం జీవిస్తున్నానో ఆ వర్గం సేవలో తుది శ్వాస విడుస్తానని వాగ్దానం ఇవ్వడమే నా ధ్యేయం". అని అంబేద్కర్ అన్నారు. మానవ పురోగతికి, ఆనందానికి దోహదం చేసే శాస్త్రీయ కళాత్మక కార్యకలాపాల కోసం ఆయన జీవించారు. ఆయన అనుచిత సామాజిక ఆర్థిక, మతపరమైన వాతావరణాన్ని సహించేవారు కాదు. ఇది మానవత్వానికి శతాబ్దాల తరబడి అవరోధాలుగా నిలిచిందని ఆయన అభిప్రాయపడ్డాడు. దురలవాట్లపై తిరుగుబాటు చేసే సమయంలో ఆయన ఒక కొత్త, నైతిక సిద్ధాంతాన్ని అభివృద్ధి చేశారు. ఆయన జీవితం చివరి రోజు వరకు అది విస్తృతంగా వ్యాపిస్తూ ఉండేది. ఆయన మానవ స్థితిగతులు, స్వేచ్ఛ, స్వాతంత్రాలు, నిరాడంబరత్వం, చిత్తశుద్ధి, సమానత్వం, సామాజిక ఆర్థిక న్యాయం, భౌతికవాదం, క్రమశిక్షణాయుతమైన మానసిక భావనల కోసం ఆయన నిలబడ్డారు. మానవ వ్యక్తిత్వానికి అన్యాయం చేసే, దాడి చేసే, అణచివేసే సామాజిక స్థితిగతులు, వ్యవస్థ దురలవాట్లను ఆయన వ్యతిరేకించారు.

అస్పృశ్యతా నివారణ ఉద్యమాన్ని బౌద్ధమతానికి మార్పిడి మార్గంగా అంబేద్కర్ మార్చారు. అస్పృశ్యతను రూపుమాపి సామాజిక సమానత్వం సాధించడం ఆయన ధ్యేయం. ఇందుకోసం బౌద్ధమతం స్వీకరించాలని తన అనుచరులకు ఆయన పిలుపునిచ్చారు. కపిలుని సిద్ధాంతాల్లో ఈ మూడు అంశాలను గౌతమ బుద్ధుడు సరిగానే స్వీకరించాడని అంబేద్కర్ అభిప్రాయపడ్డారు. వాస్తవం సాక్ష్యంపై ఆధారపడి ఉండాలి, హేతుబద్ధత ప్రాతిపదికగా ఉండాలి, దేవుడు ఉన్నాడని, ఆయనే ఈ చరాచర జగత్తును సృష్టించాడనే ఊహగానాలకు, సిద్ధాంతాలకు ఎటువంటి వాస్తవిక ప్రాతిపదిక లేదు. ఈ ప్రపంచం అంతా దుఃఖమయమనే మొత్తం బ్రాహ్మణవాద మత సిద్ధాంతాన్ని ఆయన గట్టిగా వ్యతిరేకించారు. వేదాలు, పునర్జన్మ, కర్మకాండ, అనేక జన్మల అనంతరం కైవల్యం పొందడం, ఈ చరా చర సృష్టి ఈశ్వరుని మాయా వినోదం అవే సిద్ధాంతాలను అంబేద్కర్ వ్యతిరేకించారు. ఉపనిషత్తులు కేవలం ఊహజనితమైనవని ఆయన కొట్టివేశారు. బౌద్ధం సమసమాజ స్థాపనకు దోహదం చేస్తుందని అంబేద్కర్ గట్టిగా విశ్వసించారు. సమాజానికి, మానవాళికి, వాటి అభ్యున్నతికి దోహదం చేసే ప్రతి చర్య సక్రమమైందేనని, బుద్ధుని ప్రబోధాలకు అనుగుణమైనదేనని భావించారు.

అంబేద్కర్‌ను అస్పృశ్యునిగానే పరిగణించడం ఆయన ప్రబోధాల ప్రాముఖ్యతను చాటి చెపుతోంది. ఆయన ఇస్లాం లేదా క్రైస్తవ మతం స్వీకరించి ఉంటే ఆయన ఒక సమూహంలో ఒకరిగా మిగిలిపోయి ఉండేవారు. మత మార్పిడులను ఆయన గట్టిగా సమర్థించారు. కులతత్వం, అస్పృశ్యతకు నిలయమైన హిందూ మతం నుండి బౌద్ధమతం ఉరట కలిగిస్తుందని ఆయన భావించారు. బానిసత్వ నిర్మూలకు ఈ మత మార్పిడి దోహదం చేస్తుందని విశ్వసించారు. అస్పృశ్యులు రాజకీయ సమానత్వం సాధించేందుకు సామాజిక అక్రమాలు, అన్యాయాల నిర్మూలనకు మత మార్పిడి ఒక సాధనంగా అంబేద్కర్ భావించారు. ఈ ప్రజాస్వామ్య యుగంలో

అంబేద్కర్ సామాజిక ఆలోచనగా అర్థం చేసుకోవచ్చు. అయితే అస్పృశ్యులను బౌద్ధమతంలో చేర్చే ఉద్యమం మాత్రం ఎంత మాత్రం సమంజసం కాదు.

ఈ విధంగా బౌద్ధమతం స్వీకరించిన వారు నవబౌద్ధ (నియో బుద్ధిస్టులుగా) గుర్తింపబడ్డారు. అంటే మతం స్వీకరించడం ఒక్కటే సమస్య పరిష్కర హేతువు కాదు. ప్రధాన సమస్యను దారి మళ్ళించడానికి మాత్రమే అది దోహదం చేస్తుంది. అంబేద్కర్ మరణం తరువాత ఈ మత మార్పిడి ప్రక్రియ నిలిచి పోయింది. బడుగు వర్గాల ప్రయోజనాలను పరిరక్షించడం, సామాజిక సమానత్వం సాధించడం మత మార్పిడి ఎంత మాత్రం ఉపయోగపడబోదనే విషయం స్పష్టంగా వెల్లడైంది. కులతత్వ దురాచారాన్ని నిర్మూలించడంలో విజయం సాధించకపోవడమే ఆయన మత మార్పిడి ఉద్యమానికి మూలం. అది అంబేద్కర్ పలాయన వాదానికి దోహదం చేసింది. మత మార్పిడి ఉద్యమాన్ని అస్పృశ్యులు ఒక వర్గ సమస్యగా పరిగణించలేదు. ఇంకా చెప్పాలంటే అంబేద్కర్ మద్దతుదారులే ఈ మత మార్పిడీ కార్యక్రమాన్ని వ్యతిరేకించారు. ఇది సిద్ధాంతపరంగా సరైంది కాదని, ఆచరణ సాధ్యం కాదని వారు అభిప్రాయపడ్డారు.

### మత మార్పిడి

తాను హిందువుగా మరణించబోనని అంబేద్కర్ ప్రకటించిన సందర్భంలో మహాత్మాగాంధి తన 'హరిజన' పత్రిక 1936 జూలై 11 సంచికలో ఈవిధంగా రాశారు. "అంబేద్కర్ హిందూయిజానికి ఒక సవాలు" అని గాంధి అభివర్ణించారు. మతానికి, కుల వ్యవస్థకు సంబంధం లేదు. (హరిజన, జూలై18, 1936) ఇతర మతాలను స్వీకరించరాదని హిందూ మహాసభ అధ్యక్షోపన్యాసం సందర్భంగా పండిట్ మదన్‌మోహన్ మాలవ్య హరిజనులకు విజ్ఞప్తి చేశారు.

అంబేద్కర్ ఆర్థిక పరిస్థితులపై తన అభిప్రాయాలను వివరించారు. ప్రపంచ సౌఖ్యాలన్నీ ధనికులకే చెందుతున్నాయని, వారు మతాన్ని కోరబోరని, పేద ప్రజలకు మాత్రం మతం అవసరమనే అంబేద్కర్ సిద్ధాంతాన్ని వామపక్షాలు అంగీకరించాయి. అయితే ఆయన బౌద్ధమతం స్వీకరించడాన్ని అవి వ్యతిరేకించాయి.

ఎవరైనా ఒక వ్యక్తి కొత్త అధ్యాత్మక మతాన్ని ఆధ్యాత్మిక ఉద్దేశాలతోనే స్వీకరిస్తారు. ఇది వ్యక్తిగత వ్యవహారం. అంబేద్కర్ ప్రబోధించిన మూకుమ్మడి మత బదిలీ వెనుక ఆధ్యాత్మికపరమైన విశ్వాసాలు ప్రాతిపదికగాలేవు. అంబేద్కర్ మత మార్పిడి ఉద్యమం ఒక సామాజిక ఉద్యమం. బౌద్ధమతాన్ని స్వీకరించడం ద్వారా నియోబౌద్ధులు తాము అస్పృశ్యులం కామని భావించసాగారు. అయితే వారు అగ్ర హిందు కులాలపై ఆర్థికంగా ఆధారపడి ఉంటారు. ఆర్థిక ప్రణాళిక ద్వారా దళితులకు తగిన స్వయం ప్రతిపత్తి చేకూరకపోతే ఈ మత మార్పిడీ ఉద్యమం విజయం సాధించదు. పాత స్కాలర్ షిప్పులు, ఇతర సదుపాయాలను తమకు కూడ కల్పించాలని నవబౌద్ధులు డిమాండ్ చెయ్యడం దీనినే నిరూపిస్తోంది.

మత మార్పిడి గురించి ప్రొఫెసర్ హీరేన్ ముఖర్జీ ఈ విధంగా అన్నారు.

"కేవలం మత మార్పిడి వల్ల మన దేశాలు ఎదుర్కొంటున్న సమస్యకు పరిష్కారం కనుగొనలేం. అందువల్లనే బౌద్ధమతానికి మారడం నైతిక పరమైన ప్రక్రియ మాత్రమే అనేది నా నిశ్చితాభిప్రాయం. దాని వెనుక కొన్ని మానసిక ఆలోచనలు దాగి ఉన్నాయి. బౌద్ధమతం ఒక అద్భుతమైన మతం. అయితే ఎందువల్లనో అది భారతదేశంలో తగిన ఆదరణకు నోచుకోలేక విదేశాలకు తరలివెళ్ళిపోయింది. ఏదైనా అద్భుతం జరిగి దానిని తిరిగి భారతదేశానికి తీసుకురావడం మంచిదే. అయితే నిజ జీవితంలో అలా జరగదు. అంబేద్కర్ తాను బౌద్ధమతాన్ని స్వీకరించడం మాత్రమే కాకుండా తన అనుచరులకు కూడా దానిని అనుసరించాలని ఉద్బోధించారు. అయితే ఇది బాధాతప్త హృదయంతో చేసిన పిలుపే. అంబేద్కర్ చర్య నైతికంగా సమర్థనీయమే. ప్రశంసనీయమే. నిస్సందేహంగా అర్థం చేసుకోతగ్గదే. అయితే ఇది కేవలం మానసికపరమైందే. అంతకుమించి మరేమీ కాదు. (హీరేన్ ముఖర్జీ, గాంధీ, అంబేద్కర్ అస్పృశ్యతా నివారణ 46వ పేజీ).

ప్రత్యేక సామాజిక గుర్తింపు పొందడమే మత మార్పిడీ ఉద్యమం ప్రధాన ధ్యేయం.

## సెక్షన్-2

### రాజకీయ ఆలోచన

అనేక రాజకీయ అంశాలపై అభిప్రాయాలను అంబేద్కర్ తన రచనల్లో వ్యక్తం చేశారు. అవి సిద్ధాంతపరమైనవి మాత్రమే కాకుండా ఆచరణాత్మకమైనవి కూడా. ప్రభుత్వ విధి నిర్వహణ నుండి రాజ్యాంగంలో ప్రతి అంశాన్ని సూక్ష్మంగా, స్థూలంగా ఆయన చర్చించారు. రాజకీయ శాస్త్రానికి సంబంధించి వివిధ అంశాలపై ఆయన ఆలోచనలను ఈ అధ్యాయంలో ప్రస్తావించేందుకు ప్రయత్నించడం జరిగింది.

అంబేద్కర్ ప్రభుత్వం కంటే సమాజానికే అధిక ప్రాధాన్యత కల్పించారు. ఆయన అభిప్రాయం ప్రకారం ప్రభుత్వం ప్రజలను అంతర్గత అశాంతి, బహిరంగ దురాక్రమణ నుండి కాపాడాల్సి ఉంది. ప్రభుత్వం సమగ్రమైంది, పరిపూర్ణమైంది అని అంబేద్కర్ గుర్తించలేదు. ప్రభుత్వం అనేది ప్రత్యేక, విశిష్ట వ్యవస్థ కాదు. మానవుడు తన ఉనికిని పరిరక్షించుకునేందుకు దైవంపై ఆధారపడతాడు. అంబేద్కర్ అభిప్రాయంలో ప్రభుత్వం అంటే ప్రజలే. ప్రజలు లేకుండా ప్రభుత్వం లేదు. ఈ భూ ప్రపంచంపై ఉత్తమమైనది ప్రజలు పొందేలా చెయ్యడమే ప్రభుత్వ ముఖ్య ధ్యేయం. ప్రభుత్వం అనేది ప్రజలతో ఐక్యం కావాల్సిందే. దానిదే ప్రత్యేక ధ్యేయం.

ఉనికి లేదా ప్రజలు సుఖ సంతోషాలతో జీవనం సాగించేందుకు అవసరమైన పటిష్టమైన సామాజిక వ్యవస్థను రూపొందించడమే ప్రభుత్వ బాధ్యత.

ప్రభుత్వానికి సంపూర్ణాధికారం ఉంటుందనే హాబ్స్, హెగెల్, బొసాన్క్వెంత్‌తో అంబేద్కర్ ఏకీభవించలేదు. ప్రభుత్వం అనేది ఒక మానవ సంస్థ అనే సిద్ధాంతాన్ని ఆయన విశ్వసించారు. కొంతమంది భావిస్తున్నట్లుగా అది సంపూర్ణ అధికారాలు గల వ్యవస్థ కాదు. ప్రభుత్వం, దాని బాధ్యతలపై విభిన్న ఆలోచనలు కూడా ఉన్నాయి. అంబేద్కర్ దృష్టిలో ప్రభుత్వ సుస్థిరత అనేది ప్రజల వ్యతిరేకత, సానుభూతి, మద్దతుపై ఆధారపడి ఉంటుంది. శాసనోల్లంఘన ఉద్యమంపై అంబేద్కర్‌కు విశ్వాసం లేదు. శాసనోల్లంఘనను విశ్వసించడం అరాచకత్వాన్ని విశ్వసించడమే అని అంబేద్కర్ వ్యాఖ్యానించారు. ప్రభుత్వం అనేది ఒక వ్యవస్థ అని దానికి ఇక్కడ పేర్కొన్న బాధ్యతలు ఉంటాయని ఆయన భావించారు. (1) జీవించేందుకు, సంతోషంగా ఉండేందుకు, స్వేచ్ఛ కలిగి ఉండేందుకు, తమ కిష్టమైన మతం స్వీకరించేందుకు ప్రజలకు గల హక్కులను పరిరక్షించడం (2) అట్టడుగు వర్గాలకు, అణచివేతకు గురవుతున్న వర్గాలకు మేలైన అవకాశాలు కల్పించడం ద్వారా సామాజిక, రాజకీయ, ఆర్థిక అసమానత్వాలు నిర్మూలించడం (3) ప్రతి ఒక్క పౌరుడు స్వేచ్ఛగా బ్రతికేందుకు భయం నుండి విముక్తి పౌర స్వేచ్ఛ కలిగి ఉండే హక్కులను పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యతలుగా అంబేద్కర్ భావించారు. ప్రభుత్వం యజమాని మాదిరిగా ఆధిపత్యం ప్రదర్శించకుండా ప్రజలు, సమాజానికి సేవలు అందించాలి. ప్రజల స్వేచ్ఛ, హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కృషి చెయ్యాలి. స్వేచ్ఛ కోసం ప్రజలు చేసే పోరాటాలకు అంబేద్కర్ అధిక ప్రాధాన్యత కల్పించారు. అంబేద్కర్ దృష్టిలో ప్రజల నిజమైన స్వేచ్ఛ, ఒక్క రాజకీయ పరమైనదే కాదు. అది రాజకీయ, ఆర్థిక, ఆధ్యాత్మిక, మేధోపరమైనది కూడా.

ప్రభుత్వాధికారం, వ్యక్తి స్వేచ్ఛ మధ్య సమతూకం సాధించేందుకు అంబేద్కర్ అవిరళ కృషి సల్పారు. వ్యక్తిగత స్వేచ్ఛ సమాజ ప్రయోజనాలకు భంగకరం కాకూడదు. ఒక ప్రత్యేక వర్గానికి ప్రయోజనం లేకుండా చేసేదిగా ఉండరాదు. ప్రజా ప్రయోజనాల పరిరక్షణ సమాజ ప్రయోజనాలను కాపాడటం ప్రభుత్వ బాధ్యత. అంబేద్కర్ దృష్టిలో ప్రభుత్వం అనే పదానికి అర్థం ఇదే. ప్రజలను పాలించడం, వారిని తన అదుపు ఆజ్ఞల్లో ఉంచుకోవడం అనే మాకియవెల్లియన్ సిద్ధాంతానికి అంబేద్కర్ వ్యతిరేకం. ప్రభుత్వ వ్యవస్థలో వ్యక్తి పట్ల గౌరవం, విశ్వాసం ఉండాలి. ప్రభుత్వం పట్ల ప్రజలకు విశ్వాసం, విధేయత ఉండాలి. అప్పుడే ప్రభుత్వం ప్రజలందరికీ సుఖసంతోషాలు, సంక్షేమం కలిగించాలనే తన పరిమితమైన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించగలుగుతుంది. ప్రజల ఆచరణాత్మక అవసరాలను నెరవేర్చినపుడే ప్రభుత్వం ప్రజల విశ్వాసం చూరగొంటుంది. ప్రభుత్వం నైతిక, సామాజిక లక్షణాలు కలిగి ఉంటుంది. ప్రజల కదలికలపై ఏ ప్రభుత్వం ఆంక్షలు విధించరాదని అంబేద్కర్ అన్నారు. మత, వర్గ పరమైన దాడుల నుండి ప్రజలను కాపాడటం, అంతర్గత అల్లర్ల నుండి కాపాడటం, దేశంలో ఏ ప్రాంతంలోనైనా హింసాకాండను, అశాంతిని అణచివేయడం మంచి ప్రభుత్వానికి

గీటు రాళ్ళు. అంటే ప్రభుత్వం పరిపూర్ణమైంది కాదు. ప్రజల ఆకాంక్షలను అది పాటించాలి. వివిధ సంస్థల మధ్య పరిపూర్ణ అవగాహన, సమన్వయం ఉండాలి.

వృత్తిరీత్యా న్యాయవాది. ప్రవృత్తి రీత్యా చట్టాలను అవపోసన పట్టిన వ్యక్తిగా సభ్య సమాజంలో చట్టం నిర్వహించాల్సిన పాత్రను అంబేద్కర్ నొక్కి చెప్పారు. వివిధ వర్గాల ప్రజల మధ్య సామాజిక శాంతి, న్యాయ పరిరక్షణలో చట్టం ప్రధాన పాత్ర పోషిస్తుంది. అది ప్రజల సామాజిక, నైతిక ప్రబోధంపై ఆధారపడి ఉంటుంది. సమానత్వం, స్వేచ్ఛకు అది గార్డియన్. "చట్టం ముందు అందరూ సమానులే. పౌర హక్కులు అందరికీ సమానమే" చట్టానికి న్యాయపరమైన బాధ్యత మాత్రమే ఉండదని, అది మొత్తం సమాజం దేశ జీవనాన్ని నియంత్రిస్తోందని అంబేద్కర్ అన్నారు. ప్రజలందరినీ కులం, రంగు, జాతికి అతీతంగా ప్రజలందరూ ఒక పరిమితికి లోబడేలా చెయ్యడం చట్టం విధి. "చట్టం అనేది లౌకికమైంది. ఎవరైనా దానిని ఉల్లంఘించవచ్చు. మతం అనేది పవిత్రమైంది. ప్రతి ఒక్కరూ దానిని గౌరవించాలి" – వ్యక్తిగత హోదా, స్వేచ్ఛల పట్ల ఉన్న అపార గౌరవం చట్టానికి కట్టుబడి ఉండేలా చేసింది. – పౌరుల హక్కులు, ప్రత్యేక సదుపాయాలకు విఘాతం కలిగే విధంగా ప్రభుత్వం వ్యవహరించరాదు. ఎటువంటి చట్టాలు చెయ్యరాదు.ప్రజల స్వేచ్ఛ, సౌభాగ్యాలకు భంగకరంగా వ్యవహరించరాదు. చట్టానికి అనుగుణంగా అందరికీ హక్కులు కల్పించాలి. వ్యక్తిగత హక్కులు సహజ సిద్ధంగా ఉండేవి. వారసత్వంగా సంక్రమించేది అనే రెండు రకాలుగా ఉంటాయని అంబేద్కర్ గుర్తించారు. ప్రతి వ్యక్తికీ ఇతరులకు సంక్రమింప చేయలేని కొన్ని హక్కులుంటాయి. అంబేద్కర్ తన సాంఘిక రాజకీయ సిద్ధాంతాన్ని ఈ అంశం మూలబిందువుగా రూపొందించారు. అన్యాయం, అణచివేత, నిరంకుశత్వాన్ని నిరోధించేందుకే ప్రభుత్వం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. బలహీనులకు, సేవలందించడమే ప్రభుత్వ విధి అని ఆయన వ్యాఖ్యానించారు.

> "హక్కులు చట్టబద్ధంగా కాకుండా సమాజం రాజకీయ, నైతిక ప్రబోధాల ద్వారా పరిరక్షింపబడతాయి. హక్కులను గుర్తించేందుకు సమాజం సిద్ధంగా ఉంటే అవి (హక్కులు) భద్రంగా ఉంటాయి. దానినే చట్టం గుర్తించి శాసనరూపం కల్పిస్తుంది. వ్యక్తిగత హక్కులను సమాజం తిరస్కరిస్తే ఏ చట్టం, ఏ పార్లమెంటు, ఏ న్యాయ వ్యవస్థ దానిని కాపాడి ఆచరణలోకి తీసుకురాలేవు."

ప్రభుత్వం, ప్రజల హక్కుల మధ్య సమన్వయం సాధించేందుకు అంబేద్కర్ ప్రయత్నించారు. ప్రభుత్వ చట్టాలు నైతికత ప్రమాణాలను నిర్దేశించాయి. అలాగే ఏది నిజం, ఏది కాదు అనే ఆలోచలను రేకెత్తింపచేస్తాయి.

బ్రిటిష్ తరహా వ్యవస్థ కాకుండా అమెరికా తరహా వ్యవస్థ భారత్‌కు సరిపోతుందని అంబేద్కర్ భావించారు. శాసన, కార్య నిర్వాహక వ్యవస్థల మధ్య సమన్వయ సాధనపై అంబేద్కర్ ఎక్కువగా దృష్టి సారించేవారు. అవి స్వతంత్రంగా, దేనికవే విభిన్నంగా వ్యవహరించి ఒకదాని

నొకటి సహకరించుకునేవిగా, పరస్పరం బాధ్యత వహించేలా ఉండాలని అంబేద్కర్ భావించారు. ప్రభుత్వంలోని రెండు విభిన్న అంగాల మధ్య సమన్వయం విధి నిర్వహణలో పాటించే చిత్తశుద్ధిపై ఇది ఆధారపడి ఉంటుంది. బ్రిటిష్ తరహా పాలనా వ్యవస్థవైపు ఆయన మొగ్గు చూపలేదు. భారత్‌కు దానిని వర్తింప చేస్తే ప్రమాదకర ఫలితాలు సంభవిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. బ్రిటిష్ పార్లమెంట్‌లో మెజారిటీ అంటే రాజకీయ మెజారిటి అని ఆయన వ్యాఖ్యానించారు. అయితే భారతదేశంలో మెజారిటీ అంటే కుల మత పరమైన మెజారిటీ అని ఆయన అన్నారు. అందువల్ల బ్రిటన్‌లో ఆచరణ సాధనమైన ఊహాగానం. భారత్‌కు వర్తించకపోవచ్చని అన్నారు. మెజారిటీ క్యాబినెట్‌లో మైనారిటీలకు స్థానం కల్పించాల్సిన బాధ్యత లేదన్నారు. అందువల్ల మైనారిటీలు అణచివేతకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పైన పేర్కొన్న ప్రభుత్వం నిజమైన పార్లమెంటరీ తరహా ప్రభుత్వం కాజాలదని అన్నారు. దానిని సామ్రాజ్యవాదంగా అంబేద్కర్ పరిగణించారు. బ్రిటిష్ తరహాపాలనా వ్యవస్థ మైనారిటీల మనుగడ, స్వాతంత్ర్యం, సుఖసంతోషాలకు ముప్పుగా పరిణమిస్తుందని అంబేద్కర్ హెచ్చరించారు.

మాంటిస్క్యూ పరిభాషలో ప్రజాస్వామ్య వ్యవస్థ అంటే తనిఖీలు, నిల్వల వ్యవస్థ. ఆయన దృష్టిలో పాలనా వ్యవస్థ ధ్యేయాలు నాలుగు రకాలుగా ఉంటాయి. (1) మైనారిటీలకు ఏ విధమైన అవకాశం కల్పించని రీతిలో మెజారిటీ వర్గం ప్రభుత్వం ఏర్పాటు చేయడాన్ని ప్రతిఘటించడం (2) పాలనా వ్యవస్థలో మెజారిటీ వర్గానికే సంపూర్ణాధికారం కల్పించి మైనారిటీలపై నిరంకుశత్వం, ప్రదర్శించకుండా నిరోధించడం (3) మెనారిటీల పట్ల విశ్వాసం చూరగొనాని వారిని వారి ప్రతినిధులుగా పాలన వ్యవస్థలో చోటు కల్పించకుండా చూడటం (4) సుపరిపాలన, సమర్ధవంతమైన పాలనా వ్యవస్థ అందించగల యంత్రాంగాన్ని రూపొందించేలా చూడటం.

న్యాయ వ్యవస్థ విధుల గురించి అంబేద్కర్ ఈ విధంగా పేర్కొన్నారు. "రాజ్యాంగం కొన్ని హక్కులను హామీ ఇచ్చిన సందర్భాల్లో అవి శాసన, పాలనా వ్యవస్థల అధిపత్యానికి గురికాకుండా సక్రమంగా అమలు జరిగే వ్యవస్థ నెలకొనాల్సిన అవసరం ఉంది. ఈ బాధ్యత సహజంగా న్యాయ వ్యవస్థకు అప్పగించబడుతుంది. రాజ్యాంగం హామీ ఇచ్చిన హక్కుల పరిరక్షణకు కోర్టులు ప్రత్యేక గార్డియన్లుగా వ్యవహరించాలి. ఇందు నిమిత్తం న్యాయ వ్యవస్థకు సంపూర్ణ అధికారాలు కల్పించాలి. ఈ హక్కులను న్యాయ వ్యవస్థ అతిక్రమించకుండా చూడాలి. వ్యక్తుల హక్కుల పరిరక్షణకు స్వతంత్ర ప్రతిపత్తి గల న్యాయ వ్యవస్థ ఉండాల్సిన అవసరం ఉంది. పాలనావ్యవస్థకు, మరే ఇతర వ్యవస్థల పట్ల జంకు లేకుండా సంపూర్ణ అధికారాలు గల స్వయం వ్యవస్థ నెలకొల్పాలని ఆయన భావించారు. బ్రిటిష్, అమెరికా రాజ్యాంగాల సమ్మిళితంగా భారత రాజ్యాంగం రూపొందించేందుకు అంబేద్కర్ కృషి చేశారు.

జాయింట్ ఎలక్టోరేట్స్ (ఉమ్మడి నియోజకవర్గాలు) ఉండాలని సేత్ బారో కమిటి ముందు అంబేద్కర్ ప్రస్తావించారు. షెడ్యూల్డ్ కులాల వారికి ప్రత్యేక ఎలక్టోరేట్స్ ఉండాలని ఆయన సూచించారు. బ్రిటిష్ ప్రభుత్వం భారత్‌కు స్వాతంత్ర్యం ప్రకటించేందుకు

సంసిద్ధమవుతున్న తరుణంలో జాయింట్ ఎలక్టోరేట్స్ ఉండాలని అంబేద్కర్ వాదించారు. రాజ్యాంగ పరిషత్‌లో ఆయన చేరి రాజ్యాంగ రూపకల్పనా కమిటీ ఛైర్మన్‌గా వ్యవహరించారు. తమ వర్గం ప్రయోజనాలను కాపాడేందుకే రాజ్యాంగ పరిషత్‌లో చేరినట్లు ఆయన నిర్మొహమాటంగా ప్రకటించారు. అస్పృశ్యత, అణచివేత విధానాలను నిర్మూలించడంలో బ్రిటిష్ ప్రభుత్వం వైఫల్యాన్ని ఆయన నిశితంగా విమర్శించారు. అస్పృశ్యుల అభివృద్ధికి బ్రిటిష్ ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో విఫలమైందని ధ్వజమెత్తారు. విదేశీ ఆధిపత్యంలో కేవలం మాటల రూపంలో విమర్శించడం వల్ల ఉపయోగం ఉండబోదని ఆయన అభిప్రాయపడ్డారు. భారత స్వాతంత్ర్యోద్యమంలో గాంధీ వైఖరిని ఆయన ఆక్షేపించారు. దీంతో జాతీయోద్యమం, అస్పృశ్యుల మధ్య అంతరం మరింత విస్తరించింది. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కార్యక్రమాల్లో అస్పృశ్యతా నివారణ ఒకటి. జాతీయోద్యమం దానికి మద్దతు పలికింది. అస్పృశ్యతపై కాంగ్రెస్ వైఖరి రాజకీయ పరమైన అవకాశవాదం మాత్రమేనని అంబేద్కర్ నిశితంగా విమర్శించారు. తమ వర్గం తరపున కాంగ్రెస్ మాట్లాడటాన్ని ఆయన వ్యతిరేకించారు. గాంధీజీ స్ఫూర్తితో ఏర్పాటైన హరిజన సేవక్‌సంఘ్ రాజకీయ సేవాసంస్థ మాత్రమేనని. అస్పృశ్యులను మెత్తని కత్తితో వధించడమే దాని ధ్యేయమని అంబేద్కర్ విమర్శించారు. సామాజిక తత్వశాస్త్రం ప్రాతిపదికగా రాజకీయ సిద్ధాంతాన్ని రూపొందించాలని ఆయన భావించారు. హిందూయిజంలో వేర్పాటువాద భావనను రాజకీయపరంగా గుర్తించాలనేది ఆయన సిద్ధాంతంలో మౌలిక అంశం. హిందువులు, హరిజనుల మధ్య వివాదాన్ని బ్రాహ్మిణిజం, ప్రజాస్వామ్యం మధ్య నెలకొన్న వివాదంతో సమానం చేసేందుకు అంబేద్కర్ ప్రయత్నించారు. ఇటువంటి వైఖరి ప్రజా ఉద్యమానికి అనుగుణమైంది కాదు. హిందుత్వ అగ్రవర్గాలకు, అస్పృశ్యులకు మధ్య వివాదంలో ఆయన అనుసరించిన ఆవేశపూరిత వైఖరి జాతీయ సమగ్రతకు భంగకరం.

రాష్ట్రాల్లో బాధ్యతాయుతమైన ప్రభుత్వాలకు అనుగుణంగా ప్రజాఉద్యమాలు ఒక స్పష్టమైన రూపాన్ని సంతరించుకుంటున్నాయి. ప్రజా ఉద్యమాలకు అంబేద్కర్ మద్దతు తెలిపారు. 1935 భారత ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టంలో ప్రతిపాదించిన భారత ఫెడరేషన్‌ను ఆయన వ్యతిరేకించారు. ఇది మన దేశ భవిష్యత్తును నిర్ధారించే అవకాశం యువరాజులకు కల్పిస్తుంది. ఇది భారతదేశంలో సస్యశ్యామల ప్రాంతాన్ని రథానికి కట్టివేసి ప్రగతికి ప్రతిబంధకం కావించడమేనని అంబేద్కర్ వ్యాఖ్యానించారు. భారతదేశ మొత్తం సార్వభౌమికాధికారం బదిలీ అయినపుడు ఒక పరిపాలకుని అదుపు ఆజ్ఞల్లో ఉండే ప్రాంతం సార్వభౌమికత్వం కూడా భారతదేశంలో విలీనం అవుతుందని రాజ్యాంగ పరిషత్‌లో అంబేద్కర్ స్పష్టం చేశారు. భారతదేశ సార్వభౌమికతను రద్దుచేసే ఎటువంటి చట్టాల్ని చేసే అధికారం బ్రిటన్ పార్లమెంటుకు లేదని తెలియజేస్తూ బ్రిటన్ ప్రభుత్వానికి తెలియజేయాలని తాత్కాలిక ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ 1947 జూన్ 17న ఒక ప్రకటన చేశారు. దేశంలో ఏ రాష్ట్రాన్ని స్వతంత్ర ప్రతిపత్తి గల సార్వభౌమాకాధికారం గల రాష్ట్రంగా గుర్తించరాదని కూడా ఆయన విజ్ఞప్తి చేశారు. సార్వభౌమాధికారం, స్వతంత్ర పతిపత్తి గల ఏ దేశాన్ని సభ్యురాలిగా చేర్చుకోరాదని ఐక్య రాజ్య సమితికి విజ్ఞప్తి చేయాలని అంబేద్కర్ సూచించారు. భారతదేశంలోని రాష్ట్రాల విషయంలో

ఆయన వైఖరి సహేతుకమైందే. ప్రజాస్వామ్యం పట్ల ఆయనకు ఉన్న విశ్వాసానికి ఇది ప్రతీక. అంతర్జాతీయ చట్టాలను ఆయన ఎంతగా అభ్యాసం చేసారో కూడా వెల్లడిస్తోంది.

బ్రిటన్ సంస్కరణాభిలాషను, పార్లమెంటరీ వ్యవస్థను అంబేద్కర్ పూర్తిగా ఆమోదించారు. అది వ్యక్తిపరంగా, మొత్తం సమాజానికి ప్రయోజనకరమని ఆయన భావించారు. ఆయనకు ఇష్టమైన రాజకీయ వ్యూహకర్త ఎర్మండ్ బర్క్, రాజ్యాంగంలోని ముందుమాటలో వివరించిన స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం సిద్ధాంతాలు భారత ప్రజలను నడిపిస్తున్నాయని ఆయన అన్నారు.

అంబేద్కర్ ఉదారవాదం ర్యాడికల్ హేతుబద్ధతతో అనుసంధానమైంది. ఆయన ప్రతిపాదించిన సిద్ధాంతాలు ఒక ధ్యేయసాధనకు ఉద్దేశింపబడ్డాయి. ఆయన ప్రతిపాదించిన విలువలు సమాజంలో సమానత్వ సాధనకు ఉద్దేశింపబడ్డాయి. ఆయన ఉదారవాద సిద్ధాంతాలు ఆయన వైదికరుషుల బోధనలను తిరస్కరించడానికి దోహదం చేశాయి. వారి బోధనల్లో సామాజిక విలువలకు స్థానం కల్పించక పోవడమే ఇందుకు కారణం.

ఉదారవాదం మహారాష్ట్రలో సమాజంలో ఉన్నత స్థాయిలో ప్రారంభింపబడింది. పూలే దానిని అట్టడుగు వర్గాల్లో ప్రారంభించారు. అస్పృశ్యులకు అంబేద్కర్ ఛాంపియన్‌గా మారారు. వారు అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న నాయకునిగా గుర్తింపు పొందారు. ఒకనాటి అస్పృశ్యులకు చట్టం స్వతంత్ర భారతదేశ సంతానం, ఇతర పౌరులతో సమానంగా హక్కులు, స్థాయి కల్పించడం కోసం, భారత రాజ్యాంగ నిర్మాణంలో ఆయన చేసిన కృషి ఆయన ప్రతిపాదించిన ఉదారవాద విధానాలను అనుసరించాలని పౌరులందరికీ అను నిత్యం గుర్తు చేస్తూ ఉంటుంది.

సామాజిక రంగంలో కృషి చేసిన రాజారామోహన్‌రాయ్, రానడే, ముఖర్జీ మొదలైన వారంతా అగ్రవర్గాలకు చెందినవారు. వారి వైఖరి, అంబేద్కర్ వంటి వారు బడుగు వర్గాలకు చెందిన నాయకుల వైఖరి భిన్నంగా ఉంటాయి. అస్పృశ్యుల కాలంలో జన్మించిన అంబేద్కర్‌కు తమ కులం వారిని ఉన్నతమైన స్థానంలో నిలబెట్టాలనే ఉదాత్తమైన ఆశయం ఉంది. సంఘ సంస్కరణలు ఒకరి దయాబిక్ష, సర్దుబాటు కోసం ఉద్దేశించినవి కావని అంబేద్కర్ దృఢంగా అభిప్రాయబడ్డాడు. అవి హక్కులుగా కావాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన డిమాండ్‌లోని ఔచిత్యాన్ని ఎవ్వరూ ప్రశ్నించబోరు. ఆయన ఒక సందర్భంలో ఇలా అన్నారు. "ఇతరులు చేసే కృషి నర్సులు అందించే సేవల వంటిది. నేను వారి అమ్మలాంటి వాడిని. తన లిబరల్ పార్టీ పతనం కావడం లిబరల్స్‌కు మాత్రమే కాక మొత్తం దేశానికే విచారకరమైన అంశమని ఆయన అన్నారు.

మెజారిటీల దుష్పరిపాలన నుండి మైనారిటీలను కాపాడేందుకు ఆయా ప్రాంతాల్లోని మెజారిటీ వర్గంపై పటిష్టమైన నియంత్రణ శక్తిగా రూపొందాల్సిన బాధ్యత కేంద్రప్రభుత్వంపై ఉందని అంబేద్కర్ పేర్కొన్నారు. రాజ్యాంగం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉండాల్సిన

అవసరం ఉందన్నారు. సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిణామాలను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు పటిష్టమైన కేంద్రప్రభుత్వం అవసరం ఉందని పేర్కొన్నారు. పార్లమెంటరీ తరహా ప్రభుత్వం పట్ల ఆయన సానుకూలత వ్యక్తం చేశారు.

పార్లమెంటరీ తరహా ప్రభుత్వంలో మూడు ముఖ్యమైన లక్షణాలుంటాయి. అవి

(1) వంశపార్యపాలనకు అది ప్రతిబంధకం, పార్లమెంటరీ తరహా ప్రభుత్వంలో వంశపారంపర్య పాలనకు తావులేదు.

(2) పార్లమెంటులో ప్రజల ప్రతినిధులు చట్టాలను రూపొందిస్తారు. చక్రవర్తి పాలన లేదా ఏకపార్టీ పాలనకు అంబేద్కర్ వ్యతిరేకం. ప్రజలు ప్రాతినిధ్య పాలనా వ్యవస్థ ద్వారా తమను తాము పరిపాలించుకోవాలి. ప్రజా ప్రభుత్వంలో ఇదే ఉత్తమ తరహా ప్రభుత్వమని అంబేద్కర్ అభిప్రాయబడ్డారు. అది మానవ వ్యవస్థ, మానవ పురోగతి, సుఖ సంతోషాలకు అత్యంత అనుకూలమైంది.

(3) శాసన సభ్యులంతా తిరిగి ప్రజల వద్దకు వెళ్ళి వారి విశ్వాసం పొందాలి.

స్వీయ పరిపాలనతో సత్పరిపాలనను ఆయన అనుసంధానం చేశారు. మంచి స్వీయ పాలన ప్రజాప్రాతినిధ్యతరహా ప్రభుత్వం ఉత్తమమైన స్వీయ పాలన పట్ల అంబేద్కర్ సానుకూలత చూపారు. స్వాతంత్ర్య సమరం సమయంలో ప్రజలకు సేవలందించి త్యాగాలు చేసే సమర్ధవంతమైన పాలన ఉండాలని ఆయన డిమాండ్ చేసేవారు. మంచి ప్రభుత్వం ఎంత మేరకు సాధ్యమనే విషయం అధికారంలో ఉన్నవారి, పాలింపబడుతున్న ప్రజల మధ్య ఏ మేరకు సమన్వయం నెలకొన్నదనే విషయంపై ఆధారపడి ఉంటుంది.

మంచి ప్రభుత్వాన్ని దానిని నిష్పాక్షికత, న్యాయం, అవినీతికి తావులేని పరిశుద్ధమైన పాలన, ప్రజలకు అందించే సదుపాయాల ప్రాతిపదికగా నిర్ణయించవచ్చు. మంచి ప్రభుత్వం పేద ప్రజల సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, ఆధ్యాత్మిక ప్రమాణాలను పెంపొందిస్తుంది. మంచి ప్రభుత్వానికి ఎటువంటి కులతత్వం, ఇతర స్వార్థ చింతనలు ఉండకూడదు. ప్రభుత్వ విజయం ప్రజలు అందించే సహకారంపై ఆధారపడి ఉంటుందని అంబేద్కర్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యమనేది దానంతటది పెరగదు. దానిని మనమే అభివృద్ధి చేసుకోవాలి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపై అంబేద్కర్ వ్యక్తం చేసిన అభిప్రాయాలు, ఆయన ఆలోచనలు కాలానుగుణంగానే ఉన్నాయి.

ఏక పార్టీ పాలన ప్రజా ప్రభుత్వానికి చావు దెబ్బవంటిదని అంబేద్కర్ అన్నారు. వాస్తవానికి అది ప్రజా ప్రభుత్వానికి విభిన్నమైంది. ఏకపార్టీ ద్వారా నిర్వహింపబడే ప్రజా ప్రభుత్వం నియంతృత్వ పాలనకు దొడ్డిదారిన అవకాశం కల్పించడమేనని అంబేద్కర్ అన్నారు. నియంతృత్వం అనేది ఏదో ఒకరోజు కుప్పకూలిపోకుండా ఉండదు. ప్రత్యర్థి పార్టీ పాలన దానిని కబళించకతప్పదు. ఏకపార్టీ ప్రభుత్వం నియంతృత్వానికి ప్రతిరూపం. ఇది మానవుల

మౌలిక స్వాతంత్ర్యం, వ్యక్తిత్వాలను హరించివేస్తుంది. చట్టానికి కట్టుబడి పాలకులు పాల్పడే అరాచకత్వానికి ప్రతిరూపమే నియంతృత్వం.

అంబేద్కర్ ఈ విధంగా అన్నారు. "అరాచకత్వం, నియంతృత్వంలో స్వేచ్ఛ హరింపబడుతుంది." ప్రజల మధ్య సామాజిక ఐక్యతలో "ఉత్తమమైన వాటిని పరిరక్షించాల్సిన సామాజిక అవసరం. "ఉమ్మడి నిబంధనలు, నైతికత", వ్యక్తుల అభివృద్ధిని పరిరక్షించడం. మిళితమైన అంశాలని అంబేద్కర్ పేర్కొన్నారు. మెజారిటీ పాలన సూత్రరీత్యా ఆమోదయోగ్యం కాదు. అయితే నిబంధనల రీత్యా సహింపబడే అంశంగా పరిణమించింది. "దానిని ప్రజలు ఎందుకు సహిస్తున్నారో కూడా నేను చెప్పాల్సి ఉంది. రెండు కారణాల రీత్యా ఆ వ్యవస్థను సహించడం జరుగుతుంది. (1) మెజారిటీ అంటే ఎప్పుడూ రాజకీయ మెజారిటీయే (2) మెజారిటీ వర్గం తీసుకున్న నిర్ణయంపై తిరుగుబాటు చేసేందుకు మైనారిటీలు ఆసక్తి చూపరు. మెజారిటీపాలన మొత్తం సమాజానికి ప్రయోజనకారిగా ఉండాల్సిన అవసరం లేదు. ఈ విషయంలో రూసో అభిప్రాయాలు, అంబేద్కర్ అభిప్రాయాలు ఒకే విధంగా ఉన్నాయి. మెజారిటీ వర్గం నిరంకుశత్వం నుండి వ్యక్తులను కాపాడటం ఆయన ప్రధాన ధ్యేయం. అమెరికా రాజ్యాంగం తరహాలో చెక్స్ బ్యాలెన్సెస్ ద్వారా దీనిని సాధించాలని ఆయన సంకల్పించారు. మెజారిటీ ప్రజల సంకల్పం, మంచి బాధ్యతయుతమైన ప్రభుత్వానికి అవసరమని అంబేద్కర్ అభిప్రాయపడ్డారు. మైనారిటీ ప్రజల ఆలోచనలు, ఆకాంక్షలకు తగిన ప్రోత్సాహకాలు అందించే విధంగా ఉండాలి.

ఏకపార్టీ వ్యవస్థను అంబేద్కర్ నిరంకుశత్వంతో పోల్చారు. రెండు పార్టీల ప్రజాస్వామ్య వ్యవస్థకు ఆయన సానుకూలత చూపారు. 1951-52లో జరిగిన మొట్టమొదటి సార్వత్రిక ఎన్నికల్లో పిఎస్పితో ఆయన ఎన్నికల పొత్తు పెట్టుకున్నారు. 'పేదరికంపై పోరాటం' వివరాలను ఎన్నికల ప్రణాళికలో సమగ్రంగా ప్రస్తావించారు. పటిష్టమైన ప్రతిపక్షం ఉండాలని ఆయన కోరుకున్నారు. బ్రిటిష్ తరహా వ్యవస్థ గురించి ఆయన ఎక్కువగా ఆలోచించేవారు. భారతదేశంలో పటిష్టమైన ప్రత్యామ్నాయ పార్టీ ఎన్నికల్లో పొత్తుల ద్వారా రాదు. నిలకడతో కూడిన రాజకీయ కార్యకలాపాల ద్వారానే ఇది సాధ్యమవుతుంది. అయితే దానిని సాధించడంలో ఆయన విఫలమయ్యారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపై ఆయనకు పరిపూర్ణ విశ్వాసం ఉంది. రాజ్యాంగపరమైన నైతికతను అలవాటు చేసుకోవాలని ఆయన సూచించారు. రాజకీయ ప్రజాస్వామ్య సామాజిక, ఆర్థిక ప్రజాస్వామ్యంగా మార్చాలని ఆయన సూచించారు. ప్రజాస్వామ్య సరళులను అలవాటు చేసుకునేందుకు ప్రజామోదాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందని అంబేద్కర్ సూచించారు.

పాకిస్తాన్‌ను నిర్వచించడం, ఇతర సంబంధిత సమస్యలను గుర్తించడంలో అంబేద్కర్ ముందుచూపు ఆయన పాకిస్తాన్‌పై రాసిన పుస్తకంలో వెల్లడవుతుంది. 1940లోనే ఆయన మొత్తం సమస్యను ప్రజల ముందుంచారు. ఈ అంశాన్ని నిర్ణయించే రెండు ముఖ్యాంశాలను ఆయన వివరించారు. అవి భారతరక్షణ, ముస్లింల సెంటిమెంటు. ఆయన దేశ విభజనకు

అనుకూలంగా ప్రచారం చేశారు. విభజన వల్లనే హిందువులు స్వేచ్ఛగా, స్వతంత్రంగా జీవించ గలుగుతారని ఆయన వ్యాఖ్యానించారు. అయితే అంబేద్కర్ ప్రచారం హిందువుల సెంటిమెంటుకు వ్యతిరేకమైంది. దేశ విభజనను వారెన్నడూ కోరుకోలేదు. అంబేద్కర్ చెప్పింది నిజమేనని ఆ తరువాత వెల్లడైనప్పటికీ తృతీయశక్తి (బ్రిటన్) కుతంత్ర ఫలితంగా జాతీయ సంక్షోభంగా పరిణమించింది. దేశ విభజన అనేది భారత భూభాగాన్ని రెండుగా చీల్చడమేనని భావన ప్రజల్లో నెలకొంది. రాజ్యాంగ పరిషత్ ప్రారంభంలో అంబేద్కర్ సమైక్య భారత్‌కు మద్దతు తెలిపారు. భారత్ అవిభాజ్యంగా ఉండాలనేది ఆయన స్వప్నం. భారతదేశానికి స్వాతంత్ర్యం మంజూరు చేసే సమయంలో జాతీయ భావోద్వేగాలకు విలువ ఇవ్వడం జరిగింది. రాజ్యాంగ పరిషత్తులో చర్చ సందర్భంగా సమైక్య భారతదేశానికి అంబేద్కర్ బేషరతు మద్దతు తెలపడంతో అల్లాడి కృష్ణస్వామి అయ్యర్ అమితానందం వ్యక్తం చేశారు.

అంబేద్కర్ దృష్టిలో ప్రాంతీయ భాష రాష్ట్ర అధికార భాష కారాదు. మొత్తం దేశానికి హిందీ జాతీయ భాష కావాలని అంబేద్కర్ సూచించారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ఆయన సానుకూలత చూపారు. వివిధ భాషల సమ్మేళనం గల రాష్ట్రాల్లో కంటే భాషా ప్రయుక్త రాష్ట్రాలోనే ప్రజాస్వామ్యం ఎక్కువగా ఉంటుందని అంబేద్కర్ పేర్కొన్నారు. బొంబాయి రాజధానిగా సమైక్య మహారాష్ట్ర ఏర్పాటును ఆయన బలపరిచారు. భాషాభిమానం, కులతత్వం కలసిమెలసి ఉంటాయని, భాషా ప్రయుక్త రాష్ట్రాల్లో రాజకీయాధికారం మెజారిటీ వర్గానికే లభిస్తుందని ఆయన అన్నారు. దీనికి పరిష్కారంగా 'ఒక రాష్ట్రం, ఒక భాష, సిద్ధాంతాన్ని అంబేద్కర్ ప్రతిపాదించారు. ఉత్తరప్రదేశ్, బీహర్, మహారాష్ట్ర వంటి పెద్ద రాష్ట్రాలను ఆయన వ్యతిరేకించారు. అటువంటి రాష్ట్రాలవల్ల కేంద్రప్రభుత్వానికి, మైనారిటీలకు కూడా ప్రమాదం. మరాఠీలు మాటల ద్వారా కాకుండా కులం ద్వారా పాలన సాగిస్తారు. ఈ సమస్యలపై అంబేద్కర్ ఆలోచనలను విస్మరించడానికి వీలులేదు. మరాఠీల ఆధిపత్యం, మైనారిటీల రక్షణ ప్రస్తుతం తక్షణ, సమస్యలని అన్నారు. తన కులాన్ని కాపాడుకునేందుకు ఆయన చేసే ప్రయత్నాలు ఆయన ఆలోచనల్లో కూడా ప్రతిస్పందిస్తున్నాయి. ఉత్తర, దక్షిణ ప్రాంతాల మధ్య వైరుధ్యాల గురించి ప్రస్తావిస్తూ ఉత్తర ప్రాంతం క్రమంగా బలపడుతున్న విషయాన్ని పేర్కొన్నారు. రాష్ట్రాల పునర్ వ్యవస్థీకరణ కమిషన్‌కు కె.ఎం.ఫణిక్కర్ ఒక అసమ్మతి లేఖ రాశారు. దక్షిణ ప్రాంతంపై ఉత్తరప్రాంతం ఆధిక్యత ప్రదర్శిస్తున్న విషయం గురించి ప్రస్తావించారు. అంబేద్కర్ దీనితో ఏకీభవించారు.

హిందూకోడ్ అనేది భారత రాజ్యాంగం ఇచ్చిన హామీగా అంబేద్కర్ భావించారు. ఈ కోడ్ హిందూ సమాజం పటిష్టీకరణకు ఉద్దేశింపబడింది. రాజ్యాంగానికి అనుగుణంగా ఉంది. కోడిఫికేషన్ పట్ల ఆయన తీవ్ర ఆసక్తి ప్రదర్శించారు. అయితే కాంగ్రెస్ వ్యతిరేకత వ్యక్తం చేయడంతో ఆ ప్రయతాన్ని అంబేద్కర్ ఉపసంహరించుకున్నారు. మంత్రివర్గం నుండి ఆయన రాజీనామా చేయడానికి ఇది ఒక కారణం. హిందూ చట్టం కోడిఫికేషన్ ఆలోచనలు ప్రగతిశీలకంగా ఉన్నాయి. పౌరస్మృతికి దోహదం చేశాయి. ఇది లౌకిక ప్రజాస్వామ్యానికి ప్రాతిపదిక.

భారత విదేశాంగ విధానం శాంతి, కమ్యూనిజం, స్వేచ్ఛ ప్రజాస్వామ్యం మధ్య సహజీవనం, అలీన విధానం ప్రాతిపదికగా రూపొందింపబడింది. అలీన విధానం భారతదేశానికి

మిత్రులను సంపాదించి పెట్టలేకపోయిందని అంబేద్కర్ అభిప్రాయపడ్డారు. మత ప్రాతిపదికగా కాశ్మీర్‌ను విభజించాలని ఆయన చేసిన సూచన భారతదేశానికి ఆత్మహత్యాసదృశ్యమైంది. నెహ్రూ అనుసరించిన నాజర్ అనుకూల విధానాన్ని ఆయన నిశితంగా విమర్శించారు. సూయజ్ కాలువ జాతీయకరణపై నాజర్‌కు అనుకూలంగా వ్యవహరించడం ప్రమాదకరమైందని ఆయన వ్యాఖ్యానించారు. ఆయన బ్రిటన్, అమెరికా అనుకూలవాది, సోవియట్ వ్యతిరేకి. సియాటో (ఆగ్నేయాసియా దేశాల కూటమి) అనుకూలవాది.

భారత్ అనుసరిస్తున్న అలీనోద్యమాన్ని ఆయన వ్యతిరేకించారు. అయితే అలీన వైఖరిని వ్యతిరేకించడం అందరి ఆమోదం, ప్రశంసలు పొందిన విదేశాంగ విధానానికి భిన్నమైంది. ఆయన స్పష్టంగా సోవియట్ వ్యతిరేకి. అయితే పూర్తిగా అమెరికా అనుకూలవాది కాదు. అమెరికా ప్రభావం విస్తరిస్తుండం పట్ల హెచ్చరిక జారీ చేశారు. అమెరికా తన ఆర్థిక బలంతో ప్రపంచాన్ని, ముఖ్యంగా భారత్‌ను బానిసగా చేసుకుంటుందని అంబేద్కర్ వ్యాఖ్యానించారు. అంబేద్కర్ అభిప్రాయంలో బ్రిటన్ కంటే అమెరికాయే మనకు బలమైన శత్రువు. అమెరికా తత్వం విస్తృత ప్రజాస్వామ్యం అయినప్పటికీ ఆచరణలో అది పెట్టుబడిదారి శక్తిగా ఉంది. పెట్టుబడిదారులు ఏ సమయంలోనైనా మనల్ని మోసం చేయవచ్చు. అమెరికా విధానాన్ని ఆయన విమర్శించినప్పటికీ ఆ విధానానికి వ్యతిరేకంగా ఎటువంటి పోరాటాలు నిర్వహించలేదు.

అలీన విధానాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. అలీన విధానాన్ని ఇందువల్ల భారతదేశానికి ఒక్క మిత్ర దేశం కూడా లేకుండా పోయిందని అన్నారు. అయితే అలీన విధానం అంటే ఇతర దేశాలతో సన్నిహిత సంబంధాలు నెలకొల్పుకోవడానికి వ్యతిరేకం కాదు. పండిట్ నెహ్రూ వ్యాఖ్యానించిన విధంగా "బలమైన సంకీర్ణ పక్షాలకు దూరంగా ఉండటం, సాధ్యమైన మేరకు మైత్రీ పూర్వక సహకారం పెంపొందించుకోవడం అలీన విధానం లక్షణం. పెక్కు దేశాలతో భారత్ అనేక ఒప్పందాలు కుదుర్చుకుంది. ఇక రెండవ అంశం అలీన విధానం అంటే తటస్థంగా ఉండటం కాదు. ఇది వ్యతిరేక ఆలోచనవిధానం. సామ్రాజ్యవాద శక్తుల అధిపత్యానికి వ్యతిరేకంగా ఆసియన్, ఆఫ్రికన్ దేశాలు నడుం బిగుస్తున్నాయి. ప్రపంచ ప్రజాభిప్రాయం కూడా వలసవాదం రేషియాలిజంకు వ్యతిరేకం, ఇందులో భారత్‌పాత్ర కూడా ఉంది. అయితే అంబేద్కర్ ఈ మార్గాన్ని అనుసరించలేదు. దానికి బదులు అమెరికా, బ్రిటన్ అనుకూలవిధానాలను అనుసరించారు. ఇది ప్రతీఘాత శక్తులతో క్యూ కట్టడమే. సోవియట్ వ్యతిరేక విధానాలను వ్యతిరేకించడం ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకమనే విషయాన్ని అంబేద్కర్ గుర్తించకపోవడం దురదృష్టకరం. కాశ్మీర్, గోవా, సియాటో, ఆంగ్లో అమెరికన్ బ్లాక్ విధానాలను సమిష్టిగా పరిశీలిస్తే వాటి వెనుక ఖచ్చితమైన సిద్ధాంతాలు లేవు. అవి అభివృద్ధి నిరోధకమైనవి.

హిందూ అగ్రకులాలవారు అధిపత్యం ప్రదర్శిస్తారనే అంబేద్కర్‌లో నెలకొన్న భయాందోళనలు తమ కులాన్ని దేశం ముందు నిలిపేలా ఆయనపై ఒత్తిడి తీసుకువచ్చాయి.

దేశ డిమాండ్ల విషయంలో ఆయన ఎప్పుడూ వెనకంజవేయలేదు. దేశం, అస్పృశ్యుల ప్రయోజనాల మధ్య సంఘర్షణ తలెత్తితే అంబేద్కర్ విషయంలో దేశ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇచ్చేవారు. నియంతృత్వం ప్రదర్శించే మెజారిటీ వర్గానికి మద్దతు ఇవ్వడాన్ని ఆయన వ్యతిరేకించారు. ఉద్యోగాలను నిదానంగా భారతీయకరణ చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. కొంత కాలం పాటు ఉద్యోగాల్లో బ్రిటిష్ భావన కొనసాగడం అవసరమని ఆయన అన్నారు. అదే జాతీయాభిప్రాయంగా ఉండేది ఇందుకు బ్రిటిష్ ప్రభుత్వం అంబేద్కర్ నాయకత్వాన్ని తనపై బలవంతంగా రుద్దిందని సుభాష్ చంద్రబోస్ అనుమానించారు. అంబేద్కర్ సమాజంలో దోపిడీ చేయబడుతున్న వర్గం నాయకుడు. ఆ వర్గంలో ఎక్కువ మంది కార్మికులు, చిన్న రైతులు, భూమి లేని వ్యవసాయ కార్మికులు ఉన్నారు. తరగతి ప్రాతిపదికన ఈ వర్గం సంఘటితం కావాల్సి ఉంది. అయితే, ఆయన, ఆయన అనుచరులు ఈ పద్ధతిని అనుసరించలేదు. ఇండిపెండెంట్ లేబర్ పార్టీ (కొన్ని మినహాయింపులున్నాయి) అస్పృశ్య కులాలకు చెందిన పార్టీ, షెడ్యూల్డ్ కులాల సమాఖ్యను ఐసిపి తరహాలో నిర్వహించడం జరిగింది. ఇది విస్తృత స్థాయిలో జరిగింది. ఈ పార్టీలు అస్పృశ్య కులాలకు రాజకీయ వేదికగా మారాయి. అణచివేతకు గురవుతున్న ఈ వర్గాల రాజకీయకరణ తరగతి ప్రాతిపదికగా జరగలేదు. కొన్ని సందర్భాలలో అస్పృశ్య కులాలకు చెందిన కార్మికులు ఇతర పార్టీలు నిర్వహించిన కార్మిక సంఘాల్లో చేరారు.

ఒక దేశ స్వాతంత్ర్యం ఆ దేశ సైన్యంపై ఆధారపడి ఉంటుంది. అన్ని సమయాల్లో, ఏదైనా ఆపద సమయాల్లో పోరాటంసల్పగల సైన్యం సామర్థ్యంపై ఆధారపడి ఉంటుంది. అయితే సైన్యం రాజకీయేతరమైందిగా ఉండాలి. రాజకీయాలతో సంబంధంలేని సైన్యం భారతదేశ స్వాతంత్ర్యాన్ని పరిరక్షించ కలుగుతుంది. సైన్యానికి రాజకీయ పక్షపాతం ఉంటే అది ఎప్పుడు ఒక పార్టీని అధికారం నుండి దింపివేసే స్థాయిలోనే ఆలోచిస్తూ ఉంటుంది. రాజకీయ సైన్యం భారతదేశ స్వేచ్ఛకు అత్యంత ప్రమాదకరమైందని అంబేద్కర్ హెచ్చరించారు. అసలు సైన్యమే లేని వారి పరిస్థితికంటే హేయమైంది.

జీవితం చివరి భాగంలో అంబేద్కర్ బౌద్ధమతం స్వీకరించారు. సామాజిక సమస్యల పట్ల బుద్ధుని వైఖరిని ప్రశంసించారు. ముఖ్యంగా ప్రైవేటు ఆస్తి విషయంలో గౌతమబుద్ధుని వైఖరిని ఆయన కొనియాడారు. ప్రైవేటు ఆస్తికి సంబంధించి బుద్ధుడు కఠినమైన నిబంధనలు రూపొందించాడు. బుద్ధిజం ప్రాముఖ్యతను అంబేద్కర్ నొక్కి వక్కాణించారు. అది మార్క్సిజంకు ప్రత్యామ్నాయమని భావించారు. వేలాది మంది అస్పృశ్యులను బౌద్ధమతంలో చేర్చారు. అణచివేతకు గురవుతున్న వర్గాల సమస్యలకు బౌద్ధమతమే పరిష్కారమని అన్నారు.

సమాజ నిర్వహణలో ఖచ్చితమైన సిద్ధాంతాలను మార్క్సిజం రూపొందించదు. వాస్తవ అనుభవాల ప్రాతిపదికగా రూపొందించిన మార్క్సిస్టు సిద్ధాంతం సమాజంలో శ్రామిక వర్గానికి మార్గదర్శకత్వం వహిస్తుంది. అంతిమంగా అది సోషలిస్టు సమాజ స్థాపనకు దారి తీస్తుంది. బడుగు వర్గాల ఆరాధ్య దైవమైన అంబేద్కర్ ఈ సూత్రాన్ని విస్మరించారు. ఈ వైఖరిని ఆయనను తప్పు దారిలో నడిపించింది. ఎటువంటి వర్గ సిద్ధాంతం లేకుండా బుద్ధిజాన్ని స్వీకరించారు.

మార్క్సిజాన్ని కాదని ఆయన సోషలిజాన్ని ఎలా సాధిస్తారో అర్థం కాని విషయం. మార్క్సిజానికి బుద్ధిజం ఎలా ప్రత్యామ్నాయమవుతుందో అంతుబట్టని విషయం. ఇది ఆత్మవంచనే. కార్మిక, వ్యవసాయ కార్మిక ఉద్యమాన్ని అభివృద్ధి నిరోధక, ఆధ్యాత్మిక చింతనల వైపు దారి మళ్ళించడమే.

ప్రపంచంలో కష్టాలను భౌతిక పద్ధతుల ద్వారా తొలగించుకోవాలి. మతం మార్పిడి ద్వారా వాటిని తొలగించలేము. పరిస్థితుల్లో మార్పులు తీసుకురావాల్సి ఉంటుంది. ఆధ్యాత్మిక విజ్ఞప్తి. ప్రార్థనల ద్వారా వీటిని మార్చలేం. అంబేద్కర్ ప్రవచించిన ప్రభుత్వ సోషలిజం, పార్లమెంటరీ ప్రజాస్వామ్య సిద్ధాంతాలకు భిన్నంగా ఆయన ఆ తరువాత బౌద్ధమతం స్వీకరించారు.

1937లో ఆయన ఇండిపెండెంట్ లేబర్ పార్టీని స్థాపించారు. కొన్ని సందర్భాల్లో బొంబాయి కమ్యూనిస్టులతో చేతులు కలిపారు. అయితే ఆయన విధానాల్లో నిలకడతనం లోపించేది. కుల వ్యతిరేక పోరాటాల్లో సైతం ఇదే ధోరణి ద్యోతకమయ్యేది. ఆయన కులం బడుగు వర్గానికి చెందినదైనప్పటికీ, భూమి లేని వ్యక్తులతో కూడుకున్నదైనప్పటికీ, వేతనాలమీదే ఆధారపడి ఉన్నవారికి చెందినదైనప్పటికీ, ఉన్నవారైనప్పటికీ వారిలో కులపరమైన చైతన్యం తీసుకురావడంలో అంబేద్కర్ విఫలమయ్యారు. ఆయన రాజకీయ ఆలోచనా విధానంలో గల బలహీనతలే ఇందుకు కారణం. పూనా ఒప్పందం తరువాత ఆయన కార్మిక వర్గాలకు నాయకత్వం వహించేందుకు కృషి చేశారు. ఇందులో విఫలమై ఏకంగా ఆ రంగం నుండే వైదొలిగారు. తమ కులానికి నాయకత్వం వహించడానికి మాత్రమే పరిమితం అయ్యారు. ద్వితీయ ప్రపంచ సంగ్రామంలో ప్రభుత్వంతో సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. 'క్విట్ ఇండియా' ఉద్యమం జరుగుతున్న సమయంలో ఆయన వైస్రాయ్ కౌన్సిల్ సభ్యునిగా చేరారు. ముస్లింలీగ్ ఆ కౌన్సిల్‌లో చేరకపోవడం ఇక్కడ గమనార్హమైన అంశం. తిరుగుబాటుకు చిహ్నంగా నెహ్రూ అంబేద్కర్‌ను సరిగానే వ్యాఖ్యానించారు. అస్పృశ్యుల స్థితిపట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అణిచివేతకు గురవుతున్న ఆ వర్గాలను సంఘటితం చేసేందుకు కృషి చేశారు. కులతత్వంతో కుళ్ళిపోయిన, అస్పృశ్యతా దురాచారాన్ని పాటించే సమాజాన్ని సవాలు చేసే విధంగా తమ కులాన్ని తీర్చిదిద్దేందుకు ప్రయత్నించారు. వారిని సమీకరించే ప్రయత్నంలో వారిలో ఆత్మగౌరవాన్ని మేల్కొలిపారు. తమ కులాన్ని చూసి గర్వపడేలా చేశారు. సామాజిక అన్యాయానికి పాల్పడుతున్న సమాజాన్ని కూకటివేళ్ళతో పెకిలించాలని పిలుపునిచ్చారు.

అంబేద్కర్‌కు ముందు ఉన్న సంఘ సంస్కర్తలు మానవతావాదులు, సర్వదయాళుతత్వం గలవారు.సంస్కరణా మార్గాల ద్వారా సమాజాన్ని మలిచేందుకు వారు ప్రయత్నించారు. సమానత్వం వంటి సిద్ధాంతాలను ప్రవచించేవారు. అస్పృశ్యతా నిర్మూలన వారి ప్రధాన కార్యక్రమంగా ఉండేది. ప్రచారం నిర్వహించడం పాఠశాలలను ప్రారంభించడం వంటివి వారు అనుసరించారు. అంబేద్కర్ అనుసరించిన పద్ధతులు ఇందుకు పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. సంస్కర్తల ఆకాంక్షలన్నీ అంబేద్కర్‌కూ ఉన్నాయనడంలో సందేహం లేదు. అస్పృశ్యులు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో అభ్యున్నతిని ఆయన కోరుకున్నారు. దాని కోసం ఆయన నిరంతరం

తపన పడ్డారు. 'అధికారం కోసం పోటీ పడండి' అని వారికి పిలుపునిచ్చారు. అదే సమయంలో వేర్పాటు వాద డిమాండ్‌ను ముందుకు తెచ్చారు.

మహాత్మాగాంధి పట్టుదల మేరకు అస్పృశ్యతా నిర్మూలన జాతీయోద్యమ కార్యక్రమాల్లో స్థానం సంపాదించుకుంది. జాతీయ విమోచన ఉద్యమానికి గాంధీ నాయకత్వం వహించారు. అస్పృశ్యతా నిర్మూలనకు రాజకీయ కార్యక్రమం రూపొందించడంతో పాటు దాని కోసం ప్రతి ఒక్కరూ విధిగా కృషి చెయ్యాలని పిలుపునిచ్చారు. ఆశ్రమాల్లో బోధన ఆచరణలపై సైతం ఆయన పట్టుదల వహించారు. ఆయన ప్రవచనాలు కేవలం ఉపన్యాసాలకే పరిమితం కాలేదు. ఆచరణలో పెట్టేవారు.

జాతీయోద్యమం అనేక నివారణ చర్యలు చేపట్టింది. అస్పృశ్యవర్గానికి నాయకునిగా అంబేద్కర్ బడుగువర్గాల డిమాండ్లను తరచూ ప్రస్తావించేవారు. రాజ్యాంగ వ్యవహారాలకు సంబంధించి ఆయన ప్రత్యేక డిమాండ్లు చేసేవారు. అస్పృశ్యులకు ప్రత్యేక హక్కులు సాధించడం ఆయన ధ్యేయంగా ఉండేది. అన్ని వర్గాల మధ్య సమైక్యత సాధించి వారిని కలుపుకోవడం మహాత్మాగాంధి నేతృత్వంలోని జాతీయోద్యమం ముఖ్యలక్షణంగా ఉండేది. స్వాతంత్ర్యం కోసం నిర్వహించే పోరాటంలో జాతీయ సమైక్యత సాధించడం కోసం ఒకే నాయకత్వం క్రింద ప్రజలందరినీ సమీకరించడం లక్ష్యంగా ఉండేది. అయితే ప్రత్యేక డిమాండ్లు చేసే అంబేద్కర్ జాతీయోద్యమ కార్యక్రమాలతో విభేదించారు. జాతీయోద్యమం తమ అధిక్యతను వ్యతిరేకిస్తోందని అస్పృశ్యులు భావించారు. అయితే వాస్తవం మేమంటే వారి ప్రత్యేక డిమాండ్లను మాత్రమే జాతీయోద్యమం తిరస్కరించింది. హిందూ కులాల నుండి అస్పృశ్య కులాలను వేరు చేయడం వల్ల వారు శాశ్వతంగా సామాజికంగా, రాజకీయంగా వేరు పడిపోతారని గాంధిజీ భావించారు. అది జాతీయ సమగ్రతకు భంగకరమని ఆయన భావించారు, ప్రత్యేక హక్కులు కల్పించడం, హిందూయిజాన్ని విచ్చిన్నం చేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రత్యేక డిమాండ్ల కోసం జాతీయ నాయకత్వంతో విభేదించడం కొన్ని సందర్భాల్లో బ్రిటిష్ అనుకూల వైఖరి తీసుకోవడానికి ఉద్దేశించింది. అయితే ఆయన జాతి వ్యతిరేకంగా వ్యవహరించేవారు కాదు. జాతీయ నాయకత్వం, అస్పృశ్య వర్గం మధ్య అంతరం మరింతగా విస్తరించింది.

కాంగ్రెస్‌ను, మహాత్మాగాంధీని అంబేద్కర్ నిరంతరం వ్యతిరేకిస్తుండేవారు. తమ కులాలకు భద్రత కల్పించాలని ప్రత్యేక హక్కులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇది కాంగ్రెస్ అస్పృశ్య వర్గంలో ప్రగతిశీలక శక్తుల మధ్య అగాధం ఏర్పడటానికి దోహదం చేసింది. ఈ వివాదంతో హిందు మతంలోని బ్రాహ్మణ వ్యతిరేక వర్గం తొలుత దూరంగా ఉంది. తన సామాజిక సేవా కార్యక్రమాలను యధావిధిగా కొనసాగించింది. జాతీయ శక్తుల నుండి విడిగా ఉండటం వల్ల తమ సమస్యలు పరిష్కారం కావనే విషయం వారు క్రమంగా గుర్తించారు. ఆయన అనుచరులు కూడా ఆయన మార్గాన్నే అనుసరించారు. దీంతో రెండు వర్గాల మధ్య అగాధం అంతరించే అవకాశం ఏర్పడింది. అంబేద్కర్, ఆయన అనుచరులు వేరు పడటం వల్ల దేశంలో వామపక్షశక్తులు బలహీనపడ్డాయి. సామాజిక అసమానత్వంపై కార్మిక సంఘాలు

చేసే పోరాటం సరిపోలేదు. ఫలితంగా అస్పృశ్య వర్గానికి చెందిన కార్మికులు దేశంలో సామాజిక ఉద్యమంలో భాగస్వాములు కాలేదు. బలమైన సామాజిక, జాతీయ శక్తుల నుండి అంబేద్కర్ చీలిపోవడం మత రాజకీయాలకు తెరతీసింది. అంబేద్కర్ ఆ తరువాత పెట్టుకున్న పొత్తులు, ఆలోచనలు దీనినే నిరూపించాయి.

తమ కులం అన్ని రకాల దాస్య శృంఖలాల నుండి బయటపడి సామాజిక సమానత్వం, స్వేచ్ఛను సాధించాలని అంబేద్కర్ ఆకాంక్షించారు. సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా పోరాటం జరపడంలో ఆయన చొరవ ప్రదర్శించలేదు. కాంగ్రెస్ పార్టీని గాంధీజాన్ని వ్యతిరేకించడం జాతీయ పోరాటానికి అంబేద్కర్ వ్యతిరేకమనే భావన ప్రజల్లో కలిగించింది. బ్రిటిష్ ప్రభుత్వం నుండి రాయితీలు, ప్రత్యేక ప్రయోజనాలు పొందడానికి ప్రయత్నించిన మహమ్మద్ అలీజిన్నాతో అంబేద్కర్‌ను సమానంగా భావించారు. 1939 డిసెంబర్‌న నిర్వహించిన 'డెలివరెన్స్ డే' లో పాల్గొనడం అవకాశవాదానికి పరాకష్టగా విమర్శలు చెలరేగాయి. కాంగ్రెస్ మంత్రులు రాజీనామా చేసిన అనంతరం ఏర్పాటైన తాత్కాలిక ప్రభుత్వంలో ముస్లింలీగ్ ప్రతినిధిగా సభ్యత్వాన్ని అంగీకరించాలని జె.ఎన్. మండల్ కు ఆయన విజ్ఞప్తి చేశారు. దేశంలో నిజమైన ప్రజాస్వామ్య వ్యవస్థ నెలకొల్పాలని కాంగ్రెస్‌నాయకులు కోరుతున్నారనే తమ నమ్మకం వమ్మయిందని, 1937 నుండి కాంగ్రెస్ పార్టీ వ్యవహార శైలి గమనిస్తే తాము ఈ నిశ్చితాభిప్రాయానికి వచ్చామని విమర్శిస్తూ సర్ చమన్ లాల్ సెతల్వాడ్, సర్‌కొవాస్జీ జహంగీర్, డాక్టర్ అంబేద్కర్, ఇతరులు 1939 అక్టోబర్‌లో ఒక ప్రకటన చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు తమను ఎవరూ వ్యతిరేకించడాన్ని సహించలేకపోతున్నాయని, ప్రతిపక్షం అనేది ఉండకూడదనే రీతిలో నిరంకుశంగా వ్యవహరిస్తున్నాయని వారు విమర్శించారు. ఆ పార్టీ మైనారిటీల అభిప్రాయాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నుండి వైదొలగి సత్యాగ్రహ ఉద్యమానికి (1940)లో సన్నాహాలు ప్రారంభించిన తరుణంలో అంబేద్కర్ కాంగ్రెస్ వ్యతిరేక శక్తులతో శృతి కలిపారు. ఈ పరిణామం దేశంలో కాంగ్రెస్ వ్యతిరేకతను మరింతగా పెంచింది. జాతీయ ప్రవంతికి అంబేద్కర్ దూరం కావడంతో అస్పృశ్యుల ఉద్యమం బలహీనమైంది.

గతాన్ని విస్మరించి అభిప్రాయ భేదాలకు స్వస్తి చెప్పాలని అంబేద్కర్ నిర్ణయించుకోవడం హర్షణీయ పరిణామం. కొత్త బాధ్యతలు స్వీకరించే స్థానానికి తాను ఎదగగలనని అంబేద్కర్ నిరూపించుకున్నారు. కులం కంటే దేశం, దేశ ప్రయోజనాలు ముఖ్యమని ఆయన తన అనుచరులకు ఉద్బోధించారు. మన స్వాతంత్ర్యోద్యమం రెండోసారి ప్రమాదంలో పడింది. ఈసారి అసలు దాని ఉనికికే ముప్పు ఏర్పడింది. ఆయన తన జీవితంలో చివరి సంవత్సరాల్లో తన అపార తెలివితేటలను నిర్మాణాత్మక కార్యకలాపాలకు వినియోగించారు. జాతీయ నాయకులతో హృదయ పూర్వకంగా కలిసి పని చేయడం ఆయనను కాంగ్రెస్ దగ్గరకు చేర్చింది. ప్రధాన సిద్ధాంతపరమైన విభేదాలు తగ్గుముఖం పట్టాయి. రాజ్యాంగం నిజమైన ప్రయోజనాలు అందుకోసం కృషి చేసిన వారికి మాత్రమే అందుతాయి. రాజ్యాంగ పరిషత్తు విజయవంతం కావడానికి సహకరించిన వారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సహకారంతో

అభిప్రాయ భేదాలు తగ్గుముఖం పట్టాయని అన్నారు. జాతీయ నాయకత్వం అణచివేతకు గురవుతున్న వర్గాల మధ్య అగాధం నిర్మూలన జాతీయ అవసరం. అది అద్భుత ఫలితాలను అందించింది.

## ప్రజాస్వామ్యం గురించి

సామాజిక ప్రజాస్వామ్యాన్ని రాజకీయ ప్రజాస్వామ్యానికి అన్వయించడం అంబేద్కర్ రాజకీయ ఆలోచనా విధానానికి అందించిన ప్రధాన సేవ. చైతన్యవంతమైన, సంస్కరణ పొందిన సమాజం లేకుండా రాజకీయ పురోగతి అసాధ్యమని ఆయన గట్టిగా నమ్మారు. రాజకీయ ప్రజాస్వామ్యం కోసం చేసే పోరాటాన్ని సామాజిక ప్రజాస్వామ్యం కోసం కూడా విస్తరించాలని అంబేద్కర్ పేర్కొన్నారు. ఎందువల్లనంటే ప్రభుత్వం కంటే కూడా సమాజమే ఎక్కువ నిరంకుశంగా, అణచివేసేదిగా ఉంటుంది. "ప్రభుత్వం కంటే కూడా ఎక్కువగా సమాజం వ్యక్తుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తూ అణచివేత విధానాలకు పాల్పడగలదని ఎక్కువమంది ప్రజలు గుర్తించారు. ఇలా అణచివేసేందుకు సమాజానికి అందుబాటులో ఉన్న వనరులు, పరిధి ప్రభుత్వానికి వున్న వనరులు, వారధికంటే కూడా విస్తృతంగా ఉంటాయి. అవి మరింత ఎక్కువ పదునుగా ఉంటాయి. (అంబేద్కర్, రానడే, గాంధీ, జిన్నా). ఉగ్రవాదులపై పోరాటంలో ఉదారవాద సంస్కరణవాదులతో అంబేద్కర్ పూర్తిగా ఏకీభవించారు. రాజకీయ సంస్కరణల కంటే ముందు సంఘ సంస్కరణలు ప్రవేశపెట్టాలనే సిద్ధాంతాన్ని ఆయన గట్టిగా నమ్మారు. ప్రజల హక్కులు పరిరక్షించేందుకు రాజకీయాధికారం అవసరమనే ఉగ్రవాదుల సిద్ధాంతాన్ని ఆయన వ్యతిరేకించారు. అధికారానికి ముందు హక్కు సంపాదించుకోవాలని, ఈ వ్యవస్థను అటునుంచి ఇటు మార్చడం తీవ్రమైన తప్పిదమని అన్నారు. హక్కులను చర్చల ద్వారా కాపాడుకోవడం సాధ్యం కాదని, సమాజం, సమాజ నైతిక చైతన్యం ద్వారా మాత్రమే సాధ్యమని అంబేద్కర్ అన్నారు.

సమాజంలో అణచివేతకు గురవుతున్న వర్గాల ఉనికి ఉన్న దశలో ప్రజాస్వామ్యం నిలకడగా ఉండబోదని అంబేద్కర్ భావించారు. బలమైన ప్రతిపక్షం చట్టం ముందు, అధికార యంత్రాంగంలో, రాజ్యాంగపరమైన నియమావళి, పటిష్టమైన సమాజం. సమాజంలో నైతిక నియమావళి, ప్రజాచైతన్యం ప్రజాస్వామానికి ఉండాల్సిన లక్షణాలు. భారత రాజకీయాల్లో ప్రధానంగా కనిపించే వ్యక్తి పూజను విడనాడాలని ఆయన ప్రజలకు ఉద్బోధించారు. నిజమైన సామాజిక ప్రజాస్వామ్యం ఉండాలని ఆయన ఆకాంక్షించారు. స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం, జీవిత సిద్ధాంతాలుగా గుర్తించే జీవితమే ప్రజాస్వామ్యం. ప్రజలు జాతీయ సౌరభౌమత్వాల లక్షణాలు. పెంపొందించుకోవాలని అంబేద్కర్ పిలుపునిచ్చారు. వేలాది కులాలుగా విభజింపబడ్డ ప్రజలు ఒక దేశంగా ఎలా ఉండగలరు? అని ఆయన అడిగారు. ప్రజాస్వామ్య పార్టీ అవిభాజ్యమైన అంశాలని అంబేద్కర్ గ్రహించారు. ప్రజాస్వామ్య ప్రభుత్వం నిరంకుశత్వంగా వ్యవహరించకుండా ఉండేందుకు గాను కనీసం రెండు పార్టీలైనా ఉండాలని అన్నారు. ఏకపార్టీ ప్రభుత్వంలో నిరంకుశత్వం, సరైన మార్గదర్శకత్వం లోపించడం వంటి లోపాలను కాదనలేం.

1942లో పార్లమెంటరీ పాలనకు సానుకూలత వ్యక్తం చేసిన అంబేద్కర్ 1947లో పార్లమెంటరీ యేతర పాలన భారత్‌కు అత్యంత అనుకూలమని పేర్కొనడం ఆశ్చర్యకరమని అన్నారు. హిందువులు ఒక దేశం కాలేరని, కనీసం సమాజం కూడా కాలేరని అంబేద్కర్ అభిప్రాయపడ్డారు. ఆయన వాదనలు ఇలా ఉన్నాయి. హిందువులకు జాలి, కారుణ్యం ఉండవు. వారికి ఉన్నదంతా కులం గురించి చైతన్యమే. అలవాట్లు, సంప్రదాయాల్లో సారూప్యం, నమ్మకాలు, ఆలోచనలు ఒక దేశం అయ్యేందుకు పనికిరావు. ఒకే రకమైన వస్తువులు కలిగి ఉండటం, ఒకే లక్షణాలు కలిగి ఉన్న కలిగి వుండటం వేర్వేరు అంశాలు. ఆ రెండు వస్తువులు పైకి ఒకే రకంగా ఉండవచ్చు. అయితే ఇదొక్కటే సరిపోదు. లోతైన ఆధ్యాత్మిక భావన – ఉమ్మడి లక్షణాలు – కలిగి ఉండటం అత్యంత ముఖ్యం. ఇక చివరిగా కుల వ్యవస్థ హిందూ సమాజంలో కమ్యూనికేషన్‌ను, ఉమ్మడి కార్యకలాపాలను నిరోధించింది. పాకిస్తాన్ ఆవిర్భావం తరువాత కూడా భారతీయులను ఇండియా ప్రజలు గానే భావించాల్సి ఉంటుంది కానీ 'దేశం'గా కాదని అంబేద్కర్ అభిప్రాయపడ్డారు.

బ్రిటిష్ ప్రభుత్వం దేశంలో శాంతి భద్రతలను పరిరక్షించిందని అంబేద్కర్ అన్నారు. అయితే ప్రజల ఆహార సమస్యలను తీర్చలేకపోయిందన్నారు. అయితే దానికి వ్యతిరేకంగా పోరాడేందుకు నిరాకరించారు. స్వాతంత్ర్యానంతరం అధికారం కొంతమంది ప్రత్యేక వ్యక్తుల చేతుల్లోకి వెళుతుందని, జనాభాలో వారి వారి నిష్పత్తుల ప్రకారం వివిధ కులాలకు దక్కబోదని అన్నారు. తన పోరాటం హిందూ కులంపైనేనని, అందువల్ల బ్రిటిష్ ప్రభుత్వం ఆగ్రహంతో ఉండాల్సిన అవసరం లేదని అంబేద్కర్ అన్నారు.

గాంధీని వ్యతిరేకించినప్పటికీ, హిందూయిజాన్ని విమర్శించినప్పటికీ అంబేద్కర్ హిందూ వ్యతిరేకి కాదు. మరి ఆయన బౌద్ధమతం ఎందుకు స్వీకరించారు? ఆయన మాటల్లోనే చెప్పాలంటే "బౌద్ధమతం భారత సాంప్రదాయంలో ఒక విడదీయలేని ఒక భాగం. నా మత మార్పిడీ ఈ దేశ సంస్కృతుల సాంప్రదాయాలకు ఎటువంటి విఘాతం కలగకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకున్నాను."

**ప్రభుత్వ సోషలిజం**

ప్రభుత్వ సోషలిజానికి సంబంధించి అంబేద్కర్ సూచించిన మౌలిక ప్రతిపాదనలు ఈ విధంగా ఉన్నాయి. (1) వ్యవసాయం ప్రభుత్వ పరిశ్రమ కావాలి (2) భూమి ప్రభుత్వానికి చెందినదై ఉండాలి (3) ఎటువంటి భూస్వామిగానీ కౌలుదారుగానీ, వ్యవసాయ కార్మికుడు కానీ ఉండరాదు (4) భూమి వ్యక్తుల పేర ఉండటం గానీ, కౌలుదారీ చట్టం చేయడంగానీ కాకుండా సమిష్టి వ్యవసాయ విధానం ఉండాలి (5) ప్రభుత్వం పూర్తి నియంత్రణలో పారిశ్రామికీకరణ వేగవంతం కావాలి (6) బీమాపై గుత్తాధిపత్యం ప్రభుత్వానికే ఉండాలి. తన ఈ ప్రభుత్వ సోషలిజం విధానాన్ని రాజ్యాంగంలో పొందుపరచాలనే అభిప్రాయాన్ని అంబేద్కర్ అంగీకరించలేదు. అందువల్ల అధికార పార్టీ దానికి కట్టుబడి ఉండాల్సి ఉంటుందని, మెజార్టీ సభ్యుల అభిప్రాయం దానిని మార్చలేదని అంబేద్కర్ అన్నారు.

## రాజ్యాంగ నిర్మాత

భారత రాజ్యాంగ పితామహునిగా, 'ప్రధాన శిల్పి'గా అంబేద్కర్ కీర్తించబడ్డారు. రాజ్యాంగం, రాజకీయ అంశాలపై అంబేద్కర్ అభిప్రాయాల గురించి అవగాహన ఉన్నవారికి ఈ వర్ణనలు ఎంత అతిశయోక్తితో కూడుకున్నవో అర్థమవుతుంది. రాజ్యాంగంలో చోటుచేసుకున్న తత్వం, లేదా సిద్ధాంతం నెహ్రూ, ఇతర కాంగ్రెస్ నాయకుల అభిప్రాయాల సారాంశం. చట్టసభలో అధికారం చెలాయించింది నెహ్రూ, పటేల్, ప్రసాద్, అజాద్ వంటి వ్యక్తులేనని శిబనికింకర్ పేర్కొన్నారు. శాసనసభలో అంబేద్కర్ పాత్ర రెండవ స్థాయికే పరిమితం. ఉదాహరణకు పార్లమెంట్‌కు సంబంధం లేని పాలనా వ్యవస్థ కావాలని అంబేద్కర్ భావించారు. అయితే పార్లమెంటరీ పాలనా వ్యవస్థనే రాజ్యాంగం రూపొందించింది. పరిపాలనా సంబంధమైన వ్యవహారాలను రాజ్యాంగంలో చేర్చాల్సిన అవసరం లేదని అంబేద్కర్ భావించారు. అయితే ఆయన తన వైఖరిని మార్చుకోవాల్సి వచ్చింది. భారతదేశ గ్రామం 'అమాయకత్వం, మూఢనమ్మకాల స్థావరం'గా ఆయన అభివర్ణించారు. అయితే మౌలిక సిద్ధాంతాల్లో గ్రామ పంచాయతీ వ్యవస్థను ఆయన ఆమోదించక తప్పలేదు. లక్ష్యాలకు సంబంధించిన తీర్మానం విషయంలో సోషలిస్టు తరహా ఆర్థిక వ్యవస్థను రాజ్యాంగంలో పొందుపరచాలని ఆయన భావించారు. ఆబ్జెక్టివ్ రిజల్యూషన్‌ను ఆయన గట్టిగా వ్యతిరేకించారు. కె.టి. షా దానిని కావాలని కోరినపుడు అంబేద్కర్ వ్యతిరేకించారు. 'రాజ్యాంగంలో ఇటువంటి సిద్ధాంతం ఉండకూడదు" అనేది ఆయన వాదన. ఆయన స్వయంగా అంగీకరించారు. "నా మనస్సాక్షికి వ్యతిరేకంగా వ్యవహరించాను. దానిని దగ్ధం చేసే తొలి వ్యక్తిని నేనే అని చెప్పేందుకు సిద్ధంగా ఉన్నాను" అని అంబేద్కర్ వ్యాఖ్యానించారు.

అంబేద్కర్ రాజకీయ – ఆర్థిక ఆలోచనలు, ఆయన రాజకీయాలు పరస్పర విరుద్ధమైన అంశాలుగా ఉన్నాయి. అందులో స్పష్టత, సంక్లిష్టత, ఒక వరుస క్రమం లోపించాయి. అస్పృశ్యత విషయం మినహా మిగిలిన విషయాలపై ఆయన అభిప్రాయాలు నిశ్చలంగా లేవు. ఈ విషయాలెలా ఉన్నా అంబేద్కర్ సంఘ సంస్కర్త. అస్పృశ్యులకు ఆయన అందించిన సేవలు కలకాలం గుర్తుండిపోతాయి. ఆయన ఆధునిక భారతదేశంలో ప్రముఖ వ్యక్తి. తిరుగులేని నాయకుడు.

## గాంధీ - అంబేద్కర్

కుటుంబ వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు తమ ముందు తరం నాయకులు కృషి చేశారని అంబేద్కర్, పూలే భావించారు. ఇందుకు భిన్నంగా వీరిద్దరు సామాజిక సంబంధాలు, అందుకు సంబంధించినవారి మధ్య పరస్పర సంబంధాలపై దృష్టి సారించారు. శూద్రులు, అతి శూద్రులు సామాజిక మానవ హక్కులను సంపాదించుకోవాలని పూలే ఉద్బోధించారు. ఈ పోరాటంలో కుల, వర్గ అంతరాలే ప్రధాన పాత్ర పోషించాయి. దోపిడీ విధానం గురించి స్పష్టమైన దృశ్యం గోచరించలేదు. ఇందుకు సంబంధించి అంబేద్కర్ ఈ విధంగా

అభిప్రాయపడ్డారు. "శాస్త్ర పరిధి నుండి సెంటిమెంటును వేరు చెయ్యాలి. (అంబేద్కర్స్ వ్యూస్, రైటింగ్, స్పీచెస్ 1వ అంకం, 22వ పేజీ). అయితే దానిని పరిగణనలోకి తీసుకోవడం తప్పనిసరి."

గాంధీ తన రచనలో 'సత్యం, అహింస' గురించి ఎక్కువగా ప్రస్తావించే వారు. అంబేద్కర్ 'స్వాతంత్ర్యం, సమానత్వం, సోదరభావం' గురించి ప్రస్తావించేవారు. సామాజిక పునర్నిర్మాణానికి ఇవి ఆదర్శనీయాలని అంబేద్కర్ ప్రకటించేవారు.

చెరువు నుండి మంచినీరు త్రాగడంలో మానవ హక్కులను నెలకొల్పేందుకు మహర్ పోరాటం, మనుస్మృతిని దగ్ధం చేయడం, విదేశీ వస్త్రాలను దగ్ధం చెయ్యడంతో పోల్చవచ్చు. రెండు అంశాలు జనంలో చైతన్యం తీసుకువచ్చేందుకు ప్రముఖ సాధనాలుగా గుర్తించడం జరిగింది. తన ఉద్యమం కులపరమైందని వెల్లువెత్తిన ఆరోపణలకు అంబేద్కర్ ఈ విధంగా ప్రతిస్పందించారు. "తన ఉద్యమం ఆత్మరక్షణకు ఉద్దేశింపబడింది. అగ్రవర్ణాలుగా చెప్పబడుతున్న వారికి లభిస్తున్న అదనపు సౌకర్యాలు, హక్కులను అంతమొందించేందుకు ఉద్దేశించింది." ఆయన తన పత్రికలో ఇలా రాశారు. "బాలగంగాధర్ తిలక్ ఒక అస్పృశ్య కుటుంబంలో జన్మించి ఉంటే ఆయన 'స్వరాజ్యం నా జన్మ హక్కు' అనే నినాదాన్ని ఆమోదించి ఉండేవారు కాదు. మానవ గౌరవం కాపాడటం నా జన్మహక్కు అస్పృశ్యతా నిర్మూలన నా ప్రధాన కర్తవ్యం' అని నినదించి ఉండేవారు. లెనిన్ భారతదేశంలో జన్మించి ఉంటే ఆయన తొలుత అస్పృశ్యతను అంతమొందించేందుకు పోరాటం ప్రారంభించి ఉండేవారు. ఆ తరువాతే విప్లవ కార్యక్రమం చేపట్టి ఉండేవారు."

తన ఉద్యమం సామాజిక విప్లవం కోసం ఉద్దేశింపబడిందని అంబేద్కర్ పేర్కొన్నారు. దళితుల కోసం ఆయన పోరాటం జరిపారు. ఆయన పోరాటం సామాజిక సమానత్వం కోసం ఉద్దేశింపబడింది. ఈ కార్యక్రమం సమర్థవంతంగా అమలు జరిగేందుకు ఆయన రాజ్యాంగ పరిష్కారాలను సూచించారు. అస్పృశ్యులకు అధిక ప్రాతినిధ్యం కల్పించాలని ఇంగ్లండ్ ప్రధానికి రాసిన లేఖలో గాంధీజీ విజ్ఞప్తి చేశారు. అయితే వారికి ప్రత్యేక సౌకర్యాలు కల్పించే 'కమ్యూనల్ అవార్డు'ను అమలు చేయవద్దని గాంధీజీ ఆ లేఖలో సూచించారు. 'యెరవాడ ఒప్పందం'పై సంతకం చేసిన అనంతరం గాంధీజీకి అంబేద్కర్ మరింత గౌరవం ఇచ్చారు. 1945 మే 6న జరిగిన AISCF వార్షికోత్సవంలో అంబేద్కర్ ఈ విధంగా అన్నారు. "(1) ఒక నిర్దిష్ట లక్ష్యం సాధించేందుకు సమిష్టి హక్కులు లేదా ప్రత్యేక స్థాయి కల్పించడం అవసరం (2) మైనారిటీల నామమాత్రపు ప్రతినిధి కాకుండా నిజమైన వారిని చట్ట వ్యవస్థకు ఎంపిక చేయడం ముఖ్యోద్దేశం (అంబేద్కర్ రైటింగ్స్ అండ్ స్పీచెస్ 1వ అంకం, 374వ పేజీ).

అంబేద్కర్ బ్రాహ్మణిజానికి మాత్రమే వ్యతిరేకం, బ్రాహ్మణులకు కాదు. లోక హితవాది 19వ శతాబ్దం నాటి ప్రముఖ సంఘ సంస్కర్త ఆయన బ్రాహ్మణుడే అయినప్పటికీ బ్రాహ్మణవాదానికి వ్యతిరేకం. ఆయన రాసిన శతపత్రే - బహిష్కృత భారత, జనతా నుండి

కనీసం 20 ప్రముఖ పత్రాలను అంబేద్కర్ పునర్ముద్రించారు. "మతం అనేది సమాజం యొక్క పునాది. నిజమైన ప్రజా ప్రభుత్వానికి ప్రతీక" అన్నారు. ఎడ్మండ్‌బర్క్, అంబేద్కర్ దీనితో పూర్తిగా ఏకీభవిస్తారు. మతం అనేది బడుగు వర్గాలకు తమ శత్రువులపై పోరాటం జరిపేందుకు అవసరమైన చొరవ, నైతికస్థైర్యం అందించగల సామర్థ్యం కలిగి ఉండాలి అన్నారు అంబేద్కర్.

అస్పృశ్యుల పట్ల హిందూ కులాలు వ్యవహరించిన తీరుకు, వారికి చేసిన అన్యాయానికి ప్రతీకారంగా మత మార్పిడికి పాల్పడినట్లు ప్రజలు తప్పుగా అర్థం చేసుకోరాదని అంబేద్కర్ అన్నారు. హిందూ మతంలో అసమానత్వం మార్పిడి వెనుక మూల కారణం.

రాజకీయ ఉద్యమం ఆరంభ దశల్లో మతపరమైన పునరుజ్జీవన ఆలోచనలు ప్రాధాన్యత వహిస్తాయి. ఆ తరువాత గాంధీజీ, అంబేద్కర్ వంటి నాయకులు విశ్వసౌభ్రాతృత్వాన్ని జాతీయ సమగ్రత కోసం ప్రవచించారు. నేడు మనం లౌకిక సిద్ధాంతాన్ని ఆమోదించాం. అందుకోసం మనం పునరుద్ధరణ ఉద్యమాన్ని చేపట్టాల్సి ఉంటుంది.

'భారతదేశంలో కులాలు' అనే అంశంపై రాసిన వ్యాసాలలో అంబేద్కర్ ఈ విధంగా పేర్కొన్నారు. "హిందూ జనాభా సంక్లిష్ట స్వరూపంలో లోతైన సాంస్కృతిక సమైక్యత దాగి ఉంది. ప్రత్యామ్నాయాన్ని పరిశీలించే స్థాయికి నేను చేరుకోవడం హిందువుల భవిష్యత్ కోసం నాకంటూ బాధ్యత ఉందని భావించడమే కారణం."

దోపిడీకి గురవుతున్నవారి తరఫున జరుపుతున్న పోరాటానికి సంబంధించి తాను కమ్యూనిస్టు సిద్ధాంతానికి  చాలా దగ్గరగా ఉన్నట్లు అంబేద్కర్ మరో సందర్భంలో పేర్కొన్నారు.

రాజకీయ రంగంలో పోరాటం, సామాజిక సమస్యల అధ్యయనం గాంధీ అనుసరించిన విధానం. అంబేద్కర్ సామాజిక వ్యవహారాల్లో పోరాటం, రాజకీయ రంగంలో విస్తృత చర్చలకు అధిక ప్రాధాన్యతనిస్తారు. "భారత స్వాతంత్ర్యం ఫరవాలేదని ఎదురుచూస్తుంది. అస్పృశ్యత నిర్మూలనకు జరిపే పోరాటం కాదు" అన్నారు అంబేద్కర్.

గాంధీ ప్రాథమికంగా ఒక రాజకీయ నాయకుడు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా రాజకీయ సమైక్యత దెబ్బతినకుండా ఆయన జాగ్రత్త వహించారు. దీని ప్రభావం ఆయన ప్రవర్తనపై పడింది. ఆయన కొంత పరిమితిలో ఉండాల్సి వచ్చింది. ఆయన మంచి సంస్కరణవాది. ఇందుకోసం ఆయన హిందూ కులంపై ఎక్కువగా ఆధారపడ్డారు. సమయం చిక్కినపుడు ఆయన దేశవ్యాప్తంగా పర్యటనలు జరిపి అస్పృశ్యతా నిర్మూలన కార్యక్రమంపై సందర్శనలు చేసేవారు. ఈ కార్యక్రమం విజయవంతమయ్యేందుకు ఆయన తీవ్రంగా ప్రయత్నించారు. సామాజికంగా, ఆర్థికంగా అణచివేతకు గురవుతున్న వర్గాల మధ్య సమైక్యత లేకపోతే అగ్రవర్ణాలు, కులాలు రాజకీయ అధికారాన్ని కైవసం చేసుకుంటాయి. బడుగు వర్గాల హక్కులు వారి పాదాల క్రింద నలిగిపోతాయి. ఇందుకోసం సంఘటిత ప్రజల ఒత్తిడి అవసరం. అంబేద్కర్ ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించారు.

అయితే అంబేద్కర్‌కు యువతరం పట్ల అంతగా నమ్మకం లేదు. "ఎంతసేపు ఉల్లాసంగా గడుపుతూ సిద్ధాంతాలు, ఆదర్శాలు అంతగా లేకుండా, రానడే, తిలక్, గోఖలే వంటి సిద్ధాంతాలు, సూత్రాలు, ఆదర్శాలు అందుకు అనుగుణమైన చర్యలు తీసుకునే నాయకులకు జన్మనిచ్చే అవకాశం లేని తరం పట్ల నాకు అంతగా నమ్మకం లేదు" అన్నారు.

ప్రొఫెసర్ హీరేన్ ముఖర్జీ ఇలా అన్నారు. "నాకు తెలిసినంతవరకు గాంధీజీ గొప్ప సంధాన కర్త. రాజకీయ, ఆర్థిక, సామాజిక, ఆధ్యాత్మిక విశ్వాసాల ప్రభావం తగ్గించడం సమిష్టి కృషి ద్వారా మాత్రమే సాధ్యం. ఈ మొత్తం అంశంపై ఆయనకు విడివిడిగా అభిప్రాయాలు లేవు. అంబేద్కర్ మరింత మేధస్సుతో కూడిన ఆధునిక వైఖరితో వ్యవహరిస్తారనే విషయం గ్రహించాను. అస్పృశ్యత వల్ల సంభవించే రాజకీయ, ఆర్థిక ప్రభావాల గురించి ఆయనకు తెలుసు. వాటిని నిర్మూలించాలని ఆయన పిలుపునిచ్చారు. స్వీయ చేదు అనుభవం దృష్ట్యా ఆయన గాంధీ కంటే ఎక్కువగా అంచెలంచెలుగా వ్యవహరించడం ప్రారంభించారు."

అస్పృశ్యుల్లో ఆత్మవిశ్వాసాన్ని రేకెత్తించడంతో పాటు వారిలో విద్య, రాజకీయాల ద్వారా వారిని అభివృద్ధి పరచడం, హిందూ అగ్రకులాల్లో హృదయ పరివర్తనం తీసుకువచ్చేందుకు గాంధీ ప్రదర్శించిన దృక్పథం షెడ్యూల్డ్ కులాల నాయకులకు ప్రేరణగా నిలిచింది. భారతదేశంలో విస్తృతంగా ఉన్న అస్పృశ్యత సమస్య, ఆర్థిక, రాజకీయ, మతపరమైందని అంబేద్కర్ అభిప్రాయం.

అంబేద్కర్ అస్పృశ్యుల్లో ఆత్మగౌరవం, రాజకీయాలపట్ల ఆసక్తి కలిగించి యుండవచ్చు. అయితే ఇతరులపై ఆర్థికంగా ఆధారపడే దయనీయ పరిస్థితి కొనసాగుతూ అస్పృశ్యతా ఉద్యమం ఎదుగుదలకు అవరోధంగా ఉంది

అంబేద్కర్ గొప్పతనం ఈ అంశాల్లో ఉంది. (1) అద్భుతమైన వ్యక్తిత్వం (2) ఆయన అద్భుతమైన చిత్తశుద్ధి కలవాడు. ఎటువంటి ప్రలోభాలకు లోనుకానివాడు. (3) ఆయన నిష్కపటత్వం, నిజాయితీ, భావవ్యక్తీకరణలో నిర్మొహమాటం, అచంచల అంకిత భావం, బడుగు వర్గాల పట్ల కనికరం, జాలి, ప్రేమ.

ఆయన సాధించిన విజయాలు : 1956 అక్టోబర్ 14న నాగపూర్‌లో బౌద్ధమతంలోకి సామూహిక మత మార్పిడి - దీనినే ధమ్మ విప్లవం అన్నారు.

## అంబేద్కర్ - మార్క్స్

సాహితీ జగత్తుల్లో 8-9 దశాబ్దాల్లో దళిత రచయితల ఉద్యమం ఆకృతి పొందుతోంది. సంవత్సరాల తరబడి భారత సాహితీ ప్రక్రియకు ఇది సవాలుగా నిలిచింది. నూతన దళిత రచయితలు అన్ని రకాలుగా ముందంజ వేశారు, పద్యాలు, లఘుకథలు, ఏకపాత్రాభినయం, నాటకాలు, డ్రామాలు, ఉద్యమాల్లో అన్ని విభాగాల్లో రాణించారు. పెట్టుబడి దారీ వ్యవస్థ విలువలను సవాలు చేసే శక్తివంతమైన స్థాయికి వారి రచనలు ఎదిగాయి. ఇందువల్ల దళిత సాహితీ ఉద్యమం సోషలిస్టు, కమ్యూనిస్టు ఆలోచనాపరులు, నటులు, కళాకారులతో చేతులు

కలిపింది. సాహితీ ప్రపంచంలో సామాజిక బాధ్యతను ఆవిష్కరించే సిద్ధాంతానికి శ్రీకారం చుట్టింది. ఈ ఉద్యమం కుల పరమైన అవరోధాలను అధిగమించింది. అంబేద్కర్ ఆలోచనలకు అనుగుణంగా దళిత రచయితల్లో ఉద్భవించిన కొత్త ఆలోచనా విధానం 'అంబేద్కర్ – మార్క్స్' అనే కొత్త వివాదాన్ని సృష్టించింది. ఇది అంబేద్కర్ సామాజిక ఆర్థిక ఆలోచనా విధానాన్ని ప్రక్క దారి పట్టించింది. ఎస్సిఎఫ్ రాజకీయాలు, ప్రత్యేకహక్కులు, రాయితీల విధానాన్ని బలపరిచింది. ప్రత్యేక ఎలక్టరేట్ విధానం అనివార్యమైన ముప్పుగా అంబేద్కర్ భావించారు. ఎస్సిఎఫ్ను దళితులు – దళితే తరుల మధ్య గోడగా భావించారు. అందువల్ల ఆయన ఆర్పిఐని స్థాపించారు. తరువాత అది ఎస్సిఎఫ్గా రూపాంతరం చెందింది.

ఖాట్మండులో 'బౌద్ధధర్మ – కమ్యూనిజం' అనే అంశంపై అంబేద్కర్ ఉపన్యసించారు. అది 'బుద్ధిజం × మార్క్సిజం' గా అన్వయింపబడింది. దళిత ఉద్యమం మార్క్స్ వ్యతిరేక ఉద్యమ రూపుదాల్చింది. అంబేద్కర్ స్పష్టంగా చెప్పారు.

> బౌద్ధజీవనం కమ్యూనిస్టు జీవన విధానం కంటే మేలైనదన్న విషయాన్ని బౌద్ధ దేశాల్లోని యువత గ్రహించలేకపోతే బుద్ధిజం అంతరించినట్లే' అని ఆయన ఇంకా ఈ విధంగా అన్నారు.
>
> "ప్రజల్లో ఎక్కువమంది, ముఖ్యంగా ఆసియాలోని యువకుల్లో ఎక్కువ మంది కార్ల్మార్క్స్ను ఆరాధింపగల ఏకైక ప్రవక్తగా భావిస్తున్నారు. వారు బౌద్ధ సంఘంలో పెద్ద సంఘం 'పసుపు పచ్చ ప్రమాదంగా పరిగణిస్తున్నారు. 'బిక్కు'లు ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలి. అవగాహన పెంపొందించుకోవాలి. కార్ల్మార్క్స్తో పోల్చబడే స్థాయికి ఎదిగేలా తమని తాము సంస్కరించుకోవాలి. బుద్ధిజం దానితో పోటీ పడుతుంది."
>
> మార్క్స్ సిద్ధాంతం గురించి అంబేద్కర్ ఇలా చెప్పారు.
>
> "పారిశ్రామిక కార్మికుల నియంతృత్వం నెలకొనాలనే సిద్ధాంతాన్ని కారల్మార్క్స్ రూపొందించారు. ఇది ఆయన ప్రవచించిన మూడవ సిద్ధాంతం. అణచివేతకు గురవుతున్న వారితో ప్రభుత్వం ఏర్పడాలి. అణచివేతకు పాల్పడుతున్న వారితో కాదు. పారిశ్రామిక కార్మికుల నియంతృత్వం అంటే అదే!"

ప్రైవేటు ఆస్తిని రద్దు చెయ్యడంలో ఏదైన పొరపాటు ఉందా అనేది పరిశీలించాల్సిన విషయం. దానిని చేయదలచుకున్న వారికి బుద్ధుడు అవరోధంగా నిలవడు. బౌద్ధ సంఘంతో ఇందుకు ఇప్పటికే అనుమతి ఇవ్వడమే కారణం.

కార్మికశక్తి విషయంలో దళిత ఉద్యమం, కమ్యూనిస్టు ఉద్యమం ఒకే ఆలోచనా విధానంలో లేవు. కులం అనేది అంబేద్కర్ దృష్టిలో గాలిని పూర్తిగా స్తంభింపచేసే కార్మికుల విభజన! ఈరెండు అన్వయింపులు విభిన్నం కాదు, ఒక్కటే. అంబేద్కర్, మార్క్స్ను ఒక దగ్గరకు తీసుకురావడం విద్యాపరమైన కృషి ద్వారా కాకుండా రాజకీయ జోక్యం ద్వారా

మాత్రమే సాధ్యం. మరో మాటలో చెప్పాలంటే మనం రాజకీయపరమైన ఆలోచనా విధానాన్ని తీసుకోవాలి. కులం అంశం కులాల వివాదానికి దారి తీసింది. కుల సమీకరణ అనేది దాని కులతత్వం మరలి సాగకూడదు. సామాజిక విప్లవంలో అట్టడుగు వర్గం వారు ప్రధాన పాత్ర పోషించే అవకాశం ఉంది. వీటన్నిటినీ మించి రాజకీయ దృక్పథం అనేది నిర్మాణాత్మక సామాజిక, రాజకీయ పోరాటాల గురించి యోచించాలి. వ్యతిరేక సిద్ధాంతానికి దారి తీసేదిగా ఉండరాదు.

ఒకరినొకరు నిందించుకొనే బదులు ప్రస్తుత భారత పరిస్థితులకు అనుగుణంగా సయోధ్య వైఖరి అవసరం. భారతదేశంలో మార్క్సిస్టులు విప్లవాత్మక ప్రక్రియను అవగాహన చేసుకున్నారు. పునాది ఉపరితలం మధ్య పరస్పర సంబంధాన్ని వారు అర్థం చేసుకున్నారు. సామాజిక వ్యవస్థ సామాజిక విప్లవం తరువాత ఆటోమాటిక్‌గా మారిపోతుందని వారింకెంత మాత్రం భావించబోరు. అలా ఉండాలని సైతం వారు కోరుకోరు. విప్లవాత్మక శక్తులను పటిష్టం చేయడంలో ఎదురయ్యే ఇబ్బందులను గురించి వారికి స్పష్టమైన అవగాహన ఉంది. విప్లవం తీసుకురావలసిన విధానం గురించి నేడు వారు మరింత పరిపక్వత సాధించారు. నేడు కావల్సిందేమంటే భారత సామాజిక వ్యవస్థకు అనుగుణంగా అంబేద్కర్ ఆలోచనల అన్వయంతో మార్క్సిస్టు విప్లవోద్యమాన్ని నిర్మించడం. మార్క్స్ కాదు, అంబేద్కర్ కాదు. మార్క్స్ మరియు అంబేద్కర్ కావాలి. భవిష్యత్ విప్లవ కార్యక్రమంలో దీనిని మన మార్గదర్శక సూత్రంగా నిర్ధారించుకోవాలి. అప్పుడే లక్షలాది మంది ప్రజలకు సంపూర్ణ మానవతా విలువలు అందుబాటులోకి తీసుకురావాలనే ఇద్దరు మహానుభావుల కలలు నెరవేరుతాయి.

### అంబేద్కర్ - విజయానికి మారుపేరు?

నేటి కాలమాన పరిస్థితులతో సరితూగే విభిన్న అంశాలపై అంబేద్కర్ ఆలోచనలు ఒకే విధంగా లేవని పైన అధ్యయనం చేసిన వివిధ అంశాలను బట్టి మనకు అర్థం అవుతుంది. వరుస క్రమంలో వాటిని పరిశీలించడం ఆసక్తికరంగా ఉంటుంది.

అస్పృశ్యులకు ప్రత్యేక రాయితీల కోసం చేసిన పోరాటం అంబేద్కర్ చేసిన అనేక పోరాటాల్లో అతి పెద్దది. సామాజికంగా వేరుగా ఉన్న వారు రాజకీయం కూడా వేరుగా ఉండాలన్నది అంబేద్కర్ అంతర్లీన ఆలోచన. ఇందుకోసం రాజ్యాంగ పోరాటం కూడా నిర్వహించారు. కమ్యూనల్ అవార్డు తెచ్చిన సమస్యలు, అసమానతలను పరిష్కరించేందుకు మహాత్మాగాంధి వంటి నాయకుడు ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించారు. గాంధీ ఆ దీక్షలో మరణించి ఉంటే భారత ఉపఖండంలోని వివిధ ప్రాంతాలలో విసిరివేయబడి ఉన్నట్టుగా ఉన్న అస్పృశ్యులు స్పృశ్యుల దయాదాక్షిణ్యాల మీద పూర్తిగా ఆధారపడాల్సిన పరిస్థితులు ఏర్పడి ఉండేవి. దానిని దృష్టిలో ఉంచుకునే అంబేద్కర్ పూనా ఒప్పందాన్ని ఆమోదించారు. ఉమ్మడి నియోజకవర్గాలు, సీట్ల రిజర్వేషన్ రాజ్యాంగ ప్రతిష్టంభన పరిష్కారానికి ఇది ఒక్కటే ప్రత్యామ్నాయమని ఆ ఒప్పందం నిర్దేశించింది. తాను సెంటిమెంట్ పరంగా చేసిన ఘోరమైన తప్పిందం పట్ల అంబేద్కర్ విచారం వ్యక్తం చేశారు. రాజ్యాంగ విషయాలపై తదుపరి జరిగిన

చర్చల్లో అస్పృశ్యులకు ప్రత్యేకాధికారాలు కావాలని ఆయన వాదించారు. బ్రిటిష్ వారు భారతదేశం నుండి వైదొలగనున్న విషయాన్ని గ్రహించిన వెంటనే ఆయన తన ప్రత్యేక నియోజకవర్గాల వాదాన్ని ప్రక్కన పెట్టారు. రాజ్యాంగ పరిషత్తులో భారత రాజ్యాంగాన్ని ప్రవేశపెట్టే సమయంలో కాంగ్రెస్ పార్టీతో హృదయ పూర్వకంగా సహకరించారు. రాజ్యాంగ రూపకల్పన ఆయనకు 'ఆధునిక మనువు' అని బిరుదుని సంపాదించి పెట్టింది. భారత రాజ్యాంగంలో ప్రత్యేక ఎలక్టోరేట్ అనే వ్యవస్థ లేదు. ఈ సందర్భంగా కొన్ని ముఖ్యమైన ప్రశ్నలు తలెత్తుతాయి. అంబేద్కర్ తన ఆలోచనలు ఎందుకు మార్చుకున్నారు? రాజ్యాంగ నిర్మాణ కమిటీ చైర్మన్ వంటి అత్యున్నత పదవిలో ఉన్నప్పుడు తన సెంటిమెంట్ విషయంలో చేసిన ఘోర తప్పిదాన్ని సరి చేసుకునేందుకు ఆయన ఎందుకు ప్రయత్నించలేదు? సూటిగా చెప్పాలంటే అది ఆయన రాజకీయ ఓటమి కాదా?

ఇక రెండో సమస్య జాతీయ నాయకులతో ఆయన రాజీపడటం. అంబేద్కర్ తన జీవిత పర్యంతం గాంధీజీని, కాంగ్రెస్‌ను వ్యతిరేకించారు. అంబేద్కర్ నాయకత్వం జాతి వ్యతిరేక లక్షణంగా అభివర్ణింపబడింది. అధికార బదిలీ అవకాశం త్వరలో రానున్నదనే విషయం గ్రహించిన అంబేద్కర్ కాంగ్రెస్ నాయకత్వం పట్ల ఆయన తన వైఖరిని మార్చుకున్నారు. రాజకీయ అధికారం కాంగ్రెస్ చేతికి చిక్కనున్నదనే విషయం గ్రహించారు. ఈ రాజీవల్ల కొన్ని సత్ఫలితాలు లభించాయి. అంతేకాకుండా తాను రాజ్యాంగ నిర్మాణ బాధ్యతను కాంగ్రెస్ పార్టీ అందించిన సహకారంతో పూర్తి చేయగలిగినట్లు రాజ్యాంగ పరిషత్తులో ఆయన ప్రకటించారు. తన పాత పరిస్థితిని, వైఖరిని ఆయన మరచిపోయారు. జాతీయ నాయకులు, షెడ్యూల్డ్ కులాల మధ్య ఈ ఆరోగ్యకరమైన సహకారం ఇంతకు ముందే చోటు చేసుకుని ఉంటే ఈ సహకార ధోరణి ఫలితాలను దేశం అనుభవించి ఉండేది. ప్రజాస్వామ్య ప్రాతిపదికపై ఆరోగ్యకరమైన సమన్వయం సాధించేందుకై వేర్పాటువాద ధోరణులను గురించి మరచిపోయి స్పృశ్యులు, అస్పృశ్యుల మధ్య అగాధాన్ని అంతమొందించేందుకు ప్రయత్నించాలి.

అంబేద్కర్ ప్రవృత్తిరీత్యా ఉదారవాది. అది మధ్య తరగతి ఉదారవాదం, సంస్కరణలకు సంబంధించి ఆయన వైఖరి ఉదారంగా ఉండేది. అది ఎన్నడూ విప్లవాత్మక ధోరణి తీసుకోలేదు. ఆయన కులంలో భూమిలేని కార్మికులు, చిన్నరైతులు, కార్మికులు ఉన్నారు. తన కులం ఆర్థిక సమస్యలు పరిష్కరించేందుకు కులపోరాటాలు నిర్వహించడమే మార్గం. అందుకు వర్గ సార్వభౌమత్వం పరిరక్షించుకోవడం అవసరం. ఇతర కులాల సంస్థలతో కలసిమెలసి సమన్వయంతో వ్యవహరించాలి. వర్గ శత్రువులను ఓడించడమే ధ్యేయం. దానిని అంబేద్కర్ సాధించలేక పోయారు.

వర్గం, కులం మధ్య విభజన రేఖ చాలా సూక్ష్మంగా ఉంటుంది. ఎక్కడ కులం అంతమైందీ, ఎక్కడ వర్గం ప్రారంభమైందీ స్పష్టంగా తెలియని పరిస్థితి. తనను కార్మిక నాయకునిగా కంటే కుల నాయకునిగా పిలవడం మంచిదని అట్లీకి అంబేద్కర్ వివరించారు. ఆయన రాజకీయ ఆలోచన విధానానికి ఇది అద్దం పడుతుంది. వర్గ రాజకీయాల కంటే కుల

రాజకీయాలకే ఆయన ప్రాధాన్యత నిచ్చారు. అది బలహీన వర్గాల ఉద్యమాన్ని బలహీన పరిచింది. సామాజిక ప్రవర్తన విధానాల్లో మార్పులు తీసుకువచ్చేందుకు ఆలోచనా విధానాల్లో తొలుత మార్పులు రావాల్సిన అవసరం ఉందని ఆయన పట్టుబట్టారు. ఇది వర్గానికి విధేయత, కులంపట్ల విధేయతకు మధ్య చీలిక తెచ్చింది.

వర్గ పోరాటాల పట్ల వైఖరి వాటి నిర్వహణా సామర్థ్యంపై, రాజకీయ నాయకత్వ తీరుతెన్నులు ఆధారపడి ఉంటాయి. పోరాటతత్వం విప్లవ ధోరణిలో ఉంటుందా, విభిన్నంగా ఉంటుందా, అనే విషయం వ్యక్తిగత వైఖరి బట్టి ఆధారపడి ఉంటుంది. ఈ విషయంలో అంబేద్కర్ నిలకడైన వైఖరి అవలంభించలేదు. కుల పోరాటాలను వర్గ పోరాటాలుగా మార్చడంలో ఆయన నిలకడగా వ్యవహరించలేకపోయారు.

తన పరిమితులేమిటో అంబేద్కర్‌కు తెలుసు. అందువల్లనే కుల నాయకునిగా ఆయన వ్యవహరించారు. విద్య, ఉద్యోగాలు, చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా తమ కులానికి సేవ చేసేందుకు చేతనైనంత స్థాయిలో ప్రయత్నించారు. తన కులానికి సేవలందించేందుకే తాను రాజ్యాంగ పరిషత్తులో చేరినట్లు ఆయన అంగీకరించారు. ఆయన ఆ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించారు. తన కులం తనకు అన్నివేళల్లో మద్దతునందించగలదనే ఆలోచన ఆయనలో ఆత్మ విశ్వాసం ఇనుమడింప చేసింది. బడుగువర్గం ఆయనకు మద్దతునందించడమే కాదు. ఆయన్ను దైవం మాదిరిగా ఆరాధించింది. "సమీప భవిష్యత్తులో భీమ్ రాజ్యం రానుంది" అనేది ఆయన మద్దతుదార్ల నినాదంగా ఉండేది.

జాతీయ నాయకత్వం, అణచివేతకు గురవుతున్న నాయకత్వం మధ్య విభజన సుస్పష్టం. భారతదేశానికి చెందిన అణచివేతకు గురవుతున్న వర్గాలన్నీ ఒక జాతీయ నాయకత్వం కింద అభివృద్ధి చెందేందుకు మహాత్మాగాంధీ వంటి కాంగ్రెస్ నాయకులు ప్రయత్నించారు. భారత జాతీయతత్వం, బ్రిటిష్ వ్యతిరేక వైఖరిని అవలంభించడమే కాకుండా సామ్రాజ్యవాద, వలసవాద, జాతి వ్యతిరేక వైఖరిని కూడా అవలంభించింది. మనిషిని మనిషి, జాతిని జాతి దోచుకునే వైఖరిని అంతమొందించేందుకు వారు ప్రయత్నించారు. అయితే అంబేద్కర్ ఈ ప్రయత్నాలను పరిగణనలోకి తీసుకోలేదు. కాంగ్రెస్ తన చివరి పోరాటం, డుఆర్డై, ఆందోళన చేస్తున్న సమయంలో కాంగ్రెస్, గాంధీజీ పట్ల అంబేద్కర్ వ్యతిరేకత తారాస్థాయికి చేరింది. కాంగ్రెస్‌లో చేరిన, షెడ్యూల్ కులాల సమాఖ్యలో చేరని బడుగు వర్గాల పట్ల అంబేద్కర్ అనుచరులు అనుమానంగా చూసేవారు. కాంగ్రెస్‌లో చేరిన వారికి అధికార పదవులు లభించాయి. ఇది అంబేద్కర్ అనుచరుల్లో చీలిక తీసుకువచ్చింది. జాతీయ నాయకత్వంతో రాజీ పడటం అనివార్యమనే అభిప్రాయం వ్యక్తమైంది. షెడ్యూల్డ్ కులాల సమాఖ్యలో చీలిక, అంబేద్కర్ మరణించడం అనంతరం రిపబ్లికన్‌పార్టీ ఆఫ్ ఇండియాలో చీలిక ఏర్పడ్డాయి. కాంగ్రెస్ నాయకత్వం అవకాశవాద విధానాలను అనుసరించింది. రిపబ్లికన్ పార్టీలో ఒక వర్గం కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా మారి దానితో ఎన్నికల పొత్తును కూడా పెట్టుకుంది. ఈ పరిణామం రిపబ్లికన్ పార్టీని మరింత బలహీనం చేసింది. కాంగ్రెస్ పార్టీ ఖచ్చితమైన

సిద్ధాంతాలు, విలువలు పాటించకుండా అవకాశవాద విధానాలను అనుసరించింది. అంబేద్కర్‌కు న్యాయశాఖ ఇవ్వబడింది. ఇతర ముఖ్యమైన శాఖలకు ఆయన్ను అస్పృశ్యునిగా పరిగణించింది. మంత్రి వర్గానికి ఎటువంటి దూరదృష్టి లేదని స్పష్టమైంది. కాంగ్రెస్ అంబేద్కర్ మధ్య సహకారం కొనసాగి ఉంటే అది మంచి ఫలితాలకు దారి తీసి ఉండేది – అస్పృశ్యులు, స్పృశ్యుల మధ్య అగాథం భర్తీ అయి ఉండేది. అసలు ఈ అంతరం మొత్తం తగ్గిపోయి ఉండేది. దీనిని సాధించేందుకు సామాన్య మానవుని విశ్వాసంలోకి తీసుకుని ఉండాల్సింది అయితే అణచివేతకు గురవుతున్న వర్గాలకు చెందిన సామాన్య మానవునికి ఎక్కువ ప్రాధాన్యత కల్పించలేదు.

రిపబ్లికన్ పార్టీ ఒక బహిరంగ పార్టీ మాదిరిగా వ్యవహరించదు. అణచివేతకు గురవుతున్న వర్గాలు మినహా ఎవ్వరూ ఆ పార్టీలో చేరరు. అస్పృశ్యులకే ఆ పార్టీలో స్థానం. వారి సామాజిక, ఆర్థిక సమస్యలు పరిష్కారానికి ఈ పార్టీ ఒక మార్గమని అంబేద్కర్, ఆయన అనుచరులు భావించారు. ఇతర రాజకీయ పార్టీలతో, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ నాయకులద్దైనందిన వ్యవహారంగా పరిణమించింది. కార్యకర్తలు, దిగువ స్థాయి నాయకులు వారి నాయకులను అనుసరించలేరు. అంబేద్కర్ మధ్యేవాదం, ఉదారవాదం ఆయన అనుచరులను అవకాశవాద పరిస్థితుల్లోకి నెట్టింది.

న్యాయ శాఖ మంత్రిగా రాజీనామా చేసిన తరువాత అంబేద్కర్ ప్రతిపక్ష నాయకుని అవతారం ఎత్తారు. పార్లమెంటులో ప్రసంగాలు చేశారు. అయితే అవి అంత సమర్థవంతంగా ఉండేవి కావు. రాజ్యాంగ ప్రతిని తగలబెడతానని హెచ్చరించడం ద్వారా రాజ్యాంగ నిర్మాణంలో తాను చేసిన చారిత్రాత్మక విధి నిర్వహణను వృథా చేసుకున్నారు. ఆయన రాజ్యాంగాన్ని పవిత్ర దేవాలయంగా భావించారు. అయితే చిత్తశుద్ధి, నిజాయితీ లేని వారు దానిని స్వాధీనం చేసుకున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ నాయకులే తనను వారి గట్టి విమర్శకునిగా మార్చారని ఆయన అభిప్రాయపడ్డారు. చివరిగా ఆయన బౌద్ధమతంలో తన విచారానికి పరిష్కారం కనుగొనాలని భావించారు. సామాజిక, ఆర్థిక సమస్యలకు బుద్ధధమ్మాలో పరిష్కారాలను ఆయన కనుగొన్నారు. లక్షలాది మంది అణచివేతకు గురవుతున్న ప్రజల భౌతిక సమస్యలకు ఆయన భక్తి భావంతో కూడిన పరిష్కారాలు కనుగొనేందుకు ప్రయత్నించారు.

ప్రత్యేక, సమిష్టి ఎలక్టోరేట్‌కు సంబంధించిన చారిత్రాత్మక వివాదం నేడు ముగిసింది. భారత రాజ్యాంగంలో ప్రత్యేక ఎలక్టోరేట్ వ్యవస్థ అంటూ లేదు. అంబేద్కర్ అనుచరుల్లో ఒక వర్గం బడుగు వర్గాలకు ప్రత్యేక ఎలక్టోరేట్ విధానం ఉండాలని తిరిగి ప్రస్తావిస్తున్నారు. అంబేద్కర్ తదనంతర వైఖరికి వారి అనుచరుల ధోరణి ఎంతమేరకు అనుగుణంగా ఉన్నదీ అర్థం చేసుకోవడం కష్టం. అంబేద్కర్ పేరుతో ఇటువంటి వేర్పాటువాద రాజకీయాలు అనుసరించడం అంటే గత 50 ఏళ్ళ అనుభవంతో ప్రజలు ఏమీ నేర్చుకోలేదని అర్థమవుతుంది. అంబేద్కర్ సైతం ప్రత్యేక ఎలక్టోరేట్ అంశాన్ని రాజ్యాంగ పరిషత్‌లో ప్రస్తావించలేదు. షెడ్యూల్డ్ క్లాస్ నాయకులు ఇప్పటికైనా ఈ పాఠాన్ని నేర్చుకుని తమ కార్యక్రమాన్ని అమలు చేసేందుకు ప్రయత్నించాలి.

హక్కుల కోసం సత్యాగ్రహం చెయ్యరాదనే విధానాన్ని అంబేద్కర్ ప్రవచించారు, అనుసరించారు. మరి అస్పృశ్యులు స్పృశ్యుల పాదాల వద్ద బందీగా నిలిచిపోయిన తమ హక్కులను ఎలా సంపాదించుకుంటారు? ఇతరులతో సమీకరణ కాకపోతే భూమిలేని కార్మికులు, చిన్న రైతులు, కార్మికులు తమ డిమాండ్లు ఎలా సాధించుకుంటారు? ఉదారవాద విధానాల ద్వారా డిమాండ్లు ఎలా నెరవేరతాయి? అణచివేతకు గురవుతున్న వర్గాలకు చెందిన పార్టీ విప్లవాత్మక భావాలు గల నాయకత్వం క్రింద పని చెయ్యాలి. అణచివేతకు గురవుతున్న ప్రజలను భారీ స్థాయిలో సమీకరించగలిగితేనే ఇది సాధ్యపడుతుంది.

రోజువారీ సమస్యలపై ఆందోళనలు నిర్వహించినపుడే ఒక రాజకీయ పార్టీ బలపడుతుంది. అణచివేతకు గురయ్యే పార్టీ జడపదార్థంగా నిలిచిపోతే ఆ పార్టీ ఎదుగుదలకు అవరోధం ఏర్పడుతుంది. అణచివేతకు గురవుతున్న వర్గాలకు చెందిన పార్టీ అయిన రిపబ్లికన్ పార్టీ నాయకత్వం కింద కొత్తగా నమోదైన వారు సమీకరించబడటం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో యునైటెడ్ ఫ్రంట్ లేదా భావ సారూప్య పార్టీల మధ్య ఐక్యత తక్షణావసరం. అణచివేతకు గురవుతున్న వారి వర్గ పోరాటం ఈ ఫ్రంట్ ప్రధాన కర్తవ్యం. ఒక పార్టీ అభ్యున్నతి కోసం కృషి చెయ్యాలి. మరో పార్టీ రాజకీయాల లక్ష్యాల కోసం అంకితం కావాలనే భావన అంతం కావాలని, సామాజిక అభ్యున్నతి కోసం, ఆర్థిక దోపిడీ నిర్మూలన కోసం జరిగే పోరాటాల్లో స్పృశ్య వర్గాలు భాగస్వామ్యం తీసుకోవాలి. అలాగే అణచివేతకు గురవుతున్న వర్గాల వారి అభ్యున్నతి కోసం కృషి చెయ్యాలి.

సుందరయ్య గ్రంథాలయ
A.C. No. 88664
హైదరాబాద్-500 044

అంబేద్కర్ లాంటి సమగ్ర, సంక్లిష్ట వ్యక్తిత్వాన్ని మహరాష్ట్రకు చెందిన వమన్ నారాయణ్ కుబేర్ ఎంతో సమర్థవంతంగా ఈ గ్రంథంలో వివరించారు. అంబేద్కర్ పట్ల ఎంతో ఉన్నతమైన గౌరవభావం కలిగిన ఈ రచయిత ఆయన కృషిని బేరీజు వేయదానికి ప్రశంసనీయమైన ప్రయత్నం చేశారు. పూనా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పొందదానికి ఆయన సమర్పించిన థీసిస్ ఈ గ్రంథం. అంబేద్కర్ కృషి గురించి ఇంతటి సమగ్రమైన, తులనాత్మకమైన గ్రంథం బహుశా ఇంతవరకు వెలువడకపోయి ఉండవచ్చు. ముమ్మరంగా సామాజికోద్యమాలు జరుగుతున్న ప్రస్తుత నేపథ్యంలో సరైన దృక్పథం ఏర్పరుచుకునేందుకు ఈ గ్రంథం ఎంతగానో దోహదపడుతుంది.

రు. 100/-

ప్రజాశక్తి బుక్‌హౌస్